# యజ్ఞ మాత

# జగదంబ సరస్వతి



**ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము**

ముఖ్య కేంద్రము : పాండవ భవనము, ఆబూ పర్వతము, భారతదేశము


**ప్రకాశకులు :**
తెలుగు సాహిత్య అనువాద కార్య నిర్వాహక వర్గం,
ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము

**తృతీయ ప్రచురణ :**
జూన్ 2018

**ముద్రణ :**
ధనలక్ష్మి ప్రింటర్స్,
బెంగళూరు.

**కాపీ రైట్ :**
ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము,
నెం. 77, II మెయిన్, VII క్రాస్, చామరాజపేట, బెంగళూరు –
560018, Ph.080-26603355
E-Mail : bkbangalorecity@gmail.com

## ఆశీర్వచనము



ప్రపంచమంతా ఎవరినైతే కామధేనువు, అధ్యా (మొట్ట మొదటివారు), ఆదిశక్తి, సరస్వతి................ మొదలైన అనేక పేర్లతో పిలవడమే కాక వారి ఒక్క క్షణపు ప్రకాశాన్ని(సాక్షాత్కారాన్ని) పొందేందుకు అనేక సంవత్సరాల తరబడి భక్తి ఆరాధన, జప-తపాలు చేస్తున్నారో, ఆశ్చర్యకరమైన ఆనందము కలుగజేసే విషయమేమంటే ఆ తల్లి సరస్వతీ మాతయే ప్రత్యక్ష రూపములో ఈ భూమి మీద నడిచారు. తమ కమలహస్తాలతో ప్రేమ పూర్వకంగా వేలాదిమంది బిడ్డల భుజాలను తట్టి దృష్టి ద్వారా స్నేహ, యోగాల ప్రకంపనాలను ఇచ్చారు, జ్ఞానయుక్తమైన మధురమైన పలుకులతో వారి ఆత్మలను తృప్తి పరచారు. పసిబిడ్డల వలె వారిని పాలించి-పోషించి సర్వశక్తులనే ఆహారమునిచ్చి ఆధ్యాత్మిక కర్మక్షేత్రములో సఫలమవ్వడం నేర్పించారు. అటువంటి హంసవాహిని, విద్యాదాయిని సత్యమైన విచిత్ర జీవన వృత్తాంతము ఈ పుస్తకములో పొందుపరచబడింది. ఇందులో సాకారములో వారి ఒడిని తీసుకున్న బ్రహ్మా వత్సల అనుభవ ముత్యాలున్నాయి.


సృష్టి నాటక రంగములో సర్వోన్నత పాత్రధారులైన శివపరమాత్మ ప్రజాపిత బ్రహ్మాల తర్వాత జగదంబ సరస్వతి తనదైన పద్ధతిలో సర్వ మహోన్నతమైనది. వేదమంత్రాలలో సరస్వతిని "శివ సహోదర" అని



అన్నారు. వారి జీవితములోని ప్రతి చరిత్ర ద్వారా వెలువడిన విద్య, జ్ఞానము, తపస్సు, సత్యత, సేవ, త్యాగము మొదలైన దైవీగుణాల గల ధ్వనులే ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నాయి. ఆమెయే ఆది స్త్రీ(ఆది మానవి), ఆది దేవి. భక్తిమార్గములో వారిని పుస్తకధారిణిగా చూపించారు. ఎందుకంటే ఆమెయే భాగ్యరేఖను గీచే భాగ్యవిధాత్రి మరియు సర్వ ఆధ్యాత్మిక శక్తుల అధిష్ఠాత్రి(ఆదినేత, సంరక్షకురాలు) అనేకమంది ప్రజలు వికారాలతో బాధపడుతూ భోగలాలసలో కాలిపోతూ స్వయం పరివర్తన చెందాలని కోరుకుంటున్నా పరివర్తన అవ్వడంలో స్వయాన్ని అసమర్థులుగా భావిస్తూ ఆమె దయాదృష్టి ఛాయలోకి రాగానే చమత్కార రీతిలో పరివర్తన చెందేవారు. అప్పుడు వారి నోటి ద్వారా ఈ ఆత్మిక వచనాలు వెలువడేవి - " ఇంతటి పవిత్రతా శీతలత! ఇటువంటి నిర్వికార జీవన ఆనందము!! శుద్ధ విచారాలు చేసే ఇటువంటి స్థితి!!! ఓ తల్లీ! మేము ధన్యమైపోయాము! మమ్ములను శరణులోకి తీసుకోండి. మా జీవితాలను ధన్యధన్యము చేయండి " అని అనేవారు. వారు(సరస్వతి) జ్ఞాన, యోగ, ధారణ, పవిత్రతల సాక్షాత్ దేవిగా ఉండేవారు. విపరీత(కఠోర) పరిస్థితులలో సదా నిర్భయంగా, పర్వత సమానంగా స్థిరంగా ఉండేవారు. వారి నిర్భయ స్థితికి స్మృతిచిహ్నంగానే వారిని సింహవాహినిగా చూపించారు. వారే యజ్ఞ దుర్గము(కోట)ను రక్షించే దుర్గామాత.

ఆమె మంచి జ్ఞాపక శక్తిని కలిగినవారు(స్మృతిధరులు). ప్రియమైన బాబాగారి ఒక్కొక్క మహావాక్యము నుండి అనేక రహస్యాలను వెలికి తీసిన రాజయుక్తులు. ఛాత్రక పక్షి సమానము జ్ఞానసాగరుల ఒక్కొక్క జ్ఞాన బిందువు పట్ల అనురాగము కలిగి ఉండేవారు. ఈశ్వరీయ జ్ఞాన తరగతిలో బిడ్డల ముఖాలను చూడడం తప్ప ప్రాపంచిక దృశ్యాలన్నిటి నుండి అతీతంగా ఉండేవారు. వారు నడుస్తూ తిరుగుతూ ఉండే సూక్ష్మదేవత. ఆమె శరీరము ప్రకాశ కిరణాలను ప్రకాశింపజేసేది. మనస్సు సదా పరంధామ నివాసి అయిన ప్రియమైన శివబాబా మధుర స్మృతితో నిండి ఉండేది. మంత్రదండము వలె వారి కరుణా దృష్టి ఎవరి పై పడేదో, వారు జన్మ-జన్మల తపన, అలసట మరియు అజ్ఞానాల నుండి ముక్తిని

పొందేవారు. ప్రేమ మరియు మమతల మూర్తిగా ఉంటూనే వారు సదా అతీతం(న్యారా)గా ఉండేవారు. వారు నడిచేటప్పుడు ప్రకృతిలోని కణకణము



సింహవాణి జగదంబ



వారి చరణ రజమును(ధూళిని) తీసుకునేందుకు ఆతురతగా ఉండేది. వారు రత్నాగరుల(శివబాబా) సర్వగుణాల రూపి రత్నాలతో అలంకరించబడిన ప్రథమ నారీరత్నముగా ఉండేవారు. త్రిలోకజ్ఞుడైన ప్రభువు యొక్క **"వందేమాతరమ్"** నినాదము ఆమె పట్ల అభినందనంగా ఉండేది. ఆమెయే ఆదియోగిని, ఆది తపస్వీగా ఉండేది, అవినాశి ఖండమైన భారతదేశ గౌరవముగా ఉండేది. పరమాత్ముని తెలుసుకున్న దివ్య గుణాల గనిగా ఉండేది. విశ్వానికి ప్రేమ, మురిపెము(దులార్). మమత మరియు రక్షణల ఆశ్రయంగా ఉండేవారు. భవసాగరాన్ని దాటించే దివ్యమైన నావగా ఉండేవారు. ప్రతి జ్ఞానపుత్రుడు, జ్ఞానపుత్రికకు లక్ష్యముగా తిలకాన్ని పొందేందుకు ఒక ఆధారంగా ఉండేవారు. ఎవరైతే ఆమెను చూచారో, వారు అన్నీ చూచినట్లే. వారిని మాతృరూపంలో పొందిన వారు సర్వమూ పొందినవారు. వనము(అడవి)లోని ప్రతి వృక్షములో చందన సమానంగా సుగంధాన్ని నింపేవారు. సంస్కారాలను యోగాగ్నిలో కాల్చి ఉజ్వలంగా చేసేవారు. జ్ఞాన పాటలను వినిపించి దివ్యపోషణ చేసే ప్రథమ శీతలామాత, జ్వాలామాత, అన్నపూర్ణ మాత మరియు సంతోషీమాతగా ఉండేవారు.

వారి యోగ ప్రకాశములో దేహాభిమానపు అంధకారము తొలగిపోయేది. వారిని చూచిన వెంటనే ఆధ్యాత్మిక చైతన్యము మేల్కొనేది. ఎంత మహిమ చేసేది! ఎంతగా వర్ణించను! సప్త సముద్రాలలోని నీటిని సిరాగా చేసి వ్రాసినా,.......... భగవంతుని మహిమ తరగదని ఎలా గాయనము ఉందో, అలా పరమాత్ముని ప్రథమ రచన అయిన సరస్వతి మహిమను గాయనము చేసేందుకు భక్తిమార్గములోని కవుల కవితకు శక్తి చాలదు, జ్ఞానమార్గములో సన్ముఖములో కలుసుకున్న సౌభాగ్యాన్ని పొందిన బిడ్డల వాచా శక్తి కూడా చాలదు. ఇటువంటి తల్లి దివ్యచరిత్రలతో జోడింపబడిన నిజమైన అనుభవ పుష్పాలను లిఖిత బద్ధము చేసి మనందరికి వాటి సుగంధాన్ని తీసుకునే వైభవాన్ని చూచే ఆ చరిత్రల నుండి పరమానందాన్ని పొందే సౌభాగ్యము ప్రాప్తి చేయించిన సహోదరి - సహోదరులందరూ ధన్యవాదాలకు పాత్రులు. సరస్వతి మాత సాకార

అనుభవాన్ని కలుగజేసేందుకు అనుభవ సాగరములోని ఈ ముత్యాలు సమర్థవంతము అవుతాయని ఆశిస్తాను. నమ్ర నివేదన జత జతలో నాకు దృఢ విశ్వాసముంది - ప్రస్తుత పుస్తకాన్ని చదివి సోదరీ-సోదరులు సరస్వతి మాత సమానంగా ఆత్మ నిష్ట మరియు ఏకనిష్ట(ఒకేనిష్ట) గా అయ్యేందుకు దృఢత్వముతో అడుగు ముందుకు వేసి ఈ పుస్తక రచన కొరకు జరిపిన కృషిని సార్థకము చేస్తారనే శుభ కామనలతో,.....................

- బ్రహ్మాకుమారీ ప్రకాశమణీ దాదీ



## సర్వ శ్రేష్ఠమైన విద్యాదేవి - సరస్వతి మాత

విద్యలేని మానవ జీవితము నిస్సారము. మానవ సంపూర్ణ వికాసానికి విద్య అతిమహత్వపూర్ణమైన భూమిక. ఇది మానవుని బుద్ధి - శక్తిని అనుశాసనము చేస్తుంది. విద్య మనిషిని చరిత్ర వంతునిగా, జగత్తుకు ఉపయోగకారిగా చేస్తుంది. విద్యాబలముతో మానవుడు స్వార్థాన్ని వదిలి ప్రకృతిని, మానవజాతిని ప్రేమించడం నేర్చుకుంటాడు.

భౌతిక విద్య విద్యాలయాలలో, విశ్వవిద్యాలయాలలో లభిస్తుంది. కాని తత్వజ్ఞానము లేక సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానమనే విద్యను ఇచ్చే దాత ఒక్క పరమపిత పరమాత్మ మాత్రమే. ఆ పరమాత్మ బ్రహ్మ సాకార శరీరాన్ని ఆధారంగా తీసుకొని అవతరించినప్పుడు విద్యాదేవి అయిన తల్లి సరస్వతి (మమ్మా) వారిని యధార్థ రూపములో వెంటనే గుర్తించి సంపూర్ణ జ్ఞానాన్ని ధారణ చేసి తన జీవితాన్ని దివ్యగుణ సంపన్నంగా చేసుకున్నారు. ఈ విధంగా విశ్వమంతటికి అలౌకిక తల్లి ఈ భూమి పై అవతరించినట్లయింది. ప్రపంచములో ఉంటున్నా వారు దేవీ రూపములో ప్రత్యక్షమైనట్లు అనిపిస్తుంది.

పరమాత్మను గుర్తించేందుకు దివ్యబుద్ధి, దివ్యదృష్టి చాలా అవసరము. అదే విధంగా ఈ ప్రపంచాన్ని పున: సుసంస్కారితంగా చేసేందుకు నిమిత్తమైన సాకార మాతా-పితలైన పితాశ్రీ బ్రహ్మ, వారి ముఖ వంశావళి పుత్రిక సరస్వతిని గుర్తించేందుకు కూడా దివ్యబుద్ధి అవసరము. విశ్వ పితాశ్రీ బ్రహ్మాబాబా మరియు విశ్వ మాతేశ్వరి సరస్వతి తల్లితో పాటు మానవాత్మల అలౌకిక సంబంధాలు మరియు ఆదర్శ తల్లి-తండ్రుల రూపములో వారి అలౌకిక చరిత్రల గాయనము కేవలం గ్రంథాలలో మాత్రమే లభిస్తుంది. కాని వర్తమాన సంగమ యుగములో మళ్లీ వారు మాతా-పితల రూపములో సమస్త విశ్వాన్ని దివ్యమైన అలౌకికమైన

మార్గములో ముందుకు నడిపించే దివ్యకర్తవ్యము చేస్తున్నారు. ఆదర్శ అలౌకిక విశ్వ పరివారానికి పునాది రూపములో వారి ఈ కర్తవ్యము సమస్త మానవత కొరకు సర్వోచ్ఛమైన ప్రేరణను ఇస్తుంది. అందుకే ఫాలో ఫాదర్ అండ్ మదర్(అలౌకిక మాతా-పితలను అనుసరించండి/Follow Father and Mother) అని చెప్పబడింది.

ఈ భూమి పై సర్వ శ్రేష్ఠ విద్యాదేవి తల్లి అయిన సరస్వతిగారి సాన్నిధ్యము ద్వారా ప్రాప్తి అయిన అనుభవాల ఆధారితమైన ఈ అమూల్య కానుక భలే ఆలస్యంగా ప్రాప్తి అయినా ఒక అద్భుత అమూల్యమైన ఖజానా రూపంలో మీ సన్ముఖములో ఉంది. సర్వాత్మల సత్యమైన అలౌకిక తల్లి సత్య పరిచయము ఈ పుస్తకములోని ప్రతి శబ్ధ-శబ్ధములో ఇమిడి ఉంది. సిద్ధి స్వరూపులుగా తయారుచేసే తల్లిగారి వరద (వరదానాలను ప్రసాదించే) జీవితము పై అధారపడిన ఈ అమూల్య రచన, సర్వ సోదరీ - సోదరులకు ఒక అమూల్యమైన వరదానంగా సిద్ధమవుతుంది. తల్లి ద్వారా కురిసిన ఈ అమృత వర్షము పాఠకులకు "అమరభవ" అను వరదానంగా నిరూపణ అవుతుంది.

ఏ సోదరీ-సోదరులకైతే కల్పము యొక్క ఇతిహాసములో సరస్వతి తల్లి నిభాయించిన సాకార పాత్రను చూసే మహాభాగ్యము లభించలేదో వారు ఈ అమూల్య కానుక ద్వారా స్వయాన్ని ధన్యధన్యులుగా అనుభవము చేస్తారు. దీనిని తయారు చేసేందుకు నిమిత్తమైన ఆత్మలకు హృదయపూర్వక ఆశీర్వాదాలు ఇస్తూ కృతజ్ఞతలు తెలుపుతారు.

విశ్వ మాతేశ్వరి అయిన జగదంబ సరస్వతి జీవితములో వారి ఒక్కొక్క గుణము(చరిత్ర ) పై ఒక్కొక్క గ్రంథము వ్రాయవచ్చు. మీ చేతులకు లభించిన ఈ రచన సాగరాన్ని ఒక చిన్న కూజాలో ఇముడ్చడం వంటిది. ఈ గ్రంథము కొరకు పరమ ఆదరణీయ దాదీ ప్రకాశమణి గారికి మరియు ఇతర సర్వ నిమిత్త మహాత్మలకు కోటి-కోటి దన్యవాదాలు, శుభాకాంక్షలు.

- బ్రహ్మకుమార్ నిర్వైర్

భూమిక

# యజ్ఞమాత జగదంబ సరస్వతి

"యజ్ఞమాత జగదంబ సరస్వతి" అను పేరు గల ఈ పుస్తకాన్ని సోదర-సోదరీలైన మీ చేతులలో ఉంచుతున్నందుకు మేము చాలా హర్షితమవుతున్నాము. ఈ పుస్తకములో మహాతపస్విని బాల బ్రహ్మచారిణి వీర వీరాగిణి, కోరికల పట్ల లేశ మాత్రము కూడా అవిద్య స్థితిలో ఉండు సర్వస్వ త్యాగి, నిస్వార్థ సేవాధారి, సర్వ గుణాలతో, సర్వ మర్యాదలతో సుశోభితమైన నారీరత్నము తల్లి సరస్వతి యొక్క జీవితగాథే ఉంది. వారు కుమారి(కన్య)గా ఉండినా, 350 కంటే ఎక్కువ యజ్ఞ వత్సలకు, వేలాది బ్రహ్మవత్సలకు మమతామయి తల్లిగా ఉండి వారిని పాలన పోషణ చేసి జ్ఞాన-యోగాలతో సరిద్ది దైవీ గుణాలతో శృంగారించి వారిని యోగులుగా, యోగ్యులుగా తయారు చేశారు.

ఏ యజ్ఞవత్సలు మరియు బ్రహ్మవత్సలైతే వారి పాలన తీసుకున్నారో వారి సంబంధ-వ్యవహారములోకి వచ్చారో, ఆ మహాసౌభాగ్యశాలురు కొంతమంది లిఖిత అనుభవాలను లేక మౌఖిక రూపములో ప్రాప్తి చేసుకున్న అనుభవాలను జ్ఞానామృత మాసపత్రిక నుండి ప్రాప్తి చేసుకొని ఈ పుస్తక నిర్మాణము చేయబడింది. ఇప్పుడు మన జతలో లేని చాలామంది దాదీలు, దాదాల ధ్వని ముద్రిత క్యాసెట్ల నుంచి కూడా కొంత విషయ సామగ్రి తయారు చేయబడింది,

మమ్మా జతలోని తమ అనుభవాన్ని వినిపిస్తూ వినిపిస్తూ చాలా మంది సోదర-సోదరీలు అతీతమై తమను తాము మర్చిపోయేవారు. చాలామంది భావ విభోరులై(భావనలలో మునిగి) పోయేవారు. వారి నయనసరోవరము నుండి ప్రేమ బాష్పాలు రాలేవి. చాలామంది గద్గదమై వారి కంఠాలు పూడిపోయేవి. తల్లి జతలోని తమ అనుభవాన్ని వినిపిస్తూ వినిపిస్తూ కొంతమంది సోదరీల కనుల నుండి తీక్షణమైన, శక్తివంతమైన

ప్రకాశం మెరవడం కూడా నేను చూశాను. ప్రతి సోదరీ-సోదరుడు మాతేశ్వరి కేవలం నాకు మాత్రమే తల్లి. ఆ తల్లి అందరికంటే ఎక్కువగా నన్నే ప్రేమించారు, నన్నే మురిపింపచేశారు అని అనుభవము చేశారు. ఈ సోదరీ-సోదరులు నిజంగానే పదమా పదమా భాగ్యశాలురు ఎందుకంటే వీరు ఆ పాలనకర్త, ఆదిశక్తి, సర్వమంగళకారి మాతేశ్వరిని సాక్షాత్తుగా చూశారు, తెలుసుకున్నారు. వారి వరద మహావాక్యాలను సన్ముఖంలో విన్నారు. అంతేకాక వారి ఒడిని కూడా తీసుకున్నారు.

ఒకసారి మధువనం ఆంగనములో భ్రాతా జగదీష్ చంద్రగారు మధువన వాసులైన సోదరీ-సోదరులతో వార్తాలాపము చేస్తూ ఇలా అన్నారు - జగదంబ సరస్వతిని మన జీవిత కాలములో సాక్షాత్తుగా చూశాము, “ ఇది ఎంతో సాభాగ్యకరమైన విషయము, జనులు ఎవరినైతే పూజిస్తారో, విద్యా దేవి అని ఎవరిని అంటారో, ఆ విద్యాదేవి ఎలా ఉండేది. వారిలో ఏ విశేషతలు ఉండేవో - వారితో పాటు జీవితాన్ని గడుపుతూ వారి జతలో ఉంటూ ఎవరైతే ఇవన్నీ చూశారో, వారి అనుభవాలను వినడం కూడా చాలా లాభదాయకమైన విషయము. జీవితములో చాలా గొప్ప ఉపలబ్ధము (ప్రాప్తి). మాతేశ్వరిగారితో పాటు జీవితాలను గడిపిన వారి నుండి విని అనుభవము చేసిన వరిష్ఠ(పెద్ద) సోదరీ-సోదరుల అనుభవాలను చదివే సువర్ణావకాశము కూడా ఎవ్వరూ వదిలి పెట్టరాదు. వారు తల్లి సరస్వతీగారి విశేషతలు చూశారు, వారి పాలనను తీసుకున్నారు. లాలిపాట వంటి సుఖమునిచ్చే వారి స్వరాన్ని విన్నారు, మధురాతి మధరమైన మాటలు విన్నారు, వారి దృష్టితో తృప్తి(నజర్ సే నిహాల్) చెందారు. వారి ఒడోలోకి వెళ్ళి శీతలతను ప్రాప్తి చేసుకున్నారు. ప్రీతిని, మురిపాన్ని పొంది ముందుకు వెళ్ళారు. జీవితములో అనుభవము చాలా అమూల్యమైన ఖజానా. డ్రామానుసారము చాలామంది సోదర-సోదరీలు మమ్మాగారి సాకార పాలన నుండి వంచితులుగా ఉన్నారు కావున మమ్మా తోడును పొందిన అనుభవీల మాటలను చాలా శ్రద్ధగా వినాలి, చదవాలి. దీని ద్వారా ప్రగతి జరుగుతుంది. ”



భ్రాతా జగదీష్‌గారి ఈ ప్రేరణాదాయక శబ్ధాలతో పాటు ఈ పుస్తకాన్ని తయారు చేసేందుకు మూల ప్రేరణ అయిన దాదీగారు, భ్రాతా నిర్వైర్‌గారు మరియు ఇతర వరిష్ట సోదరీ-సోదరులకు, సోదరీ-సోదరులైన మనమందరము మా కృతజ్ఞతలు అర్పిస్తున్నాము.

పుస్తకము పెద్దదౌతూ ఉన్నందున కొంతమంది సోదరీ-సోదరుల అనుభవాల లిఖితాన్ని ఇందులో చేర్చలేదు. ఈ పుస్తకము యొక్క రెండవ భాగములో వాటిని ప్రచురించేందుకు పూర్తిగా ప్రయత్నం చేయబడ్తుంది. ఈ పుస్తకము తయారు చేయడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహయోగులైన సర్వ సోదరీ-సోదరులకు మేము కృతజ్ఞులము.

ఈ పావన పుస్తకానికి మూల పురుషుడు పరమపిత పరమప్రియుడు, పరమబంధువు పరమపావనుడు, నిరాకార శివపరమాత్మ మరియు పరమమాత అయిన ఆకారి బ్రహ్మాబాబా గారికి కోటి కోటి ధన్యవాదాలు.

- బ్రహ్మాకుమార్ ఆత్మ ప్రకాశ్

# ఆదరణీయ తల్లి సరస్వతి గారి పరిచయము



ప్రజాపిత బ్రహ్మా తర్వాత జగదంబ సరస్వతి స్థానము తన రీతిలో అత్యంత మహోన్నతమైనది. యజ్ఞ స్థాపనలో వారి తలమానిక పవిత్రత. ఘోరమైన తపస్సు, చెరగని నిశ్చయము మొదలైన వాటిని ఎంత మహిమ చేసినా తక్కువే అవుతుంది. ఎవరైతే వారి ముఖమండలాన్ని చూశారో, వారిని అడగండి - వారు ఎంత ప్రాకృతిక అద్భుతంగా ఉండేవారు! వారిని చూసి మహాఅజ్ఞాని కూడా ఇలా అనేవారు -

“ తల్లీ, ఓ తల్లీ! మీ శీతలమైన ఛాయ! మీ శీతలమైన ఒడి!
మీరు అవునన్న దానికంతా అవును, ఓ తల్లీ! మీరు ఎక్కడకు
తీసుకెళ్ళినా మాకు ఆకాశమే కనిపిస్తుంది, ఈ ధరిత్రిని
మర్చిపోయాము! తల్లీ ఓ తల్లీ!.................”

శివబాబా బ్రహ్మాబాబా ఇరువురు కలిసి జ్ఞానరంగుతో చిత్రీకరించిన మీ భీని-భీని(ప్రభాతమంత స్వచ్ఛమైన మందహాసము) ఎంత బాగుండేది! ఆ చిరునవ్వును చూస్తే ఏడుపు సదా కొరకు ఆగిపోతుంది. ఆ నిర్మల



నయనాలు వేటి ద్వారా అయితే యోగ-తపస్సుల ప్రకాశ కిరణాలు ఎవరి పైన పడేవో, వారిని కూడా యోగమనే రెక్కల పై కూర్చోపెట్టుకొని భువి నుండి దివికి తీసుకెళ్ళేవి. వారి దివ్య వ్యక్తిత్వము ఒక అహింసక సైన్యానికి సేనాధిపతి వలె కనిపించేది. వారి నడవడిక - పద్ధతి ఎలా ఉండేవనగా అందులో యోగము రహస్యము కలిసి వారిని ఎంత భవ్యంగా, దివ్యంగా, సుసభ్యంగా చేసేవంటే అడిగే అవసరమే లేదు. మమ్మాగారి స్పర్శ లభించినవారు స్వయంలోని ఇంద్రియ చంచలత శాంతమైపోయినట్లు అనుభవము చేసేవారు ఏ సమయములోనైనా, ఎవరైనా వారి గదిలోకి ప్రవేశించినప్పుడు వారు సమాధి స్థితిలో ఉన్న తపస్వారథులుగా చూచేవారు అనగా హంస-తల్లి(హంస రూపములో ఉన్న తల్లి) జ్ఞానరత్నాలను ధారణ చేసినట్లు అనిపించేది. వారి చిత్రములో(ఆకారములో) ఎంత గారడి ఉండేది! వారి వ్యవహారములో ఎంత సుగంధముండేది! వారి కర్మలలో ఎంత సువాసన ఉండేది! వారిని పరిచయ యుక్తమైన దృష్టితో ఎవరు చూచారో, వారి జీవితమే సఫలమైపోయేది అనగా మనందరిది ఎంత సౌభాగ్యమంటే మనము బ్రహ్మాకుమారులము, బ్రహ్మావత్సలమే కాక సరస్వతీ పుత్రులము, పుత్రికలము కూడా అయ్యాము. జనులు ఏ దేవినైతే విద్యాదాయిని రూపములో విద్యను వరదానంగా పొందేందుకు పిలుస్తున్నారో స్వయం వారి పునీతమైన చేతులతోనే మేము అమృతము త్రాగాము. స్వయం వారి ముఖ-వీణ ద్వారా స్వర్గ సుఖమునిచ్చే జ్ఞాన ఝుంకారము విన్నాము. వారి వరదహస్తాలు మా తల పై ప్రేమను వర్షించాయి. మేము వారి జ్ఞానమయ ఒడిలోని పుత్రులము. మేము ఈ కనులతో సరస్వతిని ఈ భూమి పై నిలబడి ఉండుట, కూర్చొని ఉండడం, నడవడం చూశాము. మేము ఆమె నుండి ఇంకేమీ పొందక పోయినా, ఆమెను చూడడం ఏమైనా తక్కువ మాటనా! ప్రపంచములో ఇంత కంటే అధిక సుందరమైన దృశ్యము ఏదైనా ఉంటుందా?

వారు నడుచునప్పుడు భూమ్యాకాశాలు సూక్ష్మ దివ్యనాదము చేసేవి. వారు రాత్రంతా శివపితను స్మృతి చేసేటప్పుడు చంద్రుడు కూడా చాలా

నెమ్మదిగా కదిలేవాడు. అరే! పర్వతము పైన శివుని కొరకు తపస్సు చేసిన పార్వతి వారే. వారే గౌరీదేవి. వారే ఆ హిమరాజుని పుత్రిక. జ్ఞాన గుణాల దృష్టికి అపారమైన సుందరంగా కనిపించేవారు. సాక్షాత్తుగా వారిని చూడనివారు ఏమి చూసినట్లు? ఎవరినైతే ప్రపంచము ఆదిదేవి, అంబామాత, ఈవ్, హవ్వా మొదలైన పేర్లతో స్మృతి చేస్తూ ఉందో, వారిని చూచే సమయము ఇదే అనిపించేది. మేము వారి సాంగత్యములో ఉండినాము. వారి చేతులతో పాలింపబడ్డాము. వారి ఛత్రఛాయలో ఆడుకున్నాము. ఆ రోజులు ఎంత సాటిలేనివి! ఆ ఘడియలు మా సౌభాగ్యాన్ని తెలిపే ఎంతో సుందరమైనవి! అటువంటి రోమాంచిత అనుభవము చేయించే ఘడియ మరొకటి ఉండజాలదు. వారు భారతదేశానికి భారతనారికి గర్వకారణంగా ఉండేవారు. యోగులలో వారు సర్వ మహోన్నతమైన యోగినిగా ఉండేవారు. ధర్మమూర్తి, ధర్మనమూర్తి, మార్గదర్శిని, విశ్వసనీయమూర్తిగా ఉండేవారు. వారు దివ్యగుణాల గనిగా ఉండేవారు. వారు విశ్వానికే తల్లి(World Mother)గా ఉండేవారు. వారు లేకుంటే ఏమీ ఉండేది కాదు. వారే ప్రజాపిత బ్రహ్మా నోటి ద్వారా శివపరమాత్మని ఈశ్వరీయ జ్ఞానము విని యజ్ఞవత్సలందరికి అర్థము చేయించేవారు. వారు యజ్ఞవత్సల ముందు జ్ఞాన-యోగాల నమూనాగా ఉండేవారు. యజ్ఞవత్సలందరిని సంభాళించేందుకు వారే నిమిత్తంగా ఉండేవారు. వారికి ప్రజాపిత బ్రహ్మాకు సమానమైన స్థానములో కూర్చొని జ్ఞాన వీణా వాదన చేయు అధికారము ఉండేది.

ఆ మాతేశ్వరినే దుర్గా దేవి రూపాన్ని ధరించి యజ్ఞ దుర్గమును (కోట) రక్షించారు. విఘ్నాలు ఎదుర్కొన్నారు. జనుల ద్వారా, ప్రభుత్వము ద్వారా వచ్చిన ఆపదలను, విపత్తులను సహించారు. భిన్న-భిన్న సంస్కారాలు గల యజ్ఞవత్సలను సంస్కారాల బట్టి ద్వారా వారే ఉజ్వలము చేశారు. ఒక్కొక్కరికి జ్ఞాన జోల పాటను వినిపించి జ్ఞాన పాలన ఇచ్చారు. వారే మొట్టమొదటి శీతలా తల్లి, సంతోషిమాత, అన్నపూర్ణ.

స్వయం ప్రజాపిత బ్రహ్మా వారికి మాలలో జంట పూసలో



స్థానమునిచ్చి వారికి యజ్ఞమాత అను బిరుదునిచ్చి గౌరవనీయులుగా భావించేవారు. బ్రహ్మాబాబా వారిని ముందుంచి ఉదాహరణమునిచ్చేవారు. "పురుషులందరు" మాతలను గాని, సోదరీలను గాని ముందుంచమనే వారు. స్వయం బాబాయే చాలాసార్లు వారికి వీడ్కోలు ఇచ్చేందుకు రైల్వే స్టేషన్ వరకు వెళ్ళేవారు.

నేను సుమారు 50 దేశాలు చుట్టి వచ్చాను. రూప లావణ్యాలు గల అనేకమంది సుందరమైన స్త్రీలను కూడా చూచి ఉంటాను. ఎందుకంటే కళ్ళు మూసుకొని ప్రయాణము చేయము కదా! విద్వత్తు, సమాజసేవ, అనుశాసనము మరియు వక్తృత్వములో అగ్రగణ్యులైన మహిళలను కూడా చూశాను. కాని తల్లిలోని దివ్యతను, వారి శాలీనత(నమ్రత), వారి సౌందర్యము స్వర్గములోనిదిగా ఉండేది. వారి వివేకము అద్వితీయంగా ఉండేది. వారు మానవత నుండి ఉన్నతమైన పవిత్ర పునీత హంస వర్ణానికి చెందినవారు. వారిని చూచి ఎటువంటి పాతకుడైనా, ఘాతకుడైనా, చాతకుడైనా(దాహముతో ఉన్న వారైనా) అందరూ "తల్లీ" అనీ పిలిచేవారు.

వారు పృథ్వి పై ఉంటున్నా లేనట్లు ఉండేవారు. వారి ఆధ్యాత్మిక చైతన్యము వారి యోగ ప్రకాశము ఎలా ఉండేదంటే చూచేవారు కూడా శరీరాన్ని మర్చిపోయి ఆత్మ నిష్ఠులుగా అయిపోయేవారు. ఆత్మనిష్ఠులుగా కాకున్నా వారిలో ఆధ్యాత్మిక చైతన్యము మేల్కొనేది. కనీసము కొంత సమయమైనా వారి తమోగుణీ, రజోగుణి సంస్కారాలు సమాప్తమైపోయేవి వాటి స్థానములో సతోగుణాలు ఉదయించేవి. మన తల్లి జగదంబ సరస్వతి ఇలా ఉండేవారు.

తల్లీ!, మీకు శత–శత ప్రణామాలు!

తల్లీ!, ఓ తల్లీ మీ శీతలఛాయ,

మీ వరదాయని ఒడి,

మీరు అవునన్న దానికి నేను అవునంటే కనిపిస్తుంది ఆకాశము!

ఓ తల్లీ!!!

- బ్రహ్మాకుమార్ జగదీశ్ చంద్ర

# విషయ సూచిక


ఆశీర్వచనము

రెండు శబ్దాలు

భూమిక

ప్రస్తావన

దేవి సరస్వతిగారి సాంస్కృతిక పౌరాణిక మరియుఅధ్యాత్మిక విశ్లేషణ .................. 1

ఆది దేవి జగదంబ సరస్వతి పరిచయము........................ 9

శ్వేత వస్త్ర ధారిణి. శ్వేత చందన ధారిణి శ్వేత–శ్వేతేశ్వరి సరస్వతి మాత................. 16

సరస్వతి గారి జన్మ మరియు వారి మహిమల అధ్యాత్మిక రహస్యము.............. 19

మాతేశ్వరి గారి లౌకిక జీవన పరిచయము.................................................. 26

మమ్మా నా సహపాఠి, సఖి, అలౌకిక తల్లి కూడా అయినారు ........................... 37

మాతేశ్వరి పసిబిడ్డే కాక జగన్మాత కూడా ................................. 46

మాతేశ్వరి గుణాల గని, గుప్త తపస్విని ....................................... 54

శక్తి స్వరూపిణి, మరియు సిద్ధి స్వరూపిణి మాతేశ్వరి ............................ 58

మాతేశ్వరి గారు గానవిశారద, సంగీత శారద............................ 60

మాతేశ్వరి మా అందరి హృదయేశ్వరి ....................................... 70

సద్భావనా మూర్తి – మమ్మా ................................. 71

మమ్మా నాలో తమ దివ్య శక్తులన్నీ నింపారు ............................. 72

వైకుంఠ స్వామిని శ్రీ భగవతి ...................................................................... 79

మమ్మానే నాకు యోగము నేర్పించి యోగ్యముగా చేశారు.................................... 81

మాతేశ్వరి జీవన పర్యంతము స్థిరంగా అచంచలంగా ఏకరసంగా ఉండేవారు 86

మాతేశ్వరి విశ్వములో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వము 93

మాతేశ్వరి – సమస్త ప్రపంచానికి తల్లి 106

నేను – మరియు మాతేశ్వరి 119

విద్యా విశారద వాగ్దేవియే నాకు మాట్లాడే కళ నేర్పించారు 125

మమ్మా చాలా నిరహంకారి 134





సర్వ విద్యల సంపూర్ణ దేవి – మాతేశ్వరి............................ 137

జన్మిస్తునే మొదట తల్లి దర్శనము తర్వాత తండ్రి దర్శనము ................... 145

నిరహంకారత మరియు వినమ్రతల జనని – తల్లి సరస్వతి................ 150

సర్వులకు సన్మానమిచ్చే విశ్వవందనీయ తల్లి..................... 155

సర్వమాన్యమైన తల్లి – లలితాంబ............................... 158

మాతేశ్వరి పవిత్రతకు జనని.................................... 163

సదా అచలంగా స్థిరంగా ఉండు తల్లి – దుర్గమ్మ.................... 167

పితా శ్రీ బ్రహ్మబాబా ప్రతి కర్మను అనుసరస్తూ బ్రాహ్మీ పదవిని ప్రాప్తి చేసుకున్న బ్రహ్మ పుత్రిక (సుతే) శ్రీ సరస్వతి................................ 170

సభూతో – సభవిష్యతి..................................... 176

త్రికాలదర్శి మాతేశ్వరి..................................... 180

కష్టహారిణి, దు:ఖ నివారిణి అయిన తల్లి దుర్గ.......................... 184

జీవితములో నిర్ణయము జరిగిపోయింది.............................. 189

దివ్య దృష్టి విధాత్రి – మాతేశ్వరి....................................... 192

భవ భయహారిణి శక్తి స్వరూపిణి – మాత............................. 195

దివ్య రూపాన్ని చూపించే దైవీ తల్లి................................ 198

ఇదేమిటి దేవతలందరూ ఇచ్చటకే వస్తున్నారు ?....................... 202

విదేహ స్వరూపిణి వికార మర్ధిని – మహంకాళి మాత.................. 206

మాతేశ్వరి గారి ఆ మాటలు నా జీవితాన్ని ఆనందమయము చేసేశాయి ......... 210

కల్ప క్రితపు ఆ కన్యవు నీవే కదా! ....................................... 213

భక్తులకు, పిల్లలకు సాక్షాత్కారము చేయించే జగదంబ తల్లి................. 221

ఏ అంబా మాతను ప్రపంచమంతా పిలుస్తూ ఉందో ఆ తల్లిని నేను చూశాను......... 225

మాతేశ్వరి గారు విద్యా దేవిగా ఉండినా అత్యధిక శ్రద్ధగల ఒక విద్యార్థిని.............. 228

ఒకే ఒక ప్రకాశ కిరణము నా జీవిత లక్ష్యాన్ని పరివర్తన చేసేసింది.................... 232

సర్వకళా సంపన్న కళాదీశ్వరి – సరస్వతీ తల్లి.............................. 236

పరమపిత పరమాత్మను గుర్తింపచేయు భాగ్య విధాత్రి జగదంబ............. 238

నా జీవితము – ఆ తల్లి ప్రసాదించినది........................................ 242
మాతేశ్వరీ గారు నా అలౌకిక జన్మధాత్రి, అంతేకాక భాగ్యవిధాత్రి కూడా.......... 244
సర్వగుణ సంపన్న శివశక్తి తల్లి సరస్వతి........................... 248
మమ్మానే నన్ను చక్రధారి అని పిలిచారు................................. 252
వరదాయిని త్రికాలదర్శిని విశ్వకళ్యాణి – మమ్మా .................. 255
అష్టభుజధారి దుర్గమ్మ తల్లి .......................................... 258
మాతేశ్వరీ గారిని కలుసుకున్న వారంతా ఈశ్వరుని వారసులుగా అయ్యారు...... 261
మమ్మా నాకు నిర్భయంగా మరియు సత్యంగా ఉండడం నేర్పించారు................ 265
తల్లి – సరస్వతే నాకు గురుముఖి లిపి చదవను వ్రాయను నేర్పించారు................. 270
సరస్వతి తల్లియే నాకు జ్ఞానము నేర్పించి, యోగము చేయించారు..................... 275
మమ్మాగారి వరదానాలతోనే నేను ముందుకు పోతున్నాను........................... 280
మాతా ఓ మాతా ! నీవు ఈ ప్రపంచానికి శీతల ఛాయ !............................ 282
కరుణా శీలా క్షమాపూరిత ప్రేమమయి తల్లి – సరస్వతి.......................... 285
మమ్మా నన్ను జగన్మాతా ! అని పిలిచారు....................................... 289
లాలి(తల్లిలాలన) చూచేందుకు వెళ్ళి నేను కూడా లాల్
(ప్రియమైనల బిడ్డ) గా అయిపోయాను ................................................ 294
ఇది కూడా మాతేశ్వరి గారి ఒక మెరుపు............................... 297
మహా ప్రయాణానికి ముందు తయారవ్వడం............................. 307
మమ్మా చివరి రోజులు, వారితో అనుభవము........................... 312
మమ్మాను గురించి అవ్యక్త సందేశాలు...................................... 320

## దేవి సరస్వతి గారి సాంస్కృతిక, పౌరాణిక ఆధ్యాత్మిక విశ్లేషణ

భారతీయ సంస్కృతిలో దేవి సరస్వతి గారి స్థానము అత్యంత గౌరవప్రదమైనది మరియు అగ్రగణ్యమైనది, సుర - అసురులు, యోగులు, భోగులు, ప్రవృత్తి-నివృత్తిలోని వారు, రాజులు-ప్రజలు, సిద్ధ పురుషులు, యోద్ధ పురుషులు, సమస్త మానవ కులమువారు, దేవి సరస్వతిని అర్చన మరియు ఆరాధన చేస్తూ వారి నుండి సకల సిద్ధులు ప్రాప్తి చేసుకోవాలని ప్రార్థన చేస్తారు.

### సరస్వతి - వందనము

ప్రాచీనకాలపు గురుకుల పాఠశాలల నుండి వర్తమాన సమయములోని విద్యాలయాల వరకు విద్యాధ్యయనము ఆరంభము చేయుటకు ముందు సరస్వతీ దేవికి వందనము చేస్తారు. బహుశా ప్రతి విద్యాలయ ప్రాంగణములో లేక దాని కేంద్రస్థానములో సరస్వతీ దేవి విగ్రహము ప్రతిష్ఠింపబడ్తుంది. భారదేశములోని మనుష్యులందరూ సరస్వతీ దేవిని విద్యాబుద్ధులకు, జ్ఞానమునకు అదిష్ఠాన దేవతగా అంగీకరిస్తారు. అంతేకాక దేవీ దేవతా పదవిని ప్రాప్తి చేయించేవారిగా సర్వ అభీష్టాలను, కామనలను పూర్తి చేయువారిగా కూడా అంగీకరిస్తారు. అందుకే సరస్వతి దేవికి వందనమును ఆచరిస్తారు -

*హంసారూఢా హరహసితహారేందుకుందావదాతా*
*వాణీ మందస్మితతరముఖీ మౌళిబద్ధేందులేఖా*
*విద్యా వీణామృతమయఘటాక్షరసజా దీప్తహస్తా*
*శ్వేతాబ్జస్థా భవదభిమత ప్రాప్తయే భారతీ స్యాత్*

ఎవరైతే హంస పై సవారి అయ్యి ఉన్నారో, శివపరమాత్ముని చిరునవ్వు, ముత్యాల హారము శశాంకుని వలె కమలపుష్ప సమాన ఉజ్వల వర్ణము కలవారో, ఎవరైతే వాణీ స్వరూపిణిగా ఉన్నారో, ఎవరి ముఖము మధురమైన మందహాసముతో సుశోభితంగా ఉందో, ఎవరి

మస్తకము చంద్రరేఖతో విభూషితమై ఉందో, ఎవరి హస్తాలు వీణ, అమృతకలశము, గ్రంథము మరియు అక్షరమాలతో శృంగారితమై ఉందో, ఎవరైతే శ్వేత కమల ఆసనము పై ఆసీనమై ఉన్నారో, అటువంటి సరస్వతి దేవి - మీకు సర్వ అభీష్ఠ సిద్ధిని ప్రాప్తి చేయించేవారు. బుద్ధిదాయినీ భగవతి సరస్వతీ దేవి కృప వలననే మూఢత నశించి సద్బుద్ధి సద్విద్య, వాక్-వికాసము సత్య జ్ఞానము ప్రాప్తి అవుతాయని భారతీయ ధర్మశాస్త్రాలు కూడా చెప్తున్నాయి. విద్యాబుద్ధులను ప్రాప్తి చేసుకునేందుకు సాధన చేయు సాధకులు ఈ విధంగా సరస్వతీ దేవిని స్తృతి చేస్తారు :-





దోర్భిర్యుక్తాశ్చతుర్భి స్పటికమణిమయీ మక్షమాలామ్ దధానా
హస్తేనైకేన పద్మామ్ సితమపి చ శుకమ్ పుస్తకమ్ చాపరేణ !
యా సా కున్దేన్దుశంఖస్పటికమణినిభా బాసమానా సమానా
సా మె వాగ్దేవతేయమ్ నివసతు వదనే సర్వదా సుప్రసన్నా !!

ఎవరి చేతులలో స్పటిక మణులతో తయారైన అక్షమాల శ్వేత కమలము శుకము(చిలుక) గ్రంథములతో శోభిస్తున్నాయో, ఎవరైతే తామర పుష్పము చంద్రుడు, శంఖు స్పటికమణి సమానంగా దేదీప్యమానమై రూపవంతముగా ఉన్నారో, ఆ వాగ్దేవి అయిన సరస్వతి పరమ ప్రసన్నమై సదా నా అధరాల(పెదవుల) పై నివసించుగాక.

అంతేకాక వారిని ఇలా కూడా ప్రార్థిస్తారు -

శ్వేత పద్మాసనా దేవీ శ్వేతగంధానులేపనా
అర్చితాముసిభి: సర్వైఋుషిభి: స్తూయతే సదా

............................................................................

ఏవం ధ్యాత్వా సదా దేవీం వాంఛితం లభతే నర:

ఎవరైతే శ్వేత కమలము పై ఆసీనమై ఉన్నారో, ఎవరి శరీరములో శ్వేత చందన లేపము ఉంటుందో ఎవరినైతే మునిగణము అర్చన చేస్తుందో, సర్వ ఋుషివరులు సదా ఎవరి గుణగానము చేస్తారో, ఆ సరస్వతీ దేవి నా పట్ల అతి ప్రసన్న మగుగాక!

దేవీ సరస్వతికి ఈ విధముగా కూడా వందనమాచరిస్తారు -

శారదా శారదాంభోజవదనా వదనాంబుజే !
సర్వదా సర్వదాస్మాకం సన్నిధిం సన్నిధిం కుర్యాత్ !!
సరస్వతీ చ తాం నౌమి వాగ్గిష్ఠాత్పతే వతామ్ !
దేవత్వం ప్రతిపధన్తే యదనుగ్రహాతో జనా: !!

శరదృతువులో వికసించే(ఉత్పన్నమయ్యే) కమలపుష్ప సమాన

ముఖమండలము కలిగిన దేవి, సర్వ మనోకామనలను పూర్తి చేయు దేవీ శారదా సర్వ సంపదలతో నా ముఖమండలము పై సదా నివసించుగాక. ఎవరి కృపతో మనుష్యులు దేవతలుగా అవుతారో, నేను ఆ వచనముల అదిష్ఠాన సరస్వతికి ప్రణమిల్లుతున్నాను.

*సరస్వత్యై నమో నిత్యం భద్రకాల్యై నమో నమః*
*వేద వేదాంతవేదాంగ విద్యాస్థానేభ్య ఏవ చ*
*సరస్వతీ మహాభాగే విద్యే కమలలోచనే*
*విద్యారూపే విశాలాక్షి విద్యాం దేహి నమోస్తుతే*

ఇటువంటి సరస్వతీ దేవికి నిత్యనమస్కారము. భద్రకాళికి నమస్కారము. వేద వేదాంత, వేదాంగాలు మొదలైన విద్యల జననికి ప్రణామము. హే మహాభాగ్యవతీ జ్ఞానస్వరూపిణీ కమల సమాన విశాలాక్షి జ్ఞానదాత్రి సరస్వతి నాకు విద్యాప్రదానము చేయండి, నేను మీకు నమస్కరిస్తున్నాను.

## సరస్వతీ దేవి జన్మ రహస్యము

"దేవీ భాగవత పురాణము" అనుసారము సరస్వతీ దేవి కృష్ణుని జిహ్వా (నాలుక) యొక్క అగ్రభాగము నుండి ఉద్భవించింది(జన్మించింది). ఈ పౌరాణిక కథలోని ఆధ్యాత్మిక రహస్యాన్ని ఉద్ఘాటన చేస్తూ జ్ఞానసాగరులైన పరమపిత పరమాత్మ నిరాకార శివుడు ఇలా తెలిపారు. సత్యయుగములో ఏ ఆత్మ అయితే శ్రీకృష్ణునిగా అయ్యిందో, అదే ఆత్మ జన్మ పునర్జన్మలు తీసుకుంటూ తీసుకుంటూ కలియుగాంతము మరియు సత్యయుగాదుల వర్తమాన పురుషోత్తమ కళ్యాణకారి సంగమ యుగములో ప్రజాపిత బ్రహ్మాగా అవుతుంది. ప్రజాపిత బ్రహ్మా సృష్టి రచయిత. వారి ముఖకమలము అనగా జిహ్వా ద్వారా ఏ ఈశ్వరీయ త్రికాల జ్ఞానము ఉచ్ఛరింపబడుతుందో, దానిని విని జగదంబ సరస్వతి ఉద్భవించింది అనగా అలౌకిక జన్మ జరిగింది. బ్రహ్మా రచించిన శ్రేష్ఠ రచనలలో జగదంబ సరస్వతి సర్వ శ్రేష్ఠమైనది. ఈ



విషయాన్నే ఋషులు - కవులు సరస్వతి జన్మ శ్రీకృష్ణుని జిహ్వా అగ్ర భాగము నుండి జరిగిందని వ్రాశారు.

"దేవీ భాగవత పురాణము" లో శ్రీకృష్ణుడే ఈ ప్రపంచములో సరస్వతి దేవి పూజను ప్రచారము చేశారని కూడా వ్రాయబడి ఉంది. ఈ ప్రసంగములో మేము ఇది తెలపాలనుకుంటున్నాము - సంగమ యుగములో పరమాత్మ మరియు వారి సహయోగ అనన్య పిల్లల ప్రతి కర్మ మరియు చరిత్ర భక్తిమార్గములో స్మృతిచిహ్న చిత్రాలుగా తయారవుతాయి. ప్రస్తుత విషయము కూడా ఆ ఒక్క చరిత్రను తెలిపే ఒక చిత్రము. ఈ స్మృతిచిహ్న చరిత్రను వినిపిస్తూ భ్రాతా జగదీష్ చంద్రగారు తమ అనుభవములో ఇలా వ్రాశారు - "ఒకసారి సాకార బాబా పిల్లలూ! చిన్న-చిన్న పుల్లలు కొన్ని ఏరుకుని రండి, వాటిని మాతా జగదంబకు అర్పితము చేసి అందరూ కలిసి ఆ తల్లి మహిమను పాటగా పాడండి అని చెప్పారు. ఆ సందర్భములో వారు నన్ను - "కుమారా! నీకు ఏదైనా జగదంబను మహిమ చేయు పాట తెలుసా, హారతి చేయగలవా?" అని అడిగారు. అందుకు నేను "కొద్దిగా గుర్తుంది" బాబా అని అన్నాను. మేమందరము బాబా చెప్పినట్లే పుల్లలు ఏరుకొని ఒక మోపుగా కట్టుకుని తీసుకెళ్ళాము. ఆ రోజు మమ్మా మాతో పాటు తిరిగేందుకు రాలేదు. మేము పాండవ భవనానికి వెళ్ళేసరికి మమ్మా బాబాగారి ఆగమనము కొరకు నిలబడి వేచి ఉన్నారు. మేము ఆ పుల్లల మోపును వారి పాదాల వద్ద ఉంచి చేతులు జోడించి అర్ధ నిమీలిత నేత్రాలతో భావవిభోరమై వారికి హారతి పాడడం ప్రారంభించాము. అకస్మాత్తుగా జరిగిన ఈ సన్నివేశము చూచి మమ్మా మందహాసము చేస్తూ నవ్వుతూ కూడా ఉండినారు. "అరే! చాలా ఆనందము కలిగినది. ఇక చాలించండి" అని మమ్మా మాతో చెప్పారు. మా భక్తి పూర్తయిపోయింది. మేము భక్తిని సరస్వతి తల్లికి సమర్పితము చేసేశాము. అది ఎటువంటి దృశ్యముగా ఉండినదంటే ఆ దృశ్యాన్ని చిత్రించలేము, వర్ణన కూడా చేయలేము. మేము భూమి పై

ఉన్నట్లుగానూ అనిపించలేదు, సమయాన్ని గురించిన జ్ఞాపకము కూడా లేదు. సాక్షాత్ సరస్వతి తల్లిని ఈ కళ్ళతో కళ్ళార్పకుండా చూచాము. నోటితో హృదయములోని భావాలను వ్యక్తము చేశాము. తల్లి ఎంత ప్రేమించి ఉంటుందో అర్థము చేసుకోగలరా! ”

## సరస్వతి నివాస స్థానము

ఋగ్వేదమనుసారము, వాక్ కళ యొక్క ఈశ్వరీ వాగ్దేవి గారి పేరు సరస్వతి. వాగ్దేవి సరస్వతికి నివాస స్థానాలు మూడు - పృథ్వి, అంతరిక్షము, స్వర్గము. అందులో ఇది కూడా చెప్పబడింది - పృథ్విలోని వాగ్దేవి పేరు 'ఇల'. స్వర్గములోని వాగ్దేవి పేరు 'భారతి'. అంతరిక్షములో నివసించే వాగ్దేవి పేరు 'సరస్వతి'.

## దేవి సరస్వతిగారి మూల స్వరూపము

**“దేవీ భాగవత పురాణము”** లో సమస్త జగత్తుకు కారణ భూతురాలు ఆదిశక్తి పరమేశ్వరి అని చెప్పబడింది. ఈ సృష్టిలో వారి అభివ్యక్త రూపాలు మూడు - **మహాసరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి.** అందులో పరాశక్తి(ఆదిశక్తి) యొక్క పరిశుద్ధమైన సతోగుణాల అంశము లేక స్వరూపమే మహాసరస్వతి అని కూడా చెప్పబడింది.

## దేవి సరస్వతికి గల అనేక నామాలు, గాయనము

**భారతి, వాగీశ్వరి, సరస్వతి, ఆర్యా, బ్రాహ్మి, శారదా, కామధేనువు, వేదగర్భా, ధీశ్వరి, మహావిద్యా, మహావాణి, స్వరాత్మిక** మొదలైనవన్నీ వీరి పేర్లు. వీణాపాణి, విద్యాదాయిని, విపులమంగళదాన శీల, బుద్ధిధాత్రి, ఆకాశగామిని మొదలైనవన్నీ వీరి గాయనము(మహిమ).

## దేవి సరస్వతిగారి గుణాలు, శక్తులు

శాస్త్రాలలో సరస్వతి గురించి ఇలా వర్ణన చేశారు - వారు సమస్త సంశయాలను నివారణ చేయువారు అంతేగాక జ్ఞాన స్వరూపిణులు.



వీరిని ఆరాధించుట వలన సర్వ విధాలైన సిద్ధులు ప్రాప్తిస్తాయి. సరస్వతి దేవి సంగీతము, కళలు సాహిత్యముల అధిష్ఠాత్రి దేవత స్వరము, లయ, తాళము, రాగము, ఛందస్సు, అలంకారము మొదలైనవి దేవి సరస్వతి ద్వారానే ఆవిర్భవించాయి. సప్త ప్రకారాల స్వరాలతో వీరిని స్మరణ చేస్తారు, అందువలన వీరు **“స్వరాత్మికా”** అని కూడా పిలువబడ్తారు. వీరు సప్తస్వరాల జ్ఞానప్రదానము చేస్తారు. అందువలన వారు **“సరస్వతి”** అని పిలువబడ్తారు.

## దేవి సరస్వతిగారి కృప

ఎవరి పై వీరి కృప ఉంటుందో, వారు మహావిద్వాంసులుగా అవుతారు, కవులుగా అవుతారు, సాహిత్యకారులుగా అవుతారు. వాక్కు కళలో ప్రవీణులైపోతారు. దీనికి సంబంధించిన అనేక పౌరాణిక ఇతిహాసిక కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి బ్రహ్మ సరస్వతితో చెప్పారు - “ పుత్రీ! నీవు ఎవరైనా యోగ్యపురుషుని జిహ్వ(నాలుక) పై కవితాశక్తిగా అయ్యి నివసించు” అని పురాణాలలో చెప్పబడి ఉంది. అప్పుడు సరస్వతి బ్రహ్మ ఆజ్ఞానుసారము యోగ్యవ్యక్తిని వెతికేందుకు బయలుదేరింది. వెతుకుతూ-వెతుకుతూ వారు ఒక నదీ తీరములో తపస్సులో లీనమై ఉన్న వాల్మీకి ఋషిని చూచి వారి పై ప్రసన్నమై వారి జిహ్వ పై ఉపస్థితమయ్యింది. అప్పుడు మహర్షి వాల్మీకి నోటి నుండి ఈ శబ్దాలు వెలువడ్డాయి.

**మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః !**

**.................................................................................................. ॥**

ఇదే విధంగా మహాకవి కాళిదాసు జీవితకథలో కూడా దీనికి సంబంధించిన ఒక ప్రసంగము వస్తుంది. మహాకవి కాళిదాసుగా అయ్యేందుకు ముందు అతడు ఒక గొల్లవాడు. వారు కాళికా మాతను ఆరాధించినప్పుడు ఆ తల్లి ప్రత్యక్షమై “ **హే వత్సా!** ఏ వరము కావాలో కోరుకో” అని అన్నారు. అప్పుడు వారు “నాకు విద్యాబుద్ధులు కావాలి” అని అన్నాడు అప్పుడు కాళికామాత “ధనము, కనకము, రాజ్యము, వైభోగము, అధికారాల

పై కోరిక లేదా?" అని అడిగారు అప్పుడు కాళిదాసు - " లేదు తల్లీ! నాకు విద్యాబుద్ధులే కావాలి" అని అన్నారు. అప్పుడు కాళికామాత అతని నాలుక పై " ఓం " అను బీజాక్షరాన్ని వ్రాశారు. తక్షణమే అతని నోటి నుండి ఈ శబ్దాలు వెలువడ్డాయి.

మాణిక్య వీణాముపలాలయంతీం!

మధాలాసామ్ మంజుల వాగ్విలాసం!!

దీని తర్వాత బుద్ధిహీనుడైన గొల్లవాని నుండి వారు బుద్ధివంతుడైన మహాకవి కాళిదాసుగా అయిపోయాడు, కాళికామాత ఎవరైతే విద్యాదేవి సరస్వతికి మరో రూపమో, కాళిదాసు జిహ్వ పై సన్నివిష్టమయ్యింది. కనుకనే కవులు, సాహిత్యకారులు, వాక్-కళా ప్రవీణులు, సంగీత కారులను " ***సరస్వతీ పుత్ర, సరస్వతీ పుత్రి*** " అని అంటారు,

విశ్వములో అనేక పౌరాణిక గాథలు, ఇతిహాసిక గాథలు కూడా అనంత శక్తులు కళలతో సంపన్నమైన సరస్వతి దేవిగారి జీవన కథను వర్ణన చేస్తాయి, ఉదాహరణకు భారతవాసులు శాంతి, శీతలత కొరకు శీతలా దేవిని, విద్య, బుద్ధి కుశలత కొరకు సరస్వతీ దేవిని, నిర్భయత పవిత్రతల కొరకు దుర్గ మరియు కాళి మాతలను పూజిస్తారు. అదే విధంగా గ్రీకు దేశము వారు అథెనా(Athena) దేవిని, వారి బుద్ధి శక్తి కొరకు కళల కొరకు పూజిస్తారు. రోమ్ ప్రజలు చంద్ర లోకములోని డయానా(Diana) దేవిని వారి నిర్భయత మరియు పవిత్రత కొరకు పూజించేవారు.

ఈ విధంగా సరస్వతి దేవి విశ్వవంద్యగా అయ్యింది. విశ్వములోని సర్వ సభ్యతలలో వారికి గాయనము, వందనము జరుగుతోంది. వారి మహత్త్వము అనంతమైనది, అపారమైనది.

## ఆదిదేవి జగదంబ సరస్వతి గారి పరిచయము

*బ్రహ్మాకుమార్ దాదా ఆనంద్‌కిశోర్ గారు జగదంబ సరస్వతి పరిచయమునిస్తూ ఇలా చెప్తున్నారు -

శరీరాలకు జన్మనిచ్చే లౌకిక(శారీరిక) తల్లి ఒక్కొక్కరికి వేరు వేరుగా ఉంటారు. ఆత్మిక దృష్టిలో మనందరి 'తల్లి-తండ్రి' ఒకే నిరాకారి(అశరీరి) పారలౌకిక పరమాత్మ జ్యోతిర్బిందువైన 'శివుడు' వారు లౌకిక తల్లి - తండ్రులకు సహితము తల్లి-తండ్రి. పారలౌకిక తల్లి-తండ్రి గురించి అయితే అందరికీ తెలుసు. అయినా ఈనాడు మనుష్యులకు ఆ పారలౌకిక మాతా-పితల నామ, రూప, ధామ(నివాసం), కర్తవ్యము ఇత్యాదుల గురించి సత్యమైన పరిచయము లేదు. సృష్టి చక్రములో 5 వేల సంవత్సరాలలో కల్పములో ఒక్కసారి మాత్రమే వారు వస్తారు. అప్పుడు మనకు మన అలౌకిక తల్లి లభిస్తుంది. ఈ అలౌకిక తల్లి మనకు కల్పములో కేవలం ఒక్కసారి మాత్రమే లభిస్తారు, అది కూడా కొంత సమయము కొరకు మాత్రమే లభిస్తారు. వీరి పేరు జగదంబ, ఆదిదేవి సరస్వతి మాత.

### జగన్మాత

ఇప్పుడందరికీ ఒక ప్రశ్న ఉదయిస్తుంది - నిరాకార పరమపిత శివుడు అయితే అవినాశి అయినందున మన ఆత్మలందరికి తండ్రి. కాని జగదంబ శరీరధారి కూడా జగత్తుకంతా మాతగా ఎలా అవుతారు? దీనికి సరైన సమాధానము తెలుసుకోవాలంటే జగదంబగారి అలౌకిక కర్తవ్యాన్ని గురించి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అలౌకిక తల్లి యొక్క పూర్తి కర్తవ్య వాచక నామము '***శివవంశీ బ్రహ్మాకుమారి ఆదిదేవి జగదంబ సరస్వతి***' సరస్వతి మాతను జ్ఞానదేవి(Goddess of Knowledge) అని అందరూ అంగీకరిస్తారు. వారి చేతిలో అలంకారంగా ఉన్న వీణ. జ్ఞానవీణను

* దాదా ఆనంద కిశోర్ గారు యజ్ఞములోని ఆదిరత్నాలలో ఒకరు. బ్రహ్మాబాబా అవ్యక్తమైన తర్వాత వీరు మధువనంలో ఆఫీసు కార్యవ్యవహారాలన్నీ సంభాళించేవారు. చాలా చురుకుగా పనులు చేసేవారు. 21-09-1998 తేదీ వారు నశ్వర శరీరాన్ని త్యాగము చేశారు.

మీటేందుకే ప్రతీక. అయితే ఆలోచించవలసిన విషయమేమంటే జ్ఞానసాగరులు పరమపిత పరమాత్మ శివుడు ఒక్కరే కదా. మరి జగదంబ సరస్వతి మాతకు జ్ఞానము ఎక్కడ నుండి, ఎలా వచ్చింది? ఈ తల్లి కూడా పరమాత్మ శివుని ద్వారానే ఇంత జ్ఞానము ప్రాప్తి చేసుకొని ఉంటారు. అందుకే ఆమె జ్ఞానజ్ఞానేశ్వరి లేక జ్ఞాన దేవి అని పిలువబడింది. సృష్టి చక్రములో ఘోర కలియుగములోని పతిత సృష్టి అంతమయ్యే సమయము ఆసన్నమైనప్పుడు(పాప భాండము నిండినప్పుడు) గీతా భగవానుడైన నిరాకార పరమాత్మ శివుడు మనుష్యులను పతితుల నుండి పావనంగా చేసి నూతన సత్యయుగీ సృష్టిని పున: స్థాపన చేసేందుకు ప్రజాపిత బ్రహ్మ సాకార రథములో(భాగీరథము అనగా భాగ్యశాలీ శరీర రూపములో ఉన్న రథములో) ప్రవేశించి అవతరిస్తారు. పరమాత్మ బ్రహ్మ ద్వారా నూతన సృష్టిని స్థాపన చేశారని కూడా అందరూ అంగీకరిస్తారు. బ్రహ్మ నోటి ద్వారా సన్ముఖంలో సత్యమైన ఈశ్వరీయ జ్ఞానమనే గీతను విని ధారణ చేసి వికారాలతో యుద్ధము చేసే బ్రహ్మ ముఖవంశావళి సత్యమైన బ్రాహ్మణుల (బ్రహ్మాకుమార - కుమారీల) అహింసక శివశక్తి సైన్యానికి సేనానిగా తల్లి సరస్వతియే అవుతుంది. జ్ఞానసాగరులు అమరనాథుడైన పరమాత్మ శివుని జ్ఞానాన్ని బుద్ధి రూపి కలశములో ధారణ చేసి సరస్వతి మాత ఇతర బ్రహ్మాకుమార-కుమారీల సహితంగా చైతన్య జ్ఞానగంగ అయ్యి మనుష్యాత్మలను ఆ జ్ఞానమృతము ద్వారా పతితుల నుండి పావనంగా చేసే అలౌకిక సేవ చేస్తుంది. ఈ ఆత్మిక సేవ ద్వారానే ఈ కలియుగీ భ్రష్టాచార సృష్టి, ముళ్ల అడవి నుండి పరివర్తనై సత్యయుగీ శ్రేష్ఠాచార దైవీ పుష్పాల ఉద్యానవనంగా తయారవుతుంది. ఈ అలౌకిక కర్తవ్యము స్మృతి చిహ్నంగానే భారతదేశములోని నదులకు గంగ, యమున, గోదావరి, కృష్ణా. కావేరి బ్రహ్మపుత్ర ఇత్యాది పేర్లు ఉంచారు. సరస్వతి నది గుప్తమైనది అనగా ప్రజాపిత బ్రహ్మా శివవంశీ బ్రహ్మాకుమారీ సరస్వతి ఈశ్వరీయ జ్ఞాన-యోగాల బలము ద్వారా నూతన సత్యయుగ ప్రపంచము(నూతన జగత్తు)ను పున: స్థాపన చేస్తారు. అందుకే వారిని జగత్తుకు అలౌకిక తండ్రి



- తల్లి(జగజ్జనని జగదంబ) అని పిలువబడ్డారు. వారి ఈ అలౌకిక కర్తవ్యము కలియుగాంతము మరియు సత్యయుగ ఆదిలో అనగా సంధి కాలము లేక సంగమ సమయములో నడుస్తుంది. అందుకే సరస్వతిని "సంగమము" లో చూపిస్తారు. కాని ఈనాడు అలహాబాదులో నీటి నదుల సంగమాన్నే సత్యమైనదిగా భావించబడ్తోంది. వాస్తవానికి ఈ సంగమ యుగము భక్తిమార్గములోని స్మృతిచిహ్నము మాత్రమే నూతన సృష్టి యొక్క ఆది సమయములో కర్తవ్యము చేసినందున జగదంబను 'ఆదిదేవి' అని కూడా అంటారు.

## నవరాత్రి - రాత్రి పూట జాగరణ



పరమాత్మ శివుని ఆదేశానుసారవుం కలియుగీ పతిత ప్రపంచము నుండి మనుష్య ఆత్మలను దూరము చేసి సత్యయుగీ వైకుంఠ ధామములో భవిష్య 21 జన్మలకు జీవన్ముక్తిని, దైవీ పదవిని ప్రాప్తి చేయించు జగదంబ మరియు ఇతర శివశక్తుల ఈశ్వరీయ సేవా కర్తవ్యము చాలా శ్రేష్ఠమైనది. అందుకే కలియుగీ అజ్ఞాన అంధకారమనే రాత్రిని నశింపజేసేందుకు శివుడు అవతరించిన స్మృతిలో జరుపుకొను శివరాత్రి పండుగతో పాటు ఈ శివశక్తుల స్మృతి-చిహ్న పండుగ అయిన నవరాత్రి పండుగ కూడా సంవత్సరములో రెండుసార్లు జరుపబడ్తుంది. భక్తులు రాత్రి జాగరణ చేయడం కూడా ఈ దేవీల ద్వారా కలియుగమనే అంతిమ రాత్రిలో ఉన్న మనుష్యులకు జ్ఞానము వినిపించి ఘోరమైన అజ్ఞాన కుంభకర్ణుని గాఢనిద్ర నుండి మేల్కొలుపు కర్తవ్యానికి జ్ఞాపక చిహ్నము. దేశమంతటా అలౌకిక తల్లి అయిన జగదంబ మందిరాలు **దుర్గ, అంబ, కాళికా, సరస్వతి** మొదలైన విభిన్నమైన పేర్లతో ఉన్నాయి. కాని ఈనాటి భక్తులకు ఈ దేవీల గురించి గాని, వారికి సంబంధించిన పండుగల మహత్వము గాని, ఏ మాత్రము తెలియదు. సత్యయుగములో శ్రీ రాధ, శ్రీ లక్ష్మి, త్రేతా యుగములోని సీత మొదలైన



రాజరాజేశ్వరి దేవతలకు గాయనము, పూజలు కూడా చాలా ఎక్కువగా జరుగుతాయి. కాని **దుర్గ, అంబ, కాళి, సరస్వతి** మొదలైన 'సంగమ యుగములోని జ్ఞానజ్ఞానేశ్వరి' దేవీలకు అనేక రకాల మేళాలు (జాతరలు, తిరునాళ్ళు) భక్తుల గుంపులు ఉంటాయి. అవి రాజరాజేశ్వరి దేవతలకు ఉండవు. సంగమ యుగములో పరమాత్మ శివుని నుండి జ్ఞానామృతాన్ని ధారణ చేసుకొని ఆ జ్ఞానాన్ని ఇతర ఆత్మలకు వితరణ చేసిన ఫలితంగానే ఈ శక్తులు భవిష్య సత్య, త్రేతా యుగాలలో 'రాజరాజేశ్వరి'గా అవుతారు. భక్తులు రాజరాజేశ్వరి అయిన శ్రీ లక్ష్మితో 'ధనము' మాత్రమే కోరుకోవడం మీరు గమనిస్తారు. కాని 'జగదంబ' తో అయితే వారు ధనము ఆయువు, భాగ్యము, సంతానము మొదలైనవన్నీ వేడుకుంటూ ఉంటారు. వాస్తవానికి అంబ మాతయే సంపూర్ణ సుఖ-శాంతుల సాధనాలను స్థిరంగా ప్రాప్తి చేయించే 'కామధేనువు.' కాని కేవలం వారి జడచిత్రాల ముందు గాయనము చేసి పూజలు జరిపినంత మాత్రాన ఈ ప్రాప్తులు లభించవు. సంగమ యుగములో వారి నుండి పరమాత్మ శివుని జ్ఞానము విని ధారణ చేయడం ద్వారా మాత్రమే లభిస్తాయి. అందుకే 'ఈశ్వరీయ జ్ఞానము లేకుండా గతి(ముక్తి) లేదు' అని అంటారు. సరస్వతి తల్లి జ్ఞానదేవి కదా. ఈనాటి మనుష్యులకు 'సంగమ యుగములోని జ్ఞానజ్ఞానేశ్వరీలు' మరియు సత్య-త్రేతాయుగాలలోని రాజరాజేశ్వరి దేవీల కర్తవ్య-కాలాలలో గల భిన్నత్వము గురించిన జ్ఞానము కొద్దిగా కూడా లేదు.


భక్త జనులు పరమాత్మ అయిన శివుడిని ఎలాగైతే అమరనాథుడు, సోమనాథుడు, విశ్వనాథుడు ఇత్యాది అనేక కర్తవ్యవాచక నామాలతో ఎలా స్మృతి చేస్తారో, అలాగే వారు జగత్‌జనని అయిన తల్లిని కూడా అంబ, దుర్గ, కాళికా, శీతల, సరస్వతి మొదలైన అనేక పేర్లతో పిలుస్తారు. ఆ తల్లిని దుర్గ అని ఎందుకన్నారంటే వారు తమ మనసా, వాచా, కర్మలలో మాయ తన ముందుకు వచ్చేందుకు ధైర్యము కూడా చేయనంత గట్టిగా ఒక దుర్గము అనగా కోట వలె చేసుకున్నారు. ఆసురీ మనుష్యులు వారి ముందుకు పోతూనే సిగ్గుపడి తక్షణమే నతమస్తకులు అనగా తల వంచుకునేవారు

అబలలకు బలమును ఇచ్చే పరమాత్మ శివునితో యోగయుక్తముగా ఉండి వారు సింహశక్తి రూపాన్ని ధారణ చేశారు. అందుకే వారిని సింహవాహినిగా చూపుతారు. తల్లికి కాళికా రూపము లేక భయంకర రూపమును ఎందుకు ఇచ్చారంటే వారు ఆసురీ వృత్తి గల మనుష్యుల నుండి వారి వికారాలను బలి తీసుకున్నారు. కాని భక్తుల బుద్ధిని చూస్తే ఆశ్చర్యము కలుగుతుంది! వారు తమలోని వికారాలను బలి ఇచ్చేందుకు బదులు నోరు లేని మేకలను హింసాత్మక బలి గావించి అహింసకు సాక్షాత్‌మూర్తి అయిన తల్లిని ప్రసన్నము చేసేందుకు వ్యర్థ పనులు చేస్తారు. హింస చేయడం పాపము కదా.

తల్లి అయిన సరస్వతి పరమాత్మ శివుని జ్ఞానాన్ని వినిపించి ఆత్మలకు సుఖాన్ని, శీతలతను ఇచ్చారు. అందువలన వారిని శీతలా సరస్వతి అని కూడా అంటారు. వర్తమాన సమయము అతి ధర్మగ్లాని సమయము. దేవీ-దేవతల కాలము మరియు కర్తవ్యాలను గురించిన సత్యమైన జ్ఞానము చాలా కాలము నుండి లుప్తమైపోయింది. వారి గురించి అనేక భ్రాంతులు వ్యాపించి ఉన్నాయి. చాలా పుస్తకాలైతే వారి పై అసత్య కళంకాలు ఆపాదించి భారతదేశపు ప్రాచీన స్వర్ణిమ సభ్యతా నావను ముంచేశారు. సరస్వతి గారు బ్రహ్మ పుత్రిక వాస్తవానికి ఆమె వారికి 'ధర్మపుత్రిక(దత్తు పుత్రిక)'. సరస్వతి గారు జ్ఞానాన్ని దివ్యగుణాలను ధారణ చేసినందున తండ్రి అయిన బ్రహ్మ అతిప్రసన్నమై ఆమె యోగ్యతానుసారము బ్రహ్మ జ్ఞానయజ్ఞాన్ని సంభాళించేందుకు ఆమెను 'యజ్ఞమాతగా' నియమించారు. నూతన సృష్టి స్థాపన లేక నవనిర్మాణము బ్రహ్మ - సరస్వతుల ద్వారానే జరుగుతుంది. ఈ సంబంధము ద్వారా వారు ఈ సృష్టి నాటక రంగము పైకి ఆ తర్వాత వచ్చు మనుష్యాత్మలందరికీ పూర్వజులుగా అవుతారు. అందుకే క్రైస్తవులు, ముసల్మానులు మొదలైన ధర్మాలకు చెందినవారు కూడా వారిని ఆడమ్, ఈవ్(Adam and Eve) అని, ఆదమ్, బీబీ(హవ్వా) మొదలైన పేర్లతో సృష్టి ప్రారంభమయ్యిందని అంగీకరిస్తారు. కాని వారికి వీరి కాలము, కర్తవ్యాల గురించి కొద్దిగా కూడా తెలియదు. భారతవాసులే ఈ అలౌకిక మాతా -



పితల గురించి మరచిపోయినప్పుడు వారి తర్వాత వచ్చే ధర్మాల వారిని ఎలా దోషిగా చేస్తాము? ఇప్పుడు ఈ సృష్టిచక్రములో మళ్ళీ కలియుగము అంతమయ్యే సమయము వచ్చేస్తుంది. ఈ కలియుగ వినాశనము కొరకు పరమాణు శస్త్రాలు(అణ్వాయుధాలు) మొదలైనవి కూడా తయారవుతున్నాయి. పరమాత్మ శివుడు కూడా ప్రజాపిత బ్రహ్మ ద్వారా నూతన సృష్టిని స్థాపించేందుకు భారతదేశములో తమ రుద్ర గీతా జ్ఞాన యజ్ఞాన్ని 5 వేల సంవత్సరాల క్రితము వలె రచించారు. ఈ యజ్ఞానికి మరో పేరు "ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము". బ్రహ్మకుమారి సరస్వతిగారు పరమాత్మ స్థాపించిన ఈ యజ్ఞానికి 'యజ్ఞమాత'గా అయ్యి జగదంబ కర్తవ్యాలను నిభాయించి గుప్తమైపోయారు (అందుకే సరస్వతి గుప్తముగా ఉన్నారు! అని అంటారు) (గుప్తమైనది). బ్రహ్మకుమారీ - బ్రహ్మకుమారులైన మనమందరము ఆ అలౌకిక తల్లిగారి ముఖవంశావళి జ్ఞాన సంతానమే.



## శ్వేత వస్త్రధారిణి, శ్వేత చందనధారిణి


## శ్వేత – శ్వేతేశ్వరి – సరస్వతి మాత

పాట్నాలోని బ్రహ్మాకుమార్ భగవతీ ప్రసాద్‌గారు అంటున్నారు - జగదంబ శ్రీ సరస్వతి మహిమను భక్తులు ఇలా గాయనము చేశారు -

**యాకుందేందు తుషార హార ధవళా, యా శుభ్ర వస్త్రావృతా.**

**యా వీణా వర దండ మండితకరా, యా శ్వేత పద్మాసనా.**

శ్రీ సరస్వతి కుంద(తామరపువ్వు), ఇందు(చంద్రుడు) మరియు తుషార(మంచు) వంటి తెల్లనిది, ఆమె శ్వేత(తెలుపు) వస్త్రాలను ధరించింది. శ్వేత పద్మము పై కూర్చొని ఉంది.



జ్ఞానదేవి వస్తువులన్నీ శ్వేతముగానే కల్పన చేయబడినవి. దీని ఆధ్యాత్మిక రహస్యమేమి? దీని అర్థమేమైనా సామాన్య తెలుపు రంగా? వాస్తవానికి తెలుపు అనేది ఒక రంగే కాదు. తెలుపు రంగు సప్త రంగుల మిశ్రమము. సూర్యకిరణాలు ఒక గాజు పట్టకము(Prism) ద్వారా ప్రయాణిస్తే ఏడు రంగులుగా విభజింపబడ్తుతుంది. చర్మ చక్షువుల ద్వారా కనిపించేవి, ముఖ్యంగా ఈ ఏడు రంగులే. ఏ విధంగా అన్ని రంగులు కలిసి తెలుపుగా అవుతుందో, అదే విధంగా సర్వగుణాలతో సంపన్న వ్యక్తిని శ్వేతమని అంటారు. ఎరుపు, పసుపు మొదలైన రంగులు ఒక్కొక్క గుణానికి ప్రతీక. జ్ఞానదేవి శ్రీ సరస్వతి సర్వగుణ సంపన్నంగా ఉండేవారు అందువలన సంపూర్ణ శ్వేత రూపములో వారిని కల్పన చేస్తారు. మనము ఏ వస్తువులను త్యాగము చేస్తామో, దేనిని త్యాగము చేస్తామో దానిలా అవుతాము. ఎవరైతే ధనాన్ని త్యాగము చేస్తారో,



వారే సత్యమైన ధనికులు. ఎవరు యశస్సును త్యాగము చేస్తారో, వారే సత్యమైన కీర్తివంతులు(యశస్వీలు) జీవితాన్ని త్యాగము చేసినవారే సత్యంగా జీవించువారు. జీవితానికి అర్థమే జీవ + న. ఎవరైతే జీవించి ఉండే మృత్యువును వరిస్తారో(ఎన్నుకుంటారో), వారే సత్యమైన ప్రశంసనీయులు, వారిదే సత్యమైన జీవితము. ఈ కథనము కేవలం ఊహాగనం మాత్రమే కాదు. ప్రకృతి పదార్థాలు కూడా దీనినే ఋజువు చేస్తాయి. వస్తువులు ఎరుపుగా, పసుపుగా లేక ఇతర రంగులలో ఎందుకు కనిపిస్తాయో మీకు తెలుసా? సూర్యుని సప్తరంగుల కిరణాల నుండి వస్తువులు ఏ రంగును త్యాగము చేస్తాయో(ప్రకీర్ణ క్రియ) ఆ రంగులోనే కనిపిస్తాయి. ఎరుపు రంగు వస్తువులు, ఏడు రంగుల నుండి మిగిలిన ఆరు రంగులను స్వీకరిస్తాయి. ఎరుపు రంగును త్యాగము చేస్తాయి. ఆ రంగును వాపసు పంపుతాయి. అందువలన ఆ వస్తువులు ఎర్రగా కనిపిస్తాయి. ఇదే మాట పసుపు లేక ఏ రంగు వస్తువుకైనా వర్తిస్తుంది ఏ వస్తువులైతే ఏ రంగునూ త్యాగము చేయక అన్ని రంగులను పీల్చుకుంటుందో, ఆ వస్తువులు నల్లగా కనిపిస్తాయి. ఇందుకు విరుద్ధంగా ఏ వస్తువువైతే అన్ని రంగులను త్యాగము చేస్తుందో, అది తెల్లగా కనిపిస్తుంది. అనగా శ్వేత రంగు అన్నింటిని త్యాగము చేసినందుకు గుర్తు. ఎవరైతే కొంచెం కూడా త్యాగము చేయరో, ఆ మానవుని హృదయము నల్లగా ఉంటుంది. ఎవరైతే సర్వస్వము త్యాగము చేస్తారో, వారి హృదయము తెల్లగా ఉంటుంది. జ్ఞానమూర్తి, గుణమూర్తి, యోగమూర్తి అయిన జగదంబ శ్రీ సరస్వతి గారు సర్వస్వ త్యాగి అందుకే వారిని పూర్తిగా శ్వేత రంగులో చూపిస్తారు.

మానవుడు తమ భావాలకు అనురూప రంగులను ఇష్టపడ్తాడు. అచేతన స్థితిలో(స్పృహ లేని స్థితి) మన స్వభావ సంస్కారాలకు అనురూపమైన రంగునే మనము ఇష్టపడ్తాము. నిష్కపట హృదయము కలిగిన వ్యక్తి స్వాభావికంగా శ్వేత రంగును ఇష్టపడ్తాడు. ఎందుకంటే తెలుపు నిష్కపటముగా ఉంటుంది. అది మురికిని తనలో దాచి పెట్టుకోక స్వయం

తానే ప్రకటితము చేస్తుంది. దాని వలన అది శుభ్రమవుతుంది. శ్వేత వస్త్రము వలె శ్వేత హృదయము కూడా మురికిని దాచి పెట్టుకోదు. మీదు మిక్కిలి ప్రకటము చేస్తుంది. అందువలన అది ఇంకా శుభ్రపడిపోతుంది. అంతేకాక సదా స్వచ్ఛంగా ఉండగలదు. సమాన సంస్కారమైనందున శ్వేత వస్త్రములో శ్వేత హృదయములో తాదాత్మ్యము(ఐక్యము) స్థాపితమవుతుంది. సప్తరంగులను జోడింపజేసి నల్ల వస్త్రము మురికిని కూడా తనలో దాచుకుంటుంది. కనుక విమల హృదయము ఎప్పుడూ దీనికి ఇష్టపడదు. ఇతర రంగుల వస్త్రాలు కూడా మురికిని తమలో ఇముడ్చుకుంటాయి కనుక పావనమైన శ్రీ సరస్వతిగారు సదా శ్వేత వస్త్రధారిణి. ఆమెనే కాదు, తన వాహనమైన హంస కూడా కాలిగోటి నుండి తల వరకు అనగా సంపూర్ణంగా శ్వేత వర్ణమే. అందుకే బ్రహ్మ సరస్వతి మరియు ఫరిస్తాలను సదా శ్వేత వస్త్రాలలోనే చూపిస్తారు. అనగా మాతేశ్వరి జగదంబ సరస్వతి సర్వస్వ త్యాగిగా, సర్వగుణ సంపన్నంగా ఉండేది. పవిత్రతా దేవిగా ఉండేవారు.

# సరస్వతి గారి జన్మ మరియు వారి మహిమల ఆధ్యాత్మిక రహస్యము

*సోదరుడు జగదీష్‌గారు తల్లి సరస్వతి గారి అలౌకిక జన్మ, కర్మల ఆధ్యాత్మిక రహస్యాన్ని తెలుపుతూ వ్రాస్తున్నారు -

శ్రీమద్భగవద్గీతలో పరమపిత పరమాత్మ ప్రజాపిత బ్రహ్మ మాధ్యమముతో యజ్ఞము ద్వారా సృష్టిని రచించారని చెప్పబడింది. అనేక ప్రకారాల యజ్ఞాల గురించి ఉల్లేఖిస్తూ అన్ని యజ్ఞాల కంటే జ్ఞాన యజ్ఞము శ్రేష్ఠమయిందని తెలుపబడింది. నిస్సందేహంగా శ్రేష్ఠమైన అనగా సత్యయుగీ దైవీ సృష్టిని రచించేందుకై పరమాత్మ జ్ఞాన యజ్ఞమునే స్థాపన చేసి ఉంటారు. ఇదే మాటను - పరమాత్మ, ఈశ్వరీయ విశ్వ విద్యాలయాన్ని స్థాపన చేశాడని కూడా చెప్పవచ్చు. అయితే "జ్ఞాన" శబ్ధముతో పాటు "యజ్ఞ" అను శబ్ధమును ఎందుకు జోడించారంటే ఈశ్వరీయ జ్ఞానాన్ని వినే మానవులు కామము, క్రోధము, లోభము, మోహము, అహంకారాలనే కాక వారి తనువు, మనస్సు, ధనము మొదలైన వాటిని కూడా జ్ఞాన యజ్ఞములో ఆహుతి చేస్తారు. ఒకవేళ ఆహుతి ఇవ్వకపోతే దానికి యజ్ఞమనే పేరు ఇవ్వలేరు. ఏదో ఒక దానిని తప్పకుండా ఆహుతి ఇవ్వబడేదే యజ్ఞము. అందువలన "జ్ఞాన యజ్ఞము" అను శబ్ధము విశ్వవిద్యాలయము అనే శబ్ధము కంటే అధిక మహత్వపూర్ణమైనది.

## సరస్వతి గారి జన్మ

మహాభారతములో వర్ణించిన ద్రౌపది జన్మ కూడా యజ్ఞము ద్వారా జరిగినట్లు చెప్తారు. అందువలన ద్రౌపదిని "యజ్ఞ సైని" అని కూడా అంటారు. అదే విధంగా విద్యాదేవి సరస్వతి జన్మ కూడా యజ్ఞము ద్వారానే జరిగిందని అంటారు. ఆలోచించవలసిన విషయమేమంటే అగ్ని గుండము


* భ్రాతా జగదీశ చంద్రగారు బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయము యొక్క ముఖ్య ప్రవక్త, సాహిత్య కారులు. ఈశ్వరీయ సాహిత్యాన్ని వ్రాసిన లేఖకుడు. వారు 200 కంటే ఎక్కువ హింది, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో పుస్తకాలు వ్రాశారు. వారు 12-05-2001 తేదీన తన పార్థివ శరీరాన్ని త్యాగము చేశారు.

నుండి ఏ మానవ దేహము జన్మించజాలదు. ఎందుకంటే అగ్ని శరీరాన్ని కాల్చేస్తుంది. కాని జ్ఞానమనే అగ్ని శరీరాన్ని భస్మము చేసేది కాదు. ఈ జ్ఞాన అగ్ని ద్వారా శరీర సంబంధమైన లౌకిక జన్మ జరగదు. కాని దీని వలన సంస్కార-స్వభావాలు పవిత్రమైపోతాయి. అంతేకాక వాటి శుద్ధీకరణ ద్వారా నూతన మానవ జీవితము ప్రారంభమైపోతుంది. దీనిని మరజీవ జన్మ అని అంటారు లేక అలౌకిక జన్మ అని మరో జన్మ అని కూడా అంటారు. బ్రాహ్మణులను కూడా ద్విజులని(ద్విజుడు అనగా రెండవ జన్మ తీసుకొనువారు) ఎందుకంటారంటే జ్ఞానము ద్వారా రెండవ జన్మ జరుగుతుంది. ఇదే విధంగా జగదంబ సరస్వతి జన్మ కూడా జరిగింది. దీని భావము ఏమంటే పరమాత్మ ప్రజాపిత బ్రహ్మ ద్వారా జ్ఞాన యజ్ఞాన్ని స్థాపన చేశారు. అప్పుడు ఈ జ్ఞాన యజ్ఞము ద్వారా సరస్వతికి నూతన జన్మ లభించింది. శారీరిక రూపంలో అయితే వారు మొదటనే ఉన్నారు. కాని జ్ఞానము ద్వారా వారి మనసు, మాటలు, కర్మలు నిర్మలంగా అనగా కమలపుష్ప సమానంగా అయ్యాయి. అందువలన చిత్రకారుడు వారిని కమలపుష్పము పై ఆసీనులైనట్లు చూపిస్తారు. కాని ఈ రోజు ఏ విద్వాంసుడూ జ్ఞానదేవి సరస్వతి జన్మ ఎలా జరిగిందో, ప్రజాపిత బ్రహ్మతో వారికి ఏ సంబంధమో తెలుపలేరు. జ్ఞాన యజ్ఞాన్ని రచించు బ్రహ్మనే యజ్ఞపిత అని అంటారు. ఈ యజ్ఞము ద్వారా ఎవరైతే నూతన జీవితాన్ని తయారు చేసుకున్నారో, వారిని బ్రహ్మకుమారీ-బ్రహ్మకుమారులు అని అంటారు. ఈ దృష్టికోణముతో సరస్వతి కూడా బ్రహ్మ పుత్రిక బ్రహ్మకుమారియే.

## మనస్సు - బుద్ధి ఇత్యాదులను బలి ఇచ్చినందున కాళి

జ్ఞాన యజ్ఞములో బ్రహ్మకుమార, బ్రహ్మకుమారీలు వికారాలను ఆహుతి చేశారు. అంతేకాక యథాశక్తి వారి తనువు-మనస్సు-ధనములను అర్పణ చేశారు. దాని ద్వారానే యజ్ఞము నడిచింది. ఇతర బ్రహ్మకుమార బ్రహ్మకుమారీలు కూడా ప్రకటితమయ్యారు. అప్పటి నుండి నూతన





కరాచీ - 'రాధే భవనము' లో మమ్మా జతలో దాదీ నిర్మల్ శాంతగారు
(ఫోటో - 1938)

బ్రహ్మకుమార-కుమారీలు కూడా తమవన్నీ ఆహుతి చేస్తూ వచ్చారు. తనువును, ధనమును ఆహుతి చేయడం సులభమే కాని మనసును ఆహుతి చేయడం ఎక్కువ కఠినంగా ఉంటుంది. ఎందుకంటే మనసు చంచలమైనది. సరస్వతిగారు తమ మనసును కూడా సంపూర్ణంగా ఆహుతి చేసేశారు. వారు తమ సర్వస్వాన్ని ప్రభువుకు సమర్పణ చేశారు. మనస్సు-బుద్ధి పరమాత్మకు సంపూర్ణంగా సమర్పితం చేసేశారు. ఈ రెండిటిని బలి చేసినందున ఆమెను కాళి అని అన్నారు. ఈ పురుషార్థములో వారు బ్రహ్మ సంతానములో అద్వితీయులు, అగ్రగణ్యులు. దీని వలన ఆమె మనసు-బుద్ధి యొక్క సంబంధము పూర్తిగా పరమపిత పరమాత్మతో జోడింపబడింది. వారి బుద్ధి పరమాత్మ బుద్ధితో సమానమైపోయింది. దీని ఫలస్వరూపముగా వారు తమ పరిపక్వ అనుభవాల ద్వారా యజ్ఞవత్సలందరికీ తల్లి వలె జ్ఞాన పాలన ఇచ్చారు. అందుకే వారు యజ్ఞమాత అని పిలువబడ్డారు. నర-నారీలందరి పట్ల వారి హృదయము

వాత్సల్యభరితంగా ఉండేది. అందుకే ఆమెను జగదంబ అని అన్నారు. లేకుంటే స్థూల రూపములో ఎవ్వరూ మొత్తము ప్రపంచానికంతా అంబగా (తల్లిగా) అవ్వలేరు.

ఓంధ్వని చేసే ఓంరాధ జ్ఞాన-వీణా-నాధము

చేయు సరస్వతి, జ్ఞాన లాలి పాటను వినిపించే

మాత జగదంబ

సరస్వతి అని పేరు పెట్టుటకు ముందు ఆమె పేరు రాధ. ఓం మండలి పేరుతో జ్ఞాన యజ్ఞము ప్రారంభమైనప్పుడు ఆమె అక్కడ ఓం ధ్వని చేసేవారు. దేహము నుండి భిన్నమైవారు ఈశ్వరీయ స్మృతిలో ఎలా మగ్నమైపోయేవారంటే వారి ఆత్మీయత నిండిన కంఠము వినేవారు. దేహము నుండి భిన్నమై ఈశ్వరీయ ప్రేమలో భావ విభోరమైపోయేవారు. వారిలో కొంతమందికి దివ్యదృష్టి ప్రాప్తించేది. అటువంటివారికి శ్రీకృష్ణుని సాక్షాత్కారము కూడా అయ్యేది. అప్పుడు ఆమెను జనులు కేవలం రాధ అని కాక ఓం రాధ అని పిలిచేవారు. ఆ రోజులలో ఎప్పుడైనా బ్రహ్మాబాబా ఇతర నగరాలకు వెళ్తే అక్కడ నుండి వారు జ్ఞానపత్రము వ్రాసి ఓంరాధ వద్దకు పంపేవారు. అప్పుడు వారు ఆ పత్రాలనే చదివి జ్ఞానము వినిపించేవారు. వాటిని గురించి విస్తృతంగా వాఖ్యానించేవారు. వినేవారికి వారు జ్ఞానజోల పాటలను పాడినట్లుండేది లేక జ్ఞాన-గీతాన్ని వినిపిస్తున్నట్లుండేది. వారందరూ ఆమెను "మాత" అను శబ్ధముతో సంబోధన చేయనారంభించారు లేక ఆమెను మమ్మా అని పిలవడం ఆరంభించారు.





సతీ దాదీ(దాదీగారి పెద్ద అక్కయ్య), గంగే దాదీ, కుంజ్ దాదీ, ప్రకాశ్‌మణీ దాదీ, దాదీ మనోహర్ ఇంద్రా. వెనుక కూర్చున్నవారు మోహినీ అక్కయ్య, ఆత్మ మోహినీ అక్కయ్య, శీతల్ మణీ దాదీగారు

హంగామా (గలాటా) – యోగ తపస్సుల ద్వారా

మాతేశ్వరి దానిని ఎదుర్కోవడం

శ్రోతలందరూ మమ్మా ద్వారా వినిపించబడిన జ్ఞానము వలన ఎంత ప్రభావితులయ్యేవారంటే ఆమె మధురవాణిని విన్నవారు ఎర్రగడ్డ(నీరుల్లి), తెల్లగడ్డ(వెల్లుల్లి) మాంసము, చేపలు, గుడ్లు సారాయి సిగరెట్లు, బీడి ఇత్యాదులన్నీ వదిలేశారు, దీని వలన ఆ సమయములో సింధ్‌లో చాలా ఆందోళనలు జరిగాయి. అవి ఎంతవరకు పోయాయంటే ఒకసారి జనులు పికెటింగ్(లోపలకు పోనివ్వకుండా చుట్టుముట్టుట) కూడా చేశారు. కాని మాతేశ్వరి సరస్వతిగారు పిల్లలందరినీ ఎలా శాసించారంటే పికెటింగ్ చేయువారు కూడా ప్రభావితులై వారి ధర్నాను

మాని వెళ్ళిపోయారు. కొంతమంది విరోధ తత్వం కలిగినవారు కోర్టులో అభియోగము(కేసు) వేశారు. కాని అక్కడ కూడా మాతేశ్వరిగారు నిర్భయత, నిశ్చింతత, నిస్వార్థ నిర్మల స్థితి ద్వారా అన్నింటిని ఎదుర్కొన్నారు. అంత చిన్న వయస్సులో ఇంతటి విషమ పరిస్థితులు ఎదుర్కొన్నవారు ప్రపంచ చరిత్రలోనే ఉండరు.

పరమపిత పరమాత్మ ద్వారా ఇవ్వబడిన జ్ఞానములో అనేకానేక నవీనతలున్న కారణంగా అనేక చోట్ల స్వార్థ తత్వాలు, వాటిని ఘోరంగా విరోధించినా, మాతేశ్వరి సరస్వతి సదా నిశ్చింతతతో నిర్భయంగా, నమ్రచిత్తంతో ఉండినారు. ఏ విరోధి వారిని చూచినా లేక వారితో కొద్ది సమయము మాట్లాడినా, వారు మాతేశ్వరిని ప్రశంసిస్తూ ఉండేపోయేవారు. ఈ ప్రకారంగా మాతేశ్వరీగారి స్థితి ప్రాపంచిక ఆకర్షణల నుండి ఉన్నతంగా శివపరమాత్మ ఆకర్షణా క్షేత్రములో ఉండేది. భలే వారి తనువు ఈ ప్రపంచములో ఉండేది. కాని బుద్ధి శివతండ్రితోనే జోడించబడి ఉండేది. అందుకే వారి వ్యక్తిత్వము చాలా ప్రభావశాలిగా, ఆత్మిక ఆకర్షణతో నిండి ఉండేది. వారి వాణిలో మధురత ఉండేది అంతేకాక వారి పలుకులు మనసును శాంతపరిచేవిగా, మనసులో శక్తిని ప్రసరింపజేసేవిగా ఉండేవి.

## సదా నిర్భయము మరియు నిశ్చింతత

మాతేశ్వరీగారి తపోబలము ఉన్నత స్థాయిలో విశుద్ధంగా ఉండేది. ఎప్పుడైనా వారి వద్దకు వెళ్ళే వారు శక్తిశాలి యోగ స్థితిలో స్థితమై పవిత్రత మరియు దివ్యతల కిరణాలను వికిరణము(వ్యాపింప) చేస్తూ ఉన్నట్లు అనుభవమయ్యేది. వారి కనులు స్థిరంగా ఉండేవి. ముఖములో చిరునవ్వు, ముఖమండలములో దివ్య ప్రకాశము కనిపిస్తూ ఉండేది. వారు కేవలం జనులకు జ్ఞానము ద్వారా సేవ చేయడమే కాక తమ తపోబలము మరియు స్థితి ద్వారా ఆత్మలలో బలము నింపేవారు. తమ శీతలత ద్వారా ఆత్మలను శీతలంగా చేసేవారు. వారి జీవితములో భయము కలిగించే ఘటనలు భయంకర రూపములో అనేకము జరిగాయి. కాని వారు ఈ వెరైటీ ప్రపంచ



నాటకము(Variety World Drama)లో స్థిరమైన నిశ్చయము కలిగి ఉండే కారణంగా సదా నిశ్చింతగా ఉండేవారు వారికి అనుభవము లేని లేక చాలా కఠినమైన కార్యాలను బాబా వారికి అప్పగించినప్పుడు కూడా "నేను ఈ పని ఎలా చేసేది నాకు అలవాటు లేదు" అని ఎప్పుడూ చెప్పేవారు కాదు. ఎల్లప్పుడూ "సరే బాబా"(జీ బాబా) అంటూ బాధ్యతను స్వీకరించి దానిని సంపన్నము చేసి చూపించారు.

# మాతేశ్వరి గారి లౌకిక జీవన
# పరిచయము

మమ్మాగారి లౌకిక నామధేయము రాధ. వారి తండ్రి పేరు పోకర్ దాసు. తల్లి పేరు రోచా. వారి జన్మ 1919వ సంవత్సరములో అమృత్‌సర్‌లో జరిగింది. వారికి పార్వతి అనే సోదరి(అక్క) ఉండేది. ఆమె వివాహము ముందే జరిగిపోయింది. వీరి చిన్న చెల్లెలు పేరు గోపి. వారి తండ్రి బంగారు, - వెండి వ్యాపారము చేసేవారు. అంతేకాక స్వచ్ఛమైన దేశి నేతి టోకు (హోల్ సేల్) వ్యాపారము కూడా చేసేవారు. వారి వ్యాపారము బొంబాయి, మద్రాసు, సిలోన్(శ్రీలంక)లో ఉండేది. రాధ తండ్రి అకస్మాత్తుగా మరణించారు. బంగారు, వెండి చట్టా వ్యాపారములో అపార నష్టము సంభవించి వారు పూర్తిగా దివాలా తీశారు(చేతులు ఖాళీ అయిపోయాయి). అందువలన వారు గుండెపోటుతో మరణించారు. అప్పుడు తన తల్లి చెల్లెలు గోపితో పాటు రాధ సింధ్ హైదరాబాదు (ప్రస్తుతము పాకిస్తాన్‌లో ఉంది)లో ఉన్న అవ్వగారింటికి అనగా తన మేనమామ గారింటికి వచ్చేసింది. వారు అమృత్‌సర్ నుండే సింధ్ హైదరాబాదుకు వెళ్లి ఉండినారు.

### విద్యార్థి జీవితములో కూడా అద్వితీయ లక్షణములు

*బ్రహ్మకుమారి దాదీ శాంతామణిగారు మమ్మాగారి జీవితకథను తెలుపుతూ హైదరాబాదులో అక్కా-చెల్లెలు ఇరువురు పాఠశాలలలో చేరారు. చదువులో రాధ ఎల్లప్పుడూ నెంబరువన్‌గా ఉండేది. పాటలు పాడడంలోనూ, నృత్యము(డాన్సు) చేయడంలోనూ రాధ నెంబర్ వన్‌గా ఉండేది. పాఠశాలలో

* బ్రహ్మకుమారి దాదీ శాంతమణిగారు యజ్ఞములోని ఆదిరత్నాలలో ఒకరు. వీరి తలిదండ్రులతో సహా పూర్తి పరివారమంతా ఈశ్వరీయ విశ్వ విద్యాలయం(ఆ సమయంలో ఓంమండలి)లో సంపూర్ణ సమర్పణైపోయారు. వీరు మాతేశ్వరిగారి పిన్నమ్మ కూతురు. వీరు శాంతివనములో సేవ చేశారు. అష్టరత్నాలలో వీరు కూడా ఒకరు. 87 సంవత్సరాల వయస్సులో 15-06-2010 తేదీన దేహ బంధనాల నుండి ముక్తులై బాప్‌దాదా ఒడిలోకి చేరుకున్నారు.





అమృత్‌సర్‌లో మాతేశ్వరిగారు లౌకిక జన్మ తీసుకున్న భవనము

ఏ పోటీ జరిగినా రాధకే మొదటి బహుమతి లభించేది. "ట్వింకల్ ట్వింకల్ లిటిల్ స్టార్" అనే పాట రాధకు చాలా ఇష్టము. తెల్ల ఫ్రాకు, నెత్తిన టోపీతో(Hat) రాధ డ్యాన్సు చేస్తుంటే జనులు ఆశ్చర్యచకితులయ్యేవారు. బజారులో ఏ క్రొత్త దుస్తులు వచ్చినా, అందరికంటే ముందు కొనే అలవాటు రాధకుండేది. ఫ్యాషన్లు అంటే ఆమెకు ఎంతో ఇష్టము. బుద్ధితో తన ఫ్రాకుల డిజైను తనే చేసుకునేది. ఆ డిజైను ఆమె అక్క పార్వతికి చెప్పేది. పార్వతి తమ అత్త రూపవతితో క్రొత్త డిజైనుతో ఫ్రాకు తయారు చేయించేది. ప్రతిరోజు క్రొత్త క్రొత్త డిజైన్ గల ఫ్రాకు ధరించి స్కూలుకు వెళ్ళేది. ఆమెకు చాలా పొడవైన వెంట్రుకలుండేవి. చాలా అందంగా కూడా ఉండేది. రాధ చెల్లెలు గోపి కూడా రాధవంటి రూపము రంగు కలిగి ఉండేది, పాఠశాలకు వస్తూ, పోతున్నప్పుడు జనుల దృష్టి సహజంగా రాధ పై పడేది. వారు ఆశ్చర్యముతో అలాగే చూస్తూ ఉండిపోయేవారు. హైదరాబాదు(సింధు)లో కుందన్‌మల్ మాడల్ స్కూల్‌లో చదువుతూ ఉండేది. ఆమె మెట్రిక్ వరకు చదివింది.

## జీవన పథము(మార్గము)లో ఆశా దీపము

నా(శాంతామణిదాదీ గారి) తల్లి, మమ్మా తల్లి స్వంత అక్క చెల్లెళ్ళు. మమ్మా తల్లిగారి ఇంకొక చెల్లి అనగా మా రెండవ పిన్నమ్మ పేరు ధ్యానీ - ఆమె భర్త కూడా మరణించాడు. ఆమె కూడా హైదరాబాదులోని వారి తల్లిగారి ఇంటికి అనగా మమ్మా ఇంటికి వచ్చేసింది కావున ఆ ఇంటిలో ఇరువురు భర్తలను పోగొట్టుకున్నవారు. ముగ్గురు అక్క-చెల్లెళ్ళు తమ తండ్రిని పోగొట్టుకొని చాలా దు:ఖితులుగా ఉండేవారు. ఆ ఇరువురు మాతలు దు:ఖముతో చాలా ఏడుస్తూ భగవంతుని ప్రార్థిస్తూ ఉండేవారు. మా అమ్మ కూడా వారింటికి వెళ్లి ప్రార్థనలో వారికి సహకరించేది. అంతేకాక జప్‌సాహెబ్, సుఖమణి మొదలైన గ్రంథాలు చదివి వినిపించి వారి మనస్సును శాంతి కలిగించేందుకు దు:ఖము తగ్గించేందుకు ప్రయత్నించేది. మా తల్లిగారు ప్రతిరోజు వారింటికి వస్తూ పోతూ ఉండడం బాబా ధర్మపత్ని యశోదామాత వారి ఇంటి కిటికీ ద్వారా చూస్తూ ఉండేది. ఒక రోజు దారిలో మా అమ్మ మరియు యశోదామాత కలుసుకున్నారు. మీరు ప్రతి రోజు ఎక్కడకు వెళ్తారు? అని మా అమ్మను ఆమె అడిగింది. అప్పుడు మా ఇరువురి సోదరీల పతులు మరణించినందున నా సోదరీలు చాలా దు:ఖములో ఉన్నారు. కావున మేమందరమూ కలిసి శాంతి కొరకు సత్సంగము చేస్తున్నామని అన్నారు. అప్పుడామె దాదాగారింటిలో చాలా మంచి సత్సంగము జరుగుతుంది మొదట మీరు రండి. అనుభవము చేసి మీకు ఇష్టమైతే నచ్చితే తర్వాత వారిని కూడా తీసుకు రండి. వారి ఆహ్వానము ప్రకారము మా తల్లి మరుసటి రోజు అచ్చటకు వెళ్ళింది. బాబా గీతా గ్రంథములోని శ్లోకాన్ని వివరిస్తూ ఉండినారు. గీతలోని రెండవ అధ్యాయములో ఆత్మను గురించిన జ్ఞానమే ఉంది, ఆత్మ అమరము అవినాశి, మరణించదు. ఆత్మ పాత శరీరాన్ని వదిలి కొత్తది తీసుకుంటుంది. అందువలన ఏడ్చే అవసరము లేదు. ఇదంతా ఆత్మ ఆడే నాటకము, మొదలైన విషయాలు వివరిస్తూ ఉండినారు. బాబా సత్సంగాన్ని ప్రారంభించినప్పుడు కూడా ఓం ధ్వని



చేసేవారు. సత్సంగము పూర్తి అయినప్పుడు కూడా ఓం ధ్వని చేసేవారు. ఓం ధ్వని వింటూనే అందరికీ శరీరము నుండి భిన్నముగా అయ్యే అనుభవమవుతూ ఉండేది. ఇదే విధంగా నా తల్లికి కూడా అనుభవమైనందున మరుసటి రోజు తన ఇరువురు సోదరీలను(రాధ తల్లి, ధ్యానీ మాత) తీసుకొని బాబా వద్దకు వెళ్ళింది. బాబా ద్వారా ఆత్మ జ్ఞానము పూర్తిగా విన్న తర్వాత శరీరము నుండి భిన్నమయ్యే అనుభవము చేసిన తర్వాత దు:ఖములో ఉన్న ఆ ఇరువురు మాతలు చాలా సంతోషించారు. సత్సంగము నుండి ఇంటికి వచ్చిన తన తల్లి, పినతల్లుల వికసించిన ముఖాలను చూసి రాధకు చలా ఆశ్చర్యము కలిగి - "నిన్నటి రోజు మీరిరువురు చాలా ఏడుస్తూ ఉండినారు. కాని ఈ రోజు మీ ముఖాలు సంతోషంతో వికసించి ఉన్నాయి. అక్కడ మీకు ఏమి లభించింది?" అని వారిని అడిగింది. అప్పుడు ఆమె రాధతో - " మేము దాదా వద్దకు పోయాము, వారు గీత పై చాలా చక్కగా వివరించారు. నీవు పాఠశాలలో గీతను చదువుతూనే ఉంటావు. నీవు కూడా మాతో వచ్చి విని తర్వాత మాకు వివరించు" అని అన్నారు. రాధను కూడా మరుసటి రోజు సత్సంగానికి తీసుకొచ్చారు. రాధను చూస్తూనే ఈమె నా వారస పుత్రిక అని బాబాకు అనిపించింది. రాధకు కూడా వీరు చాలాకాలము క్రితమే విడిపోయిన మా తండ్రి అనిపించినది. ఆ తర్వాత ఎలా బాబా లౌకికములో క్షేమ సమాచారాలను అడిగేవారో అలా రాధను - "బిడ్డా! నీవు ఏమి చేస్తున్నావు, ఎలా ఉన్నావు" మొదలైన క్షేమ సమాచారాలు అడిగినారు.

## ఒక్క క్షణములోనే జీవన నిర్ణయము !

అప్పుడు రాధ వయస్సు సుమారు 17 సంవత్సరాలు. ఇంట్లో రాధకు వివాహ సంబంధ విషయాలను మాట్లాడుకునేవారు. ఒకరోజు బాబా రాధను అడిగారు - "రాధా! నీవు పీతాంబరధరుని వివాహము చేసుకుంటావా? లేక సూటు బూటు ధరించినవారినా? ఈ జ్ఞానముతో స్వయం నీ కళ్యాణము చేసుకొని విశ్వకళ్యాణము చేస్తావా? లేక పెళ్ళి చేసుకొని ఇల్లు – వాకిలి సంభాళన చేస్తావా?" బాగా ఆలోచించి

నాకు సమాధానము చెప్పు అని అన్నారు. జవాబు చెప్పేందుకు బాబా రాధకు 24 గంటల సమయము ఇచ్చారు కాని రాధ ఒక్క క్షణములోనే భవిష్య జీవిత నిర్ణయము తీసుకొని ఆ క్షణమే బాబాకు ఇలా సమాధానమిచ్చారు - "బాబా! గిరిధర గోపాలుని అప్పటి రాధను నేనే, నేను ఈ జ్ఞాన మార్గములో నడుస్తూ విశ్వకళ్యాణము చేస్తాను" ఆ రోజు నుండే బాబా రాధ పై జ్ఞాన వర్షము కురిపించడం ప్రారంభించారు. జ్ఞాన కలశము కూడా వారి పై ఉంచారు. సత్సంగములో రాధ **"ఓం"** ధ్వని చాలా బాగా చేసేది. వచ్చేవారంతా ఓం ధ్వని ద్వారా చాలా ఆకర్షితులు అయ్యేవారు. అందువలన అందరూ అమెను **"ఓంరాధ"** అని పిలవడం ప్రారంభించారు. బాబా కూడా రాధను ఓంరాధ అనే పిలవసాగారు. ఈ విధంగా రాధ పేరు **"ఓంరాధ"** గా మారిపోయింది.


ఓంరాధ చాలా బాగా పాడేవారు. ఆమె "ఓం మండలికి వచ్చి ఏమి చూచాను,ఏమి పొందాను" అనే పాటను స్వంతంగా వ్రాసి పాడినప్పుడు బాబా చాలా ప్రభావితమయ్యారు. బాబా ప్రతిరోజు ఆమెకు ఒక పాట వ్రాసి ఇచ్చేవారు. ఓం రాధ పాటను క్లాసులో పాడి వినిపించేవారు. ఆమె పాడునప్పుడు విన్నవారు చాలా సంతోషించేవారు. వారి మనస్సులో చెరగని ముద్ర పడేది. నెమ్మది నెమ్మదిగా సత్సంగము వృద్ధి చెందుతూ పోయింది. అందులో మాతలు, కన్యలు కూడా వచ్చేవారు.

## ఓంరాధ నుండి శ్రీ అనురాధ

ఈ సమయంలో ఒకసారి బాబా తన లౌకిక పరివారముతో కాశ్మీరుకు వెళ్లిన తర్వాత బాబా ప్రతి రోజు ఓంరాధ పేరుతోనూ, ఇతర సోదరీల పేర్లతోనూ ఉత్తరాలు వ్రాసి పంపేవారు. ఎవరి పేరుతో ఉత్తరము వచ్చేదో, వారు దానిని సత్సంగములో వినిపించేవారు. సత్సంగము ఇంకా వృద్ధి చెందుతూ పోయింది. ఒక రోజు ఓంరాధ చెల్లెలు గోపి క్లాసులో కూర్చొని ఉంది. ఓంధ్వని చేస్తూనే ఆమె ధ్యానములోకి వెళ్లిపోయింది. ఆమెకు శ్రీ కృష్ణుని సాక్షాత్కారమై లేచి డాన్స్ చేయడం ప్రారంభించింది. సత్సంగములో ఇదే మొట్టమొదటి సాక్షాత్కారము. దీని తర్వాత సత్సంగానికి



వచ్చే ఇతర సోదరీ-సోదరులకు కూడా సాక్షాత్కారాలు జరగడం మొదలయ్యాయి. బాబా కాశ్మీరు నుండి వస్తూనే గోపికి బాబా శ్రీ కృషునిగా



కరాచీ క్లిఫ్టన్ - సోదరి దేవా బహన్ (శాంతామణి దాదిగారి లౌకిక అక్క) గారు ట్రాన్స్‌లో కృష్ణుని జతలో నృత్యము చేస్తుండగా మమ్మా వారికి దృష్టినిచ్చుట (ఫోటో - 1945)

కనిపించాడు. అదే సమయములో ఓంరాధ, శ్రీ రాధ(సత్యయుగ మొదటి రాజకుమారి)గా కనిపించసాగింది. అప్పుడు ఆమె ఇరువురిని పట్టుకొని (బాబాను, ఓంరాధను) రాస్ చేయడం ప్రారంభించింది. అప్పటి నుండే దివ్యదృష్టి లీల లేక పాత్ర ప్రారంభమయ్యింది. నెమ్మది నెమ్మదిగా అచ్చటికి వచ్చు వారందరూ ధ్యానములోకి వెళ్లసాగారు. శ్రీ కృష్ణుడు, శ్రీ రాధ లేదా శ్రీ నారాయణుడు. శ్రీ లక్ష్మీ,......... మొదలైన వారిని సాక్షాత్కారములో చూచి వారి జతలో నృత్యము చేసేవారు. అప్పుడు బాబా ముఖారవిందము నుండి పవిత్రత విషయము వెలువడింది. బాబా అన్నారు - **"పిల్లలూ! శ్రీ కృష్ణుని రాజధాని వైకుంఠములోనికి వెళ్ళాలంటే మీరు పవిత్రంగా అవ్వవలసి ఉంటుంది."** కన్యలుగా ఉండేవారికైతే ఏ సమస్యా లేదు. గృహస్థములో ఉండే మాతలకు సమస్యలు ఎదురయ్యాయి. వారి పతులు వ్యాపారార్థము విదేశాలకు వెళ్లి

తిరిగి వచ్చినప్పుడు వారి గృహాలలో(పతి-పత్నుల మధ్య) జగడాలు ప్రారంభమయ్యాయి. మాకు వికారమనే విషము కావాలని పతులడిగే వారు. మేము పవిత్రంగా ఉంటామని పరమాత్మునికి మాటిచ్చాము, కనుక మేము విషము ఇవ్వలేము అని పత్నులనేవారు. అప్పుడు పతులు ఆలోచనలో పడేవారు. వారు పరస్పరంలో ఇలా మాట్లాడుకోసాగారు - ఏ గారడి వాడు వచ్చి వీరికి శ్రీ కృష్ణుని దర్శనము చేయించి పవిత్రంగా ఉండమని చెప్తున్నాడు! అప్పటి నుండి వ్యతిరేక ప్రదర్శనలు పికెటింగ్(Picketing/పని చేయకుండా అడ్డగించుట) చేయడం వంటివి ప్రారంభమయ్యాయి. కాని ఓంరాధ నిశ్చింతగా, స్థిరంగా సత్సంగాన్ని నిర్వహించేవారు. ఇది 1936వ సంవత్సరములో జరిగిన విషయము. ఎవరైనా అడిగితే "నేను ఏమీ చేయడం లేదు అని బాబా చెప్పేవారు. ఈ సత్సంగము కన్యలది – మాతలది. వారు సత్సంగము జరుపుతారు. పైనున్నవారు వస్తారు, చెప్పి వెళ్ళిపోతారు. నేను పైనున్న వారు చెప్పినట్లు చేసేవాడిని మాత్రమే, నాకు ఏమీ తెలియదు" అని చెప్పి అందరినీ ఓంరాధ వద్దకు పంపేవారు. బాబా సదా ఓంరాధనే ముందుంచేవారు. గోపికి సాక్షాత్కారాల పాత్ర పూర్తిగా ఒక సంవత్సరం వరకు కొనసాగింది. తర్వాత ఆమెకు టైఫాయిడ్ జ్వరము వచ్చింది. సింధ్ హైదరాబాదులో ఆమె శరీరాన్ని వదిలింది. అప్పుడు సత్సంగానికి వచ్చే మాతలను, కన్యలను అందరినీ బాబా శ్మశానానికి పంపారు. ఇది సింధి ఇతిహాసములో మొదటిసారిగా జరిగిన ఘట్టము. అంతవరకు స్త్రీలు శ్మశానానికి వెళ్ళేవారు కాదు. శవయాత్రలో ఇంతమంది మాహిళలను చూచి ప్రజలు ఆశ్చర్యపోయారు. దహన సంస్కార కార్యక్రమము కూడా ఓంరాధయే చేశారు.

## ఓంరాధ మమ్మాగా (అనగా) మాతేశ్వరీగా అయ్యారు

మమ్మా 17-18 సంవత్సరాల కన్య. కాని అందరూ వారిని "**మమ్మా**" అని "**అమ్మా**" అని పిలిచేవారు. బాబా కూడా ఒక్కోసారి "**మమ్మా**" అని, ఒక్కోసారి "**బేటీ(బిడ్డా)**" అని, ఒక్కోసారి "**మమ్మా - బేటీ**" అని పిలిచేవారు. ఈ విధంగా ఓంరాధ మమ్మాగా అయిపోయింది. నెమ్మది నెమ్మదిగా వారి



శరీరములో కూడా పేరుకు తగినట్లు పరివర్తన వచ్చేసింది.

మమ్మాను గురించి బాబాగారి లౌకిక కుమార్తె దాదీ నిర్మలశాంతగారు ఇలా చెప్తున్నారు - బాబాయే నన్ను మమ్మా వద్ద ఉంచారు. మమ్మాయే నన్ను సంభాళన చేస్తూ ఉండేవారు. నేను చిన్న పిల్లనైనందున నాకు లౌకిక తల్లి స్మృతి ఉండరాదని ఆలోచించి బాబా నన్ను మమ్మా వద్ద ఉంచారు. ఒకసారి బాబా నాతో - ఓంరాధ నిన్ను పాలన చేస్తారు, అందువలన ఈమె నీకు **మమ్మా** అని అన్నారు. అప్పటి నుండి నేను ఓం రాధను **మమ్మా** అని పిలవసాగాను. అంతవరకు వారిని అందరూ ఓంరాధ అనే పిలిచేవారు. అందరికంటే ముందు నేనే **మమ్మా** అని పిలవడం ప్రారంభించాను. ఆ తర్వాత అందరూ ఓం రాధను **మమ్మా** అని పిలువసాగారు.

రోజురోజుకు సత్సంగములో వృద్ధి జరుగుతూ వచ్చింది. అప్పుడు బాబా ఓంరాధను ఈ సత్సంగానికి వేతనములేని సంచాలికగా నియమించారు. వారితో పాటు ఎనిమిది మంది ఇతర జ్ఞాననిష్ఠ మాతలు, కన్యలతో ఒక కార్యకారిణి(కార్యాచరణ) సమితిని ఏర్పాటు చేసి తమ సమస్త ధన-సంపదలను మాతల సమితికి అర్పణ చేశారు.

## మమ్మాగారి పురుషార్థము

మమ్మాగారి వ్యక్తిగత పురుషార్థములో ఒక విషయము అత్యంత మహత్వపూర్ణమైనది. అది ఏమంటే మమ్మాకు ఏకాంతవాసము చాలా ప్రియముగా ఉండేది. వారు ప్రతిరోజు 2 గంటలకు లేచి ఏంకాంతములో చాలా ప్రేమతో బాబాను స్మృతి చేసేవారు. మమ్మా చేసే స్మృతి ఎంత ప్రేమ భరితంగా ఉండేదంటే, వారి కనుల నుండి ప్రేమబాష్పాలు(ముత్యాలు) వెలువడేవి. మమ్మా పౌర్ణమి వెన్నెలలో కూర్చొని రాత్రంతా తపస్సు చేస్తూ ఉండేవారు.

## మమ్మా మరియు యశోదా మాత

బాబాగారి లౌకిక పత్ని యశోదా మాత కూడా మమ్మాను 'మమ్మా' అని పిలిచేది. మమ్మా ఒడిలోకి వెళ్ళేది. వారి మధ్య చాలా మంచి అతి మధురమైన సంబంధముండేది, ఎందుకంటే యశోదా మాత మమ్మాను చూచినప్పుడు ఆమెకు శ్రీ లక్ష్మి సాక్షత్కారము జరిగేది. ఆమెకు కూడా బాబా పై, బాబా మహావాక్యాల పై దృఢ నిశ్చయము ఉండేది. మేము బాబా, మమ్మాలతో పాటు చాలా ఆడుకున్నాము, తిరిగాము, చాలా ఆనందము అనుభవించాము. కరాచిలో మమ్మా-బాబా మరియు మేము ఒకేచోట ఉండలేదు. బాబా వేరేచోట, నేను, మమ్మా మరోచోట ఉండేవారము. బాబా తన స్థానములో ఉంటూ సూచనలు, సలహాలు ఇచ్చేవారు. వాటిని



లక్నో - మాతేశ్వరి గారి జతలో (ఎడమ నుండి కుడివైపుకు) భగవతీ దాదీ, ప్రకాశ్‌మణి దాదీ, ఆత్మ మోహినీ దాదీ, గుల్జార్ దాదీ, కుంజ్ దాదీ, శాంతామణి దాదీ, సతీ దాదీ, శీతలమణి దాదీ, క్రింద కూర్చుని ఉన్నవారు - హృజ్‌పుష్పా దాదీ, రామి బహన్, ఈశూ దాదీ, కిసనీ దాదీ.




మమ్మా మాకు తెలిపేవారు. మేమందరమూ మమ్మా జతలో ఉంటూ అన్ని పనులు చేసేవారము. ఆబూకు(రాజస్థాన్) వచ్చినప్పుడు అందరమూ కలిసి ఒకేచోట ఉండసాగాము. ఆ సమయంలో మేము ఎక్కువగా బాబా సంబంధములో ఉండేవారము. ఆబూలోని బృజ్‌కోటిలో మమ్మా తపస్యా పాత్ర నడిచింది, అచ్చట కూడా మాకు దివ్య సాక్షాత్కారాలు జరిగేవి. వాటి ద్వారా బాబా మమ్ములను చాలా వినోదపరచేవారు.

భికారీ పాత్రలో(బెగరీ పార్ట్) మమ్మా-బాబాల పాత్ర చాలా ఆశ్చర్యచకితమైనది, వర్ణింపనలవికానిది. ఆ సమయములో మమ్మా బాబా ఇరువురూ పిల్లలందరూ తినేంతవరకు ఏమియూ తినేవారు కాదు. బాబాగారి ఉపస్థితిలో(సమక్షములో) మమ్మా ఏ సలహా ఇచ్చేది కాదు. బాబా ఎలా చెప్తారో, ఏమి చేయమని చెప్తారో అవే చేసేవారు, అందరితో చేయించేవారు. బాబాగారు లేనప్పుడు మమ్మా తన నిర్ణయాన్ని వినిపించేవారు. బాబాకు మమ్మా ఇంతటి అనంతమైన గౌరవాన్ని ఇచ్చేవారు!

## నేను మరియు మమ్మా ( శాంతమణి దాది )

మమ్మాగారి శ్రీ లక్ష్మీ రూపము నాకు చాలా ప్రియముగా ఉండేది. శ్రీ లక్ష్మి నాకు తల్లి అని అనిపించేది. మమ్మాను నేను ఎప్పుడూ ఈమె నా పిన్నమ్మ కూతురని, నా చెల్లెలు అనే దృష్టితో చూడలేదు. వీరు నా తల్లి అని జగదంబ అనే దృష్టితోనే చూసేదానిని. మమ్మా గుణాల గని. ఆమెలో అన్ని గుణాలు వికసించి ఉండేవి. నాకు మమ్మాగారి గంభీరతా గుణము చాలా ఇష్టముగా ఉండేది. గంభీరతతో పాటు సహనశీలత మరియు ధైర్యము - ఈ మూడు గుణాలు నేను కూడా నా జీవితములో ధారణ చేసి వ్యవహారములోకి తెచ్చేందుకు గమనముంచుతాను.



కరాచీ – కుంజ్ భవనము – (ఎడమ నుండి కుడి) పై  వరుసలో కికనీ బహన్, జ్యోతి బహన్. చందప్రణి దాదీ, నిర్మల శాంత దాదీ, మిఠ్ఠూ దాదీ, ప్రకాశ్‌మణి దాదీ, శాంతమణి దాదీ, శీతల మణి దాదీ, మధ్య వరుసలో బృజేంద్ర దాదీ, జశు బహన్, (శాంతమణి దాదిగారి వదిన), ధ్యానీ దాదీ, మమ్మా, మన్మోహినీ దీదీ, రుక్కీ భండారీ (చంద్రమణి దాదీగారి సోదరి), సంతరీ దాదీ, హృదయ పుష్ప దాదీ, క్రింది వరుసలో సికనీ బహన్, గుల్ గోపీ, గోపీ విష్ణు, గోపీ డమ్బీ, దేవీ బడీ, కలా బహన్ (ఫోటో – 1946)

## బ్రాహ్మణ పరివారము కొరకు సందేశము

మమ్మా తరపున సర్వ బ్రాహ్మణ కులభూషణులకు నేను(శాంతామణి దాదీ) ఇచ్చు సందేశమేమంటే మమ్మా ఎల్లప్పుడూ ఇంగ్లీషులో ఒక వాక్యము అనేవారు - ఆల్వేస్ సీ గాడ్ ఫాదర్ అండ్ ఫాలో బ్రహ్మా ఫాదర్(Always see God-Father and Follow Brahma Father) పిల్లలైన మీరు సంపూర్ణమవ్వాలంటే సదా శివబాబానే స్మృతి చేయండి. వారి శ్రీమతము పై నడవండి. బ్రహ్మాబాబాను ఫాలో చేయండి(అనుసరించండి). హుకుమీ హుకుమ్ చలా రహా హై ఏమి జరుగుచున్నా(అది ఆజ్ఞాపించేవారు ఆజ్ఞాపిస్తున్నారని భావించాలి) ఎప్పుడూ శివబాబా పై సంశయము రాకూడదు. సంపూర్ణ నిర్వికారులుగా అవ్వండి.

## మమ్మా నా సహపాఠి (తోటివిద్యార్థిని) సఖి మరియు అలౌకిక తల్లి కూడా అయినారు

*బ్రహ్మాకుమారీ దాదీ ప్రకాశమణిగారు మాతేశ్వరి జగదంబ సరస్వతి గారితో గడిపిన తమ అనుభవాలను ఈ విధంగా చెప్తున్నారు - మమ్మాగారి లౌకిక తండ్రి ముంబాయిలో ఉండేవారు. కనుక వారి ప్రారంభ శిక్షణ (విద్య) దీక్ష ముంబయిలో జరిగింది. మమ్మా ఇంగీషు మీడియంలో చదివారు. మమ్మాకు గుజరాతీ, గురుముఖి భాషలు కూడా వ్రాయడం, చదవడం  తెలుసు. మమ్మా తండ్రి అకస్మాత్తుగా మరణించినందున ఆమె పరివారముతో సహా సింధ్ హైదరాబాద్‌కు వచ్చేసింది. మమ్మా ఇక్కడకు వచ్చినప్పుడు ఆ సమయానుసారము హైదరాబాద్ సింధ్‌లో కన్య (మమ్మా) ఇంత ఆధునికంగా ఉండడం - ఒక ఉదాహరణంగా ఉండేది.  ఆ రోజులలో సింధ్‌లోని ఆడపిల్లలు ఇంత ఆధునికంగా ఉండేవారు కారు. మమ్మా పాటలు పాడడంలో చాలా చురుకైనవారు. మమ్మా కంఠము గాయకుల గొంతు వలె చాలా మధురంగా ఉండేది. మమ్మాకు పాడడంలో ఎంత ప్రావీణ్యత ఉండేదో, నృత్యములో కూడా అంత చురుకుగా ఉండేది. అంతేకాక చదువులోనూ పాఠశాలలోని ఇతర కార్యకలాపాలలో కూడా చాలా చురుకుగా ఉండేది.

### మొట్టమొదటి పరిచయము

మొదటిసారి నేను మమ్మాను ఒక స్కూల్ ఫంక్షన్ (కార్యక్రమము)లో చూశాను. ఆ ఫంక్షన్‌లో మమ్మా “ట్వింకుల్, ట్వింకుల్ లిటిల్ స్టార్(Twinkle Twinkle Little Star,......),............” అనే పాటకు డాన్స్ చేసింది. ఈ పాటకు ఆమెకు బహుమతుల పై బహుమతులు అనేకము

* బ్రహ్మాకుమారి దాదీ ప్రకాశమణి గారు ఈశ్వరీయ విశ్వ విద్యాలయానికి ముఖ్య ప్రశాసిక, అభినవ సరస్వతి. గౌరవ డాక్టరేట్ పదవితో సన్మానిత. అంతేకాక రాష్ట్రీయ, అంతరాష్ట్రీయ స్థాయిలో చాలా పతకాలతో సుశోభిత అయిన దాదీగారికి ప్రపంచంలో ఒక కుశల మహిళా అడ్మినిస్ట్రేటివ్ రూపంలో కనిపించారు. వారు మాతేశ్వరి గారి కార్య భారమంతా నిర్వహించి 25-08-2007 తేదీన తమ భౌతిక దేహాన్ని త్యాగము చేసి అడ్వాన్స్ పార్టీలోకి వెళ్లారు.

లభిస్తూ ఉండడం చూస్తూ - చూస్తూ నేను ఆశ్చర్యచకితనయ్యాను, అప్పుడు మమ్మా వయస్సు సుమారు 16 సంవత్సరాలు ఉంటాయి. నేను కూడా మెట్రిక్ చదివేందుకు మమ్మా చదివే కుందన్‌మల్ మాడల్ స్కూల్‌కు పోవాల్సి వచ్చింది. అది ఇంగ్లీషు మీడియమ్ స్కూల్. మెట్రిక్‌లో నేను మమ్మాకు సహపాఠిని. మేమిరువురమూ ఒకే బెంచ్‌లోనే కూర్చునేవారము.



మాతేశ్వరీ మరియు దాదీ ప్రకాశమణి గారు

కాని మా మధ్య అంత స్నేహము లేదు. ఎందుకంటే మమ్మా చాలా ఆధునికంగా ఉండేది. నేను చాలా సింపుల్‌గా ఉండేదానిని, కాని సహపాఠి అయినందున పరస్పరములో ఒక విధమైన ఆకర్షణ స్నేహము తప్పకుండా ఉండేవి. అప్పుడు నాకు వారి లౌకిక పరిచయము కూడా తెలియదు.



## లోతైన స్మృతి శక్తి (మంచి జ్ఞాపక శక్తి)

కొన్ని రోజుల తర్వాత దీపావళి శెలవులు వచ్చాయి. శెలవులైనందున ఒక రోజు నేను బాబా సత్సంగానికి వెళ్ళాను. అప్పటికి సత్సంగము మొదలై సుమారు ఒకటిన్నర - రెండు మాసములై ఉంటుంది. ఆ రోజులలో మమ్మా కూడా సత్సంగానికి వచ్చింది. మేము పరస్పరము కలిసినప్పుడు ఇచ్చట చాలా మంచి సత్సంగము నడుస్తోంది, మీరు కూడా ప్రతిరోజు రండి, నేను కూడా ప్రతిరోజు వస్తానని చెప్పాను. ఆ తర్వాత మమ్మా ప్రతి రోజు సత్సంగానికి రావడం ప్రారంభించింది. మమ్మా మొదటి నుండి చాలా తెలివిగలది. దూరదృష్టి మరియు మంచి జ్ఞాపక శక్తి కలిగి ఉండేది. మమ్మా జ్ఞాపక శక్తి ఎంత తీవ్రమైనదంటే ఒకసారి వింటూనే బుద్ధిలో ప్రింట్ అయ్యేది. బాబా వినిపించే ఒక పాయింటు ఒకసారి ప్రింట్ అయ్యిందంటే ఆ పాయింటుకు పది రహస్యాలు వెలికి తీసి, మా అందరినీ జ్ఞాన లోతులకు తీసుకెళ్ళేది. రహస్యములో రహస్యాన్ని వెలికి తీస్తూ పోయేది. బాబా వినిపించే ఒక పాయింటు పై మమ్మా ఒక గంట వరకు మాట్లాడగలిగేది. ఆమెలో ఇంతటి లోతైన జ్ఞానముండేది. మమ్మా తన జీవితములో ఒకసారి కూడా "నేను మర్చిపోయాను........." అనే మాట అనలేదు. "బహుశా మీరు నాతో చెప్పినారేమో,.......... ఇప్పుడు గుర్తుకొచ్చింది, చెప్పారు,........." ఇలాంటి మాటలు ఎప్పుడూ అనేవారు కాదు. ఇంత గాఢమైన జ్ఞాపక శక్తికి స్వామినిగా (అధికారిగా) ఉండేవారు మాతేశ్వరి జగదాంబ!

## మమతలో పరిపూర్ణమే కాక మమతకు అతీతము కూడా

మమ్మా వాస్తవంగానే అందరికి ఎంత ప్రేమను పంచేవారంటే అందరూ ఆ ప్రేమలో తల్లీనమయ్యేవారు. యజ్ఞములో మమ్మా నా జతలో సఖి రూపములో ఉండేది, నడిచేది, వ్యవహారము చేసేది. అయినా సంబంధములో మేము పూర్తి తల్లీ-కూతుళ్ళలాగానే ఉండేవారము. ఎక్కడైనా బయటికి వెళ్ళాలంటే మమ్మా నన్ను జతలో తీసుకెళ్ళేవారు. సఖి

అయినా మాతేశ్వరి నాకు మమ్మాగా ఉండేవారు. నేను కూతురులాగానే ఉండేదాన్ని.

మమ్మా అత్యంత దృఢతా శక్తి సంపన్నురాలిగా ఉండేవారు. ఒకవేళ ఆమె ఏ విషయము గురించి అయినా దృఢ నిర్ణయము తీసుకున్నట్లైతే దాని నుండి వారిని కదిలించడము సాధ్యమయ్యేది కాదు. బాబా ఏమి చెప్పారో, అదే విషయాన్ని దృఢతతో మమ్మా మాతో సేవ చేయించేవారు. ఎంత దృఢతనో అంతే నిశ్చయబుద్ధిగా కూడా ఉండేది. మమ్మాగారి నిశ్చయము చూడదగినదిగా ఉండేది. మమ్మా కార్యవ్యవహారాల ద్వారా అందరికీ వీరు సిద్ధముగా ఉన్న రాధ అని, యజ్ఞమాత అని తెలిసేది. మమ్మా ప్రతి అడుగులో వీరు అదే(కల్పక్రితపు) మమ్మా అదే రాధ మరియు అదే లక్ష్మి అని అందరికీ తెలిసేది.

మమ్మా చాలా నిర్భయంగా ఉండేవారు. మమ్మా ప్రాక్టికల్ (ప్రత్యక్షము)గా సింహము వలె శక్తి స్వరూపిణిగా ఉండేవారు. దానితో పాటు మమ్మా ఎంత అనాసక్తంగా ఉండేవారంటే ఇక ఆ విషయాలు అడగకండి! ఎలాంటి దేహాభిమానము ఉండేది కాదు. అయితే స్వమాన నషా ఎంత ఉండేదంటే, అది వేరెవ్వరిలోనూ ఉండేది కాదు. స్వయం పై పూర్తి విశ్వాసము, బాబా పై పూర్తి విశ్వాసము, బాబా కార్యములో పూర్తి విశ్వాసము ఉండేది. బాబా చెప్పిన వెంటనే మమ్మా చేయడం ప్రారంభించేది. సంకల్పము, శ్వాస అన్నిటిలో ఒక్క బాబానే ఉండేవారు. అందరి పై మమ్మాకు ఎంత ప్రేమ ఉండేదంటే, నా హృదయము నుండి ***"మమ్మా! మీరు మమతామూర్తి, నిర్మానత(నిరహంకారి, గౌరవాన్ని ఆశించనివారు) నిధి"*** అనే శబ్దము వెలువడేది. వారిలో మమత ఉండేది కానీ ఎలాంటి మోహముండేది కాదు. అందరినీ అంతగా ప్రేమిస్తున్నా అంతే నిర్మోహిగా కూడా ఉండేవారు. మమతామయిగా ఉంటూ మమతకు అతీతంగా (భిన్నముగా) కూడా ఉండేవారు.



## గౌరవపూర్వకంగా దీక్షనే కాక శిక్షణ కూడా ఇచ్చారు

పాండవులైనా లేక శక్తులైనా మమ్మా అందరి హృదయాలలోని మాటలను వినేవారు, అర్థము చేయించేవారు. తర్వాత వినిపించేవారి తప్పులు కూడా తెలిపేవారు. మమ్మా వద్ద ఫిర్యాదులు వచ్చినప్పటికీ మమ్మా వాటిని స్వయంలో ఇముడ్చుకొని పరివర్తన చేసేవారు. ఇరుపక్షాల వారిని సంతుష్టపరిచేవారు.

మమ్మా వద్దకు వచ్చినట్లైతే సదా వారి నుండి ఏదో ఒక విశేష శిక్షణ తప్పకుండా లభించేది. అక్కడ నుండి వెళ్ళునప్పుడు వారి నుండి ఏదో ఒక ప్రేరణ మరియు శిక్షణను తీసుకొని వెళ్తున్నామనే భావన కలిగేది. అంతేకాక ఏమి చెప్పాలని వచ్చారో, దానిని అక్కడే మర్చిపోయి వెళ్ళేవారు. మమ్మా ఎంతటి సంతుష్టతామూర్తి అంటే ఆమెకు ఏమి లభించిందో, ఎంత లభించిందో దానితోనే చాలా సంతోషపడేది.

## వాక్ - కళా దేవీ వాగీశ్వరి

మమ్మాగారి ఉపన్యసించే కళ కూడా చాలా శక్తిశాలిగా తర్క సహితంగా ఉండేది. మమ్మాను వాగ్వివాదాలలో ఎవ్వరూ ఓడించలేక పోయేవారు. అర్జునుని బాణము ఎలా వేగంగా, నేరుగా లక్ష్యానికి తగిలేదో, మమ్మా ఇచ్చే జవాబు కూడా అలాగే ఉండేది. ఒకసారి కరాచీ జిల్లా అధికారి భ్రాతా జగత్‌షేర్ గారు మా బంగళాకు ఎదురుగా ఉండే బంగళాలో ఉండేవారు. వారు మమ్మాను ఒకటి రెండు అసంబద్ధ ప్రశ్నలను అడిగినప్పుడు మమ్మా వారికి ఎలాంటి సమాధానము ఇచ్చారంటే, వారు మమ్మా చరణాల పై పడిపోయారు.

## అభయహస్తే నిర్భయ రూపిణి దుర్గామాత

ఒకసారి మమ్మా పై వారంటు వచ్చింది. మనోహర్ దాదీ మరియు ఇతర దాదీల పేర్ల పై కూడా వారంటు వచ్చింది. ఎందుకంటే వారు మైనరు (16 సంవత్సరాల లోపు వయస్సు గల స్త్రీలు)గా ఉండేవారు. ఎవరైతే 16

సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు కలిగి ఇంటిని వదిలి యజ్ఞములోకి వచ్చారో, వారికి వారంటు వచ్చింది. ఆ సమయములో మమ్మాకు 18 సంవత్సరాలు. ప్రతి రోజు ఎవరికో ఒకరికి వారంటు వచ్చేది. కనుక ప్రతి రోజు ఉదయము దానిని గురించి చర్చ జరిగేది. అంతే ఒకరోజు ఉదయ ఉదయమే బాబా - " **ఓం రాధా ఈ రోజు నీకు కూడా వారంటు వస్తుంది. కనుక నీవు ఇంటికి వెళ్ళవలసి ఉంటుంది.**" అని బాబా పూర్తిగా తమాషా చేసేలా చెప్పారు. దానికి మమ్మా - "**బాబా! నాకు వారంటు పంపించేందుకు నావారు ఎవ్వరూ లేరు నాకు తల్లి ఒక్కరే ఉన్నారు. నాకు 18 సంవత్సరాలని ఆమెకు తెలుసు. నాకు వారంటు రాదు**" అని చెప్పారు. మంచిది - మంచిది అని బాబా అన్నారు. ఆ విషయము తమాషాగా ఉండినది. అక్కడికి సమాప్తి అయ్యింది. మేమంతా కూర్చుని ఉన్నాము సరిగ్గా ఉదయము 10 గంటలకు రాధేపోకర్ దాస్ పై కోర్టు నుండి వారంటు వచ్చింది. వారంటు పై లౌకిక తల్లి సంతకము కూడా ఉంది. మమ్మాను పిలిచారు. మమ్మా వారంటును చూచి వారితో - "ఇది అసత్యమైన సంతకము. మా తల్లి ఇలా సంతకము చేయదని నేను నిశ్చయంగా చెప్పగలను. మా అమ్మనే సంతకము చేశారని నాకు ఋజువు చేయండి. అంతేకాక నా జన్మ తారీఖు ఇది. నేను 18 సంవత్సరాల వయసు ఉన్న దానను, కనుక ఈ వారంటు నాకు వర్తించదు. నాకు తక్కువ వయస్సు ఉందని మీరు ఎలా చెప్పగలరు? నా తల్లిని పిలవండి నేనే సంతకము చేశానని వారినే చెప్పమనండి" అని చెప్పింది. కాని వారంటు తీసుకోవలసి వచ్చింది. కనుక తీసుకున్నారు. తర్వాత మమ్మా కోర్టుకు వెళ్ళి జడ్జి ముందు - "నా జన్మ తారీఖు, నెల, సంవత్సరము ఇది. ఇది నా జన్మ తిథి. ఇది నా తల్లి సంతకము కాదు. మీరు వారిని అడగవచ్చు. మా తల్లే వచ్చి నేనే ఈ వారంటును పంపించానని చెప్పినట్లైతే నేను ఇప్పుడే వెళ్లేందుకు తయారుగా ఉన్నాను" అని చెప్పారు. ఇది విని కోర్టులో హాహాకారాలు చెలరేగాయి. తర్వాత వారి తల్లిని ప్రశ్నించారు. ఆమె నాకేమీ తెలియదని, నాకెవ్వరూ చెప్పలేదు, నేను సంతకము చేయలేదని చెప్పారు. జడ్జీ తెల్ల ముఖము వేశాడు. తర్వాత కోర్టు నుండి గౌరవయుక్తంగా కారులో



మమ్మాను వాపసు పంపడం జరిగింది. మమ్మా కోర్టులో జడ్జితో "మీరు ఇలాగే మహిళలను కోర్టుకు పిలుస్తారా?" అని ప్రశ్నించారు. మమ్మా వాణిలో ఎంత శక్తి, ధైర్యము ఉండేదంటే జడ్జి ఏమీ మాట్లాడలేకపోయాడు. మమ్మా నిర్భయంగా ఉండేది, భయపడేది కాదు, స్థిరంగా ఉండేవారు, నిశ్చయ బుద్ధితో ఉండేవారు, స్పష్టముగా జవాబిచ్చేవారు. ఈ విధంగా మమ్మా దుర్గామాతగా ఉండేవారు.

## మర్యాదా యుక్తంగా, సభ్యతా యుక్తంగా ఉండేవారు

మమ్మా బాబాకు ఎంత గౌరవాన్నిచ్చేవారంటే బాబా గురించి ఎవ్వరి నుండి అయినా ఎలాంటి సాధారణ శబ్దాలను కూడా వినలేక పోయేవారు. ఒకసారి జరిగిన విషయము - మేము బాబాతో ఆడుకొని వచ్చాము. అప్పుడు నేను, "మమ్మా! నేను ఈ రోజు బాబాను గెలిచాను" అని చెప్పాను. అప్పుడు మమ్మా - అలా మాట్లాడకు(చుప్). నేను బాబాను గెలిచానని చెప్తారా? అని అన్నారు. మళ్లీ నేను - అవును మమ్మా నిజంగానే నేను బాబా పై గెలిచాను" అని అన్నాను. అప్పుడు మమ్మా - "భలే నీవు గెలిచి ఉండవచ్చు కాని నేను బాబాను గెలిచానని చెప్పరాదు. నీవు ఆటను గెలిచావు, బాబాను గెలవలేదు. కనుక నేను ఆటను గెలిచానని చెప్పు" అని అన్నారు. మమ్మా ప్రతి శబ్దానికి యధార్థమైన అర్థాన్ని తెలియజేసి దానిని సరియైన పద్ధతిలో ఉపయోగించమని చెప్పేవారు. మమ్మా ప్రతి విషయములో మర్యాదాయుక్తంగా, సభ్యతాయుక్తంగా ఉండేవారు.

## స్వీకరించారు, పురుషార్థము చేశారు, తయారై పోయారు

మమ్మా జతలో ఉంటూ మేము వారి నుండి శిష్టాచారాన్ని నేర్చుకున్నాము. ఈ రకంగా ఓంరాధ మాకు తల్లిగానే కాక, సఖిగా కూడా ఉండేవారు. ప్రియమైనవారుగానే కాక మధురంగా కూడా ఉండేవారు. అంతేకాక అంబగా కూడా ఉండేవారు. మధురమైన మమ్మాగారి గుణాలను ఎంత మహిమ చేసినా, అది తక్కువే మమ్మా

ఎంత జ్ఞానీ ఆత్మగా, యోగీ ఆత్మగా ఉండేవారో, అంత శివశక్తి మాతగా ఉండేవారు. మమ్మా త్యాగమూర్తి మరియు సర్వగుణమూర్తిగా కూడా ఉండేందుకు నిశ్చయబుద్ధి విజయంతి అని బాబా కూడా చెప్తారు. దానికి ఒక సెకండులో ప్రాక్టికల్ ఋజువును మేము పూర్తిగా మమ్మాలో చూశాము. మమ్మాను బాబా చూశారో లేక బాబాను మమ్మా చూశారో కాని బాబా - " ఓ రాధా! నీవు అనురాధవు, జగదంబవు అని అన్నారు. ఎప్పుడు మమ్మా ఎదురుగా వచ్చారో అప్పుడు బాబా - "ఓ రాధా! నీవు ఓం రాధవు. హే ఓం రాధా! నీవు జగదంబవు అందరికీ తల్లివి. మమ్మా రావడంతోనే బాబా, వారి పూర్తి జన్మపత్రిని ఎలా వినిపించారంటే మేము కూడా చూస్తూ ఉండిపోయాము. మమ్మా కూడా అదే నిశ్చయంతో ఆ మాటను స్వీకరించారు, పురుషార్థము చేశారు. అదే విధంగా తయారైపోయింది. ఇది కూడా మేము ప్రాక్టికల్‌గా చూశాము.

వీణావాదిని అయిన తల్లి సరస్వతి జ్ఞానవీణను ఎంత మధురంగా వినిపించేవారంటే వినేవారి మనస్సు హర్షితమయ్యేది. జ్ఞానదేవి సరస్వతిగా మురళి చాలా రహస్యయుక్తంగా మరియు లోతుగా ఉండేది. మమ్మా నిర్భయమైన దుర్గామాతగా, శక్తిమాతగా ఉండేవారు. మమ్మా రావడంతోనే వీరు బాబా చెప్పే విజయమాలలోని మేరుమణి(జంటమణి)గా అయ్యేవారని ఋజువయింది. మమ్మా సర్వగుణాల గని అని రావడంతోనే అనిపించింది.

## సర్వ గుణాలనే మాలలతో సుశోభితులు

నేను ఆది నుండే ఓంమండలి, ఓంనివాస్, కుంజ్ భవనాలలో మమ్మా జతలో ఉన్నాను. మమ్మాలో నేను ఏమి చూశానంటే వారి ఎదురుగా, ఎవరు వచ్చినా, ఏ భావనతో వచ్చినా మమ్మా దృష్టి వారి పై పడగానే వారు మమ్మా చరణాల పై వాలిపోయేవారు. నేను తపస్సులో 14 సంవత్సరాలు మమ్మా జతలోనే ఉన్నాను. ప్రతిరోజు అమృతవేళ 2 గంటలకు పరుపును వదిలి కుర్చీ పై కూర్చుని యోగము చేసేవారు. ఇది మమ్మాగారి నియమిత చర్య. మమ్మా మాకు అన్ని రకాలైన కర్మణా సేవలు జతలో



కూర్చొని నేర్పించేవారు. ధాన్యము స్వచ్ఛము చేయడంలో గానీ, కూరగాయలు తరగడంలో గానీ మమ్మా అందరికన్నా ముందు వచ్చి కూర్చునేవారు. అంతేకాక ఎలా స్వచ్ఛము చేయాలో, ఎలా తరగాలో కూడా నేర్పించేవారు.

నిమంత్రణ పై యజ్ఞము నుండి మొదటిసారి సేవ కొరకు మమ్మా కాన్పూరుకు బయలుదేరారు. ఆ సమయములో నేను(ప్రకాశ్‌మణి దాదీ) ఢిల్లీలో ఉన్నాను. "మమ్మా జతలో నీవు కూడా కాన్పూరుకు వెళ్ళు" అని బాబా నాకు టెలిగ్రామ్ పంపారు. ఈ విధంగా ఒకటి కాదు, మమ్మాతో పాటు అనేక సేవాయాత్రలకు బాబా నన్ను పంపించారు. గుణాల మాలలో 36 గుణాలుంటాయని అంటారు. ఆ 36 గుణాలన్నిటిలో మమ్మా నంబరువన్‌గా ఉండేవారు.

మమ్మా కన్నా పెద్ద అక్కయ్యలు ఉండేవారు. అయితే వారి జతలో మమ్మా సఖిలాగా వ్యవహారము చేసేవారు. అంతేకాక తల్లిగా కూడా ఉండేవారు.

## మధువనములోని ద్రాక్ష మమ్మా స్మృతి తెప్పిస్తుంది

బాబా తోటలో ఉన్న ద్రాక్ష తీగ 1965 జూన్ 23వ తేదీన మొట్టమొదటి ఫలమునిచ్చింది. పిల్లలకు ద్రాక్ష తినిపించమని బాబా మమ్మాకు చెప్పారు. అది జూన్ 24 ఉదయము మురళి క్లాస్ తర్వాత 9 గంటల సమయము. ఆ సమయములో మధువనములో ఉన్న వారందరికీ ఒక్కొక్కరికి రెండు రెండు ద్రాక్ష పండ్లు మమ్మా తినిపించారు. ఈ ద్రాక్ష మమ్మా స్మృతి చిహ్నము.

చివరికి మమ్మా ఎక్కడ ఉన్నారు? బాబా ఎక్కడ దాచి ఉంచారు? అనే ప్రశ్న అందరి మనసులలో వస్తుంది. కాని ఈ ప్రశ్నకు సమాధానము బాబాకే తెలుసు. బాబా! మీ గతి - మతములు మీకే తెలుసు. ఈ విషయాన్ని బాబా ఇప్పటి వరకు గుప్తంగానే ఉంచారు. ఎక్కడో అయితే ఉన్నారు మమ్మా!

# మాతేశ్వరి పసి బిడ్డే కాక జగన్మాత కూడా


బ్రహ్మాకుమారి జానకీ దాదీ* గారు చెప్తున్నారు - మమ్మా నాకు మొదటి నుండి తెలుసు. కాని కుమార్కా(ప్రకాశమణి) దాదీ గారితో ఎలాంటి స్నేహముండేదో, అలా ఉండేది కాదు. వారిరువురు వయసులో నా కంటే చిన్నవారు. మమ్మా చాలా చురుకుగా ఉండేవారు. వారు నా కన్నా భిన్నంగా ఉండేవారు. కాని ఓంమండలిలో మొదటిసారి నేను చూసినప్పుడు నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. వారు తెల్లటి ఫ్రాక్ ధరించి ఉన్నారు. మిగిలిన సోదరీలతో పోల్చినట్లైతే మమ్మా చాలా మెరుస్తూ కనిపించేవారు. ఓంమండలిలోకి వస్తూనే వారి పరివర్తనను చూసి అందరికీ బాగుందని కూడా అనిపించింది, ఆశ్చర్యము కూడా కలిగింది. నేను కరాచీకి వచ్చినప్పుడు నీవు మమ్మాను చూశావా? మమ్మాతో కలిశావా? అని ఎవరో నన్ను ప్రశ్నించారు. వారు బాబా యుగల్ యశోదా మాత గురించి అడుగుతున్నారని అనుకున్నాను. కలుస్తాను అని చెప్పాను. కాని 2-3 రోజుల తర్వాత వీరు మమ్మా అని ఎవరిని అంటున్నారో తెలిసింది.

### మమ్మా విని కాదు, తనలో ఇముడ్చుకొని జ్ఞానాన్ని వినిపించేవారు

ఒకటి-రెండు సంవత్సరాలలో మమ్మాలో వచ్చిన పరివర్తన చాలా విచిత్రమైన విషయము. మమ్మా నయనాలు ఉండే తీరు, మాటలు, వ్యక్తిత్వము - ఇవన్నీ అలౌకికతలోకి పరివర్తనైపోయాయి. మమ్మా జ్ఞానాన్ని వినిపించేటప్పుడు వీరు బాబా వినిపించిన జ్ఞానాన్ని కేవలం అలాగే వినిపించడం లేదని దానిని తనలో ఇముడ్చుకుని వినిపిస్తున్నారని అనిపించేది. ఒకరోజు మమ్మాను కుంజ్ భవనము పై కప్పు మీద నిల్చొని ఉండడం చూశాను. బాబా గది ముందు ఆంగనముండేది. నేను మమ్మాను

* బ్రహ్మాకుమారి జానకీ దాదీగారు కూడా యజ్ఞములోని ఆదిరత్నాలలో ఒకరు. ప్రస్తుతం వారు ఈశ్వరీయ విశ్వ విద్యాలయానికి ముఖ్య ప్రశాసిక. విదేశాలలో సేవ చాలా విస్తరింపజేశారు. ప్రస్తుతం (2018) వారి వయసు 103 సంవత్సరాలు.





(ఎడమ నుండి కుడి) మాతేశ్వరీగారి జతలో దాదీ ప్రకాశ్‌మణి, బృజేంద్ర దాదీ, జానకీ దాదీ వెనుక క్వీన్ మదర్, ఘుగ్గీ దాదీ, పుష్ప శాంతా దాదీ.

ఎప్పుడు చూచినా, వారు ఇంటి కప్పు మీద గాని లేక ఆంగనములో గాని కుర్చీలో కూర్చుని వెన్నెలలో యోగము చేస్తూ కనిపించేవారు. మమ్మా తపస్సు చేస్తుండగా చూసి నాకు చాలా ప్రేరణ లభించేది.

మమ్మా మురళి వినిపించేటప్పుడు మేము తన్మయులమై వింటూ మూర్తుల వలె(విగ్రహాలవలె) అయిపోయేవారము. మురళి ఒకటిన్నరగంట నడిచేది. మేము కూడా ఏకాగ్రతతో కూర్చుని వినేవారము. మమ్మా మురళి ఎంత ప్రియంగా ఉండేదంటే అది వర్ణించనలవి కాదు! పూర్తి యజ్ఞములో చూసినట్లైతే మమ్మా అందరికంటే చాలా తక్కువగా మాట్లాడేవారు. మమ్మాలోని ఈ గుణము నాకు చాలా ఇష్టమనిపించేది. ఆ సమయంలో నేను కూడా చాలా తక్కువగా మాట్లాడేదానిని. అంతర్ముఖతలో ఉండాలనే ఈ ప్రేరణ నేను మమ్మా ద్వారా పొందాను. ఇతరులతో చాలా తక్కువ సంబంధాన్ని ఉంచుకునేవారు. అప్పుడప్పుడు దీదీతో కొద్దిగా మాట్లాడేవారు.

మాటల మధ్యలో నేను ఒకసారి నాకు మమ్మా అంటే భయము. నేను ఏదో తప్పు చేశానని కాదు కాని వారి వద్దకు వెళ్లేందుకు కొద్దిగా సంకోచము కలుగుతుందని చెప్పాను. ఈ విషయం మమ్మాకు తెలిసింది. ఒక రోజు మమ్మా నా చేయి పట్టుకొని **"ఏమిటీ జనక్! నువ్వు నేనంటే భయపడ్తావా ?"** అని అడిగారు. అప్పుడు నేను చెప్పాను - " భయపడను, కాని ఎప్పుడూ మాట్లాడను కదా ! " అందుకే అలా చెప్పానని అన్నాను. మమ్మా అన్నారు - "సరే, ఈ రోజు పద, మీతో జ్ఞాన చర్చ జరుపుతాను". మమ్మా ప్రతి ఒక్కరితో ఎంత ప్రేమ పూర్వకముగా మరియు గౌరవముతో మాట్లాడేవారంటే వినేవారి మనస్సు తృప్తి చెందేది.

## మమ్మా చెప్పడంతో కాక, స్వయం చేసి నేర్పించేవారు

ఒకసారి జరిగిన పొరపాటు మరోసారి పునరావృతం అవ్వరాదని మమ్మా చెప్పేవారు. మమ్మా నుండి రెండవసారి శిక్షణ తీసుకోని విధంగా నా రికార్డును ఉంచుకోవాలనే పాఠాన్ని నేను గట్టిగా పక్కా చేసుకున్నాను. మమ్మా ఎప్పుడూ ఏ పనినీ చెప్పడం ద్వారా నేర్పించేవారు కారు. స్వయం చేసి నేర్పించేవారు. ఒకసారి నేను ఉదయము 4 గంటలకు లేవలేదు. ఎందుకంటే లౌకిక జీవితంలో నేను త్వరగా లేచేదానిని కాదు. ఓం మండలికి వచ్చిన తర్వాత ఉదయము త్వరగా లేవడం నేర్చుకున్నాను. మమ్మా 4 గంటలకు వచ్చి చూసేవారు. ఎవ్వరూ లేవకుండుట చూసి నెమ్మది నెమ్మదిగా మెట్లు దిగి కిచెన్‌లోకి వెళ్ళేవారు. ఎవరికో ఒకరికి తెలిసేది. అప్పుడు వారు మమ్మా చూసి వెళ్ళారు అని చెప్పేవారు. అప్పుడు మేమంతా లేచి తయారై మళ్లీ మమ్మా ఎదురుగా నిల్చుకునేవారము. అప్పుడు మమ్మా చిరునవ్వు నవ్వి - **"చూశారా, మీ మందిరాలలో భక్తులు లేచి గంటలు మ్రోగిస్తున్నారు. దేవతలైన మీరు నిద్రిస్తున్నారు"** అని చెప్పేవారు. అప్పటి నుండి ఇప్పటి వరకు నేను అమృతవేళ నిదురపోలేదు.

## మమ్మాగారు భోజనాన్ని పరమాత్ముని ప్రసాదంగా భావించి స్వీకరించేవారు

### "భోజనము ఏమిటీ ఇలా ఉంది" అని మమ్మా ఎప్పుడూ చూచేవారు



కాదు. ఏది లభించేదో, దానినే ప్రేమగా స్వీకరించేవారు. ఈ రోజు ఉప్పు తక్కువగా ఉంది, ఎక్కువగా ఉంది, ఈ రోజు సబ్జీ బాగుంది, బాగా లేదని ఎప్పుడూ అనలేదు. తినే సమయములో మమ్మా ఎప్పుడూ అటు-ఇటు చూసేవారు కాదు. శాంతిగా కూర్చుని తిని వెళ్లిపోయేవారు. భోజనాన్ని ప్రసాదం రూపములో స్వీకరించేవారు. మమ్మా ఎదుట బాబా ఏ విషయము మాట్లాడినా, ఏమి చెప్పినా మమ్మా ఎప్పుడూ ఎందుకు? ఎలా? అని ఆలోచించేవారు కాదు. సదా " జీ బాబా ! హాజీ బాబా ! "(సరే బాబా, అలాగే బాబా) అని అనేవారు. వారికి బాబా పట్ల అంత గౌరవముండేది. నేను పూనాలో ఉన్నప్పుడు మమ్మా నా వద్దకు మూడు సార్లు వచ్చారు. బాబాగారి ప్రతి మాట పై మమ్మాకు అఖండమైన విశ్వాసముండేది. ఒకసారి ఎవరో మమ్మాను, మమ్మా! మొదట బాబా ఎక్కడ గెలుపో, అక్కడ జన్మ అని చెప్పేవారు. ఈ రోజుల్లో బాబా దాని గురించి ఏమి చెప్పడం లేదు మీ ఆలోచన ఏమిటి? అని అడిగారు. అప్పుడు మమ్మా - నా ఆలోచన ఎక్కడ నుండి వచ్చింది? బాబా ఏమి చెప్పారో, అదే మనందరి ఆలోచన అని చెప్పారు. మమ్మా ఎప్పుడూ తన బుద్ధి యొక్క అభిమానాన్ని చూపించలేదు.

## మనసును జయించిన, పద్మము వంటి మనసు గల మమ్మా

పూనాలోనే మరోసారి మమ్మాను ఎవరో ప్రశ్నించారు - మమ్మా మీరు మనసును ఎలా శాంతిగా ఉంచుకుంటారు? అప్పుడు మమ్మా చెప్పారు - "ఈ మనస్సు మన చిన్న బేబీ వంటిది. ఇప్పుడు నువ్వు శాంతిగా ఉండు. ఎప్పుడు అవసరము వస్తుందో, అప్పుడు నేను నిన్ను పిలుస్తాను అని దానికి చెప్తాను. అది శాంతిగా కూర్చుంటుంది" అని చెప్పారు. ఇలా మమ్మా మన్ జీత్‌గా ఉండేవారు.

ఇది కరాచీలో జరిగిన విషయము. మమ్మా ఆఫీసులో కూర్చుని ఉన్నప్పుడు నేను వెళ్ళి మమ్మా నేను ఏమి పురుషార్థము చేయాలి? అని ప్రశ్నించాను? ***"సదా ఇది నా అంతిమ క్షణమని భావించు,..............."*** అని మమ్మా చెప్పారు. ప్రతి క్షణము అంతిమ క్షణము. నేను బాబా స్మృతిలో ఉండాలి అను ఆ మమ్మా మంత్రాన్ని నేను ఆ రోజు నుండి ఈ రోజు వరకు మర్చిపోలేదు.

## గుప్తగామిని సరస్వతి మాత

మమ్మా ఎప్పుడూ తన షో(ఆడంబరాన్ని) చూపించలేదు. వారు ఎంతో సేవ చేసేవారు కాని ఎప్పుడూ ఇంత సేవ చేశానని తన నోటి ద్వారా చెప్పనేలేదు. మమ్మా ఒకటిన్నర మాసము సేవ చేసి బెంగుళూరు నుండి పూనాకు వచ్చారు, వారు చాలా సేవ చేశారు, అయినా నేను ఈ ఈ సేవ చేసి వచ్చానని చెప్పలేదు. ఏ సోదరుడు వారిని తీసుకు వచ్చేందుకు వెళ్ళారో అతడు కొద్దిగా వినిపించారు. అప్పుడు నేను మమ్మాను అడిగాను. సేవ బాగా జరిగింది అని మాత్రమే చెప్పారు. అంతకంటే ఎక్కువగా ఏమీ చెప్పలేదు. ఈ విధంగా మమ్మా తన గురించి తను చేసిన పనుల(సేవను) గురించి ఇతరులకు చెప్పేవారు కాదు. వారు ఎంత త్యాగీలో, అంతే వైరాగీలు, అంతే తపస్వీలు.

మమ్మాను నేను రాధ రూపములోనే కాక సరస్వతి రూపములో కూడా చూశాను, కాళికా రూపములో కూడా చూశాను, జగదంబ రూపములో కూడా చూశాను.

## శిక్షణను ఇచ్చే అద్భుతమైన పద్ధతి

బాబా సభలో అనగా క్లాసులో అందరి ఎదురుగానే శిక్షణనిచ్చేవారు. ఎవరికైనా వ్యక్తిగత రూపములో శిక్షణ ఇవ్వవలసి ఉంటే వారికి బాబా పత్రము వ్రాసేవారు. కాని మమ్మా అర్థం చేయించే పద్ధతి వేరే విధంగా ఉండేది. మమ్మా ఆ వత్స చెవులలో చెప్పేవారు లేక సంకేతాన్ని ఇచ్చేవారు, చాలా ప్రేమగా చెప్పేవారు. ఎవరో చెప్పిన మాటల ఆధారంగా మమ్మా వారికి శిక్షణను ఇచ్చేవారు కాదు. కాని మమ్మా సమయాన్ని చూసి వారికి ప్రేమగా అర్థం చేయించేవారు. అద్భుతమైన విషయమేమంటే మమ్మా ఎవరో చెప్పిన కారణంగా నాకు శిక్షణనిస్తున్నారను అనుభూతిని కూడా ఆ వ్యక్తికి కలుగనిచ్చేవారు కాదు. మమ్మా శిక్షణలను యజ్ఞ వత్సలందరూ తమ తల్లి శిక్షణ అని భావించి స్వీకరించేవారు. మమ్మా ఏమి చెప్తున్నా మా మంచి కొరకేనని ప్రతి ఒక్కరికీ అనిపించేది. బాబాగారి శిక్షణ చాలా



శక్తిశాలిగా ఉండేది. దానిని వినేందుకు మరియు అర్థము చేసుకునేందుకు శక్తి కావాలి. శక్తిశాలి ఆత్మ మాత్రమే బాబాగారి శిక్షణలను జీర్ణము చేసుకోగలిగేది. అందువల్లనే సాధారణంగా ఏ పిల్లలకైనా అర్థం చేయించవలసి వస్తే, బాబా నేరుగా వారిని ఏమీ అనేవారు కాదు. కాని వారి ఎదురుగానే మమ్మాను అనేవారు. దాని ద్వారా నా కారణంగా మమ్మా ఎన్ని మాటలు వినవలసి వచ్చిందని ఆ పిల్లలు అర్థము చేసుకునేవారు. తర్వాత వారే మమ్మా వద్దకు వచ్చి తమ తప్పును ఒప్పుకునేవారు. అంతేకాక ముందు ముందు గమనముంచుకునేవారు.

## పద్ధతి - ఆచారాలు, సభ్యత - సంస్కృతుల జనని

మమ్మా బాబాను ఎప్పుడూ సాధారణంగా భావించలేదు. బాబాగారి ప్రతి మాటకు సంపూర్ణ గౌరవాన్ని ఇచ్చారు, దానిని పూర్తిగా పరిపాలన చేశారు. కొందరు పిల్లలు బాబాగారి మాటలను చాలా సాధారణ రూపములో తీసుకొనేవారు. కనుక మమ్మా పిల్లలందరిని కూర్చోబెట్టుకొని - బాబాను సాధారణంగా అనుకునే కఠినమైన తప్పు ఎప్పుడూ చేయరాదని, బాబాగారి ఒక్కొక్క మాట చాలా అమూల్యమైనదని చెప్పేవారు. అలా చెప్తూ మాకు సభ్యతను, క్రమశిక్షణను నేర్పించేవారు. మమ్మాగారు మాట్లాడే పద్ధతి చాలా గౌరవయుక్తంగా, ప్రేమ మరియు మధురతా యుక్తంగా ఉండేది. మాకు మమ్మా పద్ధతి-ఆచారాలు, సభ్యత-సంస్కృతులను నేర్పించి యోగ్యులుగా చేశారు. అంతేకాక ఒక తల్లి పాత్రను అభినయించారు. పిల్లలైన మమ్ములను గుణాలతో అలంకరించి బాబా ఎదురుగా ఉంచారు.

## బాబా మమ్మానే యజ్ఞమాతగా తయారు చేసేందుకు మమ్మాలో ఎలాంటి విశేషతలుండేవి ?

మమ్మాను నేను ఎప్పటి నుండి చూశానో, అప్పటి నుండి వారిలో శ్రీ లక్ష్మి లక్షణాలన్నీ స్పష్టంగా కనిపించేవి. మమ్మా సర్వ దైవీ గుణాలతో సంపన్నముగా ఉండేవారు. మమ్మాకు దేహము నుండి భిన్నముగా అయ్యే

అభ్యాసము పై చాలా గమనముండేది. అశరీరిగా అయ్యే మమ్మాగారి అభ్యాసము మేమందరము నేర్చుకోదగినదిగా ఉండేది. మమ్మా ముందుకు ఎవరు ఏమి మాట్లాడేందుకు వచ్చినా, వారి శబ్దమే ఆగిపోయేది లేదా ఎక్కువగా మాట్లాడలేకపోయేవారు.



*మాతేశ్వరి గారి జతలో ప్రకాశ్‌మణి దాదీగారు, రుక్మిణీ దాదీగారు, మిఠ్ఠూ దాదీగారు*

పవిత్రతా పర్సనాలిటీ(వ్యక్తిత్వము), రాయల్టీ(శ్రేష్ఠత), త్యాగము, బాధ్యతను నిర్వహించడంలో సదా నంబర్‌వన్‌గా ఉండేవారు. ఇంత చిన్న వయస్సులో ఇంత గొప్ప పరివర్తనను తనలో తీసుకురావడం చాలా గొప్ప విశేషత. మమ్మా బాబాకు విశ్వాసపాత్రురాలైన పుత్రిక అయ్యి కర్తవ్యాన్ని నిభాయించడం మరియు యజ్ఞ వత్సలైన మా అందరికీ అలౌకిక తల్లి అయ్యి బాధ్యతను నిర్వహించడం - రెండు పాత్రలను అభినయించారు. మమ్మా గారి నోటి నుండి ఏ వాక్యాలు వెలువడినా, సలహాలు వెలువడినా వినేవారికి అవన్నీ వరదానాలుగా అయ్యాయి. అందులో మమ్మాగారి ఏ



స్వార్థము లేదని, వారు మా మంచి కొరకే ఇంత శ్రమ చేస్తున్నారని అందరికి అనుభవమయ్యేది. మమ్మాను, తాత-ముత్తాతల వయసున్న వారు కూడా **అమ్మా!** అని పిలిచేవారు. తమ శుభ చింతకులుగా భావించేవారు. పిల్లలను గుణవంతులుగా తయారు చేయడం, సభ్యతలు నేర్పించడం ఒక ఆదర్శ తల్లి కర్తవ్యము. ఈ కర్తవ్యాన్ని మమ్మా పూర్తిగా నిభాయించారు.

## మమ్మాగారి ఆత్మిక రూపము

మమ్మా ప్రతి రోజు మురళి తప్పకుండా చదివేవారు లేక టేపు ద్వారా వినేవారు. రాత్రి 11 గంటలైనా మరుసటి రోజు మురళి విన్న తర్వాతనే మమ్మా నిద్రించేవారు. ఎంత తమ కర్తవ్యాలలో పక్కాగా ఉండేవారో, అంతే ఈశ్వరీయ చదువులో కూడా పక్కాగా ఉండేవారు. ఆస్పత్రిలో ఉన్నప్పుడు కూడా మమ్మా రోజూ మురళి వినేవారు. మేము మమ్మాను సదా అలర్ట్ (చురుకు)గా, ఆక్యురేట్(ఖచ్చితము)గా చూశాము. మమ్మా కళ్ళు అలసిపోయి ఉండడం మేమెప్పుడూ చూడలేదు. సదా వారి కళ్ళు బాబా స్మృతిలో మగ్నమై ఉండడమే చూశాము. మమ్మాలో ఎంతటి నమ్రత ఉండేదంటే మాత్-పితా కా యాద్‌ప్యార్ ఔర్ నమస్తే. (తల్లిదండ్రుల ప్రియ స్మృతులు మరియు నమస్తే) అని బాబా చెప్పినప్పుడు మమ్మా తనను మాత అని భావించేవారు కాదు. పైకి సంకేతాన్ని చూపిస్తూ ఆ మాతా - పితలకు యాద్‌ప్యార్ అని చెప్పేవారు. మమ్మా కేవలం బాధ్యతను నిభాయించడంలో, పాలన ఇవ్వడంలో స్వయాన్ని తల్లిగా భావించేవారు. మమ్మా తల్లి పదవిని స్వీకరించలేదు. కాని తల్లి కర్తవ్యాలను స్వీకరించి వాటిని పూర్తిగా నిభాయించారు. బాబా ముందు వారు ఒక పసిబిడ్డ రూపాన్ని ధారణ చేసేవారు. యజ్ఞ పుత్రులు మరియు భక్తుల ముందు ఆదిదేవి, జగదంబ తల్లి రూపాన్ని ధారణ చేసేవారు. మా తల్లి సరస్వతి ఇంత మహోన్నతమైన వారు!

* బ్రహ్మకుమారి నిర్మలశాంత దాదీగారు అంటున్నారు - మమ్మా చాలా గంభీరంగా, శాంతముగా ఉండేవారు. మమ్మా మురళి చదివి వివరించడమే కాక యజ్ఞములో అన్ని బాధ్యతలను నిర్వహించేవారు. యజ్ఞములో అన్ని కార్యాలను చేయించడం, నిర్వహించడం వారే చేయవలసి వచ్చేది. అయినా వారి ముఖము, నడవడిక, వ్యవహారములో ఎలాంటి వ్యత్యాసము వచ్చేది కాదు. వారు పూర్తి శాంతిగా, గంభీరంగా, మధురంగా, ఏకరసంగా ఉండేవారు. ఉదాహరణానికి యజ్ఞములో భికారి పాత్ర వచ్చినప్పుడు చాలాసార్లు భుజించేందుకు ఏమీ లభించనప్పుడు చాలా మంది ముఖాలు నిస్తేజంగా పాలిపోయి ఉండేవి. కాని మమ్మాకు భోజనము దొరికినా, దొరకకపోయినా వారి ముఖము పై సదా చిరునవ్వు, నిశ్చింతత, ధైర్యము, సహనము అంతేకాక బాబా పై చెదరని విశ్వాసము తొణికిసలాడేది. యజ్ఞములో ఎవరైనా శరీరము వదిలినా, మమ్మా ముఖములో ఎలాంటి మార్పు కనిపించేది కాదు. మమ్మా లౌకిక తల్లి శరీరము వదిలినప్పుడు కూడా లౌకికములో వారికి తల్లి అని కూడా అనిపించనంత సాధారణంగా, మామూలుగా ఉండినారు. సంపూర్ణ శాంతి, స్థిరత ఏకరసంగా ఉండినది. ఎప్పుడు ఏమి జరిగినా మమ్మా మా పై కోపగించుకునేవారు కాదు, తిట్టేవారు కూడా కాదు. మేము మా జీవితములో మమ్మా అసంతృప్తిగా, దు:ఖముగా ఉండడం చూడనే లేదు. సంతరీ బెహన్ బాబా జతలో ఉండేవారు. నేను మమ్మా జతలో ఉండేదానిని. నేను మమ్మాను చాలా సమీపంగా చూచాను.

## మమ్మా వ్యక్తిత్వము

మమ్మా పూర్తి రాయల్‌గా ఉండేవారు. వారు ఎప్పుడూ బిగ్గరగా నవ్వేవారు కాదు. కేవలం మందహాసము చేసేవారు. మమ్మాలో కోపమే లేదు. మమ్మా అంటూ ఉండేవారు - కామము, క్రోధము, అహంకారము,

* బ్రహ్మకుమారి నిర్మలశాంత దాదీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయానికి సంయుక్త ప్రశాసిక, ఈశ్వరీయ విశ్వ విద్యాలయములో ఈస్టర్న్ జోన్ శాఖల ఇన్‌చార్జ్‌గా ఉండేవారు. చాలాకాలము జోన్ ముఖ్య కేంద్రమైన కలకత్తాలో ఉండేవారు. బ్రహ్మబాబా గారి లౌకిక పుత్రిక.





మాతేశ్వరీగారి జతలో కమలసుందరీ దాదీగారు, క్వీన్ మదర్, రత్నాబహన్ (నిర్మల శాంతదాదీగారి లౌకిక కూతురు) నిర్మల శాంతదాదీగారు

మొదలైనవి నరక ద్వారాలు. కావున పిల్లలైన మీరు ఎప్పుడూ కోపపడరాదు, ఎవరైనా కోపగించుకుంటే అప్పుడు మమ్మా నవ్వుతూ నవ్వుతూ మాట్లాడేవారు - కోపాన్ని ఏమంటారు, క్రోధమంటారు కదా. క్రోధమును భూతమని అంటారు. క్రోధము వచ్చిందంటే మీలో భూతము ప్రవేశమైపోయింది. కావున ఎప్పుడూ భూతంగా అవ్వరాదు. అనగా కోపగించుకోరాదు. ఏమి జరిగినా కోపగించుకోరాదు.

ఎవరైనా బిగ్గరగా మాట్లాడితే, మమ్మా వారికి ప్రేమతో అర్థం చేయించేవారు - చూడండి, మీరు ఆశ్రమములో ఉంటున్నారు. బిగ్గరగా మాట్లాడరాదు, చాలా నెమ్మదిగా మాట్లాడాలి, శాంతిగా మాట్లాడాలి, చాలా తక్కువగా మాట్లాడాలి, మధురంగా మాట్లాడాలి. ఎవరైనా ఏదైనా పెద్ద తప్పు చేసినా, వారికిలా చెప్పేవారు - "ఇలా రా, ఇది బాగుందా?" తప్పు చేసినవారు అది బాగుందని ఎలా చెప్పగలరు. కావున మమ్మా అనేవారు - ఇక ముందు గమనముంచుకుని రెండవసారి ఇటువంటి తప్పు జరగనీయరాదు. ఇలా చెప్పేవారే కాని ఎప్పుడూ కూడా ఈ తప్పు ఎందుకు

చేశావు? అని ప్రశ్నించేవారు కాదు. జరిగిపోయిందేదో జరిగిపోయింది. కాని వారికి ప్రేమతో సరిదిద్దుకునే శక్తి, యుక్తిని ప్రసాదించేవారు. ఈ విధంగా ప్రేమతో సూచనలనిచ్చి ఆ వ్యక్తి హృదయాన్ని పరివర్తన చేసేవారు.

నాకు సాక్షాత్కారమయ్యేది కాదు. కాని నేను ఎప్పుడు మమ్మాను చూచినా ఈమె లక్ష్మిగానే అవుతుంది. ఈమె సత్యయుగములో మహారాణి అని అనిపించేది. నేను సేవ చేసేదానిని కాదు. రాణి వలె ఉండేదానిని. మమ్మా మందహాసముతో - "అమ్మాయీ! నీవు వెళ్ళి వారికి జ్ఞానాన్ని అర్థం చేయించు. సేవ చేస్తే ఫలితము లభిస్తుంది. వెళ్ళి వారికి బాబా జ్ఞానాన్ని వినిపించు" అని చెప్పేవారు. ఈ విధంగా జ్ఞానము అర్థం చేయించడం నేర్పించారు, సేవ చేయడం మమ్మా నాకు నేర్పించారు.

## మమ్మానే యజ్ఞమాతగా ఎందుకు అయినారు ?


మమ్మా చాలా గుణవంతురాలు. గుప్త తపస్వినిగా ఉండేవారు. చూచేందుకు సాధారణంగా ఉండేవారు కాని ఆమె గుణాల గనిగా ఉండేవారు. మేము జీవితములో మమ్మా మూడ్ ఆఫ్ అవ్వడం ఎప్పుడూ చూడలేదు. బాబాగారి ప్రతి వాక్యాన్ని వెంటనే సంపూర్ణంగా పాలన చేస్తూ ఉండేవారు. మమ్మాలోని పాలన శక్తి అద్భుతమైనది. నేను మమ్మాను **"అమ్మా మమ్మా"** అని పిలిచేదానిని. లౌకిక తల్లిని " **యశోదమ్మా!** " అని పిలిచేదానిని. ఇంత పాలనా శక్తి, ప్రేమ శక్తి మమ్మాలో ఉండేది. నేను చిన్నతనము నుండి చాలా మురిపెంగా, ప్రేమతో పెంచబడ్డాను. నా వ్యక్తిగతమైన పనులు చేసుకోవడమే నాకు వచ్చేది కాదు. తల దువ్వుకోవడం కూడా వచ్చేది కాదు. నేను మహారాణి వలె ఉండేదానిని. అన్ని పనులు చేసేందుకు ఇంటిలో నౌకర్లుండేవారు. కాని నాకు మమ్మా అన్ని పనులు నేర్పించారు. కారు డ్రైవింగు, జ్ఞానాన్ని అర్థము చేయించడం, పాత్రలు తోమడం మొదలైన అన్ని పనులు నేర్పించారు. దానికి ఆధారము మమ్మా స్నేహ శక్తి, పాలనా శక్తి, ఈ శ్రేష్ఠ సంస్కారము, మధుర స్వభావము మరియు దైవీ గుణాలే మమ్మాను యజ్ఞమాతగా చేశాయి. మనము మమ్మా, బాబా హృదయ



సింహాసనాధికారులుగా ఎలా అవ్వాలి? మొదటిది ఎలాంటి తప్పు చేయకండి. కామము, క్రోధము,.......... మొదలైనవి ఎంతమాత్రము కూడా ఉండరాదు. దేహాభిమానము ఉండరాదు, నిరంతరము అశరీరి స్థితిలో ఉండండి. బాబాను హృదయపూర్వకంగా స్మృతి చేయండి, సేవ చేయండి. అప్పుడు మమ్మా-బాబాల హృదయ సింహాసనాధికారులుగా అవుతారు.

## మమ్మా తరఫున బ్రాహ్మణ పరివారానికి సందేశము

మమ్మా వైపు నుండి బ్రాహ్మణ పరివారానికి నా సందేశము ఏమంటే మమ్మా క్రోధము ఒక మహాభూతము అని చెప్పేవారు. కనుక బాబా పిల్లలారా! ఏమి జరిగినా కోపపడరాదు. ఒకవేళ ఏ నష్టము జరిగినా, వారికి ప్రేమగా అర్థం చేయించండి.



# శక్తి స్వరూపిణి మరియు సిద్ధి స్వరూపిణి మాతేశ్వరి

బ్రహ్మాకుమారి దాదీ చంద్రమణిగారు* తమ అనుభవాన్ని వినిపిస్తున్నారు. నేను కుంజ భవనములో మమ్మాకు సహయోగి(అసిస్టెంట్)గా ఉండేదానిని. అందువలన నాకు మమ్మా జతలో తోడుగా ఉండి వారి నుండి నేర్చుకునే అవకాశము చాలా లభించింది. మమ్మాలోని ప్రతి గుణము నాకు చాలా మంచిగా అనిపించేది, మమ్మా సత్యమైన యోగినిగా ఉండేవారు. ఎప్పుడూ వ్యర్థ మాటలలో, వ్యర్థ కర్మలలో సమయము వృథా చేయడం మేము మమ్మాలో ఎప్పుడూ చూడలేదు. ప్రతి వారిలోని గుణాలు చూడడం, అవగుణాలను చూడకుండా ఉండడం, వర్ణన చేయకుండా ఉండడం, ఇతరులకు జ్ఞానాన్ని అర్థం చేయించడం, శిక్షణనిచ్చి ఇతరుల జీవితాలను తయారు చేయడం, కన్యలను నిర్భయులుగా, శక్తి స్వరూపులుగా, సింహాలుగా తయారు చేయడం, బాబాకు సమర్పితము చేయడం - మొదలైన విశేషతలన్నీ నేను మమ్మా నుండి నేర్చుకున్నాను. ఈ విధంగా ప్రతి సోదర - సోదరీలలోని(చిన్నవారు గాని, పెద్దవారు గాని) గుణాలను ప్రేమించడం నేను మమ్మా నుండే నేర్చుకున్నాను.

## మమ్మాలోని విశేషతలు

మమ్మా అర్థం చేయించే విధానము సదా బేహద్‌గా ఉండేది. వారి భావము సదా అనాది, ఆదిగా ఉండేది. ప్రతి విషయంలో ప్రతి వ్యక్తిని వారు బేహద్ రూపములో చూచేవారు. మమ్మా ఇన్ని దైవీగుణాలను ధారణ చేయడం ద్వారానే ఈ బేహద్ దృష్టి, వృత్తి(భావన) ఉండేదని నేను భావిస్తున్నాను. మమ్మా చాలా నిర్భయంగా ఉండేవారు. ఎప్పుడూ ఎవ్వరికీ భయపడేవారు కాదు. శక్తి స్వరూపంగా, సదా యోగనిష్ఠలో ఉండేవారు. కర్మేంద్రియాలు సదా వారి అధీనములో ఉండేవి. వారు అందరికీ మాతృ ప్రేమను చవి చూపించేవారు. వయసులో చిన్నదైనా, పెద్ద వయసు వారు కూడా వారిని మమ్మా అని పిలిచేవారు. చివరికి వారి లౌకిక తల్లి కూడా వారిని మమ్మా అనే పిలిచేవారు. ఇందుకు కారణము మమ్మానే భవిష్యత్తులో శ్రీ లక్ష్మిగా తయారౌతుందని నేను భావిస్తున్నాను. మమ్మా ఓంమండలికి వస్తూనే బాబా వారిని గుర్తించారు.

* బ్రహ్మాకుమారి చంద్రమణి దాదీగారు ఈ అవినాశి రుద్ర గీతా జ్ఞాన యజ్ఞంలో ఒక ఆదిరత్నము. వారు పంజాబు, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మొదలైన ప్రాంతాలలో సేవాకేంద్రాల సంచాలికగా ఉండేవారు. 12-03-1997 తేదీన వారు తన నశ్వర దేహాన్ని త్యాగము చేశారు.





(ఎడమ నుండి కుడికి) మాతేశ్వరీగారి జతలో ధ్యానీ దాదీ, అచల్ బహన్, కమల సుందరీ దాదీ, చంద్రమణి దాదీ మరియు ఇతరులు.

## మమ్మా తన భవిష్య లక్ష్యము, లక్షణాలలో లవలీనమై ఉండేవారు

చాలాసార్లు మమ్మాను మేము మీరు ఏమి ఆలోచిస్తున్నారు? ఎక్కడున్నారు? అని అడిగేవారము. అప్పుడు మమ్మా "నేను ఇక్కడ నడవడం లేదు, నేను వైకుంఠ భూమిలో నడుస్తున్నాను" అని చెప్పేవారు. అప్పుడప్పుడు - నేను మహారాణి శ్రీలక్ష్మి రూపములో ఇలా అనుభవము చేశాను. మహారాజకుమారి శ్రీ రాధా రూపములో ఈ ఈ అనుభవాలు అయ్యాయి అని మాకు వినిపించేవారు. తన భవిష్యత్తు పై, బాబా మహావాక్యాల పై మమ్మాకు నూటికి నూరు శాతము నిశ్చయముండేది. బాబా చెప్పిన వెంటనే వారు ఒప్పుకొని అలాగే నడుచుకొని చూపించారు. మమ్మాగారి ప్రతి మాట శక్తిశాలిగా ఉండేది. యోగములో, జ్ఞానములో, ధారణలో మరియు సేవలో మమ్మాకు ఎవరి పట్ల ఆకర్షణ గాని, ఎవరి పట్లా ఏహ్య భావము గాని ఉండేది కాదు. మమ్మా అందరినీ తనవారిగా చేసుకున్నారు, వారు అందరివారుగా అయ్యారు. ఈ విధంగా మమ్మా శక్తిశాలిగా తల్లిగా, అసాధారణ సిద్ధి స్వరూపంగా ఉండేవారు.

# మాతేశ్వరీ గారు గాన విశారద, సంగీత శారద

బ్రహ్మాకుమారి *మనోహర్ ఇంద్రగారు మమ్మాను గురించి వినిపిస్తూ ఇలా అంటున్నారు - నాకు ఎంతటి సౌభాగ్యమంటే - బాబా గారి ఇల్లే కాక మమ్మా గారి ఇల్లు కూడా మా ఇంటి దగ్గరే ఉండేది. లౌకికములో కూడా బాబా ఇంటికి మేము పోతూ, వస్తూ ఉండేవారము. మొట్టమొదట మమ్మా సత్సంగానికి వచ్చినప్పుడు వారు బాబాను చూశారు. బాబా వారిని చూచినప్పుడు ఏమి అనుభవము అయ్యి ఉంటుంది? వీరే నా సత్యమైన అలౌకిక పిత అని మమ్మాకు అనిపించింది. నా వారసురాలు ఈ పుత్రికేనని బాబాకు అనిపించింది. ఈ బిడ్డనే నా స్థూల, సూక్ష్మ ఖజానాలకు అధికారి పుత్రిక అనిపించింది. ఆ రోజు నుండి మమ్మా జ్ఞానములో ముందుకు సాగుతూ వెళ్లారు. మమ్మా రూపము కూడా మారిపోతూ వచ్చింది. ఆచార విచారాలన్నీ పరివర్తనౌతూ వచ్చాయి. వేష భూషణాలు కూడా మారిపోయాయి. జ్ఞానములో లోతుకు వెళ్లడం, యోగములో అభిరుచి పెరగసాగింది. మమ్మా పాటలు పాడడంలో చాలా నేర్పరి. లౌకికములో ఎవరిలోనైనా ఏదైనా కళ ఉంటే, ఆ కళ అలౌకికములోకి వస్తూనే వృద్ధి చెందుతుంది. అందువలన అది ఆ వ్యక్తిని ముందుకు తీసుకెళ్తుంది. మమ్మా హార్మోనియం, సితార పై కూడా చాలా మంచి పాటలు పాడేవారు. ఒకసారి మమ్మా స్వయం తన అనుభవాన్ని ఒక పాటగా తయారు చేసి పాడారు. ఎంత బాగా పాడారంటే, ఎంత బాగా పాడారంటే వినేవారందరూ చాలా సంతోషించారు. ఆ పాట మమ్మాయే స్వయంగా సింధీలో వ్రాశారు. హిందీలో దాని అర్థము ఇలా ఉంది -

" ఓ సఖులారా, నేను మీకు ఎలా చెప్పేది, ఏమని చెప్పేది,
నేను ఓం మండలిలోనికి వెళ్ళి ఏమి చూశాను!
సఖియలారా, ఆ సుఖాన్ని నేనేమని వర్ణింతును?
అచ్చట అలౌకిక ఓం ఆలాపము జరుగుతూ ఉండినది.

*దాదీ మనోహర ఇంద్రగారు యజ్ఞములోని ఆదిరత్నాలలో ఒకరు. యజ్ఞ స్థాపన సమయం నుండే బాబా మమ్మాల జతలో ఉన్నారు. యజ్ఞచరిత్రను కళ్లకు కట్టినట్లు వర్ణించి చెప్పేవారు. వీరు 17-11-2008 తేదీన అవ్యక్త వతన వాసిగా అయ్యారు.





(ఎడమ నుండి కుడి) మాతేశ్వరీగారి జతలో ఆత్మమోహినీ దాదీ

అది నా మనస్సులో ఒక బాణము వలె తగిలి నా మనస్సు శీతలమైపోయింది.
నాలోని దు:ఖపు చిట్టాలన్నీ అంతమైపోయాయి!

దాని తర్వాత బాబా ప్రతి రోజు ఒక పాట తయారు చేసి ఇచ్చేవారు.

మమ్మా దానికి రాగము కట్టి సత్సంగములో పాడి వినిపించేవారు. గీతా జ్ఞానము, మమ్మాగారి పాటల మధురత ద్వారా ఆకర్షితులై రోజురోజుకు సత్సంగములో వచ్చేవారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. అందులో మాతలు, కన్యల సంఖ్య ఎక్కువగా ఉండేది. అదే సమయములో దివ్యదృష్టి దాత బాబా దివ్యదృష్టి భండారాన్ని కూడా తెరిచారు. ఓంధ్వని వింటూనే చాలామంది మాతలు, కన్యలు ధ్యానములోకి వెళ్ళిపోయేవారు. వారు ధ్యానములో అనేక విధాలైన దివ్యదృశ్యాలను చూచేవారు. మాతలకు స్వర్గము, కృష్ణుని జతలో ఆటపాటల సాక్షాత్కారము అవుతూ ఉండేది. కనులు మూసుకొని ఉండేవారు, కాని కృష్ణుని చూస్తూ ఉండేవారు. శ్రీ కృష్ణుడు పోతూ ఉంటే వీరు వారి వెనుక వెళ్ళే అనుభవము చేసేవారు. ఈ మాతలు నాలో శ్రీ కృష్ణుని చూస్తున్నారని, కావున వారు నన్ను పట్టుకునేందుకు వస్తున్నారని బాబాకు తెలిసింది. కనుక బాబా తాపలు ఎక్కి తన గదిలోకి పోయేవారు. ఈ మాతలు కనులు మూసుకుని ఉన్నా బాబా వెనుక అనగా శ్రీ కృష్ణుని వెనుక తాపలు ఎక్కిపోయేవారు, పరుగులెత్తేవారు. దాదా లేఖ్‌రాజ్ సత్సంగములో శ్రీ కృష్ణుడు సాక్షాత్కారమవుతున్నాడనే మాట వ్యాపించింది. చాలామంది రావడం ప్రారంభించారు. సత్సంగము చాలా వృద్ధి చెందుతూ పోయింది. సత్సంగము పెరిగే కొలది మమ్మా బాధ్యతలు కూడా చాలా పెరుగుతూ పోయాయి.

మమ్మా లౌకిక పేరు రాధ. ఆమె సత్సంగములో ఓంధ్వని చేసేవారు కావున బాబా ఆమె పేరును "ఓం రాధ" గా ఉంచారు, ఎవరైనా మాత లేక కన్యను మీరెక్కడకు వెళ్తున్నారు అని అడిగితే ఓం రాధ వద్దకు వెళ్తున్నామని చెప్పేవారు. ఎందుకు పోతున్నారు? వారు మాకు ఓంకార ధ్వని చేయడం నేర్పిస్తున్నారు. దాని అర్థము తెలిపి అందులో ఏకాగ్రమవ్వడం కూడా నేర్పిస్తారు. అందువలన మేము ఓంరాధ వద్దకు వెళ్తున్నామని చెప్పేవారు.

తన బంగళాను, సత్సంగ బాధ్యతలన్నీ ఓంరాధకు అప్పగించి బాబా తన పరివారముతో కాశ్మీరుకు వెళ్ళిపోయారు. మమ్మా సత్సంగములోకి



ఎప్పుడు వచ్చినా, సత్సంగము చేసిన తర్వాత అచ్చట ఏదో ఒక సేవ చేసి తన లౌకిక ఇంటికి వెళ్ళిపోయేవారు. అక్కడ ఎప్పుడూ ప్రసాదము కాని, భోజనము కాని తీసుకునేవారు కాదు. అలా చేస్తే కర్మల రెక్కాచారము తయారవుతుందని మమ్మా భావించేవారు. సేవ చేయకుండా లేక తక్కువ సేవ చేసి యజ్ఞ భోజనము లేక ప్రసాదము తింటే మన పై భారము పెరుగుతుందని భావించేవారు. మన పని సేవ చేయడం కాని సత్సంగానికి వచ్చి తినడం, తాగడం కాదు. ఈ విషయము బాబాకు తెలిసినప్పుడు కాశ్మీరు నుండి బాబా, మమ్మాకు ఒక జాబు వ్రాశారు......... బిడ్డా! నీవు అచ్చట ఉండడమే చాలా పెద్ద సేవ. నీవు అచ్చట ఉండడం వలన చాలా మందికి సేవ జరుగుతుంది. నీవు అక్కడే ఉంటూ అక్కడే తింటూ - త్రాగుతూ ఉండాలి. అప్పటి నుండి బాబా అజ్ఞానుసారము మమ్మా అచ్చటనే భుజించడం ప్రారంభించారు. లేకుంటే మమ్మా ఉదయమే వచ్చి సత్సంగము చేసి, సేవ చేసి పగలు తన ఇంటికి వెళ్ళిపోయేవారు. అదే విధంగా సాయంకాలము వచ్చి మళ్ళీ రాత్రికి వెళ్ళిపోయేవారు. మమ్మా యజ్ఞములో ఉండడం ప్రారంభమైనప్పటి నుండి వారిలో చాలా పరివర్తన జరగడం ప్రారంభమయ్యింది.

బాబా కాశ్మీరు నుండి మమ్మా పేరుతో, కుమార్కా దాది పేరుతో, చంద్రమణి దాది పేరుతో ఉత్తరాలు పంపేవారు. ఇవి జ్ఞాన పత్రాలు. చదివి, ధారణ చేసి సత్సంగములో వినిపించండి అని వ్రాసేవారు. పత్రములో బాబా వ్రాసినట్లే మమ్మా చేసేవారు. కాని కొంతమంది అక్కయ్యలు భయపడేవారు. అప్పుడు మమ్మా వారిలో ధైర్యము, సాహసము నింపి జ్ఞానము వినిపించడం నేర్పించేవారు. చిన్న చిన్న కన్యలు సుమారు 16, 17, 18 సంవత్సరాల వయసు గలవారు బాబా నుండి వచ్చిన జ్ఞాన పత్రాలను చదివి వినిపించేవారు. ఇంత చిన్న-చిన్న కన్యలు ఇంత గొప్ప జ్ఞానాన్ని ఎలా వినిపిస్తున్నారని అందరికీ ఆశ్చర్యము కలిగేది. నెమ్మది నెమ్మదిగా మమ్మాలో ఆత్మిక శక్తి నిండుతూ వచ్చింది. మమ్మా గద్దె పై కూర్చుని లేక నిలబడి

ఎవరికి దృష్టి ఇచ్చినా, వారికి అప్పుడప్పుడు శ్రీ రాధ, అప్పుడప్పుడు శ్రీలక్ష్మి సాక్షాత్కారమయ్యేవారు. సర్వశక్తివంతుడైన బాబా బ్రహ్మా ద్వారా ఎలాగైతే శ్రీ కృష్ణుని సాక్షాత్కారము చేయించి, అందరికీ ఈ బ్రహ్మాబాబానే భవిష్యత్తులో శ్రీ కృష్ణుడు లేక శ్రీ నారాయణుడుగా అవుతాడని స్పష్టము చేయించేవారో, అదే విధంగా "ఓం రాధ" ద్వారా అందరికీ శ్రీ రాధ, శ్రీ లక్ష్మిల సాక్షాత్కారము చేయించి ఈమె భవిష్యత్తులో శ్రీ రాధ లేక శ్రీ లక్ష్మిగా తయారవుతుందని స్పష్టము చేయించారు. పోను పోను మమ్మాలో పాలన చేసే గుణము ప్రకటితమౌతూ పోయింది.

సింధ్‌లో వ్యాపారము కొరకు వ్యాపారస్థులందరూ విదేశాలకు వెళ్ళేవారు. పురుషులు విదేశాలకు వెళ్ళినప్పుడు మాతలు ఇంటిలో ఒంటరిగా ఉండేవారు. వారంతా సత్సంగానికి రావడం ప్రారంభించారు. సత్సంగములోకి వస్తూ వారు జ్ఞానాన్ని ధారణ చేయడం కూడా ప్రారంభించారు. వారి హావభావాలన్నీ మారుతూ వచ్చాయి. జీవితము సాధారణంగా, సరళంగా తయారౌతూ వచ్చింది. వారు ధరించిన నగలన్నీ త్యజించి సాధారణ రూపములో ఉండడం ప్రారంభించారు. వారి భర్తలు వాపస్ వచ్చినప్పుడు వీరిని చూచి వీరికేమయ్యిందని వారు ఆశ్చర్యచకితులయ్యారు. వారు వికారాలకు ఒప్పుకోవడం లేదు. శాంతిగా, ప్రత్యేకంగా ఉండినారు. నగలు ధరించడం మానేశారు. కావున వారు వారి స్త్రీలను కొట్టి బాధించడం ప్రారంభించారు. అప్పుడు మమ్మా బంధనములో ఉన్న ఆ మాతలను జ్ఞానము ద్వారా, మధురమైన వచనాల ద్వారా పాలన ఇచ్చి వారి ధైర్యాన్ని, శక్తిని వృద్ధి చేశారు. నెమ్మది నెమ్మదిగా వారు తమలో ఆత్మికశక్తిని నింపుకొని విఘ్నాలను ఎదుర్కొనేందుకు లేక సహించేందుకు తయారైపోయారు. ఈ విధంగా చేస్తూ చేస్తూ మమ్మాగారి పాలనా పాత్ర అత్యంత ఉన్నత శిఖరానికి చేరిపోయింది. అప్పుడు బాబా 8 మంది మాతలు, కన్యలతో ఒక కమిటీని తయారుచేసి స్థిర చరాస్థులన్నింటిని ఆ కమిటీకి సమర్పించారు. ఈ కమిటీలో మమ్మాది



మొదటి నెంబరు. సింధ్‌లో ఉండేటప్పుడు సత్సంగానికి వచ్చువారు పవిత్రంగా ఉన్న కారణంగా చాలా హంగామాలు(గొడవలు) జరిగాయి. అప్పుడు సత్సంగానికి వచ్చు కన్యలు - మాతలందరికీ మమ్మా పేరు పై వారి ఇంటి నుండి అనుమతి పత్రాలను తీసుకు రమ్మని తెలిపారు. ఆ స్వీకార పత్రములో నేను......... అయిన నా కుమార్తెను ఓంమండలి మాత లేక ఓంరాధ మాత వద్దకు జ్ఞానామృతము త్రాగి ఇతరులకు త్రాపించేందుకు సంతోషంగా ఒప్పుకుంటున్నాను, అనుమతి ఇస్తున్నాను............" ఈ విధంగా మమ్మా కన్యలకు - మాతలకు శక్తి నింపే ఉమంగ-ఉత్సాహాలను పెంచే సాక్షాత్ దుర్గామాతగా ఉండేవారు.

తర్వాత బాబా కాశ్మీరు నుండి వచ్చినప్పుడు సర్వశక్తివంతుడైన బాబా బ్రహ్మా శరీరము ద్వారా జ్ఞానములోని నిగూఢ రహస్యాలను తెలుపుతూ మురళిని వినిపిస్తూ ఈ బ్రహ్మానే సమస్త మానవ కులానికి పితామహుడని స్పష్టము చేస్తూ పోయారు. వీరే భవిష్యత్తులో శ్రీ కృష్ణుడు లేక శ్రీ నారాయణునిగా అవుతాడని, ఈ ఓం రాధయే జగదంబ సరస్వతి. బ్రహ్మాకు కుమార్తె అని ఈమె భవిష్యత్తులో శ్రీ రాధ లేక శ్రీ అనూరాధ(లక్ష్మి)గా అవుతారని స్పష్టము చేశారు. అప్పటి నుండి మమ్మా అలవాట్లు మాటా-మంతి-ఆచార-విచార-వ్యవహారాలలో చాలా గంభీరత, చాలా శాలీనత (అణకువ, మర్యాదలు) రావడం ప్రారంభమయ్యాయి. మమ్మా త్వరత్వరగా నడవడం మేము ఎప్పుడూ చూడలేదు. వారు ఎప్పుడూ యోగయుక్తంగా, నెమ్మది నెమ్మదిగా నడిచేవారు. చాలా మందికి ఇంటిలో కూర్చునే మమ్మా బాబాలు, అప్పుడప్పుడు శ్రీ లక్ష్మీ నారాయణులు సాక్షాత్కారమవ్వసాగారు.

సత్సంగములోకి మగపిల్లలు కూడా రావడం ప్రారంభించారు. వారు ఉపన్యసిస్తూ జ్ఞానము వినిపిస్తూ ఉన్నప్పుడు వినేవారికి చాలా బాగుందనిపించేది. ఈ విధంగా సేవ చాలా బాగా జరగసాగింది. తర్వాత బాబా కరాచీలో పెద్ద పెద్ద బంగళాలు తీసుకొని అచ్చట "ఓం నివాస్" ను తెరిచారు. మేమంతా కరాచీలో ఉండడం ప్రారంభించాము. కరాచీలో

మమ్మాకు యజ్ఞమాత పాత్ర ప్రారంభమయ్యింది. ఈ భవనములో సుమారు 450 మంది సమర్పిత సోదరీ-సోదరులు ఉండేవారు. మాతలు, కన్యలు, కుమారులు వేరు వేరు బంగళాలలో ఉండేవారు. ఈ విధంగా నాలుగు వేరు వేరు భవనాలలో ఉండేందుకు ఏర్పాట్లు జరిగాయి. మమ్మా కన్యలతో పాటు ఉండేవారు. బాబా బంగళా వేరుగా ఉండేది. అమృతవేళ నుండి రాత్రి వరకు మా దినచర్య మమ్మా చేతిలో ఉండేది. అన్నీ ఏర్పాట్లు మమ్మా నిర్దేశములో సంపన్నమౌతూ ఉండేవి.

మమ్మా ప్రతి విషయములో చాలా ఖచ్ఛితంగా ఉండేవారు. వారి ప్రతి కార్యము మరియు వ్యవస్థ(ఏర్పాట్లు) నియమ ప్రమాణంగా నడిచేవి. మమ్మా ఏ సేవ కూడా మాకు చెప్పి పాఠము నేర్పించలేదు. అందరికంటే ముందు ఆమె చేసి నేర్పించారు. ఉదాహరణానికి ధాన్యము శుభ్రపరచడం, కూరగాయలు తరగడం మొదలైన సేవలలో అందరికంటే ముందు మమ్మా వచ్చి కూర్చునేవారు. తర్వాత మిగిలినవారంతా తమంతట తామే వచ్చేవారు. అంతేకాని ప్రతి ఒక్కరిని మీరు రండి! - మీరు రండి! అని పిలిచేవారు కాదు. మమ్మా చెప్పి చేయించేది చాలా తక్కువగా ఉండేది. కర్మలు స్వయం ఆచరించి చేయించేవారు. స్వయంగా చేసి అందరికీ నేర్పించేవారు. యజ్ఞము అంటే ఏమిటి? యజ్ఞ ప్రసాదము యొక్క మహత్వము ఏమిటి? బాబా ఎవరు? బాబా ఎంత గొప్పవారు? వారినెలా గౌరవించాలి? ఈ ఆచరణలన్నీ నియమానుసారము మమ్మా స్వయం ప్రాక్టికల్‌గా చేసి చూపించి అందరికీ నేర్పించారు. బాబాగారి ప్రతి ఆదేశాన్ని, ఆజ్ఞను మమ్మా ఎప్పుడూ సాధారణంగా భావించలేదు. వారు బాబా ఆజ్ఞలను ఈశ్వరుని ఆజ్ఞలుగా, సర్వశక్తివంతుడైన బాబా ఆదేశాలుగా భావించేవారు.

బాబాను గురించి మమ్మాకు ఎప్పుడూ అంశమాత్రము కూడా సంశయము రాలేదు. సాకారబాబాలో సదా నిరాకార బాబానే చూచారు. బాబా ఏమి చెప్పినా, దానిని మమ్మా చేసే చూపించారు. జగదంబ తల్లి ఇంత ఆజ్ఞాకారిగా, నమ్మకస్థురాలిగా ఉండినారు. బాబా ప్రతి సంకల్పము



వరకు మమ్మాకు చాలా ప్రియమనిపించేది. మమ్మాకు ఆపరేషన్ చేయించే తీరాలి. ఆపరేషన్ లేకుండా ఈ జబ్బు నయము కాదని డాక్టరు చెప్పినప్పుడు బాబా ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. తర్వాత ఆపరేషన్ చేయించేందుకు బాబాకు ప్రేరణ రాలేదని చెప్పారు. ఆ మాటకు కూడా మమ్మా సంతోషంగా, తృప్తిగా ఉండినారు. డాక్టరు ఆపరేషన్ చేసుకోమని చెప్పినారు కదా, చేయించుకుంటే బాగుంటుందని ఎప్పుడూ అనుకోలేదు. బాబాకు ఏది ఇష్టమో, నాకు కూడా అదే ఇష్టమని భావించారు. మమ్మా ఇంత విశ్వాసము గలవారు! మమ్మా ఏది జరుగుతున్నా జరిపించేవారు జరిపిస్తున్నారు అని అనేవారు(హుకమీ హుకమ్ చలాయే). ప్రభువైన బాబా ఎలా అనుకుంటారో, అలాగే ఆజ్ఞను ఇవ్వనీ, ఎలా కావాలంటే అలా చేయనీ, ఇదంతా వారిదే, నాది అంటూ ఏమీ లేదు. బాబా చెప్పిన వెంటనే మమ్మా హృదయ పూర్వకంగా దానిని స్వీకరించారు. ఎలాంటి ప్రశ్న గాని, సంశయము గాని రాలేదు. మరొక దానిని గురించి ఆలోచించనే లేదు. బాబా పై ఇంతటి నిశ్చయము, విశ్వాసముండేది. బాబా కూడా మమ్మాకు అంతే గౌరవమిచ్చేవారు. యజ్ఞములో ఏ విషయము వచ్చినా ఏదైనా చేయవలసి వచ్చినా పిల్లలకు బాబా - "మమ్మా ప్రేరణ ఎలా ఉందో, అడిగి రండి. మమ్మా సలహా ఇచ్చిన తర్వాత నేను సలహా ఇస్తాను ఎందుకంటే మమ్మా యజ్ఞమాత " అని చెప్పేవారు. ఈ విధంగా మమ్మాను అడగకుండా బాబా ఏ పని కూడా చేసేవారు కాదు.

ఇంట్లో ఉండే తల్లికి తన పిల్లల విషయాలన్నిటి పై ఎలా గమనముంటుందో, అదే విధంగా మమ్మా యజ్ఞములో పిల్లల క్రియా కలాపాలు వారి శారీరిక, మానసిక మరియు పారివారిక, ఆధ్యాత్మిక జీవన ప్రగతి కొరకు ప్రతి విషయంలో వీలైనంత గమనమిచ్చేవారు. సమస్యలను సమాధాన పరిచేవారు. అత్యంత ప్రేమతో పోషణ చేసేవారు. యజ్ఞములోని పిల్లలందరి హృదయాలను చూరగొనేవారు. అన్ని పనులు చేస్తున్నా జ్ఞానములో చాలా లోతుకు వెళ్ళి జ్ఞాన రహస్యాలను వినిపిస్తున్నా ఎప్పుడూ

ఇది మమ్మా విశేషత అని వినేవారికి అనుభవము అవ్వనిచ్చేవారు కాదు. సదా శివబాబా పైన గమనమిప్పించేవారు. అందరి గమనము ఒక్క బాబా పైనే ఆకర్షింపచేసేవారు. మమ్మా పిల్లల శారీరిక పోషణ, ఆత్మిక పాలన రెండూ చేసేవారు. ఈ విధంగా మమ్మా పేరు 'యజ్ఞమాత జగదంబ సరస్వతి' అని స్థిరపడింది.

బాబా ముందు చిరునవ్వుతో తల వంచి ఒకే మాట అనేవారు - "అలాగే బాబా" లేక "సరే బాబా" ఇతర ఏ శబ్ధాలు పలికేవారు కాదు. బాబా మమ్మాను మమ్మా! లేక పుత్రీ(బచ్చీ)! అని పిలిచేవారు. యజ్ఞములో సదా ఒక అలవాటు ఉండేది - బాబా, మురళికి 10 నిమిషాలు ముందు క్లాసులో మమ్మా జ్ఞాన వీణ వాయించేవారు. తర్వాత బాబా వచ్చి జ్ఞాన మురళి వినిపించేవారు.

జ్ఞానదేవి, విద్యాదేవిగా ఉండినా, మమ్మాకు చదువు పై ఎంత ప్రేమ అంటే - పగలు మూడు మూడుసార్లు మురళి చదివేవారు. ఎన్ని మార్లు మురళిని చదివితే, అంత కొత్త కొత్త జ్ఞాన ఖజానా లభిస్తుందని మమ్మా అనేవారు.

మమ్మా విశేష ధారణ - "అంతర్ముఖత." మమ్మా అందరితో ఉంటున్నా, తనలో తాను ఒంటరిగా ఉండేవారు. మమ్మా మనసులో సర్వ శక్తివంతుడైన తండ్రితో వార్తాలాపము చేస్తూ ఉండేవారు. మమ్మా అమృతవేళలో 2 గంటలకే నిద్ర లేచి తన గదిలో కుర్చీలో కూర్చుని ఏకాంతములో బాబాను స్మృతి చేసేవారు. పగలు కర్మ చేసే సమయములో కూడా బాబా జ్ఞాన మనన చింతనలో నిమగ్నమై ఉండేవారు. మమ్మా ఎప్పుడూ నవ్వులాటలలో, వ్యర్థ మాటలు మాట్లాడి తమ సమయాన్ని వ్యర్థంగా పోగొట్టుకోలేదు. మమ్మా ఎవరి ధ్యాసను తన వైపు ఆకర్షితమవ్వనిచ్చేవారు కాదు. సదా ఆ తల్లి - తండ్రి వైపే గమనమిప్పించేవారు. మమ్మాలో ఎంత మధురత ఉండేదో, అంతే నిర్భయత కూడా ఉండేది. మమ్మా అనేవారు - జీవితములో ఏ భగవంతునికైతే భయపడాలో వారే మనవారిగా




అయిపోయారు, ఇంకెవరికి భయపడాలి? పాపకర్మలు చేయువారు భయపడ్తారు. మనము శ్రేష్ఠ కర్మలు, సత్కర్మలు చేసేవారము, ఈశ్వరుని మతము పై నడిచేవారము కావున మనమెందుకు భయపడాలి ? తినడం - తాగడంలో కూడా మమ్మాకు ఎలాంటి ఆసక్తి ఉండేది కాదు. వారు ఎప్పుడూ యజ్ఞ ప్రసాదాన్ని గ్లాని లేక విమర్శ చేయలేదు. ఏమి లభించినా, ఎలా లభించినా, ఎంత లభించినా దానిని ఆదరముతో, అనాసక్త భావముతో స్వీకరించారు. చివర్లో నేను ఒకే మాట చెప్తున్నాను - మమ్మా గుణాల ఖజానా(గని). 16 కళా సంపన్నము, సర్వగుణ సంపన్నంగా, మర్యాదా కులోత్తములుగా ఉండేవారు.



మాతేశ్వరీగారి జతలో దమయంతి బహన్, కాకుభాయి, నిర్మల శాంతా దాదీ, బృజేంద్ర దాదీ

# మాతేశ్వరి మా అందరి హృదయేశ్వరి

ఢిల్లీ నుండి బ్రహ్మాకుమారి దాది హృదయ మోహినిగారు (గుల్జార్‌దాది గారు ఢిల్లీ క్షేత్రపు సంచాలకులు) ఇలా అంటున్నారు - మధురమైన మమ్మా ఎవరినైతే మేము మాతేశ్వరి అని అనేవారమో, వారు మా అందరి హృదయేశ్వరి. మాతేశ్వరి గారికి నవ విశ్వాన్ని రచించుటలో గల నేర్పు, ప్రబంధన చాలా అద్భుతము మరియు అద్వితీయమైనది. మమ్మా ఇంతమంది కన్యలను ఎంత మాతృ స్వరూపములో పాలన ఇచ్చారో, అంతే వారిని పరివర్తన చేసే శైలిలో కూడా నైపుణ్యముండేది. ఎవరైనా ఒక కన్య ద్వారా తప్పు జరిగిపోయింది, ఆ కన్య మమ్మా సన్ముఖములోకి వచ్చేందుకు సందేహిస్తున్నది, ఆ సందేహానికి కారణము సిగ్గు అని గమనిస్తే మమ్మా ప్రేమ, వాత్సల్యమయ సంబోధన రూపములో జాగృతమయ్యేది. అటువంటి సమయములో యజ్ఞములోని పిల్లలను పిలిచి, వారి తప్పును తెలిపించేవారు. వారికి బలహీనత గడ్డిపోచ వలె అనిపించేది. వారు తప్పును ఒప్పుకొని సదా కొరకు దానిని సరి చేసుకొనేవారు. మనసు అనే దర్పణము స్వచ్ఛముగా అయిపోయేది.



మాతేశ్వరీగారి జతలో హృదయ మోహినీ దాదీగారు, ప్రకాశ్‌మణి దాదీ గారు, ముఖ్యమైన సోదరీ – సోదరులు





మాతేశ్వరీగారి ప్రవచనాలను రికార్డింగ్ చేస్తూ శీల్ ఇంద్రా దాదీగారు

అంతేకాదు, మమ్మా జ్ఞాన వివేచన చేసేవారు. అప్పుడు ఈమె మమ్మా కాదు, సాక్షాత్తు సరస్వతి దేవియే మాట్లాడుతూ ఉన్నారనిపించేది. ఒకసారి సికింద్రాబాదులో సమాజములోని కొంతమంది విరోధము చూపిస్తున్నారు. పితా శ్రీ బ్రహ్మ మమ్మాను అక్కడకు వెళ్లమని చెప్పారు. మమ్మా శ్రీ మతమును శిరసావహించి కనుల పై ఉంచుకొని అచ్చటకు వెళ్లారు. నేను కూడా మమ్మాతో పాటు సికింద్రాబాదుకు వెళ్లాను.

మమ్మా విరోధులతో కలిశారు. మమ్మాగారి మధుర సారగర్భితమైన మాటలు విని వారు కరిగిపోయారు. వారికి స్వయం సరస్వతి తల్లియే ప్రతిధ్వనించినట్లు అనిపించింది. సరస్వతి తల్లిగారి ఈ స్వరూపాన్ని చూచి వారు - "తల్లీ! మమ్ములను క్షమించాలి. మాకు మీ పరిచయము లేదు. మీ ముఖ కమలము ద్వారా విన్న జ్ఞాన వివేచన చాలా అద్భుతంగా ఉంది, చింతన యోగ్యమైనది. మేము వచ్చి నేర్చుకున్నా, నేర్చుకోలేకపోయినా మీరు వచ్చినందువలన మా అంతర్చక్షువులు తెరుచుకున్నాయి " అని అన్నారు. వారి మనసులో పరమాత్మ మాధ్యమమైన పితాశ్రీ పట్ల కూడా శ్రద్ధ ఉత్పన్నమయ్యింది.

# సద్భావనామూర్తి – మమ్మా

కాన్పూర్ నుండి బ్రహ్మాకుమారి దాది ఆత్మ ఇంద్రాగారు(గంగే దాదిగారు ఉత్తరప్రదేశ్ క్షేత్ర సంచాలకులుగా ఉంటూ శరీరాన్ని వదిలి బాబా ఒడిని చేరుకున్నారు) వ్రాస్తున్నారు - మమ్మా క్షమా గుణానికి ప్రతిరూపంగా ఉండేవారు. యజ్ఞ వ్యవస్థ సంబంధంగా ఎవరైనా ఆరోపణలు తీసుకొని వస్తే మమ్మా ఎదుటి వారికి అర్థం చేయించేవారు - మీ పట్ల వ్యక్తిగతంగా వారి హృదయములో ఏ భావమూ లేదు. మీ హృదయములో ఏదైనా భావము వారి పట్ల ఉంటే దానిని తీసేయండి. మమ్మా విరిగిపోయిన హృదయాలను జోడించేవారు. డ్రామా పై నిశ్చయము, తండ్రి పై నిశ్చయము, స్వయం పై నిశ్చయమున్న కారణంగానే మమ్మా నంబర్‌వన్‌గా అయ్యారు.

మమ్మా అర్జునుని వలె ఏకాగ్రంగా ఉండేవారు. నెంబర్‌వన్‌గా అయ్యేందుకు లక్ష్యముంచారు. మమ్మా పిల్లలైన మాకు సదా చెప్తూ ఉండేవారు - సదా విచారాలను ఉన్నతంగా ఉంచుకుంటే, తండ్రి సమానంగా అవుతారు. సదా తండ్రినే చూడండి. మీరు స్వయాన్ని చూసుకోండి - ఇతరులెవ్వరినీ చూడకండి. బాబా లేక డ్రామా పై నిశ్చయముంటే కర్మాతీతులుగా అవుతారు.



కాన్పూర్ – మాతేశ్వరీగారి జతలో కుంజ్ దాదీ, ప్రకాశ్ మణి దాదీ, మోహినీ బహన్, ఆత్మ ఇంద్రా దాదీ మరియు ఇతర సోదర – సోదరీలు

# మమ్మా నాలో తమ దివ్య శక్తులన్నీ నింపారు

బెంగళూరు నుండి *బ్రహ్మాకుమారి దాదీ హృదయపుష్పగారు మమ్మా జతలోని తన అనుభవాన్ని ఇలా తెలుపుచున్నారు - కరాచీలో ఒక రోజు నాకు చాలా ఎక్కువగా కడుపు నొప్పి ప్రారంభమయ్యింది. సుమారు 30 సార్లు బాత్‌రూమ్‌కు వెళ్ళవలసి వచ్చింది. దానిని గురించి నాకు ఏ చింతా లేదు. ఎందుకంటే జీవితము భగవంతుని చేతిలో ఉంది, నా రక్షకుడు భగవంతుడు, ఇక్కడ ఉండనివ్వనీ లేక తన వతనములోకి తీసుకెళ్ళనీ వారి ఇష్టము అని నాకు దృఢ నిశ్చయముండేది. తర్వాత నేను బాబా........... అంటూ తెలివి తప్పి పడిపోయాను. ఆ సమాచారము బాబా వద్దకు చేరిన వెంటనే బాబా వచ్చి నాకు దృష్టినిచ్చారు. కొద్ది సమయము తర్వాత నేను కనులు తెరచి బాబా - బాబా అని అనసాగాను. బాబా వెంటనే మమ్మాను పిలిచి ఈమెను మీరు సంభాళించండి అని చెప్పారు. మమ్మా వెంటనే “సరే బాబా” అని అన్నారు. బాబా 7 రోజులకు ప్రోగ్రామ్ పూర్తిగా ఇచ్చారు. ఏమి త్రాగించాలి, ఏమి తినిపించాలి అని వివరంగా తెలిపారు. బాబా మమ్మాతో - ఈ అమ్మాయికి రెండు రోజులు ప్రతి గంట మూడు మూడు స్పూన్లు నీరు మాత్రమే ఇవ్వాలి. తర్వాత 2 రోజులు ప్రతి గంటకు 3 స్పూన్లు నీరు, 3 స్పూన్లు పాలు ఇవ్వాలి. 5వ రోజు రెండు స్పూన్లు కిచిడి ఇవ్వాలి. మమ్మా అదే విధంగా చేశారు. నేను ఒక వారములో బాగైపోయాను అనగా ఔషధము మరియు ఆశీర్వాదము(దవా - దువా)లే నన్ను బాగు చేశాయని భావించాను. తర్వాత కూడా మమ్మా నాకు తన చేతులతో తినిపిస్తూ ఉంటే - నేను ఇలా అన్నాను - మమ్మా నేనిప్పుడు బాగున్నాను, నేను నా చేతులతోనే తింటాను. మమ్మా అన్నారు - ఇది బాబా ఆదేశము బాబా చెప్పినప్పుడే నీవు నీ చేతులతో తినవచ్చు. మరుసటి రోజు మమ్మా రాత్రి పది గంటలకు తన గదికి రమ్మన్నారు. నేను మమ్మా గదికి వెళ్ళాను. మమ్మా గద్దె పై కూర్చుని నన్ను ముందు కూర్చోబెట్టుకుని రాత్రి పది గంటల

*హృదయ పుష్పా దాదీగారు కూడా ఈ ఈశ్వరీయ యజ్ఞ ఆదిరత్నము. వీరు చంద్రమణి దాదీగారి అక్క. వీరు 1952 నుండి 1996 వరకు బెంగళూరులో ఉంటూ సమస్త దక్షిణ భారతదేశానికి ఈశ్వరీయ సేవలను అందించారు. వీరు 15 జూన్, 1996లో నశ్వర దేహమును త్యాగము చేశారు.


నుండి తెల్లవారుఝామున 4 గంటల వరకు దృష్టినిస్తూ యోగము చేయించారు. మమ్మా నాలో తన సర్వ దివ్యశక్తులను నింపారని నేను ఒక దివ్య ప్రకాశములో కూర్చున్నట్లు అనుభవమయింది. ఉదయం మమ్మా నాతో ఇప్పుడు నీ గదిలోకి వెళ్ళి నిదురపో అని చెప్పారు.

ఉదయము చాలామంది మమ్మా వద్దకు వెళ్ళి మమ్మాను - హృదయపుష్పా బెహన్ ఏం తపస్సు చేశారు? మీరు ఆమె పై ఇంత గమనముంచి ఆమె సేవ చేస్తున్నారు అని అడిగారు. అందుకు మమ్మా - మీరు వెళ్ళి ఆమె ఏమి చేసిందో, ఆమెనే అడగండి అని అన్నారు. అందరూ నా వద్దకు వచ్చి అడిగారు - నీవు ఏమి తపస్సు చేశావు మమ్మా విశేషంగా నీకు సేవ చేశారు? అందుకు నేను - "నాకు ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు, నా జీవితాన్ని వారికే అర్పించాను. ఎప్పటి నుండి బాబాకు జీవితమిచ్చానో అప్పటి నుండి ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ కనిపించరు. ఇదే నేను చేసిన తపస్సు" అని వారికి చెప్పాను.

మధువనము నుండి సేవకై సోదరులందరిని అన్ని వైపులకు పంపినప్పుడు నన్ను కూడా బెంగుళూరుకు పంపించారు. బెంగుళూరులో చాలా సంవత్సరాల వరకు సేవలో వృద్ధి జరగలేదు. అచ్చట రోజులు కూడా చాలా కష్టంగా గడిచేవి. చాలా సహించవలసి వచ్చింది. ఎందుకంటే ఈశ్వరీయ జ్ఞానము కొత్తదైనందున ఎవ్వరూ కూడా వినేందుకు ఇష్టపడలేదు. ఈ సమాచారము బాబాకు తెలిసినప్పుడు బాబా మమ్మాతో - నా బిడ్డ చాలా కష్టములో ఉంది. నీవు బెంగుళూరుకు వెళ్ళి ఆమెను నీ వెంట తీసుకొని రా! అని చెప్పారు.

మమ్మా మొట్టమొదటి సారిగా బెంగుళూరుకు వస్తున్నారనే సమాచారము నాకు తెలిసింది. నేను యోగములో కూర్చున్నాను. మాతేశ్వరి జగదంబ ఇక్కడకు వస్తోందని, కావున తప్పకుండా ప్రకృతి దాసిగా అయిపోతుందని నాకు అనుభవమయింది. ఎవరో నాకు కమర్షియల్ వీధికి వెళ్ళు అని చెప్పినట్లయింది. నేను యోగము నుండి లేచి కమర్షియల్ వీధి ఎక్కడ ఉందోనని ఆలోచిస్తూ ఉండినాను. నేను సెంటరు నుండి





బెంగళూరు - మాతేశ్వరీగారి జతలో హృదయ పుష్పాదాదీగారు

బయలుదేరాను, అడుగుతూ అడుగుతూ చివరికి కమర్షియల్ వీధికి చేరుకున్నాను. కాని కమర్షియల్ వీధిలో ఎవరిని కలవాలో తెలియదు. అప్పుడు మనస్సులో ఇంకా ముందుకు వెళ్ళమని శబ్ధము వినిపించింది. నేను ఇంకా ముందుకు వెళ్ళాను. కొంత దూరము పోతూనే ఒక పెద్ద సేఠ్ తన దుకాణములోకి పోతూ కనిపించాడు. నాలో మళ్ళీ - "ఈ దుకాణము యొక్క యజమానిని కలువు, ఇతను జగదంబ భక్తుడు" అనే శబ్ధము వినిపించింది. నేను ఆ దుకాణములోకి పోయినప్పుడు ఆ యజమాని - "అమ్మగారు మీకేమి కావాలి?" అని అడిగాడు. అప్పుడు నేను "మీకు జగదంబ తెలుసా?" అని అతనిని అడిగాను. అందుకు అతడు - "అవునవును నేను జగదంబ భక్తుడను" అని అన్నాడు. అప్పుడు నేనన్నాను - "ఆ జగదంబ ఇప్పుడు చైతన్యములో ఉన్నారు, వారు బెంగుళూరుకు వస్తున్నారు" అని చెప్పాను. ఆ మాట విని సేఠ్‌కు చాలా ఆశ్చర్యము కలిగింది. "మంచిది ఇది నా సౌభాగ్యము ఎందుకంటే నేను చైతన్యములో నా ఇష్టదేవతను కలిసి వరదానాలను తీసుకుంటాను, ఆశీర్వాదాలు

పొందుకుంటాను. నా జన్మ-జన్మాంతరాల కోరిక తీరుతుంది" అని అన్నాడు.

మళ్లీ సేఠ్ నాతో అన్నారు - " మీ మాటలు విని నాకు ఆ దృశ్యము కనిపిస్తోంది. నేను జగదంబతో కలుస్తున్నాను" అని అన్నాడు. అప్పుడు నేను ఆ సేఠ్‌తో - "జగదంబతో కలిసేందుకు చాలామంది ఆతురతతో ఉన్నారు" అని అన్నాను. అప్పుడు సేఠ్ - "అందుకు నేను ఏమి చేయాలో తెలపండి" అని నన్ను అడిగాడు. అందుకు నేను - "చాలామంది వారితో కలిసేందుకు వస్తారు. అందుకు ఒక పెద్ద హాలు కావాలి, వారు ఉండేందుకు ఒక పెద్ద బంగళా కూడా కావాలి" అని అన్నాను. అందుకు సేఠ్ అన్నారు - "మాతాజీ! ఒక ధర్మశాల మాది క్రొత్తగా తయారై ఉంది, కొద్ది రోజుల క్రితమే దానిని ప్రారంభించాము. అందులో వారు ఉండేందుకు కూడా ఏర్పాట్లు ఉన్నాయి, మీరు ఒకసారి చూడండి" అని అన్నాడు. వెంటనే సేఠ్ నన్ను కార్లో కూర్చోబెట్టుకొని ధర్మశాలను చూపించేందుకు తీసుకెళ్లాడు. నాకు ధర్మశాల నచ్చింది. ధర్మశాల కొత్తది. ఉండేందుకు ఏర్పాట్లు కూడా బాగున్నాయి. తర్వాత వారు గోధుమలు, నెయ్యి, బియ్యము, మొదలైన రేషన్ పంపించారు. ప్రతి గదిలో మంచము, పరుపు మొదలైనవన్నీ ఉన్నాయి. మాతేశ్వరి గదిలో మంచము, బెడ్‌షీట్, గద్ది మొదలైనవన్నీ తయారు చేశారు.

ఇప్పుడు మమ్మా వచ్చే సందర్భములో ఆహ్వానపత్రికలు అచ్చు వేయించవలసి వచ్చింది. ఏమి చేయాలని ఆలోచించాను. మళ్లీ ముందుకు పొమ్మని నా మనసు చెప్పింది. నేను ముందుకు పోతే ఒక ప్రింటింగ్ ప్రెస్సు కనిపించింది. నేను ప్రెస్సు లోపలకు వెళ్తూనే "అమ్మా మీకు ఏమి కావాలి?" అని ప్రెస్సు యజమాని అడిగాడు. "జగదంబ సరస్వతి బెంగుళూరుకు వస్తున్నారు మేము ఆహ్వాన పత్రికలు వేయించాలి" అని చెప్పాను. "మీరు చెప్పండి మేము అచ్చు వేయిస్తాము" అని అన్నాడు. మంచి మంచి విద్యావేత్తలు కూడా మాట్లాడలేని ఇంగ్లీషు వాక్యాలు నా నోటి నుండి వెలువడ్డాయి. ఆ శబ్ధాలు " Mateswari Jagadamba is arriving in Bangalore, Please have the blessings of Complete purity Peace & Prosperity for many births. All are invited " (మాతేశ్వరి జగదంబ ఈజ్ అరైవింగ్ ఇన్ బెంగళూర్, ప్లీస్ హేవ్ ది బ్లెస్సింగ్స్ ఆఫ్ కంప్లీట్ ప్యూరిటీ, పీస్ అండ్ ప్రాస్పెరిటీ ఫార్ మెనీ బర్థ్స్). ప్రెస్ యజమాని డబ్బు అడిగారు కాని నా వద్ద ఏమీ లేదు. నేను వెళ్లి ఒక మాతకు డబ్బు ఇచ్చి పంపుతాను వారి చేతికి ఈ కార్డులు ఇవ్వండి అని అన్నాను. ఇప్పుడు మాతేశ్వరి జగదంబను ఎలా స్వాగతము చేయాలి? దానికి పూలహారము, పూలు కావాలి. కొద్ది రోజుల క్రితమే ఒక తోటమాలి సోదరుడు కోర్స్ తీసుకున్నాడు. అతడు జగదంబ మాతకు ఎన్ని పూలహారాలు పూలు కావాలో అవన్నీ నేను తెస్తానని అన్నాడు.

మాతేశ్వరీగారి ఆగమనము కొరకు వేచి ఉండినాము. ఆ రోజు కూడా వచ్చేసింది. మాతేశ్వరీగారు బెంగుళూరుకు చేరుకున్నారు. మేము చాలా భవ్యమైన స్వాగతము చేశాము. సేఠ్ మమ్మాను చూస్తూనే అతనికి మనోవాంఛిత ఫలము లభించినట్లయింది. అతడు తృప్తి చెందాడు. మమ్మాతో కలిసేందుకు చాలా చాలా గొప్పవారు కూడా వచ్చారు. మమ్మాగారి వాణి విని చాలా ఆనందము పొందారు. బ్రాహ్మణ పరివారము కూడా కలిశారు. అందరూ చాలా సంతోషించారు. మమ్మా ఒక వారము రోజులు బెంగుళూరులో ఉన్నారు. మమ్మా వాపసు వెళ్లే రోజు వస్తూనే మమ్మా నాతో "మీరు బాబా ఇల్లే చూపించలేదు" అని అన్నారు. నేను మాటలలో దాటివేస్తూ వచ్చాను. కాని మమ్మా మాటి మాటికి అడుగుతూ ఉంటే నేను ఉంటున్న చిన్నగదికి తీసుకెళ్లాను. అందులోనే ఆహారము తయారు చేసుకోవాలి, తినాలి, క్లాసు కూడా అక్కడే చేయాలి. విశ్రాంతి కూడా అక్కడే. కోర్సు కూడా అక్కడే ఇవ్వాలి. మమ్మా ఇది చూచి "బాబా! మిమ్ములను మహారాణుల వలె పాలన చేశారు, ఇప్పుడు మీరుండే విధానము నేను చూడలేను. అందువలన బాబా ముఖ్యంగా మిమ్ములను తీసుకొచ్చేందుకు పంపించారు." అప్పుడు నేను - "మమ్మా నేను పిరికి సిపాయిని కాదు. యుద్ధ మైదానము నుండి వాపసు రాను" అని అన్నాను. అప్పుడు మమ్మా - "మీ అంతకు మీరు రావడం లేదు, బాబా పిలుస్తున్నారు

మీరు నా వెంట రండి" అని అన్నారు. అప్పుడు నేను - మరణించడానికి కూడా వెనుకాడను కాని వెనుకకు రాను, నేను పుష్పగుచ్ఛాన్ని తయారు చేసుకునే బాబా వద్దకు వస్తాను" అని అన్నాను. నా దృఢ నిశ్చయము విని మమ్మా వాపసు ఆబూకు చేరుకున్నారు.

ఈ విధంగా మమ్మా వినమ్ర సేవాధారి తల్లిగా అయ్యి జబ్బు చేసిన సమయంలో నాకు సేవ చేశారు, సంకట సమయములో సేవా స్థానానికి వచ్చి సహయోగమిచ్చారు, స్నేహమిచ్చారు సేవా స్థలములో ముందుకు వెళ్లేందుకు నాలో శక్తిని నింపారు.



మాతేశ్వరీగారి జతలో పిల్లలు
" మేము మీ పిల్లలము, స్వీకరించండి తల్లీ! "

## వైకుంఠ స్వామిని శ్రీ భగవతి

*బ్రహ్మాకుమారి భగవతి దాది ఇలా అంటున్నారు - మమ్మా దృష్టి శక్తిశాలిగా ఉండేది. ఒక రోజు రాత్రి మమ్మా వెన్నెలలో కూర్చుని యోగము చేస్తూ ఉండినారు. నేను వెళ్ళి ఆమె ముందు కూర్చున్నాను. మమ్మా దృష్టినిచ్చారు, నేను ధ్యానములోకి వెళ్ళిపోయాను. ధ్యానములో నేను నలువైపులా ప్రకాశమే ప్రకాశాన్ని చూచాను. ఆ ప్రకాశం మధ్యలో సర్వశక్తివంతుడైన బాబా కనిపిస్తున్నారు. నేను



సహారన్‌పుర్ – మాతేశ్వరీగారి జతలో భగవతీ దాదీ, ప్రకాశ్ ఇంద్ర దాదీ మరియు ఇతరులు

బాబాను అలాగే చూస్తూ ఉండిపోయాను. అప్పుడు ఏమి చూస్తున్నావు? అని మమ్మా అడిగారు. అందుకు నేను - “మమ్మా! నేను బాబాను చూస్తున్నాను” అని చెప్పాను. “బాబాను అలాగే చూస్తూ ఉండండి” అని మమ్మా అన్నారు. ఇది కరాచీలో జరిగిన విషయము. అప్పుడు నేను చాలాసార్లు ధ్యానములోకి వెళ్లేదానిని. బాబా కూడా మమ్మాతో - “ఈమెను వతనములో తిప్పుకొని రా!” అని అనేవారు. అప్పుడు మమ్మా నన్ను వతనములోకి పంపించేవారు. అచ్చట నేను వైకుంఠాన్ని చూస్తూ శుబీరసాన్ని తాగి శ్రీ కృష్ణునితో పాటు రాస్ చేసేదానిని.

## ఏ సేవనైనా ఎప్పుడైనా చేయలేనని చెప్పరాదు

ఈ విధంగా తమ అనుభవాన్ని వినిపిస్తూ బ్రహ్మాకుమారి భగవతి* గారు అంటున్నారు - నాకు బట్టలు కుట్టడం వచ్చేది. చొక్కా, ప్యాంటు మొదలైనవి కుట్టేదానిని. ఒక రోజు మమ్మా నన్ను పిలిచి, “భగవతీ! నీవు కోటు కుడ్తావా? అని అడిగారు. నాకు కుట్టడం రాదు అని చెప్పాను. అప్పుడు మమ్మా - “ఎప్పుడూ ‘రాదు’ అని చెప్పరాదు. ఈ డ్రామాలో ‘రాదు’ అనే మాటే లేదు. నీవు షర్టు, ప్యాంటు కుడ్తావు కదా. మరి కోటు కుట్టడం రాదా? వస్తుంది అని చెప్పు, ఆ పని దానికంతకదే వస్తుంది. ఎప్పుడూ రాదు అని చెప్పరాదు. అవును అని చెప్తే, రాకున్నా ప్రయత్నము చేస్తూ చేస్తూ ఉంటే అదే వచ్చేస్తుంది. అదే విధంగా ప్రయత్నము చేస్తూ - చేస్తూ నాకు కోటు కుట్టడం రానే వచ్చేసింది. అప్పటి నుండి నేను ఏ సేవ అయినా రాదు అని చెప్పలేదు”. ప్రతి మాటకు “అవును - అవును”(హాజీ) అని అనడం ప్రారంభించాను. అప్పటి నుండి నాకు ఈ వరదానము ప్రాప్తి అయ్యింది - నేను ఏ పని చేస్తానో, అందులో సఫలత లభిస్తూనే ఉంటుంది.

## మమ్మా, మమ్మాగా ఎలా అయ్యారు ?

మమ్మా తమ గుణాల, కర్తవ్యాల ద్వారా మమ్మాగా అయ్యారు. మమ్మా తన బాధ్యతలను సంభాళించుకొను శక్తితో, మహానతతో అర్థం చేయించే శిక్షణనిచ్చే విధి ద్వారా సర్వుల పట్ల సద్వ్యవహారముతో మమ్మాగా అయ్యారు. మమ్మా తన ప్రేమ, పాలనా శక్తితో అందరి హృదయాలను గెలుచుకొని యజ్ఞమాతగా అయ్యారు.

*దాది భగవతి కూడా యజ్ఞము పార్రంభములోనే సమర్పితమైన ఆదిరత్నము. వారు ఢిల్లీ, మీరట్ మొదలైన స్థానాలలో ఈశ్వరీయ సేవ చేస్తూ 46 సంవత్సరాలు సహరాన్‌పూర్‌లో సేవ చేశారు.

## మమ్మానే నాకు యోగము నేర్పించి యోగ్యముగా చేశారు

*బ్రహ్మాకుమారి దాదీ ధైర్యమణిగారు తన అనుభవాన్ని ఇలా వినిపిస్తున్నారు - 1937లో నేను మొట్టమొదటి సారిగా నా సోదరి భగవతితో పాటు సత్సంగానికి వచ్చాను. పోతూనే నన్ను మమ్మా మొదట చూశారు. మమ్మా నన్ను తన బాహువులలోకి తీసుకొని, టోలి తినిపించి మందహాసము చేశారు. నేను కూడా చిరునవ్వు నవ్వినాను. మరుసటి రోజు కూడా రమ్మని మమ్మా అన్నారు. నేను ఆ రోజు నుండి ప్రతి రోజు వెళ్లేదానిని. జ్ఞానము వింటూ ఉంటే నాకు చాలా బాగుందనిపించింది. మమ్మానే నాకు జ్ఞాన ప్రాప్తిని చేయించేందుకు, యజ్ఞములోకి తీసుకొచ్చేందుకు నిమిత్తంగా అయ్యారు. నేను చాలా చిన్నదానిని. అందువలన నీవు ఓంనివాస్‌లో ఉంటూ జ్ఞాన-యోగాలు చదువుకో అని మమ్మా చెప్పారు. నా తల్లిదండ్రులు నాకు అనుమతినివ్వలేదు. నాకు మమ్మా ఒక యుక్తి చెప్పారు - తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నప్పుడు నీవు పోయి వారి ఒడిలో కూర్చుని ప్రేమతో అడిగితే తప్పకుండా ఒప్పుకుంటారు, అలాగే జరిగింది. ఒక రోజు నా తల్లిదండ్రులు చాలా ఖుషీ మూడ్‌లో ఉన్నప్పుడు నేను వారి అనుమతిని అడిగాను. నా తండ్రి అనుమతి పత్రాన్ని వ్రాసి ఇచ్చేశారు. అందులో నా తల్లి సంతకం కూడా చేయించారు. ఈ విధంగా నన్ను లౌకిక బంధనము నుండి ముక్తము చేయించేందుకు చాలా సహాయము చేశారు.

## కర్మేంద్రియాలను జయించిన మహాకాళి

యోగము ఎలా చేయాలో కూడా మమ్మా నాకు నేర్పించారు. వారు తమ జతలో గద్దె పై కూర్చోబెట్టుకొని నాతో యోగము చేయించేవారు. మా స్థితిని చెక్(పరిశీలన) చేసేవారు. కర్మణాసేవ చేయునప్పుడు కూడా మమ్మా తమ స్థితిలోనే ఉండేవారు. నేను ఒకసారి మమ్మాను - “మమ్మా మీరిప్పుడు గోధుమలు శుద్ధము చేస్తున్నారు, ఇప్పుడు మీరు ఏ సంకల్పము చేస్తున్నారు?” అని అడిగాను. అందుకు మమ్మా - “నేను గోధుమలు శుద్ధము చేయడం లేదు, నేను సాక్షిగా ఉండి కర్మేంద్రియాలతో శుభ్రము

చేయిస్తున్నాను. నేను చేయడం లేదు, చేయిస్తున్నాను" అని అన్నారు. అప్పుడు నాకు జ్ఞానము విస్తారముగా తెలియదు. కాని మమ్మా-బాబాలను చూస్తూ చూస్తూ నేను జీవించడం నేర్చుకున్నాను. జీవితాన్ని తయారు చేసుకున్నాను. గుణాలను స్వంతము చేసుకున్నాను.

మమ్మా జీవితము న్యాచురల్‌గా(సహజంగా) ఉండేది. వారి స్వభావము చాలా సరళంగా, వ్యవహారములో మధురంగా ఉండేవారు. వారిలో సదా అందరినీ ముందుకు తీసుకెళ్ళాలనే భావముండేది. మమ్మా ప్రతి ఒక్కరి యోగ్యత మరియు విశేషతల అనుసారము అలాంటి కార్యమే ఇచ్చేవారు. దానిని వారు సులభముగా చేసేవారు.

## మమ్మా మమ్మాగా ఎలా అయ్యారు ?

మమ్మా అందరినీ పాలన చేసి మమ్మాగా అయ్యారు. అందరికీ తల్లి మమతనిచ్చి మమ్మాగా అయ్యారు. అందరినీ తనవారిగా చేసుకొని మమ్మాగా అయ్యారు. తమ పవిత్రత, నిస్వార్థ ప్రేమ శక్తి ద్వారా అందరినీ ఆకర్షించి మమ్మాగా అయినారు. మమ్మాలో సహజత ఉండేది. మమ్మాలో నాకు శ్రీలక్ష్మీ మరియు జగదంబల భావన కలిగేది. మమ్మా నాకు ఈ విశేషతను నేర్పించారు - ఎవరితోనూ వైరభావము ఉండరాదు. ఎవరిలోని అవగుణాలను చూడరాదు, అవగుణాన్ని మనదిగా చేసుకోరాదు.

## చంద్రుని వెన్నెలలో యోగము చేసే సజగ్(మెలకువ గల) సాధకురాలు

వారములో ఒకసారి మేము(సుప్రీమ్ పార్టీ వారు) మమ్మా జతలో కూర్చుని అమృతవేళలో యోగము చేసేవారము. మమ్మా వెన్నెలలో కూర్చుని యోగము చేయునప్పుడు మేము కూడా వెళ్ళి ఒక్కొక్క మూలలో కూర్చుని యోగము చేసేవారము. అప్పుడప్పుడు మమ్మాను మా గ్రూపులోకి పిలిచేవారము. మమ్మా మూడున్నర నుండి 4 గంటల వరకు మా అందరికీ యోగము చేయించేవారు. మమ్మా ముందు కూర్చుని యోగము చేయునప్పుడు మాకు జ్ఞాన చంద్రుని శీతలతా ప్రకంపనాలతో శాంతిధామము అనుభవమయ్యేది. ఈ విధంగా మమ్మా మమ్ములను





మమ్మాగారి సన్మానములో పోగయిన జన సమూహము. జతలో ధైర్యమణి దాది

యోగినీలతో పాటు యోగ్యులుగా చేశారు.

మమ్మా అమృతవేళ 2 గంటలకు లేచి ఒంటరిగా యోగము చేసేవారు. వారు మూడున్నర గంటలకు తయారై బయటకు వచ్చేవారు. 4 నుండి 5 వరకు సామూహిక యోగము జరిగేది. మమ్మా ఆ యోగానికి తప్పకుండా వచ్చేవారు. దాని తర్వాత స్నానాది నిత్యకర్మలు పూర్తి చేసుకునేవారు. నాశ్తా తర్వాత 9 గంటలకు ఉదయము మురళి క్లాసు జరిగేది. ఆ క్లాసుకు వచ్చేవారు. దాని తర్వాత ఒక్కొక్క రోజు ఒక్కొక్క సోదరిని గద్దె పై కూర్చోబెట్టి జ్ఞానములో ఏదో ఒక పాయింటును వివరించమని చెప్పేవారు. ఈ విధంగా మమ్మా అందరికీ ఉపన్యసించడం, క్లాసు చేయడం నేర్పించేవారు. ఆ తర్వాత సేవ చేసేవారము. మధ్యాహ్నం భోజనము తర్వాత విశ్రాంతి ఉండేది. మమ్మా సాయంకాలము 5 గంటలకు ఆఫీసులో కూర్చునేవారు. యజ్ఞములో పిల్లలందరికీ టోలీ తినిపించేవారు. మాకు ఎప్పుడైనా మమ్మా నుండి టోలి తినాలనిపిస్తే మేము అచ్చటకు వెళ్ళి మమ్మా నుండి టోలి తీసుకునేవారము. ఆ తర్వాత మమ్మా ఆఫీసు పని

చూసుకునేవారు. అప్పుడు నేను యజ్ఞములో మురళి వ్రాసే సేవ చేసేదానిని. సాయంకాలము మేము కూడా యజ్ఞసేవ అనగా ధాన్యము శుభ్రము చేయడం, కూరగాయలు తరగడం మొదలైన పనులు చేసేవారము. రాత్రి భోజనము తర్వాత మమ్మా కచేరి చేసేవారు.

### మధురమైన మమ్మా వినిపించిన అమూల్యమైన శిక్షణలు

1. ఈ జ్ఞానము ద్వారా కేవలం మీ కడుపులు మాత్రమే నింపుకోరాదు. దు:ఖములో ఉన్నవారికి శాంతినిచ్చే ఉపాయము కూడా చేయాలి. ఇదే సర్వోత్తమమైన సేవ.

2. పరమపిత పరమాత్మ అయితే విశ్వ రచయిత. వారు నూతన ప్రపంచాన్ని రచించే పని చేయనే చేస్తారు. కాని పిల్లలైన మీరు మీ వికారాలను నాశనము చేసుకొని దైవీ గుణాల రచన చేయండి. ఎలాగైతే ఎవరి శరీరము పైన అయినా ఏదైనా భారముంటే వారు వేగంగా నడవలేక నెమ్మది నెమ్మదిగా నడుస్తారో, అలాగే పిల్లలైన మీ తలల పై కూడా చాలా బరువైన పాపాల మూట ఉంది. మీరు కూడా త్వరత్వరగా ఉన్నతి అవ్వాలనుకుంటే మొదట పాపాల మూటను దించుకోండి అనగా ఆత్మలో గల వెనుకటి పాపాలను దగ్ధము చేయండి. అందుకు యుక్తి - మీ శ్వాస శ్వాసలో తమ పరమపిత పరమాత్మ శివుని స్మృతి చేయండి. వారితో సర్వ సంబంధాలను జోడించి పూర్తిగా హక్కును సంపాదించుకుంటామని, 21 జన్మల కొరకు దైవీ స్వరాజ్యము ప్రాప్తి చేసుకుంటామనే దృఢ సంకల్పము ఆంతరికములో పక్కాగా ఉండాలి.

3. కొంతమంది ఆత్మలకు గతించిన జీవితము మాటి మాటికి గుర్తుకొస్తూ ఉంటుంది. వారు అందువలన సంతోషంగా ఉండరు. వారు తమ లోపల చూసుకోవాలి - ఇప్పుడు నేను నా పాత చిట్టాను సమాప్తము చేసుకొని కొత్త చిట్టా(కర్మల ఖాతా)ను తయారు చేసుకోవాలి. కొత్త పాత సంకల్ప వికల్పాలను మిక్స్ చేస్తూ ఉంటే ఆత్మలైన మీలో ఉన్న పురాతనమైనవేవీ శుభ్రమవ్వవు. కొత్త చిట్టా కూడా తయారవ్వజాలదు. అందువలన పాత



మాయావి సంకల్ప వికల్పాలను మర్చిపోండి. గతం గత:(పాస్ట్ ఈజ్ పాస్ట్) ఆత్మలైన మీది నూతన ఈశ్వరీయ జన్మ కావున సదా సంతోషంగా ఉండండి.

4. సేవ చేయడం అనగా తమ జీవితాన్ని ఆదర్శమయ జీవితంగా చేసుకోవాలి. దాని వలన ఇతర ఆత్మల పై ప్రభావము పడగలగాలి.

5. ఇప్పుడు మీరు సత్యమైన రామునికి సత్యమైన సీతలుగా అయ్యారు కావున రావణుని ఏ గుర్తూ మీ వద్ద ఉంచుకోకండి.

# మాతేశ్వరి జీవన పర్యంతమూ స్థిరంగా, అచంచలంగా, ఏకరస స్థితిలో ఉండినారు

*బ్రహ్మాకుమారి కుంజ్‌దాదీగారు తమ అనుభవాన్ని వినిపిస్తూ అంటున్నారు - నేను బాల్యావస్థలో బంధనములో ఉండేదానిని. నేను యజ్ఞములోకి వస్తూనే మమ్మాగారి సంపూర్ణ పాలన లభించింది. నేను చాలాసార్లు ఇంటి నుండి తినకుండా వచ్చేదానిని. మమ్మాకు ఎలా తెలిసేదో, నన్ను కూర్చోబెట్టి స్వయంగా భోజనము తినిపించి ఇంటికి పంపేవారు. అంతేకాక నాలో ధైర్య, ఉత్సాహాలను నింపుతూ ఉండేవారు. ఏ కన్యలకు తమ తల్లిదండ్రుల నుండి అనుమతి లభించకుండా ఉండేదో, వారు ఓంమండలికి చెందిన ఓం స్కూలులో చదువుకునేందుకు వచ్చేవారు. అందులో నేను కూడా ఒకదానిని. అక్కడ మమ్మా ద్వారా మా పాలన జరిగేది. మమ్మాను చూస్తూనే వారు మా తల్లి అని మాకు అనిపించేది. హనుమంతుడు సీతను రావణుని నుండి విడిపించినట్లు నీవు బంధనములో ఉన్నవారిని విడిపించాలి అని మమ్మా నాకు చెప్పేవారు. మమ్మా యుక్తులు తెలిపి, శక్తులు నింపి నన్ను నిర్భయులుగా చేసేవారు. అప్పుడు నా వయస్సు 9 సంవత్సరాలు.

మమ్మాకు శివబాబాతో పాటు డ్రామా పై కూడా అచంచల నిశ్చయముండేది. మమ్మా డ్రామా పై మాకు రెండు రెండు గంటలు క్లాసు చేసేవారు. మమ్మా అనేవారు - బాబా పైన ఎంత నిశ్చయముందో, డ్రామా పై కూడా అంతే నిశ్చయముండాలి. అప్పుడే మీరు ఈశ్వరీయ జీవితములో ఏకరస స్థితిలో ఉండగలరు. మమ్మా డ్రామా పై స్థిరంగా, నిశ్చలంగా ఉన్నందున వారు సదా ఏకరసంగా ఉండేవారు. యుద్ధ స్థలములో(యజ్ఞ వ్యవహారములో) బాబా మమ్మాగారినే పూర్తిగా ముందుంచారు. యజ్ఞము కూడా మమ్మా పేరు మీదే ఉండేది. స్థాపనలో ప్రతి కార్యములో ఎన్ని పరీక్షలు వచ్చినా మమ్మా శివశక్తుల సైన్యానికి నాయకత్వము వహించారు. ఎన్ని కఠిన పరిస్థితులు వచ్చినా, విఘ్నాలు వచ్చినా మమ్మా నవ్వుతూ నవ్వుతూ అచంచలంగా, స్థిరంగా ఉంటూ ఎదిరించి విజయాన్ని ప్రాప్తి చేసుకున్నారు.

* దాది కుంజ్ గారు యజ్ఞములోని ఆదిరత్నాలలో ఒకరు. వీరు బిహారు పాట్నాలోని శాఖల నిర్దేశకులుగా పాట్నాలో ఉండినారు.





బొంబాయి – మాతేశ్వరీగారితో శీల్ దాదీ, పుతులు బహన్, దైవీ మాత, బ్రిజేంద్ర దాదీ, జానకీ దాదీ, క్రింద సంత్‌రీ దాదీ, క్వీన్ మదర్, ఇతరులు

## సర్వుల పట్ల సమ భావము మరియు శ్రేష్ఠ భావము

యజ్ఞములో సేవ చేసే సమయములో నా జతకు ఒక సోదరిని ఇచ్చేవారు, వారిని జతలో ఉంచుకొని సేవను పూర్తి చేయమని నాకు చెప్పేవారు. అప్పుడు నేను మమ్మాతో - "మమ్మా, ఈమె చాలా బలహీనంగా ఉంది, చాలా నిదానంగా పని చేస్తుంది. నాతో ఫలానావారిని ఇస్తే మేమిరువురము కలిసి త్వరగా పూర్తి చేస్తామని అన్నాను." అప్పుడు మమ్మా అన్నారు - ఈమె చాలా బలహీనమని నీకెలా తెలుసు? నేను ఇలా అనేదానిని - "మమ్మా, నేను ప్రతి రోజు నాతో పని చేయడం చూస్తున్నాను కదా." అప్పుడు మమ్మా అన్నారు - " ప్రతి ఒక్కరిలో ఏదో ఒక లోపము, బలహీనత ఉంటుంది. నేను తల్లిని కదా. నేను అందరికి సేవ చేసేందుకు అవకాశము ఇచ్చి వారి భాగ్యాన్ని తయారు చేయాలి. ఈ రోజు ఆమెలో ఈ లోపముంది. నీలో ఉన్న కళను చూస్తూ చూస్తూ రేపు తనలోని లోపాన్ని, బలహీనతను పోగొట్టుకుంటుంది. ఒక రోజు ఆమె కూడా నీవలె హుషారుగా అవుతుంది.

కావున అందరినీ కలుపుకొని జతలో నడవాలి", ఈ విధంగా మమ్మా ప్రీతితో అర్థం చేయించి నాకు శిక్షణనిచ్చేవారు.

మమ్మా ప్రతి విషయములో గమనమిప్పించేవారు. ఒకసారి కరాచీలో ఒక సోదరి శరీరము వదిలేసింది. ఆమె రెండు-మూడు రోజులు మాత్రమే ఆరోగ్యము బాగాలేక అంతలోనే శరీరము వదిలేసింది. మమ్మా అందరికి ఇలా చెప్పారు - "ఈమె మృత్యువు ద్వారా అందరూ పాఠము నేర్చుకోవాలి. మృత్యువు ఎప్పుడు వస్తుందో ఎవ్వరికీ తెలియదు. మేము ఇంకా చిన్నవారిమని, వయసులో ఉన్నామని ఇంకా చాలా కాలము బ్రతికి ఉంటామని అనుకోకండి, అలా కాదు. మృత్యువు ఎప్పుడైనా రావచ్చు అందువలన ప్రతి రోజు పడుకునే ముందు మీ అంతకు మీరు ప్రశ్నించుకోండి - " నేను ఇప్పుడే శరీరాన్ని వదిలేందుకు రెడీగా ఉన్నానా?" "ఒకవేళ ఈ రోజే శివబాబా నుండి పిలుపు వస్తే నేను ఎవరెడీగా(సిద్ధముగా) ఉన్నానా?"

**యుక్తులు రచించి పిల్లలను యోగ్యులుగా చేశారు, ముందుకు నడిపించారు**

కరాచి నుండే నేను యజ్ఞములో రేషన్ డిపార్టుమెంటులో అసిస్టెంట్(సహయోగి) రూపములో సేవ చేసేదానిని. ఇంకొక సోదరి డిపార్టుమెంటుకు పెద్దగా(హెడ్‌గా) ఉండేవారు. ఆమె వెళ్ళిపోయినప్పుడు మమ్మా నాతో - కుంజ్, ఇప్పుడు నీవు హెడ్‌గా ఉండి ఈ డిపార్టుమెంటును సంభాళించు అని అన్నారు. అప్పుడు నేను లేదు మమ్మా నేను హెడ్‌గా ఉండనని అన్నాను. మొదట స్టోరు నిండుగా ఉండేది కాని ఇప్పుడు బెగ్గరి(పేదరికపు) పార్టు వచ్చింది. నేను ఎవరికైనా ఏదైనా లేదు ఇవ్వను అంటే వారు నన్ను ఏమంటారు? ఎవరైనా పెద్ద అక్కయ్యను హెడ్‌గా చేయండి, నేను ఆమె అసిస్టెంటుగా ఉండి పని అంతా చేస్తాను. అప్పుడు మమ్మా నన్ను బాబా వద్దకు తీసుకెళ్ళి బాబాతో, బాబా, ఈ కుంజ్ రేషన్ డిపార్ట్‌మెంట్‌కు హెడ్‌గా ఉండనని అంటోంది" అని చెప్పారు. అప్పుడు "బాబా చిరునవ్వుతో " ఆమె చెప్పేది కరెక్టే, స్టోరు శివబాబాది, కుంజ్ దానికి ఇన్‌చార్జి, ఇదెలా సాధ్యము? ఈమె సరిగ్గానే చెప్తోంది. "శివబాబా స్టోరుకు



హెడ్ నేను కదా, కుంజ్ నాకు అసిస్టెంట్‌గా ఉండి సేవ చేస్తుంది." ఈ విధంగా మమ్మా యుక్తితో ప్రతి ఒక్కరికి బాధ్యతనిచ్చి లేక ఇప్పించి ముందుకు నడిపించేవారు.

బాబా సేవ చేసేందుకు నన్ను బయటకు పంపాలనుకున్నప్పుడు బాబాను విడిచి వెళ్లేందుకు ఇష్టముండేది కాదు. బాబా నన్ను సర్వీసుకు వెళ్ళమన్నప్పుడు బాబా నేను మిమ్మలను వదలి వెళ్ళను అని అనేదాన్ని. ఒకసారి బాబా మురళి వినిపించేటప్పుడు "సభలో చూడండి ఈ కుంజ్‌ను నేను సమర్థురాలని అనుకున్నాను. కాని అసమర్థమని అర్థమయింది. (పౌండ్)రూపాయికి సమానమని అనుకున్నాను కాని(పెన్ని) పైసకు కూడా సమానము కాదు" అని అన్నారు. బాబా అలా అన్న తర్వాత కూడా బాబా! నేను మీ నుండి దూరంగా వెళ్ళనని అనేదానిని. ఒక రోజు బ్రిజ్‌కోటిలో మమ్మా నన్ను ఊయలలో కూర్చోబెట్టి - కుంజ్ బాబా నీ ద్వారా ఏమి కోరుతున్నారు? అని అడిగింది. అప్పుడు నేనన్నాను - మమ్మా - "బాబాగారు నన్ను సేవకు వెళ్ళమంటున్నారు. బాబాను వదిలి దూరంగా వెళ్లే శక్తి నాకు లేదు. మురళి సమ్ముఖంలో వినకుండా కాగితము పై చదవాలా! ఇది నాతో అయ్యే పని కాదు. నేను అక్కడికెళ్లి ఏడుస్తూ ఉంటాను. నేను అచ్చట ఏడుస్తూ ఉంటే సేవ ఎలా చేస్తాను?" అప్పుడు మమ్మా అన్నారు - "చూడు బచ్చీ, బాబా నీతో సేవ చేయించాలనుకుంటే, వారే తప్పకుండా నీకు ఆ శక్తినిస్తారు, భయపడకు. బాబాకు సరే! అని చెప్పు ఏ విఘ్నమూ రాదు, అన్నీ సరిపోతాయి." ఈ విధంగా అర్థం చేయించి, నాలో శక్తిని, ఉత్సాహాన్ని నింపి బాబా వద్దకు తీసుకెళ్ళి బాబాతో, కుంజ్ సేవ చేసేందుకు ఎక్కడికైనా వెళ్లేందుకు రెడీగా ఉంది అని చెప్పారు. కాని నేను ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాను. అప్పుడు బాబా - "ఆ మాట కుంజ్ చెప్పడం లేదే, ఏమీ మాట్లాడకుండా మౌనంగా నిలబడి ఉందే" అని అన్నారు. అప్పుడు నేను మెల్లగా బాబా నేను సేవకు వెళ్లేందుకు రెడీగా ఉన్నానని చెప్పాను. మమ్మా ఒక తల్లి వలె నాలో ధైర్యము ఉత్సాహ-ఉల్లాసాలు నింపి బాబా వద్దకు తీసుకెళ్లారు. సేవలో ముందుకు వెళ్లేందుకు మంచి అవకాశము



ముంబయి - విశ్నీ బహన్, ప్రకాశ్ మణి దాది, రజనీ బహన్ మరియు మమ్మా

కలిగించారు. ఈ విధంగా మమ్మా అన్ని విధాలైన శిక్షణనిచ్చేవారు. దాదీ ప్రకాశమణి మరియు నేను పాట్నాలో ఉండేవారము. అక్కడ ఒక ప్రత్యేకమైన స్వభావము గల సోదరుడు ఉండేవాడు. మీరు సేవ చేసేందుకు అచ్చటకు వెళ్ళకండి, ఇచ్చటకు వెళ్ళకండి అని జబర్‌దస్తీగా అనేవాడు. మమ్మా వస్తే అతని విషయమంతా చెప్పాలని మేమనుకున్నాము. మమ్మా వస్తూనే మేము మమ్మాతో - "మమ్మా మేము మీతో మాట్లాడునప్పుడు ఆ సోదరుని పిలవకండి" అని చెప్పాము. మమ్మా అనేవారు - నేనిప్పుడు అతని అతిథిని, నేను ఎలా అతనికి శిక్షణను ఇవ్వాలి? మీరే తెలివిగల వారిగా అవ్వండి. ఇలా చెప్పి చెప్పి చిన్నవారిని కూడా పెద్దవారిగా చేసేవారు. రకరకాల వ్యక్తులను కూడా ఎలా నిభాయించాలనే యుక్తులు కూడా మమ్మా మాకు నేర్పించేవారు. ఎటువంటి వారినైనా ఎలా వంచాలి - ఇది మమ్మాకు గల గొప్ప విశేషత. పాట్నాలో సరస్వతీ పూజ జరిగినప్పుడు ఆ సోదరుడే మమ్మాను నగలు మొదలైన వాటితో బాగా అలంకరించి 56 ప్రకారాల భోగ్ (నైవేద్యాన్ని) సమర్పించాడు.



## అనంతమైన విశ్వాసము మరియు ప్రేమ

బాబా చెప్పిన ప్రతి మాట పై మమ్మాకు ఎంత నిశ్చయముండేదంటే బాబా వినిపించిన మాటలను యజ్ఞవత్సలెవరైనా విమర్శిస్తే వినగలిగేవారే కాదు. బాబా మహావాక్యాల పై అనంతమైన విశ్వాసము, అనంతమైన ప్రేమ ఉండేది. ఒకసారి మమ్మాతో నేను - "మమ్మా ఈ రోజు బాబా ఈ పాయింటును ఎలా తిరగేశారో చూడండి" అని అన్నాను. ఇంతకుముందు 'నేను ఒక జ్యోతిర్లింగమును' అని అనేవారు. ఇప్పుడు 'నేను జ్యోతిర్బిందువును' అని అంటున్నారు, ఇదేమిటి? అని అడిగాను. మమ్మా వెంటనే అవేశముతో - "బాబా జ్యోతిర్లింగమని గాని, జ్యోతిర్బిందువని గాని చెప్పినప్పుడు ఫలానా సైజ్‌లో ఉంటానని కొలత నీకేమైనా చెప్పారా? బాబా ఈ పాయింటును తిరగేసి చెప్పారనే మాటను మమ్మా వినలేకపోయేవారు. "అప్పుడు నీవు చాలా చిన్న పిల్లగా ఉండేదానివి. బిందువంటే ఏమిటో నీకు అర్థమయ్యేది కాదు. కొంతైనా అర్థము కావాలని బాబా తన రూపము జ్యోతిర్లింగమని లేక జ్యోతిస్వరూపమని తెలిపేవారు. ఈ రోజు బాబా నీకు తన మూల స్వరూపము జ్యోతిర్బిందువని తెలిపారు. బాబా అసలు రూపము జ్యోతిర్బిందువు. వారు సర్వ గుణాల సింధువు(సాగరము)."

ఇది కరాచీలో జరిగిన విషయము. నేను, దాదా విశ్వకిశోర్, దాదా విశ్వరతన్ మొదలైనవారు కలిసి చిత్రాలను తయారు చేసేవారము. రోజుకు ఎక్కువలో ఎక్కువ 2-4 చిత్రాలు మాత్రమే తయారు చేయగలిగేవారము. ఒక రోజు బాబా మమ్మాతో - "మమ్మా! రాకుమారి ఎలిజెబత్ జన్మదినము వస్తోంది, ఆ రోజు వారి కుటుంబములో ఉన్న 108 మందికి ఈ చిత్రము వెళ్ళాలని నేను అనుకుంటున్నాను, వీలవుతుందా?" అని అన్నారు. వెంటనే మమ్మా "సరే బాబా" అని అన్నారు. మా వద్దకు మమ్మా వచ్చి "చూడండి నేను బాబాకు సరే అని చెప్పాను. 15 రోజులలో 108 చిత్రాలు తయారు చేయాలి" అని అన్నారు. అప్పుడు మేము "మమ్మా - రోజంతా ఎంతో కష్టపడితే 2-3 చిత్రాలు మాత్రమే తయారౌతూ ఉన్నాయి. 15 రోజులలో

108 చిత్రాలు ఎలా తయారౌతాయి? మీరే చెప్పండి" అని అన్నాను. అప్పుడు మమ్మా అన్నారు - "మనకు చెప్తోంది ఎవరు! బాబా పైన ఉన్న చంద్రుని క్రిందకు తెచ్చి ఇక్కడ తగిలించమని చెప్పినా, చంద్రుని దింపి ఇక్కడ తగిలించాలి. బాబా నోటి నుండి ఈ వాక్యము వచ్చిందంటే ఎలా అవ్వకుండా ఉంటుంది?" మమ్మా శక్తి రూపాన్ని ధరించి తీవ్రంగా సంపూర్ణ విశ్వాసముతో మాట్లాడేవారు. ఆ పని నిజంగానే రెండు రోజులు ముందే ముగిసేది. మమ్మాలో ఇంత గొప్ప శక్తి, దృఢ విశ్వాసము ఉండేది!

మమ్మా గుణాల మరియు శక్తుల భండారము. వాటిని వర్ణించడం ఎవ్వరికీ సాధ్యము కాదు. మమ్మాది మొదటి నుండి అవ్యక్త రూపము, ఫరిస్తా రూపంగా ఉండేది. మా పురుషార్థము ప్రోగ్రాము అనుసారంగా జరుగుతుంది. కాని మమ్మా పురుషార్థము న్యాచురల్(సహజము)గా ఉండేది. అందుకే ఆమె సులభంగా సంపూర్ణతను ప్రాప్తి చేసుకున్నారు.

మమ్మా అవ్యక్తమైన తర్వాత వారి పూజ అనగా జగదంబ దుర్గా దేవీలను పూజించడం చాలా ఎక్కువ అయ్యిందని నా అనుభవము. అవ్యక్త రూపములో మమ్మా దుర్గా పాత్రను పోషిస్తున్నారు. అందుకే దుర్గాదేవిని పూజించడం, అర్చనలు చేయించడం చాలా ఎక్కువగా జరుగుతోంది. కలకత్తాలో అయితే దుర్గాదేవిని పూజించే విధానము చూడదగింది. మమ్మా సాకారములో ఉన్నప్పుడు జ్ఞాన జ్ఞానేశ్వరిగా తయారై జ్ఞానగంగను ప్రవహింప చేశారు. అవ్యక్తమైన తర్వాత దుర్గ పాత్రను పూర్తిగా చేసి భక్తులకు గుణాల మరియు శక్తుల వరదానమును ఇస్తూ ఉన్నారని మనకు అనుభవమౌతుంది.

మమ్మాను ఎంత మహిమ చేసినా, అది తక్కువే అవుతుంది. శివబాబా జ్ఞాన భండారమునిచ్చి మనలను జ్ఞానముతో సంపన్నంగా చేశారు. కాని మమ్మా అయితే ఆచరణలో జీవించే పద్ధతిలోనూ నియమాలను నేర్పించి మమ్ములను మహోన్నతంగా చేశారు. మమ్మా గుణదాయనిగా, శక్తిగా, మమతామూర్తిగా ఉండేవారు. నా జీవితాన్ని తయారు చేశారు, అలంకరించారు అంతేకాక యోగ్యంగా కూడా చేశారు.

## మాతేశ్వరి – విశ్వములో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వము

సహోదరుడైన బ్రహ్మాకుమార్ జగదీష్ చంద్రగారు మమ్మాగారి సంబంధములో తమ అనుభవాన్ని వినిపిస్తూ ఇలా అంటున్నారు - మమ్మాగారి ప్రేమానురాగాలు, వ్యక్తిత్వము ఎంత ప్రభావశాలిగా ఉండేవంటే, వారు బాబా ద్వారా ఇవ్వబడుతున్న శిక్షణలమూర్తి రూపంగా ఉండేవారు. యోగి అనగా వారి వ్యక్తిత్వము వారు మరణించునంత వరకు ప్రసన్నంగా ఉంటుంది, వారి మనసులో సర్వుల పట్ల సద్భావన ఉంటుంది. అందరి పట్ల వారికి ప్రేమగా ఉంటుంది. వారు ఎవ్వరిని గురించీ చెడు ఆలోచించరు. వారు అందరి మేలును గురించి ఆలోచిస్తారు. బాబా జీవితంలో కూడా నేను ఈ విషయాలను ఆచరణ(ప్రాక్టికల్)లో చూచాను. కేవలం చెప్పడమే కాదు, నిందించేవారిని కూడా బాబా మిత్రుల వలెనే చూచారు. బాబా - "వీరు కూడా నా పిల్లలే కదా, వీరికి జ్ఞానము లేదు, వీరి తప్పేమీ లేదు. డ్రామానుసారము వీరి పాత్ర ఇదే. ఎందుకంటే వీరు ఇంకా అర్థము చేసుకోలేదు కదా. అర్థము చేసుకుంటే ఇలా అనరు. కావున వీరి మాటలను తప్పుగా అర్థము చేసుకునే అవసరము లేదు" అని అనేవారు. అలాగే నేను మమ్మాలో కూడా ఇదే విశేషతను చూశాను. వారి జీవితంలో ఒక అయస్కాంత శక్తి ఉండేది. ఎందుకంటే వారు అందరినీ తన బిడ్డలుగా భావించారు. ఇలా వారు ప్రత్యక్షంగా అనుభవము చేశారు. వారు నిజంగా సాక్షాత్ జగదంబయే అనునట్లు వ్యవహరించేవారు. వారు వయసు ఎంతైనా సరే. మరి మీరు ఆలోచించండి - వారికి దేహాభిమానము సమాప్తమైపోయింది కదా. వయసును గురించి గాని, పురుషుడు-స్త్రీ అనే భావము గాని, శత్రువు - మిత్రుడు అనే భావము గాని, లేనప్పుడు ఏ వస్తువును గురించి గాని దేహాభిమానము లేకుంటే వారు యోగులే కదా. యోగము లేకుండానే దేహాభిమానమెలా పోతుంది? యోగశక్తి సర్వ శ్రేష్ఠమైనది. యోగబలము ద్వారా మాత్రమే విజయము ప్రాప్తి అవుతుంది. విజయమాలలో మణిగా అవుతారు. మమ్మా జీవితములో వీటిని ప్రాక్టికల్‌గా చూశాము.

## భేద భావ రహితంగా బేహద్ ప్రేమ

ఢిల్లీలో ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు తన పత్నిని చాలా విసిగించేవాడు. పవిత్రత కారణంగా వారి ఇంటిలో జగడాలు జరిగేవి. పత్నిని కొట్టి తిట్టేవారు. చాలా సార్లు నీవు ఇంటి నుండి వెళ్లిపో అని అనేవాడు. దగ్గరుండే వారితో, బంధువులతో అతడు ఈమె ఇలా చేస్తుంది, అలా చేస్తుంది అని చెప్పేవాడు. ఇది సత్సంగానికి వెళ్లినప్పటి నుండి ఇంట్లో సరిగ్గా సేవ చేయడం లేదు, పిల్లల పాలన, పోషణ సరిగ్గా చేయడం లేదని చెప్పేవాడు. అతడు అసత్యము చెప్పేవాడు. కాని అసలు విషయము పవిత్రత కాని ఈ విషయం బయటకు ఎలా చెప్పగలడు? అతడు తన పత్ని పై చాలా కోపగించుకునేవాడు. ఒక రోజు అతడు ఆమెను ఇంటి నుండి వెళ్లగొట్టాడు. ఆ విషయము నిశ్చయమైనంత వరకు ఆమెను ఒక మహిళా ఆశ్రమములో ఉంచాము.

ఆ సమయములో రజోరి గార్డన్ సెంటరుకు మమ్మా వచ్చి ఉండినారు. నేను ఆ మహిళా ఆశ్రమము మేనేజరును మమ్మాతో కలిసేందుకు తీసుకెళ్తూ ఉండినాను. ఇంతలో తన పత్నిని ఇంటి నుండి వెళ్లగొట్టిన వ్యక్తికి మమ్మా అచ్చటకు వచ్చారని తెలిసింది. అతడు మా కంటే ముందే సెంటరుకు వెళ్లి జంకాణాలు ఎత్తివేసి, బల్బులు పగులగొట్టాడు. అంతేకాక కుర్చీలను చెల్లా-చెదురు చేసేశాడు. తన కోపమును, ఆవేశమునంతా వెళ్లగక్కి జగడము కూడా చేశాడు. అతడు మమ్మా ఎక్కడుందో నాకు చూపించండి. నన్ను మమ్మాతో మాట్లాడించండి. ఈ రోజు నేను ఏదో ఒకటి తేల్చుకునే వెళ్తాను. అతడు కొట్లాడేందుకు, గలాటా చేసేందుకు వచ్చాడని అక్కయ్యలు భయపడిపోయారు. అతనిని ఎలా శాంతపరచాలో తెలియక భయపడ్డారు. ఆ సమయానికి సెంటరులో అన్నయ్యలు ఎవ్వరూ లేరు. మమ్మా అన్నిటికంటే పై అంతస్థులో ఉన్నారు. అతడు మమ్మా ఎక్కడుంది? అని గట్టిగా అడిగాడు. మీరు మమ్మాను దాచిపెట్టారు. బయటకెందుకు రాదు? నేను ఆమెతో మాట్లాడాలి. నాతో మాట్లాడించండి. అక్కయ్యలు





మాతేశ్వరీ గారి జతలో పిల్లలు, యువకులు మరియు వృద్ధులు

అతని మాటలు వినలేదు. అతడు ఆ ఇంటిలోకి దూసుకెళ్లి మమ్మా కొరకు ఇల్లంతా పైనా - క్రింద వెతికాడు కాని అతనికి మమ్మా ఎక్కడా కనిపించలేదు. చివరికి అతడు అన్నిటికంటే పై అంతస్థుకు వెళ్లాడు. అక్కడ ఒక మంచము, ఒక కుర్చీ ఉన్నాయి. మమ్మా కుర్చీలో కూర్చుని ఉండినారు. ఆ వ్యక్తి అక్కడకు వెళ్తూనే మమ్మా కుర్చీ నుండి లేచి మంచము పై కూర్చుంది. మమ్మా అతనితో "రా! బిడ్డా రా! అని పిలిచి కూర్చో ఎందుకొచ్చావు ? అని చాలా ప్రేమగా రా బిడ్డా, కుర్చీలో కూర్చో! అని చెప్పారు. మమ్మా నుండి ఈ శబ్దాలు వింటూనే అతని కోపమంతా చల్లారిపోయి నీరుగారి పోయాడు. సత్యమైన మనస్సుతో మమ్మాను 'అమ్మా' అని అంటూ తను అడగవలసిందంతా మర్చిపోయాడు. కేవలం అమ్మా, అమ్మా, అమ్మా అంటూ ఉండిపోయాడు. మమ్మా - చెప్పు బిడ్డా ఎందుకొచ్చావు?" ఏమీ లేదమ్మా, ఏమీ లేదు అని అనసాగాడు. మమ్మాతో ఎంత ప్రభావితమయ్యాడంటే శాంతి, ఆనందానుభూతిని చేస్తూ తనను తాను మర్చిపోయాడు. మమ్మా అతనితో ఏమీ చెప్పలేదు. కేవలం ఎందుకు వచ్చావు? అని అడిగారు. రా

బిడ్డా కూర్చీలో కూర్చో! " అని పిలిచారు. అతను చాలా నమ్రతతో "వద్దమ్మా నేను క్రిందనే కూర్చుంటాను, ఇక్కడే బాగుంది" అని అన్నాడు. మమ్మా చెప్పగా చెప్పగా కూర్చీలో ఏమో కూర్చున్నాడు కాని తన విషయము తెలిపే సమయము వచ్చినప్పుడు చెప్పలేకపోయాడు. మమ్మాను చూస్తూ ఉండిపోయాడు. శాంతిగా చూస్తూ ఉండిపోయాడు. మమ్మా కూడా అతనికి దృష్టినిచ్చారు. ఆ దృష్టి ద్వారా అతనికి చాలా లాభమే కాక అనుభవము కూడా అయ్యింది. తర్వాత అతడు వెళ్ళిపోయాడు. బయటకు వెళ్ళి మమ్మా చాలా మంచిది అని చెప్పడం ప్రారంభించాడు. అతడు మమ్మా మాతృత్వము ద్వారా ఎంత ప్రభావితమయ్యాడంటే - అతని మనసు చాలా తేలికైపోయింది. మమ్మా ఎంత మహోన్నతమైనది! అని చెప్పసాగాడు. అతని మనసు పరివర్తనైపోయింది. తర్వాత అతను మమ్మాతో "మమ్మా నేను తర్వాత ఎప్పుడైనా వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు. నీవు ఎవరు? ఎక్కడ నుండి వచ్చావు? ఎవరిని అడిగి లోపలకు వచ్చావు? అని అతనిని మమ్మా అడగలేదు. అతనితో చాలా ప్రీతిగా మాట్లాడి అతనికి గౌరవమిచ్చారు. అతని మనసు పరివర్తనైపోయింది.

### తనవారైనా, పరాయి వారైనా అందరూ - వీరే మా తల్లి అని అనేవారు

ఆ రోజులలో అనేకమంది బాబాను కూడా నిందించేవారు. యజ్ఞ వత్సలు తమ నిందను కూడా వినేస్తారు, తర్వాత సంస్థను నిందించినా సహిస్తారు. ముఖ్యంగా ఎవరైనా బాబాను, ఎవరి పట్ల మనకు అనన్య ప్రేమ ఉందో, ఎవరితో మనము నూతన జీవితము పొందామో, వారిని ఎవరైనా నిందిస్తే వారిని గురించి ఉల్టా-సుల్టా చెడ్డ మాటలు మాట్లాడితే, ఎవరికైనా ఉత్తేజము కలుగుతుంది కాని ఇది కూడా ఉండరాదని మమ్మా జీవితాన్ని చూచి మేము నేర్చుకున్నాము. ఎవరైనా ఆదర్శముగా మన ముందు లేకుంటే ఎవరిని అనుసరించాలి? ఏదైనా ఇటువంటి ఆదర్శము మనముందు ఉండే తీరాలి. మహాత్ములకు నిర్వచనము ఏమంటే - మనసా, వాచా, కర్మణా ఒకే విధంగా ఉండువారు, లోపలా బయటా ఒకే విధంగా



ఉండువారు. మమ్మాగారి జీవితము నిర్మలంగా, సంపూర్ణ దర్పణము వలె ఉండేది. ఎవరైనా వారి వద్దకు వచ్చి కూర్చుంటే వారు తనవారు గాని, పరాయివారు గాని........... వారు "వీరు మా తల్లి" అని అనేవారు.

అమృత్‌సర్‌లో ఇదే విధమైన ఒక సంఘటన జరిగింది. అమృత్‌సర్‌లో చాలా కొట్లాటలు జరిగాయి, చాలామంది వ్యతిరేకించారు. చాలా పెద్ద గ్రూపు తయారయ్యింది. మీరు త్వరగా రండి అని టెలిగ్రాము వచ్చింది. అప్పుడు నేను కూడా అచ్చటికి వెళ్ళాను. బ్రిజ్‌మోహన్ భాయి తండ్రి కూడా అచ్చటకు వచ్చారు. మేము అచ్చటికి ఉదయమే చేరుకున్నాము. యోగములో ఒక పాట వినిపిస్తూ ఉంది. సుమారు 1500 మంది చేరి ఉన్నారు. వారంతా బయట నిలబడి ఆ పాట వింటూ ఉన్నారు. వాకిలి మూయబడి ఉంది. వారు మాటిమాటికి వాకిలి శబ్దము చేస్తూ - మమ్ములను లోపలకు రానీయండి, మేము మాతేశ్వరిగారితో మాట్లాడాలి అని అంటున్నారు. అక్కయ్యలు లోపల కూర్చుని ఉన్నారు. వారు వాకిలి తెరవలేదు. చివరికి వారు వాకిలి పగులగొట్టారు. ఇప్పుడు మాతేశ్వరీగారు మీతో కలుసుకోరు అని అక్కయ్యలు చెప్పగా వారు ఇంకా ఎక్కువగా కోపంతో మేము ఇంత మంది వస్తే ఆమె ఎందుకు కలవదు? మాకు కేవలం 5 నిమిషాలు మాత్రమే చాలు. ఇప్పుడు కలవకుంటే ఇంకెప్పుడు కలుస్తారు? తర్వాత ఆమె వెళ్ళిపోయిందని మీరంటారు. కావున మేము ఇప్పుడే ఆమెతో కలిసి వెళ్తాము. వాకిలి పగులగొట్టినప్పుడు 5 - 6 మంది మాతేశ్వరిగారితో మాట్లాడేందుకు ఏర్పాటైనవారు లోపలకు వెళ్ళారు. మమ్మా కూర్చుని ఉన్న మొదటి అంతస్థులోకి వారు వెళ్ళారు. అచ్చట క్లాసు, యోగము కూడా జరిగేవి. మమ్మా అచ్చట యోగములో కూర్చుని ఉన్నారు. అక్కడ చాలా డీప్(లోతైన. గాఢమైన) సైలెన్స్(శాంతి) ఉండినది. ఎలాంటి హల్‌చల్, గాభరా ఏ చింతా అక్కడ లేదు. మమ్మా చాలా ఆనందంగా(అతీంద్రియ సుఖము) యోగములో కూర్చొని ఉన్నారు.

మమ్మా యోగాన్ని చూచి వారికి కూడా అపారమైన శాంతి

అనుభవమవ్వసాగింది. వారిలో కూడా ఏ ద్వేషము, ఆవేశము లేకుండా పోయింది. వారు వెళ్ళి మమ్మా ఎదుట కూర్చుండిపోయారు. వారు కూడా ధార్మిక భావము గలవారైనందున ఇలా ఆలోచిస్తూ ఉండిపోయారు - మాతేశ్వరి ధ్యానములో కూర్చుని ఉన్నారు, వారికి విఘ్నము కలిగించరాదని అనుకున్నారు. వారు మమ్మాను చూస్తూ ఉండిపోయారు. కనులు తెరచుకునే ఉంది. కదలడమే లేదు. అంతేకాక స్థిరంగా ఉంది. వారికి కూడా చాలా ఆనందము కలిగింది. గది అంతటా శాంతి ప్రకంపనాలు వ్యాపించి ఉన్నాయి. వీరు పవిత్రమైనవారు అని వారికి అనుభవమయింది. కమలపుష్ప సమానము, కమల నివాసి అని ఇటువంటి అనేక ప్రకారాలైన అనుభూతులు కలిగాయి. వారు కూడా కొంచెము సేపు అలాగే చూస్తూ కూర్చుండిపోయారు. కొద్ది సమయము తర్వాత మమ్మా కనుల వైపు చూడసాగారు. మమ్మా నేత్రాల నుండి ప్రకాశమే ప్రకాశము కనిపిస్తూ ఉంది. ఎవరో టార్చిలైటు వేస్తున్నట్లు వారికి అనిపించింది, మమ్మా నలువైపులా ప్రకాశమే ప్రకాశము వారికి కనిపిస్తూ ఉంది. అది ఏమిటో వారికి అర్థమవ్వలేదు. కాని వీరి వెనుక ఏదో గొప్ప శక్తి ఉంది, వీరు సాధన చేశారని అర్థము చేసుకున్నారు. లేకుంటే ఒక సామాన్య మహిళ ఎవరైనా తెలియని క్రొత్త వ్యక్తులను చూచి భయపడిపోయేది లేక బిగ్గరగా అరిచేది లేక కొట్లాడేది. కాని వీరు ఎంతో శాంతిగా, నిశ్చలంగా ఉన్నారు. శాంతి శక్తితో మమ్మా వారిని శాంతిగా చేసేశారు. ఆ సమయంలో శాంతి శక్తి ఇచ్చే అవసరముంది, నోటితో మాట్లాడే అవసరము లేదు. ఆ నిర్బల ఆత్మలకు మమ్మా శాంతి శక్తినిచ్చారు. వారు ఇంకా కొంత సమయము కూర్చుని ఉండినారు. ఇప్పుడు ఏమీ మాట్లాడరాదని వారనుకున్నారు. మేము ఎక్కడ కూర్చున్నామో, అక్కడ శాంతిగా ఉండడమే బాగుంటుందని వారనుకున్నారు. అక్కడ కొంచెం శబ్ధం చేయడం కూడా బాగుండదని కూడా వారికి అనిపించింది. స్వయం వారికి వీరు ఎక్కడో శబ్ధ ప్రపంచానికి పైన గల ప్రపంచములో ఉన్నారని వారు అనుభవము చేశారు. ఒకే జాగాలో, ఒకే భంగిమలో, ఒకే ఆసనములో ఇంతసేపు ఉండడం అసాధారణ



విషయమని భావించారు. శరీరాన్ని స్వాధీనపరచుకున్నారు. నేత్రాలను, మనసును కూడా స్వాధీనపరచుకున్నారు అందుకే ఇంత స్థిరంగా కూర్చొని ఉన్నారు. వీరు మహోన్నతులు! అని భావించారు. వారిలో కొంతమంది ధార్మిక పుస్తకాలు చదివినవారు, భక్తి చేసినవారు కూడా ఉన్నారు. యోగమంటే వారి చుట్టూ ఇటువంటి శాంతి ఉంటుందని వారికి తెలుసు. ఈ విధంగా వచ్చిన మనుష్యులు తమ శత్రుత్వాన్ని మర్చిపోయారు. అంతేకాక అచ్చట నుండి సంతోషంగా వెళ్ళిపోయారు.

## పురుషార్థానికి అర్థము

ఈ రోజు కూడా బాబా మనకు మాటిమాటికి చెప్తున్నారు - " పిల్లలూ, మీ యోగస్థితి మనసా సేవ చేయగలుగునట్లుండాలి. చివర్లో ఇటువంటి సేవయే జరుగుతుంది. జనులు చాలా గాభరాపడుతూ, దు:ఖము, అశాంతితో ఉంటారు. మీరు దృష్టినిచ్చి వారికి శాంతిశక్తినివ్వాలి. మమ్మా జీవితములో ఈ ప్రియమైన స్థితులన్నీ నేను చూచాను. బాబా మమ్మాకు ఏ విషయమైనా మాటిమాటికీ చెప్పలేదు. మమ్మాలోని విశేషత ఏమంటే - ఎప్పుడైనా బాబా ఒక శిక్షణనిస్తే, రెండవసారి చెప్పే అవసరము బాబాకు ఉండేది కాదు. 'సరే బాబా' అని మమ్మా ఆ శిక్షణను తన జీవితములో అవలంభించారు. దీనినే పురుషార్థము అని అంటారు. మమ్మా స్వయంగా మురళి వినిపించేవారు. వాణి వినిపించేటప్పుడు వారు ఇలా చెప్పేవారు - అందరూ నేను పురుషార్థిని అని అంటారు, అప్పుడు మీరు " పురుషార్థి " అనే శబ్ధాన్ని ఏ భావముతో అంటారు, ఏ సందర్భములో అంటారు? ఏవైనా పొరపాట్లు మీ ద్వారా జరిగినప్పుడు ఇతరులకు నష్టము జరిగితే, వారితో, "సోదరా, నేను ఇంకా పురుషార్థిని కదా" అని అంటారు! అంటే 'పురుషార్థి' అనగా లోపాలు ఉండేవారని, బలహీనతలు ఉండి పొరపాట్లు, తప్పులు చేయవచ్చని మీరనుకుంటున్నారు. కాని పురుషార్థికి ఇది అర్థము కాదు. సత్యమైన పురుషార్థి అనగా - ఒక్కసారి చెప్పిన తర్వాత రెండవసారి చెప్పే అవసరముండరాదు. ఇదే సత్యమైన పురుషార్థము.

ఇటువంటి పురుషార్థము చేయాలి. ప్రాక్టికల్‌గా ఈ విషయాన్ని మమ్మా జీవితములో నేను చూశాను. బాబా ఏ శిక్షణనిచ్చారో, ఆ శిక్షణను వారు అదే విధంగా పాలన చేసి ఆచరించారు.

### బాబాకు సమీపంగా వచ్చేందుకు ఆధారము - పరివర్తన

బాబా మమ్మాగారిని నిమిత్తంగా చేశారు. ఎందుకంటే మమ్మా కొంత సమయములోనే ఏ గుణాలనైతే ధారణ చేయడంలో ఇంతవరకు అందరూ నిమగ్నమై ఉన్నారో, ఆ గుణాలను తమ జీవితములో ధారణ చేశారు. సంస్కారాలను పరివర్తన చేసుకోవాలని అనుకుంటున్నారు కాని చేసుకోలేకున్నారు. కాని మమ్మా చాలా త్వరగా తన సంస్కారాలను పరివర్తన చేసుకున్నారు. ఇది మమ్మాగారి అద్భుతమైన చర్య.

### దృఢ నిశ్చయము - ఎలా ?

మమ్మా నిశ్చయము చాలా దృఢమైనది, స్థిరమైనది. నిశ్చయములో కూడా అనేక రకాలుంటాయి. ప్రతి ఒక్కరి నిశ్చయము ఒకే విధంగా ఉండదు. చాలామంది శివబాబా వచ్చారని, ప్రపంచము చాలా చెడిపోయిందని అంగీకరిస్తారు,......... ఇది, అది,.......... అన్ని విషయాలలో నిశ్చయముంటుంది. కాని ఈ ప్రపంచము వినాశనమైపోతుంది అంటే అది ఎలా జరుగుతుందో వారికి అర్థము కాదు. కల్పము ఆయువు 5 వేల సంవత్సరాలని చెప్పినప్పుడు చాలామంది మాకు ఈ విషయాల పై ఇంతవరకు నిశ్చయము లేదని అంటారు. వారు ప్రతి రోజు క్లాసుకు వస్తారు. మురళిని ప్రతి రోజు వింటారు. మేము బాబా పిల్లలమని కూడా అంటారు. కాని నూటికి నూరు శాతము నిశ్చయము అనగా సంపూర్ణ నిశ్చయమని దేనినంటారో, అది వారిలో ఉండదు. ఒకటి - సంపూర్ణ నిశ్చయము, రెండవది - దృఢ నిశ్చయము. మమ్మా ఎప్పుడూ ఆ నిశ్చయము నుండి ప్రక్కకు కదలలేదు.

ఈ జ్ఞానములో కూడా చాలా ప్రగతి వస్తూ వచ్చింది. కొద్ది కొద్దిగా భేదము వస్తోందని కూడా కొంతమంది అంటారు. ప్రారంభములో ఇంత



లోతైన, సూక్ష్మమైన విషయాలు అర్థము చేసుకోలేకపోయేవారు. అందువలన బాబా ప్రారంభములో తెలిపిన విషయాలకు, తర్వాత తెలిపిన విషయాలకు బాగా గమనముంచి వింటే కొద్దిగా తేడా కనిపిస్తుంది. ఉదాహరణానికి ప్రారంభములో ఆత్మ అంగుష్టాకారమని చెప్పబడింది. తర్వాత అది జ్యోతిర్బిందు రూపమని తెలిపారు. అంగుష్టమైతే పెద్దది, జ్యోతిర్బిందువు చిన్నది. చాలా ఉపనిషత్తులలో కూడా - ఆత్మ అంగుష్టాకారమని వ్రాయబడింది. ఇక్కడ కూడా మొట్టమొదట ఆత్మ అంగుష్టాకారమని చెప్పబడుతూ ఉండేది. తర్వాత ఆత్మ చాలా సూక్ష్మమైనదని, అంగుష్ట రూపములో ఎలా ఉంటుంది? అని అర్థం చేయించారు. చాలామంది ఆత్మకు చాలా శరీరాలున్నాయని భావిస్తారు. మొదటిది ఈ స్థూల శరీరము, తర్వాత సూక్ష్మ శరీరము. అది మనసు, బుద్ధి, సంస్కారాలను కలిగి ఉంటుంది. ఆ తర్వాత కారణ శరీరము. కారణ శరీరమనగా ఏమి? జన్మ-జన్మాంతరాలుగా మనము చేసిన కర్మలు, సార రూపములో ఒక శరీరముగా తయారు చేయబడి ఉంటుంది. వ్యక్తికి ఏమి జరిగినా, అది కారణ శరీరముతో ప్రారంభము అవుతుందని వారి అభిప్రాయము, నమ్మకము.

### స్థిర నిశ్చయమెలా ?

ఒకసారి మమ్మా కోర్టుకు వెళ్లవలసి వచ్చింది. వారు ఒక చిన్న కన్య కాని అచ్చట వచ్చినవారందరూ ఎంతో గొప్ప మనుష్యులు. వారి ముందు కోర్టులో మమ్మాను - ఈ దాదా లేఖ్‌రాజ్ కన్యలనందరిని తన ఒడిలోకి ఎందుకు తీసుకుంటారు? అని అడిగారు. అందుకు మమ్మా - "వారు మా పితామహుడు, తండ్రి పిల్లలను తన ఒడిలోకి తీసుకుంటే తప్పు చేసినట్లా?" మీరు ఈ ప్రశ్న అడుగుతూ ఉంటే ఆశ్చర్యంగా ఉంది, ఈ ప్రశ్నను అడగడం మీకు శోభిస్తుందా? మీరు కూడా తండ్రులే, మీరు మీ పిల్లలను ఎప్పుడూ ఒడిలోకి తీసుకోలేదా? అని మమ్మా కఠినంగా జవాబునిచ్చారు. ఎలాంటి సంకోచము ఉంచుకోలేదు, సిగ్గుపడలేదు,

ఎందుకు? ఎందుకంటే బాబా మనసు ఎంత నిర్మలమయ్యిందో, ఎంతవరకు శుద్ధమైనదో వారికి తెలుసు. అంతేకాక వారి ఒడి స్వర్గము కంటే గొప్పది! ఎవరైతే వారి ఒడిలోకి పోతారో, వారు ఈశ్వరీయ వారసత్వానికి హక్కుదార్లుగా అవుతారు. కావున మమ్మాకు ఈ నిశ్చయము స్థిరంగా ఉండేది. ఈ నిశ్చయము నుండి వారెప్పుడూ ప్రక్కకు కదలలేదు. అనేకమార్లు అనేకమంది ప్రాణము కాపాడుకునేందుకు కొంచెం ఇటు-అటు మాట్లాడ్తారు. వారు మాట వచ్చినప్పుడు చూసుకుంటాములే ఇప్పుడు మేము కష్టంలో పడి ఉన్నాము, కావున ఇప్పుడు ఇలా చెప్తాము తర్వాత అలా చెప్తాము అని అంటారు. కాని మమ్మా అలా కాదు. ఆమెను శక్తి స్వరూపమనవచ్చు. మమ్మా అటువంటి శక్తిశాలి నిశ్చయము గలవారు. కావున మమ్మా దృఢ నిశ్చయము, సంపూర్ణ నిశ్చయము, స్థిర నిశ్చయము, శక్తితో కూడిన నిశ్చయము గలవారు. ప్రతి ఒక్కరు తమ తమ నిశ్చయాలను చూచుకోండి - ఆ నిశ్చయంలో ఈ విషయాలన్నీ ఉన్నాయా? ఎప్పుడూ మమ్మా జీవితములో ఆమె నిశ్చయాన్ని కొద్దిగానైనా కదిలించే విషయమేదీ రాలేదు. చాలామంది సంపూర్ణ బ్రహ్మచర్యాన్ని పాలన చేస్తే ఈ ప్రపంచమెలా నడుస్తుంది? అని అంటారు. విషయమైతే మంచిదే, అయితే ప్రపంచమెలా నడుస్తుంది? మనము అలాగే జన్మించాము. ఇతరులకు అలా చేయకండి అని ఎలా చెప్పాలి? అని అంటారు. వారు ఇంత హఠంగా పవిత్రత విషయము పాటించలేరు. కాని మమ్మా చాలా దృఢంగా(హఠంగా) జవాబిచ్చేవారు, చాలాసార్లు జనము వారితో ఇలా అనేవారు - ఎవరు లడ్డు తినలేదో, వారికి దాని రుచి ఎలా తెలుస్తుంది? కావున గృహస్థములో ఉండే సుఖము కన్యలైన మీకేమి తెలుసు? ఇల్లు, పరివారములో ఉండే మజా మీకేమి తెలుసు? మీకు దాని అనుభవమే లేదు. అప్పుడు మమ్మా అనేవారు - ఒకరు చేయి కాల్చుకుంటే, మేము కూడా చేయి కాల్చుకొని చూడమన్నట్లు మీరు మాట్లాడ్తున్నారు. అరే! ఒకరు మా ముందే చేయి కాల్చుకొని అనుభవము చేస్తున్నారు. చేయి కాల్చుకున్న ఫలితము ఏదో మేము చూస్తున్నాము. మేము కూడా కాల్చుకొని చూడాలా? మీరు వికారులు



కదా, మీరు ఏ సుఖము పొందారో తెలపండి అని మమ్మా భయపడక సంపూర్ణ నిశ్చయముతో మాట్లాడేవారు. ఇది మమ్మాగారి చాలా గొప్ప విశేషత.

## సమస్త మానవ జాతికి తల్లి

చాలామంది మనస్సులలో ఈ ప్రశ్న ఉదయించి ఉండవచ్చు. మమ్మాగారినే బాబా ఎందుకు ముందుంచారు? వారినే ఎందుకు ఎన్నుకున్నారు? మొదటి విషయము వారి నిశ్చయము, రెండవది పవిత్రత. పవిత్రత అనగా కేవలం బ్రహ్మచర్యమే కాదు. పవిత్రత అనగా మనసా, వాచా, కర్మణా పవిత్రత వికారాలను ఓడించుట. వాటి పై విజయము పొందుట. నిషేధించబడిన సంకల్పాలు కాని, చెడు సంకల్పాలు కాని రారాదు. అరే! మమ్మా మనసు ఎంత నిర్మలంగా, ఎంత శుద్ధంగా ఉండేదంటే ఎవరైనా ఆమె ముందుకు వెళ్తూనే తల వంచి నమస్కరించేవారు. అమ్మా, అమ్మా అను శబ్ధాలు వారి నోటి నుండి వెలువడేవి. వారు 70 సంవత్సరముల వయస్సువారైనా, 80 సంవత్సరముల వయస్సువారైనా, 20 సంవత్సరముల యువకులైనా వారిని చూస్తూనే అందరి నోటి నుండి ఈమె తల్లి, మా తల్లి అనే మాట వెలువడేది. మమ్మాను కలుసుకనేందుకు అనేక పట్టణాల నుండి చాలామంది దేవీల పూజార్లు వచ్చేవారు. వార్తాపత్రికల గొప్ప ఎడిటర్‌లు(సంపాదకులు) వచ్చేవారు, అనేకమంది ప్రసిద్ధ రచయితలు, ఎవరి పుస్తకాలైతే చాలా ప్రచురింపబడ్డాయో, చాలా అమ్మకము అయ్యేవో వారు కూడా వచ్చారు. మమ్మాతో కలిసినప్పుడు వారు మోకాళ్ళ పై కూర్చున్నారు, కొంతమంది సాష్టాంగ నమస్కారము కూడా చేశారు. చిన్న పిల్లల వలె అమ్మా, అమ్మా - అంటూ కన్నీరు కారుస్తూ ఉండిపోయారు. అది ఏమి ఇంద్రజాలమో! ఎవ్వరికీ తెలియదు. మేము మా కనులతో మమ్మాగారి ఈ ప్రభావాన్ని చూశాము. వారి వ్యక్తిత్వానికి ఎంత ప్రభావముండేది! వారి మానసిక ప్రకంపనల ప్రభావము జనుల పై ఎంతగానో పడుతూ ఉండేది. మమ్మాను

చూచి ఈ సంస్థ చాలా మంచిదని, వీరి ధారణలు బాగున్నాయని వారికి అనిపించేది. పిల్లలైన మీరు బాబాను ప్రత్యక్షము చేసే షోకేసులోని షోపీసులు వారు అని బాబా అనేవారు. ఇందుకు మమ్మా ఒక శ్యాంపుల్‌గా (ఉదాహరణ)గా ఉండేది.

### మమ్మా పట్ల బాబాగారి అనంతమైన ప్రీతి, గౌరవము

ఒకసారి వర్షాకాలము, చాలా జోరుగా వర్షిస్తోంది మమ్మా సేవ కొరకు ఏదో ఒక దూర పట్టణానికి పోయి వెళ్లారు. అది మమ్మా మధువనానికి వచ్చే రోజు. బాబా అన్నారు - పిల్లలూ! ఆలోచించండి, మమ్మా వస్తున్నారు, ఆమె ఈ ప్రపంచమంతటికి తల్లి అని మీ అందరికి తెలుసు. ఆ జగన్మాతను వర్షములో తడవనిస్తారా?(ఆ రోజులలో ఆబూలో చాలా వర్షము పడేది. మమ్మా మరుసటి రోజు ఉదయము రావలసి ఉంది). తెల్లవారేసరికి ఒక షెడ్డు తయారుచేయండి. దాని క్రింద టాక్సీ రావాలి.



రైల్వే స్టేషన్‌లో మమ్మాకు సేవార్థముగా వీడ్కోలునిస్తూ బాబా మరియు విశ్వ కిశోర్ భావు మరియు ఇతర సోదర - సోదరీలు



మమ్మా టాక్సీ దిగి తమ గదిలోకి వెళ్ళాలి. మమ్మా కొరకు బాబా మనస్సులో ఎంత ఉన్నత భావముండేది! మమ్మా సేవార్థము బయటకు పోవునప్పుడు బాబా ఆమెను విడిచి పెట్టేందుకు రైల్వేస్టేషను వరకు వెళ్ళేవారు. బాబా శిక్షణ ఇచ్చేవారు. పిల్లలందరికీ నేర్పించేందుకై వారే స్వయంగా చేసి చూపించేవారు. తమకంటే పెద్దలను ఎలా గౌరవించాలో చేసి చూపించేవారు. ఈ యజ్ఞములో ఎవరి స్థానమేదో తెలిపి వారి పట్ల మా మనోభావనలు, మాట్లాడే పద్ధతి, మా నడవడికలు, మా వ్యవహారము ఎలా ఉండాలో బాబా చేసి మాకు నేర్పించేవారు.

### మమ్మా తమ సంస్కారాలను ఎలా పరివర్తన చేసుకున్నారు ?

శివబాబా శిక్షణ ఇచ్చేవారు, సద్గురువు కనుక వారి నుండి లభించిన శిక్షణలను మమ్మా తమ జీవితములో ధారణ చేశారు. మమ్మా శరీరము లేక ప్రకృతి లేక వారి ముఖము చాలా సేవ చేస్తూ ఉండేది. మమ్మా నుండి వచ్చే పవిత్రతా ప్రకంపనాలు చాలా శక్తిశాలిగా ఉండేవి. అవి మనసా సేవ చేసేవి. మనము కూడా మనలో అలాంటి స్థితిని తెచ్చుకోవాలి. ఈ మాట నేను చెప్పాలని అనుకునేవాడిని. మమ్మాకు కూడా పిల్లల పట్ల ఇదే ఆశ ఉండేది.

# మాతేశ్వరి సమస్త ప్రపంచానికి తల్లి

* బ్రహ్మాకుమార్ భ్రాతా రమేష్‌షాహ్ గారు మమ్మా సంబంధములో తమ అనుభవాన్ని వినిపిస్తున్నారు. 1955 సంవత్సరములో మమ్మాగారు బొంబాయికి వచ్చారు. నా లౌకిక తల్లి నన్ను - " మాతేశ్వరి వచ్చారు వారిని కలుసుకునేందుకు వస్తావా? " అని అడిగారు. అందుకు నేను తప్పకుండా వస్తాను, వారితో అపాయింట్‌మెంట్(అనుమతిని) తీసుకోండి, ఎందుకంటే వారిని కలుసుకునేవారు చాలామంది ఉంటారు. అంతేకాక వారికి చాలా కార్యక్రమాలు కూడా ఉంటాయి అని అన్నాను. సాయంకాలము 5-6 గంటల మధ్య వారు నాకు సమయమిచ్చారు. నేను మమ్మాను చూడడం అదే మొదటిసారి. మమ్మా పార్సీ శైలిలో చీర కట్టుకునేవారు. మొదటి కలయికలోనే మమ్మాతో ఒక అదృశ్యమైన అవినాశి సంబంధము ఏర్పడిపోయింది. ఈ సంబంధము వల్లనే నా జీవితములో చాలా పరివర్తన వచ్చేసింది. చాలా సమయము మమ్మా నా జతలో ఉండినారు. మమ్మా నా తల్లిగా అయ్యి చాలా విషయాలను తెలిపించారు, నేర్పించారు. తల్లి ప్రథమ గురువు అని అంటారు కదా. అదే విధంగా మమ్మా నాకు ఈశ్వరీయ జీవితములో గురువు-తల్లిగా ఉండి చాలా విషయాలు నేర్పించారు. నేను మమ్మాను అనేక చిక్కు ప్రశ్నలు, వంకర ప్రశ్నలు అడిగేవాడిని. అయినా మమ్మా ఆ ప్రశ్నలన్నిటికి చిరునవ్వుతో జబాబులిచ్చి మనస్సుకు ఊరట కలిగించేవారు.

ఒకసారి మమ్మాను "మీ కంటే ముందు జ్ఞానములోకి వచ్చిన సోదరీలు చాలామంది యజ్ఞములో ఉన్నారు. అయినా మీరు పురుషార్థములో అందరికంటే ముందుకు పోయారు. అందరికంటే ముందుకు తీసుకెళ్ళిన మీలోని ప్రత్యేక విశేషత ఏది?" అని అడిగాను. అందుకు మమ్మా - ఇది చాలా కఠినమైన ప్రశ్న. ఎందుకంటే ఏ వ్యక్తి అయినా ఒకే ఒక్క విశేషత ద్వారా ముందుకు పోలేరు. చాలా విశేషతలు

* భ్రాతా రమేష్ గారు ఈ ఈశ్వరీయ విశ్వ విద్యాలయములోని సీనియర్ (వరిష్ఠ) సోదరులలో ఒకరు. వీరు బొంబాయిలో ఉంటూ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము బాధ్యతలను సక్రమంగా నిర్వహించారు. వీరు జనవరి 28, 2017న తమ పార్థివ శరీరాన్ని త్యాగము చేసి బాబా ఒడిలోకి చేరుకున్నారు.





(కుడి నుండి ఎడమ) దైవీ మాత, నిర్మల్‌శాంతా దాది, పుష్పశాంత దాది మరియు అందరికంటే వెనుక రమేష్ అన్నయ్య మరియు ఇతర అన్నయ్యలు - అక్కయ్యలు

ఉంటాయి. వాటన్నిటి కలయిక ద్వారా ఆ వ్యక్తి జీవితములో ముందుకు వెళ్తారు అని అన్నారు. దానికి నేనన్నాను - అలా కాదు, నేను ఒకే విషయము తెలుసుకోవాలనుకుంటున్నాను. పురుషార్థములో మీరు ముందుకు వెళ్ళిన మీలోని విశేషత ఏది? చాలా సమయము ఆలోచించిన పిదప మమ్మా అన్నారు - నేను ఇలా అనుకుంటున్నాను - నాలోని దృఢత ఒకసారి ఏదైనా సంకల్పము చేస్తే, దానిని ఏ పరిస్థితిలోనైనా పూర్తి చేసే తీరాలి. ఈ గుణముతోనే నేను ముందుకు వెళ్తున్నాను.

## సర్వులకు గౌరవమునిచ్చు సర్వులచే ఆదరింపబడిన మమ్మా

మమ్మా ప్రతి ఒక్కరికి చాలా స్నేహముతో పాటు గౌరవము కూడా ఇచ్చేవారు. ఒకసారి జరిగిన విషయము - నేను మమ్మాతో - "మమ్మా మీలో ఒక విషయము నాకు నచ్చలేదు" అని అన్నాను. మమ్మా - "ఏ విషయము? అని అడిగారు. అందుకు నేను - "మమ్మా, లౌకికములో ఏ

తల్లి అయినా తన కుమారుని మీరు - మీరు అని సంబోధించరు, నీవు అని అంటుంది. మీరు నన్ను మీరు అనే శబ్ధముతో సంబోధిస్తున్నారు. దీని అర్థమేమంటే మీరు నన్ను మీ పుత్రునిగా స్వీకరించలేదు.” అందుకు మమ్మా అన్నారు - అలా ఏమీ కాదు. మీరు బాబాను మీ వారిగా చేసుకున్నారు. దానికంటే ముందు మమ్మా మిమ్ములను తనవారిగా చేసుకున్నారు. నేనన్నాను - అయితే నన్ను మీరు నీవు అని ఏకవచనముతో మాట్లాడరు? ఈ విధంగా మీరు నన్ను - మీరు-మీరు అనే శబ్ధము నాకు చాలా భారమనిపిస్తుంది. నేను వయస్సులో కూడా మీ కంటే పెద్ద కాదు. మీరు మీ భవిష్యత్తులో విశ్వమహారాణి శ్రీ లక్ష్మి రూపములో, వర్తమాన సమయములో జగజ్జనని అంబ రూపములో భగవతి సరస్వతి రూపములో పూజింపబడ్తున్నారు. ఇంత గొప్పవారైనా, మీరు నన్ను ఇలా ఎందుకు సంబోధిస్తున్నారు? అందుకు మమ్మా అన్నారు - చూడండి రమేష్‌గారు, ఈ సృష్టి నాటకములో ప్రతి ఆత్మ శ్రేష్ఠమైనదే. అది తన పాత్ర చేస్తూ ఉంది. మనమందరము పరమపిత సంతానము. ఆత్మలము ఒకరికొకరు సోదరులము. కనుకనే పరస్పరములో ప్రేమ గౌరవాలతో వ్యవహరించాలి. లోక వ్యవహారార్థము నేను మిమ్ములను మీరు అని సంబోధిస్తున్నాను. మమ్మా నన్ను తన బిడ్డ రూపములో స్వీకరించలేదని మీరు అనుకోకండి. ఈ విధంగా మమ్మా మాకు ప్రతి వ్యక్తితో దూరదృష్టి గలవారై గౌరవము మరియు స్నేహముతో వ్యవహరించాలి అని నేర్పించారు.

### సదా ఆధారము, తోడునిచ్చి అభయమిచ్చువారు

బొంబాయిలో మొదటిసారిగా ప్రదర్శినీ చేస్తామని మమ్మాను అడిగాను. ఎంత ఖర్చు అవుతుందని మమ్మా అడిగారు. బాబా పర్మిషన్(అనుమతి) ఇవ్వాలి కదా! అని నేనన్నాను. బాబా తరపు నుండి మమ్మా పర్మిషన్ ఇస్తున్నారు. ఖర్చు ఎంత అవుతుందో చెప్పమన్నారు. నేను అందాసుగా ఇంత అవుతుందని చెప్పాను. మీరు ప్రదర్శిని ఏర్పాటు చేసుకోండి అని మమ్మా పర్మిషన్ ఇచ్చారు. ఈ విధంగా నా కొరకు మమ్మా



సమ్మతి సదా ఉండేది.

ప్రదర్శిని కొరకు చిత్రాలు తయారు చేయవలసి వచ్చేది, చిత్రాలు తయారైన తర్వాత కరెక్షన్(సంశోధనము) కొరకు వాటిని బాబాకు పంపేవారము. బాబా కరెక్షన్ చేసి పంపేవారు. ఒకసారి బాబా జాబులో వ్రాశారు - ఈ పుత్రుడు(రమేష్) చిత్రాల వెనుక పిచ్చివాడైపోయాడు. ఎక్కువ చిత్రాలు తీసుకొనిపోయి ఏమి చేస్తారు. కల్పవృక్షము, త్రిమూర్తి, సృష్టి చక్రము(గోలా) ఈ మూడు చిత్రాలే చాలు. ఆ జాబు క్రింద భాగములో ఒక మూలలో మమ్మాగారి ఉత్సాహము నింపు శబ్ధాలు కూడా ఉన్నాయి - పుత్రా రమేష్, మీరు చేస్తూ ఉండేది చాలా బాగుంది, బాబా మిమ్ములను పరీక్ష చేస్తున్నారు. మీరు చిత్రాలు తయారుచేస్తూ ఉండండి. ఈ విధంగా నా జీవితములో మమ్మా ఆధారమనండి, ధైర్యమనండి, పక్షపాతమనండి, అది సదా నా పై ఉండేది. అదే సంవత్సరము 29 డిశెంబరున ప్రదర్శిని ఉద్ఘాటన జరిగింది. మమ్మా కూడా వచ్చారు.

### డ్రామా పై అచంచలమైన, స్థిరమైన విశ్వాసము

ఇది నేను మధువనంలో ఉన్నప్పటి విషయము. ఆ రోజు మమ్మా హాపుడ్‌కు వెళ్లి అన్ని సెంటర్లు తిరిగి వచ్చే రోజు. సాయంకాలమే మమ్మా మధువనానికి చేరుకున్నారు. అప్పుడు వారికి గొప్ప స్వాగతము ఏర్పాటు చేయబడింది. ఆ రోజు రాత్రి బాబా-మమ్మా కూర్చొని ఉండినారు. మమ్మా హాపుడ్‌లో జరిగిన హంగామా(గలాటా) విషయము బాబాకు వివరంగా వినిపిస్తున్నారు, నేను కూడా అక్కడనే ఉన్నాను. మమ్మా బాబాకు అచ్చటి విరోధి వర్గమువారు ఏమి చేశారో, ఎలా చేశారో మొదలైన విషయాలు వినిపిస్తూ ఉండినారు. బాబా శాంతచిత్తులై వింటున్నారు. మమ్మా ఏకరసమై తెలుపుతూ ఉన్నారు. నేను వారి వార్తాలాపము వింటున్నాను. నా మనస్సులో ఒక ప్రశ్న తలెత్తింది. తర్వాత మమ్మాను - “మమ్మా మీరు స్వయంగా హాపుడ్ పరిస్థితి చూచి వచ్చారు. బాబాకు అన్ని విషయాలు వినిపిస్తూ కూడా ఉన్నారు. మీరు జరిగిన హంగామా అంతా చూస్తున్నప్పుడు మీ



ముంబయి - ప్రథమ విశ్వ నవ నిర్మాణ ఆధ్యాత్మిక చిత్రప్రదర్శినీని అవలోకన చేస్తూ మాతేశ్వరి గారు

మనసులో ఏదైనా ఆందోళన మొదలైనవి ఉత్పన్నమయ్యాయా? అని అడిగాను. మమ్మా అందుకు - “నాకే ఆందోళన కలుగదు అని అన్నారు.” నేను మళ్లీ - “ఎందుకు కలుగదు?” అని అడిగాను. మమ్మా బాబాను చూస్తూ అన్నారు - “ఒక విషయములో నాకు పక్కా నిశ్చయముంది - 5 వేల సంవత్సరాల క్రితము ఎలా స్థాపన అయ్యిందో ఇప్పుడు కూడా అదే విధంగా స్థాపనవుతోంది. ఇప్పుడు ఏ ఏ హెచ్చు-తగ్గులు, విఘ్నాలు, పరిస్థితులు మొదలైనవి వస్తున్నాయో అవి 5 వేల సంవత్సరాల క్రితము కూడా వచ్చాయి. ఈ విధంగా చాలా విషయాలు వస్తాయి, పోతాయి. కనుక ఈ విషయాల వలన నా స్థితి చెడిపోదు. నేను కూడా ఆందోళన చెందను. ” ఈ విధంగా డ్రామా పై మమ్మాకున్న అచల విశ్వాసాన్ని చూచి నేను ఎంతో నేర్చుకున్నాను.



## ప్రేమ మనమివ్వకపోతే మరెవ్వరిస్తారు ?

నేను ఒకసారి మమ్మాతో అడిగాను - “మమ్మా మీ వద్దకు ఎవరు వచ్చినా, తమ కష్టాలు మొదలైనవి వినిపిస్తారు లేక ఇతరుల లోపాలను, బలహీనతల గురించి వినిపిస్తారు. మంచి మాటలు వినిపించేందుకు ఎవ్వరూ రానే రారు” అని అన్నాను. అందుకు మమ్మా - “ఈ మాట సత్యమే” అని అన్నారు. అప్పుడు నేను - “ఎవరైనా ఈ విధంగా వినిపిస్తే దాని ప్రభావము నా పై పడ్తుంది. ఆ వ్యక్తిని అదే దృష్టితో చూడడం ప్రారంభిస్తాను. మీ పై అటువంటి ప్రభావము పడదా?” అని అడిగాను. అందుకు మమ్మా ఇలా అన్నారు - “ ప్రతి ఒక్కరు పురుషార్థులే అని నేను భావిస్తున్నాను. ప్రతి ఒక్కరు పురుషార్థము చేసి స్వయాన్ని పరివర్తన చేసుకునేందుకు, ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రయత్నము చేస్తూ చేస్తూ కొంతమంది ముందుకు వెళ్తారు, కొంతమంది ఫెయిల్ అయిపోతారు, కొంతమంది నెమ్మది నెమ్మదిగా పురుషార్థము చేస్తారు, కొంతమంది ఆగిపోతారు. మమ్మాకు ఇది ఒక పాఠశాల అని కూడా తెలుసు. పాఠశాలలో అన్ని రకాల విద్యార్థులుంటారు. కొంతమంది మంచి తెలివిగలవారు, కొంతమంది డల్‌గా(బలహీనంగా) ఉంటారు. పరీక్షలలో అందరూ మొదటి నెంబరులో అయితే పాస్ అవ్వరు. కొంతమంది మొదటి నెంబరులో, కొంతమంది రెండవ నెంబరులో, కొంతమంది మూడవ నెంబరులో పాస్ అవుతారు, కొంతమంది పాస్ కూడా కారు. రాజధాని స్థాపన అవుతూ ఉందని కూడా నాకు నిశ్చయముంది. రాజధానిలో నంబరువారుగా ఉండనే ఉంటారు. రాజధానిలోని అన్ని వర్గాల వారు ఇక్కడే తయారవ్వాలి. ప్రతి ఒక్కరు ఆ పదవి ఆధారముతో తయారైన సంస్కారమనుసారము ఇక్కడ తమ పురుషార్థము చేస్తారు. అందువలన ఎవరైనా ఎవరి గురించి ఎమి చెప్పినా నేను ఎవరి అవగుణాలు గాని, బలహీనతలు గాని, నా మనసులో ఉంచుకోను. ఆ పుత్రుని పట్ల నాలో నకారాత్మక భావాన్ని ఎప్పుడూ నిర్మాణము చేయను. ఏ పుత్రుడైతే

వినిపించేందుకు వచ్చాడో అతని పట్ల, ఎవరిని గురించి వినిపిస్తున్నాడో అతని పట్ల ఇరువురి పై కూడా నా మనసులో కళ్యాణ భావన, స్నేహ భావన ఉంటుంది. అందరినీ ముందుకు నడిపించే శుభ భావనే ఉంటుంది. ఇరువురి పట్ల నేను స్నేహాన్ని, గౌరవాన్ని చూపిస్తాను. ఎందుకంటే వారికి ప్రేమ మనమివ్వకుంటే ఇంకెవరిస్తారు?

మమ్మా బొంబాయి వచ్చినప్పుడు వారికి బాబా శ్రీ లక్ష్మీ, శ్రీ నారాయణుల చిత్రాలను తయారు చేసే బాధ్యతనిచ్చారు. ఘాట్‌కోపర్‌లోని నళిని బహన్‌గారి తండ్రి అయిన కాకూభాయి వద్ద పరమానందుడు అనే ఒక చిత్రకారుడుండేవాడు. అతనితో చిత్రాలు తయారు చేయించేవారు. మమ్మా అనేవారు - ఇది ప్రథమ విశ్వమహారాణి - విశ్వమహారాజుల చిత్రము. అందువలన చిత్రము చాలా బాగుండాలి. ప్రతి చిన్న విషయానికి మమ్మా అవ్యక్త బాబా వద్దకు సందేశము పంపి సలహా తీసుకునేవారు. శ్రీ లక్ష్మి - శ్రీ నారాయణుల కంఠములో ఎన్ని మాలలు ఉండాలి? మాలలో ఎన్ని వజ్రాలు, ఎన్ని ముత్యాలు, ఎన్ని రత్నాలు మొదలైనవి ఉండాలో అంతేకాక నడుముకు పెట్టుకునే వడ్డాణము పై కూడా ఎన్ని వజ్రాలు మొదలైనవి ఉండాలో అన్ని విషయాల విస్తారమైన విజ్ఞతను బాబా నుండి మమ్మా తీసుకునేవారు. ఇది కూడా భవిష్యత్తులో సేవ చేసేందుకు మాకు ఒక ప్రశిక్షణ(ట్రైనింగ్)గా ఉండేది.

### నాకు మాతేశ్వరీగారు అంటే అతి ప్రీతి ఎందుకు ఉండినది ?

(రమేష్‌భాయి గారి అనుభవామృతము) నేను నా మస్తీ(నషా)లో మస్త్ అయినప్పుడు చాలాసార్లు నాకు నేనే అనేక ఉల్టా సీదా(అర్థము పర్థము లేని) ప్రశ్నలు వేసుకుంటూ ఉంటాను, ఒకసారి ఇటువంటి అవస్థలో నాకు నేనే ఇలా ప్రశ్నించుకున్నాను - రమేష్ నీకు బాబా పై ఎక్కువ ప్రేమనా? లేక మమ్మా(శ్రీ మాతేశ్వరిగారి) పైననా? ఈ ప్రశ్న తమాషాకు నాకు నేనే ప్రశ్నించుకున్నాను. ఆంతరికము నుండి మమ్మా పై ప్రేమ ఎక్కువ అనే జవాబు వచ్చింది. ఎలాగైతే లౌకిక ఇంట్లో కూడా చిన్న పిల్లలను



అడుగుతారు కదా - నీకు మమ్మీ(అమ్మ) ఎక్కువ మధురమనిపిస్తుందా లేక పప్పా(తండ్రి)నా? అదే విధంగా ఇది కూడా చిన్న పిల్లల ప్రశ్న. ఇందుకు కారణము కూడా చాలాసార్లు ఆలోచిస్తే మాతేశ్వరీగారు మాతో పాటు 18 మాసాలు మా లౌకిక ఇంట్లోనే ఉన్నారు. ప్రతి రోజు కారులో సెంటరుకు వెళ్లి మాతేశ్వరిగారి మురళిని వినడం, రాత్రులు వారితో పాటు భోజనము చేయడం, మొదలైన అనేక విషయాల కారణంగా మాతేశ్వరిగారి పట్ల అధిక శ్రద్ధాయుక్త ప్రేమ కలిగింది. ఇంకా ఎక్కువ ఆలోచిస్తే నాకు ఓహో! ఎంత ఆశ్చర్యము అనిపిస్తుంది. మాతేశ్వరి అనుపమ(పోలిక లేని) పురుషార్థానికి ప్రతీక వలె ఉన్నారు. పితాశ్రీ అయితే పరమపిత పరమాత్మకు భాగ్యశాలీ రథము భగీరథుడుగా ఉన్నారు. వారిది 60 సంవత్సరాల అనుభవము గల శరీరము అంతేకాక స్వయం అపార సంపదకు యజమానిగా ఉండేవారు. అందువలన నాకు అర్థమైనంతలో మొదటి నంబరు పదవిని ప్రాప్తి చేసుకునేందుకు ఇంత పురుషార్థము చేయవలసిన అవసరమే లేదనిపించింది. ఈ పదవి వారికి చాలా స్వాభావికంగానే ఉండినది. మాతేశ్వరి ఈ యజ్ఞములోకి వచ్చినప్పుడు వారి వయసు కూడా చాలా చిన్నది. గృహస్థ వ్యవహారములో వారికెలాంటి అనుభవము కూడా లేదు. ధనము మొదలైన వాటితో తండ్రికి సహాయకారిగా కూడా అవ్వలేదు. అనగా ఏ దృష్టితో చూచినా, పరిస్థితులు వారికి విపరీతంగానే ఉన్నాయి. పితాశ్రీకి అయితే అన్ని విధాలుగా పరిస్థితులు సానుకూలంగానే ఉండేవి.

ఒకసారి పూనాలో నేను మాతేశ్వరితో పాటు పడిపోయిన పాన్‌షేన్ ఆనకట్ట కారణంగా జరిగిన అపార నష్టాన్ని చూచేందుకు వెళ్లాను. అచ్చట కొద్ది దూరము నడిచి వెళ్లవలసి వచ్చింది. నడుస్తూ నడుస్తూ మేమందరము మమ్మా కంటే ముందుగా వెళ్లిపోయాము. మమ్మా ఒంటరిగా వెనుక ఉండిపోయారు. కొంత దూరము వెళ్లిన తర్వాత మమ్మా కొరకు ఆగి మమ్మా వచ్చిన తర్వాత మమ్మాతో - "మమ్మా మీరు నడవడంలో చాలా వెనుక పడిపోయారు. చాలా సార్లు బాబా కూడా మాతో తిరిగేందుకు నడచి వచ్చేవారు. కాని వారు ఎంత వృద్ధులైనా సదా మా సమానంగానో

లేక చాలాసార్లు మా కంటే ముందుగా కూడా నడిచి వెళ్ళిపోయేవారు" అని అన్నాను. మమ్మా నవ్వుతూ నవ్వుతూ - రమేష్‌గారు, "బాబా సాటిలేనివారు అక్కడ ఒకే శరీరములో రెండు ఆత్మలు, అందులోనూ ఒకటేమో పరమాత్మ, రెండవది వారి ఆత్మ కావున రెండు ఇంజన్ల బండి, ఒక ఇంజన్ బండి కంటే తప్పకుండా వేగంగా వెళ్ళిపోతుంది కదా! పూనాకు వచ్చునప్పుడు కూడా దారిలో రెండు ఇంజన్లు తగిలిస్తారు. కావున తప్పకుండా ఇందులో రహస్యము నిండి ఉంది. బాబా తప్పకుండా మనకంటే ముందే వెళ్తారు. ఎందుకంటే మనమంతా సింగల్ ఇంజన్‌వారము. అంతేకాక బాబా ఇంజన్. మనమంతా రైలు పెట్టెలము. అందువలన ఇంజన్ తప్పకుండా ముందే ఉంటుంది కదా. అప్పుడే పెట్టెలను లాక్కొని వెళ్ళగలదు" అని అన్నారు.

మాతేశ్వరి గారు ఇచ్చిన ఈ జవాబు సత్యత పై విశేషమైన ప్రకాశాన్ని వేస్తుంది. ఈ కారణము వల్ల నాకు మమ్మా అంటే ఎక్కువ ప్రేమ అని అనుకోండి. వారు విశ్వ మహారాణి శ్రీ లక్ష్మి పదవిని చాలా పురుషార్థము చేసి పొందారు. అలసిపోని సంకల్పాతీత పురుషార్థానికి మన మాతేశ్వరీ గారు చైతన్య రూపము. అందుకు కారణమేమి? దీనికి అనేక జవాబులున్నాయి. కాని ఇక్కడ కొన్ని మాత్రమే తెలుపుచున్నాను.

1. మమ్మా ఎప్పుడూ జ్ఞాన విషయములో తన స్వంత ఆలోచనలు, తర్క-వితర్కాలు చేసేవారు కాదు అనగా తనకెంత తెలుసో, ఇతరులకు అంత మాత్రమే తెలిపేవారు. జ్ఞాన విషయములో ఇంతవరకు పరమాత్మ స్పష్టంగా తెలపని విషయాలెన్నో ఉన్నాయి. అందువలన జ్ఞానము విషయములో మనము ఇలా జరుగుతుందా, అలా జరుగుతుందా? అని తర్క-వితర్కాలు చేయవలసిన అవసరం లేదు. అలా చేస్తే మన్మతాన్ని ఈశ్వరీయ మతముతో కలిపే చేష్టలు చేసినట్లవుతుంది. ఉదాహరణానికి నేను 1962లో మధువనములో మాతేశ్వరి గారిని ఒక ప్రశ్న అడిగాను - మమ్మా! ఈ సందేశీలందరూ ఎక్కడకు వెళ్తారు? ఆ సమయములో వారి ఆత్మ శరీరములో ఉంటుందా లేక ఎచ్చటైనా ఇతర స్థానములో



ఉంటుందా? మమ్మా వెంటనే ఈ విషయం పై బాబా ఇంతవరకు స్పష్టము చేయలేదు అని చెప్పారు. నేను మళ్ళీ అడిగాను, మీరు ఆలోచించి ఉంటారు కదా? మీరేమనుకుంటున్నారు? అప్పుడు మమ్మా అన్నారు - నేను ఒక విద్యార్థిని మాత్రమే చదువుకుంటున్నాను. అందువలన శిక్షకుడు ఎంత చదివిస్తారో, అంతవరకే ఆలోచిస్తాను. చదివించేవారు మన సన్ముఖములో కూర్చుని ఉన్నప్పుడు వారినెందుకు అడగరు? నేను నా విచారము వినిపిస్తే, అది మన్మమతము అయిపోతుంది. ఎందుకంటే ఆ ప్రశ్నకు జవాబు ఈశ్వరీయ మతమేమిటో నాకు తెలియదు. రాత్రే మీరు బాబాను ఈ ప్రశ్న అడగండి. రాత్రి క్లాసులో బాప్‌దాదా ఈ రహస్యాన్ని వినిపించారు. అది ఈ రోజు అందరికీ తెలుసు. జ్ఞానమంటే మనకున్న శక్తులు, లేని శక్తులు(అశక్తి) - ఈ రెండింటి జ్ఞానము. మమ్మా వద్ద ఈ రెండు విషయాల జ్ఞానము పూర్తిగా ఉంది. అందుకే వారు పురుషార్థములో అందరికంటే ముందుకు వెళ్ళారు.

2. మమ్మా తీవ్ర పురుషార్థానికి రెండవ కారణము - మమ్మాలో దృఢ సంకల్పశక్తి ఉండేది. సంకల్ప శక్తిని కొలవడం చాలా కష్టమైన పని కాని ఎక్కువనా? తక్కువనా? అని చెప్పగలము. మమ్మా ఒక్కసారి నిశ్చయము చేసుకున్నారంటే, అది తప్పకుండా చేసేవారు. ఒకసారి కాన్పూర్‌లో అనన్య సోదరి - సోదరులు మమ్మాను ఆహ్వానించేందుకు చాలా మధురమైన ప్రేమతో కూడిన పాటను టేపు చేసి బొంబాయికి పంపించారు. పాటలో బాధ కూడా ఉండినది. అందుకే ఆ పాట విన్న వారినందరిని అది గాయపరిచింది. అందరి కనుల నుండి కన్నీరు ప్రవహించింది. మమ్మాగారి కనులలో కూడా కన్నీరు నిండింది కాని మమ్మా అన్నారు - ఈ కన్నీటి చుక్క కనుల నుండి బయటకు రాదు. ఎంతో ప్రేమతో నిండిన ఈ శబ్దాలు విని కూడా కన్నీరు కనుల నుండి బయటకు కూడా రాలేదు. ఆ కన్నీటి బిందువు దానంతటకదే కనులలో ఇమిడిపోయింది. నేను మమ్మాను అడిగాను - మీ కనుల నుండి ఎందుకు ప్రవహించలేదు? అప్పుడు మమ్మా తమ పురుషార్థము యొక్క శబ్ద చిత్రాన్ని చూపించారు. మమ్మా అన్నారు

- యజ్ఞ ప్రారంభ దశలో కరాచీలో బాబా వేరుగా క్లిఫ్టన్‌లో ఉండేవారు, మమ్మా ఇతర యజ్ఞ కుమారీలతో పాటు మరొక స్థానములో ఉండేవారు. రాత్రి పూట అకస్మాత్తుగా బాబా స్మృతి వచ్చి మమ్మా కనుల నుండి రాత్రంతా కన్నీరు ప్రవహిస్తూ ఉండినది. మమ్మా కనుల నుండి ఎంత కన్నీరు కారిందంటే మమ్మా దిండు అంతా కన్నీరుతో తడిసి ముద్దైపోయింది. ఈ విషయము తర్వాత బాబాకు తెలిసింది. బాబా మమ్మాకు ఏకాంతములో తెలిపించారు - బిడ్డా, ఇక ముందు ఎప్పుడూ నీవు ఏడ్వరాదు. ఆ రోజు నుండే నేను బాబాకు ప్రతిజ్ఞ చేశాను - నా కనుల నుండి ఒక్క కన్నీటి చుక్క కూడా క్రింద పడదు. అప్పటి నుండి ఇప్పటి వరకు నేను ఈ విషయంలో ఫెయిల్ అవ్వలేదు. అందుకే నేను ఈ రోజు కాన్పూర్ వారి పాట విన్నప్పుడు, ఈ నీరు నా కంటి వెలుపలికి రాదు అని మీకు చెప్పాను. మరొకసారి మమ్మాను నేను అడిగాను - మమ్మా బాల్యములో మీరు మీ భవిష్యత్తు విషయములో ఏదైనా ఆలోచించి ఉంటారు కదా? మీరు ఏమవ్వాలని అనుకున్నారు? మమ్మా ఇలా అన్నారు - "అప్పుడు భక్తిమార్గములో కల్పన చేసేదాన్ని - మీరాబాయి మొదలైన వారిని ఇంతవరకు అందరూ మహిమ చేస్తున్నారు. కనుక ప్రపంచమంతా నన్ను స్మృతి చేసుకునే కర్తవ్యము చేసి వెళ్ళాలి "అని అనుకున్నాను. అదే విధంగా మమ్మా తన బాల్యములోని సంకల్పాలను సిద్ధము చేసి చూపించారు.

3. మాతేశ్వరి గారి వద్ద తర్కము చేసే శక్తి చాలా జబర్‌దస్త్(గొప్ప)గా ఉండేది. ఎదుటివారిని రెండు సెకండ్లలోనే శాంత పరచే గుణము మమ్మా వద్ద ఉండేది. నేను ఒకసారి మా లౌకిక ఇంటికి బొంబాయిలో ప్రాపంచిక గీతాపాఠశాలలో అనేక శాస్త్రాలు చదువుకున్న మిత్రులను మమ్మాతో కలుసుకునేందుకు ఆహ్వానించాను. మమ్మా ఏ శాస్త్రాలు చదవలేదు కదా. వీరందరినీ జ్ఞానముతో ఎలా తృప్తి పరుస్తారు? అని అనుకున్నాను. మొట్టమొదట వారు వేసిన ప్రశ్న - ఈ గీతను మీరు అసత్య గీత అంటారా? మమ్మా వెంటనే మీరు ఆలోచించండి - "కలిగిన ప్రాప్తిని చూడండి.



పాండవులు ఈ గీతను విని ఏమి ప్రాప్తి చేసుకున్నారు? గీత సమాజము కొరకు తెలుపబడింది. కాని సమాజము చూస్తే, కలియుగముగా తయారయ్యింది. పాండవులు హిమాలయాలకు వెళ్ళిపోయారు. యాదవులు వారి వారి స్థానాలలో సమాప్తమైపోయారు. కౌరవులు కురుక్షేత్ర యుద్ధములో అంతమైపోయారు. జ్ఞానము ఇంత ఉన్నతమైనప్పటికి సమాజములో వికృతి వికారాలు ఎందుకు జన్మించాయి? కాని ఇచ్చట ఇప్పుడు పరమాత్మ చెప్తున్నారు - నేను గీతా జ్ఞానము వినిపించి సత్యయుగాన్ని స్థాపన చేస్తాను. అనగా గీత ద్వారా విశ్వ పరివర్తన చేస్తాను. కావున ఇప్పుడు చెప్పండి - ఏ గీత ద్వారా విశ్వపరివర్తన జరిగిందో, ఆ గీతను సత్యమనుకోవాలా? లేక ఏ గీత ద్వారా సమాజములో వికారాలు (వికృతులు) జన్మించాయో దానిని సత్యమనుకోవాలా? దీనిలో మూఢ నమ్మకాల(గ్రుడ్డినమ్మకాల) మాటే లేదు. ఇది సత్యమైన విషయము. మీరంతా బాగా చదువుకున్నవారు. కావున మూఢ నమ్మకాల నుండి వెలుపలికి వచ్చి సత్యమేదో నిష్పక్షపాతంగా ఆలోచించండి." ఇది విని పరస్పరము చెవులలో గుసగుసలాడుకున్నారు - అరే! ఈమె ప్రాప్తిని గురించి మాట్లాడి మనందరి నోళ్ళు కట్టి వేశారు, నిజంగా ఆ తర్వాత చర్చ రూపమే మారిపోయింది.

4. మాతేశ్వరీగారు తమ పదవిని, బాధ్యతను చివరివరకు నిభాయించారు. ఆమె ఒక కన్య అయినా ఏ క్షణము నుండి వారికి మమ్మా పదవి లేక సింహాసనము లభించిందో, ఆ క్షణము తర్వాత ఆ సింహాసనము నుండి లేక ఆసనము నుండి ఎప్పుడూ క్రిందికి దిగలేదు. సదా వారు సర్వుల పట్ల శుభప్రదమైన తల్లి దృష్టినే ఉంచారు. పిల్లలైన మనకు కూడా బాబా పదవిని, సింహాసనాన్ని లేక ఆసనాన్ని ఇచ్చారు - పరస్పరము భాయీ - భాయీ లేక సోదరీ - సోదర దృష్టి, వృత్తిని ఉంచుకోండి. కాని మనము సదా ఈ దృష్టి వృత్తిని ఉంచుకోగలుగుతున్నామా? - లేదు దానికి కారణమేమంటే మనము మన పదవిని మాటిమాటికి వదిలేస్తున్నాము, మాతేశ్వరిగారితో అందరూ సంతుష్టముగా(తృప్తి) ఉండేవారు. అలాగే మాతేశ్వరి గారు కూడా అందరితో

సంతుష్టముగా ఉండేవారు. మాతేశ్వరిగారు ఎవరి భావ, స్వభావాల ప్రభావములోకి వచ్చేవారు కాదు. అందరినీ ప్రేమతో జయించేవారు. అందువలన ఎవ్వరూ వారిని పరాయివారని భావించేవారు కాదు. ఈశ్వరీయ జ్ఞానములోని నూతన విషయాలను ఒప్పుకోనివారు కూడా మాతేశ్వరిగారి వ్యక్తిత్వన్ని(Personality) పొగిడేవారు అందరూ వారిని తమ తల్లిగా భావించేవారు.



వీడ్కోలు సమయములో, తృప్తి నిండిన మందహాసము

# నేను – మాతేశ్వరిగారు

*బ్రహ్మాకుమార్ బ్రిజ్‌మోహన్ భాయిగారు మాతేశ్వరీగారితో తమ అనుభవాన్ని ఈ విధంగా వ్రాస్తున్నారు - మాతేశ్వరీగారితో సాకారములో అలౌకిక స్నేహము, అలౌకిక పాలన పొందిన సౌభాగ్యశాలీ పిల్లలలో నేను కూడా ఒకరిని. మాతేశ్వరీగారిని నేను మొట్టమొదట 1955లో కలిశాను. అప్పుడు నేను సి.ఎ చదువుకుంటున్నాను. అప్పటికి నేను ఈశ్వరీయ విశ్వవిద్యాలయము ఢిల్లీ కమాలానగర్ సేవాకేంద్రము నందు ఈశ్వరీయ జ్ఞాన-యోగాల శిక్షణను ప్రాప్తి చేసుకొని కొద్ది నెలలు మాత్రమే గడిచింది. అప్పుడే మా లౌకిక తల్లి-తండ్రి, సోదరుని జతలో నేను పితాశ్రీ, మాతేశ్వరీగార్ల(బాబా, మమ్మా అని స్నేహముతో పిలుస్తూ ఉండేవారము)ను కలుసుకునేందుకు ఆబూపర్వతములో ఉన్న మధువన స్వర్గాశ్రమానికి వెళ్లాము. మొట్టమొదటి సారి హిస్టరీ హాలు(History Hall) లో ఒక గద్దె పై పితాశ్రీ గారు, రెండవ గద్దె పై మాతేశ్వరీగారు విరాజమానమై ఉన్నారు. నేను ఇరువురినీ మాటిమాటికీ చూస్తూ ఉన్నాను. మమ్మా ఒక అలౌకిక ప్రకాశముతో మందహాసము చేస్తున్నారు. వారి ముఖమండలములో ఆత్మీయత ఉట్టిపడుతూ ఉండినది. వారి కనుల నుండి అంతులేని ప్రేమ పర్షిస్తూ ఉంది. మమ్మా వ్యక్తిత్వము అతి ప్రభావశాలిగా సహజంగా ఆకర్షణ చేసేది. నాకు బాగా గుర్తుంది - వారు నోటితో మాట్లాడడం గాని, సైగలతో తెలపడం గాని ఏమీ చేయలేదు. ఆమె కేవలం కూర్చుని మందహాసము చేస్తూ ఉండినారు. కాని ఆ చిరునవ్వులోనే ఏదో ఒక ఇంద్రజాలము ఉండి నన్ను వారి వైపు పిలుస్తున్నట్లు స్పష్టంగా అనుభవమయింది. నేను స్వతహాగానే లేచి నిలబడి అలౌకిక తల్లి వద్దకు వెళ్లి కూర్చుండిపోయాను! ఓహో! వారి సాన్నిధ్యము తాపాన్ని ఎంతో చల్లార్చేదిగా ఉంది! భక్తులు తల్లిని 'శీతలాదేవి' అని ఎందుకు పిలుస్తున్నారో నాకు ఆ క్షణములోనే

* భ్రాతా బ్రిజ్‌మోహన్ గారు ఈ ఈశ్వరీయ విశ్వ విద్యాలయములోని సీనియర్ (వరిష్ఠ) సోదరులలో ఒకరు. వారు వర్తమాన సమయంలో ఢిల్లీ పాండవ భవనంలో ఉంటూ ఇంగ్లీషు మాస పత్రిక 'ప్యూరిటీ'కు ముఖ్య సలహాదారు రూపంలో సేవ చేస్తున్నారు. రాజనీతి వింగ్‌కు అధ్యక్షునిగా కూడా ఉన్నారు.

అర్థమైపోయింది. మమ్మా రెక్కల సమానంగా కోమలంగా కమలపుష్ప సమానంగా ఉన్న తమ పవిత్ర హస్తాలతో ప్రేమగా నా వీపును తడుతూ, నా నోటిని తీయగా చేశారు.

నేను ఎన్ని రోజులు ఆబూలో ఉన్నానో, అన్ని రోజులు నేను ఒక విచిత్రమైన చిక్కును అనుభవము చేశాను. దాని గురించిన చర్చ నేను ఈ రోజు వరకు ఎవరితోనూ చేయలేదు. మీరు అనుకోవచ్చు అటువంటి వీరు రాజనీతి మార్గమునకు అధ్యక్షులుగా కూడా ఉన్నారు. విచిత్రమైన చిక్కు ఏముంటుందని దానిని ఇంతవరకు నా వద్దని ఉంచుకున్నదేది? ఆ విషయము నిజానికి ఏమంటే - క్లాసులో ఛేంబర్‌లో(ఆ రోజుల్లో బాబా, మమ్మా క్లాసు తర్వాత జ్ఞాన విషయాలను చర్చించేందుకై మరొక గదిలో వచ్చి కూర్చునేవారు. దానిని ఛేంబర్ అని అనేవారు. టోలి కూడా అందులోనే లభించేది) లేక బాబా, మమ్మా ఇరువురూ ఎక్కడ ఉన్నా మేము ఎవరి నుండి దృష్టి తీసుకోవాలి? ఎవరి దృష్టి నుండి వంచితమవ్వాలి? అనే సందిగ్ధములో పడేవాడిని. ఒకవైపు జ్ఞానసూర్యుని తేజస్సు ప్రకాశము, రెండవ వైపు జ్ఞాన చంద్రుని వెన్నెల, శీతలత నేను ఈ రెండింటిని కలిపి ప్రాప్తి చేసుకుంటూ ఉండాలని కోరుకునేవాడిని. ఆ తర్వాత నేను ఈ సమస్యకు సమాధానము కనుగొని ఇరువురి నుండి మాటిమాటికి దృష్టి తీసుకుంటూ ఉండినాను.

### లౌకిక తల్లికి కూడా అలౌకిక తల్లి

మమ్మా వయస్సులో ఒక యువ అవస్థలోని కన్య. కాని యజ్ఞమాతగా అయ్యి కార్యమంతా సంభాళన చేసినంతనే వారి శారీరిక ఆకృతిలో కూడా ఎంత ఆశ్చర్యజనకమైన మార్పులు వచ్చేశాయంటే - ఎంత వృద్ధులైనప్పటికీ వారికి కూడా మమ్మా స్వాభావికంగా తల్లి భావనను కలిగించేవారు. ఆ రోజు నుండి నేను నా లౌకిక తండ్రి ఇతర పెద్ద వయస్సులో ఉన్నవారు కూడా మాతేశ్వరీని మమ్మా - మమ్మా అంటూ కలుస్తూ వ్యవహరించడం చూచాను. కాని దీనిని గురించిన మరొక సాటిలేని అనుభవమవ్వడం ఇంకా మిగిలి ఉండేది. ఒక గురువారము రోజు మధువన ఆశ్రమంలో





మాతేశ్వరీ గారితో చాచీగారు (బ్రిజ్ మోహన్ భాయిగారి లౌకిక తల్లి)

ధ్యానావస్థలోకి వెళ్ళి శివబాబా వద్దకు భోగ్(నైవేద్యము) తీసుకెళ్ళే సందేశి శారీరిక సంబంధములో మమ్మాగారి లౌకిక తల్లి. ఆ లౌకిక తల్లి తన లౌకిక కుమార్తెను తన అలౌకిక తల్లి సంబంధములో చూచేవారు. మమ్మా తన లౌకిక తల్లిని అలౌకిక కుమార్తె సంబంధములో వ్యవహరిస్తూ ఉండడం చూశాను. నేను అలాగే చూస్తూ ఉండిపోయాను. మొట్టమొదటిసారి నేను ఈ దృశ్యము చూస్తూనే ఆశ్చర్యముతో నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. మమ్మా ముందు వారి లౌకిక తల్లి వృద్ధురాలైనా సత్యంగా వారి కుమార్తె వలె అనిపిస్తూ ఉండినది. ఎలాగైతే సంస్కార - స్వభావాలు కర్తవ్యములు మార్పు చెందినప్పుడు మనుష్యాత్మల వాతావరణమంతా అనగా వారి సర్వ సంబంధములన్నీ మారిపోతాయో అలా కనిపించింది. ఈ సత్యత యొక్క ముద్ర ఆ క్షణమే నా పై ఏర్పడి పోయింది. నేను చాలా సౌభాగ్యశాలిని ఎందుకంటే నా లౌకిక పరివారమంతా జ్ఞాన మార్గములో నడుచుకునేది. ఆ క్షణములో నేను చేసిన అనుభవము ద్వారా లౌకిక సంబంధాలన్నిటినీ అలౌకికములోకి

పరివర్తన చేసుకోవడంలో నాకు చాలా సహాయము లభించింది.

### ఒక సంపూర్ణ మాతృదేవి

మమ్మా దివ్యగుణాల సంపూర్ణ సాక్షాత్‌దేవిగా ఉండేవారు. వారి సంకల్పము రాతిబండ వలె చలించనిది, స్థిరమైనది. మాటలు మధురంగా, సారయుక్తంగా ఉండేవి. కర్మలు శ్రేష్ఠంగా, యుక్తియుక్తంగా ఉండేవి. మమ్మా ఎంత యోగయుక్తంగా, గంభీరంగా, శాంతంగా ఉండేవారనగా వారి చుట్టూ ఉన్న వాతావరణములో నిశ్శబ్ధము ఆవరించి ఉండేది. అది అందరికీ ప్రత్యక్షంగా అనుభవమయ్యేది. వారు నడుస్తూ తిరుగుతూ ఉండే లైట్ హౌస్, మైట్ హౌస్ వలె అనిపించేవారు. మమ్మా నడవడికలు ఫరిస్తా(సూక్ష్మ దేవతల) వలె ఉండేవి. ఆశ్రమవాసులకు మమ్మా ఎప్పుడు తమ వద్దకు వచ్చి వెళ్ళిపోయారో లేక వారి వెనుక వచ్చి ఎప్పుడు నిలబడి తమను గమనిస్తూ ఉన్నారో కూడా తెలిసేదే కాదు. మమ్మా మాటలు చాలా మధురంగా, స్నేహయుక్తంగా, గౌరవపూర్వకంగా ఉండేవి. మమ్మా నన్ను ఎల్లప్పుడూ 'బృజ్‌మోహన్ గారూ' అని పిలిచేవారు. జాబులలో సదా వారు సదా నన్ను 'ప్రియమైన బృజ్‌మోహన్ గారూ' అని వ్రాస్తూ ఉండేవారు. జాబుల ద్వారా లేక వ్యక్తిగతంగా కలుసుకున్న వెంటనే వారు అన్నింటికంటే మొదట శారీరిక ఆరోగ్య పరిస్థితులను క్షేమ సమాచారాలను తప్పకుండా విచారించేవారు. ఆ అలౌకిక తల్లికి పిల్లల పై ఎంత బేహద్ ప్రేమ ఉండేదో, అంత ప్రేమ ఏ లౌకిక తల్లికి కూడా ఉండదు. నాకు నా లౌకిక తల్లి కూడా మమ్మాయే అని అనిపించేది.

### ప్రేమ పూర్ణము, నియమ పూర్ణమైన (లవ్‌ఫుల్ - లా ఫుల్) జ్ఞాన దేవి

పిల్లలైన మేము ఎప్పుడైనా మమ్మాతో - 'ప్రేమలో నియమాలు లేవు' అను వాక్యమనుసారము ఏదైనా కార్యము చేయడంలో మేము నిర్లక్ష్యము చూపినప్పుడు వెంటనే మమ్మా చాలా మధురమైన రీతిలో కర్మల గుహ్య రహస్యము తెలిపి సావధానపరిచేవారు. ఒకసారి మమ్మా అంబాలా ఛావని సేవాకేంద్రానికి వచ్చినప్పుడు నేను నంగల్(నేను ప్రభుత్వ సర్వీసు చేయు



ఊరు) నుండి వారిని కలుసుకునేందుకు అచ్చటికి వెళ్ళాను. అప్పుడే నంగల్‌కు రమ్మని వారికి విన్నవించుట జరిగింది. కొన్ని రోజులైన తర్వాత ఏదైనా ఒక ప్రోగ్రాము తయారు చేయమని సలహా ఇచ్చారు. కాని మమ్మా భావార్థాన్ని అర్థము చేసుకోని కారణంగా నేను మళ్ళీ మీరు రేపే నంగల్‌కు రండి అని బ్రతిమలాడాను. అప్పుడు మమ్మా అన్నారు "నేనేమో వస్తాను, కాని పంజాబులో చిన్న చిన్న కేంద్రాలలో గల ఇతర ఆత్మలందరూ నన్ను కలుసుకునేందుకు అంబాలాకు వచ్చి నిరాశ చెందుతారు. దాని భారమంతా మీ పై పడ్తుంది." అప్పుడు కొన్ని రోజులైన తర్వాత నంగల్‌కు వస్తానని ఎందుకు చెప్తున్నారో నాకు అర్థమయింది. అందరికీ ఆ ప్రోగ్రాము గురించి సూచన లభించాలనే శుభ సంకల్పము వలన అలా అన్నారు. తర్వాత నేను వారి మాట అంగీకరించాను. కొన్ని రోజుల తర్వాత నంగల్‌కు రాను కూడా వచ్చారు. దీని ద్వారా మమ్మా లవ్‌ఫుల్ - లాఫుల్ ఈ రెండు యోగ్యతలను కలిపి కుశలతతో ఎలా ప్రయోగించేవారో, స్పష్టంగా తెలిసిపోతుంది! వారు ప్రేమ కొరకు నియమాలను లేక నియమము కొరకు ప్రేమను విడనాడేవారు కాదు.

### యజ్ఞ రక్షక తల్లి

సాకార మమ్మా రుద్ర జ్ఞాన యజ్ఞ సంబంధమైన కార్య వ్యవహారాలను సంభాళన చేయడంలో పితాశ్రీ గారికి చివరి వరకు సహయోగము చేశారు. కాని మమ్మా సంపూర్ణమైన తర్వాత అవ్యక్త మమ్మా సందేశీ శరీరములో వచ్చినప్పుడు మొట్టమొదట ఏమి చెప్పారో మీకు తెలుసా? ఆ సమయములో ఉన్న పిల్లలతో మమ్మా ఇలా అన్నారు - "ఇప్పుడు పిల్లలైన మీరు యజ్ఞకార్య భారమంతా సంభాళించడంలో పితాశ్రీకి పూర్తిగా సహాయపడాలి, పితాశ్రీ వృద్ధులు. మమ్మా వెళ్ళిపోయినందున వారి పై అధిక భారము పడరాదు." మన మమ్మా ఎంత పితా స్నేహీగా ఉండేవారు!

ఆ సమయములో నాకు స్వప్నములో కూడా ఈ విచారము (సంకల్పము) లేదు

మమ్మా సంపూర్ణమయ్యేందుకు కొంత సమయము ముందు నేను

ఆబూకు వెళ్ళినప్పుడు జరిగిన ఘటనను నేను ఎప్పుడూ మర్చిపోలేను. ఒక రోజు నేను ఉదయము క్లాసు తర్వాత నక్కీ సరోవరము చుట్టూ తిరిగేందుకు వెళ్ళాను. నక్కీ సరోవరము చుట్టూ తిరిగి వెనుకకు వస్తూ ఆశ్రమము దగ్గరకు వచ్చినప్పుడు మమ్మా తన బ్రాహ్మణి జమునా సోదరితో పాండవ భవనము నుండి వెలుపలికి వచ్చి సరోవరము వైపు వెళ్తూ ఉన్నారు. మమ్మాను చూస్తూనే నాకు అపారమైన సంతోషము కలిగింది. మమ్మా కొంత దూరము వాకింగ్ వెళ్తూ ఉన్నారని జమునా బెహన్ తెలిపిన పిదప నేను వెనుకకు మరలి మళ్ళీ వారితో పాటు తిరిగేందుకు వారి వెంట వెళ్ళాను. నడుస్తూ నడుస్తూ మేము అనాదరా పాయింటుకు వెళ్ళు దారి వద్దకు చేరుకున్నాము. ఈ రోజు అనాదరా పాయింటు వరకు వెళ్దాము పద అని మమ్మా అన్నారు. నేను చాలా సంతోషించాను. మమ్మా జతలో నడుస్తూ రకరకాల విషయాలు మాట్లాడుతూ అపారమైన సంతోషము పొందుతూ ఉన్నాను. నేను మమ్మాతో - "మమ్మా, ఇప్పుడు నేను బ్రిజ్‌మోహన్‌ను అని నాకు తెలుసు. అంతేకాక మీరు మమ్మా అని కూడా నాకు తెలుసు. కాని సత్యయుగములో ఇవన్నీ గుర్తుండవు కదా అని అన్నాను." మమ్మా రహస్యపూర్ణముగా మందహాసము చేస్తూ ఉండినారు. మమ్మాతో అలా కలిసి నడవడం, ఆహ్లాదపడడం ఎంత సుఖప్రదంగా ఉండినదంటే దారి పొడుగునా అత్యంత సంతోషంగా నా రోమాలు నిక్కబొడుచుకొని నేను రెండవసారి మళ్ళీ అంత దూరము నడిచానని కూడా అనిపించలేదు. జమునా బెహన్ కూడా మమ్మా ప్రతి రోజు ఇంత దూరము నడిచేవారు కాదని తెలిపింది. మరుసటి రోజు మమ్మా బాబా నాతో కలిసి ఫోటో తీయించుకున్నారు. అది ఈనాటికి నా గదిలో తగిలించబడి ఉంది. కాని ఇప్పుడు నేను స్వప్నములో కూడా మమ్మా ఇక కొద్ది రోజులలో మా నుండి పూర్తిగా వీడ్కోలు తీసుకుంటారని అనుకోలేదు. ఈ కల్పములో ఇదే మమ్మాతో అంతిమ కలయిక అని కూడా తెలియదు. కాని మమ్మాకు ఈ విషయాలన్నీ తెలుసుననిపిస్తుంది. అందుకే బహుశా ఆ రోజు అంతటి ఆత్మిక ప్రేమను వారి నుండి నేను దొంగలించేందుకు అనుమతి లభించింది.

## విద్యా విశారద వాగ్దేవియే స్వయంగా నాకు మాట్లాడే కళ నేర్పించారు

* బ్రహ్మాకుమార్ నిర్వైర్‌గారు తమ అనుభవాలను తమ స్మృతి పటలములోనికి తెచ్చుకుంటూ అంటున్నారు - మమ్మా నాకు ఒక వరదానమిచ్చారు, కొంతమంది మాట్లాడే కళ ఎంత బాగుంటుందంటే వారి మాటలు వింటూనే 'వీరి నాలుక పై సరస్వతి కూర్చొని ఉంది' అని ప్రజలు అంటారు. నాకు మమ్మా నుండి అటువంటి వరదానము లభించినది. బొంబాయిలో ఒకసారి సర్వధర్మ సమ్మేళనం జరుగుతూ ఉంది. మాకు దానిలో పాల్గొనేందుకు ఆహ్వానము లభించింది. అందులో పాల్గొనేందుకు నాకు ఇష్టము లేదు. మమ్మా నన్ను పంపమని చెప్పారు. ఆ సమ్మేళనము ముస్లిమ్ నేతలు జరుపుతూ ఉండినారు. పేరుకు సర్వ ధర్మసమ్మేళనం కాని నిర్వహించేవారు ముస్లిమ్ ధర్మానికి చెందినవారు. అప్పటి వరకు నేను వ్యక్తిగతంగా ఈశ్వరీయ జ్ఞానాన్ని వినిపిస్తూ, చర్చిస్తూ ఉండేవాడిని కాని సభలో ఎప్పుడూ ఉపన్యసించలేదు. నాకు ఆహ్వానము లభించినప్పుడు, నేను ఎప్పుడూ ఉపన్యసించలేదు కావున సమ్మేళనానికి నేను ఎలా వెళ్ళేది! అని అన్నాను. అది రాత్రి సమయము. ఈ విషయము మమ్మా చెవులలో పడింది. వెంటనే అతడిని నా వద్దకు పంపండి. నేను ఇప్పుడే ఎలా ఉపన్యసించాలో అతనికి నేర్పిస్తానని అన్నారు. నేను మమ్మా వద్దకు వెళి కూర్చున్నాను. మమ్మా నా వీపు పై తన చేతినుంచి నెమ్మది-నెమ్మదిగా ఉపన్యసించడం నాకు నేర్పించారు. సమ్మేళనములోని విషయము "**విశ్వశాంతి**" నాలుగు నిమిషాలు మమ్మా నాకు విశ్వశాంతి అనగా ఏమి? దాని అవసరమేమి? విశ్వములో శాంతి ఎప్పుడు ఉండేది? విశ్వశాంతి స్థాపన కర్త ఎవరు? ఈ విషయాలన్నీ నాకు తెలిపారు. నేను సమ్మేళనంలో ఉపన్యసించినప్పుడు 40 నిమిషాల ఆ ఉపన్యాసములో

* *భ్రాతా నిర్వైర్‌గారు కూడా ఈ ఈశ్వరీయ విశ్వ విద్యాలయములోని సీనియర్ (వరిష్ఠ) సోదరులలో ఒకరు. వారు ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సెక్రటరీ జనరల్‌గా ఉన్నారు. విద్యా విభాగానికి అధ్యక్షులు. గ్లోబల్ ఆసుపత్రి మరియు రిసెర్చ్ సెంటరుకు కార్యకర్తలుగా ఉన్నారు. వారు అంతరాష్ట్రీయ ముఖ్య కేంద్రమైన ఆబూలో(శాంతివనంలో) ఉంటున్నారు.*



మాతేశ్వరిగారితో నిర్వైర్ భాయిజీ

జనులందరూ ఏకాగ్రచిత్తులై వింటూ ఉండిపోయారు. ఆ రోజు ఉపన్యాసములో అందరికంటే ఎక్కువగా జనులను నా ఉపన్యాసమే ఆకర్షించింది. కల్పవృక్షము, సీఢి(మెట్లు), సృష్టిచక్ర చిత్రాలను చూపిస్తూ ఉపన్యాసము చేశాను. వారంతా ఆ చిత్రాలు కావాలని చాలా అడిగారు. ఈ విధముగా వాగ్ధేవి సరస్వతి తల్లే స్వయముగా నాకు మాట్లాడే కళను నేర్పించారు. ఇది నా జీవితములో చాలా విశేషముగా జ్ఞాపకము పెట్టుకోదగిన ప్రసంగము.

## నిస్వార్థమైన తల్లి ప్రేమ

మొట్టమొదట నేను మమ్మాను 1959 సంవత్సరములో ముంబాయిలో కొలాబా దగ్గర గల వాటర్‌లూ భవనము ఏరియా వద్ద కలుసుకున్నాను. ఆ సమయములో అప్పటికి నేను జ్ఞానములోకి వచ్చి కేవలం ఒక నెల మాత్రమే అయ్యింది. మమ్మా ముంబయిలో సుమారు ఒక మాసముండినారు. అప్పుడు నా వయస్సు సుమారు 20-21 సంవత్సరాలు.



మమ్మా వ్యక్తిత్వము చాలా తేజోమయము. స్వాభావిక రూపములో ఒక తల్లి భావన ఇప్పించేదిగా ఉండినది. వారిని కలుసుకుంటూనే నేను ఇంతకుముందు కూడా వీరిని కలుసుకున్నానని అనిపించింది. ఇదే మాట నేను వారితో కూడా అన్నాను. మమ్మా అన్నారు - అవును కల్పక్రితము కలుసుకున్నారు. కాని ఆ సమయంలో ఆ మాట అర్థము కాలేదు.

ఒక రోజు భోజనము చేయునప్పుడు వారి వద్ద ఉండడం జరిగింది. అప్పుడు వారు భోజనము చేయుటకు ముందు మొదటి ముద్ద నాకు తినిపించి తర్వాత వారు భుజించారు. ఈ ఘటన వలన నాకు ఇలా అనుభవమయింది - చాలా రోజుల తర్వాత నా తల్లి నాకు మళ్లీ లభించింది. మమ్మా అన్నారు - అవును, ఇది అలౌకిక సంగమము.

## సదా స్వయాన్ని బాబా ముందు ఒక వినమ్ర కుమార్తె రూపములోనే ప్రత్యక్షము (అనుభవము) చేసుకున్నారు!

ప్రతి సాయంకాలము విశేషంగా మమ్మా క్లాసు 5 నుండి 6 వరకు ఉండేది. నేను భారతీయ నౌకాదళములో ఉండేవాడిని. మాకు ఇది మంచి ఏర్పాటుగా ఉండేది. మమ్మా క్లాసు సుమారు ఒక గంట-ముక్కాలు గంట నడిచేది, మమ్మా జ్ఞానాన్ని స్పష్టపరిచే విధానము చాలా విశిష్టంగా, సరళంగా ఉండేది. నా మనస్సులో జ్ఞాన విషయములో, ధారణ విషయములో కొన్ని ప్రశ్నలుండేవి. కాని అడిగేవారము కాదు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే మమ్మాగారి మాటలలో మా ప్రశ్నలన్నిటికీ, సంశయాలన్నిటికి స్వతహాగా జవాబులు లభించేవి. ఈ విషయములో నేను మమ్మాను ఇలా అడిగాను - మమ్మా మా మనసులో ఈ ప్రశ్నలు ఉన్నాయని మీకెలా తెలుసు? వాటి జవాబులు మీరు మాకిచ్చేశారు. మమ్మా అన్నారు - అలాంటి విషయమేమీ లేదు. నేను బాబాను స్మృతి చేస్తాను, బాబా నుండి ఏ ప్రేరణ లభిస్తుందో, దాని అనుసారము మీకు వినిపిస్తాను. వారు ఎప్పుడు కూడా నాకు తెలిసిందని అనలేదు. సదా మమ్మా(తల్లి) తండ్రి వైపే సూచించారు. స్వయాన్ని సదా వారి వినమ్ర కుమార్తె రూపములోనే ప్రత్యక్షము చేసుకున్నారు.

## రోమ - రోమములో జ్ఞానము నిండి ఉండేది, అంగాంగము పరమాత్మ స్మృతినిప్పించేది

మమ్మా ఏ విషయాన్నైనా చాలా లోతుగా అర్థం చేయించేవారు. ఆ రోజులలో మమ్మా విశేషంగా కర్మల పై చాలా విస్తారంగా, లోతుగా వివరించేవారు. పరమాత్మ పరిచయము విషయములో లేక పవిత్రతను ధారణ చేసే విషయంలో కూడా చాలా లోతుగా అర్థం చేయించేవారు. లోతుతో పాటు అర్థం చేయించే విధానము చాలా సరళంగా, సహజంగా, రమణీకంగా ఉండేది. వినేవారికి ధారణ కష్టంగా, బరువుగా అనిపించేది కాదు. వినేవారికి మమ్మా సత్యమైన విద్యాదేవి సరస్వతి అనిపించేది. వారి విద్య ద్వారా విన్న వారి జీవితము ధారణ రూపీ ధనముతో సంపన్నమౌతూ ఉందని అనిపించేది.

వారి ధారణ చాలా ఉన్నత కోటికి చెందింది, చాలా శ్రేష్ఠమైనదిగా ఉండేది. మమ్మా అతి తక్కువగా మాట్లాడేవారు. కేవలం క్లాసులో లేక ఎవరైనా వ్యక్తిగత రూపములో కలుసుకున్న సమయంలో మాత్రమే వారి శబ్ధము వినిపించేది. పరమాత్మ స్మృతిలో లీనమై ఉండడం వారి స్వాభావిక స్థితిగా ఉండేది. వారి పరిసరాలలోని ప్రకంపనాలు ఎవరికైనా వీరు నావారు అని అనుభవము చేయించేదిగా, చాలా సుఖమైనదిగా తోచేది. వారి ప్రతి శబ్ధము(మాట)లో జ్ఞానము ఇమిడి ఉండేది. అనగా వారి రోమరోమములో జ్ఞానము ఇమిడి ఉండేదని చెప్పవచ్చు. వారిని చూస్తూనే పరమాత్ముని స్మృతిలో నా మనసు మగ్నమైపోయేది. స్మృతి చేసే శ్రమ చేయనవసరముండేది కాదు. తండ్రి అయిన పరమాత్మ స్మృతి సహజంగా వచ్చేది.

## కర్మబంధనాల నుండి, లౌకిక సంబంధాల నుండి ముక్తము చేసే మమ్మాగారి వరదానీ పలుకులు

నేను భారతీయ నౌకాదళములో ఉన్నప్పుడు శెలవులలో 2 మాసాలు నన్ను సేవార్థమై జయపూర్‌కు పంపించారు. ఈశ్వరీయ సేవలో నాకు



చాలా ఆనందము కలిగింది. నేను వచ్చి మమ్మాగారికి సేవా సమాచారమంతా వినిపించాను. మమ్మాతో నేను - మమ్మా! ఈశ్వరీయ సేవలో నిమగ్నమవ్వాలని నా మనసు చెప్తోంది అని అన్నాను. మమ్మా నాకు చాలా ఉత్సాహమునిచ్చే సలహానిచ్చారు - “ఇది చాలా సంతోషించే విషయము, మనిషికి ఏమి కావాలి? తినేందుకు రెండు రొట్టెలు, ధరించడానికి రెండు జతలు బట్టలు! ఇవి యజ్ఞము నుండి తప్పకుండా లభిస్తాయి. మీరు మీ కళ్యాణము చేసుకోండి, ఇతరుల కళ్యాణము కూడా చేయండి.” మమ్మా మాట్లాడిన ఈ ప్రేరణాదాయక మాటలు నా సర్వ లౌకిక బంధనాలను ప్రేమగా చుక్తా చేసుకొని ముక్తమవ్వడంలో నాకు చాలా సహాయకారిగా సిద్ధమయ్యింది. మమ్మాగారితో చేసిన ఈ ఆత్మిక సంభాషణ వారితో కూర్చున్న సమయము నా జీవితములో ఒక అమూల్యమైన నిధి. ఈశ్వరీయ సేవలో సంపూర్ణంగా సమర్పితమయ్యేందుకు నన్ను ప్రేరేపించారు. నాకు సహాయము చేసిన శక్తి మమ్మా అని నాకు చాలా గర్వముంది.

## ఈ పాత ప్రపంచము వారి అస్తిత్వములోనే ఉండేది కాదు

మమ్మా ముంబాయికి 2-3 సార్లు వచ్చారు. మొట్టమొదట ప్రదర్శన చిత్రాలు 1964లో తయారౌతూ ఉన్నాయి. వాటి విషయములో మమ్మా కొన్ని సలహాలిచ్చేందుకు సేవ కొరకు ముంబాయికి వచ్చారు. ఆ సమయములో జరిగిన ఒక సన్నివేశము నాకు గురుకొస్తోంది. ఒకసారి రమేష్ భాయి కారులో మేము పోతూ ఉన్నాము. వెనుక సీటులో మమ్మా, జమునా దాది, ఫ్రెంటు సీటులో నేను, రమేష్ భాయి కూర్చున్నాము. మేము వాటర్‌లూ భవనము నుండి రమేష్ భాయి ఇంటి వైపు పోతున్నాము. చౌపాటి ద్వారా వెళ్ళవలసి వస్తుంది. చౌపాటిలో రోజర్ కంపెనీ వారి ఒక పానీయ సంబంధమైన బోర్డు తగిలించబడి ఉంది, ఒక బాటిల్ నుండి క్రింద ఉన్న గ్లాసులోనికి పానీయము పడుతూ ఉంది. నెమ్మదిగా ఆ బాటిల్ ఖాళీ అవుతూ, మళ్ళీ ఆ బాటిల్ నింపబడుతూ ఉంది. ఆ

పానీయమంతా మళ్ళీ గ్లాసులోకి పడ్తూ ఉంది. మళ్ళీ బాటిల్ ఖాళీ అయ్యేది. ఆ విధంగా ఎలక్ట్రాలిక్ పద్ధతిలో విజ్ఞాపనము తయారు చేయబడింది. ఇటువంటి జ్ఞానయుక్త చిత్రాన్ని ప్రదర్శన కొరకు తయారు చేయాలని నేను, రమేష్ బాయి మాట్లాడుకుంటూ ఉండినాము. ఆ విషయములో మేము మమ్మాను అడిగాము - "మమ్మా ఆ చిత్రము మీకు ఎలా కనిపిస్తూ ఉంది? మమ్మా చెప్పిన జవాబు మా సంకల్పములో గాని, స్వప్నములో గాని లేదు! మమ్మా అన్నారు - "మమ్మా! క్లాసులో ఉన్నప్పుడు మాత్రమే ఎదురుగా ఉన్నవారి పై దృష్టిని సారిస్తారు. లేకుంటే మమ్మా కొరకు ఆ ప్రపంచము అస్తిత్వములోనే ఉండదు." పాత ప్రపంచము, పాత వస్తువుల పై మమ్మాకు ఇంత వైరాగ్యముండేది.

### నిమంత్రణ పత్రము(ఆహ్వానపత్రిక) మొదలైన వాటికి అంతిమ రూపము కూడా మమ్మానే ఇచ్చేవారు

ఆ రోజులలో బాబా గొప్ప-గొప్ప వ్యక్తులకు అనగా జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ నేతలకు, ధర్మ నేతలకు, సామాజిక కార్యకర్తలకు ఈశ్వరీయ సందేశాన్నిచ్చే టెలిగ్రాములు పంపేవారు. ఆ టెలిగ్రాములు ఇచ్చేందుకు కావలసిన విషయాన్ని తయారు చేసి బాబా మమ్మాకు చూపించేవారు. ఎందుకంటే మమ్మా దానిని చూసి అందులో ఏదైనా లోపము గాని, పరివర్తన చేయు అవసరము గాని ఉంటే పూర్తి చేయుట లేక చేయించుట గాని చేసేవారు. ఆ సమయములో మమ్మా బొంబాయిలో ఉండేవారు. వారి జతలో విశ్వకిశోర్ భాయి కూడా ఉండేవారు. ఆ రోజులలోనే 6వ పోప్‌పాల్ భారతదేశానికి వస్తారనే సమాచారము అందింది. వారికి ఈశ్వరీయ నియంత్రణనిచ్చే ఒక టెలిగ్రాము పంపవలసి ఉంది. టెలిగ్రాములోని సందేశాన్ని బాబా తయారుచేసి మమ్మా స్వీకృతి కొరకు ముంబాయికి పంపించారు. మమ్మా విశ్వకిశోర్ భావు, రమేశ్ భాయి మరియు నేను అందరూ కలిసి ఆ నియంత్రణకు అంతిమ రూపమునిచ్చాము. ఆ రోజు రాత్రి 12 గంటలకు పోప్‌కు టెలిగ్రాము



పంపించాము. అందులోని సందేశము ఇలా ఉండినది - "మీరు భారతదేశానికి వచ్చుటకు మా హృదయపూర్వక స్వాగతము. ఈ భారతదేశము పరమపిత పరమశిక్షకుడు పరమసద్గురువు అవతరించిన భూమి. ఇచ్చటకు వచ్చి మీరు ఈశ్వరీయ సందేశాన్ని తీసుకొని మీ జీవితాన్ని ఎంత శ్రేష్ఠంగా చేసుకోగలరంటే ముక్తి–జీవన్ముక్తిని మీరు ప్రాప్తి చేసుకోగలరు. ఈ సేవకై బ్రహ్మకుమారి సోదరీ–సోదరులు ఉపస్థితులై ఉన్నారు. " ఈ టెలిగ్రాముకు ఫలితంగా జగదీష్‌భాయి, రమేష్‌భాయి చేసిన పరిశ్రమ ఫలితంగా పోప్‌ను కలుసుకునేందుకు అనుమతి లభించింది. దాదీగారు, దాదీ నిర్మలశాంత, శీల్‌దాది, రమేష్ భాయి, జగదీష్ భాయి మొదలైనవారు 6వ పోప్‌పాల్‌ను కలుసుకునేందుకు వెళ్ళారు. ఆ సమయములో వారిని, వారితో పాటు చాలా మంది బిషప్‌లకు త్రిమూర్తి, సృష్టిచక్రము కల్పవృక్షము మొదలైన చిత్రాలు విశేషంగా అలంకరించి బహుమతి రూపములో ఇవ్వబడ్డాయి. ఆ రోజులలో మమ్మా మురళి కూడా చెక్ చేసేవారు. గణనీయమైన వ్యక్తులకు జాబులు వ్రాయాలన్నా, టెలిగ్రాములు మొదలైనవి పంపవలసి వచ్చినా, దానిలోని విషయ వస్తువుకు మమ్మాయే అంతిమ రూపమును ఇచ్చేవారు. ఈ విధంగా ఆ సమయములో మమ్మాకు విశేషమైన పాత్ర ఉండేది. అందరిలో ఉత్సాహాన్ని నింపే మనోబలాన్ని వృద్ధి చేసే, ముందుకు నడిపించే కార్యము కూడా మమ్మా చేసేవారు.

### అనుపమ, కుశల సంఘటకులు, ప్రశాసకులు

మమ్మాలో సంఘటితము చేయు శక్తి(Organising Capacity) చాలా శ్రేష్ఠంగా, చాలా శక్తివంతముగా ఉండేది. అందరినీ వెంటపెట్టుకొని తీసుకెళ్ళే కుశలకళ కూడా ఉండేది. వారిలో వ్యక్తిగత ధారణలు కూడా ఉండేవి. ఉదాహరణానికి బాబా చెప్పినదానిని ధారణ చేయడంలో మమ్మా నెంబర్‌వన్‌గా ఉండేవారు. సహజ రూపములో తల్లికి ఉండవలసిన సంస్కారాలన్నీ వారిలో సంపూర్ణముగా ఉండేవి. సమర్పితమయ్యే వారి పద్ధతిని 'ఘూట్కా' అని అంటారు. ఆ పద్ధతి అనేకమంది సోదరీ సోదరులకు ఒక ఆదర్శమై అనేకమంది జీవితాలు ఉద్ధరింపబడేందుకు ప్రేరణగా

అయ్యింది. అన్నింటికంటే గొప్ప విషయమేమంటే వారిని అందరూ యజ్ఞమాత రూపములో స్వీకరించారు. వారిని చూస్తూనే ప్రతి ఒక్కరికి స్వాభావికంగా తల్లి భావము వచ్చేది. వారు ప్రతి ఒక్కరి అవసరాలను అడగకుండానే పూర్తి చేశారు. ఎవ్వరికి ఏ వస్తువునూ అడిగే అవసరము కలిగించలేదు. ఎప్పుడూ ఎవ్వరూ ఈమె వయస్సు ఎంత, నా వయస్సు ఎంత అని ఆలోచించలేదు. ఏ ధర్మమువారైనా, జాతివారైనా మార్గమువారైనా ప్రతి ఒక్కరు ఇదే అనుభవము చేశారు - ఈమె నా తల్లి నా హిత చింతకులు(మేలుకోరేవారు). ఆ మహోన్నతమైన ఆత్మలో ఇంత శక్తి ఉండేది! అందువలన డ్రామా అనండి లేక బాబా అనండి వారినే యజ్ఞమాతగా, మాతేశ్వరిగా, మమ్మాగా తయారు చేశారు.



జ్ఞాన బిందువుల పఠనము, మథనములో లీనమై ఉన్న మమ్మా

## అహో రాత్రాలు సాధనలో లీనమైన గౌరీదేవి

మమ్మా ప్రారంభము నుండి చివరివరకు తన సాధనలో ఏ విధమైన జాప్యము ఢీలాతనము కానివ్వలేదు. ప్రతి రోజు 2 - 2 1/2 గంటలకే లేచి



విశేషంగా శాంతిలో ఉండేందుకు బాబాను శక్తిశాలి రూపములో స్మృతి చేసే అభ్యాసము చేసేవారు. వారి డైరీలో జ్ఞానములోని ఒక్కొక్క విషయము పై చాలా లోతైన విషయాలు వ్రాయబడి ఉండేవి. వారి డైరీని చదివే సదవకాశము నాకు జయపూర్‌లో లభించింది. ఒక సంవత్సరము మమ్మా జతలో ఉండిన ఒక సోదరి మమ్మా డైరీలోని జ్ఞాన బిందువులను తన డైరీలో వ్రాసుకొంది. ఆ డైరీని చదివే అవకాశము నాకు లభించింది. ఆ జ్ఞాన బిందువులను చదివి మమ్మా జ్ఞాన విచార సాగర మథనము ఎంతగా చేసి ఉంటారో, ఎంతగా జ్ఞాన లోతులకు వెళ్లి ఉంటారో, వాటిని ఎంతగా ధారణ చేయు అభ్యాసము చేసి ఉంటారో అని నాకు ఆశ్చర్యము కలిగింది. విద్యాదేవి సరస్వతిని కవులు, విద్వాంసులు వర్ణించారు. కాని ఆ విద్యాదేవి రూపాన్ని, కర్తవ్యాన్ని నేను నా కనులతో చూశాను. వారి నుండి నేర్చుకున్నాను అంతేకాక ఆ తల్లికి పుత్రునిగా అయ్యాను, ఇది నా పరమ సౌభాగ్యము.

# మమ్మా చాలా నిరహంకారి

మధువనములోని బ్రహ్మకుమార్ దాదా చంద్రహాస్‌గారు యజ్ఞములోని ఆదిరత్నాలలో ఒకరు. అంతేకాక మమ్మా - బాబాలకు అతి సన్నిహితంగా ఉండేవారు. వారు తమ అనుభవాన్ని ఇలా వినిపిస్తున్నారు - ఒకసారి నేను మమ్మాను - "మమ్మా, మీరు మమ్మాగా ఎలా తయారయ్యారు?" అని అడిగాను. మమ్మా జవాబిస్తూ, "నేను మమ్మాగా అవ్వలేదు. మీరంతా కలిసి నన్ను మమ్మాగా చేశారు." నేను మళ్లీ అడిగాను - "ఎలా?" మమ్మా ఇలా అన్నారు - "బాబా యజ్ఞాన్ని నడిపించే బాధ్యతను నాకు ఇచ్చారు. పిల్లలు కూడా ఒప్పుకున్నారు కావున నేను అందరినీ నా పిల్లలుగా భావించి నడుచుకోవలసి వచ్చింది.

మమ్మాతో నాకు లౌకిక బాంధవ్యము కూడా ఉండేది. మేమిరువురము దూర బంధువులము చిన్నతనము నుండే నేను మమ్మాను చూచాను. లౌకిక సంబంధము కారణంగా నేను మమ్మా ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడిని. మమ్మా విద్యార్థి జీవితాన్ని కూడా నేను చూచాను. మమ్మా బాబా ముందుకు వస్తూనే విద్యార్థి జీవితములో నేను చూచిన ఆ రాధ ఈ రాధ ఒకటేనా! అని నాకు ఆశ్చర్యము కలిగింది. మమ్మా బుద్ధి ఎంత తీవ్రంగా ఉండేదంటే బాబా మహావాక్యాలు వారి చెవులో పడిన వెంటనే జీవితములో ధారణ చేసేవారు. మమ్మా జ్ఞానములోకి వస్తూనే వారిలో కలిగిన పరివర్తన నన్ను చాలా ఆశ్చర్యచకితునిగా చేసింది. విద్యార్థి జీవితములో అంత ఫ్యాషన్‌గా, నూతనంగా(అధునాతనంగా) ఉన్న రాధ అంత తీవ్రంగా బాబా జ్ఞానము ధారణ చేయడం నాకు చాలా ఆశ్చర్యము కలిగించేది బాబా కూడా మమ్మాను చాలా త్వరగా గుర్తించారు. ఒక రోజు మురళి వినిపిస్తూ వినిపిస్తూ బాబా మమ్మాను - బచ్చీ! నేను నీకు బలిహారసయ్యానా లేక నీవు నాకు బలిహారమయ్యావా? అని అడిగారు. మమ్మా ఏమీ మాట్లాడక మందహాసము చేస్తూ ఉండిపోయింది. మళ్లీ బాబాయే జవాబిచ్చారు, "మొదట బాబా మమ్మాకు బలిహారమయ్యారు, తర్వాత మమ్మా బాబాకు బలిహారమైనారు. ఎలా? మమ్మా వస్తూనే బాబా





నయ్యా మేరీ పార్ లగావో మైయ్యా (ఓ తల్లీ! నా నావను దరికి చేర్చు)

ఒక కమిటీ చేసి తన పూర్తి ఆస్తిని ఆమెకు వీలునామా వ్రాసారు బాబా నీ పై ఎలా బలిహారమయ్యానో అర్థమయిందా మమ్మా?" ఇది విని మమ్మా నవ్వేశారు. మమ్మా వస్తూనే ఆమెను గుర్తించి ఒక బాధ్యత తర్వాత మరొక బాధ్యతను ఇస్తూ పోయారు. మమ్మా కూడా ఆ బాధ్యతలన్నీ స్వీకరిస్తూ స్వీకరిస్తూ యజ్ఞమాతగా అయ్యింది.

ఏదైనా ఒక పక్షి గడ్డిని లేక ధాన్యపుగింజను మొదట చిన్న చిన్న తుంట తుంటలుగా చేసి తన పిల్లల నోటిలో వేస్తుందో(తినిపిస్తుందో) ఆ విధంగా మమ్మా కూడా బాబా నిగూఢమైన జ్ఞానాన్ని తనలో ధారణ చేసి, అనుభవం చేసి, దానిని సులభంగా చేసి పిల్లలైన మాకు వినిపించేవారు. మమ్మా జ్ఞానాన్ని ఎంత సరళంగా చేసి వినిపించేవారంటే ఈశ్వరీయ జ్ఞానము ఏమీ తెలియని అమాయక వ్యక్తికి కూడా జ్ఞానము సులభంగా అర్థమయ్యేది. వారి బుద్ధిలో కూర్చునేది. దాని వలన వారు చాలా సంతోషించేవారు. మమ్మాలోని ఈ సుగుణాలు చూచి బాబా వారిని

ఎక్కువగా టూర్ చేసేందుకు పంపించేవారు. మమ్మా జీవితములో చివరి 8 సంవత్సరాలు టూర్ చేస్తూనే గడిపారు. 1-2 సార్లు నాకు కూడా మమ్మా జతలో వెళ్లే సౌభాగ్యము ప్రాప్తి అయ్యింది. లక్నో, కాన్పూర్, పాట్నా మొదలైన పట్టణాలకు మమ్మా జతలో నేను కూడా వెళ్లాను.

మమ్మా ఎంత నిరహంకారిగా ఉండేవారంటే సాధారణ సేవ కూడా ఆమె స్వంత చేతులతో స్వయంగా చేస్తూ ఉండేవారు. బాబాకు భోగ్ కూడా ఆమె స్వయంగా తయారు చేసేవారు. మమ్మా ప్రతి పుత్రుని అనంతమైన ప్రేమతో పాలించారు, పోషించారు. అంతేకాక పిల్లల ప్రతి అవసరాన్ని పూర్తి చేశారు. మమ్మా గుర్తు వస్తూనే నాకు.............. ఏమని చెప్పాలి, ఏదైనా చెప్పేందుకు నా వద్ద శబ్దాలు లేవు. నా మనస్సు వారి స్నేహములో గద్గదమైపోతుంది.

# సర్వ విద్యల సంపూర్ణ దేవి - మాతేశ్వరి

* బ్రహ్మాకుమార్ భ్రాతా శాంతారామ్‌గారు మాతేశ్వరీగారితో తమ అనుభవాలను ఈ విధంగా వ్రాస్తున్నారు. 1956 సెప్టెంబర్‌లో నా సౌభాగ్యము మేల్కొంది. అప్పుడు నాకు ఈశ్వరీయ జ్ఞానము ప్రాప్తి అయింది. అదే సంవత్సరము నేను అక్టోబరు మాసము చివర్లో నేను మమ్మా - బాబాలను కలుసుకునేందుకు మధువనానికి వచ్చాను. ఆ సమయములో ముఖ్యకేంద్రము కోటాహౌస్‌లో ఉండేది. మేము బస చేసేందుకు ధౌల్‌పూర్ హౌస్ ఇచ్చారు. మొదటి రోజు నేను కోటాహౌస్‌లోని హాలులో మమ్మా - బాబాలను మొట్ట మొదటిసారి మిలనము చేసేందుకు వచ్చినప్పుడు మధురమైన మమ్మా శాంతముద్రలో చిరునవ్వు వెదజల్లుతూ అలౌకిక ఆకర్షణకు కేంద్రమై ఉండడం చూశాను. బాబా ఒడిని తీసుకున్న పిదప నేను మమ్మా ఒడిలోకి పోయాను. నాకు ఇలా అనుభవమయింది - చాలా కాలము నుండి దూరమైన నా తల్లి నాకు లభించింది. వారి దృష్టి ఎంతో నిర్మలంగా, స్నేహమయంగా, శక్తిశాలిగా ఉండేదంటే నేను కనురెప్పలు మూయని నేత్రాలతో తదేకంగా మమ్మాను చూస్తూ ఉండిపోయాను. సమయము తెలియనే తెలియలేదు.

## అవతరించిన దేవి

వాస్తవానికి మొదటి మిలనములోనే వారు అవతరించిన దేవి అని నాకు అనుభవమౌతూ ఉండినది. వారు పవిత్రత, సర్వ దివ్యగుణాలు మరియు ధారణలతో సంపన్నమై ఈ పతిత ప్రపంచాన్ని పావనంగా తయారు చేసేందుకు అవతరించారు అనిపించింది. వారి దృష్టిలో అలౌకిక ఇంద్రజాలము ఉండేది. వారు జీవించి వెలిగిపోతున్న ఆధ్యాత్మిక అయస్కాంతమని అనుభవమౌతూ ఉండినది. మమ్మా యజ్ఞ ప్రబంధము చేసే బాధ్యతను సంభాళిస్తూ పిల్లల ఉన్నతి కొరకు వారికి శిక్షణనిచ్చేందుకు కూడా సమయము కేటాయించేవారు.

---

* బ్రహ్మాకుమార్ భ్రాతా శాంతారాం గారు కాన్పూర్‌లోని సుప్రసిద్ధ వకీళ్లలో ఒకరు. వారు వర్తమాన సమయంలో ముఖ్యాలయమైన ఆబూలో ఈశ్వరీయ విశ్వ విద్యాలయం లీగల్ విభాగంలో సేవ చేస్తున్నారు.

## సౌభాగ్యమనే అత్యంత శ్రేష్ఠమైన లాటరీ

నేను మధువనము యాత్ర పూర్తి చేసుకొని కాన్పూర్‌కు చేరుతూనే నా సౌభాగ్యపు అత్యంత శ్రేష్ఠమైన లాటరీ తెరవబడింది. బాబా నుండి టెలిగ్రామ్ వచ్చింది - మమ్మా మొట్టమొదటిసారి యజ్ఞ స్థలము నుండి బయటకు వచ్చి ఈశ్వరీయ సేవార్థము కాన్పూరుకు వస్తూ ఉన్నారు. మమ్మా వస్తూనే అచ్చట నూతన ఉమంగ-ఉత్సాహాలు వ్యాపించాయి. ఉదయం పూట మురళి క్లాసులో ఆ తర్వాత కూడా తిలక్‌నగర్ సేవాకేంద్రములో అనగా ఆదరణీయ మమ్మాగారు బస చేసిన సేవాకేంద్రానికి మేము తప్పకుండా వెళ్ళేవారము.

అంతేకాక మమ్మా కాన్పూర్‌కు దగ్గరలో ఉన్న ఉన్నావ్, లక్నో, అలహాబాద్‌కు వెళ్ళేవారు. అచ్చట కూడా వారి సాన్నిధ్యము ప్రాప్తి చేసుకునేందుకు మేము వెళ్తూ ఉండేవారము. బాలభవనము తెరచిన తర్వాత మమ్మా చాలా సమయము అచ్చట ఉండినారు. ఆ తర్వాత పాట్నా, కలకత్తాలలో కూడా ఈశ్వరీయ సేవార్థము మమ్మా రావడము జరిగింది. ఈ విధంగా మమ్మా సాన్నిధ్యములో ఉంటూ వారి విశేషతలు, సూక్ష్మ శక్తులు మొదలైన వాటిని సూక్ష్మంగా చూచే, అర్థము చేసుకునే, పరిశీలించి వాటి ద్వారా లాభాన్వితమయ్యే అవకాశాలు నాకు మాటిమాటికీ లభించాయి.

## జ్ఞాన జ్ఞానేశ్వరి

జ్ఞాన క్షేత్రములో మమ్మా సంపూర్ణ నిశ్చయబుద్ధి కలిగి ఉండేవారు. పరమాత్మ మహావాక్యాలను మంచి ఆసక్తితో అర్థము చేసుకుంటూ మాటి మాటికీ చదివేవారు. వారి అనుభవము ప్రకారము మురళి, జీవితాన్ని సంపూర్ణంగా, సంపన్నంగా చేసుకునే ఏకైక సాధనము. వాస్తవంలో అభ్యాసము, లోతైన మనన చింతనల ఆధారము పై వారు ఈ ప్రతిభను వికసింపజేసుకున్నారు - జ్ఞాన బిందువులను విన్న లేక చదివిన వెంటనే వారు తమ వ్యవహారిక రూపములో అనుభవము చేసుకునేవారు. అంతేకాక



అందులో సహజంగా స్థితమయ్యేవారు అనగా ఈశ్వరీయ జ్ఞానము పై వారికి పూర్తి అధికారము లభించినది. వారు ఏ జ్ఞాన బిందువునైనా సంపూర్ణ అధికారముతో అర్థం చేయించేవారు. దాని వలన వినేవారికి దాని యథార్థ విషయములో సహజంగా నిశ్చయమయ్యేది అనగా వారి సంశయాలన్నీ దూరమైపోయేవి.

## మమ్మా యోగ - యోగేశ్వరి

మమ్మా యోగము జోడించే అవసరము లేకుండానే నిరంతరము సహజ లేక స్వతహా యోగినిగా ఉండేవారు. మన్మనాభవ, మధ్యాజీభవ మహామంత్రాన్ని వారు స్వాభావిక రూపములో ధారణ చేశారు. అంతేకాక ఈ భూమి పై నడుస్తూ తిరుగుతున్నా ఈ భూమి నుండి భిన్నంగా కనిపించేవారు. వారి బుద్ధి సదా పరంధామానికి జోడింపబడి ఉన్నట్లు ఉండేది అనగా అతీంద్రియ సుఖాన్ని అనుభవిస్తూ ఉన్నట్లు కనిపించేవారు.



మాతేశ్వరిగారితో గుల్జార్ దాదీ, సావిత్రి బహన్ మరియు లక్నోలోని సోదరీ - సోదరులు (ఫోటో - 1962)

వారు యోగనిష్టలో ఉన్నప్పుడు వాతావరణములో నిశ్శబ్ధము వ్యాపించేది. ఇతర వ్యక్తులకు శాంతి మరియు శక్తుల శక్తిశాలి ప్రకంపనాలు అనుభవమౌతూ ఉండేవి. వారిలో యోగుల సమస్త లక్షణాలు విరాజమానమై ఉండేవి. దాని వలన వారి వ్యక్తిత్వము చాలా ప్రభావశాలిగా ఉండేది.

## దివ్య గుణాల జనని

దివ్యగుణాల ధారణా క్షేత్రములో మాతేశ్వరీగారు నిశ్చయంగా అద్వితీయమైనవారు. అంతేకాక సర్వగుణ సంపన్నంగా ఉండేవారు. అనగా వారు దివ్య గుణాలకు జనని అని చెప్పవచ్చు. అంతర్ముఖత, గుణగ్రాహకత, గంభీరత, ధైర్యత, మధురత, హర్షితముఖత, ప్రసన్నత, సాక్షిద్రష్ట, పవిత్రత, శాలీనత, అచల్ - అడోల్ లేక ఏకరస స్థితి డ్రామా పై సంపూర్ణ నిశ్చయము మొదలైన సర్వ గుణాలకు సాక్షాత్తు చైతన్యమూర్తిగా ఉండేవారు. ఏ బ్రాహ్మణ వత్స అయినా వారి సాన్నిధ్యము ప్రాప్తి చేసుకుంటూ వారి దివ్యతతో ప్రభావితులు కాకుండా ఉండలేకపోయేవారు.

ఆ దివ్యగుణాలకు ఒకసారి కఠిన పరీక్ష ఎదురయింది. కోటాహౌస్ మరియు ధౌల్‌పూర్ హౌస్‌లోని బంగళాలను ఖాళీ చేయమని రాజస్థాన్ గవర్నమెంటు నిర్ణయించింది. ప్రభుత్వము వారి అనేక పోలీసు అధికారులు, పోలీసులు ఈ బంగ్లాను ఖాళీ చేయించేందుకు ముఖ్యకేంద్రానికి వచ్చారు. అప్పుడు యజ్ఞములో అనేకమంది వృద్ధ మాతలు కొంతమంది యువ వయస్సులో ఉన్న సమర్పిత సోదర-సోదరీలు ఉండేవారు(నివసించేవారు). యజ్ఞములోని సమస్త సామానులు ఆ బంగళాలలో నిండి ఉండేవి. అనేక ట్రక్కులలో నిండునంత సామాను ఉండేది.

ఏదైనా ఒక తగిన ఇతర స్థానమేదీ ఆ సమయములో లభించలేదు. ముఖ్యకేంద్రాన్ని మార్చేందుకు తగిన బంగళా లభించలేదు. అప్పుడు యజ్ఞములో ఆర్థిక పరిస్థితి చాలా క్లిష్టంగా ఉండేది. యజ్ఞపిత బ్రహ్మాబాబా మధువనము బయటకు సేవార్థమై వెళ్ళి ఉండినారు. ఇటువంటి వికట



పరిస్థితిలో ఏ వ్యక్తి మానసిక పరిస్థితి అయినా ఎలా ఉంటుందో, ఎంత ఆందోళనతో, చింతలతో ఆలోచన జరిగి ఉంటుందో మీరు ఆలోచించవచ్చు! మమ్మా ఇటువంటి విషమ పరీక్షా సమయంలో విశేషంగా యోగ ప్రయోగము చేసేవారు అనగా స్వయం కఠినాతి కఠినమైన పరిస్థితులను కూడా తన పరిపక్వమైన అచల, అడోల ఏకరస స్థితి ద్వారా దాటుకునేవారు. ఆ సమయములో కూడా విశేషంగా యోగ కార్యక్రమము ఉంచబడింది. స్వయం మమ్మా శక్తి సైన్యానికి సేనానిగా ఉండి, తమ గాఢమైన శాంతి శక్తి ద్వారా ఆ స్థానాన్ని ఆత్మీయత అనే శక్తిశాలి కోటగా తయారు చేశారు. వారి చలించని స్థిరమైన ఏకరస స్థితిని చూసి ఇతర యజ్ఞ వత్సలు కూడా నిస్సంకల్ప స్థితిలో ఉన్నారు. సాక్షి దృష్టిగలవారై పరిస్థితులను ఎదురించారు. ఆ సమయములో భ్రాతా జగదీష్ చంద్రగారు అత్యంత సాహసము లేక శక్తి పరిచయమిస్తూ భారతదేశపు ప్రథమ రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్రప్రసాద్‌గారి ద్వారా భవనము ఖాళీ చేసేందుకు మూడు మాసాల అదనపు సమయము తీసుకున్నారు. జగదీష్ భాయి ఢిల్లీ నుండి జయపూర్‌కు వచ్చి గృహమంత్రితో కలిసి వారికి స్థితి-గతులను అవగతము చేయించారు. వారి ద్వారా ఆబూలో ఉండు ఎస్.డి.యమ్ గారికి టెలిగ్రామ్ ద్వారా వాయిదా వేయుటకు ఆదేశము పంపించారు. ఈ పరీక్షా సమయములో మాతేశ్వరిగారి అనేకానేక గుణాల పరీక్ష, గుణాల ప్రత్యక్షీకరణము కూడా జరిగింది. విజయము మన జన్మ సిద్ధ అధికారము అనే సత్యము కూడా అందరికీ ప్రత్యక్షంగా అనుభవమయింది.

## అవిచల(స్థిరమైన) నిష్ఠ ఇచ్ఛామాత్రమ్ అవిద్యా

బ్రహ్మాబాబా శరీరములో అవతరితమైన శివపరమాత్మని అతిరహస్యమైన లేక గోపనీయమైన రహస్యాన్ని అత్యంత లోతుగా పరిశీలించి శీఘ్రంగా తన కుశాగ్ర బుద్ధి లేక పవిత్ర బుద్ధిని మమ్మాగారు అందరికీ పరిచయమిచ్చారు. యజ్ఞచరిత్ర ద్వారా ఇది స్పష్టమైనది - బాప్‌దాదాగారి ప్రేరణలను లేక ఆజ్ఞలను యథార్థంగా అర్థము చేసుకొని వాటిని

యజ్ఞములో కార్యాన్వితము చేయు బాధ్యతను మమ్మా సంపూర్ణ కుశలతతో నిభాయించారు. ఆమె ఇతర యజ్ఞవత్సలకు మాటిమాటికీ ఇది ఎవరి ఆజ్ఞనో అర్థం చేయిస్తూ ఉండేవారు! స్వయం సర్వజ్ఞులు, సర్వశక్తివంతుల ఆజ్ఞ అని అర్థము చేయించేవారు. అంతేకాక డ్రామాలో ఈ కార్యము ముందే నిర్ణయింపబడి ఉంది, పూర్తి అయ్యే ఉంది, మనము కేవలం నిమిత్తమై కాళ్ళు - చేతులు కదిలిస్తూ ఉండాలని చెప్పేవారు.

## ఒక్క తండ్రి తప్ప ఇతరులెవ్వరూ లేరు

వారి జీవితములోని అనేకానేక ప్రసంగాలను అధ్యయనము చేస్తే మమ్మాగారు, “నాకు బాబా ఒక్కరు తప్ప ఇంకెవ్వరూ లేరు” అనే మహామంత్రము యొక్క అత్యంత నిగూఢమైన రహస్యాన్ని పూర్తిగా పరిశీలించి దాని సత్యతను అనుభవము చేసుకున్నారనుట నిర్వివాదంగా ఋజువైపోతుంది. ఈ విధంగా దేహము, దేహ సంబంధాలు లేక దేహ ప్రపంచము నుండి వారికి సంపూర్ణ వైరాగ్య వృత్తి ఉండేది. ఆమె దేహములో ఉంటున్నా సర్వ వేళలా దేహము నుండి భిన్నమైన ఆత్మనని అనుభవము చేస్తూ ఫరిస్తా(సూక్ష్మ దేవత)గా తయారై కార్య వ్యవహారాలు చేసేవారు. వారు స్వయంగా ఇచ్ఛా మాత్రమ్ అవిద్యా స్థితిని అనుభవము చేస్తూ, ఇతర యజ్ఞ సంతానానికి కూడా ఈ ధారణను దృఢంగా చేసుకొను మహత్వాన్ని తెలుపుతూ ఉండేవారు. సదా ప్రతి కార్యములో మధురమైన బాబాను చేయించేవారి(కరావన్‌హార్)గా అనుభవము చేస్తూ కర్మేంద్రియాలతో కర్మలు చేయించేవారు. అంతేకాక ఆత్మిక మస్తీలో సదా ఎగురుతూ ఉండేవారు. వారి ప్రతి సంకల్పము, మాట, కర్మ అనంతమైన సేవావృత్తి, స్మృతి, భావన, కామనలతో సంచలిత(ప్రవాహిత)మవుతూ ఉండేవారు. వారి ప్రతి శ్వాసలో, సంకల్పములో బాబాయే నిండి ఉండేవారు.

## బాధలను హరించు కాళీ మాతా

మమ్మా కలకత్తాకు వచ్చిన సమయములో ఆమె సంపూర్ణ లగ్నముతో మనసా సేవ, వాచా సేవ చేస్తూ ఉండడం నేను చూశాను. ఆ



సమయములో అచ్చట ఒక పెద్ద ధాన్యపు టోకు మార్వాడి వ్యాపారి వచ్చారు. అతను చట్టా వ్యాపారములో చాలా నష్టపోయిన కారణంగా జీవితములో ఓడిపోయి జీవఘాతము(ఆత్మహత్య) చేసుకునే విషయములో ఆలోచిస్తూ ఉండినారు. నేను అతనికి - ఈ సమయములో నీ భాగ్యము కొలది జగదంబ సరస్వతి ఎవరి మందిరమైతే కాళీ మాతా రూపములో స్థితమై పూజింపబడుచున్నదో, ఆమె చైతన్యముగా మీ నగరములోకి వేంచేసి ఉన్నారు, వారికి నీ పరిస్థితులను, నీ వేదనలను తెలిపి నివారణ పొందుకో అని చెప్పాను. ఆ వ్యక్తి మమ్మా ముందుకు వస్తూనే మమ్మా అతనికి శక్తిశాలి మరియు ఆత్మిక ప్రేమతో నిండిన దృష్టినిచ్చి మందహాసము చేస్తూ ఈ విధంగా చెప్పారు - “బిడ్డా! ఈ జీవితము గెలుపు-ఓటముల ఒక ఆట. అందులో ఏ ఆత్మ కూడా సుఖము-దు:ఖము, గెలుపు - ఓటమి. మానము - అవమానము, స్తుతి-నిందల నుండి విడుదల అవ్వనే అవ్వలేరు. శివబాబా తెలిపిన జ్ఞానాన్ని లోతుగా అర్థము చేసుకో, యోగాభ్యాసము చేసి నిమిత్తంగా ఉండి కార్యవ్యవహారాలు చేస్తూ ఉంటే స్వతహాగా సర్వమూ సరిపోతాయి.” మమ్మా నోట పలికిన ఈ మధురమైన లాలిపాట వింటూ వింటూ అతని నేత్రాల నుండి ప్రేమాశ్రువులు ప్రవహించాయి. మమ్మా మళ్లీ మధురమైన ఆత్మిక దృష్టినిచ్చి అతని హృదయములోని బాధను హరించారు. ఆ తర్వాత నేను కొద్ది రోజుల వరకు కలకత్తాలో ఉన్నాను. అంతవరకు అతను క్లాసుకు రెగ్యులర్‌గా వచ్చేవారు. కొన్ని సంవత్సరాల తర్వాత నేను అలహాబాద్‌లో కుంభమేళాలో సేవలో ఉన్నప్పుడు ఒక రోజు అకస్మాత్తుగా అదే వ్యక్తి తన కారు నుండి క్రిందకు దిగి నా వద్దకు వచ్చి నాకు పాత స్మృతిని కలిగించారు. మళ్లీ అతడు పూర్వము వలె సంపూర్ణ ఆరోగ్యముతో, సంపన్నంగా సుఖంగా ఉన్నాడు. అతడు మాటిమాటికి మధురమైన మమ్మాగారి ధైర్యమునిచ్చే శబ్దాలను గుర్తు చేసుకున్నారు. ఆ ఓదార్పుతో కూడిన పలుకులు అతనికి నూతన జీవితానికి ఊపునందించాయి(ఊపిరినిచ్చాయి).

## సంపూర్ణ దేవి

నేను ఇది కూడా అనుభవము చేశాను - రోజంతా మమ్మా క్రొత్త క్రొత్త వ్యక్తుల జ్ఞాన నేత్రమును తెరిపించు సేవలో నిమగ్నమై ఉండేవారు. ఎంత పనిలో వ్యస్థమై ఉన్నా అలసిపోయేవారు కాదు. రాత్రి నిదురించుటకు ముందు మరుసటి రోజు మురళి చదివే నిదురించేవారు. కలకత్తాకు పోయి వచ్చిన తర్వాత సమయము తీసుకొని నేను వారిని - మమ్మా మీరు నాకు సంపూర్ణ దేవిగా అనుభవమౌతున్నారు. మీరు ఏ పురుషార్థము చేస్తున్నారు? అని అడిగాను. మమ్మా చిరునవ్వు నవ్వి ఇలా చెప్పారు - “బిడ్డా! ఈ సమయములో ప్రతి బ్రాహ్మణాత్మ యొక్క పురుషార్థమే నిరంతరము ఆత్మిక స్థితిలో స్థితమై ఉండి పరంధామములో బిందు రూపములో తండ్రిని స్మృతి చేయడం. వారిని చేయించేవారిగా (కరావన్‌హార్‌గా) భావించి స్వయాన్ని నిమిత్తంగా భావించి యజ్ఞ సేవ సత్యమైన హృదయముతో చేస్తూ ఉండాలి. మమ్మా కూడా ఇదే పురుషార్థములో మునిగి ఉంటారు.” ఇప్పటికి 40 సంవత్సరాల క్రితమే మాతేశ్వరిగారు నాలుగు విషయాల సారమును చాలా లోతుగా అనుభవము చేసేశారు. ఈ ఆధారముతోనే సత్యయుగ ప్రథమ విశ్వమహారాణి శ్రీలక్ష్మిగా అయ్యి విశ్వములో సతోప్రధాన రాజ్య ప్రణాళికా పరంపరను ప్రారంభము చేసేందుకు నిమిత్తమవుతారు.

## జన్మిస్తూనే మొదట తల్లి దర్శనము, తర్వాత తండ్రి దర్శనము

*బ్రహ్మాకుమార్ భ్రాతా అమీర్‌చంద్‌గారు మమ్మాతో వారి అనుభవాన్ని ఈ విధంగా తెలుపుతున్నారు - నేను మాతేశ్వరీగారితో మొట్టమొదట 1959 సంవత్సరము డిశంబరు మాసములో కలుసుకున్నాను. ఆ సమయానికి నేను జ్ఞానములో నడుస్తూ కొద్ది మాసాలు మాత్రమే అయ్యింది. మాతేశ్వరీగారు కాన్పూరు నుండి సహారన్‌పురానికి రావలసి ఉన్నారు. నేను అప్పుడు కర్నాల్‌లో ఉండేవాడిని. మాతేశ్వరీగారితో కలవాలని నా మనస్సులో చాలా ఉత్సుకత ఉండినది. నేను స్టేషన్ వద్దకు చేరుకుంటూనే రైలు నుండి మాతేశ్వరీగారు క్రిందికి దిగుతూ ఉన్నారు. వారు క్రిందికి దిగుతూనే అందరికీ దృష్టినిస్తూ కనులతో కలుసుకుంటూ ఉన్నారు. ఆ సమయములో నేను వారి వ్యక్తిత్వము ఆత్మిక అయస్కాంతము వలె ఉండడం గమనించాను. కనులు, ముఖము ఆత్మిక శక్తితో ప్రకాశిస్తూ ఉన్నాయి. వారి దృష్టి నా పై పడ్డూనే నాకు సులభంగా అశరీరి స్థితి అనుభవమవ్వసాగింది. ఆ రోజు ఆ స్థితిని ప్రాప్తి చేసుకునేందుకు పురుషార్థము చేస్తున్నాను కాని ఆ సమయములో మాతేశ్వరీగారి దృష్టి పడ్డూనే నాకు ఆ స్థితి ప్రాప్తి అయ్యింది. మాతేశ్వరీగారి వ్యక్తిత్వము అలా ఉండేది అనగా వారిని ఎవరు చూచినా లౌకికములోని వారు కూడా వారిని గౌరవిస్తూ నిలబడిపోయేవారు. వారికి మమ్మాలో ఒక విశేషమైన మహాత్మ్య కనిపించి మమ్మా పాదాలను స్పర్శించేవారు. మాతేశ్వరీగారు అటువంటి వారిని కూడా తమ స్నేహ భరితమైన కరుణ నిండిన దృష్టితో తృప్తి పరిచేవారు.

ఆ సమయములో సమాజానికి ఈ జ్ఞానము క్రొత్తదైన కారణంగా సేవాకేంద్రానికి వచ్చు సోదరీ-సోదరులలో చాలా ప్రశ్నలు, సందేహాలు కలిగేవి. కాని మాతేశ్వరీగారు ఈ జ్ఞానాన్ని ఎంత స్పష్టంగా, సరళంగా చేసి వినిపించేవారంటే వారి అనేక ప్రశ్నలు నివారణై నిశ్చయబుద్ధిగా

* బ్రహ్మకుమార్ భ్రాతా అమీర్‌చంద్ గారు పంజాబ్ జోన్‌లోని ఈశ్వరీయ సేవలకు నిర్దేశకులు. మీరు సమాజ సేవా విభాగానికి అధ్యక్షులు. వర్తమాన సమయంలో పంజాబు జోన్ ముఖ్యాలయమైన చండీఘడ్‌లో ఉంటున్నారు.

తయారైపోయేవారు. అప్పుడు నా వయస్సు 19 సంవత్సరాలు. నేను కూడా వారిని ఒక ప్రశ్న అడిగాను - సత్యమైన బ్రాహ్మణులని ఎవరిని అంటారు? అందుకు వారన్నారు - "బ్రాహ్మణులనగా సంపూర్ణ సమర్పణ అయినవారు. సర్వస్వము బాబాదే. లౌకిక సేవ గాని, వ్యవహారము గాని కేవలము నిమిత్తము ఇది కూడా బాబా సేవ కొరకే. నాదంటూ ఏమీ లేదు" అని చెప్పారు. వారు చెప్పిన ఈ మాటలు నాకు వరదానమైపోయాయి. కొంత కాలము తర్వాత నేను సేవాకేంద్రములో ఉండడం ప్రారంభించాను. నేను ఈ మాటలను జీవితమంతా గుర్తుంచుకొని నడుస్తున్నాను.

## శాలీనతకు సంపూర్ణ మూర్తి

మాతేశ్వరీగారు ఒకసారి 3-4 రోజులు ఉండేందుకు కర్నాల్‌కు వచ్చారు. అప్పుడు నాకు వారిని అతిసమీపంగా చూచే సౌభాగ్యము లభించింది. మాతేశ్వరీగారు గంభీరతకు ప్రతిమూర్తి(స్వరూపము)గా ఉండేవారు. వారు ఆ చిన్న ఆంగనములో సంచరించునప్పుడు ఏ మాత్రము శబ్దము అయ్యేది కాదు. ఆ వీధి వీధి అంతా వారితో ప్రభావితమయ్యేది. వారు శాలీనతకు(నమ్రతకు) సంపూర్ణ స్వరూపముగా(మూర్తిగా) ఉండేవారు.

## జ్ఞాన ఛాత్రక పక్షి

మాతేశ్వరి గారికి శివబాబా మహావాక్యాల పై చాలా గమనముండేదని నేను చూచాను. ఆ సమయములో ఆబూ నుండి సాకార బాబా మాతేశ్వరీ గారికి ఒక ఉత్తరము వ్రాశారు. ఆ ఉత్తరములో శివబాబా మహావాక్యాల పాయింట్లు వాటితో పాటు సాకారబాబా పరిపాలనా కార్య వ్యవహారాలు కూడా ఉన్నాయి. మాతేశ్వరీగారు మొదట శివబాబా మాహావాక్యాలు చదివిన తర్వాత సాకారబాబా కార్య వ్యవహారాలను గురించిన పత్రాన్ని చదివారు. ఆ సమయములో దాది మనోహర ఇంద్రగారు అక్కడనే ఉన్నారు. వారు మాతేశ్వరీ గారితో ఇలా అన్నారు. "మమ్మా, మీరు మొదట బాబా వ్రాసిన ఉత్తరము చదివేందుకు



బదులు జ్ఞాన బిందువులనే ఎందుకు చదివారు? అప్పుడు మాతేశ్వరిగారు - "మన జీవితానికి శివబాబా జ్ఞానమే ఆధారము. ఇదే మన భోజనము. దీనికై నేను చాలా కుతూహలముతో నిరీక్షిస్తూ ఉంటాను. కవరు వస్తూనే మొట్టమొదట నేను జ్ఞానబిందువులనే చదువుతాను. తర్వాత కార్యవ్యవహారాల గురించిన సమాచారాన్ని చదివి ఏమి చేయాలో అది చేస్తాను" అని చెప్పారు. ఈ విధంగా జ్ఞానానికి అథారిటీ, జ్ఞానదేవి అయ్యి ఉండినా మాతేశ్వరీగారిలో ఈశ్వరీయ జ్ఞానపిపాస సదా ఉండేది. వారు జ్ఞాన వర్షపు జ్ఞాన ముత్యాల ప్రతీక్షలో ఉండే జ్ఞానఛాత్రక పక్షిగా ఉండేవారు.

## తల్లిగారి ద్వారము పిల్లలకు సదా తెరచి ఉండేది

మాతేశ్వరీగారు ప్రతి ఒక్కరికి ఇలా చెప్పేవారు - ఎవరైనా ఏ విషయముకైనా మమ్మాతో వ్యక్తిగతంగా కలుసుకోవాలనుకుంటే వారు ఏ సమయములోనైనా అనుమతి లేకుండా అడగకుండా రావచ్చును. ఎటువంటి నియమము పాటించవలసిన అవసరము లేదు. ఈ విధంగా మమ్మా(తల్లి) తన మొత్తము సమయాన్ని పిల్లల ఉన్నతికి మరియు సేవకు ఇస్తూ ఉండేవారు. వారు ఎంత గొప్ప అథారిటీగా ఉండేవారో, అంత నిరహంకారిగా కూడా ఉండేవారు.

మాతేశ్వరీగారు స్వంత పురుషార్థము పై చాలా గమనముండేది. సదా వారి నోటి ద్వారా ఇదే శబ్దము వెలువడుతూ ఉండేది - "మనము ఎటువంటి కర్మలు చేస్తామో, మనలను చూచి ఇతరులు కూడా అలాగే చేస్తారు." మమ్మాగారు బిగ్గరగా మాట్లాడడం నేను ఎప్పుడూ చూడలేదు. బిగ్గరగా నవ్వడం అస్సలు ఆమె చరిత్రలోనే లేదు.

## సదా ఆజ్ఞాకారి, వినమ్రతతో ఆజ్ఞలను పాటించే ముద్దు బిడ్డ

ఈ యజ్ఞములో మాతేశ్వరీగారు చాలా గొప్ప అథారిటీగా ఉండినా, వారు బాబా ముందుకు వచ్చినప్పుడు ఆమె ఒక చిన్న బాలిక వలె ఆజ్ఞాకారిగా ఉండేది. సదా 'సరే బాబా' "మంచిది బాబా" అని అంటూ ఉండేవారు. ప్రతి రోజు బాబా క్లాసులోకి వచ్చేందుకు ముందు మమ్మా

క్లాసు చేయించవలసి వచ్చేవారు. మమ్మా వినిపిస్తూ ఉన్నప్పుడు బాబా క్లాసులో ప్రవేశిస్తూనే వారు వెంటనే తమ వాణిని నిలిపేసేవారు. బాబా కొరకు వారిలో ఇంత గౌరవము ఉండేది! బాబా మురళికి మమ్మా చాలా గౌరవమిచ్చేవారు. బ్రహ్మాబాబాలో శివబాబా ప్రవేశించి, మురళిని చెప్పడం ప్రారంభించినప్పుడు మమ్మా తన ముఖాన్ని సభ వైపు ఉంచేవారు కాదు, బాబా వైపు తిరిగి కూర్చుని మురళి చాలా అటెన్షన్‌తో వినేవారు. మమ్మా కూర్చునే స్థానము కూడా బాబాకు సమానంగా ఉండేది. అయినా మమ్మా తమ ముఖాన్ని బాబా వైపు తిప్పి కూర్చునేవారు. ఈ విధంగా మమ్మాలో బాబా పట్ల అనంతమైన గౌరవముండేది.

## అసామాన్యమైన వ్యక్తిత్వము

మమ్మా యోగములో కూర్చున్నప్పుడు గాని, ఇతరులకు దృష్టినిచ్చునప్పుడు గాని ప్రతి ఒక్కరికి విచిత్రమైన అనుభూతి కలిగేది. మమ్మా స్థూల స్వరూపానికి బదులు లైటు స్వరూపమే కనిపించేది. మమ్మాగారు సన్ముఖములో కూర్చున్నప్పుడు సహజంగా అవ్యక్త వాతావరణము, విదేహీ స్థితిలో ఉండడం, పూర్తి నిశ్శబ్ధములో ఉండడం చెప్పకనే ఏర్పడేది. మమ్మా కేవలం ఒక కుమారి అని బ్రహ్మా వత్సలందరికీ తెలిసినా, వారిని ఎవరు చూసినా మాత, దేవి, ఫరిస్తాల దర్శనమయ్యేది. దేహ భావము అసలు ఉండేదే కాదు. ఎలాగైతే చిన్న బాలుడు తన తల్లి ఒడిలోకి సహజంగా ఇమిడిపోతాడో, ఆ విధంగా బ్రహ్మా వత్సలు ప్రతి ఒక్కరు మాతేశ్వరిగారి ఒడిలోకి చేరిపోయేవారు.

మాతేశ్వరీగారిలో పరిశీలనా శక్తి చాలా అధికంగా ఉండేది. నేను వారితో మధువనములో మొట్టమొదట కలుస్తూనే మాతేశ్వరీగారు ఇతను జ్ఞానయుక్తమైన పుత్రుడు అని అన్నారు. అంతకు ముందు నేను ధ్యానములోకి వెళ్ళేవాడిని. ఆట-పాట పాడేవాడిని. భవిష్య దృశ్యాలు చూచేవాడిని. కాని మాతేశ్వరీ గారితో కలిసి కర్నాల్‌కు వాపస్ పోతూనే నా ధ్యాన పాత్ర సమాప్తమైపోయింది. ఇంతవరకు మళ్ళీ ఒక్కసారి కూడా



సాక్షాత్కారమవ్వలేదు. ఈ విధంగా మమ్మా మాటలు నాకు వరదానంగా కూడా అయ్యాయి. మాతేశ్వరిగారిలో నిమిత్త భావము సంపూర్ణ రూపములో ఉండేది. వారు సదా - ఇది శివబాబా కార్యము, చేసి చేయించేవారు వారే. మనము కేవలం నిమిత్తులము. సర్వము బాబాయే చేస్తారు అని అనేవారు. మమ్మాలోని ఈ గుణాన్ని నా స్వంతము చేసుకునేందుకు నేను ప్రయత్నించాను. విశ్వ పరివర్తన చేయవలసింది బాబాయే. మనము కేవలం వారికి ఉపకరణాలు మాత్రమే. చేయడం, చేయించడం వారి కర్తవ్యము. ఈ విధంగా మేము మమ్మా సదా తేలికగా, నిశ్చింతగా ఉండడం మేము చూచాము.

## కర్మభోగ సమయములో కూడా నిరంతర యోగిని, నిస్వార్థ స్నేహి

మాతేశ్వరీ గారితో నా చివరి కలయిక బొంబాయిలో జరిగింది. మాతేశ్వరీగారి ఆరోగ్యము చాలా క్షీణించి ఉందని వారితో ఎవ్వరూ మాట్లాడరాదని మాకు తెలియచేయబడింది. మాతేశ్వరీగారితో నేను కేవలం కనులతోనే కలిశాను. మాతేశ్వరీగారు నాకు ఏమీ చెప్పలేదు. కాని ఆ సమయములో వారి ముఖము వారి దృష్టి మస్తిష్కము పై ప్రకాశము ఇంతకుముందు ఎలా శక్తిశాలిగా ఉండేదో, అప్పుడు కూడా అలాగే శక్తిశాలిగా ఉండేది. వారి స్నేహ స్వరూపములో, వ్యవహారములో లేశమాత్రము కూడా తేడా లేదు. వారు జబ్బుగా ఉన్నారని, వారి ఆరోగ్యము చాలా ఆందోళనకరంగా(నాజూకుగా) ఉందని ఏ మాత్రము అనిపించలేదు. వారు ప్రకృతిజీత్‌గా అయ్యారని నాకు స్పష్టంగా అనుభవమయింది.

# నిరహంకారత, వినమ్రత విద్యుత్ జనని – తల్లి సరస్వతి

బ్రహ్మకుమార్ భ్రాతా రామఋషి శుక్లగారు ఇలా వ్రాస్తున్నారు - ఇది 1956వ సంవత్సరములో జరిగిన విషయము. అప్పుడు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి తాత్కాలిక ముఖ్యాలయము కోటాహౌస్‌లో మొట్టమొదట మమ్మా, బాబాలతో నేను కలిశాను. ఏప్రిల్ మాసములో జరిగిన కలయికలలో మొదటి రోజంతా సాక్షాత్కారాలతో గడచిపోయింది. కాని తర్వాత రోజు విశేష అనుభూతుల రోజుగా ఉండినది. ఒకనాడు మూడవ ఝామున జరిగిన విషయము - మమ్మా, బాబాలు టేబుల్ ముందు కూర్చుని ఉండినారు. నేను వారి ఎదుట కుర్చీలో కూర్చుని ఉండినాను. నేను తప్ప ఇంకెవ్వరూ లేరు. బాబా లౌకిక రీతిలో క్షేమసమాచారాలు విచారిస్తూ ఉండినారు. అంతలో ఒక గుప్త చమత్కారము జరిగిపోయింది. నేను ఈ స్థూల నేత్రాలతో ప్రత్యక్షంగా చూచినట్లు శివబాబాను మమ్మా - బాబాల వెనుక వృత్తాకారములో చూచాను. ఆ రోజు నుండే నాకు - నిరాకార పరమాత్మ శివుడు విశ్వ పరివర్తన విశ్వకళ్యాణము కొరకు బాబా-మమ్మాలను నిమిత్తముగా చేశారని దృఢ నిశ్చయము, ఆత్మ విశ్వాసము కలిగింది.

## అలౌకిక తల్లితో పాటు లౌకిక తల్లి కూడా అయ్యారు

8 -9 సంవత్సరాల చిన్న వయస్సులోనే నేను తల్లిని చాలా సమీపంగా చూశాను. వారితో మాట్లాడే అవకాశము, విచార విమర్శలు చేసే అనేక మంచి అవకాశాలు ఈ ఆత్మకు లభించాయి. అన్నిటికంటే గొప్ప విషయము ఏమంటే - వ్యక్తిగతంగా కలిసినప్పుడు వారు అలౌకిక తల్లితో పాటు లౌకిక తల్లి కూడా అయ్యారనే భావాన్ని కలిగించేది. ఆమె జ్ఞాన విషయాలు వివరిస్తూనే ఉండేది. గృహస్థ వ్యవహారాలకు సంబంధించిన ఉపయోగపడు శిక్షణలు కూడా తక్కువగా ఏమీ ఇచ్చేది కాదు. ఇంటిలో ఎలా ఉండాలి, లౌకిక పిల్లలను ఎలా చూడాలి, బంధువులతో ఎలా వ్యవహారము నిభాయించాలి - మొదలైన విషయాల సాటిలేని శిక్షణలు మాకు తల్లి నుండి లభించేవి.



ఇచ్చట నేను మమ్మాగారి నిరహంకారతకు, వినమ్రతకు రెండు ఉదాహరణాలను ఇస్తున్నాను. ఒకసారి మమ్మా లక్నో సేవాకేంద్రము, హజరత్ గంజ్‌లో ఉండడం జరిగింది. ఒకచోట నుండి మమ్మా మహావాక్యాలు టేప్‌లో రికార్డ్ చేసి పంపమని ప్రార్థన లేఖ అందింది. కొంతసేపు మమ్మా చింతనమగ్నమయింది. తర్వాత మమ్మా బాబాగారి ఒక మురళిని ఇప్పించుకుని ఆ మురళిలోని కొన్ని మహావాక్యాలను ఉన్నవి ఉన్నట్లుగానే చదివారు. తన స్వంత శబ్దము ఒక్కటి కూడా జోడించలేదు. తల్లి నిరహంకారత ఇలా ఉండేది. బాబాలో వారి మహావాక్యాలలో మమ్మాగారికి అగాధమైన నిష్ఠ ఉండేది.

హజరత్‌గంజ్ సేవాకేంద్రములో మమ్మా ఉన్న సమయములో చాలాసార్లు మమ్మాగారి జతలో ఒక్కసారిగా ఆశ్చర్యచికితుడనై ఉండే మంచి అవకాశాలు నాకు లభించాయి. మాతేశ్వరిగారు ఉదయము కనులు తెరుస్తూనే మొట్టమొదట బాబా నుండి వచ్చిన పోస్ట్‌ను, వాణిని ఆది నుండి అంతము వరకు పూర్తిగా చదివేసేవారు.

## అనంతమైన వినమ్రత

ఒకసారి మాతేశ్వరీగారిలో అనంతమైన వినమ్రతను చూచాను. వారితో పరిచయము చేయించేందుకు నేను ఒక వరిష్ఠ పత్రకారుడైన మిత్రుని తీసుకెళ్లాను. అతడు ఉన్నత శ్రేణికి చెందిన శాసనాధికారియే కాక మాత్ర భక్తుడుగా కూడా ఉండేవారు. తన గదిలోకి పత్రకార మిత్రుడు ప్రవేశించిన వెంటనే మాతేశ్వరిగారు అతనిని గద్దె పై కూర్చోబెట్టారు. మేము ఇరువురము స్తబ్ధమై అవాక్కై (ఆశ్చర్యపడి)పోయాము. ఆ మిత్రునికి కూడా ఏమి చేయాలో తోచలేదు. తల్లి ఆదేశాన్ని ఏ పుత్రుడైనా ఎలా దాటగలడు! అప్పుడు మాతా-పితలు ఏ విధంగా తమ పిల్లలను తమ తల పై, కనుల పై కూర్చోపెట్టుకొని తీసుకెళ్తారో నాకు అనుభవమయింది!

ఒక రోజు ప్రాత: సమయము క్లాసులో నేను నాచే ప్రచురించబడిన పుస్తకము "(ఉన్మేష్")లో తల్లిని ఆహ్వానించు అంతిమ భాగాన్ని భావ

విభోరమై గట్టిగా చదువుతూ ఉండినాను. ఉన్నట్లుండి మమ్మా నన్ను ఆపి వేలుతో పైకి సైగ చేసి ఇలా అన్నారు. "ఈ తల్లి కాదు, ఆ తల్లి మాతలకు మాత పరాత్పర మాత, స్వయం పరమపిత నిరాకార పరమాత్మ." మమ్మాగారి అపరిమిత వినమ్రతా భావన ఇలాంటిది!

### అకాట్య(ఖండింపనలవి కాని) ప్రభావశాలి తర్కము(లాజిక్)

కల్పక్రితము జ్ఞానకలశధారిణి సరస్వతి శ్రీ మాతేశ్వరిగారు ఇలా తర్కము చేసి మహావాక్యాలను పలికేవారు. వాటితో మొత్తము అసురీ తర్కము లేక కు(చెడు) తర్కము అంతా కర్పూరము వలె గాలిలో కలిసి ఎగిరిపోయేది. అచ్చట నేను పరమ ఆదరణీయ శ్రీమాతేశ్వరి గారి కొన్ని ఖండింపనలవి కాని ప్రభావశాలి తర్కాలను ఉదహరిస్తున్నాను.



ముంబయి (సాయన్) - మమ్మాతో విసనీ దాదీ(ఫోటో - 1961)

### సత్యమనగా ఏమి ? కల్పన అనగా ఏమి ?

కొంతమంది బ్రహ్మాకుమారీల జ్ఞానాన్ని వీరి పితాశ్రీగారి స్వంత కల్పన అని అంటారు. కాని వారు ఏ విషయాలను, మాన్యతలను ప్రస్తుతిస్తారో, సిద్ధము చేస్తారో వాటి స్థితి ఏమి? వీరి నమ్మకాలను అనుసరించి నడుస్తూ



భారతదేశము చాలా వేల సంవత్సరాల నుండి పతనపు గోతిలో పడుతూనే వస్తోంది, ఇప్పుడు కూడా అదే గోతిలో పడుతూనే ఉంది. దీనికి విపరీతంగా పితాశ్రీ గారి శ్రేష్ఠమైన నోటి ద్వారా శివపరమాత్ముడు ఉచ్ఛరించిన సత్యాలను, మాన్యతలను అనుసరించి మన చరిత్రలు(గుణగణాలు) చక్కదిద్దబడ్డాయి. మనము ఉన్నతకళలోకి వచ్చాము. కావున జీవితము దేని వలన చక్కదిద్దబడిందో, ఉన్నతకళలోకి వచ్చిందో, అదే సత్యమైనది. దేని వలన పతనమౌతూ పోయిందో వాస్తవానికి అదే కల్పన లేక పూర్తి కల్పన.

### ఉన్న మార్గము ఒక్కటే అనేక మార్గములు లేవు

అనేక విధాలైన మహావాదులు(వాదించేవారు) పరమాత్మ ప్రాప్తికి అనేక మార్గాలు ఉన్నాయని అంటారు. వారి తాత్పర్యమేమంటే ఏ మార్గములోనైనా లేక వివిధ మార్గాలలో నడుస్తూ కూడా పరమాత్మ సమీపానికి చేరవచ్చు అనగా వారిని ప్రాప్తి చేసుకోవచ్చు. ఒక ప్రశ్నకు అనేక జవాబులు ఉండేందుకు వీలు ఉందా? ఉండనే ఉండవు. పరమాత్మ ఒక్కరే, వారు ఈ ఒక్క సంగమ యుగములోనే ప్రజాపిత బ్రహ్మా సాకార శరీరము ద్వారా మనుష్యాత్మలమైన మనకు అవ్యక్త లేక ఆత్మిక రూపములో ప్రాప్తి అవుతారు. అంతేకాక కలియుగాన్ని సత్యయుగములోకి పరివర్తన చేసేస్తారు.

### ఇది సత్యయుగాన్ని స్థాపన చేసే సమయము

కొంతమంది బ్రహ్మాకుమారీల సంస్థ సత్యయుగ స్థాపన, స్వర్ణ యుగము శీఘ్రంగా రావడం గురించి మాట్లాడ్తారు. కాని అది సరి కాదు. ఎందుకంటే కలియుగము ఇంకా చిన్నబాలునిగానే ఉంది అని అంటారు. కాని ఆలోచిస్తే వర్తమాన సమయము కంటే ఎక్కువ ధర్మగ్లాని సమయము ఇంకా ఏదైనా ఉంటుందా? 25 - 30 సంవత్సరాల క్రితము మేము రాబోవు వినాశ విషయము చెప్పినప్పుడు మమ్ములను భయపెట్టేందుకు ఇలా చెప్తున్నారని జనులు అనేవారు. ఇటువంటి గొప్ప వినాశనము ఎలా జరుగుతుంది! కాని ఆటంబాంబు, హైడ్రోజన్ బాంబు మొదలైనవి తయారైన

తర్వాత ఇప్పుడు వినాశనము జరుగుతుందనే భయము కనిపిస్తోంది. వారి నోటి నుండే వినాశనము సమీపములో ఉందనే విషయం స్వీకరించబడుతూ ఉంది. అనగా స్వీకరించే తీరుతారు. కనుక మనము చెప్పే సత్యయుగ స్థాపన విషయము కూడా జనులు అదే విధంగా త్వరలో తప్పకుండా స్వీకరిస్తారు. ఏ విధంగా వినాశ విషయములో ఇప్పుడు మన మాట జనులకు అర్థమౌతూ ఉందో, అదే విధంగా మనము చెప్పే ఈ విషయము కూడా అనగా కలియుగము ఇప్పుడు బాల్యావస్థలో లేదు, అంతిమదశకు వచ్చిందని కూడా జనులు తప్పకుండా అంగీకరిస్తారు.

ఈ విధంగా మమ్మాగారి వాక్‌శక్తి అద్భుతంగా ఉండేది. ఈశ్వరీయ మహావాక్యాలను వివరిస్తూ వారు ఉచ్ఛరించిన మృదు వచనాలు అన్ని విధాల అనుపమానంగా(సాటిలేనివిగా) ఉన్నాయి.

## సర్వులకు సన్మానమిచ్చే విశ్వవందనీయ (విశ్వముచే పూజింపదగిన) తల్లి

భోపాల్ నుండి బ్రహ్మాకుమార్ భ్రాతా మహేంద్రగారు తమ అనుభవాన్ని ఈ విధంగా వ్రాస్తున్నారు. ఈ ప్రపంచములో అనేక మహోన్నతమైన అభ్యుదయవాదులు అపారమైనశక్తి కలిగినవారు జన్మిస్తారు. వారు లౌకిక కర్తవ్యాలు చేసి వెళ్ళిపోతారు. వారి స్మృతులు ఇతరుల హృదయాలపై అంకితమైపోతాయి. అనగా ఇతరుల హృదయాల పై ముద్రించబడ్తాయి. ఇటువంటి సాటిలేని ముద్ర మన ప్రియమైన, మధురమైన జగదంబ తల్లి ఇతరుల హృదయాల పై వేశారు. వారి కర్తవ్యాల స్మృతులు మర్చిపోవాలనుకున్నా మరపురానివి. ఎప్పుడైనా నేను ఏకాంతములో కూర్చున్నప్పుడు ప్రియమైన తల్లి పలికిన మధురమైన శిక్షాప్రదమైన లాలి పాటలు హృదయాన్ని కదిలించి వేస్తాయి. ఎంత కఠోర పరిశ్రమ చేశారు! ఎన్ని ఆత్మల జీవితాలను ఆనందప్రదంగా చేశారు!

వారి మానస పటలముపై పవిత్రతా ప్రకాశముండేది. మాటలలో శక్తి నిండి ఉండేది. ముఖముపై ఆత్మిక చిరునవ్వు ఆలోచనలలో గంభీరత అడుగులలో ఫరిస్తాల చలనముండేది, వారి ఆత్మీయతతో ఆత్మలకు విశ్రాంతి లభించేది. వారి ప్రవచనాలను వినే అవకాశము నాకు చాలా సార్లు ప్రాప్తించింది సాక్షాత్ సరస్వతీదేవి జ్ఞానవీణను మీటుచున్న అనుభూతి కలిగేది. మమ్మా ఏ విషయాన్ని తీసుకున్నా చాలా లోతుగా స్పష్టపరిచేవారు. అలాగే వింటూ ఉండాలి, వింటూ ఉండాలనిపించేది. ప్రియమైన తల్లి మాటలు హృదయములో ఇమిడిపోయేవి. అంతేకాక నేను కూడా అదే విధంగా తయారవ్వాలనే లక్ష్యాన్ని తయారు చేసుకున్నాను. కొంతసమయము తర్వాత చిన్న వయస్సులోనే జీవితాన్ని సేవలో సమర్పితము చేశాను. ఆ సమయములో వేలాది కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది కాని మమ్మాగారి ప్రవచనాలు పుష్పాల వంటి లేఖలు జీవితాన్ని సరళంగా

* బ్రహ్మాకుమార్ భ్రాతా మహేంద్ర గారు మధ్యప్రదేశ్‌లోని భోపాల జోన్‌లోని సేవా శాఖల నిర్దేశకులు. వీరు హింది పక్ష పత్రిక 'జ్ఞాన వీణ' ముఖ్య సంపాదకులు.

చేసేశాయి. మమ్మా విశేషత ఏమంటే - వారు చిన్నవారితో కూడా గౌరవపూర్వకంగా వ్యవహరించేవారు. ఉత్తరాలలో కూడా 'గారు' అని గౌరవించేవారు.

## ఉన్నత స్థితికి చేర్చు ఉన్నతమైన శిక్షణలు

నేను ఒకసారి మాతేశ్వరిగారిని ఇలా ప్రశ్నించాను - మీరు ఇంత ఉన్నత స్థితికి చేరుకునేందుకు ఏ విషయాల పై గమనముంచవలసి వచ్చింది. వారు జవాబులో మూడు విషయాలను తెలిపారు.

1. నా నిశ్చయము శివబాబాలోనూ, బ్రహ్మాబాబాలోనూ సదా అచలంగా, స్థిరంగా, దృఢంగా ఉన్నాయి. నేను బాబాకు ఆజ్ఞాకారిగా, నమ్మకస్థురాలిగా ఉన్నాను. హాజీ(సరే బాబా) అనే పాఠాన్ని పక్కా చేసుకున్నాను. ఏమి జరిగినా, బాబా చెప్పినదానిని చేసే తీరాలి.

2. నేను ఎప్పుడూ బాబా మురళిని(ఈశ్వరీయ జ్ఞాన శ్రవణము) మిస్ చేయలేదు. ఎంత వ్యస్థము(బిజీ)గా ఉన్నా మధ్యలో సమయము వెతుక్కొని తప్పకుండా చదివి, చింతన చేస్తాను.

3. నేను ఎట్టి పరిస్థితులలోనూ ఏడ్వలేదు. భలే యజ్ఞములో భావ-స్వభావాలు, సంస్కారాలు, విఘ్నాలు కలిగించే అనేక విషయాలు వచ్చాయి. నేను మానసికంగా గాని, కనుల నుండి గాని ఎప్పుడూ ఏడ్వలేదు. ఎందుకంటే ఏడ్చినందున సహనశక్తి నశిస్తుంది.

## ఎప్పుడూ తమ కొరకు కానుకలను ఉపయోగించుకోలేదు

మాతేశ్వరిగారు ఎక్కడెక్కడికో సేవాకేంద్రాలకు ప్రవచనాలు ఇచ్చేందుకు వెళ్ళేవారు అచ్చట ఎన్ని కానుకలు లభించినా, వాటిని స్వయానికి ఉపయోగించుకునేవారు కాదు, ఇతరులను కూడా ఉపయోగించుకోనిచ్చేవారు కాదు. వాటన్నింటిని తీసుకొచ్చి మొదట యజ్ఞపితకు అర్పితము చేసేవారు.

మమ్మాగారి స్వభావము, గుణాలు సాగరము వలె ఉండేవి. ఎప్పుడూ



ఇతరుల తప్పులు గాని, ఇతర విషయాలు గాని మమ్మాకు తెలిసినప్పుడు, సాగరము వలె వాటన్నిటినీ ఇముడ్చుకునేవారు. ఏ పుత్రుడైనా వారి వద్దకు ఏ విషయాన్ని తీసుకొచ్చినా, వారికే అర్థం చేయించి తెలిపేవారు. ఆ విషయాలను ఇతరులకు రిపీట్ చేసేవారు కాదు. ఎవరైనా ప్రేమగా చెప్పినప్పుడు అర్థము చేసుకోకుంటే వినకుంటే అప్పుడు నేను నీకు తల్లిని మాత్రమే కాదు, కాళికా దేవిని కూడా అని గుర్తు పెట్టుకో అని చెప్పేవారు.

## త్రిమూర్తి స్వరూపధారిణి

వాస్తవానికి మాతేశ్వరిగారు మూడు రూపాలలో కనిపిస్తారు. సరస్వతి రూపములో విద్యాదేవి జ్ఞాన ధనాన్ని పంచే లక్ష్మి, ఆసురీ భావాలను సంహరించే దుర్గాదేవి. జగదంబ ఈ భూమి పై అవతరించి వెళ్ళిపోయారు. మేము మాత్రము పూజిస్తూ గుణగానము చేస్తూనే ఉండిపోయామనే రహస్యాన్ని భక్తులు తెలుసుకోలేరు.

# సర్వ మాన్యమైన తల్లి లలితాంబ

* బ్రహ్మాకుమార్ భ్రాతా ఓం ప్రకాశ్‌గారు తమ అనుభవాన్ని ఈ విధంగా వినిపిస్తున్నారు - ఇది 1957వ సంవత్సరములో జరిగిన విషయము - కౌసల్య అనే ఒక సోదరి ప్రతి రోజు కమలానగర్ సేవా కేంద్రానికి వచ్చేది. ఆమెకు జ్ఞాన-యోగాలలో చాలా లగ్నముండేది, ఆమె పవిత్ర జీవనము కూడా గడుపుతూ ఉండేది. కాని ఆమె పతి ఈ పవిత్రత విషయంలో చాలా జగడమాడేవాడు. ఒక రోజు అతడు ఆమెను చాలా కొట్టను కూడా కొట్టాడు. మమ్మా వచ్చారని తెలియగానే స్వయంగా మమ్మాను కలుసుకునేందుకు వచ్చాడు. మమ్మా ముందు చాలా కోపంగా తన విషయాన్నంతా వెళ్ళగక్కాడు. మమ్మా శాంతిగా అతని మాటలన్నీ వింటూ అతనికి శాంతి దానము చేస్తూ ఉండినారు. అతను చెప్పేదంతా పూర్తి అయినప్పుడు మమ్మా అతనితో బిడ్డా! - బిడ్డా!(బచ్చే, బచ్చే) అంటూ చాలా ప్రేమగా మాట్లాడారు. వెంటనే అతడు ఒక్కసారిగా శాంతము వహించి శాంతిగా వెళ్ళిపోయాడు. బాబా మురళి కొంచెము జటిలంగా(కష్టంగా) ఉండేది అనగా సాధారణ వ్యక్తి లేక జిజ్ఞాసువు లేక కొత్తగా జ్ఞానము తీసుకున్నవారు అర్థము చేసుకోలేకపోయేవారు ఎందుకంటే మురళి అనేక నిగూఢమైన రహస్యాలతో నిండి ఉండేది. ఢిల్లీలో మేము గమనించాము రాత్రి పూట మమ్మా బాబా మురళిని టేపు ద్వారా విని చింతన మంథన చేసి మొదట స్వయం తనలో ఇముడ్చుకొని దానిని సరళము చేసి పిల్లలకు వినిపించేవారు. మమ్మా అర్థం చేయించిన తర్వాత ప్రతి పుత్రుడు ఈ జ్ఞాన బిందువు నా కొరకే ఇది నేను ధారణ చేసి తీరాలి అని భావించేవారు. ఈ విధంగా మమ్మాగారి వాణి సరళంగా, సహజంగా ఉండేది.

భారతదేశపు సుప్రీమ్ కోర్టు ముఖ్యన్యాయాధీశులు(జడ్జి) గౌరవనీయులైన బి. పి సిన్హాగారు మమ్మాను కలుసుకునేందుకు వచ్చారు. మమ్మా సదా మమ్మా(తల్లి)గానే ఉంటూ ఉండేవారు. ప్రతి ఒక్కరి మాటలు బాగా విని, దానిని పరిష్కరించేవారు. మమ్మాను చూసి సిన్హాగారు అలౌకిక

* బ్రహ్మాకుమార్ భ్రాతా ఓం ప్రకాశ్ గారు చాలాకాలం మధువనంలో ట్రాన్స్‌పోర్ట్ విభాగము అధ్యక్షులుగా ఉండినారు.



తల్లి మమతను అనుభవము చేశారు. వారు తమ అనుభవములో ఇది వ్యక్తము కూడా చేశారు - వీరే నా ఆత్మిక తల్లి, దేవి, శక్తి. మమ్మా ముందు ఎలాంటి వాగ్వివాదనలు చేయలేదు, ఆయన చాలా ప్రీతితో మమ్మాను కలుసుకొని వారి మాటలు విని ఆనందము కూడా అనుభవించేవారు మమ్మాతో ఎవరైనా బయటివారు కలుస్తే మమ్మా నుండి చాలా మంచి ప్రభావము తీసుకొని వెళ్ళేవారు, మమ్మాను చూచి ఎవ్వరికీ ఏ విషయములోనూ శంక(అనుమానము) భ్రమ మొదలైనవి జన్మించేవే కాదు. వారిని చూచి ప్రతి ఒక్కరు తమ వారిగా మరియు ఆత్మిక ప్రేమను అనుభవము చేసేవారు.

## మమ్మాకు తమ స్వ పురుషార్థము చాలా ఉండేది

నేను మొట్టమొదట మధువనానికి వచ్చినప్పుడు పాత్రలు తోమేందుకు పని మనుష్యులు ఉండేవారు కాదు. మేమే అన్ని పనులు చేసుకునేవారము. ఆ సమయములో మమ్మా మా అందరినీ కూర్చోపెట్టి అప్పడాలు చేయడం కూడా నేర్పించారు. అప్పడాలు దిద్దడం చాలా కఠినమైన పని అని మీకందరికీ తెలుసు. మమ్మాతో పాటు నాకు ఎక్కువగా సేవ కొరకు టూర్‌కు వెళ్ళే పాత్ర ఉండేది. ఢిల్లీలో అయితే ఎక్కడికి కావాలంటే అక్కడికి మమ్మా కారులో వెళ్ళిపోయేవారు. నేను నా సైకిల్ పై అక్కడికి చేరుకునేవాడిని. మమ్మా ఆశ్చర్యపోయి ఇలా అనేవారు - అక్కడ ఉండేవాడివి అప్పుడే ఇక్కడకు ఎలా వచ్చావు! ఈ విధంగా ప్రారంభము నుండి మమ్మాకు చాలా సమీపంగా ఉండినాను. నేను మమ్మాతో పాటు సేవకు వెళ్ళినప్పుడు క్లాసులో టేపు వినిపించడం నా విశేష సేవగా ఉండేది. నేను బాబా మురళిని అందరికీ వినిపించేవాడిని. ఖాళీ టేపులు ఆబూకు పంపేవాడిని. మురళి నిండిన టేపులను వినిపించేవాడిని. అప్పుడు మమ్మా కూడా మురళి వింటూ ఉండేవారు. నేను మమ్మా వ్యక్తిగత జీవితాన్ని ఆబూలో కూడా చూచాను, అంతేకాక టూర్‌లో కూడా చూచాను. మమ్మా స్వ పురుషార్థము చాలా ఉండేది.

మమ్మా ఎక్కువగా లౌకికములోకి అనగా బాహ్యముఖతలోకి వెళ్ళలేదు. జ్ఞాన, యోగ, ధారణ, పురుషార్థము తప్ప ఇతర ఏ విషయాలను అనగా బాహ్యా విషయాలను మమ్మా నోటి నుండి విననేలేదు. ప్రారంభములో ఈ పద్ధతి ఉండేది - ఏ మాట మాట్లాడవలసి వచ్చినా, వారు ఆ రోజు మురళి పాయింటుతో ప్రారంభము చేయించవలసి వచ్చేది. సమాప్తము కూడా మురళి పాయింటుతోనే చేయవలసి వచ్చేది. బాబా గాని, మమ్మా గాని ఎవరికైనా ఉత్తరాలు వ్రాసినా, ఆ ఉత్తరము ప్రారంభములోనూ, అంత్యములోనూ ఆ రోజు జ్ఞాన మురళి పాయింట్లు లేక ధారణ పాయింట్లు లేక యోగ పాయింట్లు వ్రాసేవారు.

## మధుర మందహాసము చేసే దేవీ సుహాసిని

మమ్మా సెంటరులో కూడా బాబా మురళి వినిపించేందుకు ముందు 10 నిముషాలు ఆ మురళి సారాన్ని వినిపించేవారు. దీని వలన బాబా మురళిని అర్థము చేసుకోవడం అందరికీ సులభంగా ఉండేది. మమ్మా ఎప్పుడు క్లాసు చేసినా, ఒక గంట గాని, రెండు గంటలు గాని సూది క్రింద పడినా శబ్ధము వినిపించేటంత శాంతిగా, నిశ్శబ్ధంగా ఉండేది. క్లాసు మధ్యలో ఎవరైనా లేచి వెళ్ళడం అసంభవంగా ఉండేది, మమ్మాలో చాలా మధురత ఉండేది. వారి మాటలు కూడా చాలా మధురంగా, తక్కువ శబ్ధముతో ఉండేవి. ఎంత అవసరమో అంతే మాట్లాడేవారు. ఒక్క శబ్ధము కూడా ఎక్కువగా మాట్లాడేవారు కాదని నేను భావిస్తున్నాను. మమ్మాలోని మరొక విశేషత ఏమంటే వారు ఎప్పుడూ ఎవ్వరినీ ముందు సమయము ఇచ్చి కలుసుకునేవారు కాదు. పిల్లలు ఎప్పుడు కావాలన్నా ఏ పరిస్థితిలోనైనా వారిని కలుసుకోగలిగేవారు. మమ్మాగారి ఈ వ్యవహారము లేక పాత్ర అనండి అసాధారణమైనది. అన్యులందరూ నవ్వుతూ, బేలుతూ (సంతోషపరుస్తూ) రమణీకంగా, తమాషాగా ఉండేవారు. కాని మమ్మా ఎప్పుడూ అలా ఉండేవారు కాదు. మమ్మా కూడా నవ్వేవారు కాని ఎవ్వరికీ తెలిసేది కాదు. శబ్ధ రహితంగా నవ్వేవారు. అది మధురమైన మందహాసము,



జ్ఞానము - ధ్యానము, యోగము తప్ప ఇక దేనిలోనూ ఆసక్తి చూపేవారు కాదు. ఇతరులు బాబాతో పాటు ఆడుకోవడం, రాస్ చేయడం మొదలైనవన్నీ చేసేవారు. కాని మమ్మా అలా చేయలేదు. అలాగని ప్రతి విషయములోనూ వేరుగా ఉండేదని కాదు. మమ్మా అన్ని కార్యక్రమాలలో పిక్నిక్ వెళ్లడం, ఆట పాటలలో పాల్గొనడం, వాకింగ్ వెళ్లడం మొదలైన వాటిల్లో పాల్గొనేవారు కాని తమ పురుషార్థములో మగ్నమై ఉండేవారు. ఈ క్రియాకలాపాలన్నీ సాక్షిగా చూస్తూ ఉండేవారు. ఈ విధంగా మమ్మాగారి స్వ పురుషార్థము చాలా తీవ్రంగా ఉండేది. మమ్మా ఎప్పుడూ తన స్వంత పురుషార్థాన్ని ఢీలాగా వదిలి పెట్టలేదు.



ఢిల్లీ - ఓంప్రకాశ్ భాయిగారు, విష్ణు గారు, జగదీష్ గారు, బలదేవ్ గారు, సుందర్ లాల్‌గారు, సంత్‌రామ్ గారు, క్రింద (రాజ్ బహెన్ మరియు ఇతర సోదరి-సోదరులు)

## దివ్యలోకాలను చూపించి దివ్యంగా తయారుచేసే కమల నయని

మమ్మా చూచే విధానమే విచిత్రంగా ఉండేది. ఎలాగైతే బాబా మమ్మలను చూచేవారో వారిని చూస్తూనే మేము సర్వస్వము మర్చిపోయి ఒక అతీంద్రియ అనుభవంలోకి వెళ్ళిపోయేవారమో, అదే విధంగా మమ్మాగారి దృష్టి మమ్మాగారి ముఖము ఎంత ఆత్మీయంగా ఉండేవంటే ఆమె ఎదుట ఉండేవారు స్వయాన్ని ఈ ప్రపంచము నుండి వేరుగా

ఉన్నట్లు అనుభవము చేసేవారు. మమ్మా అయినా లేక బాబా అయినా ఇరువురిలో ఎవరో ఒకరు మాకు యోగము చేయిస్తూ ఉంటే మేము ఇక్కడ ఉండేవారమే కాదు. ఎక్కడో దూరంగా వెళ్ళిపోయేవారము. అనుభవాలలో మమ్ములను మేమే మర్చిపోయేవారము. ఆ సమయంలో మేము ప్రాక్టికల్‌గా పరంధామములో ఉన్నట్లు అనుభవమయ్యేది. 4-5 గంటల వరకు మేమందరము మరియు మమ్మా - బాబా ఒకే ఆసనములో కూర్చుని యోగములో ఉండేవారము. శరీరము కొంచెము కూడా కదిలేది కాదు.

## ఒడిలోకి వెళ్లడం అనగా దత్తు (ధర్మ) పుత్రులుగా అవ్వడం

అప్పట్లో జిజ్ఞాసువులకు జ్ఞానము నేరుగా వినిపించేవారు. అప్రత్యక్షంగా తిప్పి తిప్పి వినిపించేవారు కాదు. అదే విధంగా మమ్మా కూడా సదా పరమాత్మను గురించి, పరమాత్మ అవతరణను గురించి, ఆత్మను గురించి, యోగమును గురించి, కర్మల గుహ్యగతిని గురించి నేరుగా జ్ఞానము వినిపించేవారు. ముఖ్యమైన విషయం పవిత్రత. పవిత్రత పైననే ఎక్కువ ఫోర్స్ ఇచ్చేవారు. 1954వ సంవత్సరములో నేను మమ్మాను ఆబూ పర్వతము పై మొట్టమొదట కోటాహౌస్‌లో కలుసుకున్నాను. నాకు ఢిల్లీలోని కమలానగర్ సేవాకేంద్రములో 1953 సంవత్సరములో జ్ఞానము లభించింది. మమ్మా - బాబాలను కలుసుకునేందుకు ఎవరు వచ్చినా, మొదట వారిని ఒడిలోకి తీసుకునేవారు. ఇక్కడ ఒడిలోకి తీసుకోవడం అనగా రెండు అర్థాలున్నాయి - మొదటిది వారిని పుత్రునిగా ఒప్పుకొని దత్తత తీసుకోవడం, రెండవది ఆ పుత్రునికి తల్లి - తండ్రి అయ్యి వారికి ఒడిలో తమ శరణు(రక్షణ) ఇవ్వడం. ఈ విధంగా ఎప్పుడైతే నేను మమ్మా ఒడిలోకి వెళ్ళానో నాకు మమ్మాగారికి ఎముక మాంసముల శరీరము లేనే లేదు అన్నట్లు అనుభవమయ్యింది. వారి ఒడి నాకు దూది వలె అనుభవమయ్యింది. వారి ఒడిలోనికి వెళ్తూనే నేను ఏ లోకానికి వెళ్ళిపోయానో నాకే తెలియదు. నాకు అపరిమితమైన ఆనందము, శాంతి అనుభవమవ్వసాగాయి.

# మాతేశ్వరి పవిత్రతకు జనని

బ్రహ్మాకుమార్ భ్రాతా విద్యాసాగర్ గారు ఢిల్లీ నుండి వ్రాస్తున్నారు - నేను 1963వ సంవత్సరములో ఈశ్వరీయ జ్ఞానాన్ని ప్రాప్తి చేసుకున్నాను. అంతకుముందు ఈ ప్రపంచములో ప్రసిద్ధి చెందిన ఈశ్వరుని ప్రేమికుల, భక్తుల అనుభవాలను, వారు చెప్పిన జ్ఞానాన్ని చదివాను. అన్ని ధర్మ శాస్త్రాలను చదివాను. వేదాలు, ఉపనిషత్తులు మొదలైనవాటి సారాన్ని కూడా చదివి ఆచరణలోకి తెచ్చాను. చివరిలో ఆర్యసమాజము వారి పక్కా అనుయాయునిగా అయ్యాను. అయినా సత్యాన్ని వెతుకుతునే ఉండినాను.

## మొట్టమొదటిసారి ఢిల్లీ రాజోరీ గార్డెన్‌లో మాతేశ్వరీగారిని కలుసుకున్నాను

మాతేశ్వరీగారు 1963వ సంవత్సరములో ఆబు నుండి ఢిల్లీకి రాజోరీగార్డెన్ సేవాకేంద్రానికి వచ్చారు. మొదటిసారి మాతేశ్వరీగారితో కలుసుకున్నప్పుడు నాకు వారి నుండి దివ్యప్రకాశము పవిత్రత ఎంతగా అనుభవమయ్యాయంటే నేను దేహాన్ని పూర్తిగా మర్చిపోయాను. నా నలువైపులా ఆనందపుటలలు వ్యాపించాయి. ఆ రోజులలో నేను కేవలం ఈ సంస్థకు సంబంధములో మాత్రమే వచ్చాను. ఈశ్వరీయ జ్ఞాన లోతులను తెలుసుకోవడంలో నిమగ్నమై ఉండినాను. ఆ సమయములో ఈ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము పట్ల సమాజములో అనేక భ్రాంతులుండేవి. అవన్నీ నేను విన్నాను. ఈ ఈశ్వరీయ విశ్వ విద్యాలయములో ప్రవేశించేందుకు అనేకమంది నన్ను అడ్డుకున్నారు. అయినా నేను ఈ జ్ఞాన-యోగాల లోతును అనుభవము చేయడంలో మగ్నమై ఉన్నాను. నేను ఒక నిశ్చయానికి కూడా వచ్చాను - నేను ఈ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము గురించి అటువంటి విషయాలను ఏవైనా చూడనంతవరకు, విననంతవరకు ఎట్టి పరిస్థితిలోనూ వదిలిపెట్టను. మాతేశ్వరీగారితో మొదట కలుసుకున్న పిదప పవిత్రత వలన కలిగే ఆనందము, తేలికతనాలను అనుభవించాను. దాని వలన ఈశ్వరీయ విశ్వవిద్యాలయములోని శిక్షణలను పూర్తిగా అనుభవము చేయాలనే ఉత్సాహము ఇంకా వృద్ధి చెందింది. మాతేశ్వరీగారితో ఎన్ని సార్లు

కలుసుకున్నానో అన్నిసార్లు నా బలహీనతలను, అవగుణాలను మాతేశ్వరీగారు సమాప్తము చేసేశారు. తల్లి శ్వాసల ద్వారా కూడా పవిత్రత నడుస్తూ ఉండేది. నాకు దివ్యగుణాలను ధారణ చేయు వరదానము ప్రాప్తించింది.



ఎడమ నుండి కుడికి - మాతేశ్వరిగారితో ఆత్మ మోహిని దాదీ, గంగే దాదీ, శాంతమని దాదీ



## సర్వాలంకరణ సుశోభిత

మాతేశ్వరీగారి పవిత్ర మందహాసము, ఆత్మిక దృష్టి, మాటలు సదా వరదానిగా ఉండేవి. మమ్మాగారి కర్మలలో సంపూర్ణ ధారణ చూశాను. మాతేశ్వరీగారిని నేను సమీపంగా చూస్తూ అనుభవము చేశాను - ఒక్క శబ్దము కూడా అనగా ఒక్క మాట కూడా జ్ఞాన స్వరూపము, ప్రేమ స్వరూపము యోగయుక్తంగా లేనిది వెలువడేది కాదు. ఆ రోజులలో ప్రపంచములో ఈ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చాలా గొప్ప విరోధము ఉండేది కాని నేను మాతేశ్వరీగారి ఆనంద స్వరూప స్థితి ద్వారా రోజురోజుకు ఈ జ్ఞానానికి అతిసమీపంగా వస్తూ స్వయం ప్రతిజ్ఞ చేసుకున్నాను, దృఢ సంకల్పము చేశాను - "నేను కూడా తల్లి వలె తయారవ్వాలి."

లౌకికములో ఎవరో వ్రాసినట్లు -

"వృక్ష కబహుమ్ నహీ ఫల్ భఖె, నదీ న సంచై నీర్,
పరమార్థ్ కే కారనే, సాధున్ ధరా శరీర్"


" వృక్షము ఎప్పుడూ తన ఫలాలను తానే భుజించదు. నది తన నీటిని తానే తడుపుకోదు. అలాగే సాధువులు పరమార్థము కొరకు ఇతరుల కొరకు శరీరాలను ధరిస్తారు" అని అంటారు.

మాతేశ్వరీగారు సాక్షాత్తు సరస్వతి. వారు చైతన్య నదిగా ఉండేవారు. నేను ఒకసారి మాతేశ్వరిగారితో "అమ్మా, నేను కూడా ఈ ఈశ్వరీయ విద్యాలయ కర్తవ్యములో నా జీవితమంతా సమర్పణ చేయాలని అనుకుంటున్నాను" అని అన్నాను. అందుకు తల్లి అన్నారు - మీ తల్లిదండ్రులతో నివసిస్తూ ఈ ప్రపంచములో భీష్మపితామహుని ఉదాహరణను ప్రత్యక్షము చేయండి. దాని వలన విశ్వములోని యువకులు మీ నుండి ప్రేరణను తీసుకుంటారు." మాతేశ్వరీగారి శిక్షణలను గ్రహించి ఇప్పుడు నేను 40 సంవత్సరాల నుండి ఈ ఈశ్వరీయ కార్యములో నిమగ్నమై ఉన్నాను.

సరస్వతీ మాత జీవితము నుండి ఇలాంటి దివ్య దిగ్దర్శనము గోచరించేది - ఏ అపరిచిత వ్యక్తికైనా వీరు నిజంగా దివ్యశక్తి సంపన్నులనే ఆలోచన తప్పకుండా కలిగించేది. ఈ మాటలు నేను నా మిత్రుల నుండి పరివారములోని వ్యక్తుల నోటి నుండి వినడం జరిగింది. ఈ రోజు నేను ఇలా వ్రాస్తున్నాను - ఈ ప్రపంచములో మాతేశ్వరీ వంటి స్త్రీ బహుశా భాగ్యవిధాత కేవలం మాతేశ్వరీగారికే ఈ వరదానమిచ్చి ఈ భూమి పైకి పంపించారు. నేను చూచాను, చూడటమే కాక తల్లి నుండి పొందుకున్నాను. మాతేశ్వరీగారు సత్యంగా సరస్వతీ దేవియే. జగదంబ కూడా వారే. సరస్వతి అనగా జ్ఞాన స్వరూపము. ఏ కర్మ చేసినా, ఏ వ్యవహారము చేసినా, జ్ఞాన స్వరూప స్థితిలో స్థితమై చేసేవారు

మాతేశ్వరీగారి కర్మలు, దృష్టి, భాష, భావనలు ఎంత ఆకర్షణ శక్తియుక్త సంపన్నంగా ఉండేవంటే వారు ఈ భూమి పై సాక్షాత్తు చైతన్యదేవి అని ఋజువయ్యింది. నేను ఇక ఏమని వ్రాయాలి? నా కలమేమో వ్రాయాలని అనుకుంటోంది. కాని నేను ఏ శబ్ధాలలో వ్రాస్తే నా వెలిగేజ్యోతి అయిన తల్లిని దర్శింపజేస్తాను? కావున నేను ఇంతమాత్రమే వాస్తున్నాను. వారు ఒక జ్యోతి ఈ పృథ్వి పై చైతన్య జ్ఞానగంగ, ప్రాణ దానమిచ్చేవారుగా ఉండేవారు. సరస్వతి భవాని, “ఓ సరస్వతి తల్లీ మీకు నా కోటి - కోటి వందనాలు.”

# సదా చలించక (అచల్), స్థిరంగా ఉండే దుర్గా మాత



చండీగడ్ నుండి బ్రహ్మకుమారి అచల్ బెహన్ గారు తమ అనుభవాన్ని వినిపిస్తూ ఇలా అంటున్నారు - మమ్మా శిక్షణలు వారి ప్రేరణాదాయక జీవితము మమ్ములను ఆధ్యాత్మిక గమ్యము వైపు ముందుకు వెళ్లేందుకు చాలా సహాయపడింది. మొట్ట మొదట ప్రియమైన తల్లిని ఆబూలోని కోటా హౌస్‌లో నేను కలుసుకున్నాను. ఎంత దివ్యత! ఎంత ఆకర్షణ! మమ్మాలో ఉండినది!

మమ్మాతో కలుస్తూనే నాకు ఇలా అనుభవమయ్యింది - తల్లి సరస్వతి సర్వశక్తులు, సర్వగుణాలను ఇముడ్చుకొని తన సంపన్న సాక్షాత్కారము చేయిస్తూ ఉన్నారు. నాకు కొన్ని రోజులు మమ్మా వద్ద గడిపే సువర్ణ అవకాశము లభించింది. వారి సంస్కారాలలో ఎంతో మధురత, ఎంతో ప్రేమ విరజిమ్ముతూ ఉండడం అనుభవం చేశాను! నేను చాలా తేలికై మాట్లాడేదానిని. ప్రియమైన మమ్మా - మనము అశరీరీ అవస్థను తయారు చేసుకోవడంలో ఎంత గమనమిస్తామో అంత గుణరూపి ముత్యాలను ధారణ చేసుకొని ఇతరుల ముందు ఒక ఆదర్శముగా అవుతామని నాకు అర్థం చేయించారు.

నేను ప్రాక్టికల్‌గా మమ్మాలో సహనము, ప్రేమ, సహానుభూతుల స్వరూపాన్ని చూశాను. ఒకసారి మమ్మా అమృత్‌సర్‌కు వచ్చినప్పుడు ఒక

పార్టీవారు చాలా గలాటా చేశారు. వారు మమ్మాను కలుసుకోవాలని గలాటా చేశారు. ఆ సమయంలో పాఠశాలలోని పిల్లలు చాలా ఎక్కువగా అల్లరి చేస్తూ ఉండినారు. నేను పై అంతస్థులో మమ్మా వద్ద నిల్చొని ఈ దృశ్యము చూస్తూ ఉన్నాను. వాత్సల్యమూర్తి అయిన మమ్మా ఈ దృశ్యము చూసి క్రింద నిలబడి ఉన్న సోదరీలకు ఒక సందేశము పంపించారు - వారిలో ముఖ్యమైన వారిని నాతో కలవనివ్వండి. వారు ఏవైనా వ్యతిరేకమైన పదాలు ఉపయోగిస్తారేమోనని మాకు లోలోపల భయంగా ఉండినది. కాని మాతేశ్వరీగారి శక్తిశాలీ ప్రకంపనలు పని చేసి ఆ ఆత్మలు మమ్మా ముందుకు వచ్చి చాలా సమయము వరకు ఏమీ మాట్లాడలేక పోయారు. నెమ్మది నెమ్మదిగా చాలా ప్రేమగా ఒకటి-రెండు ప్రశ్నలు అడిగారు. మమ్మాగారు వాస్తవానికి ఆంతరికములోని సంకల్పాలను హరించే తల్లిగా ఉండేవారు. క్రోధులుగా ఉండేవారిని శీతలంగా చేసే శీతలాదేవిగా ఉండేవారు.

ప్రియమైన మమ్మా చాలా నిరహంకారి రూపాన్ని సాక్షాత్కారము చేయించేవారు! నేను లౌకిక సేవ చేసే చోటుకు ఒకసారి మమ్మాను ఆహ్వానించాను. వేలాది మంది జనులు మమ్మాను దర్శించారు. నేను కారులో మమ్మాను అమృత్‌సర్ నుండి తీసుకెళ్ళాను. దారిలో కారు చెడిపోయింది. అది పల్లె కనుక మరో కారు గాని, మరో సాధనము గాని లభించలేదు. ఇటువంటి శ్రేష్ఠమైన శక్తిని అమృత్‌సర్‌కు ఎలా తీసుకెళ్ళాలో అని ఆలోచనలో పడ్డాను! అంతలో ఒక కొత్త బస్సు గల సోదరుడు వచ్చి మమ్మాను తన బస్సులో వదలి వస్తానని అన్నాడు. మమ్మాను తప్ప ఇతరులెవ్వరినీ బస్సులో కూర్చోబెట్టలేదు. ఆ సంకల్పాన్ని కామధేనువైన మమ్మా తెలుసుకున్నారు. అటువంటి సమయములో డ్రామా పాత్రను పక్కాగా ఉంచుకోవాలని మధురమైన శిక్షణనిచ్చారు. బాబా మనలను అన్ని రకాలుగా అనుభవీలుగా తయారుచేస్తున్నారు. మీరు ఏమీ ఆలోచించకండి అని తెలిపారు. ప్రియమైన మమ్మాగారి అచల, అడోల స్థితి ఎంతో ప్రభావశాలిగా ఉండేది!



మమ్మా ఒకసారి బటాలాకు వచ్చారు. అచ్చట కన్యల సమూహము మమ్మాతో కలుస్తూ ఉండినారు. అప్పుడు చాలా మధురమైన స్వరముతో మమ్మా కన్యలకు చాలా అర్థం చేయిస్తూ ఉండినారు - శివశక్తులు శక్తి స్వరూపమై ఉండాలి. ఎవరి అవగుణాలను మనసులో ఉంచుకోరాదు. జరిగిపోయిన విషయాలను చింతన చేయరాదు. సేవ కొరకు వెళ్లేందుకు మీరు ఎప్పుడూ 'కాదు' అని చెప్పరాదు. సేవ చేయడం ద్వారానే బాబా ప్రేమను తీసుకోగలరు. ప్రియమైన మమ్మా శిక్షణల ప్రభావము కన్యల పై ఎంతగా పడిందంటే, ఆ కన్యలందరూ సేవ చేసేందుకు వేరు వేరు సేవాకేంద్రాలకు వెళ్ళిపోయారు.

మన ప్రియమైన మమ్మా ఇటువంటి శక్తి స్వరూపము ప్రేరణనిచ్చే మూలము. గుణాల గని, ప్రియమైన బాబాగారి అడుగులో అడుగు వేసి నడుచుకునేవారు.

## పితాశ్రీ బ్రహ్మాబాబా ప్రతి కర్మను అనుసరించి బ్రాహ్మీ పదవిని ప్రాప్తి చేసుకున్న బ్రహ్మా సుతే శ్రీ సరస్వతి

హరిద్వారములోని బ్రహ్మకుమారి ప్రేమలతా బెహన్‌గారు తమ అనుభవాన్ని ఇలా వ్రాస్తున్నారు - గతించిన స్మృతులను ప్రేమ అని అంటారు. ఆ ప్రేమను మనసులో ఉంచుకోవడం శోభిస్తుంది. కాని అనేక మహాత్ముల ఆసక్తి లేక పట్టుదల ఈ రోజు నా మౌనాన్ని పారదోలి కొంత వ్రాసేందుకు నిర్బంధించింది. మాతేశ్వరీ గారితో నా సంబంధము సుమారు ఒక దశకము వరకు (10 సంవత్సరాలు) ఉండినది. కాని ఆ కొద్ది సమయమే చాలా జన్మల ప్రగాఢ సంబంధము అనిపిస్తుంది. వారు వారి వాణి ద్వారా సేవ చేయడమే కాక ఒక అలౌకిక తల్లి వలె నా పాలన కూడా చేశారు. వారి ఆ శిక్షణలు ఈ రోజుకు కూడా నా జతలోనే ఉన్నాయి.



జ్ఞాన మననము చేసి హర్షితచిత్తులుగా ఉన్న తల్లి సరస్వతి

### ఒక పరిపూర్ణ వ్యక్తిత్వము

సర్వ ప్రథమంగా మాతేశ్వరీగారితో కలుసుకునే సౌభాగ్యము నాకు అమృత్‌సర్‌లో చాలా చిన్న వయస్సులోనే ప్రాప్తించింది. దివ్యత, సౌమ్యత, సరళత, సహృదయతతో పరిపూర్ణమైన వారి వ్యక్తిత్వాన్ని చూచి జీవితమంటే ఇలా ఉండాలి అని నా మనస్సు పై ఒక గాఢమైన ప్రభావము ఏర్పడింది.



మమ్మా మాట్లాడే సమయములో ఒక ధారాప్రవాహము ప్రవహిస్తున్నట్లు మాట్లాడేవారు. ఆ మాటలు విన్నవారి చెవులలో మారుమ్రోగుట వలన వారి జీవితములో అలౌకికత సంచరించేది. మమ్మాగారు, బాబా ఇచ్చిన జ్ఞానజ్యోతి ద్వారా అందరినీ వెలిగించారు. వారి వాణిలో సాగరమంత లోతు, ఆకాశమంత ఎత్తు మరియు గంగా ప్రవాహముండేది. దానిని విని మనస్సులో మాటిమాటికి నేను కూడా మమ్మా సమానంగా నా జీవితాన్ని తయారు చేసుకోవాలి అనే సంకల్పము కలిగేది.



(ఎడమ నుండి కుడికి) హర్‌దేవి బహన్, విసనీ బహన్, మమ్మా, శీతల్‌మణి బహన్, ప్రేమ్ బహన్ డెహరాడూన్ (క్రింద కూర్చుని ఉన్నవారు) కమల సుందరి దాదీ, జానకీ దాదీ, బృజశాంత దాదీ

### సాధారణ మాటల ద్వారా కూడా శ్రేష్ఠమైన శిక్షణ

మమ్మాగారి ఒక విశేషత ఏమంటే చిన్నవారిని ,పెద్దవారిని అందరికీ చాలా ప్రేమతో పాలననిచ్చి ముందుకు నడిపించేవారు. ఎలాగైతే ఒక శిల్పి మూర్తిని రచించి ఎలా అలంకరిస్తారో, అంత శ్రద్ధ చూపించేవారు. మమ్మా యజ్ఞ వత్సల చిన్న-చిన్న విషయాలను, జిజ్ఞాసువులు చేసిన తప్పులను

ఎంత ప్రేమగా కూర్చొని అర్థం చేయించేవారంటే వినేవారు సహజంగా ఆ మాటలను తమ అంత:కరణములో అలాగే ముద్రించుకునేవారు. ఒకసారి మమ్మాగారు యజ్ఞములోని ఒక పాత ఫోటో ఆల్బమ్‌ను సరి చేసి రిపేరు చేసే పని అప్పగించారు. దాని నుండి యజ్ఞాన్ని వదిలి పెట్టిపోయిన వారి ఫోటోలను తొలగించి వర్తమాన పిల్లల ఆల్బమ్‌ను తయారు చేయవలసి ఉంది. మమ్మా నాకు చెప్తూ ఉంటే నేను ఆ ఫోటోలను వెతికి వేరు చేస్తూ ఉన్నప్పుడు నా మనస్సులో ఒక సంకల్పము కలిగింది. వీరు ఇటువంటి ప్రియమైన మమ్మా-బాబాలను, పరివారాన్ని వదిలిపెట్టి ఎందుకు వెళ్ళిపోయారు! నేను మమ్మాను - మమ్మా, వీరు బాబాను వదిలిపెట్టి పాత ప్రపంచములోకి వెళ్ళిపోయేందుకు కారణమేమి? అని అడిగాను. అప్పుడు మమ్మా చిరునవ్వుతో చాలా సరళమైన భాషలో నాలో కలిగిన ఈ జిజ్ఞాసను శాంతపరచి ఇలా చెప్పారు - పురుషార్థములో నిర్లక్ష్యముగా ఉండువారిని మాయ ఏదో ఒక రూపములో ఆకర్షించి పాత ప్రపంచములోకి తీసుకెళ్తుంది.

## పితా శ్రీ గారి ప్రతి మాటను హృదయపూర్వకంగా స్వీకరించారు

ఒకసారి లచ్చు బెహన్ ఒక కాగితము పై రెండు చిన్న చిన్న పిచుక గుడ్లను బాబా కుటీరములో వెనుక ఆ గుడ్లను పెట్టిందని, బాబా గదిలోకి వచ్చి అందరికీ చూపించారు. బాబా ఆ గుడ్లను చూచి చాలా రమణీకంగా మమ్మాను పిలవండి అని అన్నారు. అప్పటికి నేను చాలా చిన్న పిల్లను. బాబా మమ్మాను ఎందుకు పిలుస్తున్నారో అందులో రహస్యమేమిటో అర్థము కాలేదు. నేను ఉత్సుకతతో బాబా వద్ద నిల్చుండిపోయాను. మమ్మా బాబా గదిలోకి వస్తూనే బాబా ఇలా అన్నారు - మమ్మా, నోరు తెరువు ఈ పిచుక గుడ్లను బాబా నీకు తినిపిస్తారు. నా ఆశ్చర్యానికి అంత్యము లేదు. బాబా ఈ మాట అంటూనే మమ్మా ఒక చిన్న పిల్ల వలె బాబా ముందు నోరు తెరచుకొని నిలబడ్డారు. బాబా చాలా ప్రేమ నిండిన దృష్టినిస్తూ చిరునవ్వుతో మమ్మా నీవు "జీ బాబా(సరే బాబా)" అను పరీక్షలో పాసైపోయావు. ఆ సమయములో నా బాల్య మనసులో ఆందోళన కలిగింది. కాని ఇది కేవలం చిట్-చాట్‌లో



(ఉబుసు పోవుటకు జరుగు సంభాషణలో) బాబా కళ్యాణకారి అని, మమ్మా 'జీ బాబా' అను విషయాన్ని ధారణ చేయడంలో ఎంత దృఢంగా ఉండేదో మాకు శిక్షణనిచ్చారు. దృఢ సంకల్పముతో మమ్మా ఎలా గెలుపొందారో ప్రత్యక్ష అనుభవము అయ్యింది!

## మర్యాదలను నేర్పించే మధురమైన తల్లి

బాబా సాధారణంగా చెప్పే వాక్యాలను కూడా మమ్మా మహావాక్యాల రూపములో స్వీకరించేవారు. ఒకసారి యజ్ఞములో స్థలము చాలనందున పెద్ద మంచము క్రింద చిన్న మంచము వచ్చునట్లు సెట్ చేయమని బాబా చెప్పారు. చిన్న మంచము పగటిపూటి పెద్ద మంచము క్రింద ఉంటుంది. రాత్రి పూట బయటకు తీసుకొని దాని పై పడుకోవచ్చు అని అలా ఏర్పాటు చేయమన్నారు. బాబా పాత భవనములోని హాలు(ఇప్పుడు భోలీ(బూరి) దాదీ మొదలైనవారు నిదురించు హాలు)లో స్వయం మంచము వేసి చూస్తూ ఉండినారు. బాబా - మమ్మాతో పాటు నేను కూడా అచ్చటనే నిలబడి ఉన్నాను. బాబా ఒక అన్నయ్యతో ఈ మంచము క్రింద మరొక చిన్న మంచము వేసి చూడండి అని చెప్పారు. నాకు వెంటనే ఈ మంచము ఆ మంచము క్రింద పట్టదనిపించి వెంటనే ఆ విషయం బాబాకు చెప్పాను. అయినా ఆ అన్నయ్య బాబా ఆజ్ఞానుసారము ఆ మంచాన్ని వేసేందుకు ప్రయత్నించాడు. కాని అది పట్టలేదు. నాకైతే ఈ సంఘటన చాలా సాధారణంగా అనిపించింది. నేను తప్పు చేశానని ఏ మాత్రమూ నాకు అనిపించలేదు. కాని సాయంకాలము నేను మమ్మా వద్దకు వెళ్ళినప్పుడు మమ్మా మందహాసము చేస్తూ ప్రేమ్ బచ్చీ! నీవు చాలా తెలివైనదానివి. నీ బుద్ధి చాలా చురుకైనది. త్వరగా సరియైన నిర్ణయము తీసుకుంటావు అని అన్నారు. ఈ రోజు మమ్మా ఎందుకు ఇలా చెప్తున్నారో నాకు అర్థము కాలేదు. ఇంతకు ముందు మమ్మా ఎప్పుడూ అలా అనలేదు. నేను మమ్మాను - మమ్మా ఈ రోజు మీరు నాకెందుకు ఇలా చెప్తున్నారు. నేను ఏమైనా తప్పు చేశానా? అని అడిగాను. అప్పుడు మమ్మా మంచము అమర్చే విషయము పై చాలా ప్రేమగా అర్థం చేయించి - బాబా చెప్పినట్లు మొదట

ఇతరుల మాటకు గౌరవమునివ్వాలి అన్నారు. తర్వాత వారిలో ఏదైనా లోపముంటే వారికి తెలిపినా, అది వారికి చెడ్డగా అనిపించదు. వారికి బాధ కలగదు. అప్పుడు నా వయస్సు సుమారు 17 సంవత్సరాలు. అప్పుడు కూడా మమ్మా చాలా ప్రేమతో - నీ బుద్ధి చాలా చురుకైనది, సరియైన నిర్ణయము తీసుకుంటావు, కాని బాబా నిలబడి ఈ మంచాన్ని ఇలా వేయి అని చెప్పినప్పుడు మన పని ఏమిటంటే వారు చెప్పినట్లు చేయడం మాత్రమే. అలా పట్టకుంటే బాబా స్వయంగా తీసేయమని చెప్తారు, అప్పుడు తీసేస్తాము. అయినా నాకు అర్థము కాలేదు. అందువలన మమ్మా నా తప్పు ఏమిటో స్పష్టంగా చెప్పండి అని అడిగాను. అప్పుడు మమ్మా అన్నారు - చూడు బచ్చీ! ఈ విధంగా బుద్ధిని ఉపయోగిస్తూ మాట్లాడేందుకు అలవాటు పడితే పోను పోను నీకు బుద్ధి పై అభిమానము వచ్చి, నా బుద్ధి ఎంత మంచి నిర్ణయం తీసుకుంటుందో చూడు! అనే అభిమానము రావచ్చు! అప్పుడు ఈ బుద్ధి దివ్యబుద్ధిగా తయారవ్వజాలదు. బాబాగారి ప్రతి ఆజ్ఞను పాలన చేయడం ద్వారానే బుద్ధి దివ్యంగా తయారౌతుంది. ఆ క్షణము నుండి నేను కూడా ఈ సంకల్పము చేశాను. నా బుద్ధిని ఉపయోగించకుండా బాబా చెప్పిన దానిని చెప్పినట్లు జీవితములో ధారణ చేస్తాను. ఈ ఘటన నా ఆలోచనా విధానాన్నే మార్చేసింది. నేను చాలాసార్లు అనుభవము చేశాను - మమ్మా ద్వారా ప్రాప్తించిన ఈ సంస్కారము కారణంగా ఏ పరిస్థితులోనైనా పురుషార్థ మార్గములో నేను సరళంగా, సంతుష్టముగా ఉన్నాను.

### జగన్మాత జగదీశ్వరీ

1960వ సంవత్సరములో నేను అంబాలాలో ఉన్నప్పుడు మాతేశ్వరిగారు అచ్చటకు రావడం జరిగింది. అక్కడ నాకు మాతేశ్వరీగారి సాంగత్యములో రాత్రింబవళ్ళు ఉండే మంచి అవకాశము లభించింది. ఆ సమయములో ఒక్కొక్క సోదరీ-సోదరుని పై వ్యక్తిగతంగా గమనముంచి మమ్మా వారి ప్రతి సమస్యను ఎలా సమాధానపరిచేవారో దాని వలన వారందరూ ఎలా గద్గదమైపోయే వారంటే చిన్న పిల్లలు తమ తల్లిని పొంది



వారి దు:ఖాలన్నీ మర్చిపోయినట్లు పెద్ద పెద్ద సోదరీ-సోదరులు కూడా వారి వారి పదవి, వయసు, స్థానము అన్నీ మర్చిపోయి మమ్మా ముందు చిన్న పిల్లలుగా అయిపోయేవారు. 1963వ సంవత్సరములో ఒక వారము రోజులు మమ్మా డెహరాడూన్‌కు వచ్చారు. అప్పటికి ఆ సేవాకేంద్రము తెరచి కేవలం ఒక సంవత్సరము మాత్రమే అయ్యింది. బాబాగారి కొత్త కొత్త పిల్లలను పూర్తిగా పాలన చేసి మమ్మా వారిని జ్ఞానముతో మధురమైన వాణితో ఎలా తృప్తి పరిచారంటే, వారు వారి జీవితమంతా మమ్మాగారు చేసిన ఆ అథక్(అలసట లేకుండా) సేవను మర్చిపోలేకపోయారు. మమ్మాగారి వాణిలో ఈ విశేషత ఉండేది - వారు బాబాగారి ప్రతి శబ్దాన్ని ఎంతో సులభంగా స్పష్టపరచి చిన్న చిన్న పిల్లలకు, కొత్తగా వచ్చిన బాబా పిల్లలకు సహితము జ్ఞాన లోతులు అనుభవమగునట్లు అర్థము చేయించేవారు. మమ్మా ఒక వారము నిరంతరము సేవ చేసి ఈ భూమిని ఫలీభూతము చేశారు. మమ్మాగారి ఈ స్వరూపాన్ని చూచి సరస్వతి దేవి వాణికే ఎందుకు మహిమ జరుగుతుందో అనుభవమయ్యింది. తల్లి అయిన సరస్వతి, తండ్రి అయిన బ్రహ్మాబాబా గారి ప్రతి కర్మను తన జీవితములో అక్షరాక్షరము పాటించి జ్ఞాన చైతన్యమూర్తిగా అయినారు. దీనిని నేను సాక్షాత్తుగా అనుభవము చేశాను.

## నభూతో, నా భవిష్యతి

బొంబాయి నుండి బ్రహ్మాకుమారీ ఉషా బెహన్‌గారు తమ అనుభవాన్ని వినిపిస్తూ ఇలా అంటున్నారు - అహో! ఎంత అద్భుతమైనది మమ్మా! మమ్మా ప్రేమ ఎంత సాటిలేనిది! ఎంతటి శక్తి స్వరూపము! గమనించినట్లైతే బాబా-మమ్మా వంటి సాటిలేని మహోన్నతులు ప్రపంచమంతటిలో ఇంతవరకు ఎవ్వరూ జన్మించలేదు. ఇక మీదట జన్మించరు. న భూతో, న భవిష్యతి. మమ్మా ఇటువంటి అద్భుతమైన వ్యక్తిత్వము తేజస్విని జీవితము కలిగి ఉండినారు. నేను మొదటిసారి మధువనానికి వచ్చినప్పుడు నాకు ఈశ్వరీయ జ్ఞానము లేదు. బాబా నాకు నిమంత్రణ ఇచ్చి పిలిపించారు. నేను పూర్తిగా క్రొత్తదానిని. ఇది 1961వ సంవత్సరములో జరిగిన విషయము. బొంబాయి నుండి సుమారు 8 -10 మంది కూర్చొని ఉన్నారు. మేము బాబాతో కలుస్తూ ఉండినాము. ఆ సమయములో హాపుడ్‌లో కొంత గలాటా నడుస్తూ ఉంది. బాబా అచ్చట నుండి వచ్చిన సోదరీ-సోదరుల నుండి సమాచారము వింటూ ఉండినారు. బాబా వారితో - పిల్లలూ! ఏమీ పర్వాలేదు, రేపు మమ్మా అచ్చటకు వస్తున్నారు అన్ని పనులు చక్కబడ్తారు, చింత చేయకండి అని అన్నారు. బాబా, ఇంత నిశ్చింతగా, దృఢంగా, విశ్వాసముతో మమ్మాను గురించి చెప్తూ ఉంటే ఈ మమ్మా ఎలా ఉంటారు? బాబా వారిని ఇంతగా మహిమ చేస్తుంటే వారు తప్పకుండా చాలా విచిత్రమైన వ్యక్తిత్వము కలిగి ఉంటారని నేను ఆలోచిస్తూ ఉండినాను. ఎందుకంటే నేను అంతవరకు మమ్మాను చూడనేలేదు. మరుసటి రోజు మమ్మా వచ్చినప్పుడు బాబా ఆమెకు ఘనమైన స్వాగతము ఏర్పాటు చేశారు.

### నేను ఒక చిన్న బిడ్డగా అయిపోయాను

ఆ రోజు మమ్మా క్యాంప్ నుండి వచ్చారు. సాయంకాలము వచ్చిన పిల్లలందరితో మమ్మా కలుస్తూ ఉండినారు. పిల్లలందరూ మమ్మా ఒడిలోకి పోతూ ఉండినారు. అది మమ్మాతో నా మొదటి కలయిక. నేను కూడా ఒడిలో ఒదిగిపోయాను. మమ్మా ఒడిలోకి పోయినప్పుడు నేనొక చిన్న బిడ్డనని నాకు అనుభవమవ్వసాగింది. అంతేకాక తల్లి మమతల పాలనలో



ఊగుచున్నట్లు అనుభవమయింది. నేను చాలా తేలికదనాన్ని, ఆనందాన్ని అనుభవము చేస్తూ ఉండిపోయాను. వారి ఒడి ఎంతో బాగుండినది.



బాధ్యతలున్నను సదా నిశ్చింతగా ఉన్న మమ్మా

## నన్ను నేను మర్చిపోయాను

మమ్మాతో కలిసేందుకు ముందు బాబాతో కలిసినప్పుడు బాబా నాతో అన్నారు - బచ్చీ! నీకు మమ్మా తెలుసా? అందుకు నేను, బాబా నేను మమ్మాను ఇంతవరకు చూడనే లేదు కావున ఎలా గుర్తు పట్టాలి? అని అన్నాను. బాబా అన్నారు - చూడు బిడ్డా! రేపు మమ్మా వస్తున్నారు, వారిని నీవు బాగా గమనించు. వారు ఎలా కూర్చుంటారో, ఎలా లేస్తారో, ఎలా నడుస్తారో, ఎలా చూస్తారో మొదలైనవన్నీ పూర్తిగా గమనించు. ఇది ఏమైనా చెప్పే విషయమా? అని నేను ఆలోచించాను. మనిషి ఎలా కూర్చుంటారో, లేస్తారో, నడుస్తారో, అలాగే ఉంటుందని మనస్సులో అనుకొని, అయినా సరే బాబా అని అన్నాను.

ఒక రోజు నేను నాశ్తా(టిఫిన్) చేస్తూ ఉన్నాను, మమ్మా ఎదురుగా వస్తూ ఉన్నారు. నేను వారిని చూస్తూ అలాగే ఉండిపోయాను. నన్ను నేను మర్చిపోయాను. మమ్మా నా సమీపానికి వచ్చు కొలది ఏదో శీతలమైన గాలి ప్రవాహము నా వైపుకు వస్తూ ఉన్నట్లు అనుభవమౌతూ ఉంది. మమ్మా నా సమీపము నుండి వంటగది వైపు వెళ్ళిపోయారు. అచ్చట ఒక సోదరికి ఏదో సేవ చేసేందుకు సూచనలిస్తూ ఉన్నారు. సూచనలిచ్చే విధానము చాలా నిదానంగా చెవిలో చెప్పినట్లు ఉంది. అచ్చట 5-10 నిముషాలు ఉండి చెప్పవలసిందంతా చెప్పి నెమ్మదిగా వెళ్ళిపోతూ ఉండినారు. వారు నడిచే విధానము, ఇతరులతో మాట్లాడే విధానము చూచి నేర్చుకునేందుకు, అనుసరించేందుకు తగినట్లు ఉండినది. మమ్మా అచ్చట నుండి నెమ్మదిగా వెళ్తూ ఉండినారు. అయస్కాంతము ఇనుమును ఆకర్షించినట్లు అనుకోకుండా నేను కూడా వారి వెంట లాగబడుతూ వెళ్లాను. తర్వాత ఒక రోజు మమ్మా తన గదిలో ఎవరితోనో మాట్లాడుతూ ఉన్నారు. నేను వారి గది వాకిలి వద్దకు వెళ్ళి కొద్దిగా పర్దా తొలగించి చూశాను. వారు కూర్చునే విధానము చాలా ఆకర్షణీయంగా అనిపించింది. మమ్మా నడిచే విధానము, మాట్లాడే విధానము, కూర్చునే విధానము అన్నీ సాటిలేనివిగా



ఉండినవి. అప్పుడు నాకు మమ్మా ప్రతి కర్మను నిరీక్షించమని బాబా నాకెందుకు చెప్పారో అర్థమయ్యింది.

## మమ్మా మా ఇంటిలోనే ఉండినారు

మమ్మాకు చాలా సమీపముగా ఉండి వారిని గమనించే సౌభాగ్యము నాకు కలిగింది. మమ్మా తమ చివరి కాలములో సుమారు 22 నెలలు బొంబాయిలో ఉన్నారు. అందులో 18 మాసాలు మా ఇంటిలోనే ఉన్నారు. మేము మమ్మాతో పాటు మా లౌకిక తల్లి జతలో ఉన్నట్లు ఉండేవారము.

మమ్మా సాధారణంగా, అలౌకికంగా ఉండేవారు. శబ్దాలలో దానిని వర్ణించలేము. వారు అనంతమైన వారు, వర్ణనాతీతులు. ఇటువంటి మమ్మా లాలన పాలనలో పాలింపబడిన మేము చాలా భాగ్యశాలీ పిల్లలము.

మజఫ్ఫర్‌పూర్ నుండి బ్రహ్మాకుమారీ రాణి అక్కయ్యగారు తన అనుభవాన్ని ఈ విధంగా వినిపిస్తున్నారు. ఇప్పటికి 50 సంవత్సరముల ముందు నేను ఆబూలోని కోటాహౌస్‌లో మమ్మాను కలిశాను. అప్పటికి నా వయసు కేవలము 6 సంవత్సరాలు మాత్రమే. నేను బాబా - మమ్మా ముందు కూర్చున్నప్పుడు మాతేశ్వరీగారి ఆకర్షణీయమైన ఆ వ్యక్తిత్వము, తల్లిలోని ఆ ఆత్మిక ఆకర్షణ, వారి దివ్య స్వరూపము ఎలా ఉందంటే మమ్మా అవ్యక్త లోకము నుండి సంపూర్ణతను తీసుకొని వచ్చినట్లు అనిపించింది. నేను కూర్చున్న స్థానము నుండి లేచి మమ్మా ఒడిలో ఒదిగిపోయాను. నా తల పై మమ్మా తన వరదానీ హస్తాన్ని ఉంచుతూ నా వీపు నిమిరారు. ఆ సమయములో నాలో అమితమైన శక్తి నిండిపోయింది. నేను ఈ లోకములోనే లేనట్లు, మరో లోకములో ఉన్నట్లు అక్కడ నుండి అదృశ్యమైనట్లు అనుభవమయింది.

మమ్మాగారు ఢిల్లీకి ఎప్పుడు వచ్చినా సేవాకేంద్రములో వారి స్వాగతము కొరకు మాకు నృత్యము నేర్పించడం జరిగేది. చిన్నతనము నుండే నాలో నృత్యము చేసే సంస్కారముండేది. ఒక రోజు నా నృత్యము చూసి స్కూలులో మా టీచరు నీవు స్కూలులో కూడా నృత్యము చేయమని చెప్పారు. అప్పుడు నా వయసు సుమారు 8 సంవత్సరాలు. మమ్మా ఢిల్లీకి వచ్చినప్పుడు - మమ్మా స్కూలులో నృత్యము చేసేందుకు మా టీచరు నిమంత్రణము ఇచ్చారు. నన్ను వెళ్ళమంటారా? అని మమ్మాను అడిగాను. అందుకు మమ్మాగారు, "బచ్చీ! నీవు సాధారణ బాలిక కాదు. నీది విశేషమైన పాత్ర. నిమంత్రణ ఇచ్చి ఉంటే ఈ సారికి స్వీకరించు. తర్వాత మళ్ళీ ఆ ప్రాపంచిక వాతావరణములోకి నీవు ఎప్పుడూ వెళ్ళరాదు" అని అన్నారు. ఎటువంటి చెడు సాంగత్యములోకి కూడా పోకుండా మాతేశ్వరిగారు నాకు ఈ ప్రేరణ ఇచ్చారు.

### సదా తండ్రి సాంగత్యములోనే ఉండాలి

ఒకసారి మా బంధువులు - నీవు సదా ఒకే విధమైన తెల్లని వస్త్రాలే





ఢిల్లీ - మాతేశ్వరిగారితో పాటు బాల్యములో రాణి అక్కయ్య, ఇతరులు మిఠ్ఠూ దాదీ, రుక్మిణీ దాదీ, విమలా బహన్(ఆగ్రా)

కట్టుకుంటున్నావు, ఇదేం బాగాలేదు అని అన్నారు. లౌకికములోకి వెళ్ళినప్పుడు నీవు లౌకికము వారి వలె ఉండాలి, సత్సంగములోకి వెళ్ళినప్పుడు సత్సంగములోని వారి వలె ఉండాలి అని నాకు చెప్పారు. నేను ఈ విషయమంతా మాతేశ్వరీగారితో చెప్పినప్పుడు వారు - "బచ్చీ! నీవు సత్యమైన తండ్రికి సత్యమైన బిడ్డవు. పిల్లలైన మీ రూపము మారజాలదు. ఎటువంటి వాతావరణములోనైనా మీ వస్త్రాలు తెల్లగానే ఉంటాయి. నీవు ఎచ్చటికి వెళ్ళినా నీ మనస్సు, మాట, కర్మలు ఒకే విధంగా ఉండాలి. వారైతే ప్రపంచములోని మనుష్యులు, మాయావి రంగులో రంగరింపబడి ఉన్నారు. అందువలన ప్రతి రోజు అనేక రూపాలు మార్చుకుంటూ ఉంటారు. నీవు ఎవ్వరి ప్రభావములోకి రాకూడదు. సదా ఒక్క తండ్రి సాంగత్యములోనే ఉండాలి.

నా వయస్సు చాలా చిన్నది కాని మమ్మా నన్ను చిన్న పిల్లగా

భావించి నాలో ఏ చిన్న లోపమూ ఉండనివ్వలేదని నేను అనుభవము చేశాను. మమ్మా అన్ని విధాలైన ధారణా విషయాలు నాకు వినిపించేవారు. బయటి ప్రపంచము వారితో వారి ఇంటి భోజనము తిన్నట్లు కాని రంగు-రంగుల వస్త్రాలు ధరించినట్లు కాని నాకు గుర్తు లేదు. నేను సదా తెల్లని వస్త్రాలనే ధరించేదానిని. పాఠశాలకు పోవునప్పుడు కూడా తెల్లని వస్త్రాలనే ధరించేదానిని. నేను రంగు వస్త్రాలను ధరించాలి అని గాని, బయట తినుబండారాలను తినాలని గాని నాకు ఎప్పుడూ సంకల్పములో కూడా రాలేదు. నేను అమృత్‌సర్ సేవాకేంద్రములో ఉండి 9 - 10 తరగతులు పాఠశాలలో చదువుకున్నాను.

మమ్మా మొట్టమొదట ఆబూ నుండి సేవ కొరకు బయటకు వచ్చినప్పుడు వారు ఢిల్లీకి వచ్చారు. వారికి స్వాగతము పలికే కార్యక్రమము జరిగింది. నేను ఆ గుంపులో నిలబడి మమ్మానే తదేకంగా చూస్తూ ఉండిపోయాను. కాని ఆశ్చర్యమేమంటే ఆ గుంపులో కూడా మమ్మాగారి దృష్టి నా పై పడింది. వారు వచ్చి నా వేలు పట్టుకుని తమతో కారులో వారికి వసతి కల్పించిన చోటికి నన్ను కూడా తీసుకెళ్ళారు. ఢిల్లీలో మమ్మాగారు ఉన్నంతవరకు నన్ను వారి వద్దనే ఉంచుకున్నారు. ఈ విధంగా మమ్మాగారి ఆత్మిక దృష్టి నా జీవితాన్ని పరివర్తన చేసి నా భాగ్యాన్ని మేల్కొలిపింది.

### ప్రేమ శక్తి కలిగిన పరాశక్తి - మమ్మా

ఒకసారి మమ్మా అమృత్‌సర్‌కు వచ్చారు. అచ్చట ఒకరోజు అందరికీ ఐస్‌క్రీమ్ తినిపించారు. నేను చిన్న పిల్లనైనందున ఐస్‌క్రీమ్ కొంచెం ఎక్కువగానే తిని ఉండవచ్చు. మరుసటి రోజు నా ఆరోగ్యము పాడైపోయింది. చాలా చలి, జ్వరము, పడిశము పట్టి శ్వాస తీసుకునేందుకు కూడా కష్టంగా ఉండినది. మమ్మాకు ఈ విషయము తెలిసి వారు నా వద్దకు వచ్చి నన్ను తన ఒడిలోకి తీసుకొని సుమారు అర్ధగంట, ముప్పావుగంట కూర్చోపెట్టుకొని నా వీపు నిమురుతూ ఉండిపోయారు.



అప్పుడు నా శ్వాస క్రియ సక్రమంగా జరిగి నెమ్మదిగా జ్వరము కూడా తగ్గిపోయింది. మరుసటి రోజుకు నా ఆరోగ్యము పూర్తిగా చక్కబడిపోయింది. ఈ విధంగా మమ్మా తన వరద హస్తాలతో తన ప్రేమ శక్తితో నా కష్టాన్ని హరించి వేశారు.

నాకు చిన్న వయసులోనే ఉబ్బసము వచ్చింది. ఒకసారి నేను ఆబూకు వచ్చాను. అప్పట్లో బస్‌స్టాండ్ నుండి పాండవ భవనానికి మేమంతా నడిచి రావలసి వచ్చేది. అలా నడిచి రావడంలో నాకు ఊపిరి ఆడలేదు. అప్పుడు బాబా తన గది వెనుక ఉన్న ఒక గదిలో నాకు మంచము ఇచ్చారు. బాబా మమ్మాతో - " మమ్మా నీవు బాబాతో కలిసేందుకు ఎన్నిసార్లు వస్తావో అన్నిసార్లు ఈ బిడ్డ వద్దకు పోయి దృష్టి ఇస్తూ ఉండాలి, ఈ బిడ్డ ఆరోగ్యము సరిపోతుంది" అని చెప్పారు. మమ్మా బాబా చెప్పిన ప్రకారమే దృష్టినిస్తూ వచ్చారు. అంతేకాక బాబా కూడా ఎన్నిసార్లు బయటకు వెళ్ళేవారో అన్నిసార్లు నా వద్దకు వచ్చి నా వీపు పై, తల పై చేతితో నిమిరి దృష్టిని ఇచ్చేవారు. ఆశ్చర్యమేమంటే నా ఉబ్బస వ్యాధి ఏ మందు లేకుండానే నయమైపోయింది.


సరస్వతి తల్లి పాలన తీసుకోవడం నా పరమ సౌభాగ్యము. వారి జ్ఞానవీణలోని మధురమైన రాగాలు తనివి తీరా విన్నాను. మమ్మా నా జీవితానికి ఆధారముగా అయినారు. వారి స్మృతి మరియు ఆదర్శమయమైన జీవితము నాకు సంజీవిని.

## కష్టహారిణి, దు:ఖ నివారిణి అయిన తల్లి దుర్గ (దుర్గామాత)

జలందర్(పంజాబ్) నుండి బ్రహ్మాకుమారి శుక్లాబెహన్ గారు ఇలా వ్రాస్తున్నారు - నాకు బాబా జ్ఞానము అమృత్‌సర్‌లో 1954 సంవత్సరములో లభించింది. ఆ రోజులలోనే మమ్మా అమృత్‌సర్‌కు వచ్చారు. అప్పుడు నేను భోజనము తయారు చేయు సేవలో ఉన్నాను. మమ్మా చైతన్య దుర్గ అని నా మనసులో భావించేదానిని. మమ్మా వంటగదిలోకి వచ్చినప్పుడు తల్లి కొరకు భోజనము తయారు చేస్తున్నావా? అని అడిగేవారు. ఒకరోజు ఒక మాత వంటగదిలో బెల్లపు దలియా(గోదుమ జావ) తయారు చేసి తీసుకు వెళ్ళునప్పుడు ఇత్తడి పాత్ర చేతి నుండి జారిపడిపోయింది. నా చేతుల పై, కాళ్ళ పై దలియా పడింది. అక్కడున్న అక్కయ్యలు మమ్మాను పిలుచుకొని వచ్చారు. మమ్మా చూచి - "మమ్మా కొరకు భోజనము తయారు చేస్తూ ఉండినారు, ఏం పర్వాలేదు, త్వరలో బాగైపోతుంది, చింతించే అవసరము లేదు అని అన్నారు. "వెంటనే నా పాదాలు చల్లగా అవుతున్నట్లు అనిపించింది. మమ్మా నా బాధనంతా హరించి వేశారు. బాధ, నొప్పి ఏమీ లేదు కదా? అని అందరూ అడిగారు. "అప్పుడు నాకు నొప్పి ఉన్నట్లు కూడా గుర్తు లేదు. నాకు తెలియనే లేదు" అని చెప్పాను.

మమ్మా నడిచే విధానాన్ని చూచి బాబా - భూమి కూడా మమ్మాను ఎంత ప్రేమిస్తోందో చూడండి అని అనేవారు. ఫరిస్తా వలె మమ్మా సదా తేలికగా ఉండేవారు. మమ్మా ఎంత సేవ చేసినా, వారి ముఖములో ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. సదా చిరునవ్వుతో, తేలికగా కనిపించేవారు. బాబా మమ్మాకు ఏ సేవ ఇచ్చినా సరే బాబా(జీ బాబా)! అని అనేవారు. బాబా కూడా సదా - మమ్మా ఎంత గట్టి(గట్టిపిండం) వారంటే ఒక్క శివబాబానే తన హృదయపూర్వక వరునిగా(దిల్‌వర్‌గా) చేసుకున్నారు, అతనికి తప్ప తన మనసులోని మాట ఎవ్వరికీ వినిపించరని అనేవారు. మమ్మా ఎప్పుడైనా ఇతర చోటుకు వీడ్కోలు తీసుకెళ్లునప్పుడు అందరి కళ్ళు చమ్మగిల్లేవి. మమ్మా ఎంత పక్కాగా ఉండేవారంటే, వారి కనులలో ఎప్పుడు కూడా కన్నీరు వచ్చేది కాదు. మమ్మా ఇలా అనేవారు -





ప్రవచనము చేస్తున్న మాతేశ్వరిగారు - వారి ఎదుట జలంధర్ శుక్లా బెహన్, వారి వెనుక కృష్ణా బహన్
(శుక్లా బహన్ గారి లౌకిక సోదరి)

కన్నీరు కార్చండి కాని ప్రేమ బాష్పాలుగా ఉండాలి. ప్రేమ బాష్పాలైతే అవి ముత్యాలుగా అయిపోతాయి.

మమ్మా ప్రతి ఒక్కరి మనస్సులోని మాటలను ఎలా వినేవారంటే ఎవరైనా తల్లి తన బిడ్డల దు:ఖమును శ్రద్ధగా వింటున్నట్లు వినేవారు. పిల్లలందరూ మమ్మా తమ భారమునంతా దించి వేశారు అన్నంత తేలికగా అయ్యి వెళ్ళేవారు. మమ్మాను అందరూ చాలా ప్రేమించేవారు. మమ్మా మొత్తం విషయమంతా విని ఇంతగా వివరించావు. ఇప్పుడు ఏదైనా మీ గురించి కూడా చెప్పండి. మీ లోపల ఏ లోపాలున్నాయో వినిపించండి అని అనేవారు!

### మమ్మా నన్ను నిర్భయురాలిగా చేశారు

నేను మమ్మా-బాబాలకు భోజనము తయారు చేసేదానిని. అందువలన మమ్మా-బాబాలతో నిస్సంకోచంగా విషయమంతా

తెలిపేదానిని. నేను ఒక రోజు మమ్మాతో ఇలా అన్నాను - మమ్మా మనము శివశక్తులమని మీరంటారు. కాని చిన్న చిన్న విషయాలకే నేను భయపడ్తాను. అప్పుడు మమ్మా - మొదట రోజుకు ఒకసారి నేను శివశక్తి భారతమాతను అని 11 సార్లు అన్న తర్వాత నా వద్దకు రా! అని చెప్పారు. ఈ రీతిగా మమ్మా నన్ను సంపూర్ణ నిర్భయురాలిగా చేశారు. ఏదైనా సేవ చేసి వచ్చినప్పుడు మొదట నేను మమ్మాకు వినిపించేదానిని - ఈ రోజు ఫలానా జిజ్ఞాసువు వచ్చారు, ఈ విధంగా ప్రశ్నించాడు అని చెప్పేదానిని. అప్పుడు మమ్మా-బాబా ఏ విధంగా జవాబు చెప్పాలో నాకు వివరించారు. జాబులు వ్రాయునప్పుడు ఎవరెవరు జాబులు వ్రాశారో మమ్మా-బాబా నన్ను అడిగి తెలుసుకునేవారు. తెలుసుకొని వారి పేరుతో జవాబు వ్రాసేవారు. ఎందుకంటే జాబు వ్రాసినవారు జవాబు కొరకు వేచి ఉంటారని, ఎవరు వ్రాయలేదో, వారు ఎదురు చూడరని మమ్మా - బాబా అనేవారు.

మమ్మా అమృత్‌సర్‌కు వచ్చినప్పుడు ఆ సమయంలో మా తల్లిదండ్రులు తప్ప ఇతరుల తల్లిదండ్రులెవ్వరూ జ్ఞానములో నడిచేవారు కాదు. ఆ సమయములో బ్రహ్మకుమారీలు మనుష్యులను ఎత్తుకెళ్తారని జనులు అనేవారు. కాని బ్రహ్మకుమారీలు మనుష్యులను తీసుకెళ్తారని, సేవ కొరకు పంపుతారని ఋజువు చేసేందుకు మమ్మా ఒక కార్యక్రమము చేశారు. అప్పుడు మా పరివారమంతా నన్ను మమ్మా ముందు సమర్పణ చేశారు. నా లౌకిక తండ్రి మమ్మా ముందు ఒక పాట కూడా పాడారు - "రెండు మొగ్గలను తీసుకొని వచ్చాను, ఆ మొగ్గలతో పాటు నేను కూడా సమర్పణ అయ్యేందుకు వచ్చాను........" మమ్మా ఆబూ పర్వతానికి వచ్చినప్పుడు బాబా అడిగారు - మమ్మా ఒంటరిగా ఎందుకు వచ్చావు, ఎవ్వరూ సమర్పణ అవ్వలేదా? అప్పుడు మమ్మా నన్ను మరియు మా లౌకిక అక్కయ్య రాజ్ బెహన్‌ను బాబా ముందుకు తీసుకెళ్లారు. మేము బాబా వద్దకు వెళ్లాము. బాబా మాకు ఒక గంట సేపు దృష్టి ఇస్తూ ఉండిపోయారు. యోగము ద్వారానే మాలో ఎంత శక్తి నింపారంటే సూక్ష్మలోకంలో కూర్చుని ఉన్నట్లు మాకు అనుభవమయింది. మమ్మా-బాబాల దృష్టి సుఖవంతంగా, నిర్మలంగా



తయారు చేసేదిగా ఉండినది.

### భక్తులు కూడా మా తల్లి వచ్చేసిందని పాటలు పాడారు

నేను మొట్టమొదట 1954వ సంవత్సరంలో మధువనములో మమ్మాను కలుసుకోవడం జరిగింది. నేను మొట్టమొదట మమ్మాను చూసినప్పుడు నాకు ఇలా అనిపించింది - అనేక సంవత్సరాలు తల్లి నుండి విడిపోయిన పుత్రుడు తన తల్లిని కలుసుకున్నట్లు అనుభవమయింది. మనస్సు చాలా తేలికైపోయింది. మమ్మా కనులలోకి అలాగే చూస్తూ ఉండిపోవాలని మనస్సుకు అనిపించింది. దానితో పాటు నా కనుల ద్వారా అశ్రువులు కూడా ప్రవహిస్తూ ఉండినాయి.

1964వ సంవత్సరంలో మమ్మా మొట్టమొదట జలంధర్‌కు వచ్చినప్పుడు నేను ఒక విశేషమైన విషయాన్ని గమనించాను. మమ్మా వచ్చినప్పుడు మేము మైక్‌ను(గొప్ప వి.ఐ.పిని) గాని, గాయకులను (కళాకారులను) గాని పిలువకుండానే చాలా మంచి కళాకారులు తమంతకు తామే అచ్చటకు వచ్చారు. వారి పేర్లు కూడా మాకు తెలియదు. వారు మా తల్లి వచ్చేశారు,.......... అని కన్నీరు ప్రవహింపజేస్తూ పాటలు పాడారు. సోదరులారా! మీరెలా వచ్చారు? అని అడిగినప్పుడు అందులో చాలా మంది మేము స్వప్నములో మా తల్లి ఇక్కడకు వచ్చిందని చూశాము అని చెప్పారు. మరి కొంతమంది తెల్లని వస్త్రాలలో మాకు కనిపించారని అన్నారు. వచ్చిన వారందరూ మంచి మంచి అనుభవాలు వినిపించారు. ఈ మాటల వలన మమ్మాలో తల్లి పాలనను ఇచ్చే దివ్యశక్తి నిండి ఉందని, దాని ద్వారా వారి ప్రేమ కొరకు దాహముతో ఉన్న పిల్లలు ఆకర్షింపబడి వచ్చేశారని నేను తెలుసుకున్నాను.

### మమ్మా నాకు చున్నీ ధరింపచేశారు

ఇది మధువనములో జరిగిన విషయము. మమ్మా నన్ను తన గదికి తీసుకెళ్ళి నీకేమి కావాలి? అని అడిగారు. దానికి నేను సదా మీ ప్రేమ నా పై ఉండాలి అన్నాను. అప్పుడు మమ్మా మోగియా(మల్లెపూవు)



మాతేశ్వరీగారితో సోదరి కర్మాభాయి, కాన్పూర్

రంగు గల రెండు చున్నీలు తీసుకొని ఒకటి రాజ్‌బ్‌హన్ గారికి మరొకటి నాకు తమ స్వహస్తాలతో ధరింపజేశారు.

ఈ విధంగా మమ్మాగారి ఆ అలౌకిక ప్రేమానుభూతి ఈనాటికి కూడా నా జతలోనే ఎల్లప్పుడూ ఉంది, దానిని ఎప్పుడైనా స్మృతిలోకి తెచ్చుకుంటే నా పురుషార్థములో తీవ్రత వస్తుంది.

## జీవితములో నిర్ణయము జరిగిపోయింది

భఠిండా నుండి బ్రహ్మాకుమారీ కమలేష్ బెహన్‌గారు తమ అనుభవాన్ని వినిపిస్తూ - 1954వ సంవత్సరములో నాకు ఈశ్వరీయ విశ్వ విద్యాలయముతో పరిచయమయింది. ఒకటి - ఒకటిన్నర సంవత్సరాల తర్వాత మాతేశ్వరీగారు పంజాబు రాష్ట్రములో టూర్ చేసేందుకు వస్తున్నారని మాకు ఆబూ నుండి సందేశము అందింది. మా చిన్న గ్రామానికి (శ్రీ హర గోవిందపురముకు) కూడా మాతేశ్వరీగారు వస్తున్నారని మా అందరితో కలుస్తారని తెలుసుకొని "అహో మా సౌభాగ్యము" అని భావించాము. మాతేశ్వరీగారు మా గ్రామానికి రావడం జరిగింది. ఎందుకంటే మా గ్రామము చిన్నదైనా అచ్చట కుమారీల సమూహముండేది. కుమారీలైన మేమందరము కలిసి ఒక పాటను తయారు చేసి మాతేశ్వరీగారి ముందు గానము చేశాము. ఈ పాటలోని రెండు చరణాలు ఇప్పటికీ నాకు గుర్తున్నాయి.

" శక్తులైన మేము కురుక్షేత్ర మైదానములో ప్రవేశిస్తాము.
పరీక్షలో పాస్ అవుతామనే నిశ్చయంతో ముందుకు పోతాము........"

మాతేశ్వరిగారు ఈ పాటను విని చాలా ప్రేమతో నిండిన దృష్టినిస్తూ మమ్ములను తదేకంగా చూశారు. వారు మధుర జ్ఞానవీణను మ్రోగించునప్పుడు అందులో ఇటువంటి శివశక్తులు మైదానములోకి వస్తే బాబా పేరును ప్రసిద్ధము చేయగలరని కూడా అన్నారు. మాతేశ్వరీగారి ఈ మాటలు విని మా కోరిక ఇంకా పక్కా అయిపోయింది. ఆ సమయములో నేను 9వ తరగతి చదువుకుంటున్నాను.

2 సంవత్సరాల తర్వాత నేను పై చదువులకు చండీఘర్‌కు వెళ్ళాను. ఆ సమయములో అచ్చట సేవాకేంద్రము లేదు. ఒకసారి మాతేశ్వరీగారు పంజాబు టూర్‌కు వచ్చినప్పుడు చండీఘర్ యూనివర్శిటీ క్షేత్రములో ఉంటారని నాకు ఉత్తరం వచ్చింది. కాని నాకు మాతేశ్వరీగారు ఎవరి నిమంత్రణ పై వస్తున్నారో ఎచ్చట బస చేస్తారో తెలియలేదు. అయినా నేను ఆ ఇంటిని వెతికేందుకు ప్రయత్నించాను కాని నేను ఆ ఇంటిని కనుగొనలేక

పోయాను. తర్వాత నాకు ఉత్తరం లభించిన అడ్రస్సు ఆధారంతో మాతేశ్వరీగారు ఏ రోజు వస్తారో తెలుపమని జాబు వ్రాశాను. ఆ జాబు చేరి, వారు స్వయంగా నా వద్దకు వచ్చి నాకు నిమంత్రణ ఇచ్చి వెళ్ళిపోయారు. నేను అక్కడికి వెళ్ళాను. అప్పుడు మమ్మాగారు ప్రతి రోజు అచ్చటకు వెళ్ళి క్లాసు చేసేందుకు, గురువారము భోగ్ పెట్టేందుకు నన్ను నియమించి నాకు సేవనిచ్చారు. నేను లౌకిక చదువు చదువుకుంటూ సమయము తీసుకొని బాబా సేవ చేస్తూ ఉండినాను. తర్వాత 1960వ సంవత్సరములో చండీఘర్‌లో సేవాకేంద్రము స్థాపించబడింది. మాతేశ్వరీగారు మళ్లీ అచ్చటకు రావడం జరిగింది. 2 రోజులు చండీఘర్‌లోనే ఉండినారు. వారిని చూచి మాటిమాటికి నాకు ఒక ప్రేరణ వచ్చేది - మాతేశ్వరీగారు ఎంతటి ధారణా మూర్తిగా, ఎంతటి గంభీరమూర్తిగా, సరళ స్వభావిగా ఉన్నారో అలాగే నేను కూడా తయారవ్వాలి. మాతేశ్వరిగారు మా ముందు కూర్చున్నప్పుడు ఒక గొప్ప(సింహ) శక్తి నా ముందు కూర్చుని ఉన్నారని, నేను కూడా అలాగే తయారవ్వాలనే ఆదేశము ఇస్తున్నారని నాకు అనిపించేది. వారి మహావాక్యాలు వింటూనే మనస్సులో ఉమంగ-ఉత్సాహాలు నిండిపోయేవి. నేను కూడా బాబా కార్యములో ఎందుకు చేయి కలపరాదని అనిపించేది.

లౌకిక చదువు చదువుకునే సమయములో మధ్య మధ్యలో నాకు మాతేశ్వరీగారి నుండి జాబులు వచ్చేవి. అందులో "బచ్చీ !! నీవు సింహశక్తివి. ఎటువంటి పరిస్థితులు వచ్చినా, నీవు భయపడరాదు. పరిస్థితులు దాటుకొని పాస్ అవ్వాలి. నీకు ఒకే బలము, ఒకే నమ్మకము ఈ నిశ్చయ బలముతో ఆ పరీక్షలన్నింటిలో పాస్ అవ్వాలి". ఈ ప్రేరణల వలన నేను ముందుకు పోతూ వచ్చాను. చదువు పూర్తి చేసుకొని కొంత సమయము లౌకిక సేవతో పాటు ఈశ్వరీయ సేవ కూడా చేశాను. నా లౌకిక బంధనాలన్నీ తెగిపోయే సమయము వచ్చింది. 1962లో ఈశ్వరీయ సేవలో పూర్తిగా సమర్పణమైపోయాను. ఆ తర్వాత చండీఘర్‌లో సేవ చేస్తూ ఉండిపోయాను. నేను మమ్మాగారిని ఎప్పుడు చూచినా వారు మాకు



కేవలం అలౌకిక తల్లే కాక లౌకిక తల్లి అని కూడా అనిపించేది. వారి పాలన కూడా నాకు అలాగే లభించింది. అడుగడుగునా వారి మార్గదర్శనం కూడా లభించింది. సదా ముందుకు వెళ్లేందుకు నాకు సదా ఉత్సాహము కూడా ఇచ్చారు.

ఇప్పుడు మమ్మాగారు సాకారములో లేరు. కాని ఎప్పుడు నేను మధువనానికి వచ్చినా మమ్మా - బాబా నా జతలోనే ఉన్నారని అడుగడుగునా నాకు దారి చూపుతున్నారని అనిపిస్తుంది. యోగము చేస్తున్నప్పుడు అప్పుడప్పుడు మమ్మా మూర్తి నా ముందుకు వస్తుంది, ప్రేరణ లభిస్తుంది, ఆదేశము లభిస్తుంది - "నీవు ముందుకు వెళ్ళాలి. సీ ఫాదర్(తండ్రిని చూడు/See Father) ఫాలో ఫాదర్(తండ్రిని అనుసరించు/Follow Father) అవ్యక్త రూపములో ఈ రోజుకు కూడా నాకు మమ్మా నుండి సూక్ష్మ ప్రేరణలు లభిస్తూనే ఉన్నాయి - సదా ముందుకు వెళ్తూ ఇతరులను ముందుకు తీసుకెళ్ళాలనే ప్రేరణ నాకు లభిస్తూనే ఉంది.

# దివ్య దృష్టి విధాత్రి - మాతేశ్వరి

గురుదాస్‌పూర్ నుండి బి.కె. సుమన్ అక్కయ్య తమ అనుభవాన్ని వినిపిస్తూ ఇలా అంటున్నారు - మాతేశ్వరిగారి భావనలు ఎంతో పవిత్రంగా, పరిశుద్ధంగా ఉండేవి. అందువలన వారిని దర్శించుకుంటే ఎటువంటి విరోధ భావము మరియు ఇతర భావము గల వ్యక్తులైనా పూర్తిగా పరివర్తనై శీతలతను అనుభవం చేసేవారు. అంతేకాక ఈ మహోన్నతమైన ఆత్మను దర్శించుకొని మేము ధన్యమైపోయామని అనుభవం చేసేవారు. మాతేశ్వరీగారి ప్రభావము ఎటువంటిదంటే వారి ముందు ఎటువంటి ఆత్మ వచ్చినా పరివర్తనైపోయేవారు.

అమృత్‌సర్‌లో ఒకసారి మమ్మాగారి సత్సంగము జరుగుతూ ఉంది. మా ఇంటిలోని వారంతా చాలా ఖుషీ ఖుషీగా వెళ్తూ ఉండినారు. మాతేశ్వరీగారు వస్తున్నారు, నీవు కూడా మా వెంట రా అని నన్ను కూడా పిలిచారు. నేను కూడా వారితో వెళ్ళాను. అచ్చట మాతేశ్వరీగారిని చూసి, నేను కూడా ఇలా తయారవ్వాలి, వారి వలె ఆదర్శ జీవితము జీవించాలి అనే ప్రేరణ కలిగింది. ఇలా ఆలోచిస్తున్నప్పుడు మాతేశ్వరి దృష్టి నా పై పడింది. వారు మందహాసము చేస్తూ శక్తినిచ్చే తమ దృష్టిని నా పై కురిపించారు. రెండవసారి మమ్మా అమృత్‌సర్‌కు వచ్చినప్పుడు ఆ రోజు నేను క్లాసుకు వెళ్లలేదు. అప్పుడు మా తల్లి ద్వారా ఒక శక్తుల(దేవీల) చిత్రాన్ని పంపి ఈ శక్తుల వలె తయారవ్వాలని ఉందా? అని మీ కన్యను అడగండి అని చెప్పారు. ఆ చిత్రాన్ని చూచి అవును ఇలా తయారవ్వాలి అని నాకు అనిపించింది. ఆ రోజు నుండి మాతేశ్వరీగారితో నా ప్రేమ ఇంకా పెరిగిపోయింది. అంతేకాక మాటిమాటికి ఈమె నా తల్లి అని అనుభవమౌతూ ఉండేది. ఆ ప్రేమ వలన నా జీవితము పూర్తిగా పరివర్తనైపోయింది.

మొదటిసారి నేను మమ్మాను చూచినప్పుడు మమ్మా నాకు అష్టభుజాలు కలిగిన దేవిగా కనిపించింది. కిరీటము ధరించి మెరిసిపోయే రంగుల వస్త్రాలు ధరించి సర్వ అస్త్రశస్త్రాలతో సుసజ్జితమైన(అలంకరించ





మాతేశ్వరి గారు

బడిన) తల్లిగా శక్తి రూపములో కనిపించింది. మమ్మాగారి జీవితము చాలా ఉన్నతమైనది. ఒకసారి ఏమి జరిగినదంటే మమ్మాగారి ముందు చాలామంది కన్యలు కూర్చొని ఉన్నారు. మమ్మా వారితో కలుస్తూ ఉన్నారు. అందులో నేను కూడా ఉన్నాను. నాతో కలియునప్పుడు మమ్మా నన్ను ఇలా అడిగారు - "బచ్చీ! ఈశ్వరీయ జీవితములో చాలా పరీక్షలు వస్తాయి. నీవు ఆ పరీక్షలలో పాస్ అవుతావా?" "తప్పక పాస్ అవుతాను" మమ్మా అని నేను అన్నాను. అప్పుడు మమ్మా - "ఇన్ని ఇన్ని మిరపకాయలు తినవలసి వస్తుంది, తింటావా?" అని అడిగారు. "తింటాను మమ్మా" అని నేను అన్నాను. మమ్మా మళ్ళీ, "ఇంతింత పెద్ద పెద్ద కుండల నీరు తాగవలసి వస్తుంది, తాగుతావా?" అని అడిగారు. నేను హాజీ(తాగుతాను) మమ్మా అని అన్నాను. మళ్ళీ ఇలా ప్రశ్నించారు - ఈ ప్రపంచంలో నడుచుకోవాలంటే చాలా పరీక్షలు ఎదుర్కోవలసి వస్తుంది. ఎదుర్కోగలవా? నేను అన్నీ తప్పకుండా ఎదుర్కుంటాను మమ్మా అని అన్నాను.

ఈ విధంగా నడుస్తూ నడుస్తూ నా వద్దకు ఎన్నో పరీక్షలు వస్తూనే ఉన్నాయి. అప్పుడు నాకు మమ్మాగారి వద్ద చేసిన ప్రమాణము గుర్తుకు వస్తుంది. దీని ద్వారా మనస్సులో ఇంకా శక్తి వస్తుంది, ఆ పరీక్షలో పాస్ అయ్యే సాహసము నాకు వచ్చేస్తుంది.

## భవ భయహారిణి – శక్తి స్వరూపిణి మాత

కర్నాల్ నుండి బ్రహ్మకుమారి కమలా బెహన్ తన అనుభవాన్ని ఈ విధంగా వినిపిస్తున్నారు - మమ్మాలో నిర్భయతా సంస్కారము చాలా ప్రబలంగా ఉండేది. వారు సత్య జ్ఞానాన్ని ఎంత నిర్భయంగా నిరూపించేవారంటే - వినేవారు ఎంత చదువుకున్నవారైనా తర్క-వితర్కాలు చేసేవారైనా, వారే లొంగిపోయేవారు. ఒకసారి జరిగిన విషయము - కర్నాల్‌లో మమ్మా కొరకు ఒక జనరల్(సార్వజనిక) సభ ఏర్పాటు చేయబడింది. మమ్మా ఆ సమయములో కర్మసిద్ధాంతము గురించి మాట్లాడుతూ ఉండినారు. అచ్చటి నగరపాలక అధ్యక్షుడు కొంతమందితో కలిసి విరోధించేందుకు అక్కడకు వచ్చారు. ఆ నిండు సభలో మమ్మా తమ తేజోవంతమైన ఉపన్యాసము వినిపిస్తూ ఉన్నారు. మమ్మా పూర్తిగా ఒక గంటసేపు మాట్లాడారు. ఉపన్యాసము పూర్తి అయిన తర్వాత మమ్మా స్టేజి నుండి క్రిందకు వచ్చే సమయంలో నగరపాలిక సంస్థ అధ్యక్షుడు వచ్చి మమ్మాకు సాష్టాంగ నమస్కారము చేస్తూ అమ్మా - అమ్మా అంటూ కన్నీరు కారుస్తూ ఉండిపోయాడు. అతనికి మమ్మా ద్వారా తల్లి - శక్తి రూపములో సాక్షాత్కారము అయ్యింది. ఈ విధంగా మమ్మాలోని నిర్భయతా గుణము అనేక ఆసురీ సంస్కారము గలవారిని పరాజితులుగా చేసింది. వారు ఆమె శరణులోనికి వచ్చునట్లు చేసింది.

### సేవయే గౌరవమిప్పిస్తుంది

మమ్మాలోని ఈ నిర్భయతా గుణము నన్ను నా పరివారములోని లౌకిక బంధనాలను తెంచి వేసేందుకు ప్రేరేపించింది. క్లాసుకు వచ్చేందుకే నాకు ఇంట్లో చాలా బంధనాలు వేసేవారు. అందువలన సమర్పణమవ్వడం నాకు చాలా దూరమైన విషయము. కాని మమ్మాలోని నిర్భయతా గుణాన్ని నేను నా స్వంతము చేసుకొని అన్ని బంధనాలను తెంచి వేశాను. ఈ విధంగా నన్ను నిర్బంధనంగా చేయడంలో పూర్తి సహయోగమిచ్చింది మమ్మా మాటలే.

జ్ఞాన విషయాలు ఇతరులకు వినిపించేందుకు నాకు

భయమనిపించేది. ఒక రోజు మమ్మా కొంతమంది సేవ చేసే అక్కయ్యల పేర్లు తీసుకుంటూ ఉన్నారు. నా పేరు తీసుకుంటే బాగుంటుందని లోపల నాకు ఇష్టముగా ఉంది. ఆ రోజు నేను మమ్మాను - "మమ్మా సేవ కొరకు నా పేరు ఎందుకు తీసుకోలేదు?" అని అడిగాను. అప్పుడు మమ్మా అన్నారు - "బచ్చీ! ఎవరైతే బాబా సేవ చాలా చేస్తారో వారి పేర్లు మమ్మా తీసుకుంటారు. నీవు కూడా బాగా సేవ చేయి అప్పుడు నీ పేరు కూడా తీసుకుంటాను" అప్పుడు బాబా సేవ చేయాలని మనసులో అనుకున్నాను. అప్పటి నుండి నేను బాబా జ్ఞానాన్ని వినిపించే సేవ చేయడం ప్రారంభించాను. మమ్మా మాటలు నన్ను సంకోచించకుండా ఈశ్వరీయ జ్ఞానము వినిపించేందుకు ప్రేరణనిచ్చాయి. ఆ తర్వాత నేను గొప్ప-గొప్ప సభలలో బాబా సందేశాన్ని నిర్భయంగా వినిపిస్తూ వచ్చాను.

## పంచ తత్వాలను కూడా కష్టపెట్టరాదు

ఒకసారి కర్నాల్‌లో క్లాసు తర్వాత మమ్మా కన్యలమైన మాతో కూర్చొని ఉండినారు. మమ్మా సంతోషపెట్టుటలో కూడా చాలా రహస్యాలు నిండి ఉండేవి. సదా అందరికీ సుఖమునిస్తూ ఉండమని మమ్మా చెప్పేవారు. పంచ తత్వాలకు కూడా దు:ఖమివ్వరాదు. ఎవరైనా చెప్పులు వేసుకొని శబ్ధము చేస్తూ నడిస్తే మమ్మా నెమ్మది నెమ్మదిగా నడుస్తూ ఉండండి. భూమికి కూడా కష్టమునివ్వరాదు. తత్వాలకు కూడా మీరు సుఖమివ్వండి. ఎందుకంటే ఈ తత్వాలు కూడా మీకు సుఖమివ్వాలి. తల్లి తన పిల్లలకు - ఎలా మాట్లాడాలో, ఎలా నడవాలో, ఎలా వ్యవహరించాలో ప్రతి విషయము అర్థం చేయిస్తుందో, అలా మమ్మా కూడా అన్ని రకాల శిక్షణనిచ్చి పిల్లలైన మమ్ములను యోగ్యులుగా తయారు చేసేవారు. నేను మమ్మాను ఎప్పుడు చూచినా, నాకు వారు అలంకరింపబడి కిరీటము ధరించిన శక్తి రూపములో కనిపించేవారు.

## అందరి పట్ల సమాన దృష్టి, గౌరవయుక్తమైన దృష్టి

తల్లి అయినందున మమ్మాకు మేమందరము పిల్లలుగానే



ఉండినాము. వారు ఏ విధమైన బేధ భావము చూపలేదు. లౌకిక తల్లి ఏ విధంగా అయితే తన పిల్లలందరికీ తెలివిగలవారిని గాని, తెలివిహీనులైన వారిని గాని ప్రేమిస్తుందో, అలా యజ్ఞములోని ఏ పిల్లలైనా మమ్మా వద్దకు ఏదైనా ఫిర్యాదును తీసుకెళ్తే, మమ్మా ఇలా అనేవారు - పిల్లలూ! ఎవరిదైనా అవగుణాన్ని తెలిపేందుకు ముందు మీరు వారిలోని ఏదైనా ఒక మంచి గుణము తెలుపవలసి ఉంటుంది. ముందు వారిలోని ఒక గుణాన్ని వినిపించండి. తర్వాత వారి అవగుణాన్ని వినిపించండి. ఎప్పుడైతే వారు, వారి మంచి గుణాన్ని గురించి ఆలోచించినప్పుడు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిలో ఉన్న కోపము, రోషము నెమ్మదిగా చల్లారిపోయేది. వారి మంచి గుణము వినిపించిన తర్వాత వారిలోని అవగుణమునెలా వినిపిస్తారు! ఈ విధంగా మమ్మా ప్రేమతో పిల్లలిరువురి జగడాన్ని స్నేహములోకి పరివర్తన చేసేవారు. ఇరువురి పట్ల సమాన దృష్టి ఉంచేవారు.

# దివ్య రూపాన్ని చూపించే దైవీ తల్లి

కైథల్ నుండి బ్రహ్మాకుమారి పుష్ప బెహన్‌గారు ఇలా తెలుపుతున్నారు - ఎన్ని బాధ్యతలుండినా మమ్మా శాంతంగా, గంభీరంగా ఉండేవారు. ఎంత గంభీరమంటే వారి మనసులో ఏముందో తెలుసుకునేందుకు ఎవ్వరికీ సాధ్యమయ్యేది కాదు. సాధారణ మనుష్యులైతే వారి మనస్సులోని విషయాన్ని పది మందికి వినిపించి స్వయాన్ని తేలికగా చేసుకుంటారు. కాని మమ్మా మీ మనస్సులో ఏముందని అడిగేందుకు ఎవ్వరికీ ధైర్యము చాలేది కాదు. వారు సాగరము వలె ఎంత గంభీరంగా ఉండేవారంటే, అనగా మమ్మా ముఖము హర్షితంగా ఉండేది కాదని కాదు, మమ్మా నవ్వేవారు కాని చాలా శాలీనత(నమ్రత)గా నవ్వేవారు.

నేను మొట్టమొదట కర్నాల్‌లో మమ్మాను చూచినప్పుడు వారిని జగన్మాత రూపములో చూచాను. మమ్మా ఒక నెల రోజులు కర్నాల్‌లో ఉన్నారు. మమ్మా పెద్ద వయస్సు గలవారిని కూడా పిల్లల వలె పాలన చేసేవారు. మమ్మా దృష్టి వారి పై పడుతూనే వారు “అమ్మా, తల్లీ” అంటూ వారి ప్రేమను పొందేందుకు వేచి ఉండేవారు. మమ్మా తన దృష్టి ద్వారా తృప్తి పరచేవారు. వారు మమ్మా దర్శనము చేసుకొని ప్రేమాశ్రువులు ప్రవహింప చేసేవారు.

## భక్తులకు కూడా మమతామయి తల్లి

ఒకసారి మమ్మా కర్నాల్‌కు రావలసి ఉంది. వారిని స్వాగతించేందుకు చాలా మంది సోదరీ - సోదరులు స్టేషన్‌కు వెళ్ళారు. అందులో వయస్సులో పెద్దవారు, వృద్ధులు, మధ్య వయస్కులు కూడా ఉన్నారు. అచ్చట కొంతమంది వీరెవరు? అని అడిగారు. వీరు మా తల్లి అని ఎవరో చెప్పారు. వయసులో చిన్నవారు కాని వృద్ధులు కూడా వీరు మా తల్లి అని అంటున్నారు! మళ్లీ మమ్మా వాపసు ఆబుకు వచ్చునప్పుడు స్టేషనులో అందరికి దృష్టి ఇస్తూ ఉన్నారు. అంతలో స్టేషన్‌మాస్టర్ వచ్చి ఈమె ఎవరు? అని అడిగాడు. వీరు మా తల్లి అని వారికి చెప్పడం జరిగింది. అతడు కూడా ఆశ్చర్యచికితుడై మమ్మాను చూచాడు. మమ్మా కూడా అతనిని





మాతేశ్వరిగారితో సుందరి బహన్(పూనా), జవాహర్ బహన్ వెనుక లైనులో హరదేవీ బహన్, రాజ్ బహన్(జలంధర్)

చూశారు. మమ్మా దృష్టి పడ్తూనే అతడు మమ్మా చరణాల పై పడి, “అమ్మా-అమ్మా” అని అనడం ప్రారంభించాడు. ఈ విధంగా అనేకమంది భక్తులకు కూడా మమ్మా ఒక దేవి అని, శక్తి అని, దైవీ తల్లి అని అనుభవమయ్యేది. నేను చాలా బంధనములో ఉండేదానిని. ఒకసారి నేను రహస్యంగా మమ్మాను కలుసుకునేందుకు వెళ్లి - “మమ్మా నాకు చాలా కఠినమైన బంధనాలున్నాయి ఏం చేయమంటారు?” అని అడిగాను. అప్పుడు మమ్మా అన్నారు - “ఈశ్వరీయ సేవ ఎంత మధురమైన మరియు శ్రేష్ఠమైన బంధనమంటే అది స్థూల బంధనాలన్నిటిని తెంచేస్తుంది.” ఈ విధంగా మమ్మా నాకు ఈశ్వరీయ సేవలో రుచిని పెంచారు. సర్వ బంధనాల నుండి ముక్తమై ఈశ్వరీయ సేవలో సమర్పితమయ్యే భాగ్యాన్ని కూడా తయారు చేశారు.

## సదా బాబా వైపే సూచించేవారు

ఒకసారి నేను మమ్మాతో - “మమ్మా నేను మీకు

బలిహారమౌతాను" అని అన్నాను. మమ్మా అన్నారు - "నా పై కాదు, శివబాబాకు బలిహారమవ్వు." అందుకు నేను - "బాబా నా ఎదుట లేరు, నా ఎదుట ఉండేది మీరే కావున మీకే బలిహారమవుతాను" అని అన్నాను. అందుకు మమ్మా అన్నారు - చూడు బచ్చీ! బలి అవ్వడం సులభము కాదు, జనులంతా చూస్తున్నారు, ప్రపంచము కూడా చూస్తోంది." అప్పుడు నేను - " మమ్మా నేను ముందే మీకు బలిహారమయ్యాను" అని అన్నాను. అందుకు మమ్మా - "బలి పూర్తిగా అవ్వాలి అని అన్నారు. నేను సరే మమ్మా అని అన్నాను. అప్పుడు మమ్మా నా తల పై చేయి ఉంచి ఇప్పుడు నీవు శివునికి బలిహారమైపోయావు అని అన్నారు. మమ్మా తనకు బలిహారమవ్వనివ్వలేదు. నీవు శివునికి బలి అయ్యావు అని అన్నారు. ఈ విధంగా మమ్మా సదా ఒక్క బాబా వైపే సూచించేవారు. ఆ ఒక్కరినే అనుసరించి, వారినే స్మృతి చేయమని చెప్పేవారు.

## బాబా పట్ల యజ్ఞము పట్ల ఎడతెగని ప్రేమ ( స్నేహము )

బాబా ఏ మాట చెప్పినా మమ్మా హాజీ, హాజీ(చిత్తము, చిత్తము) అంటూ నడుచుకునేవారు. మమ్మా సాకార బాబాలో సదా నిరాకార బాబాను చూచారు. వారు ఏ మాట చెప్పినా, ఎప్పుడూ తేలికగా తీసుకోలేదు, చూడలేదు. సదా సర్వశక్తివంతుల ఆజ్ఞగా భావించి నడుచుకునేవారు. ఇతరులకు కూడా అలాగే నేర్పిస్తూ ఉండేవారు.

## మమ్మా పట్ల బాబా దృష్టి కోణము

బాబా మమ్మాను కుమార్తె రూపములోనే కాక తల్లి రూపములో కూడా చూచేవారు. బాబా మమ్మాను ఎల్లప్పుడు యజ్ఞమాతగానే గౌరవించారు. అప్పుడప్పుడు బాబా మమ్మాతో - "మమ్మా నీవు యజ్ఞమాతవు, జగన్మాతవు, పిల్లలకు యాద్‌ప్యార్ ఇవ్వు" అని అనేవారు. అప్పుడు మమ్మా బాబా చెప్పినట్లు యాద్‌ప్యార్ ఇచ్చేవారు. ఈ విధంగా బాబా కూడా మమ్మాను చాలా గౌరవించేవారు. అదే విధంగా వ్యవహరించేవారు. ఈ విధంగా బాబా మమ్మాను తన కుమార్తె రూపములో ఆజ్ఞాపించేవారు.



యజ్ఞమాత రూపములో అపారమైన గౌరవమును కూడా ఇచ్చేవారు.

## శిక్షలతో ఎవ్వరూ బాగుపడరు

కచేరిలో మమ్మా తప్పు చేసిన వారిని శిక్షించేవారు కాదు, మందలించేవారు కాదు. కాని ఇలా తప్పకుండా చెప్పేవారు - "ఇక మీద గమనము పెట్టి ఈ తప్పు మరో మారు జరగరాదు, శ్రేష్ఠ కర్మలు చేయి" అని చెప్పేవారు. ఆ తప్పును బాబా వరకు పోకుండా అక్కడికే ముగిసేటట్లు కూడా మమ్మా ప్రయత్నించేవారు.

## ఇదేమిటి, దేవీలందరూ ఇచ్చటకు వస్తున్నారా?

ఇది 1965వ సంవత్సరములో జరిగిన విషయము. మా ఇంటి పైన ఆశ్రమముండేది. నేను అప్పటికి జ్ఞానములో లేను కాని అక్కయ్యలను చూచి సంతోషము కలిగేది. ఒక రోజు ఒక అక్కయ్య మా వద్దకు మమ్మా వస్తారు అని ఎవరితోనో చెప్తూ ఉంది. వారి మాటలలో అప్పుడప్పుడు జగదంబ వస్తారని, అప్పుడప్పుడు వైష్ణవి మాత వస్తారని చెప్తూ ఉన్నారు. ఈ దేవీలందరూ ఇచ్చటకు వస్తారా? అని నేను ఆశ్చర్యపడ్డాను. అంబాలా సిటి బ్రహ్మకుమారి సరోజ్ బెహన్ తమ అనుభవాన్ని వినిపిస్తూ - మమ్మాగారి కారు సేవాకేంద్రము వద్దకు వచ్చింది. మమ్మా కారు నుండి దిగుతూ ఉన్నారు. నేను అందరికంటే వెనుక ఉండినాను. మమ్మా సరిగ్గా కనిపించడం లేదు. అందువలన నేను ముందకు వెళ్ళిపోయాను.

### దీదీ, వీరు ధరించిన వస్త్రాలు ఎరుపా ? తెలుపా ?


నేను చిన్న పిల్లగా ఉన్నందున నేను ముందుకు పోతున్నా నన్ను ఎవ్వరూ ఆటంకపరచలేదు. మమ్మా కారు నుండి దిగుతూనే వారి దృష్టి నా పై పడింది. మమ్మా కారు నుండి దిగినట్లు కాక సింహము పై నుండి వైష్ణవి మాత దిగినట్లు కనిపించారు. నేను తికమకపడ్డాను. నేనేమి చూస్తున్నాను! అప్పుడప్పుడు తెల్ల వస్త్రాలలో, అప్పుడప్పుడు ఎరుపు వస్త్రాలలో కనిపించారు. నేను అక్కడున్న అక్కయ్యతో - "దీదీ, వీరు ఎరుపు వస్త్రాలు ధరించి ఉన్నారా లేక తెల్ల వస్త్రాలా?" అని అడిగాను. అందుకామె "ఇప్పుడు మాట్లాడవద్దు తర్వాత చెప్తాను" అని చెప్పారు. మమ్మాను స్వాగతము చేయడంలో నా సోదరుడు ఒక జాట్(సైన్యములో ఒక జాతి విభాగము)గా, నేను ఒక జాటనిగా నాటకములో వేషము వేశాము. ఆ సమయములో మమ్మాలో చూచిన అలౌకిక ఆకర్షణను ఈ రోజు వరకు నేను మర్చిపోలేదు.

మమ్మాకు కన్యల పట్ల చాలా ప్రేమ ఉండేది. బటలాలో ప్రతిరోజు సాయంకాలము సుమారు 40 కన్యలకు క్లాసు జరిగేది. కన్యలందరూ బంధనములోని వారే. అయినా ఏదో ఒక నెపము చెప్పి మేము సేవాకేంద్రములో మురళి వినేందుకు వచ్చేవారము.



### అసుర సంహారిణి

బటాలాలో ఒక పెద్ద హవేలి(భవంతి) ఉండేది. దాని పై అంతస్తులో ఆశ్రమముండేది. క్రింది భాగములో హవేలి యజమాని నివసించేవాడు.



ముంబయి వాటర్‌లూ మాన్షన్ – మాతేశ్వరి గారు సభలో ప్రసంగిస్తూ (ఫోటో – 1956)

అంతేకాక వేరేవారు కూడా బాడుగకు ఉండేవారు. మా పరివారము వారు కూడా అక్కడే ఉండినారు. ఆ ఇంటి యజమానిని ఆశ్రమానికి పిలుచుకు రమ్మని, నీ మాట వింటాడని అక్కయ్య చాలాసార్లు చెప్పారు. నేను చాలా చిన్న పిల్లనైనందున అతనికి నేనంటే చాలా ప్రేమ కనుక నా మాట ఎప్పుడూ కాదనేవాడు కాదు. ఆ సమయములో మమ్మా బటాలాకు వచ్చి ఉన్నారు. నేను ఉదయము ఉదయమే ఇంటి యజమాని వాకలి తట్టాను. వాకిలి తీస్తూనే, "అంకుల్ ఈ రోజు మీరు పై అంతస్తులో ఉన్న ఆశ్రమానికి రావాలి" అని అన్నాను. అందుకు అతడు "నేను సారాయి త్రాగకుండా ఒక సెకండు కూడా ఉండలేను. ఇటువంటి స్థితిలో ఆ దేవీల వద్దకు నన్ను రమ్మని పిలుస్తున్నావా ? ఇది అయ్యే పని కాదు" అని అన్నాడు. నేను కూడా చాలా

హరము చేసేదాన్ని. నేను అక్కడనే కూర్చుండిపోయాను. "నీవు వచ్చేంతవరకు ఇక్కడ నుండి పోను" అని అన్నాను. ఇప్పుడు స్నానము చేసి రండి. నేను మిమ్ములను తీసుకెళ్ళాలి అని అన్నాను. స్నానము చేసి బయటకు వస్తూనే నేను ఆయన రెండు చేతులు పట్టుకొని(బాటల్‌ను కనీసం తాకనివ్వలేదు) ఇప్పుడే మీరు రావాలి అన్నాను. విధి లేక అతడు నాతో పాటు వచ్చాడు. అప్పుడు అక్కడ మమ్మా క్లాసు జరుగుతూ ఉంది. మేము వాకిలి వద్దకు పోయి లోపలి దృశ్యము చూస్తూనే అతని నోటి నుండి - 'ఇది వైష్ణవీ మాత దర్బారు' ఇలా అంటూ నా చేయి వదిలి తనంతకు తానే లోపలికి వెళ్ళాడు. నేరుగా మమ్మా వద్దకు వెళ్ళి ఆమె కాళ్ళు పట్టుకున్నాడు. అప్పుడు మమ్మా - వచ్చావా బిడ్డా! మంచి పని చేశావు అని అన్నారు. బాగున్నావు కదా? అని అడిగారు. బాగున్నానమ్మా అని ఆయన అన్నాడు. ఆ రోజు నుండి ఈ రోజు వరకు అతడు సారాయి తాకను కూడా తాకలేదు. అంతకుముందు ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము, రాత్రి నాలుగు పూటలా సారాయి తాగుతూనే ఉండేవాడు. ఈ రోజు అతడు పక్కా వైష్ణవునిగా జీవిస్తున్నాడు. ఈ విధంగా మమ్మాలో ఇంత అలౌకిక శక్తి ఉండేది. చిన్న బాలుడైనా, యువకుడైనా, వృద్ధుడైనా వారు అయస్కాంతము వైపు సూది వలె లాగబడి వచ్చేవారు, వారిలో నివసిస్తున్న అసురత్వాన్ని త్యాగము చేసేవారు.

## భక్తుల ఇష్టదేవత

ముఖ్యంగా మమ్మా 3.30గంటలకే తయారై గది నుండి బయటకు వచ్చేవారు. ఒకరోజు 3.15కే తయారై బయటకు వచ్చేశారు. అప్పుడు జమునా దాది మమ్మాతో, "మమ్మా ఇంకా టైము కాలేదు మీరు త్వరగా ఎందుకు బయటకు వచ్చారు?" అని అడిగింది. అందుకు మమ్మా అన్నారు - " ఈ రోజు ఒక భక్తుడు నన్ను కలుసుకునేందుకు వస్తాడు, కావున నన్ను వెళ్ళనీ అని అన్నారు." మమ్మా ఇంకా కర్టెన్(పర్దా) లోపల ఉండగానే అమృత్‌సర్ నుండి ఒక సోదరుడు అక్కడికి వచ్చాడు. అతడు తన కారు నుండి దిగి



మూడవ అంతస్తుకు పరుగెత్తి ఎక్కుతూ వెళ్తున్నాడు. ఎందుకంటే మమ్మా 3వ అంతస్తులో ఉండినారు. వచ్చిన వ్యక్తి, "మమ్మా నీ గడప వద్ద నిలిచాను........" జయ జగదంబే. జయకాళి, కపాలాల కాళి........... అని పాడుతూ ఉండినాడు. మమ్మా నిల్చొని అతనికి దర్శనమిచ్చి - "బిడ్డా నీవు భక్తుడవై పాటలు పాడుతూనే ఉంటావా లేక నా పుత్రునిగా అయ్యి తల్లి నుండి ఏమైనా పొందుకుంటావా?" తల్లి ఏమో తన బిడ్డను పొందుకుంది. నీవు తల్లిని పొందుతావా? అని అడిగింది. అతను తల్లీ - తల్లీ అంటూ మమ్మా చరణాల పై వాలిపోయాడు. కన్నీరు కారుస్తూ ఉండిపోయాడు. మమ్మా అతనిని క్లాసులో కూర్చోబెట్టి, జ్ఞానాన్ని అర్థం చేయించారు, ప్రసాదము తినిపించారు. ఈ విధంగా మాతేశ్వరిగారు భక్తులను కూడా సంతుష్టపరుస్తూ ఉండేవారు. అంతేకాక వారు వచ్చేందుకు ముందే తెలుసుకునేవారు. మమ్మా పిల్లల ఆశలు, భక్తుల ఆశలు పూర్తి చేసే కల్పతరువుగా ఉండేవారు.

## విదేహ స్వరూపిణి వికార మర్ధిని – మహంకాళి మాతా

బటాలా నుండి బ్రహ్మాకుమారి గీతా బెహన్ తమ అనుభవాన్ని ఈ విధంగా వినిపిస్తున్నారు - నేను మొదటిసారి మమ్మాను 1963వ సంవత్సరములో బాటాలాలో చూచాను. అప్పుడు నా వయస్సు 12 సంవత్సరాలు. నేను మమ్మాను చూస్తూనే నేను జగదంబను చూస్తున్నానని అనిపించింది. నాకు జగదంబ సాక్షాత్కారమయింది. మమ్మా పైన హాలులో వెళ్ళి కూర్చున్నారు. అచ్చట సంపూర్ణ నిశ్శబ్ధము వ్యాపించి ఎవరో ఫరిస్తా వచ్చినట్లు అనుభవమయ్యింది.

మమ్మా నన్ను ఎంత ప్రేమించేవారంటే నేను మాటలలో వర్ణించలేను. మమ్మా నన్ను సదా గుడ్డూ(అందమైన బొమ్మ) అని అనేవారు. మరి వారి శబ్ధాలలో ఎంత మధురత ఉండేదంటే గుడ్డూ అని పిలుస్తూనే నేను ఎక్కడున్నా పరుగెత్తుకొని మమ్మా వద్దకు వచ్చేదాన్ని. మమ్మాలో ఎలాంటి దేహాభిమానము గాని, “నాది” అనేది గాని ఉండేది కాదు. మమ్మాకు తన దేహ స్మృతి కూడా ఉండేది కాదని నేను భావిస్తాను.

### అభయదాయిని - పాప వినాశిని

ఒక రోజు మమ్మా క్లాసు చేస్తూ ఉన్నారు. క్లాసు పూర్తి అవుతూనే అందరూ వెళ్ళిపోయారు. ఒక బంధనములోని మాత మాత్రము వెళ్ళకుండా అలాగే ఉండిపోయింది. ఆమె మమ్మాతో - “మమ్మా నేను ఇంటికి వెళ్ళను, నా భర్త నన్ను చాలా విసిగిస్తున్నాడు” అని చెప్పింది. అప్పుడు మమ్మా - “ఏమీ జరగదు, నీవు ఇంటికి వెళ్ళు అతడు నిన్ను ఏమీ అనడు” అని చెప్పారు. ఆ మాత ఇంటికి పోతూనే ఆమె భర్త అన్నాడు - నేను మీ ఆశ్రమానికి వచ్చాను. కాని నేను మెటికలు(తాపలు) పైకి ఎక్కలేక పోయాను. అక్కడికి ఎవరో చాలా గొప్పవారు వచ్చినట్లు నాకు అనిపించింది. అప్పుడా మాత అతనితో మా మాతేశ్వరి గారు వచ్చారు అని చెప్పింది. అప్పుడామె పతి వారిని నేను దర్శనము చేసుకోవచ్చా? అని తనంతకు తానే అడిగాడు. ఆ మాత తన భర్తను మాతేశ్వరీ వద్దకు తీసుకొచ్చింది. మాతేశ్వరీ గారిని చూస్తూనే అతడు వారి చరణాల పై





మాతేశ్వరిగారితో మన్మోహిని దీది, ఇతరులు

వాలిపోయాడు. మమ్మా తన చేతితో చాలా ప్రేమతో అతని తల పై నిమిరి దృష్టి ఇచ్చారు. అతడు గద్గదమై ఆ తల్లి నా జన్మ-జన్మల పాపాలను భస్మము చేసేశారని అనుభవము చేశాడు.

ఒకసారి క్లాసులో మమ్మా కన్యలందరిని వేరుగా కూర్చోబెట్టారు. మమ్మా కన్యలను ఒక ప్రశ్న అడిగారు - ఎవరెవరికి ఈ జీవితము బాగుందో వారు చేతులెత్తండి. నేను కూడా నా చేయి ఎత్తాను. అప్పుడు మమ్మా - ఈ బాలిక పై ఆమె తల్లికి చాలా మోహముంది. మెల్ల మెల్లగా అది కూడా సమాప్తమైపోతుంది. ఈ అమ్మాయి బంధనముక్తమైపోతుంది అని అన్నారు. మమ్మా అన్న ఈ మాట నాకు వరదానంగా అయిపోయింది. నా సర్వ లౌకిక బంధనాలు నెమ్మది నెమ్మదిగా తెగిపోయాయి.

### కరుణామయి - కాత్యాయిని

ఒకసారి మమ్మా బటాలా నుండి జమ్మూకు వెళ్తూ ఉన్నారు. నేను



మాతేశ్వరిగారితో వారి లౌకిక తల్లి రోచాగారు

మమ్మా ముందు నిలబడి నేను కూడా మీతో వస్తానుని ఏడ్వసాగాను. మమ్మా ఒక్క క్షణం ఆలోచించి నన్ను తన వెంట జమ్మూకు తీసుకెళ్ళారు. అచ్చటకు పోయిన తర్వాత నాకు ఒక సుందరమైన ఫ్రాకు ధరింపజేశారు. మమ్మానే నాకు ఫ్రాకు తొడిగిందని నాకు చాలా ఆత్మిక నషా పెరిగిపోయింది. ఆ రాత్రి మమ్మా నన్ను తన వద్దనే పడుకోబెట్టుకున్నారు. మరుసటి రోజు నన్ను ఒక అన్నయ్యతో వాపసు బటాలాకు పంపించారు. మమ్మాలో చాలా ప్రేమ శక్తి ఉండేది. ఎప్పుడూ ఎలాంటి పరిస్థితిలోనూ కన్నీరు కార్చరాదని మమ్మా చెప్పేవారు. ఒకవేళ కన్నీరు వచ్చినా, బయటకు రానివ్వరాదని అనేవారు.

మమ్మాకు ఏ విషయమైనా విస్తారంగా వినిపించే అవసరముండేది కాదు. వారు ఒక్క క్షణములో ఆ సమాచారములో సారాన్ని అర్థము చేసుకొని సమాధానము కూడా ఇచ్చేవారు. మమ్మాలో దయాభావము కూడా చాలా ఉండేది. దానితో పాటు నిరహంకార భావన కూడా ఉండేది. ఎవరి పట్ల కూడా అవగింజంత ఏహ్య భావము ఉండేది కాదు. ఎటువంటి పుత్రుడు వచ్చినా అతని పై దయ, ప్రేమ భావనతోనే చూచేవారు. ఒకసారి



మమ్మాకు రబడి(బాసంది) తయారు చేసి ఇవ్వబడింది. మమ్మా అదే స్పూనుతో అందరికీ రబడి తినిపించారు. ఆ తల్లి ప్రేమ మురిపెము ఎటువంటిదో నేను వర్ణించలేను.

## క్షమించి క్షమాశీలురుగా చేయడం

ఒకసారి జరిగిన విషయము - మమ్మా అమృత్‌సర్‌కు వచ్చారు. అచ్చట ఒక అక్కయ్య చేతి నుండి పాలగిన్నె జారి క్రింద పడిపోయింది. మమ్మా ఆమెను ఏమీ అనలేదు. సరి కదా, నీ పై పాలు పడలేదు కదా. చేయి కాలలేదు కదా? అని అడిగి ఆమెను శాంతపరచారు. మరుసటి రోజు ఆమె మనసు శాంతించిన తర్వాత పాలు ఎలా జాగ్రత్తగా తీసుకెళ్ళాలో అర్థం చేయించారు. మమ్మాలో కరుణా భావము, క్షమా భావము చాలా ఎక్కువగా ఉండేది. ఈ భావాల ఆధారముతోనే వారు శిక్షణనిచ్చేవారు.

## మాతేశ్వరీ గారి ఆ మాటలు నా జీవితాన్ని ఆనందమయము చేశాయి


చండీఘర్ నుండి బ్రహ్మాకుమారి ఉత్తరా బెహన్‌జీ ఇలా అంటున్నారు - మమ్మాను గురించి విన్నప్పుడు మమ్మా బహుశా చాలా చమత్కారిక ముఖము కలిగి ఉంటుందని అనుకున్నాను. మమ్మాను ప్రతి ఆత్మ మొదట హృదయముతో తర్వాత కనులతో గుర్తించేవారు. ఈ విషయములో ఒక ఘటన వినిపిస్తాను.

### కనులు తెలుసుకోలేదు, కాని హృదయము గుర్తించింది

నేను మొదటిసారి మమ్మాను 1962లో బటాలా సేవాకేంద్రములో చూచాను. అప్పుడు మమ్మాను స్వాగతించేందుకు ఒక గ్రుడ్డి సోదరి పూలమాలతో నిలబడి ఉంది. ఆమెను చూచి నాకు ఆశ్చర్యము కలిగింది. ఈమె చూడలేదు కదా, మమ్మాకు పూలమాల ఎలా వేస్తుంది? నేను ఆమెను నీవు మమ్మాను ఎలా గుర్తిస్తావు? పూలమాల ఎలా వేస్తావు? అని అడిగాను. అందుకామె నేనెలా గుర్తిస్తానో, నీవు చూస్తూ ఉండు అని చెప్పింది. మమ్మా నడిచి వస్తూ ఉన్నారు. ఆమెకంటే ముందు చాలా మంది సోదరీ - సోదరులు ఆ గ్రుడ్డి సోదరి ముందు నుండి వెళ్ళిపోయారు. మమ్మా ఆమె ముందుకు వస్తూనే కరెక్టుగా మమ్మా కంఠములో ఆమె పూలమాలను వేసింది. ఇది ఒక చమత్కారంగా ఉండినది. దీనినే - " కనులు తెలుసుకోలేవు కాని హృదయము గుర్తిస్తుంది" అని అంటారు.

నేను మొదట మమ్మాను కలుసుకున్నప్పుడు నా జీవితము సంఘర్షణలో ఉండేది. ఇంట్లో చాలా పటిష్టమైన బంధనముండేది. మనస్సు చాలా భారంగా ఉండేది. నేను మమ్మా వంటి జీవితము గడపాలని గాఢంగా లోపలి నుండి అనిపించేది. మమ్మా కూడా నన్ను చాలా ప్రేమతో కలిసింది మరియు అచల్ దీదీతో - చూడు, ఈ బిడ్డ పై గమనముంచు, ముమ్ముందు ఈ బిడ్డ చాలా సేవ చేస్తుంది అని అన్నారు. మమ్మా అచ్చట నుండి వెళ్ళునప్పుడు నన్ను చూస్తూ మళ్లీ అచల్ దీదీతో అదే మాటలు అనగా ఈ బిడ్డ(బచ్చీ) పై గమనముంచు అని అన్నారు. నేను ఈ మాటలు విన్నాను కాని ఈ మాటలలో నాకు ఏ ప్రత్యేకతా కనిపించలేదు. ఎందుకంటే ఆ సమయములో నేను చాలా బంధనములో ఉన్నందున నేను యజ్ఞములో సమర్పితమై బాబా సేవ చేస్తాననే ఆలోచన కూడా నాలో లేదు. కాని మమ్మాగారి ఆ మాటలు నాకు ఒక వరదానంగా తయారయ్యాయి. నేను నిర్బంధనంగా ఉంటూ ఈశ్వరీయ సేవలో ఉపస్థితమయ్యాను.





మాతేశ్వరిగారితో యోగ ముద్రలో ఉన్న దాదీ ప్రకాశ్ మణిగారు

### అది కాళిమాత సాన్నిధ్యముగా ఉండినది

మమ్మా జీవితము చాలా సీదా సాదా(సాధారణ) జీవితము. వారి హృదయము చాలా విశాలమైనది. వారిలో అద్వితీయమైన పరిశీలనా శక్తి ఉండేది. వారి మాటలు వరదానీ మాటలుగా, సత్యముగా ఉండేవి. మమ్మా ధారణలో సంపూర్ణమూర్తిగా ఉండేది. ఒకసారి ఒక వ్యక్తి మమ్మాతో కలుసుకునేందుకు వచ్చాడు. అతను బ్రహ్మాకుమార్ కాదు. ఎందుకంటే అతడు పవిత్ర జీవితాన్ని గడుపుట లేదు. మమ్మా కేవలం వారి వరదాని హస్తాన్ని పైకెత్తి అతనికి వరదానమిచ్చారు. ఆ వ్యక్తి - "మమ్మా, నేను మీ సాన్నిధ్యానికి రాకూడదా?" అంటూ ఏడ్వసాగాడు. అప్పుడు మమ్మా - "చూడు బిడ్డా! ఇది కాళికాదేవి సాన్నిధ్యము, అందరూ దానిని పొందలేరు" అని అన్నారు. ఈ విధంగా మమ్మా శీతలాదేవితో పాటు కాళిమాతగా కూడా ఉండేవారు.

### శిక్షణనిచ్చే సాటిలేని పద్ధతి

మమ్మా శిక్షణనిచ్చే విధానము చాలా ప్రత్యేకముగా ఉండేది. ఒకవేళ ఎవరైనా తప్పు చేస్తే, మమ్మా సదా వారికి సూచనలతో ప్రేమతో అర్థం

చేయించేవారు. ఒకసారి మేము చాలా మంది కన్యలము, మమ్మా ముందు కూర్చుని ఉండినాము. ఆ సమయములో మమ్మా అందరినీ - మీలో ఎవరైనా బజారులో అమ్మే తినుబండారాలను తింటున్నారా? అని అడిగారు. అప్పుడు ప్రతి ఒక్కరు వారి వారి సమాధానాలు చెప్పారు. అప్పుడు మమ్మా ప్రేమగా అన్నారు - "చూడండి, మీరు ఎవరి సంతానము! శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన పరమపిత పరమాత్మ సంతానము! సాధారణ పిల్లలు కాదు. ఆ రోజు నుండి మాలో ధారణ ఎంత పక్కాగా అయిపోయిందంటే తర్వాత మేమెవ్వరమూ బజారు వస్తువులు తిననే లేదు.

## పరమ తపస్విని, శివాని

మమ్మాను చూస్తూనే ఎదుటివారికి సాక్షాత్కారాలు లేక అనుభవాలు ఎందుకు అయ్యేవి? మమ్మాగారి గాఢమైన తపస్సు, వారి ధారణలే. అందువలన చూచేవారికి సాక్షాత్కారాలు జరిగేవి. బాబా సాక్షాత్కారము అయ్యేవారు. మమ్మా ఎదుట ఎటువంటి కఠోర విరోధ వ్యక్తి అయినా లొంగిపోయేవారు. అలా చేసిందెవరు? మమ్మా ఆదర్శాలు ధారణాయుక్త తపస్వీ జీవితము, బాబా పట్ల వారి అగాఢమైన సమర్పణ భావన అని నేను భావిస్తున్నాను. మా ఇరుగు-పొరుగున ఉండే ఒక వ్యక్తి మా తండ్రిని - "నీవు నీ కుమార్తెను సరిగ్గా సంభాళించు, అచ్చటికి పోనివ్వవద్దు" అని మందలించేవాడు. కాని అతడు మమ్మాను కలిసినప్పుడు మొత్తం అతని భావ-స్వభావాలన్నీ మారిపోయాయి.

అతడు 7 రోజుల కోర్సు కూడా తీసుకున్నాడు. చివరికి అతడే నా తండ్రితో ఇది "చాలా ఉత్కృష్టమైన జ్ఞానము. ఆమెను వెళ్ళనివ్వండి. నేను వీరి తల్లిని చూశాను. వారు చాలా గొప్ప వ్యక్తి. నీవు నీ బిడ్డతో పోట్లాడవద్దు. నీవు కూడా జ్ఞానము అర్థము చేసుకునేందుకు ప్రయత్నించు" అని చెప్పాడు. అతని మాటలతో మా తండ్రి పరివర్తనైపోయాడు. అప్పుడు వారు కూడా సేవాకేంద్రానికి వచ్చాడు. జ్ఞానము అర్థము చేసుకొని నన్ను బంధనముక్తముగా చేశాడు. మమ్మా స్మృతి మర్చిపోవడం మాకు అసంభవము ఎందుకంటే వారు చాలా గొప్పవారు. మమతా స్వరూపిణి పరోపకారిణి.

# కల్పక్రితపు ఆ కన్యవు నీవే ఎందుకు అవ్వరాదు

చాలా మంది స్త్రీ-పురుషులు తీర్థయాత్రలకు వెళ్తూ ఉండినారు. నేను కూడా వారిలో కలిసిపోయాను. వారు పరస్పరము ఇలా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. ఈ రోజు తప్పకుండా ఈశ్వరుని దర్శించే వాపసు రావాలి. పోతూ పోతూ వారు ఒక పర్వతాన్ని ఎక్కసాగారు. నేను కూడా వారితో పాటు పర్వతము పైకి ఎక్కసాగాను. పైకి ఎక్కి చూస్తే అక్కడ ఒక పెద్ద సభా గృహము ఉంది. అందులో ఒక బాల్కనీ కూడా కట్టబడి ఉంది. బాల్కనీ కనిపించకుండా ఒక పర్దా వేసి ఉన్నారు. మెల్లమెల్లగా ఆ పర్దా తొలగుతూ పోయింది. అక్కడ ధవళ(తెల్లని) వస్త్రాలు ధరించి వెంట్రుకలు విరబోసుకొని ఒక తేజోవంతమైన ముఖము కలిగిన మహిళ నిలబడి ఉంది. ఒక అలౌకిక ఆత్మిక ఆకర్షణ నాకు ఆ మహిళ పట్ల అనుభవమౌతూ ఉండినది. నేను వారి ముఖమండలాన్ని తదేకంగా చూస్తూ ఉండినాను. ఆ తేజోవంతమైన మహిళ అచ్చట ఉపస్థితమైన జనులందరికీ దృష్టినిస్తూ ఉండేది. మెల్ల మెల్లగా వారి దృష్టి నా దృష్టితో కలిసింది. నేను ఒక్కసారిగా అలౌకిక అతీంద్రియ ఆత్మిక సుఖ-శాంతులను అనుభవము చేస్తూ ఉండిపోయాను.

నేను బాహ్య స్మృతిని, నా ఉనికినే మర్చిపోయాను. కొంత సమయము తర్వాత ఆ దృశ్యము అదృశ్యమైపోయింది. యాత్రలో వచ్చిన స్త్రీ - పురుషులందరూ అరే! మనము ఇంత దూరము నుండి కష్టపడి నడుచుకుంటూ వచ్చి అలసి సొలసి దేవీ దర్శనము లేక ఈశ్వరుని దర్శనము అవుతుందని ఇచ్చటకు వచ్చాము. కాని ఇక్కడ ఏమీ లభించలేదు, ఆమె ఒక సాధారణ స్త్రీ - మొదలైన నిందలు చేస్తూ అందరూ వాపస్ మరలారు. వారి మాటలు విని ఆ దేవిని వీరు ఎందుకు నిందిస్తున్నారని మనస్సులో మనస్సులో బాధ కలిగింది. నాకు ఆ దేవి చాలా మంచి ఆత్మిక శాంతిని, సుఖాన్ని అనుభవము చేయించింది.

ఈ విధంగా అజ్మీర్ నుండి బ్రహ్మాకుమారీ రాధ అక్కయ్యగారు మాతేశ్వరీగారితో తమ సాకార అనుభవాన్ని, అవ్యక్త అనుభవాన్ని వినిపిస్తూ ఇంకా ఇలా కొనసాగించారు. ఇంతలో నా కనులు తెరుచుకున్నాయి, నా స్వప్నము కరిగిపోయింది. అప్పుడు సమయము తెల్లవారుఝామున 4 గంటలు అవుతూ ఉంది. అప్పటికి నా వయస్సు 10-12 సంవత్సరాలు. ఆ రోజు ఉదయము నుండే నాకు యథార్థంగా స్థిరమైన రూపములో ఈశ్వరుని మిలనము చేయాలనే

గాఢమైన కోరిక కలిగింది. అడవికి వెళ్ళి తపస్సు చేయాలనే సంకల్పము దృఢంగా మాటిమాటికి నాలో పెల్లుబుకుతూ ఉండినది. నేను ఉదయము సుమారు 9 గంటలకు అడవికి వెళ్లేందుకు నిశ్శబ్ధంగా ఇంటి నుండి వెలుపలికి వచ్చేశాను. కాని నేను నడుస్తూ ఉన్నప్పుడు నా చెవిలో ఎవరో ఇల్లు వదలి అడవికి వెళ్లడం వలన భగవంతుడు లభిస్తాడా? ఇప్పుడు చదువుకో, నీవు ఇంట్లో కూర్చునే భగవంతునితో కలిసే సమయము తప్పకుండా వస్తుంది అని చెప్పారు. ఈ ప్రేరణను పొంది నేను మళ్ళీ ఇంటికి తిరిగి వచ్చాను. మనోయోగముతో నా లౌకిక చదువులో పూర్తిగా నిమగ్నమైపోయాను.

### ఎవరిని స్వప్నములో చూచానో, వారిని నా ఎదుట చూశాను

ఇది 1960వ సంవత్సరములో జరిగిన విషయము. అప్పుడు నా 10వ తరగతి పరీక్షలు పూర్తి అయిపోయాయి. నా లౌకిక తండ్రి జైపూర్‌లో రైల్వే పోలీస్ ఆఫీసర్‌గా ఉండేవారు. ఆబురోడ్‌లో గల పోలీస్ స్టేషన్ వారి కార్యక్షేత్రములో ఉండేది. శెలవులైనందున నా సోదరుడు, నా తల్లి, మా అవ్వ గారింటికి వెళ్లారు. నేనింకా రెండు పరీక్షలు వ్రాయవలసి ఉంది. అందువలన నేను జైపూర్‌లో నా తండ్రి వద్ద ఉండిపోయాను. పరీక్షలు పూర్తి అయిన వెంటనే నా తండ్రి నాతో - నేను ఆబూరోడ్ పోలీస్ స్టేషన్ తనిఖీకి వెళ్తున్నాను, నీవు కూడా నా వెంటరా నీకు మౌంట్ ఆబూ చూపిస్తానని అన్నారు. ఆబూకు వచ్చిన పిదప ఆబురోడ్ పోలీస్ స్టేషన్‌లో పని చేయుచున్న ఒక పోలీస్ కుటుంబముతో పాటు నన్ను జీపులో ఆబుపర్వతము చూచేందుకు పంపించారు. ఆ పోలీసు సింధీ కులానికి చెందినవాడు. దిల్‌వాడా మందిరాన్ని చూసి వాపస్ వచ్చునప్పుడు పోకరణ గృహాము(ఇప్పటి పాండవ భవనము) ముందు జీపు ఆపి తన పరివారముతో పాటు నన్ను కూడా లోపలికి తీసుకెళ్ళాడు. పోకరణ గృహాము లోపలకు గేటు ద్వారా ప్రవేశించిన వెంటనే కుడిచేతి వైపు ఇప్పుడేదైతే చిన్న తోట, చల్లని నీటి సదుపాయము చేయబడి ఉందో అచ్చట ఆ సమయములో ఒక చిన్న టెంటు ఉండేది. అచ్చట 4-6 మూడాలు ఒక టేబుల్ ఉండేవి. టేబుల్ పై కొంత సాహిత్యము పడి ఉండేది. నాతో వచ్చిన ఆ పోలీసు గేటు





దివ్య ప్రకాశమును విరజిమ్ముతున్న సరస్వతి మాత

లోపలికి ప్రవేశిస్తూనే గంట మ్రోగించాడు. కొంత సమయము వరకు అచ్చటకు ఎవ్వరూ రాలేదు. నేను కూడా టెంటు నుండి వెలుపలికి వచ్చి నిలబడ్డాను. ఆ పోలీసు రెండవసారి మళ్లీ గంట మ్రోగించాడు. అప్పుడు

ప్రస్తుతము ఈషు దాది, ప్రకాశ్‌మణిదాది గార్ల ఆఫీసు ముఖ్య గేట్ ఉందో అక్కడ సింధీ ఫ్రాకు, సింధి పైజామా ధరించి నిలబడి ఉన్న ఒక మహిళ మా ముందుకు వచ్చి మమ్ములను చూస్తూ నిలబడింది. ఆ మహిళను చూస్తూనే నా చిన్నతనములో చూచిన స్వప్నము గుర్తుకొచ్చింది. వెంటనే అప్పుడు నా స్వప్నములో చూచిన నాకు దృష్టి ఇచ్చి అతీంద్రియ సుఖమును ఆత్మీయతను అనుభవము చేయించిన మహిళ వీరే అని నాకు స్పష్టంగా అర్థమయింది. నేను ఆ స్మృతుల దారములో బంధింపబడి ముందుకు సాగుతూ ఆ మహిళకు 7-8 అడుగుల దూరములో వెళ్లి నిలబడిపోయాను. వారు కూడా నన్ను తదేకంగా చూస్తూ దృష్టి ఇవ్వసాగారు. నేను ఒక్కసారిగా తేలికతనాన్ని అనుభవము చేయసాగాను. కొంత సమయము తర్వాత వారు నన్ను ఇలా పరామర్శించారు - "బిడ్డా! ఎలా ఉన్నావు? ఎక్కడ నుండి వచ్చావు ?" అప్పుడు నేను - "నేను మిమ్ములను నా చిన్నతనములో స్వప్నములో చూచాను. కాని ఈ రోజు సత్యంగా మెలకువలో మీతో కలుసుకుంటున్నాను. మిమ్ములను చూస్తున్నాను. ఓహో ఎంత భాగ్యము నాది! " అని అన్నాను. అప్పుడు వారు "ఎందుకు కాదు బిడ్డా, నీవు కల్పక్రితము నాతో కలిసిన అదే బిడ్డవు" అని అన్నారు. అప్పుడు నేను మీరెవరు? ఇది ఏ ఆశ్రమము? అని అడిగాను. అప్పుడు వారు "జమునా, ఓ జమునా..............." అని పిలిచారు. ఇంతలో మరొక మహిళ అదే విధమైన సింధి ఫ్రాకు పైజామా ధరించి అచ్చటకు వచ్చింది ఆ మహిళతో వారు ఇలా అన్నారు - "జమునా నీవు ఈ అమ్మాయి వెంట వెళ్ళి చక్కగా పరిచయమివ్వు, బాగా అర్థం చేయించు" అని చెప్పారు. ఈ మాటలు చెప్పి ఇప్పటి పాండవ భవనములో డిస్పెన్సరీ ఉన్న సందులోకి వారు(మమ్మా) వెళ్ళిపోయారు. జమునా దాది నన్ను టెంటులో కూర్చోపెట్టి సుమారు అర్థగంట సేపు నాకు అర్థం చేయించారు. అప్పుడు నా వయస్సు 16 సంవత్సరాలు. జమునా దాది అప్పుడున్న బ్లాక్ అండ్ వైట్(నలుపు-తెలుపుల) చిన్న చిత్రాలు నాకు చూపిస్తూ కల్పవృక్షము, త్రిమూర్తి చిత్రాలను చూపిస్తూ నాకు అర్థం చేయించారు. కాని నాకు ఏమీ అర్థం కాలేదు. ఎందుకంటే నా ధ్యాస



అంతా ఆ తేజస్వీ మహిళ స్మృతిలోనే లగ్నమై ఉంది. జమునా దాది ఆ కల్పవృక్షము, త్రిమూర్తి చిత్రము, మనుష్య మతానికి ఈశ్వరీయ మతానికి గల అంతరాన్ని తెలుపు ఒక రజిత(వెండి) రంగు కవరు గల ఒక పుస్తకాన్ని నాకు బహూకరించింది. నేను మళ్లీ నా తండ్రితో పాటు ఆబురోడ్ నుండి మా లౌకిక ఇంటికి తిరిగి వచ్చేశాను. నేను ఆ పుస్తకాన్ని చదివాను. అంతేకాక త్రిమూర్తి, కల్పవృక్షమును గురించి కూడా చదివాను. నేను వాటిని చూస్తూ ఉండిపోయాను. కాని నాకు ఏమీ అర్థము కాలేదు. నేను చిత్రాలను, పుస్తకాన్ని నా తండ్రికి ఇచ్చేశాను. సమయానుసారము నేను భక్తి చేసేదానిని. చాలా విధములైన యోగాలను కూడా నేర్చుకుంటూ మరోవైపు చదువుకుంటూ కూడా ఉండినాను. లోలోపల ఈశ్వర ప్రాప్తిని చేసుకోవాలన్న తపన కూడా నాలో తీవ్రమౌతూపోయింది.

### భక్తికి ఫలము ప్రాప్తి అయ్యే సమయము రానే వచ్చేసింది

నేను బి.ఎ పూర్తి చేసి ఎల్.ఎల్.బి ఫైనల్ సంవత్సరములోకి వచ్చాను. 1965వ సంవత్సరము అక్టోబరు నెల 10వ తేది మొట్టమొదటి సారి జయపూర్‌లోని తిలక్ నగరములో మా ఇంటి నుండి 7 ఇళ్ల అవతల ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ నూతన సేవాకేంద్రము ప్రారంభోత్సవము జరుగుతూ ఉండినది. దాని ఆహ్వానపత్రిక మా తండ్రి గారికి లభించి ఉండినది. వారు ఆ సమయములో పోలీస్ అధికారిగా ఉండేవారు. ఈ మధ్యకాలములో నా జీవితములో జరిగిన కొన్ని సంఘటనల వలన ఆస్తికురాలిగా ఉన్న నేను ఒక్కసారిగా నాస్తికురాలిగా మారిపోయాను(బహుశా నా భక్తి సమాప్తమయింది). మా తండ్రిగారు బ్రహ్మాకుమారీ సేవాకేంద్రము ప్రారంభమౌతున్నదనే విషయము నాకు తెలిపి నన్ను కూడా తన వెంట రమ్మని పిలిచారు. అందుకు నేను అచ్చటికి రానే రాను అని నా అనంగీకారాన్ని తెలియజేశాను. అంతేకాక ఇప్పుడు నాకు ధర్మము పై విశ్వాసము లేదు. నాకు ఇష్టము లేదు. నేను రాను అని కూడా చెప్పాను. కాని మా తండ్రిగారు చాలా ఫోర్సుగా చెప్పినందున వారిని

గౌరవించేందుకై నేను అయిష్టంగానే వారి వెంట ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్ళాను. అచ్చట ఈ సంస్థకు వ్యతిరేకులైనవారు కొంత గలాభా చేశారు. బ్రహ్మాకుమారీల సంస్థకు వ్యతిరేకంగా కొన్ని నినాదాలు కూడా చేశారు. అంతేకాక చిన్న చిన్న పుస్తకాలు కూడా అచ్చట చేరిన శ్రోతలకు పంచిపెట్టారు. నాకు బ్రహ్మాకుమారీ అక్కయ్యల ప్రవచనాలు చాలా నచ్చాయి. ఆ సమయములో గలాటా చేయువారు పుస్తకాలను పంచడం చాలా చెడుగా అనిపించింది. ఎలాగో ఒకలాగా కార్యక్రమము ముగిసింది.

రెండవ రోజు సాయంకాలము 6 గంటలకు నేను సేవాకేంద్రానికి వెళ్ళాను. అచ్చట తరగతి గదిలో ప్రదర్శింపబడిన చిత్రాలను చూడసాగాను. ఆ తేజస్వీమహిళ చిత్రము కూడా గోడ పై తగిలించబడి ఉంది. నేను ఒక్కసారిగా ఆశ్చర్యముతో అరే! వీరు నా స్వప్నములో కనిపించి ఆబూలో సాక్షాత్తుగా కనిపించిన తేజస్విని కదా అని రోమాంచితమై పులకరించిపోయాను. ఇంతలో బ్రహ్మాకుమారీ అక్కయ్య కోర్సు చేయించేందుకు వచ్చారు. నేను ఆ చిత్రము వైపు చూపించి ఇది ఎవరి చిత్రము? వర్తమాన సమయములో వీరు ఎక్కడ ఉన్నారు? అని అడిగాను. వారు మా జగదంబ సరస్వతి అమ్మగారు. యజ్ఞమాత అంటూ అచ్చట ఉన్నవారు క్లుప్తంగా పరిచయమిచ్చారు. నేను వింటూ వింటూ వారి పూర్తి పరిచయము పొందుకొని గద్గదమైపోయాను. వెంటనే నాకు సాప్తాహిక కోర్సు పూర్తి అవుతూనే తప్పకుండా ఆబూకు వెళ్ళి మమ్మాను కలుసుకొని వారితో పూర్తిగా జ్ఞానచర్చ చేస్తానని నాలో నేను ఆలోచిస్తూ ఉండిపోయాను.

పూర్తి పరిచయమిచ్చిన తర్వాత ఆ సంవత్సరమే వారు(జగదంబ) జూన్ 24వ తేదీ దేహ త్యాగము చేశారని తెలిపించారు. నేను ఒక్కసారిగా ప్రాణములేని బొమ్మ(హక్కి బక్కి) వలె నిలబడిపోయాను. ఇక నేను వీరితో ఎప్పుడూ కలుసుకోలేనా? అని ఆశ్చర్యముతో అడిగాను. మమ్మా నుండి విడిపోయినందుకు నాకు అత్యంత దు:ఖము కలిగింది. కాని మరో



క్షణములోనే ఆబూ పర్వతములో వారి దృష్టి నుండి లభించిన అలౌకిక సుఖ-శాంతుల అనుభూతులలో నన్ను నేను మర్చిపోయి అందులో లీనమైపోయాను.

## సూక్ష్మముగా ఉన్న శాశ్వతమైన ఆధారము

అదే రాత్రి నేనొక స్వప్నము చూచాను. అందులో ఒక బంగారు నిచ్చెన ఆకాశము వరకు చాలా ఎత్తుగా వేయబడి ఉంది. నేను ఒంటరిగా ఆ బంగారు నిచ్చెన ఎక్కి పైకి పోతూ ఉన్నాను. పైకి ఎక్కుతూ ఎక్కుతూ నేను శిఖరము పైకి చేరుకున్నాను. ఆ శిఖరము పై చాలా చాలా కొద్దిగా మాత్రమే జాగా ఉండినది. పట్టుకొని పైకి వెళ్లేందుకు ఏ ఆధారము కూడా అచ్చట లేదు. ఏ ఆధారము పట్టుకోకనే నేను శిఖరము పైకి వెళ్ళి నిలబడి నలువైపులా చూస్తూ ఉండిపోయాను. ఇంతలో భయంకరమైన పెనుగాలులు వీస్తూ తుఫాను ప్రారంభమై ఆ నిచ్చెన అటు-ఇటు జోరుగా కదలసాగింది. నేను ఒక్కసారిగా గాభరాపడి ఆధారము కొరకు వెతుకుతూ దేనిని పట్టుకోవాలి అని చుట్టూ చూడసాగాను. ఇలా ఆలోచిస్తూ ఉండగానే ఆకాశములో పై భాగములో మమ్మా నిలబడి బిడ్డా! ఏ ఆధారము కొరకూ వెతకవద్దు. ఒక్క శివబాబాను మాత్రమే స్మృతి చేస్తే చాలు. వారే నీకు సత్యమైన ఆధారము అని పలికారు. బిడ్డా! జీవితములో సత్యంగా నడచుకోవడంలో చాలా పెనుగాలులు, తుఫానులు మొదలైనవి వస్తాయి కాని గాభరా పడరాదు. ఒక్క శివబాబా స్మృతిలో ఉండాలి. బాబా చేతిని తోడును ఎప్పుడూ వదలరాదు. చివరి సమయములో సత్యమే జయిస్తుంది. ఈ పెనుగాలులు, తుఫానులు సమాప్తమై శాంతమైపోతాయి. మమ్మా ఈ మాటలు చెప్పి అదృశ్యమైపోయింది. నేను శివబాబా - శివబాబా అంటూ స్మృతి చేయసాగాను. శివబాబా ఒక్క మీరు మాత్రమే నాకు సత్యమైన ఆధారము. మీరొక్కరుంటే చాలు అని స్మృతి చేస్తూ ఉండిపోయాను. గాలి, తుఫానులు అన్నీ నిలిచిపోయాయి. నా కనులు వాటంతకవే తెరవబడి చూశాను కదా - నేను నా గదిలో హాయిగా పడుకుని ఉన్నాను.

నేను మళ్లీ కళ్ళు మూసుకొని నిదురించేందుకు ప్రయత్నించాను. కనులు మూసుకొని ఉన్నా నా గది అంతా తెల్లని ప్రకాశంతో నిండిపోయి ఎవరో నా తల పై చాలా ప్రీతిగా తమ చేతితో నిమురుతున్నట్లు అనుభవమౌతూ ఉంది. నేను కనులు మూసుకునే ప్రక్కకు తిరిగి తలగడ వైపు చూచాను. మమ్మా నా తలగడ వైపు కూర్చుని నన్ను చాలా ప్రీతిగా చూస్తూ ఉండినారు. నేను మమ్మాతో అన్నాను - "మమ్మా మీరు ఎందుకు త్వరగా వెళ్ళిపోయారు? నేను మీతో పొందుకోవలసింది చాలా ఉండిపోయింది." అప్పుడు మమ్మా అన్నారు - "బిడ్డా! నేను ఎచ్చటికీ వెళ్లలేదు. నీ చెంతనే ఉన్నాను. నీకు ఎప్పుడు అవసరమున్నా సదా సూక్ష్మంగా నీకు సహాయము అందిస్తూనే ఉంటాను. బిడ్డా! మాయ చాలా తీవ్రంగా వస్తుంది. పరీక్షలు వస్తాయి కాని బాబా చేయిని ఎప్పటికి వదలరాదని గుర్తుంచుకో. బాబా నీ ద్వారా చాలా సేవ చేయించుకుంటారు." ఈ మాటలు చెప్పి మమ్మా నా తల పై చేతితో నిమురుతూ ఉండినారు. నన్ను నిదురింపజేసేందుకా అన్నట్లు నిమురుతూ ఉండగా నాకు తెలియకుండానే గాఢమైన నిద్రలోకి జారిపోయాను. ఉదయము నిదురలేచిన వెంటనే మమ్మా నాకు చెప్పిన మాటలు. రాత్రి నేను చూచిన స్వప్నము పూర్తిగా గుర్తుకు వచ్చింది. రాత్రి జరిగినదంతా కలనా? నిజమా? అని ఆలోచించసాగాను. నిజంగానే నా జీవితములో మమ్మా చెప్పినట్లు అనేక పరీక్షలు పెనుగాలులు, తుఫానులు వచ్చాయి. కాని ఒకే బలము, ఒకే నమ్మకము, ఒకే శివబాబా స్మృతిలో ఉండినందున అన్నీ దాటుకున్నాను. ఇంకా దాటుకుంటూ ఉన్నాను. నా స్థితి అచలంగా, స్థిరంగా, నిర్భయంగా తయారయ్యింది. మమ్మా శిక్షణలు ఇప్పటికీ గుర్తున్నాయి. ఇక మీదట కూడా గుర్తు వస్తూ ఉంటాయి.

## భక్తులకు, పిల్లలకు కూడా సాక్షాత్కారము చేయించే జగదంబ తల్లి

మహారాష్ట్రలోని బురహాన్‌పురము నుండి బ్రహ్మాకుమారి సుధా అక్కయ్యగారు తమ అనుభవాన్ని ఈ విధంగా వ్రాస్తున్నారు - నా లౌకిక జన్మ అమృత్‌సర్‌లో ఒక సంపన్న ధార్మిక కుంటుంబములో జరిగింది. 8 సంవత్సరముల చిన్న వయస్సులోనే నాకు జ్ఞానము లభించింది. అప్పటి నుండి నాకు అనేక సాక్షాత్కారాలు జరుగుతూ ఉండేది. బాల్యము నుండే నాకు బాబా పై, యజ్ఞము పై చాలా ప్రేమ ఉండేది. యజ్ఞములోకి చిన్న చిన్న కానుకలు పంపించేదానిని. ప్రీతిగా బాబా-మమ్మాలకు జాబులు కూడా వ్రాసేదానిని బాబా - మమ్మాలు దానికి బదులుగా చాలా ప్రియమైన స్మృతులు, బహుమతులు, లేఖలు మొదలైనవి పంపేవారు. ఈ బిడ్డ ఎవరో బాబాను చూడకున్నా బాబా పై ఇంత ప్రేమ కలిగి ఉంది! అని అనేవారు. చివరికి నేను మధువనము, పావనధామములోకి చేరుకునే రోజు వచ్చేసింది, బాబా-మమ్మాలతో కలిశాను నేను దృష్టి తీసుకుంటూ తీసుకుంటూ ధ్యానములోనికి వెళ్ళిపోయాను. అప్పుడు ఈ బిడ్డ కల్పక్రితపు బిడ్డ, ఇపుడు బాబా వద్దకు వచ్చేసింది అని బాబా అన్నారు.

### శక్తి  స్వరూపిణి దుర్గమ్మ(దుర్గా మా)

మమ్మాను చూడగానే వారి శక్తి స్వరూపము తేజస్విని స్వరూపము, మాతృ ప్రేమ నన్ను చాలా ఆకర్షించేది. వారు పవిత్రతా మూర్తి. ధైర్యము, గంభీరత కలిగి ఉండి బాబా ప్రతి అడుగును అనుసరించే సింహాశక్తి స్వరూపిణిగా అనుభవమయ్యేది. భక్తిమార్గములో నేను దుర్గాస్తుతి స్తోత్రాన్ని చదివేదానిని. అంతేకాక నవరాత్రులలో 9 రోజులు వ్రతమును ఆచరించేదానిని. మమ్మా నాకు సదా దుర్గా రూపములో కనిపించేవారు. వారు సదా నాలో శక్తి నింపేవారు. నా లౌకిక మేనమామగారి ఆహ్వానము పై మమ్మా ఢిల్లీకి వచ్చినప్పుడు అచ్చట వారి జతలో ఉండే సౌభాగ్యము లభించింది. మమ్మా కన్యలలో శక్తి నింపి ఇలా చెప్పేవారు - శివబాబా పేరు ప్రసిద్ధము చేసే శక్తులుగా, సేవాధారులుగా అవ్వండి. ఈ మాటలు



జగత్తును హర్షింపజేసే తల్లి జగదంబ

విని కన్యలందరికి చాలా నషా పెరిగేది.

ఒకసారి మమ్మా ఢిల్లీకి వచ్చారు. చాలా ధూమ్‌ధామ్‌గా (వైభవోపేతముగా) వారికి స్వాగతము పలికారు. ఒక సోదరుడు కొబ్బరి బొండాల పై వెండితో నగిషీ పని చేసి వాటి మాలను తయారుచేసి మమ్మా కంఠానికి అలంకరింపజేశారు. అంతేకాక "నీవే జగదంబవు, కపాలధారి కాళికాదేవి నీవే..........." అనే పాట కూడా వినిపించారు. మమ్మా ఆ సోదరునికి దృష్టినిస్తూ ఉండినారు. మమ్మాగారి ఆ స్వరూపము చాలా శక్తిశాలిగా ఉండినది. ఆ సోదరుడు మమ్మాకు సమీపంగా పోవాలని మనసులో అనుకుంటూ ఉండినాడు. మమ్మా అన్నారు - "బిడ్డా! తల్లిని గుర్తించావా? తల్లి కాళికాదేవి! తల్లితో ఎవరు కలుసుకోగలరు? ప్రపంచము చూడాలనుకుంటే చూడండి అంతేకాని తల్లిని శరణుజొచ్చి మళ్లీ మాయ శరణులోకి పోరాదు. అలా చేస్తే చాలా పాపము నెత్తికి ఎక్కుతుంది." అతడు వెక్కి వెక్కి ఏడుస్తూ మమ్మాతో - మమ్మా ప్రపంచాన్ని చూచాను.



మాయను కూడా చూచాను. ఇప్పుడు నేను మీ బిడ్డను, మీ బిడ్డగానే ఉంటాను అని అనసాగాడు."

### హృదయానికి విశ్రాంతినిచ్చే దయామయి తల్లి

మమ్మా బాగా కాచి చల్లార్చిన నీరు త్రాగేవారు ఒక రోజు మధ్యాహ్నము బట్టలు ఉతుక్కుంటున్న సమయములో నీరు కాగుతూ ఉన్నాయి. ఎప్పుడు చల్లారుతాయి? అని జ్ఞాపకము వచ్చింది నేను లేచి నీరు చల్లార్చేందుకు వెళ్ళునప్పుడు చేయి జారి పాత్ర కింద పడిపోయింది. బాగా తెర్లుతున్న నీరంతా నా కాళ్ళ పై పడ్డాయి. జమునా దాది నన్ను పైకి లేవనెత్తి ఆవనూనె, ఉప్పు మొదలైనవి పట్టించారు. మంట చాలా ఎక్కువగా ఉండినది. కాని నేను బాబా స్మృతిలో శాంతిగా ఉన్నాను. అందరూ ఇది చూస్తూ ఉన్నారు. ఈ విషయము మమ్మాకు తెలిసింది. మమ్మా వచ్చి నా తలను తన ఒడిలో ఉంచుకొని నీవు పుష్పాల్(లౌకిక తల్లి) బిడ్డవైతే ఏడ్చేదానివి కాని నీవు మమ్మా బిడ్డవు కదా. అందుకే నీవు బాబా స్మృతిలో శాంతిగా ఉన్నావు అని అన్నారు.

### అడిగి తీసుకున్నది నీటికి సమానము,
### అడగకుండా లాక్కునేది రక్త సమానము

మమ్మా అమృత్‌సర్‌లో కొన్ని రోజులు ఉన్నప్పుడు కన్యలందరము మమ్మాను వారి అనుభవము వినిపించమని అడిగాము. అప్పుడు మమ్మా తనను గురించి ఇలా తెలిపారు, "నేను ఒక్క సెకండులో నా జీవితము గురించి నిర్ణయము తీసుకున్నాను. నాకు బాబా పైన కాని, బాబా కర్తవ్యమును గురించి గాని, శ్రీమతమును గురించి గాని, ఈశ్వరీయ జ్ఞానము గురించి గాని మొదలైన ఏ విషయములోనూ ఎప్పుడూ సంశయము రానే లేదు. బాబావారిగా అయిన పిదప నేను ఎప్పుడూ దుఃఖములో కన్నీరు కార్చలేదు. అమృతవేళ ఎప్పుడూ 2 గంటల తర్వాత నిదురించలేదు."

నేను బటాలాలో ఉన్నప్పుడు ఒకసారి మమ్మా నా వద్దకు వచ్చారు.

సోదరీలందరూ అక్కడకు వచ్చారు. మమ్మా సేవ చేసేందుకై వారిలో బలము నింపి సేవ చేసే ఆసక్తి ఉండాలని చెప్పారు. మాటిమాటికి నోటి పై చేయి ఉంచుకొని "నేను కాళికను, దానంతకదే యాచించకుండా లభించేది క్షీర సమానము, అడిగి తీసుకుంటే జల సమానము, లాక్కుంటే అది రక్త సమానము అని చెప్పారు. "

### దేహ త్యాగము గురించిన పూర్వ భాసన (ముందుగానే తోచుట)

కొంతకాలము నుండి మమ్మాగారి ఆరోగ్యము చాలా చెడిపోయి ఉంది. నేను మమ్మాను వారి గదిలో కలిశాను - బాబా కుర్చీలో కూర్చుని ఉండినారు. ఇతరులు కూడా మమ్మా నుండి దృష్టి తీసుకునేందుకు ఆమె వద్దకు వెళ్ళారు. మమ్మాగారికి చాలా కష్టంగా ఉన్నా వచ్చిన వారందరికీ మామిడి పండ్లు ఇచ్చారు. బాధగా ఉండినా మమ్మాగారి ముఖము హర్షితంగా ఉండినది. నేను మధువనము నుండి వాపసు వచ్చాను. ఆ రోజు జ్వరంగా ఉండినది. రాత్రి 3 గంటలకు నిదురలో ఇలా చూచాను - ఆఫీసు ముందు నిలబడి మమ్మా బాబా నుండి దృష్టి తీసుకుంటూ ఉండినారు. కనుల నుండి ప్రేమాశ్రువులకు ప్రవహింపచేస్తూ బాబాతో మిలనము చేస్తూ ఉండినారు. నా మనసులో మమ్మా ఆరోగ్యము బాగైపోయింది. చాలా రోజుల తర్వాత బాబాతో కలుస్తూ ఉందనిపించింది. నేను క్లాసులో అందరికీ మమ్మాను కలుసుకునేందుకు మధువనానికి వెళ్తున్నానని చెప్పాను. ఆ రోజు సాయంకాలము మమ్మా అవ్యక్తమైపోయినట్లు ఫోన్ వచ్చింది అనగా మమ్మా శరీరము వదిలేందుకు ముందు చాలామందిని అవ్యక్త రూపములో కలిశారని అర్థము చేసుకున్నాను. చాలామంది మమ్మా గాలిలో ఎగిరిపోవడం చూచారు. అంతేకాక చాలామంది భక్తులకు జగదంబ విగ్రహము నుండి ధవళ వస్త్రధారి విరబోసుకున్న వెంట్రుకలు గలవారి సాక్షాత్కారము జరిగింది. అనగా భక్తులకు కూడా సాక్షాత్కారము చేయించారు. పిల్లలను కూడా అవ్యక్తంగా కలిసి వతనానికి వెళ్ళిపోయారు.

## ఏ అంబా మాతను ప్రపంచమంతా పిలుస్తూ ఉందో, ఆ తల్లిని నేను చూచాను

వర్తమాన సమయములో ప్రపంచము ఓ తల్లీ! అంటూ ఏ జగదంబను పిలుస్తూ ఉన్నారో రాత్రుళ్ళు జాగరణ చేస్తూ ఎవరిని ప్రార్థన చేస్తూ ఉన్నారో, ఆ తల్లిని నేను స్థూల కనులతో చూశాను, తెలుసుకున్నాను, గుర్తించాను, వార్తాలాపము చేశాను, దృష్టి తీసుకున్నాను అంతేకాక పాలన కూడా పొందాను. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల నుండి బ్రహ్మాకుమారి ఉమా బెహన్ తమ అనుభవాన్ని వినిపిస్తూ పైన తెలిపినట్లు అన్నారు. అంతేకాక వారు ఇలా చెప్తున్నారు - నేను మొట్టమొదట 1964వ సంవత్సరములో మమ్మాగారిని కలిశాను. అప్పుడు నా వయస్సు 18 సంవత్సరాలు. నేను జ్ఞానము వినేందుకు నా ఇంటి నుండి సెంటరుకు ప్రతి రోజు వచ్చేదానిని. మమ్మా 15 రోజులు అమృత్‌సర్‌లో ఉండేందుకు రానున్నారని తెలిసింది. మమ్మా వచ్చినప్పుడు వారి నుండి దృష్టి తీసుకున్నప్పుడు నా ఆత్మలో శక్తి నిండుతూ ఉందని అనుభవమయింది. మనస్సు ఖుషీగా ఊగసాగింది, తప్పిపోయిన నా తల్లి లభించినట్లు నాకు అనుభవమయ్యింది. వాస్తవానికి మమ్మా జగత్తు అంతటికి తల్లి. వారిలో అనంతమైన ప్రేమ, అనంతమైన దృష్టి ఉండేది. ఆ సమయములో మమ్మా నన్ను తన వద్దకు పిలిచి బిడ్డా! సేవ చేస్తావా? సెంటరులో ఉంటావా? అని నన్ను అడిగారు. అప్పట్లో సెంటరులో ఉండడం నాకు ఇష్టము లేదు. ఇంటి నుండి వచ్చి పోతూ ఉంటేనే బాగుందని అనుకునే దానిని. కాని మమ్మాగారి ఈ మాటలలో ఎంత ఆత్మీయత, మధురత, ప్రేమ ఉండినవంటే మమ్మాతో నేను రానని చెప్పలేకపోయాను. మమ్మా మీరు ఎలా చెప్తే అలాగే చేస్తానని అనేశాను. ఆ రోజు నుండి మమ్మా నన్ను 15 రోజులు తమ జతలోనే ఉంచుకున్నారు. ఈ 15 రోజులలో నేను - మమ్మా ప్రతి రోజు అమృతవేళ 2 గంటలకే నిదురలేచి బాబాను స్మృతి చేసేవారు. వారి జతలో ఉండినంత కాలము నేను ఈ ప్రపంచాన్నే మర్చిపోయాను. నాకు సంతోషాలతో నిండిన జీవితము లభించింది.

## మధురభాషిణి శారదాంబ

మమ్మాగారి వాణి ఎంత సరళంగా, మధురంగా, ఆసక్తికరంగా ఉండేదంటే ఆ వాణి విని మా ఆలోచనలే పరివర్తనైపోయాయి, మా జీవితమే పరివర్తనైపోయింది. వారి వలె తయారవ్వాలనే ప్రేరణ లభించింది. మమ్మాలో పరిశీలనాశక్తి నిర్ణయశక్తి చాలా తీవ్రంగా ఉండేది. మమ్మా నన్ను పరిశీలించి ప్రేమనొసగి సమర్పణ చేసేశారు.




విమానము ఎక్కుతూ మాతేశ్వరిగారు



నేను మమ్మాను చూసినప్పుడు వారు నాకు తెల్లని వస్త్రాలు ధరించిన అష్టభుజధారిగా కనిపించారు. తర్వాత రంగు వస్త్రాలలో సింహము పై సవారి అయ్యి ఉన్న జగదంబ రూపము కనిపించింది. మమ్మాలో చాలా ఆత్మీయత ఉండేది.

## దృష్టి ద్వారా జీవన సృష్టిని రచించేవారు

మమ్మాగారి నిర్ణయశక్తి చాలా అమోఘము(గురి తప్పనిది). చంద్రమణిదాదీ ఇలా అనేవారు - చూడు మమ్మా ఈ కన్యలు(నేను, నా చిన్న చెల్లెలు) సెంటరులో ఉండేందుకు తయారుగా లేరు, చాలా మంచివారు, వీరికి జ్ఞానము కూడా బాగనిపిస్తుంది. ప్రతి రోజు క్లాసుకు కూడా వస్తారు. కాని సెంటరులో ఉండేందుకు ఒప్పుకోవడం లేదు. మీరైనా చెప్పండి. మమ్మా మాకు దృష్టినిచ్చి ఒక్క క్షణములోనే పరిశీలించి ప్రేమతో పాలననిచ్చి బాబాకు మమ్ములను సమర్పణ చేసేశారు. ఈ కన్యలు ప్రేమగా పాలన చేయడం ద్వారానే సమర్పితమవుతారని వారికి తెలుసు. ఈ ఆధారముతోనే మమ్మా చాలా ప్రేమను, మురిపెమును ఇచ్చి మమ్ములను పరివర్తన చేసేశారు.

మమ్మా విద్యాదాయిని సరస్వతి అయినప్పటికీ చిన్న చిన్న పిల్లలకు కూడా చాలా గౌరవమునిచ్చేవారు. చాలా సరళము అనగా నిరహంకారిగా ఉండేవారు. మా తల్లి జగదంబ సరస్వతి ఇలా ఉండేవారు.

# మాతేశ్వరి గారు విద్యా దేవిగా ఉండినా అత్యధిక శ్రద్ధ గల ఒక విద్యార్థిని

నాగ్‌పూర్ నుండి బ్రహ్మాకుమారి పుష్పా బెహన్‌జీ ఇలా అంటున్నారు - ఈశ్వరీయ సంతానమైన వెంటనే అన్నింటికంటే మొట్టమొదటి కర్తవ్యము - ఈశ్వరీయ చదువు. ఎందుకంటే బాబా మనకు పరమపిత పరమాత్మయే కాక పరమ శిక్షకులు కూడా. మమ్మాకు అన్నిటికంటే ఎక్కువగా చదువు పై గమనముండేది. బాబా మురళి వినిపించునప్పుడు మమ్మా ధ్యానముంచి మురళి వినేవారు. ఒక ఛాత్రక విద్యార్థి వలె విద్య కొరకు తన టీచరు చెప్పేది ఎంతో గమనముతో ఎలా వింటాడో, అంత గమనముంచి మమ్మా వినేవారు. చివరివరకు మమ్మా చదువు పై పూర్తిగా గమనముంచారు. చివరి సమయములో మమ్మా శారీరిక స్థితి ఎంత నాజూకుగా (సీరియస్‌గా) ఉండేదంటే ఒక నిముషము స్థిరంగా కూర్చోవడం కూడా చాలా కష్టంగా ఉండేది. కాని యోగులు ప్రకృతిజీతులుగా ఉంటారని అంటారు కదా. అటువంటి యోగిని స్వరూపాన్ని నేను మమ్మాలో ప్రాక్టికల్ (వాస్తవికము)గా చూచాను. చివరిరోజు వరకు కూడా వారు బాబా మురళి మిస్ చేయలేదు. మమ్మా క్లాసుకు రాలేకపోయినా మైకు కనెక్షన్ మమ్మా గారి గదిలోకి ఇవ్వబడింది. సాధారణంగా ఎవరికైనా ఆరోగ్యము బాగలేకుంటే బెడ్(మంచము) పై పడుకొని మురళి వింటారు లేక చదువుకుంటారు. కాని మమ్మా ఎప్పుడూ అలా చేయలేదు. ఈ మురళి మన చదువు అని మమ్మా అనేవారు. ఈ చదువును చదివించేదెవరు? పరమ శిక్షకులైన పరమాత్మ. అందువలన మనము ఈశ్వరీయ విద్యను విద్యార్థుల రూపములో చదువుకోవాలి అని మమ్మా అనేవారు. కావున మమ్మా నియమానుసారము తయారై మంచము పై దిండు సహాయముతో కూర్చుని మురళి వినేవారు. ఆరోగ్యము ఎంత పాడైపోయినా ఒక గంట సమయము మమ్మా కూర్చుని మురళి వినేవారు. మన ఈశ్వరీయ విద్యార్థులకిది ఒక మహోన్నతమైన ఉదాహరణ.

భలే మమ్మా కుమారీ అయినా గంభీరంగా, నిర్భయంగా ఉండేవారు.



మమ్మాలో ఫలానా మంచి గుణము లేదని మాకు అనిపించనంతగా ప్రతి గుణము మమ్మాలో కనిపించేది మమ్మా సర్వ గుణాల సంపన్నమూర్తిగా ఉండేవారు. ఆమె స్వయం ఎలాగైతే గుణమూర్తిగా ఉండేవారో, అలా యజ్ఞములోని పిల్లలందరూ గుణమూర్తులుగా అవ్వాలని కోరుకునేవారు. ఎలాగైతే ఒక మంచి తల్లి తన పిల్లలను చక్కగా అలంకరించి, మంచి బట్టలు తొడిగి, మంచి మాటలు నేర్పించి పిల్లలను వారి తండ్రి వద్దకు పంపుతుందో లేక తీసుకుపోతుందో, అలా మమ్మా కూడా యజ్ఞములోని పిల్లలందరినీ గుణాలతో అలంకరించి బాబా ముందుకు తీసుకెళ్ళేవారు.

ఒకవేళ ఎవరైనా తప్పు చేస్తే లేక ఎవరైనా ఏమైనా అంటే మమ్మా వారి పై ఎంత ప్రేమ చూపేవారంటే వారంతకు వారే వచ్చి తమ తప్పును ఒప్పుకునేవారు అప్పుడు మమ్మా ప్రేమగా వారి తప్పులను సరిదిద్దుకునే యుక్తులు తెలిపేవారు. సదా పిల్లల తప్పులను మమ్మా తన తప్పులుగా భావించి వారిని సరిదిద్దేందుకు శ్రమ చేసేవారు. మమ్మా ఎల్లప్పుడూ ఇలా అనేవారు - మీరు అసలైన మేలిమి బంగారమే కాని మీలో కొద్దిగా ఉన్న ఆ మలినాన్ని తీసేస్తే మీరు సత్యమైన బంగారుగా అయిపోతారు. ఈ విధంగా మమ్మా చాలా ప్రేమతో శిక్షణనిచ్చి లోపాలను గ్రహింపచేసేవారు.

ఒక రోజు క్లాసు ముగిసిన తర్వాత చేంబర్‌లో మమ్మా-బాబా ఇరువురు కూర్చుని ఉండినారు. ముఖ్యంగా కన్యలను చూచి బాబా చాలా సంతోషించేవారు. ఆ రోజు 6-7 మంది చిన్న కన్యలు బాబా సమ్ముఖములో కూర్చుని ఉండినారు. ఒకసారి బాబా చూచి బచ్చీ, ఈ రోజు మీరు వంట చేయగలరా? అని అడిగారు. ఆ సమయములో మధునంలో 200 మంది సోదరీ-సోదరులున్నారు. నిజానికి మాలో ఎవ్వరికీ వంట చేయడం రాదు. ఎందుకంటే అందరూ పాఠశాలలో చదువుకునేవారము. బాబా చెప్పారు - మీరు ఈ రోజు భోజనము తయారు చేయండి. మమ్మా-బాబాలు పిల్లలకు భోజనము తినిపిస్తారు. మేము చాలా ఖుషీ ఖుషీగా అవును బాబా! మేము భోజనము తయారుచేస్తాము అని చెప్పాము. మేము భోజనము తయారు చేసేందుకు భోలీ దాదీ వద్దకు వెళ్లి బాబా మమ్ములను భోజనం తయారు



విమానము ఎక్కుతూ మాతేశ్వరిగారు

చేయమని చెప్పారు, మీరు మేము కలిసి భోజనము తయారు చేస్తాము అని చెప్పాము. బాబా చెప్పిన అనుసారంగా భోజనము తయారు



చేసేందుకు ఈ పిల్లలు ఖుషీగా వెళ్ళినారు, కాని వీరికి భోజనము తయారు చేయడం రాదు అని మమ్మా ఆ రోజు తమ పనులన్నీ ఒకవైపు పెట్టి మాతో వంట చేసేందుకు కిచెన్(వంటగది)లోకి వచ్చేశారు. భోజనము పూర్తిగా తయారయ్యే వరకు మమ్మా కిచెన్‌లోనే ఉండినారు. అప్పుడు మమ్మా బియ్యము కడిగే పద్ధతి నుండి పప్పు తయారుచేసే వరకు నేర్పించారు. ఎందుకంటే మాకు కనీసము పెనములో ఎంత నూనె వేయాలి, నూనెలో మొదట ఏది వేయాలి, చివర్లో ఏది వేయాలో ఏమీ తెలియదు. భోజనము చేసే పద్ధతిని మమ్మా మాకు పూర్తిగా నేర్పించారు. భోజనము ఎంత రుచిగా తయారయ్యిందంటే బాబా చాలా సంతోషించారు. మమ్మా-బాబా ఇరువురు స్వయంగా యజ్ఞములోని పిల్లలందరికి తినిపించారు. మేమందరము కూడా చాలా సంతోషించాము. ఈ విధంగా మమ్మా పిల్లలందరికీ అన్ని విధాలైన సేవలు ఎలా చేయాలో నేర్పించి అందరినీ యోగ్యులుగా తయారు చేసేవారు.

# ఒకే ఒక ప్రకాశ కిరణము నా జీవిత లక్ష్యమునే పరివర్తన చేసేసింది

ప్రతి ఒక్కరి జీవితములో భిన్న-భిన్న స్వభావ సంస్కారాలు గల వ్యక్తులు, సంబంధ-సంపర్కములోకి వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు. కాని అప్పుడప్పుడు కొంతమంది మన జీవితము పై చెరగని ముద్ర వేసే గొప్పవారు తటస్థపడుతూ ఉంటారు, 1964 సంవత్సరములో మాతేశ్వరిగారు నా జీవితములో ప్రవేశించి సదా కొరకు నన్ను తనవారిగా చేసేసుకున్నారు.


పై తెలిపిన అనుభవాన్ని వినిపిస్తూ బొంబాయిలో సాయన్ సేవాకేంద్రము నుండి బ్రహ్మకుమారి సంతోష్ బెహన్‌గారు ఇలా అంటున్నారు - బొంబాయిలో మమ్మాగారు సేవార్థము వచ్చినప్పుడు నేను మొట్టమొదటసారి చూశాను. మమ్మాగారి శీతలమైన గంభీరమూర్తిని చూస్తూనే సాక్షాత్తు సరస్వతి దేవిని చూస్తున్న అనుభూతి కలిగింది. మమ్మాగారి ఒకే ఒక మెరుపు, ఒకే ఒక ప్రకాశ కిరణము నా జీవిత లక్ష్యమునే మార్చి వేసిందనే అనుభూతి నాకు కలిగింది. అవ్వాలంటే మమ్మాలాగ తయారవ్వాలి, మమ్మా సమానంగా అవ్వాలి, జీవించాలంటే మమ్మాలాగా విశ్వ సేవకై జీవించాలి అని అనిపించింది. మమ్మా ముఖములోని పవిత్రతా ప్రకాశము నన్ను ఎంత ప్రభావితము చేసిందంటే నేను అచేతనంగా ఉండి నన్ను నేను మర్చిపోయి అలాగే చూస్తూ ఉండిపోయాను. మమ్మాగారి మధుర మాటలు మళ్లీ నాలో చైతన్యము కలిగించాయి. సంతోష్ అనేది కేవలం పేరే కాదు సంతోషము చాలా గొప్ప గుణము చాలా గొప్ప ఖజానా. దానిని మీరు పరమాత్మ ద్వారా పొందవచ్చు. నా లౌకిక తల్లి నా శరీరానికి సంతోష్ అని నామకరణము చేశారు, కాని అలౌకిక తల్లి ఆత్మనైన నాకు సంతుష్టత వరదానమునిచ్చి సంతుష్టమణిగా చేసేశారు.

## పరమ త్యాగి, పరమ తపస్విని

మమ్మాను చూస్తూనే వారు ఒక తపస్విని, త్యాగమూర్తి అని అనుభవమయ్యేది. మమ్మా వెంటనే దానమిచ్చి మహాపుణ్యాన్ని జమ చేసుకునేవారు. బృజ్‌ఇంద్ర దాదీ దీనికొక ఉదాహరణాన్ని వినిపించారు.



ఒకసారి సింద్ హైదరాబాద్‌లో ఒక ఆఫీసర్ బ్రహ్మబాబాను కలుసుకునేందుకు వచ్చారు. ఎందుకంటే జనుల మనసులో కొన్ని విషయాలు తప్పుగా ధారణ అయ్యి ఉండినవి. అదేమంటే బ్రహ్మబాబా మాతలను, కన్యలను ఇల్లు-వాకిళ్ల నుండి దూరము చేసి జాదు(మంత్రము) చేస్తారని, మొదలైన రకరకాల ఆపోహాలుండేవి. బాబా ఆ ఆఫీసరుకు ఇలా అర్థం చేయించారు - చూడండి నేను ఈ పిల్లలకు ఏమిస్తున్నాను? శరీర శృంగారానికి నగలివ్వడము లేదు, ధరించేందుకు మంచి వస్త్రాలు కూడా ఇవ్వడం లేదు. వీరికి నగలు, దుస్తుల కంటే శ్రేష్ఠమైన జ్ఞాన శృంగారము లభిస్తుంది. ఆ జ్ఞానము ద్వారా వీరికి ఆత్మిక సుఖము లభిస్తుంది. ఈ కారణంగా వీరు భౌతిక సుఖాలను త్యాగము చేసి ఆత్మిక సుఖము వైపు పరుగెత్తి వస్తున్నారు. ఈ వార్తాలాపము మమ్మా, బ్రిజేంద్రదాదీ బయట తోటలో తిరుగుతూ విన్నారు. మమ్మా అన్నారు - బ్రిజేంద్రా, బాబా మనలను గురించి ఏమి చెప్తున్నారో విన్నావా? కాని మనము ఇంతవరకు ఈ వినాశి నగలను ధరించి ఉన్నాము. అప్పుడు మమ్మా కూడా కొన్ని నగలు ధరించి ఉండినారు. బ్రిజేంద్ర దాదీకైతే లౌకిక



కరాచీ - మాతేశ్వరిగారితో బృజేంద్ర దాదీ, ఆ వైపు యజ్ఞ వత్సలకు హిందీ నేర్పించే ఆనంది మాత నిలబడి ఉన్నారు (ఫోటో - 1938)

జీవితములో బాబా చాలా నగలతో శృంగారము చేసి ఉండినారు. మమ్మా మాటలు విని బ్రిజేంద్రదాదీ అన్నారు - మనమే అసత్య నగలు ధరించినందున బాబా వాక్యాలు ఇతరులకు అసత్యమనిపిస్తాయి. ఎందుకంటే మనము నగలు ధరించి ఉన్నాము. బాబా ఏమో అసత్య శృంగారాన్ని వదిలి సత్యమైన శృంగారము చేసుకుంటారని చెప్తున్నారు. ఇప్పుడేం చేయాలి? వెంటనే మమ్మా - మనమిరువురము ఈ అసత్య నగలను తీసేస్తాము అని అన్నారు. వెంటనే వారిరువురు నగలన్నీ తీసేశారు. వారిని చూచి యజ్ఞములో ఉన్న మిగిలిన పిల్లలందరూ తమ నగలన్నీ స్వయం తమంతకు తామే త్యాగము చేసేశారు. సారాంశమేమంటే మమ్మా సదా బాబా మహావాక్యాలను సాకారము చేయడంలో నంబర్‌వన్‌గా ఉండేవారు.

## సదా మందస్మిత వదన

శివబాబా సదా ఇలా అనేవారు - బాబా నంబర్‌వన్ కాని మీ మమ్మా ఫ్లస్‌వన్‌లోకి వెళ్ళిపోయారు. మమ్మా ముఖము పై మేము ఎప్పుడూ ఉదాసీనత చూడలేదు. సదా వారి ముఖము చిరునవ్వుతో వెలిగిపోతూ ఉండేది. మమ్మాగారి ప్రతి మాట సుఖమునిచ్చేదిగా ఉండేది. మమ్మాగారు పలికే దృఢమైన మాట సదా ఇతరులను కూడా దృఢ సంకల్పధారిగా చేసే విధంగా ఉండేది. మమ్మా దృష్టితో చాలామందికి అశరీరి స్థితి అనుభవమయ్యేది. మమ్మాగారి శీతలమైన ఒడి జన్మ-జన్మాంతరాల వికారాల వేడిని చల్లబరిచేదిగా ఉండేది, విచిత్రమైన అనుభవమయ్యేది. బాబాను ఫాలో(అనుసరణ) చేయడంలో మమ్మా నంబర్‌వన్‌గా ఉండేవారు. అందువలన బాబాగారి దినచర్య ఉదయము నుండి రాత్రి వరకు ఎలా నడిచేదో, ఆ దినచర్యను విని ఫాలో చేసేవారు.

కరాచీలో బాబాతో పాటు బాబా భవనములో బ్రిజేంద్రదాది ఉండి బాబా అవసరాలు చూచేవారు. మమ్మాగారు మమ్మా భవనములో ఉండేవారు. రాత్రి బాబా నిదురించిన పిదప మమ్మా బ్రిజేంద్రదాదీని తన వద్దకు పిలిచి, బాబా చెప్పిన ప్రతి మాటను ప్రతి విషయాన్ని రిపీట్ చేసి



వినిపించమని, ఏ కొంచెము కూడా మిస్(Miss)చేయకుండా చెప్పమని అడిగేవారు. మిద్దె పై భాగములో ఇరువురు కూర్చుని బాబా విషయాలను గురించి మాట్లాడుకునేవారు. ఉదయము "మేలుకోండి ప్రేయసులారా!........" అనే రికార్డు వేసినప్పుడు బ్రిజేంద్రదాది బాబా భవనంలోకి వెళ్ళిపోయేవారు. ఈ విధంగా మమ్మా బ్రిజేంద్ర ద్వారా బాబా దినచర్యను విని ఫాలో చేసేవారు, రాత్రంతా మేలుకొని తపస్సు చేసేవారు.

మధువనములో మమ్మా బాబా ద్వారా మురళిని వినునప్పుడు ఛాత్రక పక్షి ఒక్కొక్క వర్షపు చినుకును ముత్యంగా తయారు చేసేందుకు ఎలాగైతే కాచుకొని ఉంటుందో, అలా కాచుకొని ఉన్నట్లు అనిపించేది. మమ్మా బాబాగారి ఒక్కొక్క మహావాక్యాన్ని వినేందుకు ఆతురతతో ఉండేవారు. ప్రతి మహావాక్యాన్ని గ్రహించి వెంటనే దానిని తన నిజ జీవితములో ధారణ చేసి, జ్ఞాన స్వరూపంగా అయ్యేవారు. మమ్మా స్మృతి వస్తూనే ఈ శబ్దాలు హృదయాంతరాళము నుండి వెలువడ్తాయి...............

" జీవన్ అమర్ నహీ హై ప్యారే నామ్ అమర్ కర్ జానా

జగ్ మే అన్మోల్ బోల్ సే, సబ్‌కా దిల్ బహలానా "

(ప్రియమైన పిల్లలారా, జీవితము అమరము కాదు. పేరును అమరము చేసుకొని పోవాలి. ప్రపంచములో అమూల్యమైన మాటల ద్వారా అందరి హృదయాలను ఆహ్లాదపరచాలి).

ములంద్ నుండి బ్రహ్మాకుమారీ గోదావరి బెహన్‌జీ ఇలా వ్రాస్తున్నారు - ప్రియమైన మమ్మాతో ప్రథమ సమాగమము 1962 సంవత్సరములో బొంబాయిలోని వాటర్‌లూ భవనములో జరిగింది. మధురమైన మమ్మాను మొదటిసారి చూస్తూనే నాకు సాక్షాత్తు జగదంబ తల్లి సాక్షాత్కారమయింది. వారి దివ్య వ్యక్తిత్వాన్ని చూసి నాకు - నిజంగా పరమాత్మనే ఈ శక్తి అవతారాన్ని ఈ భూమి పైకి పంపారని అనిపించింది.

మధురమైన తల్లి సంబంధములో వచ్చిన తక్షణమే వారి శ్రేష్ఠమైన ప్రతిభాశాలి చమత్కారి బుద్ధి నాకు అర్థమయింది అంతేకాక వీరు చైతన్యములో ఒక దైవీశక్తి అవతారమని కూడా అనుభవమయింది. ప్రియమైన మమ్మా జీవితములో ధైర్యము, గంభీరత, శాంతి సరళత, ప్రసన్న ముఖబంగిమ ద్వారా శిక్షణ ఇచ్చే కళ చాలా ఆకర్షణీయంగా ఉండేది.

మమ్మాగారిలో దృఢత, స్థిరమైన నిశ్చయము, సాహసము, చైతన్య మూర్తి రూపములో చూశాము. వారు సదా నిశ్చింతులుగా ఉండేవారు. ఒకవేళ బాబా వారికి ఎప్పుడైనా ఏదైనా కార్యాన్ని అప్పగించినప్పుడు అనుభవం లేకున్నా చాలా కఠినంగా ఉన్నా, అప్పుడు కూడా “లేదు, నేను కార్యాన్ని ఎలా చేయగలను?” అని ఎప్పుడూ అనలేదు. వారు సదా 'సరే బాబా'(హాజీ బాబా) అని అన్ని బాధ్యతలను స్వీకరించి వాటిని సంపన్నము చేసి చూపించారు.

## ఉన్నత శ్రేణికి చెందిన శాసించు గుణము, ప్రబంధము(ఏర్పాట్లు) చేయు యోగ్యత

మధువనంలో వచ్చే పార్టీలందరికీ నివాసము భోజన వసతులు స్వయం మాతేశ్వరిగారే ఏర్పాట్లు చేసేవారు. వారి పాలన ఎలాంటిదంటే మధువనానికి వచ్చిన వారెవ్వరూ వాపస్ వెళ్లేందుకు ఇష్టపడేవారు కాదు. మాతేశ్వరీగారికి యజ్ఞము పట్ల అత్యంత స్నేహముండేది. యజ్ఞములోని ఏ వస్తువూ వృథా పోరాదని వారు చెప్తూ ఉండేవారు. ఒకసారి పిల్లలందరూ కలిసి గోధుమలు శుభ్రము చేసి సంచులలో నింపేశారు. కొన్ని గోధుమలు నేల పై చెల్లాచెదురుగా పడి ఉండినాయి. మాతేశ్వరీగారు గమనమిప్పిస్తూ చాలా స్నేహముతో ఒక్కొక్క గోధుమగింజ ఒక్కొక్క మొహర్(బంగారు నాణెము)కు సమానమని చెప్పారు. యజ్ఞములోని ప్రతి వస్తువు విలువ వారికి తెలుసు. ఇతరులకు కూడా తెలిపేవారు. వారు చాలా తెలివైన కుశల ప్రబంధకులుగా ఉండేవారు. యజ్ఞ వత్సల స్థూల పాలనతో పాటు సూక్ష్మ ఆధ్యాత్మిక పాలన పై కూడా వారికి విశేష గమనముండేది.






ముంబయి - మాతేశ్వరిగారితో నిర్వైర్ భాయి, శాంతా బహన్(గోదావరి బహన్‌గారి అక్కగారు), రతన్‌మోహిని దాదీ, ఇంద్రా బహన్, నళిని బహన్, కాకూ భాయి మొదలైనవారు

మమ్మా తెలివిగల ప్రశాసకురాలి రూపములో చిన్న వయస్సులోనే యజ్ఞ వ్యవహారాల బాధ్యతలు నిర్వర్తించేందుకు నిమిత్తంగా అయ్యారు. అందరి హృదయాలను చూరగొన్నారు. మమ్మాగారి అనేక విశేషతలు నా మనోనేత్రము ఎదుట నిలుస్తున్నాయి కాని నాకు మమ్మాగారి ఈ విశేషత మరియు శిక్షణ చాలా ఇష్టము - అది ఏమిటంటే ఇతరుల అవగుణాల గురించి ఆలోచించక సదా గుణగ్రాహకులుగా అవ్వాలి. సర్వాత్మలలోని విశేషతలను చూస్తూ హంసల వలె ముత్యాలు మాత్రమే ఏరుకోండి అనేవారు. ఈ విశేషతలను చూస్తూ హంసల వలె ముత్యాలు మాత్రమే ఏరుకోండి అనేవారు. ఈ విశేషత ద్వారా నేను చాలా ప్రభావితమయ్యాను. నా జీవితములోకి ఈ విశేషత తెచ్చుకునేందుకు ప్రయత్నించాను.

మమ్మా ద్వారా నేను విభిన్న కళలను నేర్చుకున్నాను. ఉదాహరణానికి శిక్షణనిచ్చే కళ, పాలన చేసే కళ, మాయాజీతులుగా తయారుచేసే కళ, మధురమైన హాస్యకళ, ఏకతా సూత్రములో కూర్చబడే కళ, ఏడ్చేవారిని నవ్వించే కళ, జ్ఞానామృత పానము చేయించి ఈశ్వరీయ వారసత్వానికి అధికారిగా తయారు చేయు కళ మొదలైనవి. సరస్వతి మాత దివ్యగుణాల సువాసనను వ్యాపింపజేసే గుణదాయిని జ్ఞాన వీణా వాదిని, సర్వ హితకారిణి, మాయామర్ధినిగా ఉండేవారు.

# పరమపిత పరమాత్మను గుర్తింప చేసే భాగ్యవిధాత్రి జగదంబ

బొంబాయిలోని ఘాట్‌కోపర్ సేవాకేంద్రములోని బ్రహ్మాకుమారి నళిని బెహన్‌గారు తమ అనుభవాన్ని ఇలా వ్రాస్తున్నారు - భాగ్యవిధాత్రి జగదంబ అపారమైన మహిమగలవారు, సాటిలేనివారు. తనకుతానే సాటి స్వయం సర్వశక్తివంతులైన పరమపిత పరమాత్మకు గుర్తు. సర్వ గుణాలంకృతము, దివ్యశక్తులతో సంపన్నము, సర్వుల దాహము తీర్చేవారు, సర్వుల మనోకామలను పూర్తి చేసేవారు, ఈశ్వర ప్రదత్తమైన సర్వ గుణాల శాశ్వత, నిర్మల, స్వచ్ఛ, శీతల, పవిత్ర, శాంత, గంభీర, సిద్ధి స్వరూపము. ఇటువంటి ప్రాణ ప్రియమైన మాతేశ్వరి సరస్వతి గాయనము స్వయం పరమపిత పరమాత్మయే బ్రహ్మా ముఖకమలము ద్వారా వర్ణన చేశారు.

జగదంబ విషయములో నేను ఏమి వ్రాసినా, ఎంత వ్రాసినా అది తక్కువే అవుతుంది. ప్రాణ ప్రియమైన జగదంబ పట్ల స్నేహము శ్రద్ధా భావనల పుష్పాల వంటి శబ్దాలను మీ ముందు ఉంచే శ్రేష్ఠమైన అవకాశము నాకు లభించడం నాకు పరమ సౌభాగ్యము. ఓ మాతా! ప్రాణేశ్వరి మాతా! ప్రియమైన జగదంబా! నా మమ్మా నా అలౌకిక జీవితానికి అలౌకిక



ముంబయి - మాతేశ్వరిగారితో పాటు (ఎడమ నుండి కుడికి) దీవాలి బహన్, పార్వతి బహన్, నళిని బహన్, వెనుక వైపు నిలబడి ఉన్న కాకూ భాయి(నళినీ బహన్ తండ్రిగారు)



జన్మదాతా! నాకు ఈ రూపములో అప్పటి శుభప్రధమైన సర్వోత్తమ క్షణాలు, శ్రేష్ఠమైన పవిత్రమైన పావన సమయపు క్షణాలు, నా లౌకిక తల్లి మొట్టమొదటిసారి మమ్మా ఒడిలో కూర్చోబెట్టేందుకు తీసుకెళ్ళిన క్షణాలు గుర్తు వస్తున్నాయి. నేను నా దివ్య నేత్రమును తెరిస్తే సమస్త జగత్తు యొక్క అద్భుత రచయిత, చైతన్య కళాకారుడు "సత్యం-శివం-సుందరం" ను చూచేందుకు, నా జీవితాన్ని ధన్యము గావించు అత్యంత సుందరమైన రచనను చూచేందుకు, వారి పరిచయాన్ని ప్రాప్తి చేసుకొని ప్రపంచములోని సర్వోత్తమ ఆంతరిక సౌందర్యాన్ని అనుభవము చేసేందుకు నన్ను మమ్మా ఒడిలో వదిలిన క్షణాలు, అతీంద్రియ సుఖభరితమైన క్షణాలు ఈ రోజుకు కూడా తాజాగా ఉన్నాయి. నా కనులు సర్వస్వము మర్చిపోయి ఆ కనులలో ఇమిడిపోయాయి. మనస్సు-బుద్ధి ఆ మనోహర ముఖాన్ని చూచి మోహితమై హర్షితమయ్యాయి. నేను అలాగే చూస్తూ ఉండిపోయాను, లోలోపలే వారి ఆకర్షణలో బంధింపబడ్డాను.

ఇటువంటి సమయములో కొద్ది క్షణాలలో మధుర మంజుల స్వరము నా చెవులకు వినపడింది. అలా వినపడుచున్న ప్రతి మధుర స్వరాన్ని జాగృతావస్థకు చేరుకునే దశలో అర్ధచేతనావస్థలో జవాబులిస్తూ పోయాను. చివర్లో ఆ ముఖకమలము నుండి "మీ జీవిత లక్ష్యమేమి" అనే ప్రశ్న వినబడింది. అందుకు నేను "తినడం, త్రాగడం, మజా చేసుకోవడం" అని జబాబిచ్చాను, మధురమైన తల్లి మధురమైన ప్రేమభరితమైన దృష్టితో చూచారు. వారి మందస్మిత వదనము చూస్తున్నంతలో నా దృష్టి గదిలో ఉన్న ట్యూబ్‌లైటు పై ఉన్న ఒక పిచుక గూటి పైకి వెళ్ళింది. అందులో చిన్న ప్రియమైన కోమలమైన పిచుక పిల్లలు నోరు తెరచుకుని ఎదురు చూస్తున్నాయి. ఇంతలో వాటి తల్లి కిటికీ నుండి లోపలకు వచ్చి గూటిలో పిల్లల తెరచుకున్న నోటిలో గింజల రూపములో ఉన్న ఆహారము వేయసాగింది. ఎంత భవ్యమైన దృశ్యము! ప్రపంచములోని సర్వ సంబంధాలలో సర్వోత్తమ సంబంధము, తల్లి-పిల్లల సంబంధము అని చూస్తూ ఉండిపోయాను. అంతలో మళ్ళీ మధురమైన స్వరముతో



ముంబయి - మాతేశ్వరిగారితో పాటు (ఎడమ నుండి కుడికి) బృజేంద్ర దాదీ, పార్వతి మాత, నళిని బహన్, విజయా బహన్(నళిని బహన్ గారి తల్లి )

ప్రేమభరితమైన ప్రశ్న - "చూస్తున్నావా?" అని వినిపించింది. "అవును" అని నేను జవాబిచ్చాను. "ఏమి చూచావు?" "తల్లి తన పిల్లలకు తినిపిస్తోంది!" ఆలోచించు! నీకు, ఆ పక్షికి ఏమి తేడా? నీకు ఈశ్వరుని వరదానంగా మానవ జీవితము లభించింది. ఈశ్వరునిచే బుద్ధి లభించిన మానవుడు కూడా అలాగే ప్రవర్తిస్తే అనగా పెరిగి పెద్దవడం, పిల్లలకు జన్మనివ్వడం.......... వారిని పోషించడం ఈ పనులైతే పశుపక్ష్యాదులు కూడా చేస్తున్నాయి. మనుష్య జన్మ తీసుకొని మనము కూడా అదే చేస్తే మనకు, వాటికి తేడా ఏమిటి? మనుష్య జీవితము అన్నిటికంటే ఉత్తమమయిందని ఎందుకంటారు? మనుష్య జీవితంలోని శ్రేష్ఠత ఏమిటి? మానవ జీవితానికి గొప్పదనమెలా వస్తుంది?" ఈ మాటలు వినిపిస్తూ ప్రాణ ప్రియమైన మమ్మా సర్వ ప్రాప్తులను లేక సర్వ మనోకామనలను పూర్తి చేసే తన ఒడిలో ప్రేమపూర్వకంగా తమ అరచేతులతో మెల్లగా తట్టారు. ఆత్మిక ప్రేమతో కూడిన చేతితో నిమిరారు. జీవన లక్ష్యమేముండాలి? మనిషి జీవితము వజ్ర



సమానంగా ఎలా అవ్వాలి? మన జీవితాన్ని దేవతల వంటి దివ్య జన్మగా ఆదర్శముగా ఎలా తయారు చేసుకోవాలి! ఈ విషయాల పై సుమారు ఒక గంట సేపు అర్థం చేయించారు. అజ్ఞానమనే గాఢ నిద్రలో నిదురిస్తున్న బుద్ధి నేత్రాన్ని తెరిపించారు. తమ మంద, మధుర శక్తి వర్ధక చిరునవ్వు ద్వారా ఎటువంటి శక్తులను నింపినారంటే వాటి వలన నా జీవితానికి సత్యమైన దిశ లభించింది. సత్యమైన జీవిత గమ్యము లభించింది. ఈ రోజుకు కూడా ఈ జీవితము మమ్మా పాలన, మమత, జ్ఞాన, గుణ, శక్తుల వ్రేలు పట్టుకుని గమ్యము వైపుకు ముందుకు వెళ్తూ సాగిపోతోంది.

బ్రహ్మాకుమారి విమలా బెహన్‌జీ ఢిల్లీ ఛాందినీ చౌక్ సేవాకేంద్రము నుండి మమ్మా గురించి ఇలా వ్రాస్తున్నారు - నేను మొట్టమొదట ఢిల్లీ రాజోరీగార్డెన్ సేవాకేంద్రములో మమ్మాను కలిశాను. మమ్మా దృష్టి ద్వారా నాకు గాఢమైన ఆత్మీయత అనుభవమయింది. అంతేకాక ఒక దివ్య అలౌకిక శక్తి, ఉత్సాహాలు కూడా అనుభవమయ్యాయి. నాకు నా సత్యమైన తల్లి లభించిందని అనిపించింది. నా ఆత్మ పై ఆత్మిక ప్రేమ ముద్ర ఏర్పడింది. నేను అంతకు కొన్ని రోజుల క్రితము బ్రహ్మాబాబాను కూడా రాజోరీగార్డెన్ సేవాకేంద్రములోనే చూచాను. ఈ మిలనము వలన నా పై అలౌకిక పవిత్రతా ముద్ర ఏర్పడింది. నాకు ఏ సుఖమైతే లభించిందో, ఆ సుఖాన్ని ఇతర ఆత్మలకు కూడా ఇవ్వాలనే నిశ్చయము నాకు కలిగింది.

ఈ కార్యము కొరకు మమ్మా నాలో విశేషశక్తి నింపారు. మమ్మాతో నేను చాలా సార్లు కలిశాను. నేను కాలేజి నుండి కూడా ముఖ్యంగా మమ్మాతో కలుసుకునేందుకు రాజోరిగార్డెన్‌కు వెళ్ళేదానిని. మమ్మా ఒక రోజు నాతో “మీ లౌకిక తండ్రిని కూడా సన్ముఖములోకి తీసుకొని రమ్మని” చెప్పారు. నా లౌకిక తల్లి దేహాంతమైపోయారు. కనుక మమ్మా చెప్పిన వెంటనే నా లౌకిక తండ్రిని మమ్మా వద్దకు తీసుకెళ్ళాను. మమ్మాగారి వార్తాలాప ప్రభావము నా లౌకిక తండ్రి పై కూడా గాఢంగా ఏర్పడింది.

నేను 1958వ సంవత్సరములో ఢిల్లీ ఇంద్రప్రస్థ కాలేజీలో బి.ఎ ఫైనల్ విద్యార్థిని. నాకు చిన్నతనము నుండే ఆధ్యాత్మికత పై అభిరుచి ఉండేది. నేను బనారస్ విశ్వవిద్యాలయము తరపున ఢిల్లీలోని విద్యార్థులకు ఏర్పాటు చేయబడిన గీతా జ్ఞానములో ఒక పరీక్షను కూడా వ్రాశాను. అందులో బహుమతి కూడా లభించింది. అది జరిగిన వెంటనే నాకు ఈశ్వరీయ జ్ఞానము ప్రాప్తి అయ్యింది.

నేను మమ్మా నుండి గంభీరతా గుణము నేర్చుకున్నాను. దృఢ లగ్నముతో కార్యము చేయడం కూడా నేర్చుకున్నాను. మమ్మాలో సాగర సమానమైన ఇముడ్చుకునే శక్తి కనిపించింది. మమ్మా స్వరూపములో సత్యత మరియు నిర్భయతా శక్తులు విశేషంగా కనిపించాయి. నేను నా జీవితములో సత్యత మరియు నిర్భయతా శక్తులను సదా జతలో ఉంచుకునేందుకు విశేష గమనమిస్తున్నాను.

మమ్మాలో గంభీరత ఎంత ఉండేదో, అంత రమణీకత కూడా ఉండేది. 1963 సంవత్సరములో మమ్మా ఢిల్లీలో ఉన్నప్పుడు నేను ప్రతిరోజు మమ్మా





మాతేశ్వరిగారితో దాదీ ప్రకాశ్ మణీజీ, దాదీ బృజ్ శాంతాజీ మరియు ఇతరులు

మురళి వినేందుకు ప్రాత: కాలములో రాజోరీ గార్డెన్ సేవాకేంద్రానికి వెళ్ళేదానిని. కొంతమంది సోదరీ సోదరులకు మమ్మా ముందు ఏదైనా పాట పాడాలని ఏదైనా డయలాగ్(సంభాషణ) మొదలైనవి చేయాలని ఉత్సాహముండేది. కావున నేను మమ్మాతో “మమ్మా ఒకరోజు మేము పాడే పాటలు, డయలాగ్‌లు, డ్రామాలు మొదలైనవి వినండి” అని చెప్పాను. మమ్మా ఆదివారము సాయంకాలము కార్యక్రమానికి సమయము నిశ్చయించారు. సభ్యులందరిని పిలిచారు. అందరూ కలిసి చాలా సుందరమైన మనోరంజన కార్యక్రమాన్ని తయారుచేశారు. ఒక సోదరి మమ్మా వేషాన్ని వేసుకుంది. వారు తమ కవితలో నేను మమ్మానైతే మమ్మా చేసే పనులన్నీ - ఈ పని, ఈ పని, చేసే దానిని అనే పాట పాడింది. మరొక సోదరి లక్ష్మిగా తయారయింది. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా పాల్గొన్నారు. కార్యక్రమము చాలా రమణీయంగా ఉండినది. మమ్మా సభలో మొదటి వరుసలోనే కూర్చుని కార్యక్రమమునంతా చాలా ప్రేమతో, ఇష్టముతో చూచి చాలా మెచ్చుకున్నారు. జగదంబ అయిన తల్లి పిల్లలందరి మనోకామనలు పూర్తి చేసేవారని మాకనిపించింది.


# మాతేశ్వరిగారు నా అలౌకిక జన్మదాత్రి, అంతేకాక భాగ్యవిధాత్రి కూడా

ఆస్ట్రేలియాలో ఈశ్వరీయ సేవలలో మునిగి ఉన్న బ్రహ్మాకుమారి డాక్టర్ నిర్మల బెహన్‌గారు తమ అనుభవాన్ని వినిపిస్తూ ఇలా అంటున్నారు - ఈ జ్ఞానీ జీవితములో కేవలం మమ్మాతో కలుసుకోవడమే కాక వారి ద్వారా పాలన కూడా పొందడం నా సౌభాగ్యము. నేను జ్ఞానములోకి వచ్చిన తర్వాత వారు భలే రెండు రెండున్నర సంవత్సరాలు మాత్రమే సాకారములో ఉన్నారు. కాని మెజారిటీ సమయము వారు బొంబాయిలోనే గడిపారు. అందువలన ప్రారంభములో మమ్మా ద్వారా నాకు కావలసినంత పాలన లభించింది. బాబా నన్ను - ఈ అమ్మాయి మమ్మాగారి పుష్పము, మమ్మాగారి రచన అని అనేవారు.

## దివ్యబుద్ధి దాయిని (దాత)

ఆ రోజులలో ప్రతి ఆదివారము సాయంకాలము బొంబాయి వాటర్‌లూ భవనంలో మమ్మాగారి క్లాసు, సర్వ జనులకు జరుగు సభ(సార్వజనిక సభ)గా ఉండేది. ఆ సమయములో బొంబాయి ఉషా బెహన్ జ్ఞానానికి వచ్చారు. ఆమె నాకు ఈ కార్యక్రమానికి ఆహ్వానపత్రిక పంపించింది. కార్డు లభించినప్పుడు నేను దాని పై అంత గమనమివ్వలేదు. ఉషా బెహన్ శుక్రవారము నాడు మళ్లీ ఫోనులో ఈ ఆదివారము నీ కార్యక్రమమేది? అని అడిగారు. నేను ఫ్రీగా ఉన్నానని చెప్పాను. అలాగైతే ఆదివారము సాయంకాలము జరిగే ప్రవచనానికి రమ్మని చెప్పింది. నేను సరే అన్నాను. ఆశ్రమానికి వెళ్లిన వెంటనే నాకు మమ్మాను కలిసే సౌభాగ్యము లభించింది. మమ్మాగారి ప్రవచనము వినే మంచి అవకాశము లభించింది. మమ్మా బొంబాయిలో 9 మాసాలుండినారు. మమ్మా శ్రీ లక్ష్మి శ్రీ నారాయణుల చిత్రాన్ని తయారు చేసేందుకు సూచనలిస్తూ ఉండినారు. మమ్మా ధ్యానములోకి వెళ్లేవారు కాదు. కాని ధ్యానములో వెళ్లేవారి కంటే ఎక్కువగా దేవీ దేవతలను గురించిన జ్ఞానముండేది. వారు తన బుద్ధియోగము ద్వారా అన్ని విషయాలను తెలుసుకున్నారు. వారికి





వీణావాదిని మాత సరస్వతి

దివ్యబుద్ధిని గురించిన జ్ఞానముండేది. అందువలన మమ్మా చిత్రకారులను గైడ్(మార్గదర్శనము) చేసేవారు. మన్‌మోహిని దీదీ గారి చెల్లెలు శీల్‌ఇంద్ర దీదీ బొంబాయిలో ఉండేవారు. ఆమె ధ్యానములోనికి వెళ్లేది. మమ్మా మరియు శీలఇంద్రదాది ఇరువురు చిత్రకారులకు సలహాలు, సూచనలిచ్చేవారు. దీని వలన మమ్మాగారు బొంబాయిలో ఎక్కువ రోజులుండవలసి వచ్చింది.

నేను మొదటి రోజు మమ్మాగారి ప్రవచనము విన్నాను. ఉషా బెహన్ నన్ను మమ్మాతో పరిచయం చేయించింది. తర్వాత ఉషా బెహన్ 7 రోజుల కోర్సు తీసుకుంటావా? అని అడిగారు. నేను కోర్సు తీసుకుంటానని చెప్పాను. కోర్సు పూర్తి అయ్యింది. ఉషా బెహన్ నన్ను మమ్మాతో వ్యక్తిగతంగా మిలనము చేయించేందుకు తీసుకెళ్లింది. మమ్మాతో పరిచయము చేయిస్తూ, మమ్మా ఈమె నా స్నేహితురాలు. లౌకికములో డాక్టరు, 7 రోజులు కోర్సు పూర్తి

చేసింది అంటూ నా వివరాలు తెలిపింది. అప్పుడు మమ్మా నన్ను ఎలా ఉన్నావు? ఏమి చేస్తున్నావు? జ్ఞానము అర్థమయిందా? ఏమైనా ప్రశ్నలుంటే అడుగు అని అన్నారు. అప్పుడు నేను మమ్మా శ్రీ కృష్ణుడు సతోప్రధానమే, క్రీస్తు కూడా సతోప్రధానమే ఇరువురిలో తేడా ఏమి? అని అడిగాను. అప్పుడు మమ్మా అన్నారు - ఏసుక్రీస్తు కూడా సతోప్రధానమే కాని ఆయన జన్మించిన సమయము రజోప్రధానము. అందువలన అతను శ్రీ కృష్ణుడంతటి సతోప్రధానము కాదు. శ్రీ కృష్ణుడు సతోప్రధాన(సత్య) యుగపు ప్రథమ సతోప్రధాన ఆత్మ.

## మర్యాదా పురుషోత్తమురాలు

మమ్మా సదా ఉదయము పూట క్లాసు చేసేవారు. ఆసుపత్రిలో నా డ్యూటీ కూడా ఉదయమే ఉండేది. అందువలన నాకు ఉదయము క్లాసుకు వెళ్ళేందుకు వీలయ్యేది కాదు. అయితే ప్రతి ఆదివారము ఉదయము క్లాసుకు వెళ్ళేదానిని. మమ్మా స్వయం ధారణామూర్తి అయినందున ధారణా క్లాసులే ఎక్కువగా చేసేవారు. ఆ క్లాసు అందరినీ చాలా ఆకర్షించేది. మమ్మా ఎప్పుడూ అమృతవేళ మిస్ చేయలేదు. ఒకసారి ముంబయిలో ఒక మంత్రిగారు మమ్మాతో కలిసేందుకు వచ్చారు. మంత్రిగారు వెళ్ళేటప్పటికే రాత్రి 12 గంటలయ్యింది. మరుసటి రోజు మమ్మా తన దినచర్య అనుసారము ఉదయము 2 గంటలకే నిదురలేచారు. ఆ రోజులలో మమ్మా రమేశ్ భాయి ఇంటిలో ఉండేవారు. అప్పుడు రమేశ్‌బాయి మమ్మాను ఇలా అడిగారు, మీరు రాత్రి 1 గంట వరకు మేలుకొని ఉండినారు. మళ్లీ 2 గంటలకే ఎందుకు లేచారు? అప్పుడు మమ్మా అన్నారు - ఆ మినిష్టరు అపాయింట్‌మెంటు వలన రాత్రి మేలుకున్నాను. అయితే అమృతవేళలో నా అపాయింట్‌మెంటు నా ప్రియునితో ఉంటుంది. దానిని నేను ఎలా మిస్ చేయగలను? ఈ విధంగా మమ్మా ఎప్పుడూ అమృతవేళ మిస్ చేయలేదు.



## కష్టనివారిణి, పాప వినాశిని

మమ్మా వాణి నడిపించేటప్పుడు ప్రతి ఒక్కరి హృదయానికి హత్తుకొని పోయేది. అందువలన మమ్మాగారి వాణిని వినేందుకు చాలామంది వచ్చేవారు. మమ్మా సేవ చేసేందుకు ఇతర సేవాకేంద్రాలకు వెళ్లినప్పుడు అచ్చటి మాతలు అంటే జ్ఞానములోకి రాని బంధనము కలిగించు పతులను, పుత్రులను మమ్మాతో కలిసేందుకు, మాటాడేందుకు తీసుకొచ్చేవారు. మమ్మా ప్రీతితో వారి యోగక్షేమాలు విచారించేవారు. ఈశ్వరీయ సాప్తాహిక 7 రోజుల కోర్సు తీసుకోమని చెప్పేవారు. వారు అంగీకరించి కోర్సు తీసుకునేవారు. కోర్సు తీసుకున్న తర్వాత వారి మనసు పరివర్తనైపోయేది. ఆ తర్వాత వారు తమ పత్నులకు, తల్లులకు ఆటంకము కలిగించేవారు కాదు. ఈ విధంగా మమ్మా చాలామంది మాతలను బంధనాల నుండి విడుదల చేయించారు.

నాకు 1962లో జ్ఞానము లభించింది. ఒకటిన్నర సంవత్సరం తర్వాత మొట్టమొదటిసారి సాకార బాప్‌దాదాను కలిశాను. అప్పుడు వారు బచ్చీ! నీవు డబుల్ డాక్టరుగా అవ్వాలి. తర్వాత మా లౌకిక తండ్రి ఒక ఇల్లు ఇచ్చారు. అందులో నేను ఒక క్లినిక్‌తో పాటు సేవాకేంద్రము కూడా తెరిచాను. అవ్యక్త బాప్‌దాదా మరియు దాదీజీ 1972న సంవత్సరములో నన్ను సేవ కొరకు లండన్‌కు పంపించారు. అప్పుడు నేను దాదీ ఆజ్ఞానుసారము నా క్లినిక్‌ను మూసేసి సేవ కొరకు విదేశాలకు వెళ్ళాను. ఇలా నా జన్మ మరియు సమర్పణలో పూర్తి యోగదానము తల్లి సరస్వతి గారిదే. వారే నాకు అలౌకిక జన్మదాత్రి మరియు నా భాగ్యవిధాత్రి.

## సర్వ గుణ సంపన్న శివశక్తి తల్లి సరస్వతి

ఢిల్లీ లోని ఓంశాంతి రీట్రీట్ సెంటరు నుండి బ్రహ్మకుమారి ఆశా బహన్‌గారు తమ అనుభవాలను పంచుతూ ఇలా అంటున్నారు - నా లౌకిక తల్లిదండ్రులు ఈ ఈశ్వరీయ జ్ఞానములో చాలా లగ్నము కలిగినవారు. నా లౌకిక తల్లి భోజనము తయారు చేయడంలో చాలా నేర్పరి. 5 మంది సోదరీ - సోదరులలో నేను అందరికంటే పెద్ద దానిని. బాబా, మమ్మాలు వచ్చినప్పుడు నా తల్లిదండ్రులు పూర్తి సేవాకేంద్రములోనే గడిపేవారు. ఒకసారి మమ్మా కాన్పూరులో సివిల్‌లైన్ సేవాకేంద్రానికి వచ్చారు. ఇంచుమించు వారు 15 రోజులు సేవాకేంద్రములో ఉన్నారు. ఒక రోజు మమ్మా గంగే దాదితో ఈ నిర్మల(నా లౌకిక తల్లి) రోజంతా సెంటరులోనే ఉంటుంది కదా. ఈమెకు పిల్లలెవరూ లేరా? అని అడిగింది. అప్పుడు గంగేదాది 5 మంది పిల్లలున్నారని మమ్మాకు చెప్పింది. అయితే పిల్లలను ఏమి చేసి వస్తుంది? అని మమ్మా అడిగారు. ఇంట్లోనే ఉంచి ఇంటికి తాళము వేసుకొని వస్తుంది అని చెప్పారు. మమత గల తల్లి హృదయము స్పందించి వెంటనే " పిల్లలను ఇంట్లో ఉంచి తాళము వేసుకొని వస్తుందా? ఆ తాళాలలో పాలింపబడే పిల్లలను చూడాలి అని అన్నారు! మరుసటి రోజే మమ్మా తనతో పాటు భోజనము చేసేందుకు మా అందరినీ రమ్మని నిమంత్రణము పంపించారు. అప్పుడు నా వయస్సు 10-11 సంవత్సరాలు అప్పటి దృశ్యము నాకిప్పటి వరకు కనులలో మెదులుతూ చాలా స్పష్టంగా గుర్తుంది. మమ్మా కూర్చున్నారు వారి ప్రక్కనే నన్ను కూర్చోపెట్టుకున్నారు. నా చిన్న తమ్ముడు, చెల్లెలు కూడా కూర్చుని ఉన్నారు. భోజనము వడ్డించారు. మమ్మా అర్ధ రొట్టె మాత్రము తీసుకున్నారు. అప్పుడు సిగ్గుతో మేము కూడా ఒక్కొక్క రొట్టె మాత్రము తీసుకున్నాము. మమ్మా భోజనము పూర్తి చేశారు. మేము కూడా మా భోజనము పూర్తి చేశాము. మమ్మా అన్నారు - పిల్లలూ! ఇంకా కొంచెము తీసుకోండని అన్నారు. అప్పుడు మేము మా కడుపు నిండిపోయింది అని అన్నాము. అప్పుడు మమ్మా - అలా అనకండి, మీరు చిన్న పిల్లలు బాగా భోంచేయండి అని అన్నారు. ఇది మొదటిసారి మమ్మాతో మా వ్యక్తిగత మిలనము.



## ఈ రోజు మీ డిపార్ట్‌మెంటు చల్లగా ఉంది

ఆ తర్వాత నేను మధువనానికి రావడం జరిగింది. ఆ సమయములో బాబాకు కన్యల పై చాలా ఎక్కువ గమనముండేది. నేను చిన్న పిల్లనైనందున నాకు ఏదో ఒక సేవ ఇచ్చి ఈ సేవ చేయమని పంపించేవారు. ఉదయమే బాబా మురళి నడిచేది. సాయంకాలము మమ్మా ఆ మురళీని రివైజ్ చేసేవారు. మమ్మా కూడా ఎక్కువగా కన్యల పై గమనముంచేవారు. పెద్ద కుమారీల గ్రూపు ఒకటి ఉండేది. చిన్న కుమారీల గ్రూపు కూడా ఒకటుండేది. ఇప్పుడు నిర్వైర్ భాయి ఆఫీసు ఉన్న చోట ఒక పెద్ద కొండ ఉండేది. మేము అక్కడ కూర్చుని మురళిని అధ్యయనము చేసేవారము. మధ్యాహ్నము కర్మణా సేవ ఉండేది. మధ్యాహ్నము భోజనానికి పళ్లేలు, కటోరాలు రెడీ చేయడం మా డ్యూటీ. ఆ సమయములో బొంబాయి గాందేవి నిమ్మూ బెహన్ పిల్లలైన మాకు ఇన్‌చార్జ్‌గా ఉండేది. మేమంతా ఆడుకుంటూ ఉండేవారము. భోజనానికి గంట కొడ్తూనే వచ్చేయండని చెప్పారు. వచ్చిన వెంటనే పళ్లేలు, కటోరాలు రెడీ చేయాలి. ఒక రోజు ఆటలలో మునిగి మేము మా డ్యూటీ మర్చిపోయాము. మమ్మా రౌండు వేసుకుంటూ వచ్చి చూస్తే, ఇంకా భోజనానికి తయారే అవ్వలేదు. సోదరీ-సోదరులంతా భోజనము చేసేందుకు వస్తే ఏమి చేయాలి? అని నిమ్మూ బెహన్ కూడా వ్యాకులతతో ఉండినారు. నిమ్మూ బెహన్ ఆడుకుంటూ ఉన్న పిల్లలందరినీ తిట్టడం ప్రారంభించారు. భయంతో మేమంతా తల దించుకుని పని చేస్తూ ఉండిపోయాము. మమ్మా దూరంగా నిలబడి ఇదంతా గమనిస్తూ ఉండినారు. కాని నిమ్మూ బెహన్‌కు ఈ విషయము తెలియదు. అప్పుడు మమ్మా కూడా ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్ధంగా నిలబడి ఉన్నారు. తర్వాత మమ్మా నిమ్మూ బెహన్‌తో, నిమ్మూ ఈ రోజు మీ డిపార్ట్‌మెంటు చల్లగా ఉంది అని ఒక్క మాటే అన్నారు. కాని ఆ సమయములో మమ్మా అన్న మాటలకు అర్థము మేము పెద్ద అయిన తర్వాత మాకు తెలిసింది. మమ్మా

యజ్ఞములో ప్రతి కార్యాన్ని ఎంత ఆక్యురేట్‌గా(ఖచ్చితముగా), పంక్చువల్(నియమితముగా) చేసేవారో తెలిసింది.

## ఆదర్శ తల్లి పాత్ర అభినయించి జగన్మాతగా అయ్యారు

మమ్మా తన 17వ ఏట చిన్న వయస్సులోనే వచ్చేశారు. 17 సంవత్సరాలు పెద్ద వయస్సేమీ కాదు. ఆ రోజులలో 17 సంవత్సరాలు యువ వయస్సు అని స్వేచ్ఛనిచ్చారు. కాని మమ్మా తన యువ అవస్థను తపస్సులో తపింపజేశారు. కావున తపస్యా స్వరూపము వారిలో కనిపించేది. ఇప్పుడు సమాజములో శిక్షణ ఇచ్చేవారు లక్షలమంది ఉన్నారు. కాని తల్లి స్వరూపములో శిక్షణ ఇచ్చేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. వ్రేళ్ళ పై లెక్కించవచ్చు. మమ్మా తల్లి స్వరూపములో శిక్షణనిచ్చే టీచరుగా ఉండేవారు. పరివారమంతటిని ఏకతా సూత్రములో బంధించి ఉంచడం తల్లి మొదటి కర్తవ్యము. ఈ కార్యము చేయడంలో మమ్మా నంబర్‌వన్‌గా ఉండేవారు. యజ్ఞములో ఏ ఇరువురి మధ్య అయినా బేధాభిప్రాయాలు ఉంటే మమ్మా దానిని పోగొట్టి ఇరువురి మనసులను కలిపే కార్యము చేసేవారు. ఒకే ఇంటిలోని ఇద్దరు పిల్లలు పరస్పరము కొట్లాడుకొని మాట్లాడుకోకుండా ఉంటే, తల్లి హృదయము ఎలా ఉంటుంది? అదే విధంగా అటువంటి ఘటనలు ఏవైనా జరిగితే మమ్మా కూడా ఆ ఇరువురిని కలిపే పని చేసేవారు. పిల్లలందరి లోపాలను, బలహీనతలను మమ్మా తనలో ఇముడ్చుకునేవారు. బాబాకు కూడా ఇటువంటి విషయాలు ఎంత అవసరమో అంతే తెలిపేవారు. పిల్లల తప్పులను తనలో ఇముడ్చుకొని ఆ తప్పులను పిల్లల నుండి తీసి వేయడమే ఒక ఆదర్శ తల్లికి ఉండవలసిన లక్షణము. అదే విధంగా మమ్మా సూచనలతోనే శిక్షణనిచ్చేవారు, వారిని శక్తివంతులుగా చేసేందుకు యోగదానము చేసేవారు.

కాన్పూరులో మమ్మా హార్మోనియమ్ వాయించడం నేను చూశాను. నేను మమ్మాతో పాటు గంగానదిలో బోటింగ్ చేశాను. మధువనంలో మమ్మాతో బ్యాట్‌మింటన్ ఆడాను.



## మమ్మాకు చైతన్యపుష్పాలంటే ఇష్టము

కాన్పూరులో మేము మమ్మాను స్వాగతము చేసేందుకు ఒక పాట పాడాము, డయలాగ్ చేశాము. అప్పుడు మమ్మా “ పిల్లలూ! మీకు మమ్మా గుర్తుంటారా లేక బాబా గుర్తొస్తారా? అని అడిగి వెంటనే మమ్మా బాబా స్మృతి చేయమని మాకు గమనమిప్పించేవారు. మమ్మా ఎల్లప్పుడూ - మీ మమ్మాను కాదు, మమ్మాను ఇలా తయారు చేసిన బాబాను గుర్తుంచుకోండి అని అనేవారు. ఒకసారి కాన్పూరులో మమ్మాకు గులాబి పుష్పాల మాలలు వేశారు. ఆ మాలలలో మమ్మా కప్పబడ్డారు. అప్పుడు మమ్మా ఇలా అన్నారు - ఈ పుష్పాలు తీసుకొని మమ్మా ఏమి చేస్తారు? మమ్మాకు చైతన్య పుష్పాలు కావాలి. మమ్మాకు చైతన్య పుష్పాలంటేనే ఇష్టము.

మమ్మా ఎవ్వరికీ వారి అవగుణాల గురించి నేరుగా చెప్పేవారు కాదు. మొదట వారిని తమ వద్ద కూర్చోబెట్టుకొని టోలి తినిపించి వారి మంచి గుణాలను వర్ణన చేసి వాటి మహత్వాన్ని తెలిపి ఆ తర్వాత నీవు నిజంగా బంగారే కాని ఆ బంగారులో కొంచెము ఈ అవగుణము మిశ్రితమై ఉంది. దానిని తొలగిస్తే నీవు పక్కా బంగారమై బాబాకు అతిప్రియంగా తయారైపోతావు. ఈ విధంగా మొదట మమ్మా వారి మంచితనాన్ని అనుభవము చేయించి తర్వాత వారి లోపాలను, బలహీనతలను తొలగించి వేసేవారు. నేను నా సమర్పణ పత్రాన్ని మమ్మాకు వ్రాసి ఇచ్చాననే శుద్ధ గర్వము నాకుంది. ఎలాగైతే యజ్ఞ ప్రారంభములో యజ్ఞములోని పిల్లలు మమ్మా(ఓంరాధ) పేరుతో సమర్పణ పత్రాలు వారి తల్లితండ్రుల నుండి తెచ్చేవారో, అలా నేను కూడా నా లౌకిక తల్లిదండ్రుల నుండి మమ్మా పేరుతో సమర్పణ పత్రము తీసుకొని వచ్చాను.

# మమ్మాయే నన్ను చక్రధారి అని పిలిచారు

రష్యాలో ఈశ్వరీయ సేవలకు నిమిత్తంగా ఉన్న బ్రహ్మాకుమారీ చక్రధారి బెహన్‌గారు మమ్మాతో తన అనుభవాలను వినిపిస్తూ ఇలా అంటున్నారు - ఈశ్వరీయ జ్ఞానాన్ని ప్రాప్తి చేసుకున్న కొద్ది రోజులకే మమ్మా ఢిల్లీకి వచ్చారు - మా లౌకిక తల్లిగారు ఉదయం ఉదయమే తయారై మమ్మాను కలిసేందుకు వెళ్తూ ఉండినది. ఎక్కడికి పోతూన్నావమ్మా? అని అడిగాను. మాతేశ్వరిగారు వచ్చారు, నేను వారిని కలుసుకునేందుకు వెళ్తున్నానని చెప్పింది. నేను కూడా రావచ్చునా? అని అడిగాను. రావచ్చు పద పోతాము అని నా తల్లి అన్నారు. నేను కూడా నా తల్లితో మాతేశ్వరిగారిని కలుసుకునేందుకు వెళ్లాను. అప్పటికి క్లాసు ఇంకా ప్రారంభమవ్వలేదు. మమ్మా తన గది ముందు నిలబడి ఉన్నారు. కొంతమంది అనన్య అక్కయ్యలు నెంబరువారుగా మమ్మాను ఆలింగనము చేసుకుంటూ ఉండినారు. ఇది ఇక్కడి పద్ధతిలే అని నేను అనుకున్నాను. నేను కూడా ఆ లైనులోకి వెళ్ళి నిల్చున్నాను. మమ్మా వద్దకు వెళ్లినప్పుడు మమ్మా నా రెండు భుజాలు పట్టుకుని ఈమె నా చక్రధారి అని అన్నారు. బాబా నాకు జాబులో నీవే చక్రధారివి అని వ్రాసి ఉండినారు. మమ్మా నన్ను ఈమె నా చక్రధారి అని పిల్చినప్పుడు సోదరీ-సోదరులందరూ నా పేరే చక్రధారి అని భావించారు. ఆ రోజు నుండి నన్ను అందరూ చక్రధారి అని పిలవడం ప్రారంభించారు. బాబా ఆ పేరే వ్రాశారు. మమ్మా ఆ పేరుతో పిలిచారు. బ్రాహ్మణుల నోటితో ఈ పేరే వినబడింది. ఈ విధంగా నా పేరు చక్రధారి అయిపోయింది.

ఒకసారి నాకు బొంబాయిలో బాబా జతలో ఒక మాసము ఉండే సౌభాగ్యము లభించింది. అప్పుడు మమ్మా ఢిల్లీలో ఉండేవారు. మమ్మా సందేశాన్ని పంపారు - ఏ బిడ్డ అయితే బాబాను కలిసి వచ్చిందో వారు తమ అనుభవాన్ని మమ్మాకు వినిపించండి. మమ్మా తమ గదిలో కూర్చొని నన్ను ప్రత్యేకంగా పిలిపించి - "బాబా జతలో నీ అనుభవమెలా ఉండినది? బాబా నీకు ఏమి వినిపించారు?" అని అడిగారు. నేను నా అనుభవాన్ని వినిపించునప్పుడు మమ్మా వినే పద్ధతి చాలా విచిత్రంగా ఉండినది. ఈనాటికి కూడా నాకా దృశ్యము కనిపిస్తుంది. మమ్మా పూర్తిగా లవలీనమై బాబా మాటలు వింటూ ఉండినారు. బాబా స్మృతిలో బాబా ప్రీతిలో అలాగే ఇమిడిపోయి తనను తాను మర్చిపోయారు. మమ్మాకు బాబా పట్ల, వారి మాటలు పట్ల ఎంత గౌరవ ప్రేమలున్నాయి! మమ్మా గద్గదమై





వింటూ ఉండినారు, మమ్మా ఒక్క బాబాలోనే రెండు రూపాలు చూచేవారు. ఒకటి పరమపిత రూపము, రెండవది జగత్పిత రూపము.

మమ్మా బాబాను సంపూర్ణంగా తెలుసుకున్నారు. బ్రహ్మబాబాలో కూర్చుని ఉన్నదెవరు? ఈ మహోన్నతమైన జ్ఞానాన్ని వినిపిస్తున్నదెవరు? ఈ విషయాలు మమ్మా పూర్తిగా తెలుసుకున్నారు. మమ్మా బాబాను పూర్తిగా అనుసరించారు. బాబా కూడా ప్రతి రోజు ఉదయము రెండు గంటలకే లేచేవారు. ఒకసారి నేను మధువనానికి వచ్చినప్పుడు నేను ఉండేందుకు బాబా గదికి ప్రక్కనున్న గదే లభించింది. నేనేమి చూశానంటే బాబా 2 గంటలకే లేచి టేబుల్ ల్యాంప్‌ను వెలిగించి దాని పై ఒక న్యాప్‌కిన్ కప్పి, చిన్న వెలుతురులో ఏదో వ్రాస్తూ ఉండేవారు. మరుసటి రోజు నేను బాబాతో - బాబా మీరు నిన్నటి రోజు రాత్రి ఏదో వ్రాస్తూ ఉండినారు అని అన్నాను. అందుకు బాబా అన్నారు - అవును బచ్చీ, ఆల్‌మైటీ బాబా ఏ ఆజ్ఞను ఇచ్చారో, ఏ పనినిచ్చారో ఆ పనిని పూర్తి చేస్తూ ఉండినాను. నాకిచ్చిన పనిని నేను పూర్తి చేసినప్పుడే ఇతర పిల్లలను నేను ఏదైనా అడగగలను. ఈ విధంగా బాబా రాత్రుళ్ళు మేలుకొని - ఆల్‌మైటీ బాబా ఆజ్ఞను పాలన చేసేవారు.

మమ్మాగారి జీవితము చాలా ఆకర్షణీయము అనగా అయస్కాంతము వలె ఆకర్షించే జీవితము. వారిని ఎవరు చూచినా, వీరు నా వారు అని అనుభవము చేసేవారు. నా తల్లి అని అనుభవము చేసేవారు అనగా దైవీ తల్లిని దర్శించేవారు. ఢిల్లీలోని కమలానగర్ సేవాకేంద్రానికి ఒక మాత వస్తూ ఉండేది. ఆమె పతి మంచివాడే కాని ఉద్రేకము కలిగించే జనుల మాటలు విని అతడు తన పత్నిని ఆశ్రమానికి రానిచ్చేవాడు కాదు. ఆ మాత అతనికి తెలియకుండా వచ్చేది. సేవాకేంద్రానికి మమ్మా వస్తుందని తెలుస్తూనే ఆమె తన పతితో - చూడండి, మాతేశ్వరిగారు వస్తున్నారు. ఆమె అంబ, దేవి. వారినొక్కసారి మీరు కలుసుకొని వారి దర్శనము చేసుకోండి. వారిని కలుసుకున్న తర్వాత కూడా ఈ సంస్థలోకి వెళ్లడం మంచిది కాదని మీరనుకుంటే నేను అచ్చటకు పోవడము మానేస్తానని చెప్పింది. ఈ మాటలు చెప్పి ఆమె తన పతిని ఒప్పించి పిలుచుకుని వచ్చింది. మమ్మా ఆ ఇరువురితో వ్యక్తిగతంగా కలిశారు. ఇరువురికి 5 నిమిషాలు మధురమైన దృష్టినిచ్చి, మధుర మహావాక్యాలు వినిపించారు. మమ్మా దర్శనము చేసుకొని మమ్మాగారి మహావాక్యాలు విని ఆ వ్యక్తి గద్గదమైపోయాడు. అతడు తన పత్నితో మన ఇంటి వద్ద కూడా సేవాకేంద్రముంది. అచ్చటికి రమ్మని మమ్మాను ఆహ్వానించమని అన్నాడు. మనకు కూడా లాభము కలుగుతుంది, నాతో పాటు అచ్చట ఉన్నవారికి కూడా లాభముంటుంది అని అన్నాడు. అతని పత్ని వెంటనే మమ్మాతో మమ్మా! మీరు మా ఆహ్వానాన్ని అంగీకరించి ఆ సేవాకేంద్రానికి రండి, మేము అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పింది. మమ్మా చాలా ప్రీతిగా వారి ఆహ్వానాన్ని స్వీకరించింది. మమ్మా 8 రోజులు ఉండేందుకు అన్ని ఏర్పాట్లు వారు చేశారు, ఆ 8 రోజులు అందరికంటే ముందు వచ్చి మమ్మా ఎదురుగా క్లాసులో కూర్చునేవాడు. మమ్మాను మేము ఆహ్వానించాము కాబట్టి సేవాకేంద్రములో మమ్మా ఉండేందుకు ఏ వస్తువూ తక్కువ కాకూడదని అతడు చాలా జాగ్రత్త వహించాడు. ఆ తర్వాత అతడు ఎంత పక్కాగా బాబా విద్యార్థిగా అయ్యాడంటే అతడు కొత్త ఇల్లు కట్టుకున్నప్పుడు క్రింది భాగములో తాను నివసిస్తూ పై భాగాన్ని సేవాకేంద్రానికి ఇచ్చేశాడు. ఈ విధంగా మమ్మా ద్వారా ఎవరు పాలన తీసుకున్నా, వారు బాబాకు వారస పిల్లలుగా అయిపోయారు.

## మమ్మా వరదాయిని, త్రికాలదర్శిని, విశ్వకళ్యాణిగా ఉండేవారు

ఢిల్లీ కృష్ణానగర్ నుండి బ్రహ్మకుమారి కమలమణిగారు ఇలా వ్రాస్తున్నారు - మేమెంతో సౌభాగ్యశాలి ఆత్మలము, ఎందుకంటే ఈ మనోహరమైన సంగమయుగములో మొత్తం కల్పములో 84వ జన్మలో 7 సంవత్సరాల ప్రాయములో అనగా 1937 సంవత్సరములో అలౌకిక దివ్యజన్మ తీసుకున్నాను, జన్మ తీసుకున్న వెంటనే అలౌకిక తల్లిదండ్రుల పాలన లభించింది. చిన్న పిల్లలమైన మా కొరకు శివబాబా బ్రహ్మాబాబా ద్వారా ఆత్మిక బోర్డింగు తెరచి దానికి 'ఓంనివాస్' అని పేరు ఉంచారు. మా ఈశ్వరీయ బాల్యము చాలా అలౌకికంగా, దివ్యంగా ఉండేది. దివ్యజన్మ తీసుకుంటూనే ఒక్క సెకండులో లౌకిక తల్లి-తండ్రి, బంధు-మిత్రులతో బుద్ధితో సంబంధము ఎంతగా తెగిపోయిందంటే వారు మావారు కానే కారనిపించింది. ఈ శరీరమేమో వారి ద్వారానే జన్మ తీసుకుంది కాని మా ఆత్మలోని కల్పక్రితపు సంస్కారమనుసారము అలౌకిక తల్లి - తండ్రి లేక ఈశ్వరీయ పరివారముతో సహజంగానే ఆత్మిక సంబంధము ఏర్పడింది.

### మమ్మాతో మొదటి కలయిక

ప్రియమైన మమ్మాగారితో నా మొదటి కలయిక ఓంనివాస్‌లో జరిగింది. అప్పుడు మమ్మా పేరు మమ్మా కాదు, ఓం రాధగా ఉండేది. చిన్న పిల్లలైన మమ్ములను చూచి మమ్మా - అప్పుడు మీరు మీ ఇంట్లో ధరించు రంగు వస్త్రాలు ధరించరాదు. ఓం అక్షరమును అల్లిక కుట్టు కుట్టబడిన తెల్ల వస్త్రాలు ధరించాలి. మమ్మా మాకు ఓం డ్రస్సు ధరింపజేస్తుందని మాకు చాలా సంతోషము కలిగింది. మమ్మా మాకు ఓండ్రస్సు ఎందుకు తయారుచేశారో తెలిపారు. ఎందుకంటే మేము ఓం అనగా నేను ఒక ఆత్మను అను స్మృతిలో ఉండాలి.

### యజ్ఞమాతతో పాటు యజ్ఞ - కార్యవ్యవహారాల విశేష అనుభవము

మాకు బాబా మురళి నుండి పాయింట్లు ఎలా తయారు చేయాలో

మమ్మా నేర్పించారు. దీని వలన ఎటువంటి ఆత్మకైనా సులభంగా అర్థము చేయించవచ్చు. మమ్మా సింధి భాషలో చాలా కాపీలు వ్రాయించారు. ఈ కాపీల ద్వారా తర్వాత కూడా చాలా సేవ జరిగింది. ఈ విధంగా ఇతర యజ్ఞములోని స్థూల కార్యాలను కూడా నేర్పించేవారు. ఉదాహరణానికి భోజనము తయారు చేయడం, బట్టలు ఉతకడం, చెప్పులు కుట్టడం, డ్రస్సులు కుట్టడం మొదలైన స్థూల కార్యాలన్నిటిలో అనుభవీలుగా చేశారు. చేసేది రాకపోయినా మమ్మా ముందు సరే అనే పాఠము పక్కా చేసుకున్నాము. దాని వలన అన్ని కార్యాలు సులభమైపోయాయి.

## అత్యంత పెద్ద కార్యాన్ని కూడా సహజమని అనుభవము చేయించారు

నేను గుడ్‌గావ్ సేవాకేంద్రములో ఉండేదానిని. నేను రెండు రోజులుండేందుకు గుడ్‌గావ్‌కు వస్తున్నానని మమ్మా తెలిపారు. నేను ఈ మాటలు విని చాలా సంతోషించాను. కాని నేను మమ్మాతో - “మమ్మా నేను చాలా చిన్నదానిని. నాకు పెద్దగా తయారు చేయడం రాదు” అని అన్నాను. అప్పుడు మమ్మా అన్నారు - “చూడు కమలమణీ నీవు చిన్నదానివే కాని చిన్నదానివైనా మమ్మాను పిలిచావు. ఈ మాట విని సోదరీలందరూ నిన్ను చాలా ప్రశంసిస్తారు. అందువలన ఈ కార్యము చేయడం రాదని అనకు. పెద్ద దీది(మన్మోహినిదీదీ) నీకు సహాయము చేస్తారు.” ఈ విధంగా మమ్మా నాకు చాలా గొప్ప ధైర్యమునిప్పించారు. గుడ్‌గావ్ సేవాకేంద్రములో మమ్మా రెండు రోజులున్నారు. చాలా పెద్ద కార్యమైనా చాలా సులభంగా జరిగిపోయింది. రెండు రోజుల వరకు మమ్మా చాలా గొప్ప సేవ చేశారు. ఉదయము క్లాసు చేయడం, తర్వాత సోదరీ-సోదరులతో వ్యక్తిగత మిలనము చేయడం మొదలైన వాటి ద్వారా నాకు చాలామంచి అనుభవము కలిగింది. మమ్మా సేవ ఎలా చేస్తున్నారో, నేను కూడా అలాగే చేయాలనే సంకల్పము కలిగింది.



## ఏ ఆత్మ కూడా అసంతుష్టము అవ్వకుండా ఉండేందుకు సహజ విధి

ఒక జైను సోదరుడు తను చెప్పిన మాట ఏదైనా వినకుంటే చాలా అసంతుష్టంగా ఉండేవాడు. నేను ఈ విషయము మమ్మాకు తెలిపాను. అప్పుడు మమ్మా అన్నారు - ఎవరికైనా దాహమైనప్పుడు వారికి నీరు ఇవ్వకుండా 36 రకాల భోజనమిస్తే వారు తృప్తి పడ్తారా? అందువలన ఈ ఆత్మ సంస్కారాన్ని గమనించి సంతృప్తిపరచాలి. ఆ సోదరుని సంస్కారము చూచి మమ్మా అతనికి ‘ఓ.కె’ అని పేరు పెట్టారు. ఆ సోదరునిలో చాలా స్నేహ భావము కలిగింది. ఓ.కె అను పేరు పెట్టినందున అతడు ఓ.కె అయిపోయాడు అనగా పరివర్తనైపోయాడు. మమ్మాగారి మాటలు జైను సోదరునికి వరదానమైపోయాయి. ఈ విధంగా మమ్మా వరదాని, త్రికాలదర్శి, విశ్వములోని సమస్త ఆత్మలకు మేలు చేయు విశ్వకళ్యాణిగా ఉండేవారు.

## అష్టభుజాధారి దుర్గమ్మ తల్లి

సోనీపత్ నుండి బ్రహ్మాకుమారీ జనక్ బెహన్ గారు ఇలా వ్రాస్తున్నారు - నా లౌకిక జన్మ బటాలా(పంజాబు) యందు జరిగింది. లౌకిక పాలన, అలౌకిక పాలన శ్రీ హరగోవిందపురములో జరిగింది. శ్రీహర గోవిందపురానికి మమ్మా-బాబా ఇరువురూ వచ్చారు. ప్రేమమూర్తి, స్నేహమూర్తి అయిన మమ్మా తల్లి అయ్యి మమ్ములనందరినీ పాలన చేశారు. కుమారీలైన మమ్ములను మమ్మా షేర్‌నీ శక్తి(సింహిణి) అనే టైటల్‌తో పిలిచేవారు. మమ్మాకు కుమారీలంటే చాలా ప్రీతి. మొదటిసారి మమ్మా శ్రీ హరగోవింద పురానికి వచ్చినప్పుడు 15-16 మంది కుమారీలము యజ్ఞములోకి వచ్చాము. అప్పటి మమ్మాగారి అలౌకిక శబ్దాలు ఎంత ఉత్సాహాన్ని కలిగించేవిగా ఉండినాయంటే, నిర్బల ఆత్మలో కూడా శక్తి నింపేవారు. నేను కొంత అనారోగ్యంగా ఉండేదానిని. కనుక నేను మమ్మాతో "మమ్మా నా ఆరోగ్యము సరిగ్గా ఉండదు, నేనేమి సేవ చేయగలను" అని అన్నాను. మమ్మా నోటి పై వేలుంచుకొని అన్నారు - " షేర్‌నీ శక్తిస్వరూప ఆత్మ ఇటువంటి బలహీన సంకల్పము ఎప్పుడూ చేయదు, నీ జతలో ఉండేదెవరు? ఇది నీవు మర్చిపోయావా? వెంటనే నాలో శక్తి అలలు ప్రవహించాయి, నేను జబ్బుగా ఉండినాననే విషయాన్నే మర్చిపోయాను." సేవాక్షేత్రములోకి వచ్చిన తర్వాత మళ్లీ ఇటువంటి సంకల్పమే రాలేదు.

దుర్గా స్వరూపమైన తల్లిని మొట్టమొదట సారి చూచినప్పుడు నేను అలాగే తదేకంగా చూస్తూనే ఉండిపోయాను. మమ్మా, "బచ్చీ! ఏమిటలా చూస్తున్నావు?" అని అడిగారు. అప్పుడు నేను "మమ్మా మిమ్ములను మొదటిసారిగా చూస్తూనే సింహము పై సవారి చేస్తున్న అష్ట భుజములు ధరించిన దుర్గమ్మగా కనిపించారు. వెంటనే సాధారణ రూపములో కనిపిస్తున్నారు. ఇదేమిటి? ఇదేమి ఇంద్రజాలము? ఇంత త్వరగా మీరు వస్త్రములెలా మార్చుకున్నారు? అని అడిగాను. మమ్మా నా తల పై చేతితో నిమురుతూ - " ఇది నీ భావన నీకు దుర్గమ్మ తల్లి అంటే చాలా ఇష్టము కదా? " అని అడిగారు. నేను అవును మమ్మా అని అన్నాను. నీకు దుర్గమ్మ





వార్తాలాపము చేయునప్పుడు తల్లిగారి అలౌకిక ముద్ర

సాక్షాత్కారమయిందని మమ్మా అన్నారు. వీరే ఇంతకాలము నేను పూజించిన దుర్గమ్మ తల్లి అని నాకు నిశ్చయము కలిగింది.

మనసును హరించే మధురమైన తల్లి వరదాని హస్తము ఈనాటికీ నా తల పై ఉంది. మమ్మా శక్తి స్వరూపముగా ఉండేవారు అంతేకాక ప్రేమమూర్తి, స్నేహమూర్తిగా ఉండేది. ఎప్పుడైనా నాకు బలహీన సంకల్పము వచ్చినప్పుడు వెంటనే తల్లి నిర్భయ స్వరూపము నా ముందు కనిపిస్తుంది. మమ్మా ఎప్పుడూ విఘ్నాలకు భయపడేవారు కాదు. నా 40 సంవత్సరాల అలౌకిక జీవితములో అనేక ప్రకారాలైన విఘ్నాలు వచ్చాయి. కాని మమ్మాగారి నిర్భయమైన శక్తి స్వరూపము నన్ను నిర్భయంగా, శక్తిశాలిగా, విజయులుగా తయారు చేసింది. మమ్మా ఎదుట నేను ప్రతిజ్ఞ రూపములో ఒక పాట పాడాను. దానిలోని చరణాలు ఇలా ఉన్నాయి..........

**యుద్ధ మైదానములోకి శక్తులైన మేము వస్తాము,**
**నిశ్చయమనే పరీక్షలో మేము పాస్ అవుతూ పోతాము,**

జ్ఞాన ఆభరణాలు ధరిస్తాము,
యోగముతో అలంకరించుకుంటాము,
నడుముకు జ్ఞాన వడ్డాణము ధరిస్తాము,
యుద్ధ మైదానములోకి శక్తులైన మేము వస్తాము,
మేము భారతదేశ జ్యోతిని వెలిగిస్తాము,
జ్ఞానామృతాన్ని తాపిస్తాము,
మేము...............................

ఈ రోజు కూడా మమ్మా ఇచ్చిన శిక్షణలు, మమ్మాగారి పాలన గుర్తొస్తూనే ఉంటుంది. అయితే మమ్మాగారి అదే ముఖము, ఆ రూపము, అవే శిక్షణలు మళ్లీ ఎప్పుడు లభిస్తాయి? అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. జవాబు వస్తుంది - 5 వేల సంవత్సరాల తర్వాత అని నా మనసు చెప్తుంది. మంచిది. మమ్మా! నేను అంతవరకు వేచి ఉంటాను. తప్పకుండా వేచి ఉంటాను.


## మాతేశ్వరీగారిని కలుసుకున్న వారంతా ఈశ్వరుని వారసులుగా అయ్యారు

బ్రహ్మకుమారి సుందరి బెహన్‌గారు ఢిల్లీలోని మాలవీయనగర్ సేవాకేంద్రము నుండి తమ అనుభవాన్ని ఇలా వ్రాస్తున్నారు - 1961 సంవత్సరములో నేను మధువనానికి వచ్చి మధురమైన మమ్మాను చూస్తూనే నేను దుర్గమ్మ వద్దకో, లేక వైష్ణవీదేవి సమ్ముఖానికి వచ్చానని అనిపించింది. దేవీలను సదా కొండల పైననో లేక గుహలలోనో ఉన్నట్లు చూపిస్తారు. వారి ముందు సదా జ్యోతి వెలుగుతూ ఉంటుంది. వాస్తవానికి మమ్మా తన ఉన్నత స్థితిలో అంతర్ముఖత అనే గుహలో కూర్చొని ఉన్నట్లు, జ్యోతి వెలుగుతూ ఉన్నట్లు వారి కనుల నుండి పూర్తి షేర్‌నీశక్తి అనుభవమవుతూ ఉండినది. మమ్మా గంభీరత, నిర్భయతల స్వరూపంగా ఉండినారు. మమ్మా దృష్టి ఇచ్చినప్పుడు నాలోని బలహీనతలన్నీ లాగబడి బయటకు వచ్చినట్లు అనిపించింది. వారి దృష్టిలో ఇంతటి తేజస్సు ఉండేది. చాలా మధురమైన మాటలు మమ్మా నోటి నుండి వెలువడ్డాయి - బచ్చీ! వచ్చేశావా, చాలా మంచి పని చేశావు, ఇలా అంటూ మమ్మా నన్ను తన బాహువులలోకి తీసుకున్నారు. మమ్మాతో కలుస్తూనే ఒక విచిత్రమైన శక్తి నా రోమ రోమములో సంచరించడం మొదలయ్యింది. ఆత్మనైన నాకు విశ్రాంతి లభించింది. నేను మమ్మా ప్రేమను జీవితములో మొదటిసారి పొందాను.

మమ్మాను నేను సదా బాలకుని రూపములో చూశాను. మధువన ప్రాంగణములో మమ్మా ఎల్లప్పుడూ ఫ్రాకు పైజామా ధరించి ఉండేవారు. మమ్మాగారి అమాయకమైన చిరునవ్వుతో ఉన్న రూపము. ఒక నిష్కపట బాలుని వలె లేక ఒక సాధువు వలె కనిపించేవారు. ఆ రూపము చాలా మధురంగా, ప్రియంగా ఎలాంటి వికారాల అంశము కూడా లేని రూపంగా కనిపించేది -

" సాధువు చాలా పరమార్థము చేస్తాడు
అతని అవయవాలన్నీ శీతలము
ఇతరుల తాపాన్ని హరించి తన రంగునిస్తారు "

మమ్మా ఎలాగైతే శీతల స్వరూపంగా ఉండేవారో, అలా బాబా ముందు ఒక చిన్న బాలకుని వలె ఉంటూ ఉండేవారు. బాబా, మమ్మాకేమైనా చెప్తే వెంటనే “జీ బాబా(సరే బాబా, అలాగే బాబా)” అని అనేవారు. మమ్మా అనే ‘జీ బాబా’ అనే పదము ఎంత మధురంగా ఉండేదంటే ఆ శబ్ధము రోమాంచితము చేసేది. నా తల్లి సరస్వతి ఇలా ఉండేవారు! ఇది 1963 వ సంవత్సరములో జరిగిన విషయం. మమ్మా 3 రోజులు మాతో పాటు జమ్మూలో ఉన్నారు. వారు అమృత్ సర్ నుండి జమ్మూకు వచ్చారు. మేము వారిని ఆహ్వానించాము. సేవాకేంద్రము ఇప్పుడే కొత్తగా తెరవబడింది.



### త్రిమూర్తి స్వరూపిణీ ఆదిశక్తి తల్లి సరస్వతి

చాలా మంది కన్యలు, మాతలు మరియు సోదరులు వచ్చేవారు. నేను మరియు న్యూయార్క్ మోహిని బెహన్ ఒకే చోట ఉండేవారము. అప్పట్లో



మా వద్ద వంట పాత్రలు గాని, ఫర్నీచర్ గాని ఏమియూ ఆ రోజులలో మిలిటరీ మేజరుగారి పత్ని కొత్త కొత్తగా జ్ఞానానికి వస్తూ ఉండేది. మన వద్దకు జగదంబ సరస్వతిగారు వస్తున్నారని ఆమెకు తెలిపాము. ఆమె వారి ఇంటి నుండి క్రొత్త పాత్రలు, సోఫా తీసుకొని వచ్చింది. సేవాకేంద్రాన్ని అలంకరించింది. మమ్మా ప్రవేశిస్తూనే మేజరు పత్నికి మమ్మా ద్వారా జగదంబ సాక్షాత్కారమయింది. ఆమె పూర్తిగా తృప్తి చెందింది. ఆమె పూర్తిగా పరివర్తనైపోయింది. మధురమైన మమ్మా మా వద్ద 3 రోజులు ఉండినారు. మమ్మాగారి అథక్(అలసటలేని) సేవ, మధురమైన మురళి మాకు అంతులేని ఆనందాన్ని కలుగజేసింది. మమ్మా అమృతవేళలో 2 గంటలకు నిదుర లేచి మధ్యాహ్నము 2 గంటల వరకు బాబా స్మృతి మరియు పిల్లల సేవలో ఉపస్థితమై ఉండేవారు. జీవితములో వారి ధారణల ద్వారా అనేక ఆత్మలు లాభము పొందుకున్నారు, వాహ్ వాహ్...... అనే పాట పాడారు. మమ్మా జీవితము ద్వారా పవిత్రతా పర్సనాలిటి ప్రకాశించేది. అంతేకాక మమ్మా సాక్షాత్తు దివ్యగుణాలమూర్తిగా ఉండేవారు. మూడు రోజులలో మమ్మా నుండి మేము చాలా నేర్చుకున్నాము. మా సంతోషానికి అంతే లేదు. విచిత్రమైన నషాలో ఉండినాము. మూడవ రోజు మమ్మా వాపసు వెళ్ళే క్షణాలు వచ్చినప్పుడు మా అందరి కనులలో నీరు నిండింది. గోపికలైన మా మధ్య నుండి కృష్ణుడు వెళ్ళి పోయినట్లనిపించింది. ఇలా ఉండేది - మా మధురమైన మమత నిండిన మూర్తి మమ్మా.

1963 సంవత్సరములోనే మధురమైన జగదంబ మమ్మా ఢిల్లీకి వచ్చారు. మేము సౌత్ ఎక్స్‌టెన్షన్‌లో ఉండేవారము. జ్ఞానములో నడిచే ఒక సోదరుడు లక్నోకు వెళ్ళిపోయాడు. లక్నో నుండి అతడు ఒకసారి ఢిల్లీకి వచ్చాడు. అతనికి ప్రమాదము జరిగి ఉండినది. మాకు తెలిసి, అతనిని కలిసేందుకు వెళ్ళాము. అతడు అతని బంధువైన డాక్టర్ మాథుర్‌గారి వద్ద ఉండినాడు. ఆ సోదరుడు డాక్టర్ మాథుర్‌కు మా పరిచయము కలుగజేశాడు. మేము సేవాకేంద్రానికి రమ్మని మాథుర్‌ను ఆహ్వానించాము. నాకు భగవంతుడంటే నమ్మకము లేదని అన్నాడు. అతడొక

విజ్ఞానవేత్త(సైంటిస్ట్). అతడు "నా పత్ని రామ-కృష్ణుని పూజిస్తుంది" అని చెప్పారు. నాకు ఈ మాటల పై నమ్మకము లేదని చెప్పాడు. నేనన్నాను - అయినా ఫర్వాలేదు. రేపటి రోజు ఒకసారి రండి. ఎందుకంటే రేపటి రోజు మాతేశ్వరిగారు ఆబూ నుండి వస్తున్నారు. మీరు ఒకసారి వారిని తప్పకుండా కలవండి. అప్పుడాయన సరే వస్తానన్నారు. వారి యుగల్‌తో కలిసి రమ్మని ఆహ్వానించాము. మరుసటి రోజు మమ్మాగారు మా వద్దకు వచ్చారు. డాక్టర్ మాథుర్ గారు కూడా సేవాకేంద్రానికి వారి పత్నితో సహా వచ్చారు. మమ్మాను కలుస్తూనే మాథుర్ మమ్మాను భగవంతుడెవరు? అని ప్రశ్నించాడు. మమ్మా వెంటనే "పాయింట్ ఆఫ్ లైట్(జ్యోతిర్బిందువు/Point Of Light) సైన్స్ కూడా ఈ విశ్వాన్ని నడుపుతున్న ఒక శక్తి(సోర్స్ ఆఫ్ ఎనర్జీ/Source of Energy) ఉందని ఒప్పుకుంటున్నది కదా" అని జవాబు ఇచ్చారు. ఈ మాట అతని మనసుకు నచ్చింది. రేపటి నుండి మీరు కోర్సు తీసుకునేందుకు రండి అని మమ్మా వారికి చెప్పారు. తర్వాత పతి-పత్ని ఇరువురూ బాబా పిల్లలుగా అయిపోయారు. వారు శివబాబాను వారసునిగా చేసుకున్నారు. పక్కా నిశ్చయబుద్ధి అచలంగా, స్థిరంగా ఉండిపోయారు. వారి డైరీలో ఒక్క రోజు కూడా మురళి మిస్ చేయలేదు. ఇప్పుడు ఇరువురూ శరీరాలు వదిలేశారు. ఢిల్లీలో డిఫెన్స్ కాలనీలో వారి ఇంటిలో సేవాకేంద్రము నడుస్తోంది.

## మమ్మా నాకు నిర్భయంగా మరియు సత్యంగా ఉండేందుకు నేర్పించారు

గాజియాబాదు నుండి బ్రహ్మాకుమారి సుతీష్ బెహన్ ఇలా వ్రాస్తున్నారు - నా తల్లిదండ్రులు వైష్ణవి మాతను పూజించేవారు. వారు ప్రతి సంవత్సరము 3 - 4 సార్లు వైష్ణవీ దేవి యాత్ర చేసేందుకు తప్పకుండా వెళ్ళేవారు. ఈ విధంగా మా ఇంటిలో భక్తి మరియు పూజల వాతావరణముండేది. దీని ద్వారా శక్తిని ఆరాధించే సంస్కారము నాలో కూడా వచ్చేసింది. నా బాల్యము నుండి(బుద్ధి వచ్చినప్పటి నుండి) నాకు కూడా వైష్ణవి మాతలో పూర్తిగా నమ్మకముండేది. నేను కూడా ఇలాంటి దేవిగా అవ్వాలని అనుకునేదానిని. కాని ఎలా అవ్వాలో తెలియదు. నేను కూడా ఇలా అవ్వగలనా? అని నా లౌకిక తండ్రిని చిన్నతనములో అడిగేదానిని. సత్యమైన మనస్సుతో ఈమెను పూజిస్తే నీవు కూడా ఇలా అవ్వగలవు! అని మా తండ్రి చెప్పేవారు. నేను ఒంటరిగా కూర్చున్నప్పుడు నేను కూడా దేవిగా అవుతాను........ అనే ఆలోచనలు నడిచేవి. ఇటువంటి విచారాలు చాలా ఎక్కువగా నడిచేవి. ఒకసారి నాకు స్వప్నములో దేవి సాక్షాత్కారమైనారు. ఆ స్వప్నములో ఒక పెద్ద సుందరమైన గది, అందులో ఎర్ర లైటు కనిపించింది. నేను ఆ గదిలోకి వెళ్ళాను. అక్కడ ఒక శ్వేత వర్ణము గల గద్దె, తెల్ల పరుపు, దాని ప్రక్కనే ఒక తెల్ల కుర్చీ కూడా ఉంది. దాని పై మమ్మా తెల్ల డ్రస్సులో కూర్చొని ఉంది. నేను ఆమె వైపు చాలా సంతోషంగా చూస్తూ ఆ వైపుకు ముందుకు సాగిపోయాను. మమ్మా నాకు స్నేహపూరిత దృష్టినిచ్చి ప్రేమతో - నీవు ఇక్కడ ఉంటావా? అని అడిగారు. ఈ మాట వింటూనే నా కనులలో నీరు నిండి మమ్మా(దేవి) వైపు చూస్తూ ఉండిపోయాను. కొంత సమయము తర్వాత మమ్మా నా చేయి పట్టుకొని - బచ్చీ! నీవు త్వరగా వచ్చేస్తావు అని అన్నారు. ఈ విధంగా శక్తి స్వరూప స్థితి నాకు సాక్షాత్కారమయింది. ఈ దృశ్యము నా కనులలో తిరగడం మొదలయ్యింది. నేను మనసులోనే తల్లిని స్మృతి చేస్తూ ఉండేదానిని.

## చివరికి ఆ రోజు రానే వచ్చేసింది

దీని తర్వాత పాకిస్తాన్ - హిందూస్థాన్ విభజన జరిగింది. మేము 1947వ సంవత్సరములో లాహోర్ నుండి ఢిల్లీకి వచ్చేశాము. అప్పట్లో నేను 5వ తరగతి చదువుతూ ఉండేదానిని. మా లౌకిక పరివారము ఢిల్లీ సబ్జీ మండిలో ఉండేది. నేను సాక్షాత్కారములో మాతేశ్వరి రూపాన్ని దేనినైతే చూశానో, అదే రూపము మాటిమాటికి గుర్తుకొచ్చేది. సదా ఇదే ఆశ ఉండేది. నన్ను తల్లి ఎప్పుడు పిలుస్తుంది? అని ఎదురు చూస్తూ చూస్తూ ఉండగా ఆ రోజు రానే వచ్చేసింది. అప్పుడు నేను 8వ తరగతి చదువుకుంటూ ఉన్నాను. అప్పుడు మాకు వేసవి శెలవులు. మేము వాకింగ్‌కై ఉదయమే యమునా నదీ తీరానికి వెళ్ళేవారము. అకస్మాత్తుగా ఒకరోజు అచ్చట తెల్లడ్రస్సులో కొంతమంది సోదరీలు కూర్చొని ఉన్నారు. ఆధ్యాత్మిక జ్ఞాన చర్చ జరుగుతూ ఉండినది. నేను వారిని చూచి నేరుగా వారి వద్దకు వెళ్లి కూర్చుండిపోయాను. వీరు నా వారే అన్న ఆకర్షణ ఆంతరికములో కలగడం ప్రారంభమయింది. నేను కూడా వీరి వద్దనే ఉండిపోతే బాగుంటుందని మనస్సులో అనిపించింది. తర్వాత వారిని మా ఇంటికి దగ్గరగా ఉండే ఒక ధర్మశాలలో ఉంచారు. నేను అచ్చటికి వస్తూ, పోతూ ఉండినాను. ఒక రోజు నేను వారి వద్ద కల్పవృక్ష చిత్రాన్ని చూశాను. అందులో జగదంబ తల్లి తపస్సు చేస్తూ కూర్చొని ఉండడం చూశాను. నేను సాక్షాత్కారములో ఇంతకు ముందు చూచిన చిత్రము కూడా ఇదే. అప్పుడు నేను ఆ సోదరీలతో ఈ తల్లి ఎక్కడున్నారు? ఈమె మీకు తెలుసా? అని అడిగాను. అప్పుడు వారు ఈమె మా అందరికి యజ్ఞమాత అని చెప్పారు. అప్పుడు నాకు దేవీ - తల్లి లభిస్తుందని చాలా సంతోషము కలిగింది. ఈ విధంగా నడుస్తూ నడుస్తూ 3 సంవత్సరాలు గడచిపోయాయి. మనస్సులో ఏ ప్రాప్తి కొరకు ఎదురుచూచానో ఆ రోజు కూడా వచ్చేసింది. 1954వ సంవత్సరములో మమ్మా ఢిల్లీకి వచ్చారు. అప్పటికే ఢిల్లీలో కమలానగర్ సేవాకేంద్రము తెరవబడింది. మమ్మా ఆ సేవాకేంద్రానికే వచ్చారు. నా మనసు అతీంద్రియ





ఢిల్లీ - మాతేశ్వరిగారితో (ఎడమ నుండి కుడి) - సుతీష్ బహన్, సరళా బహన్, సంతోష్ బహన్ మరియు సరోజ్ బహన్ క్రింద లైనులో తృప్తా బహన్, విమలా బహన్, సుధా బహన్, రాణి బహన్

సుఖములో ఊగుతూ ఉండినది. మేము మమ్మాకు స్వాగతము పలికేందుకు హారము పుష్ప గుచ్ఛాలు తీసుకొని నిలబడి ఉండినాము. మమ్మా బండి నుండి దిగుతూనే నేను మమ్మాకు పుష్పహారము వేశాను. మమ్మా నన్ను పేరుతోనే సుతీష్ ఎలా ఉన్నావు? అని పలకరించారు. ఏమి కోరుకుంటూ ఉండినావో అది లభించింది కదా? అని అడిగారు. అప్పుడు స్నేహమయి శక్తి రూపములో ఉన్న తల్లి ఎలాంటి దృష్టినిచ్చారంటే నా సంతోషానికి అంతేలేదు. ఎందుకంటే ఏ తల్లినైతే నేను సాక్షాత్కారము చేసుకున్నానో, ఆ తల్లి నాకు లభించింది. దాని తర్వాత నేను ఈశ్వరీయ చదువును ఎప్పుడూ వదలలేదు. ఎంత సమయము దొరికితే అంత సమయము నేను ఈశ్వరీయ సేవాకేంద్రములోనే ఉండేదానిని.


## ఎన్నో విఘ్నాలు వచ్చాయి, కాని నేను ఓడిపోలేదు

కొంతమంది మా లౌకిక పరివారానికి ఈ సంస్థను గురించి విరుద్ధంగా నా గురించి విపరీతంగా ఉల్టా-సుల్టా మాటలు వినిపించసాగారు. నేను జ్ఞానములోకి వచ్చేందుకు ఒక సంవత్సరము ముందే మా లౌకిక తండ్రి శరీరాన్ని వదిలేశారు. నా సోదరులు సంస్థకు రాకుండా నన్ను ఆటంకపరచి - మేము ప్రపంచములో ఉండాలా వద్దా? ఈ ప్రపంచములో అన్ని నియమాలు నిభాయించాలి. వాస్తవానికి పూర్తి జీవితమంతా వివాహము చేసుకోకుండా ఒంటరిగా ఎవ్వరూ ఉండలేరు. కనుక ఈ సంస్థకు పోవద్దని అందరూ నాకు అర్థం చేయించేందుకు ప్రయత్నించారు. అయితే నేను ఆగిపోలేదు. అప్పుడు వారు నాకు వివాహము చేస్తే సరిపోతుందని నిర్ణయించుకున్నారు. కాని నాకు భగవంతుని పై పూర్తి లగ్నమేర్పడిపోయింది. ఈ విధంగా అనేక ప్రకారాలైన విఘ్నాలు కలుగజేశారు. కాని నేను ఎప్పుడూ మమ్మా-బాబాల తోడు వదిలి పెట్టలేదు. ఇలాంటి పరీక్షలు దాటుకుంటూ నేను 1956వ సంవత్సరములో పూర్తిగా ఈశ్వరీయ సేవలో సమర్పితమైపోయాను. కొంత సమయము మమ్మా - బాబా ఢిల్లి రజోరి గార్డెన్‌లో ఉండినారు. నేను కూడా వారి సాంగత్యములో అచ్చటనే ఉన్నాను. అచ్చట మమ్మా నాకు ఈశ్వరీయ మర్యాదలను అనుసరించడం నేర్పించారు. ఇతర ఆత్మలకు ఆధ్యాత్మిక విద్యలో కోర్సు ఇవ్వడం కూడా నేర్పించారు.

## చెడు (అలవాట్ల)ను బలి తీసుకొని కష్టాలను హరించే సుఖదాయి - తల్లి

మొట్టమొదట నేను ఒక వృద్ధావస్థలో ఉన్న సోదరునికి కోర్సు చేయించాను. అతడు పూర్తి తాగుబోతుగా ఉండినాడు. అతడు సారాయి వదలడం కష్టమనిపించేది. కాని అతనికి జ్ఞానము కూడా చాలా బాగుందనిపించేది. ఒక రోజు అకస్మాత్తుగా అతడు ఉదయము ఉదయమే క్లాసుకు వచ్చాడు. అప్పుడు మమ్మా మురళి నడుస్తూ ఉంది. అతను చాలా ఏకాగ్రతతో మురళి వింటూ ఉండినాడు. చివర్లో అతను లేచి నిలబడి -





పిల్లల ఉత్తరాలు చదువుతున్న మమ్మా - బాబా

"అమ్మా! నన్ను క్షమించండి అంటూ ఏడ్వడం ప్రారంభించాడు. మమ్మా అతనికి మమత నిండిన దృష్టినిచ్చారు. అతడు మమ్మాను చాలా చాలా క్షమాపణలు వేడుకున్నాడు తన ఈ బలహీనతను మమ్మా ముందుంచాడు. నన్ను ఈ చెడు అలవాటు నుండి వదిలించు. అప్పుడు మమ్మా - ఈ బలహీనతను నాకిచ్చేయి........... అని అన్నారు. ఈ విధంగా ఆ వ్యక్తిని మమ్మా ఉద్ధరించారు. మమ్మా అందరి కష్టాలను స్నేహపూరిత దృష్టితో శుభ భావనతో దూరము చేసేవారు. నేను 6 మాసాలు మధువనములో ఉండినాను. అక్కడ మమ్మా తన మధురమైన శిక్షణలతో నిర్భయత మరియు సత్యతా గుణాన్ని నేర్పించారు. యజ్ఞ మాత-పితలతో సత్యంగా ఉంటే, మీ జీవితము శ్రేష్ఠంగా తయారవుతుందని మమ్మా చెప్పేవారు. ఇలా మా మాతేశ్వరి అన్ని రకాలైన శిక్షణలను ఇచ్చేవారు.

# తల్లి - సరస్వతే నాకు గురుముఖి లిపి చదువుట, వ్రాయుట నేర్పించారు

అహ్మదాబాదు నుండి సరళా దీది మమ్మాతో తన అనుభవాలను వినిపిస్తూ ఇలా అంటున్నారు - మధురమైన మమ్మాతో ఏ మధుర మిలనము ఈ జీవితంలో జరిగిందో, ఏ అలౌకిక అనుభవము ప్రాప్తి అయ్యిందో, దానిని వర్ణన చేయడంలో నాకు అలౌకిక ఆనందము అనుభవమౌతూ ఉంది. ఇప్పటికి 49 సంవత్సరాల క్రితము బొంబాయి మాతుంగలో మా పొరుగు ఇంటికి బ్రహ్మకుమారి అక్కయ్యలు వచ్చారు. మొట్టమొదట బ్రిజేంద్రదాదీ గారితో నేను కలవడము జరిగింది. బ్రిజేంద్రదాదీ హోలి పండుగ జరుపుకునేందుకు ఆబూకు వెళ్తూ ఉండినారు. వారు మా లౌకిక అవ్వను, లౌకిక అక్కను వెంట తీసుకెళ్లేందుకు వచ్చారు. ఎందుకంటే వారు ఆశ్రమానికి వస్తూ పోతూ ఉండినారు. అప్పటికి నేను నా ఎస్.ఎస్.సి పూర్తి చేశాను. నన్ను కూడా మధువనానికి తీసుకెళ్లమని అడిగాను. నేను కూడా వారి వెంట ఆబూకు వచ్చాను. అప్పుడు కోటాహౌస్‌లోను, ధౌల్‌పూర్ గృహములో ఆశ్రమముండేది. నాకు అప్పుడు పితాశ్రీ ఎవరో, మాతేశ్వరి ఎవరో వారితో మనకేమి సంబంధమో తెలియదు. అచ్చటికి చేరుతూనే హాలులో ఒక గద్దె పై పితాశ్రీ, రెండవ గద్దె పై మాతేశ్వరిగారు విరాజమానమై ఉన్నారు. అప్పటికి భారతదేశమంతటా కలిసి కేవలం 5-6 సేవాకేంద్రాలు మాత్రమే ఉండేవి. ఆ సేవాకేంద్రాలన్నిటి నుండి కొంతమంది సోదరీ-సోదరులు హోలి పండుగ జరుపుకునేందుకు ఆబూకు వచ్చారు. మేము కూడా హోళి పండుగ జరుపుకునేందుకు వచ్చి చేరుకున్నాము. బాబా - మమ్మా జతలో మేము హోలి జరుపుకున్నాము. దాని వలన మా మనస్సు చాలా ప్రసన్నమైపోయింది.

## సాధనా దేవిగా తయారై మాతృదేవిగా అయ్యింది

మమ్మా కుమారిగా ఉండినా, పురుషార్థము చేసి మాతేశ్వరిగా, యజ్ఞమాతగా అయ్యి ఆధ్యాత్మిక జీవితములో ముందుకు సాగిపోయారు. వారిని చూచి నాకు వారి వలె తయారయ్యేందుకు ప్రేరణ లభించింది.



బాబా తమాషాగా నాతో ఇలా అన్నారు - "బిడ్డా! నీవు మమ్మా వలె తయారవ్వాలా? అలా అవ్వాలనుకుంటే మమ్మా తోక పట్టుకో అనగా మమ్మాను అనుసరించు కామధేనువు తోక పట్టుకుంటే ఈ సంసారమనే సాగరాన్ని దాటుకుంటారని అంటారు కదా. అలా నీవు కూడా మమ్మా వలె అవ్వాలనుకుంటే, మమ్మా తోక పట్టుకో(అనుసరించు)" అని అన్నారు.



ముంబయి సాయన్ - మాతేశ్వరిగారితో కాకూభాయి, నానీ మా(సరళా దీది తల్లి), విజయ బహన్, జమునా దాదీ, బ్రిజేంద్ర దాది వెనుక వైపు నిమ్ము బహన్, నళినీ బహన్

## మంత్ర ముగ్ధము చేయు రెండు శబ్ధాలు

మమ్మా సంగీత విద్యలో ప్రవీణురాలు. వారిది చాలా ప్రభావశాలి వ్యక్తిత్వము. మమ్మాగారు పూర్తి రాత్రి అంతా మేల్కొని పురుషార్థము చేసేవారు. పురుషార్థము పట్ల వారికి చాలా ప్రీతి మరియు పట్టుదల ఉండేది. ఈ విషయాలు వారి వలె మేము కూడా అవ్వాలనే ప్రేరణనిచ్చాయి. ఎప్పుడు బాబాగారు మమ్మాను పిలిచినా లేక ఏదైనా సేవ తెలిపినా, మమ్మా నోటి నుండి రెండు శబ్ధాలు మాత్రమే వచ్చేది. "జీ

బాబా (సరే బాబా)." ఈ రెండు శబ్దలలో బాబా పట్ల వారికి గల గౌరవము, స్నేహము ఎంత నిండి ఉండేదంటే - వినే వారిని ఆ రెండు శబ్దాలు మంత్రముగ్ధులుగా చేసేవి.

### దైవీ సభ్యతా సంస్కారాన్ని నింపే ఆదిశక్తి

మమ్మా మాకు ఇలా శిక్షణను ఇచ్చేవారు - పరస్పరము మీరు మాట్లాడుకునేటప్పుడు చాలా తగ్గు స్వరములో మాట్లాడాలి. ఇరువురు మాట్లాడుకుంటూ ఉంటే మూడవ వ్యక్తికి కూడా వినపడనంత మెల్లగా మాట్లాడాలి. మమ్మా నడిచేటప్పుడు కూడా ఇతరులకు ఏ మాత్రము తెలిసేది కాదు. వారు ఎప్పుడు వచ్చేవారో, ఎప్పుడు వెళ్లేవారో కూడా తెలుసుకోలేనంత నెమ్మదిగా, నిశ్శబ్ధంగా నడిచేవారు. పిల్లలూ! మనము నడిచే విధానము భూమిని కష్టపెట్టకుండా ఉండాలని చెప్పేవారు. చాలామంది రావణుడు నడిచినట్లు నడుస్తారు. రావణుడు నడిచేటప్పుడు భూమి కదిలేది, వణికేది అని కథలలో చెప్తారు. మనము దేవతలుగా అయ్యేవారము అందువలన మన నడక దేవతల వలె ఉండాలి. శబ్దము బొత్తిగా రాకూడదు. ఒకరినొకరు ఎలా పిల్చుకోవాలో కూడా మమ్మా మాకు నేర్పించారు. బొంబాయిలో ఉన్నప్పుడు మా ఇంటి ఎదురుగా మా అవ్వగారిల్లు ఉండేది. మేము ఎవరినైనా పిలవాలనుకుంటే మేము మా ఇంటి నుండే గట్టిగా ఇలా వచ్చి ఈ మాట విను అని పిలిచేవారము. ఒకసారి మమ్మా క్లాసులో ఇలా వినిపించారు - ఒకరికొకరు బిగ్గరగా శబ్దము చేస్తూ మాట్లాడుకోరాదు. ఆ వ్యక్తి దగ్గరకెళ్ళి నీతో కొద్దిగా మాట్లాడాలి, ఇలా రండి అని చెప్పాలి. ఈ విధంగా శాంతి ప్రేమలతో, మెల్లగా మాట్లాడాలి. మీరు దేవతలుగా అవుతారు. దేవతలెప్పుడూ బిగ్గరగా నవ్వరు, బిగ్గరగా మాట్లాడరు, నడవరు. అన్ని పనులు నెమ్మదిగా, నిశ్శబ్ధంగా, శాంతిగా చేస్తారు. కావున మీరు కూడా అలాగే నడుచుకోవాలి. మీకు ఎవరైనా శిక్షణనిస్తే ప్రీతిగా సంయమముతో వినాలి. వారు మాట్లాడేటప్పుడు అది అలా కాదు, ఇలా కాదు, నేను చేయలేదు అని మీరు మాట్లాడరాదు. వారు చెప్పే మాటలు ఇప్పుడు పనికి రాకపోవచ్చు.



ఇప్పుడు జరగకుండా ఉండవచ్చు. బహుశా భవిష్యత్తులో పనికి వచ్చేవిగా ఉంటాయి. అందువలన ఏ శిక్షణకైనా గౌరవమివ్వాలి, దానిని గౌరవపూర్వకంగా కూడా స్వీకరించాలి.

నాకు రంగు-రంగుల డ్రస్సులు ధరించే రెండు జడలు వేసుకునే అభిరుచి చాలా ఉండేది. ఒక రోజు రాత్రి నేను బ్రిజేంద్రదాదితో మమ్మాకు గుడ్‌నైట్ చెప్పేందుకు వెళ్ళాను. అప్పుడు మమ్మా ఇలా అన్నారు - "సరళా! నీవు దేవీల ఫోటో చూశావు కదా. వారి వెంట్రుకలెలా ఉంటాయి?" నేను నిశ్శబ్ధంగా ఉండినాను. మళ్లీ మమ్మా అన్నారు - దేవతల వెంట్రుకలు జడ వేసుకోకుండా ఓపన్‌గా అయినా ఉంటాయి లేక ఒక జడ మాత్రమే ఉంటుంది. ఇలా అంటూ నా రెండు జడలు విప్పి శాశ్వతంగా ఒకే జడగా చేసేశారు. ఈ విధంగా మమ్మా అడుగడుగునా పిల్లలను సావధానపరచి శిక్షణలు ఇచ్చేవారు, ఎంతవరకు అనగా మమ్మా నాకు చీర కట్టుకోవడం కూడా నేర్పించేవారు. గురుముఖి లిపి చదవడం, వ్రాయడం కూడా నేర్పించారు.

### లౌకికతను బలి తీసుకొను కాళికా మాత

నన్ను మమ్మాగారే బాబాకు సమర్పణ చేశారు. మమ్మా నవ్వులాటగా ఇలా అనేవారు............ సరళా ఈ మమ్మా తల్లే కాకుండా కాళికా దేవి కూడా. కాళికా దేవి! నిన్ను తప్పకుండా బలి తీసుకుంటుంది. నేను చిరునవ్వుతూ వినేదానిని. నా లౌకిక తల్లి సేవ కూడా నేనే చేయవలసి ఉండేది. ఒక రోజు సభలోనే మమ్మా నన్ను గట్టిగా హెచ్చరించారు. నీవు మీ ఒక్క తల్లి కొరకు స్వయం జగన్మాత అవ్వకుండా వంచితమైపోతావా? ఈ మాట నా మనస్సులో బాణము వలె గుచ్చుకుంది. ఆ తర్వాత నేను ఈశ్వరీయ సేవలో సమర్పితమయ్యేందుకు సిద్ధపడ్డాను. నాకు ఒక అక్క, ఒక చెల్లెలు కూడా ఉండేవారు. వారు నా లౌకిక తల్లి క్షేమ సమాచారాలు చూడసాగారు. ఈ విధంగా కాళికా మాత నన్ను బలి తీసుకుని నన్ను శివ పితకు అర్పించారు. నన్ను కర్మబంధనాల నుండి లౌకిక బంధనాల నుండి

విడిపించారు.

సమర్పితమైన పిదప మమ్మా మొదట నన్ను బ్రిజేంద్రదాది వద్దనే ఉంచారు. కొంత సమయమైన తర్వాత మమ్మా నన్ను సరళా నీవు పూనాకు వెళ్తావా? అని అడిగారు. అందుకు నేను - మమ్మా మీరెలా చెప్తారో, ఎక్కడకు పంపుతారో, అక్కడకు వెళ్తానని అన్నాను. నన్ను పూనాకు పంపేటప్పుడు మమ్మా నాకు శిక్షణనిచ్చి హితవు చెప్పారు - "అందరూ నా వారే, బాబా వారే అని భావించి నిమిత్త భావముతో సేవ చేయాలి, ముందుకు వెళ్తూ ఉండాలి. "

## అన్ని పనులు చేస్తూ గుప్త పురుషార్థులుగా ఉండండి

మమ్మా చెప్పేవారు - మన పురుషార్థము సదా గుప్తముగా ఉండాలి, షో కొరకు కాదు. సేవ వదిలేసి అందరి నుండి వేరుగా యోగములో కూర్చోరాదు. అన్ని పనులు చేస్తూ అందరితో ఉంటూ గుప్త పురుషార్థము చేయాలి. స్వయం మమ్మా కూడా అలాగే చేస్తూ ఉండేవారు. మమ్మాను చూస్తే నాకు అప్పుడప్పుడు శీతలమైన తల్లి, అప్పుడప్పుడు కాళికా తల్లిగా అనుభవమయ్యేది. మమ్మా జగదంబగానే ఉండినారు. మమ్మానే దేవిగా కూడా ఉండేవారు. అందరి మనోకామనలను పూర్తి చేయు కామధేనువు తల్లిగా కూడా ఉండినారు.

## సరస్వతి తల్లియే నాకు జ్ఞానము నేర్పి, యోగము చేయించారు

మధువనములో ఉంటున్న బ్రహ్మాకుమారి మోహిని బెహన్‌జీ తమ అనుభవాన్ని వినిపిస్తూ ఇలా అంటున్నారు - నేను మొట్టమొదట 1955 సంవత్సరములో ఆబూలోనే మమ్మాను కలిశాను. అప్పుడు నా వయస్సు 14 సంవత్సరాలు. నేను మమ్మా-బాబాలను చూచినప్పుడు వారు నాకు కాంతి వలయములో కనిపించారు. వారి మధురమైన దృష్టి నా పై పడ్తూనే - "నేను ఎక్కడకు వచ్చాను, ఏ ఫరిస్తాల ప్రపంచములోకి వచ్చాను............" అని ఆలోచనలో పడ్డాను. అది ఈ ప్రపంచము కంటే చాలా భిన్నంగా, ప్రియంగా కూడా ఉండినది. అప్పుడు నాకు జ్ఞానము గురించి ఇంత వివరము తెలియదు. కాని బ్రహ్మాబాబా శరీరములో శివబాబా అవతరించి ఉన్నారని, వారు ఈ ఈశ్వరీయ జ్ఞానమిస్తున్నారని నిశ్చయము మాత్రము పూర్తిగా ఉండేది.

బాబా నన్ను చూచి మమ్మాతో అన్నారు - మమ్మా ఈ అమ్మాయికి 7 రోజుల కోర్సు చేయించండి. బాబా నాతో కూడా ఇలా అన్నారు - నీవు మమ్మా వద్ద 7 రోజుల జ్ఞానము విను. బాబాకు చిన్న పిల్లలంటే చాలా విశేషమైన ప్రేమ. వారిని జ్ఞానముతో పాలించడంలో విశేష గమనముంచేవారు. బాబా అనేవారు - ఈ చిన్న చిన్న పిల్లలు కూర్చుని ఎవరికైనా జ్ఞానము వినిపిస్తే వినేవారు చాలా ప్రభావితమౌతారు. మేము కూడా వీరి వలె అవ్వాలి లేక మా పిల్లలు కూడా వీరి వలె తయారవ్వాలి అని అనుకుంటారు. మమ్మా నాకు 3 రోజులలోనే ఈ ఈశ్వరీయ జ్ఞానములోని 7 రోజుల కోర్సు చేయించారు. ప్రతిరోజు సాయంకాలము ఆ చదువులో పరీక్ష పెట్టేవారు. బాబా ప్రశ్నలడిగేవారు. నేను చెప్పే జవాబులు విని బాబా చాలా సంతోషించేవారు. ఈ విధంగా జ్ఞాన జ్ఞానేశ్వరి సరస్వతి తల్లి నాకు జ్ఞానాన్ని నేర్పించారు. యోగమును అభ్యాసము చేయించారు.

మమ్మాగారి విశేషత - పాలనా శక్తి, మమ్మా నాకు ఎంత ప్రేమనిచ్చారంటే అంత ప్రేమ బహుశా నా లౌకిక తల్లి కూడా ఇచ్చి ఉండదు. మమ్మాగారి ఆదేశాలు, పాలన, ప్రేమ నా జీవితాన్నే మార్చేశాయి.

మమ్మాయే నాకు ఉపన్యసించే విధానము కూడా నేర్పించారు. ఒకసారి మమ్మా ఉపన్యసించేందుకు బయటకు వెళ్లేటప్పుడు నీవు నా జతలో రావాలి, అచ్చట మొదట నీవు మాట్లాడాలి, తర్వాత నేను మాట్లాడ్తానని అన్నారు. అందుకు నేను మమ్మా, నాకు మాట్లాడుడం రానే రాదు, అంతమంది మనుష్యుల ఎదుట నేను ఎలా మాట్లాడగలను? అని అన్నాను. అప్పుడు మమ్మా ఇలా అన్నారు - నీవు పెద్ద శరీరాలకు జ్ఞానము వినిపించడం లేదు, నీవు జ్ఞానము వినిపించాల్సింది ఆత్మలకు. నీవు ఆత్మలను చూడు. చిన్న చిన్న బిందు రూపములో ఉన్న ఆత్మలను చూచి మాట్లాడు. అప్పుడు నేను అచ్చటికి వెళ్లి "ఆత్మ" పై మాట్లాడాను. మొదట నా ఉపన్యాసాన్ని మమ్మాకు వ్రాసి చూపించాను. మమ్మా అందులో కరెక్షన్ చేసి కూడా ఇచ్చారు. ఈ విధంగా మమ్మా నాకు ప్రేమనిచ్చారు, పాలన చేశారు, జ్ఞానము అర్థం చేయించారు, యోగాభ్యాసము కూడా చేయించారు, ఉపన్యసించడం నేర్పించారు.

మమ్మా, బాబాకు ఒక గొప్ప ఆజ్ఞాకారి పుత్రిక. దానికి ఒక ఉదాహరణ వినిపిస్తాను. ఒకసారి జరిగిన విషయము - ఆబూకు బాబా-మమ్మాను కలుసుకునేందుకు ఒక పార్టీ వచ్చింది. వారు అదే రోజు పోవలసి ఉంది. వారు బాబా - మమ్మాలతో శెలవు తీసుకొని వెళ్ళునప్పుడు బాబా మమ్మాతో - మమ్మా పిల్లలు వెళ్తున్నారు వారికి సగ్గు బియ్యము హల్వా చేసి ఇవ్వు. మమ్మా వెంటనే "సరి బాబా" అని ఒప్పుకున్నారు. నేను మమ్మా మాట వింటూనే ఆశ్చర్యపోయాను. వారు అప్పుడే వెళ్తున్నారు. కాని సగ్గుబియ్యము హల్వా చేసేందుకు చాలా సమయము పడ్తుంది. ఇంత వేగంగా హల్వా ఎలా తయారౌతుంది? అప్పుడు మమ్మా నవ్వుతూ అన్నారు - బాబా చెప్పినారంటే అది తప్పకుండా తయారౌతుంది. మమ్మా హల్వా చేసేందుకు కూర్చున్నారు. పార్టీ వారేమో వెళ్లిపోయారు. నేను పోయి మమ్మా వారు వెళ్లిపోయారని చెప్పాను. మమ్మా సరే అని హల్వా చేస్తూనే ఉండినారు, బయటకు పోయి చూచాను. వారు గేటు దాటి వెళ్లిపోయారు. నేను మళ్లీ వచ్చి మమ్మాతో - మమ్మా వారు అంత దూరము పోయారు అని చెప్పాను.



మమ్మా సరేలే అన్నారు. మమ్మా హల్వా చేస్తూనే ఉండిపోయారు. వారేమో బస్‌స్టాండ్‌కు వెళ్లిపోయారు. బాబా వచ్చి - మమ్మా హల్వా తయారైపోయిందా? అని అడిగారు. మమ్మా - తయారౌతూ ఉంది బాబా అని అన్నారు. చివరికి హల్వా తయారైనది. బాబా హల్వాను ఒక డబ్బాలో నింపి ఒక సోదరునికిచ్చి బస్టాండుకు పోయి ఈ డబ్బా ఆ పిల్లలకు ఇచ్చి రమ్మని చెప్పారు. అప్పుడు యజ్ఞములో ఒక బండి(కారు) కూడా లేదు. ఆ అన్నయ్య పరుగెత్తికెళ్లి బస్టాండు చేరుకున్నాడు. బస్సు బయలుదేరుతూ ఉంది. ఆ సోదరుడు చేతితో బస్సును ఆపాడు. బస్సు నుండి పార్టీలోని ఒక సోదరుడు బయటకు వచ్చాడు. బాబా పంపిన హల్వా తీసుకొని వారందరూ గద్గదమయ్యారు. మమ్మా-బాబా మా కొరకు హల్వా తయారు చేసి పంపించారు. వారు ఆబూరోడ్ చేరుతూనే బాబా కొరకు ప్రేమ మరియు ధన్యవాదాలతో నిండిన జాబు వ్రాశారు. ఖుషీలో మగ్నమై బాబా స్మృతిలో హల్వా తిన్నారు. ఈ విధంగా మమ్మా-బాబా పిల్లలను సుఖ-సంతోషాలలో ఉంచడమే తమ కర్తవ్యంగా భావించారు.

మమ్మాగారి ముఖము, నయనాలు ఎంత ఆత్మీయంగా ఉండేవంటే - ఎవరైనా మమ్మాను ఒకసారి చూస్తే వారు తమ జీవితమంతా మర్చిపోయేవారు కాదు. ఎవరెవరు మమ్మా పాలనను పొందారో, వారు ఈ జ్ఞానములో స్థిరంగా, అచంచలంగా నడిచారు. ఇంకా నడుస్తూనే ఉన్నారు. మమ్మా వ్యక్తిత్వము చాలా ప్రభావశాలిగా, శక్తిశాలిగా ఉండేది. మమ్మా ఎదుట ఎవరైనా బయట వ్యక్తి గాని, యజ్ఞ వత్సలైనా అసత్యము చెప్పలేకపోయేవారు. వారికి ధైర్యముండేది కాదు. వారి ఎదుటకు వస్తూనే వారు ఆమె ఆత్మిక దృష్టితో ప్రభావితమై తమను చిన్న బిడ్డగా అనుభవము చేసుకునేవారు. వారిని తమ తల్లిగా లేక దేవిగా, శక్తిగా అనుభవము చేసేవారు. ఉన్నది ఉన్నట్లు సత్యము చెప్పేవారు.

మమ్మా మా ద్వారా చిన్న చిన్న తప్పులు కూడా జరగరాదని భావించేవారు. ప్రతి పుత్రుడు తప్పుల నుండి ముక్తమైపోవాలని

కోరుకునేవారు. మా ద్వారా ఇతరుల దినచర్యకు ఎలాంటి కష్టము జరగరాదని లేక వారి కార్యాలకు ఎలాంటి ఆటంకము కలగరాదని మాకు నేర్పించేవారు. ఈ విషయములో నాకు ఒక సంఘటన గుర్తుకు వస్తోంది. నేను మొట్టమొదట మధువనములో మురళి వ్రాసే సేవ చేసేదానిని. నా లక్ష్యమేమంటే ఉదయము టిఫిన్ తర్వాత వ్రాయడం మొదలు పెడ్తే దానిని పూర్తి చేసే భోంచేయాలనే లక్ష్యముండేది. చాలాసార్లు ఒక్కొక్క మురళి చాలా పెద్దదిగా ఉండేది. కావున పూర్తి చేయడంలో ఆలస్యమైపోయేది. అందరూ భోంచేసి వెళ్లిపోయేవారు. నేనొక్క దానిని మిగిలిపోయేదానిని. నా వలన భోజనము వడ్డించే మాత కాచుకొని కూర్చునేది. మమ్మా దీనిని మొదటిసారి చూచినప్పుడు ఏమీ అనలేదు. ఇంకోసారి జరిగినప్పుడు మమ్మా నన్ను పిలిచి - చూడు మోహినీ నీ వలన ఆ మాత చాలా సేపు కూర్చోవలసి వస్తుంది. నీవు ఆలస్యము చేసినందున ఆమె కూడా ఆలస్యంగా భోంచేయవలసి వస్తుంది. తర్వాత ఆమె చేయవలసిన యజ్ఞసేవలో గాని, పాత్రలు యథాస్థానానికి చేర్చడము మరియు ఆమె వ్యక్తిగత పనులు గాని, సమయానికి చేయలేక హెచ్చు-తగ్గులౌతాయి. కావున నీవు సమయానికి భోంచేస్తూ ఉండు.......... నేను అలాగే మమ్మా అని అన్నాను. రెండు మూడు రోజుల తర్వాత నేను మళ్లీ నా ప్లాను ప్రకారమే మురళి వ్రాయడం పూర్తి చేసే భోజనము చేసేందుకు వెళ్లాను. ఆ మాత నా కొరకు కాచుకొని ఉండినారు. మమ్మా నన్ను మళ్లీ పిలిచి, మోహినీ ఈ రోజు నుండి 15 రోజుల వరకు భోజనము వడ్డించే సేవ నీవు చేయాలి అని చెప్పారు. నేను మౌనంగా ఉండిపోయాను. మమ్మా చెప్పినట్లు చేసేందుకు ఒప్పుకున్నాను. ఆ రోజు భోజనము వడ్డించేందుకు కూర్చుంటే అందరూ భోజనము చేసేటప్పటికి నా స్థితి చాలా చెడిపోయింది. అందరికీ తినిపించిన తర్వాత నేను తినవలసి వచ్చింది. ఆ తర్వాత పాత్రలన్నింటిని తమ స్థానాలకు చేర్చడం, మొదలైన పనులు చేయుటలో నా స్థితి చాలా చెడిపోయింది. మరుసటి రోజే నేను మమ్మాతో - "మమ్మా నేను ఈ సేవ చేయలేను ఇక ముందు నేను సమయానికి వచ్చి భోంచేస్తాను, ఆలస్యము చేయను అని చెప్పాను.



ఒక రోజుకే నీవు ఇంత పరేషాన్ అయ్యావా? ఆ మాత ప్రతిరోజు ఇటువంటి పరిస్థితిని ఎదుర్కుంటోంది, ఆమె ఎలా చేస్తూ ఉంది? అయినా నీవు 15 రోజులు సేవ చేసే తీరాలి" అని మమ్మా అన్నారు. ఈ విధంగా నాకు సేవ ఇచ్చి, చిన్న తప్పుతో కూడా ఇతరులకు ఎంత కష్టము కలుగుతుందో ప్రతి వ్యక్తి తమ పనులు తాము చక్కగా లేక సరియైన సమయానికి చేయడం వలన సేవలో అందరికీ ఎంత సహయోగము మరియు సఫలత లభిస్తుందో అనుభవము చేయించారు. ఆ రోజు నుండి నా కారణంగా ఇతరుల సేవలో కష్టము కలగకుండా ధారణ చేశాను. ఈ రోజు వరకు దానిని గమనముంచుకుంటూ వస్తున్నాను.

మమ్మా తన నోటి నుండి ఎప్పుడూ ప్రయత్నిస్తాను, చూస్తాననే మాటే అనలేదు. బాబా చెప్తూనే మమ్మా తన సైన్యమును వెంట బెట్టుకొని ఆ కార్యములో నిమగ్నమయ్యేది. ఎందుకంటే మమ్మా మాకిదే చెప్పేవారు - ఈ కార్యము అప్పగించిందెవరు? ఈ కార్యము జరిగేది కాకుంటే వారెందుకు చెప్తారు? బాబా మనకే ఈ కార్యమెందుకిచ్చారు? ఆ పని చేసేందుకు అర్హత ఉంది కనుకనే ఇచ్చారు కదా. బాబాగారి ఏ ఆజ్ఞ పట్ల గాని, సేవ కొరకు గాని ఎప్పుడూ లేదు అని చెప్పరాదు. ఈ విధంగా మమ్మా నుండి చాలా ప్రేరణలు తీసుకుని, వారు చూపిన మార్గములో నేను నడుస్తున్నాను. ఆధ్యాత్మిక జీవితాన్ని ఉన్నతమైన శిఖరము పైకి చేరుస్తున్నాను.

## మమ్మాగారి వరదానాలతోనే నేను ముందుకు పోతున్నాను

గాంధీనగరము నుండి బ్రహ్మకుమారి కైలాష్ బెహన్‌జీ ఇలా వ్రాస్తున్నారు - ఇది1959వ సంవత్సరములో జరిగిన విషయము - నేను అప్పుడు చాలా చిన్నదానిని. అప్పట్లో నా తల్లిదండ్రులు జ్ఞానములో నడుస్తూ ఉన్నారు. వారితో పాటు నేను కూడా ప్రతి రోజు సెంటరుకు వెళ్ళేదానిని. నాకు అక్కయ్యల జీవిత విధానము, వారు వ్యవహరించు విధానము, వారి ప్రేమ చాలా బాగా నచ్చాయి. ఆ రోజులలోనే మమ్మా జలంధర్ సేవాకేంద్రానికి వచ్చారు. నేను కూడా నా తల్లిదండ్రులతో జలంధర్ సేవాకేంద్రానికి వెళ్ళాను. మమ్మాను కలవడమే కాక వారి ముందు ఒక పాట కూడా పాడాను. నా పాట మమ్మాకు చాలా బాగా నచ్చింది. వారు నవ్వుతూ "నీవు చాలా పాత పరిచయమున్న బాబా బిడ్డవు. యజ్ఞము నుండే వెళ్ళావు, మళ్ళీ యజ్ఞములోకే వచ్చేశావు. చూడు బిడ్డా! బబా సేవ కొరకు వేరు వేరు స్థానాలకు, వేరు వేరు విధానాలతో బాబా అనేక యుక్తులతో పంపిస్తూ ఉంటారు. బాబా మీ ద్వారా సహజంగానే సేవ చేయించుకుంటారు. మీరు శ్రమ చేయవలసిన పని ఉండదు." మమ్మా ఇచ్చిన ఈ వరదానము నాకు సదా గుర్తుంటుంది. ఈ రోజుకు కూడా నన్ను బాబా నిమిత్తంగా చేసి సేవ చేయిస్తున్నారు.

తర్వాత నాకు కొద్దిగా నా పెద్దనాన్నగారి ద్వారా బంధనము(విఘ్నము) వచ్చింది. కాని నాకు బాబా తోడు, సహాయము చాలా లభించింది. నా వివాహము చాలా వైభవంగా, ఆడంబరంగా చాలా బాగా చేయాలని నా పెద్దనాన్నకు చాలా ఆశ ఉండేది. కాని నేను నా మనస్సులో ఏమి జరిగినా నేను బ్రహ్మకుమారీల వలె జీవితాన్ని తయారు చేసుకొని బాబా సేవను చాలా బాగా చేయాలని పక్కాగా నిశ్చయించుకొని ఉన్నాను. బంధు-మిత్రుల తరఫు నుండి ఎలాంటి సహాయము ప్రోత్సాహము లభించకపోవడమే కాక ఇంకా ఎక్కువ విరోధులుగా అయ్యారు. నా తల్లిదండ్రులకు నేను బ్రహ్మకుమారీగా అవ్వాలనే కోరిక ఉండేది. ఏ సేవ చేస్తున్నా నాకు అలౌకిక నషా ఉండేది. నేను చదువుకున్న దానిని కూడా కాదు. కావున లోలోపలే చాలా ఆలోచిస్తూ ఉండేదానిని. నా మనస్సులోని ఆలోచనలను నాకు గల బంధనాలను బాబా-మమ్మాలకు లేఖ ద్వారా తెలుపుతామనే ఆలోచన వచ్చింది. నేను మమ్మా-బాబాకు జాబు వ్రాశాను - "మమ్మా నేనేమీ చదువుకోలేదు, నాకేమీ రాదు, నేను ఎల్లప్పుడూ సెంటరులోనే ఉండాలంటే ఏం చేయాలి, ఏ



విషయాల పై గమనమివ్వాలి? కొన్ని రోజులైన తర్వాత మమ్మా నుండి జాబు వచ్చింది. మమ్మా చాలా ప్రేమభరిత జాబు వ్రాశారు. జీవితములో జ్ఞాపకము ఉంచుకోవలసిన చాలా మధురమైన చాలా మంచి మంచి విషయాలు జాబులో వ్రాశారు. నేను ఒక అక్కయ్యను పిలిపించుకుని వారి ద్వారా పూర్తిగా చదివించుకున్నాను.

మొదట మమ్మా ఈ విధంగా జాబు వ్రాశారు - బచ్చీ! నీవు మీ ఇంటి నుండి బాబా ఇంటికి వస్తే ఇక మీదట సదా కొరకు నా ఇల్లు ఇదే, ఈ ఇల్లు తప్ప నాకు మరో ఇల్లు గాని, పరివారము గాని లేదని దృఢంగా భావించి గుర్తుంచుకోవాలి. బాబా, మమ్మా మరియు దైవీ పరివారము తప్ప నాకు వేరే పరివారమేదీ లేదు. రెండవది బాబా ఇలా వ్రాశారు - ఈ విషయము బాగా గుర్తుంచుకోవాలి - నేను బాబా ఇంటికి ప్రాణముతో వచ్చాను, ఇక బాబా ఇంటి నుండి మరణించిన తర్వాతే వెళ్తాను. మూడవ విషయము - బిడ్డా! ఇది కూడా గమనముంచుకో - సేవార్థము చాలా చోట్లకు పోవలసి వస్తుంది. ఎప్పుడూ ఒక ఇంటిలోని విషయాలు మరో ఇంటిలో తెలుపరాదు. ఈ విషయాలన్నీ అమలుపరచి చివరి వరకు బాబా బిడ్డగా ఉండిపోతాను. ఎలాగైతే వివాహమైన తర్వాత కన్య ముందున్న ఇంటిని వదిలి ఆ ఇంటిని మర్చిపోయి అత్తగారింటికి గృహిణిగా మారిపోతుందో అలా అవ్వాలి. అప్పుడే ఆమె మంచిరీతిగా అందరినీ సంతోషపరుస్తూ స్వయం కూడా సంతోషంగా ఉండగలదు. మాటిమాటికి తల్లిగారింటి విషయాలు మాట్లాడుతూ ఉంటే బాగుండదు. అలాగే బాబా ఎక్కడకు పంపినా, ఎలా ఉంచినా, ఎటువంటి స్థానమైనా, ఎటువంటి వారు సాథీలుగా (జతగాళ్ళుగా) ఉండినా, మనము అందరితో మంచిరీతిగా ఉండాలి. అందరి జతలో ఉంటూ అందరినీ గమనిస్తూ నడుచుకోవాలి. అందరితో నీ స్వభావ - సంస్కారాలు కలసిపోవునట్లు నడుచుకోవాలి. ఆ రోజుకు, ఈ రోజుకు నాకు ఈ శిక్షణలు సదా గుర్తున్నాయి, అదే విధంగా నేను ఈ విషయాల పై గమనముంచి నడుచుకుంటున్నాను. బాబా నడిపిస్తున్నారు. ఈ మాటలు మామూలు మాటలు కాదు. నాకు ఈ మాటలు వరదానాలుగా అయిపోయాయి. బాబా - మమ్మా వరదానాల ద్వారా ఇతర సర్వ ఆత్మల ఆశీర్వాదాలతో నడుస్తున్నాను.

కర్నాటకలోని బీదర్ నుండి బ్రహ్మకుమారీ సంతోష్ బెహన్‌గారు ఇలా వ్రాస్తున్నారు - స్త్రీ జీవితము ఒక ఊయల వలె ఒకసారి ఈ తీరానికి, ఒకసారి ఆ తీరానికి వెళ్తూ ఉంటుంది. కాని నా మధురమైన ప్రాణదాయిని తల్లి నా జీవితాన్ని ఆ తీరము నుండి అంతులేని ఆనందము గల ఈ తీరానికి చేర్చి వేశారు. లౌకిక జన్మలోనే జగత్పాలకుని దయతో జీవితములో సంపన్నత ఉండేది.

1965 మే నెల 31 తేదిన జరిగిన విషయము. లౌకిక తల్లిదండ్రులు మరియు కమలసుందరి దాది నా చేతిని మధురమైన మమ్మా మరియు బాప్‌దాదాగారి చేతులలో ఉంచేసి ఈ రోజు నుండి ఈ కన్య మీ కన్య అని అన్నారు. నాకు "ఈ అమ్మాయి మీది" అన్న మాట విని ఇదేదో చిక్కుప్రశ్నగా ఉందనిపించింది. అప్పుడు నా వయస్సు 15 సంవత్సరాలు ఏమీ తెలియని ఆ వయస్సులో నా హితము గురించి ఆలోచించువారు నా కొరకు ఏ ఏ ప్రణాళికలు తయారు చేస్తున్నారో నాకు అర్థము కాని విషయంగా ఉండినది. నేను 1950 సంవత్సరము మే 31 వ తేదిన పూనాలో శారీరిక జన్మ తీసుకున్నాను. సరిగ్గా 10 సంవత్సరాల తర్వాత మొదటిసారి లౌకిక తల్లితండ్రులతో సేవాకేంద్రానికి వెళ్ళే శుభదినము వచ్చింది. అది కూడా మే 31వ తేదియే(1960). 1965 సంవత్సరము మే 31వ తేది నేను మూడవ జన్మలో ప్రవేశించే ఘడియ ఆసన్నమయింది. ఆ రోజు ఉదయము నాశ్తా(టిఫిన్) సాకార తల్లి జతలో, మధ్యాహ్న భోజనము సాకార తల్లిదండ్రులతో, సాయంకాలం పిక్‌నిక్, రాత్రి భోజనం అలౌకిక, లౌకిక మాత-పితలు మరియు ప్రేరణ ఇచ్చిన కమలసుందరి దీది జతలో చేశాను. భోజనము తర్వాత బాప్‌దాదా ఇలా అన్నారు - చక్కని కొయ్యబొమ్మ వలె ఉండే సంతోష్ నీవు పూర్తిగా మమ్మా కుమార్తెగా అనిపిస్తున్నావు. నీ పోలికలు నీ లౌకిక తల్లితో ఏ మాత్రము కలవడము లేదు. నా హృదయము ధన్యతతో ఎగిరి గంతులు వేసింది. రాత్రి క్లాసు తర్వాత విశ్రాంతి కక్షలో ప్రవేశించేందుకు ముందు నా చేతులను తమ చేతులలోకి తీసుకొని మధురమైన మమ్మా, ఈ మధుర మహావాక్యాలు ఉచ్ఛరించారు - "నీవు



ఏమి చేశావో, అది అర్థము చేసుకొని చేశావు. బాబా చేతికి నీ చేతినిచ్చావు. వారి జతలో జీవిస్తానని ప్రమాణము కూడా చేశావు. బాగా అర్థము చేసుకొని చేశావు కదా!" అవును మమ్మా అని అన్నాను. మమ్మా మరలా ఇలా అన్నారు - "మిరపకాయలు సంచులు సంచులే తినవలసి వస్తుంది. తినగలవా?" "తినగలను మమ్మా" అని అన్నాను. మమ్మా మళ్లీ "కడవలు కడవల నీరు త్రాగవలసి వస్తుంది. త్రాగుతావా?" అని అడిగారు. త్రాగుతా మమ్మా అని అన్నాను. మా వెనుక జమునాదాది వస్తూ ఉండినారు. ప్రచండ శీతలతా సంపన్నురాలు కాని ప్రకాశవంతమైన దివిటీ వలె మాతల కక్షలో ప్రవేశించిన జమునా దాది అడిగారు - అన్నింటికీ సరే సరే అని అనేశావు దాని అర్థము తెలుసా? అందుకు నేను "తెలియదు దాదీ" అని అన్నాను. "ఓహో! అలాగైతే రేపు గదికి రా, నీకు అర్థము తెలియజేస్తాను" అని అన్నారు. వారి కంటే ముందే బాప్‌దాదా అమృతవేళలోనే తమ మధుర మహావాక్యాలలో అర్థము తెలియజేశారు. ఎంతో ఆత్మిక ఆకర్షణ నిండిన వాతావరణము నెలకొని ఉండినది. ఆ వాతావరణములో ఏ విషయమూ కష్టమనిపించలేదు. ప్రియమైన మమ్మా ఉచ్ఛరించి కవచాన్ని ధరింపజేసినట్లుంది. ఆ కవచము ఈ రోజు వరకు నేను ధరించే ఉన్నాను. ఆ కవచము ఇప్పటికీ క్రొత్తదిగానే ఉంది. ఇలా వ్రాస్తూ వ్రాస్తూ ఉంటే అనేక మధుర స్మృతులు మానసిక పటలము పైకి వస్తున్నాయి. ఏ విషయాలు వ్రాయాలి! ఏవి వ్రాయకుండా ఉండగలను! మమ్మాగారు ఇలా నిర్దేశించారు - ప్రతి స్థూల, సూక్ష్మ కర్మ ఏది చేసినా సంపూర్ణతతో నిండి మనస్ఫూర్తిగా చేయండి. చపాతి రుద్దినా, చంద్రుని వలె గుండ్రముగా ఉండాలి. దాని వలన గుండ్రముగా ఉన్న ఆ రొట్టె ఆ ఎర్రని గుండ్రని జ్యోతిని స్మృతిని కూడా ఇప్పించాలి. తినేవారు కూడా శక్తిశాలిగా అవ్వాలి.

ఒక రోజు సాయంకాలము 6-30 గంటలకు నేను ఇస్త్రీ(ప్రెస్) చేసేందుకు చాలా కష్టపడుతూ ఉన్నాను. నా చిన్న-చిన్న చేతులతో పెద్ద ఇస్త్రీ పెట్టెతో నా చీరెను ఇస్త్రీ చేస్తూ ఉండినాను. మమ్మా ఫరిస్తా వెనుక

నుండి వచ్చి ఎంత సేపటి నుండి నా సఫలత, అసఫలతల ప్రయత్నాన్ని గమనిస్తూ ఉండినారో, నాకు తెలియనే తెలియదు, ఉన్నట్లుండి నన్ను ఒక వైపుకు తొలగమని చెప్పి స్వయం మమ్మానే చీర ఇస్త్రీ చేసి చూపించసాగారు. నేను ఆనందవిభోర స్థితిలో ఇది చెప్పడమే మర్చిపోయాను - నేను ఇప్పుడు నేర్చుకున్నాను. ఇక నేనే చేసుకుంటాను. మమ్మా నాకు వస్త్రమివ్వడమే కాక మాయ దెబ్బల నుండి ముక్తముగా ఉండేందుకు బుల్లెట్ ప్రూఫ్ కవచము తొడిగారు. ఆ కవచము తొడుక్కున్నప్పుడు నా మనస్సు పాట పాడ్తుంది....................

**ఓ మాతా, ఓ మాతా!**

**నీ ఒడిలో జీవిస్తాను, నీ ఒడిలోనే మరణిస్తాను.**

**మనవారి ఊరిలోకి వచ్చేశాను,**

**నీ చల్లని చల్లని నీడలో తప్పులు వేడిమి దూరమయ్యాయి వచ్చేశాను**

**తల్లీ !..........................**

**మీ శక్తి బాహువులలోకి వచ్చేశాను, నన్ను ఇముడ్చుకోండి.**

**నేను వచ్చాను, వచ్చేశాను, వచ్చేశాను,.............**

## కరుణా శీలి, క్షమాపూరిత ప్రేమమయి తల్లి – సరస్వతి

పూనా నుండి దాదీ బృజ్‌శాంతాగారు తమ అనుభవాన్ని వినిపిస్తూ అంటున్నారు - ఒకసారి నాతో పాటు 30 మంది కన్యలను ఒక గదిలో ధ్యానములో కూర్చోపెట్టారు. అందులో నేను కూడా ఉన్నాను. అప్పుడచ్చట ఎంత శాంతి వ్యాపించిందంటే చాలా మంది కన్యలు ధ్యానము(ట్రాన్స్)లోకి వెళ్ళిపోయారు. బాబా ఓంనివాస్‌లో ఉండేవారు. మేము ఓంమండలిలో ఉండేవారము. ఓంమండలి భవనానికి మొదటి పేరు యశోదా నివాసము. చాలామంది కన్యలు ధ్యానములోకి వెళ్ళిపోయారని వారు ధ్యానములో ప్రియా-ప్రియా(పియూ పియూ) అంటున్నారని బాబాకు ఫోన్‌లో తెలియజేశారు. బాబావచ్చి వారిని ధ్యానము(ట్రాన్స్) నుండి క్రిందికి దింపేశారు.

మమ్మాలో జ్ఞాన్నాన్ని అర్థము చేయించే విధానము చాలా ప్రభావశాలిగా ఉండేది. మమ్మా ఎవరికైనా జ్ఞానాన్ని వినిపిస్తే వారు తప్పకుండా ప్రభావితులయ్యేవారు. నా తండ్రి, తాత ఇరువురూ జ్ఞానాన్ని వినేందుకు ఓంమండలికి వచ్చేవారు. సింధ్‌లో ఈ జ్ఞానము గురించి గాని, బాబాను గురించి గాని, మమ్మాను గురించి గాని ఎవ్వరికీ ఏ విధమైన విరోధ భావము గాని, ఏ విధమైన ఫిర్యాదులు గాని ఉండేవి కావు. శివబాబాను మేమప్పుడు ఆల్‌మైటీ బాబా(సర్వశక్తివంతులు) అని అనేవారము. పవిత్రతను ధారణ చేసే నియమము ప్రారంభించినప్పటి నుండి విరోధము ప్రారంభమయ్యింది. దానికి ముందు ఓంమండలిని అందరూ ప్రశంసించేవారు, గౌరవించేవారు.

ఒక రోజు మమ్మా టెన్నీస్ కోర్టుకు తీసుకెళ్ళి జ్ఞానము వినిపిస్తూ ఉండినారు. ఆ సమయములో మమ్మా అన్నారు - ఇలా చూడండి బృజశాంతా ఇలా చూడు, మీకు జ్ఞానమునెవరు వినిపిస్తున్నారు? ఈ జ్ఞానము మీకు ఎవరిస్తున్నారు? మీ ముందు ఎవరు నిలబడి ఉన్నారు? అలా అంటూ నన్ను గమనించడము ప్రారంభించారు. మమ్మా మాటలలో, మమ్మా రూపములో సాక్షాత్తు బాబాగారి స్వరూపము అనుభవమౌతూ



మాతేశ్వరిగారితో బృజ్ శాంతదాది, క్వీన్ మదర్, రామీ బహన్, మమ్మాకు వెనుక వైపు
రమేశ్ భాయి శాహ్ మరియు ఇతర సోదర-సోదరీలు

ఉండేది. అప్పట్లో బ్రహ్మబాబాను మేము ఎప్పుడూ సాధారణ రూపములో చూచేవారము కాదు. మేము బ్రహ్మబాబాను నిరాకారుల సాకార పాత్రగా గౌరవించేవారము. అప్పుడు బాప్‌దాదా అను శబ్ధము లేదు. నిరాకార శివబాబాను ఆల్‌మైటీ బాబా అని, సాకారాన్ని బాబా అని అనేవారము. ఇరువురు వేరు వేరని మాకు తెలుసు. అయినా ఇరువురు కంబైండుగా (సంయుక్తముగా) ఉన్నారని మాకు అనుభవమయింది. టెన్నీస్ కోర్టులో నాకు మమ్మాలో బాబాగారి కంబైండు రూపము అనుభవమయింది. అప్పుడు నేను - మమ్మా నేను అర్థం చేసుకున్నానని అన్నాను.

మమ్మా చాలా దయా హృదయము గలవారు. శిక్షించడం వలన ఏ వ్యక్తి అయినా చక్కదిద్దబడ్తాడని వారు విశ్వసించలేదు. ఎవరైతే తన తప్పు తెలుసుకొని ప్రాయశ్చిత్తము చేసుకుంటారో అనగా తన తప్పును తెలుసుకొని చక్కదిద్దుకుంటారో, వారే మంచి వ్యక్తులు. వారు క్షమార్హులు. అటువంటి వ్యక్తి పై మమ్మా తన ప్రేమను కురిపించేవారు. ఇటువంటి ఒక



సన్నివేశము నా విషయములో జరిగింది. కరాచీలో మేము ప్రతి రోజు డ్రిల్లు డ్రస్సు ధరించి టెన్నీస్ కోర్టులో డ్రిల్లు చేసేందుకు వెళ్లేవారము. చంద్రమణి బెహన్ మా అందరికీ డ్రిల్లు నేర్పించేది. అప్పుడప్పుడు మమ్మా కూడా వచ్చేవారు. డ్రిల్లు చేసేందుకు వెళ్లునప్పుడు అందరూ బూట్లు వేసుకునేవారు. ఏ రోజు అయితే మమ్మా వచ్చారో, ఆ రోజు నేను చెప్పులు ధరించి ఉండినాను. "నీవు బూట్లు ఎందుకు వేసుకోలేదు?" అని మమ్మా నన్ను అడిగారు. అప్పుడు నేను "మమ్మా 2-3 రోజుల నుండి పాదాలు నొస్తున్నందున వేసుకోలేదు అని అన్నాను" కాని తర్వాత మమ్మా మహారాణికి అసత్యము చెప్పానని నాలో నేను బాధపడ్డాను. ఎందుకంటే ఆ రోజు నాకు నొప్పి లేదు. బూట్లు వేసుకొని ఉండవచ్చు. అయినా నేను మమ్మాకు అసత్యము చెప్పాను. ఆ రోజులలో బాబా మాతో ఇలా అనేవారు ఎవరైనా ఏదైనా తప్పు చేస్తే మీ అంతకు మీరే ఒక రోజు టిఫిన్ గానీ, భోజనము గాని మానేసి మీ అంతకు మీరే శిక్ష వేసుకోండి. ఈ మాటలు నాకు గురుకొచ్చి త్వరత్వరగా అందరికీ నాశ్తా(టిఫిన్) వడ్డించి బయటకు వచ్చేశాను. వడ్డించే డ్యూటీ నాది మరియు ఆత్మమోహిని సహోదరిది. 8 గంటలకంతా టిఫిన్ వడ్డించే పని పూర్తయిపోయింది. 9 గంటలకు మమ్మా తన గది నుండి క్రిందికి వచ్చారు. క్రింద ఒక బెంచి ఉండేది. మమ్మా ఆ బెంచి పైన కూర్చునేవారు. వారి ముందు మేమందరము క్రింద కూర్చునేవారము. కచేరి వలె జరిగేది. ఈ కచేరిలో అందరూ తాము చేసిన తప్పులు తెలిపేవారు. నేను కూడా నిలబడి మమ్మా నేను ఈ రోజు మీతో అసత్యము చెప్పాను. అందువలన నా అంతకు నేనే శిక్ష విధించుకున్నాను అని చెప్పాను. ఏ తప్పు చేశావో, ఏ శిక్ష విధించుకున్నావో చెప్పమన్నారు. నేను విషయమంతా వివరించాను. నీవు నాశ్తా తినలేదా? అని అడిగారు. అంతవరకు మమ్మా కూడా తినలేదు. మమ్మా జతలో నీవు కూడా నాశ్తా తిను పద అని అన్నారు. నేను "లేదు మమ్మా నేను మీకు అసత్యము చెప్పాను, నన్ను శిక్ష అనుభవించనీయండి" అని అన్నాను. అప్పుడు మమ్మా - బృజశాంతా! ఈ రోజు మమ్మాను నాశ్తా చేయనీయవా? మమ్మా

నా వేలు పట్టుకుని నన్ను తీసుకెళ్లి నీవు తినకుండా నేను నాశ్తా తినను. చివరికి మమ్మా నన్ను కూర్చోబెట్టుకుని నాకు నాశ్తా తినిపించారు. ఈ విధంగా మమ్మా తల్లి కరుణామయిగా, క్షమామయిగా, వాత్సల్యమూర్తిగా ఉండేవారు.

మమ్మా ఎల్లప్పుడూ మన్మనాభవ స్థితిలో ఉండేవారు. ఎప్పుడు చూచినా మమ్మా యోగములో ఉండినట్లే, మగ్నావస్థలో ఉండినట్లే కనిపించేవారు. మమ్మాగారు చూడడం, నడవడం, మాట్లాడడం, నవ్వడం మొదలగు అన్ని విషయాలలో అలౌకికత మరియు ఆకర్షణ స్పష్టంగా కనిపించేవి. మమ్మాగారి నషా మరియు ఖుషీ ఎప్పుడూ తగ్గిపోయేవి కావు.

## మమ్మా నన్ను జగన్మాతా! అని పిలిచారు

కాశీ (బెనారస్) నుండి బ్రహ్మాకుమారి సురేంద్ర బెహన్ వ్రాస్తున్నారు. శాస్త్రాలలో వర్ణించిన విద్యాప్రదాయిని, వీణావాదిని జగదంబ సరస్వతిగారిని సాక్షాత్తుగా మిలనము చేసే పరమ సౌభాగ్యము నాకు లభించిన క్షణాలు ఎంతో అద్భుతమైనవి, అలౌకికమైనవి, దివ్యమైన అనుభూతులతో నిండినవి. ఈ అనుపమైన మహామిలనాన్ని వ్యక్తము చేసేందుకు మాటలకు సమర్థత లేదు. భక్తిలో నేను దేవీల మహిమ విన్నాను. కాని మమ్మాగారి దివ్య మిలనముతో నేను స్వయం దేవిగా తయారైపోయాను. ఇదంతా ఒక్క క్షణములో జరిగిపోయింది. ఆలోచించే సమయము గాని, అర్థం చేసుకునే సమయము గాని, తర్క-వితర్కాలు చేసేందుకు గాని, భవిష్యత్తు గురించి సంశయించు సమయమే లభించలేదు. సమయము స్తంభించిపోయినట్లు అనిపించింది. ఈ దివ్య మిలనము వలన నా నశ్వర శరీరాన్ని, సార విహీనమైన ప్రపంచాన్ని, సమయాన్ని కూడా మర్చిపోయాను. ఈ రోజుకు కూడా మమ్మాగారితో జరిపిన ప్రథమ మిలనపు క్షణాలు నా కనుల ద్వారా ముత్యాల రూపములో వెలువడ్తాయి(రాల్తాయి).

జన్మత: భక్తి సంస్కారమున్నందున ప్రతి రోజు మందిరానికి వెళ్లి పూజలు నమస్కారాలు చేసేదానిని. శివశక్తి స్వరూపమైన దుర్గాదేవి ఉపాసకురాలుగా ఉండేదానిని. మనసులో దేవిగా తయారవ్వాలనే కోరిక ఉండేది. ఈ విషయమునే నేను భగవంతుని ప్రార్థించేదానిని. ఒక రోజు నేను శివాలయములో కూర్చొని ధ్యానించు సమయములో నా ముందున్న శివలింగము అదృశ్యమైపోయింది. ఆ స్థానము నుండి ప్రకాశపుంజము వెలువడడం ప్రారంభమయింది. ఆలయ ద్వారములో తెల్లని వస్త్రాలు ధరించిన వ్యక్తి సాక్షాత్కారించింది. నేను ధ్యానములోకి వెళ్ళిపోయాను. “బిడ్డా! నీవేమి కావాలనుకుంటావో, అలాగే అవుతావు అని వినిపించింది. కనులు తెరచి చూచాను. మందిరములో శివలింగము, బయట నంది తప్ప ఇతరులెవ్వరూ లేరు. ఈ సాక్షాత్కారమే తర్వాత నన్ను మమ్మాతో మిలనము చేయించేందుకు ప్రత్యేకమైన మాధ్యమంగా అయ్యింది. ఎందుకంటే ఈ సాక్షాత్కారము తర్వాత ఎలాగైనా నేను దేవిగా



తనువు భూమి పై, మనస్సుతో సూక్ష్మ లోకములో విహరిస్తున్న అంబికా దేవి

తయారవ్వాలనే కోరిక గాఢతరమైపోయింది. ఎక్కడికైనా హిమాలయ పర్వత గుహలలోకైనా వెళ్ళి తపస్సు చేసి దేవిగా అయిపోవాలని మనస్సులో అనిపించేది. కాని కన్యనైనందున అడుగు ముందుకు వేయలేకపోయే దానిని. ధైర్యాన్ని పరీక్ష చేసుకునేందుకు కూడా ఒక హద్దు ఉంటుంది. చివరికి నా జీవితంలో డ్రామాలో నేను సత్సంగానికి వెళ్ళే మంచి సమయము రానే వచ్చింది. సత్సంగము జరుగుతూ ఉంది. ఒక రోజు చంద్రమణిదాది యోగము చేయిస్తూ ఉండినారు. నేను అచ్చట కూర్చుంటునే ధ్యానములోకి వెళ్ళిపోయాను. ధ్యానము(ట్రాన్స్)లో శివబాబా అడిగారు. "బచ్చీ! జగదంబ సరస్వతితో కలవాలనుకుంటున్నావా"? "అవును బాబా"



- అని నేనన్నాను. అప్పుడు బాబా "బచ్చీ! నీవిపుడు దేవిగా అయిపోతావు" అని అన్నారు. నేను సంతోషములో తేలిపోతూ, ఊగుతూ ఉండిపోయాను. నేను ధ్యానావస్థ నుండి మామూలు స్థితికి వస్తూనే నా ఎదుట బ్రహ్మబాబా ఫోటో తగిలించబడి ఉంది. వారిని నేను 5 సంవత్సరాల క్రితమే సాక్షాత్కారములో చూచి ఉండినాను. అచ్చటనే నాకు మాతేశ్వరి జగదంబ అమృత్‌సర్‌కు వస్తూ ఉందనే సమాచారము లభించింది.

మాతేశ్వరి జగదంబ సాక్షాత్తు దేవీ అని నేను విన్నాను. (ఈ విషయాలు బాబా నాకు ట్రాన్స్‌లో కూడా వినిపించారు) నేను మమ్మాతో కలిసే క్షణాలకై ఆతురతతో, అసహనంగా ఎదురు చూడసాగాను. చివరికి ఆ రోజు రానే వచ్చింది. మేమందరము క్లాసులో ఉన్నప్పుడు మాతేశ్వరి జగదంబ ఎదురుగా ఉన్నప్పుడు నా దృష్టి మమ్మా పై పడిన వెంటనే నాకు మమ్మాకు బదులు వీణావాదిని సాక్షాత్తు సరస్వతి దేవి సాక్షాత్కారమయింది. ఆమె నలువైపులా ప్రకాశ చక్రము తిరుగుతూ కిరణపుంజము కనిపించింది. మమ్మాగారి ఈ తేజోమయ స్వరూపాన్ని చూచి నేను ఆశ్చర్యచకితనైపోయాను. తర్వాత మమ్మా వచ్చి గద్దె పై ఆసీనమైనారు. అకస్మాత్తుగా మమ్మాగారి స్థానములో ఒకసారి దుర్గ, మరోసారి లక్ష్మీ, మరోసారి భక్తిమార్గములోని సరస్వతి నాకు కనిపించారు ఇది చూస్తూ చూస్తూ నేను ధ్యానములోకి వెళ్ళిపోయాను. నేను ప్రారంభము నుండే సులభంగా ట్రాన్స్‌లోకి వెళ్ళేదానిని. ఆ తర్వాత మమ్మా మురళి చదవడం ప్రారంభించారు. మమ్మాగారి ఒక్కొక్క మాటలో గారడి చమత్కారముండేది. చిన్న పెద్ద అందరూ సులభంగా అర్థము చేసుకునేటట్లు ఉండేది. ఆ సమయములో నా వయస్సు సుమారు 12-13 సంవత్సరాలు. చిన్నతనమైనా మమ్మాగారి ప్రేమ, నా లౌకిక తల్లి ప్రేమను మరపింపజేసింది. నేను మమ్మానే నా లౌకిక తల్లి మరియు అలౌకిక తల్లిగా స్వీకరించసాగాను.

మొదటిసారి తల్లి జగదంబ ముఖారవిందము ద్వారా జ్ఞానమురళి విని జీవితములో సర్వాధికమైన సంతోషము కలిగింది. మమ్మా మాటల

శబ్ధముతో పాటు నాకు సితారా మధుర ధ్వనులు కూడా వినిపిస్తూ ఉండినవి. మురళి తర్వాత మమ్మా నాకు వరదానమిస్తూ - మురళి విని ఇతరులకు వినిపించడం ఇది పిల్లలైన మీ కర్తవ్యము. నీవు శివశక్తివి, శక్తి సైన్యములో చేరి బాబా కార్యాలను పూర్తి చేయి అని అన్నారు. మొదట నేను నా మనస్సులో - నేను ఈ తల్లి వచనాలను తప్పకుండా పూర్తి చేస్తానని ప్రమాణము చేసుకున్నాను.

పంజాబులో బటాలా పట్టణంలో మమ్మాతో రెండవసారి కలిసే పరమ సౌభాగ్యము లభించింది. చంద్రమణి దాదీగారి పాలనలో పాలింపబడిన కన్యలతో మొత్తం హాలంతా నిండి ఉండినది. అంతమంది కన్యలను చూచి మమ్మా అమితమైన సంతోషంగా కనిపిస్తూ ఉండినారు. మమ్మా సేవను గురించి, సేవ చేసే విధానము గురించి మంచి క్లాసు చేసి మమ్ములను ఈశ్వరీయ సేవ చేసేందుకు ప్రేరేపించారు. నేను అందరిలో చిన్న వయస్సు కలిగి సన్నగా ఉండినాను. అయినా మమ్మా క్లాసు ద్వారా ప్రేరణ తీసుకొని నేను సేవ చేసేందుకు వెళ్తానని దృఢ ప్రతిజ్ఞ చేశాను. చంద్రమణి దాదీగారి ద్వారా లభించిన ఈశ్వరీయ పాలన, స్నేహముల వలన ఏ ఒక్క కన్య మనస్సులో కూడా బయటకు వెళ్ళాలని లేదు కాని నేను మమ్మాతో - "నేను సేవ చేసేందుకు బయటకు వెళ్తానని అన్నాను. మమ్మా నా నిశ్చయాన్ని పరీక్ష చేశారు. ఒకవేళ మీ తల్లి వద్దంటే ఏమి చేస్తావు? అని నన్ను అడిగారు. అప్పుడు నేను సంకోచిస్తూ మమ్మాగారితో "మమ్మా నా తల్లి మీరే కదా" అని అన్నాను. అంతవరకు నేను నిజంగా మా లౌకిక తల్లిని మర్చిపోయినట్లే ఉండినాను. ఇది మమ్మాగారి ప్రేమ చేసిన గారడి, చమత్కారము. మమ్మా మళ్ళీ ఇలా అన్నారు - నేను నిన్ను పెద్ద పులులు సింహాల వద్దకు పంపితే భయపడవా? పెద్ద పులులను వేటాడుతావా? అయితే పెద్ద పులులు అంటే దాని భావార్థము నాకు అర్థం కాకున్నా తప్పకుండా వేటాడ్తాను మమ్మా అని అన్నాను. మమ్మా ఒక్కొక్క పరీక్ష తీసుకుంటూ నాకు ఫుల్ మార్కులు ఇచ్చి నన్ను కాశీలో ఉన్న విద్వాంసులు, పండితులు, మహామండలేశ్వరులు, శంకరాచార్యులు మొదలగు పండిత పరిషత్తుకు సేవ చేసేందుకు



పంపించారు.

ఈశ్వరీయ సేవకు బయలుదేరేందుకు ముందు మమ్మా నన్ను తమ విశేషతలతో నింపారు. ఆ సమయంలో ప్రతిష్ఠ కలిగిన పెద్ద వయస్సులో ఉన్న గొప్ప-గొప్ప వ్యక్తులు కూడా మమ్మా అలౌకిక శక్తుల ముందు తల వంచడం నేను నా కనులారా చూచాను. ఇది వారికి గల అంతులేని ఈశ్వరీయ శక్తుల చమత్కారమే. మమ్మా కేవలం మధురంగా, తీయగా మాట్లాడడమే కాదు, వారి నయనాల భాష కూడా ఎంత మధురంగా, తీయగా ఉండేదంటే ఎవరైనా వారి దృష్టితో దృష్టి కలిపినప్పుడు మమ్మా మమ్ములను ఎంతో ప్రేమిస్తూ ఉందని అనుభవమయ్యేది.

నాకు చిన్నతనము నుండే నాలో తక్కువగా మాట్లాడే సంస్కారముండేది. ఒకవేళ మాట్లాడినా సంకోచపడే సంస్కారము ఉండేది. దీనిని గురించి మమ్మా ఇలా అనేవారు - "నీవు శక్తుల దేవత, దుర్గాదేవిగా తయారై సేవ చేయాలి. దుర్గాదేవి ఎప్పుడూ సంకోచించదు." ఈ విధంగా మమ్మా నాలో ఉండిన అనేక సూక్ష్మ బలహీనతలను తన మధురమైన శిక్షణల ద్వారా చాలా సులభంగా పరివర్తన చేసేశారు. తర్వాత మమ్మా నన్ను - నీవు జగన్మాతవు అని అర్థము చేయించారు. జగన్మాత ముందుకు అన్ని రకాల పిల్లలు వస్తారు, కొంతమంది ప్రేమించేవారు, కొంతమంది అల్లరి పిల్లలు............. మమ్మా ఇచ్చిన ఈ స్వమానాన్ని విశేషంగా ప్రయోగించి సేవాక్షేత్రమందు సేవలో సఫలత ప్రాప్తి చేసుకోవడంలో విశేషమైన సహాయాన్ని అనుభవము చేశాను. ఈ రోజుకు కూడా మమ్మా సూక్ష్మ రూపములో నా సన్ముఖములో స్థితమై సమయ - ప్రతి సమయము నాకు మార్గము చూపిస్తూ ఉన్నారని నాకు అనిపిస్తూ ఉంటుంది. మమ్మా జ్ఞాన-యోగ, దివ్యగుణాల ప్రతిమూర్తి ఎంత వర్ణించినా, మమ్మా మహిమను శబ్దాలతో ఎలా వ్యక్తము చేయగలను!

# లాలి (తల్లి లాలన) చూచేందుకు వెళ్ళి నేను కూడా లాల్ (ప్రియమైన బిడ్డ)గా అయిపోయాను

ఢిల్లీ హరినగర్ సేవాకేంద్రము నుండి బ్రహ్మకుమారి శుక్లాబెహన్‌గారు తమ అనుభవాన్ని ఇలా వ్రాస్తున్నారు - నేను మొట్టమొదట మమ్మాను 1956వ సంవత్సరములో అమృత్‌సర్‌లో కలిశాను. మమ్మా తనలో తాను ఒక అద్వితీయమైన శక్తిగా ఉండేవారు. వారు పౌర్ణమినాటి సంపూర్ణ చంద్రుని వలె ఒక శీతలమైన శాంతియుతమైన ఆభా(కాంతి) కలిగి ఉండేవారు. వారి జీవితము ఒక సుగంధభరితమైన పుష్పగుచ్ఛము, దివ్యగుణముల గనిగా ఉండేది. వారి కర్మలలో సద్గుణాల సుగంధ పరిమళముండేది. మమ్మా కనులలో మాతృప్రేమ కరుణ, ఆత్మీయతల అలౌకిక ప్రకాశముండేది. వారిని చూచినా లేక వారి సాన్నిధ్యములో ఉన్నప్పుడు వారు దైవీ స్వరూపులైన సాక్షాత్ సరస్వతి దేవి అని అనుభవమయ్యేది. వారు సాగర సమానము శాంతి శక్తి గలవారిగా ఉండేవారు. మొదటి కలయికలోనే వారి తేజస్వీ దివ్య స్వరూపము, అయస్కాంత శక్తి నన్ను వారి వైపు ఆకర్షించాయి. శుభ్రమైన శ్వేత వస్త్రధారిని. పెద్ద - పెద్ద కనులు, పొడవాటి వెంట్రుకలతో వారు సాక్షాత్తు పవిత్రతా దేవిగా కనిపించేవారు.

## మమ్మా పవిత్రతా దేవి

వారి వ్యక్తిత్వములో నిర్భయత, నిశ్చింతత, నిరహంకారత నిశ్చలత మొదలైన గుణాలు పూర్తిగా నిండి ఉండినాయి. వారి సమీపానికి వెళ్ళినంతనే వారి పవిత్రమైన శీతలత కిరణాలు వారి వైపు ఆకర్షిస్తున్నట్లు నాకు ప్రతీతమయ్యేది. నాలోని సమస్త వికారాలు నా నుండి దూరంగా పారిపోయి చాలా తేలికదనము, ఖుషీ వ్యాపిస్తూ ఉండేది. వారి విలక్షణమైన వ్యక్తిత్వము నా పై గాఢమైన ముద్ర వేసింది. దాని వలన నాకు మమ్మా వంటి జీవితాన్ని జీవించాలనే దృఢమైన సంకల్పము కలిగింది. మమ్మా సంపూర్ణ పవిత్రతకు ఒక జీవించి ఉండు ఉదాహరణగా ఉండేవారు.

వారు త్యాగము, తపస్సు, సేవల ప్రతిమూర్తిగా ఉండి అందరిని ఆకర్షించేవారు. వారి ముందుకు ఎటువంటి సంస్కారమున్న ఆత్మ వచ్చినా, వారు మమ్మా మాటలను చాలా ధ్యానపూర్వకంగా(శ్రద్ధగా) వినేవారు. మౌన భాషలో వారికి శక్తినిస్తూ పరిపూర్ణంగా మార్గదర్శనం చేయించేవారు.





మాతేశ్వరీగారి జతలో గోపీవల్లభ్ బహన్, రుక్మిణీ బహన్, శుక్లా బహన్, కమల సుందరీ బహన్, ధ్యానీ దాదీ, కృష్ణా బహన్, చంద్రమణి దాదీ, ప్రకాశ్ మణి దాదీ

## జీవితానికి ఆత్మిక, చమత్కారి, వరదాని వచనాలు

శివశక్తి సైన్యానికి సైన్యాధిపతి మాతేశ్వరిగారు అమృత్‌సర్ భూమిలో మూడవసారి వచ్చినప్పుడు నా లౌకిక తల్లి చాలా ఆదర పూర్వకంగా ప్రీతిగా జనులందరి మనోకామనలను పూర్తి చేయు మధురమైన మమ్మా ముందు మళ్ళీ ఈ ప్రశ్ననుంచింది - శుక్లాను వివాహము చేసుకోమని మీరు నచ్చచెప్పండి. లేకుంటే నా లౌకిక పరివారము పై అమృతసర్ భూమి పై ఈ జ్ఞాన ప్రభావము బాగుండదు. అప్పుడు శుభ చింతకులైన మమ్మా చాలా ప్రీతిగా, మురిపెంగా "బచ్చీ! నీవు వివాహము చేసుకోవాలి" అని అర్థం చేయించారు. నేను మమ్మాతో - "మీ ప్రతి శ్వాసలో పవిత్రతా సువాసన నిండి ఉంది, మీరు మహోన్నతమైన పవిత్రతా దేవి. మీరు జనులందరి మనస్సులో, హృదయంలో జ్ఞాన ప్రకాశము లేక జ్ఞానవీణ ద్వారా పవిత్రతా సంస్కారాలను జాగృతము చేస్తున్నారు. అందరికి పవిత్రంగా అయ్యే ఆదేశాన్ని, సందేశాన్ని ఇస్తున్నారు. అయితే నాకు వివాహము చేసుకోమనే ఆదేశము ఎందుకిస్తున్నారు?" అని అడిగాను. మమ్మాగారి

పరిశీలనా శక్తి, నిర్ణయ శక్తి చాలా తీక్షణమైనది. వారు ఇలా అన్నారు - "నీవు ఈ ఆత్మ అనగా మీ లౌకిక తల్లిని ఉద్ధరించాలి. నీ జీవితములో ధారణల ద్వారా అనేకమందికి సందేశమివ్వాలి." అప్పుడు నేను ఆ అద్వితీయ శక్తితో ఇలా అన్నాను - "నేను ఫుల్‌కాస్ట్(సంపూర్ణ) బ్రాహ్మణిగా అవ్వాలి, బాలబ్రహ్మచారిణిగా ఉండి నా జీవితాన్ని శివశక్తి రూపములో సార్థకము చేయాలి." అయినా ఆ శివశక్తి సేనాని వివాహము చేసుకోమని నాకు ప్రేరణనిచ్చి ఇలా చెప్పారు - "బాప్‌దాదా నీ ద్వారా ఏదో విశేష కార్యము చేయిస్తారు. ఆ కార్యము భీష్మ పితామహుడు, ద్రోణాచార్యుల వంటి వారికి కూడా నారి ఒక శక్తి అని, నారి ఒక దుర్గ అని చూపించగలగాలి."

ఆ రోజు నేను చాలా వాత్సల్యముతో సన్మానితమైన గౌరవయుక్తమైన శబ్దాలలో ఇలా చెప్తున్నాను - ప్రాణము కంటే ప్రియమైన మమ్మాగారి మధురాతి మధురమైన దృష్టి మధుర, మధురమైన ఉత్సాహమును పెంపొందించే వచనాలు నాకు వరదానాలుగా అయ్యాయి. వాటి వలన అసంభవ కార్యము కూడా సహజంగా సంభవమైపోయింది. నేనెక్కడకు వెళ్ళినా, ఎక్కడ ఉండినా, స్వయాన్ని సదా ఈశ్వరీయ శక్తులతో సంపన్నంగా ఉన్నట్లు అనుభవము చేస్తాను. నా జీవితము ప్రభువుకు తాకట్టు అని నాకు సదా గమనముంటుంది. మధురమైన ప్రియమైన మమ్మా నాకు శక్తివంతమైన జీవితమును జీవించేందుకు ఏ శక్తినైతే ఇచ్చారో, ఏ వరదానాలతో అలంకరించారో వాటిని జీవితములో ధారణ చేస్తూ సత్యత, దివ్యత, పవిత్రత మొదలైన ఆత్మిక గుణాలమూర్తిగా అయ్యి మాత-పితల పేరును ప్రకాశవంతము చేయాలని నాకు సదా గమనముంటుంది.

**లాలీ మేరే లాల్ కీ, జిత్ దేఖా ఉత్ లాల్**

**లాలీ దేఖన్ మై గయీ మై భీ హోగయీ లాల్**

నా తల్లి లాలన ప్రకాశము. ఎక్కడ చూసినా ఆ లాలనే లాలి(తల్లి లాలన) చూచేందుకు వెళ్ళి నేను కూడా లాల్(ప్రియమైన బిడ్డ)గా అయిపోయాను అని అంటారు.

## ఇది కూడా మాతేశ్వరీగారి ఒక మెరుపు

### మాతేశ్వరి భగవతిగా శివసతిగా ఉండినారు

గుడ్‌గావ్ నుండి బ్రహ్మకుమారి సుదర్శన బెహన్‌గారు ఇలా వ్రాస్తున్నారు - నా అలౌకిక జన్మ 1959 సంవత్సరములో కర్నాల్‌లో జరిగింది. మొదటి సారి నేను మధువనానికి వచ్చినప్పుడు మమ్మా - బాబా గద్దె పైన కూర్చొని ఉండినారు. జన్మ-జన్మాంతరాల నుండి విడిపోయిన నా తల్లిదండ్రులు దొరకిన అనుభూతి నాకు కలిగింది. నావారు అనే అనుభూతి కలిగింది.

మమ్మాగారి ఒక్కొక్క అవయవములో ఆత్మీయత నిండి ఉండేది. మొదటిసారి మమ్మా దృష్టి నా పై పడినప్పుడు చంద్రుని వెన్నెలనంతా మమ్మా నా పై కురిపించినట్లు నాకు అనుభవమయ్యింది. మమ్మా అనేక రూపాలలో నాకు కనిపించారు. వీరే జగదంబ అని, దుర్గ అని, కాళిక అని అనిపించింది. నా మలినమంతా శుభ్రమైపోయినట్లు నా కనులకు ప్రకాశము లభించింది. మమ్మాగారి తల్లి ప్రేమ ఎంతటిదో వర్ణించడం నాకు సాధ్యము కాదు.

మమ్మాగారి మాటలు శబ్దాలు ఎంత మధురంగా ఉండేవంటే వాటిని విని దారిలో పోయే వ్యక్తి కూడా నిలబడిపోయేవాడు. మమ్మాగారు మురళి వినిపించే రాగము(విధానము) విన్న వారిలో ఒక ఆత్మిక మత్తు ఎక్కించేది. మమ్మాగారు జ్ఞానమునిచ్చే భాష ఎంత సరళంగా ఉండేదంటే, ఎటువంటి చదువురాని వారికి కూడా సులభంగా అర్థమయ్యేది. ఇప్పటికీ మమ్మా గుర్తుకొస్తే మధురమైన మమ్మాగారి వికసించిన మందహాసము చేస్తున్న ముఖము కనుల ముందు గోచరిస్తుంది. హృదయము గద్గదమైపోతుంది. మమ్మాగారి మస్తకములోని మెరుపు ఎలాంటిదంటే దానిని చూస్తూనే నేను చైతన్య స్థితిని స్పృహను మర్చిపోయేదానిని. అమ్మా నిన్ను చూస్తూ ఇలాగే ఉండిపోవాలని ఉంది అని నా హృదయమంటున్నది. తల్లిలో ఇంతటి ఆత్మీయతా శక్తి ఉండేది. ఒకసారి కర్నాల్‌లో మమ్మాతో కలుపుటకు నా లౌకిక పరివారమును తీసుకెళ్ళాను. నా లౌకిక సోదరునికి వీరు సాక్షాత్తు భగవంతుడే అని అనుభవమయింది. కాని మమ్మా భగవంతుడు కాదు. ఆమె భగవంతుని భగవతి శివుని సతి.

## సఫల జీవితాన్ని గడిపేందుకు మమ్మా నాకు అయిదు సూత్రాలు తెలిపించారు

కాన్పూరు నుండి విద్యా బెహన్ మమ్మాగారితో తన అనుభవాన్ని కొన్ని సాక్ష్యాలు కూడా తెలుపుచున్నారు - మమ్మాగారు ఒక అద్భుతమైన ఆత్మిక అయస్కాంతముగా ఉండేవారు. నడుస్తూ - తిరుగుతూ ఉన్నప్పుడు మమ్మా కనిపించిన వెంటనే నేను ఉన్న చోటనే నిలబడిపోయేదానిని. మమ్మా ప్రీతిగా నా తల నిమిరేవారు. ఒక రోజు మమ్మాగారు ఇలా అడిగారు - మురళి వినునప్పుడు నీ స్థితి ఎలా ఉంటుంది? మళ్లీ అర్థం చేయిస్తూ ఇలా అన్నారు.



**మాతేశ్వరిగారితో దీదీ మన్మోహినీ, దాదీ ప్రకాశ్ మణీ**

1. బ్రహ్మబాబా నోటి ద్వారా శివబాబా వినిపించునప్పుడు ఆ శబ్ధాలు నీ చెవిలో పడక ముందే మధ్యలో మాయ ప్రవేశించరాదు. బాబా నోటికి నీ చెవికి మధ్య దూరముంది కావున గమనముంచి సదా ఆత్మిక స్థితిలో స్థితమై ఉండి మురళిని వినాలి.

2. మమ్మా ఇలా అన్నారు - జీవితము పోస్టల్ కవరు వలె మూయబడి



ఉండక పోస్టు కార్డు వలె సదా తెరవబడి ఉండాలి.

3. సదా "హాజీ!"(సరే బాబా) అనే పాఠాన్ని పక్కా చేసుకోవాలి. ఏదైనా ఒక పని అప్పజెప్పినారనుకోండి. నీకు ఆ పని రాకున్నా నేరుగా చేయనని చెప్పరాదు. అలా చెప్పడము నాస్తికుల పని ఇది ఎలా చేయాలో పద్ధతి తెలిపితే నేను చేస్తానని వారికి చెప్పాలి.

4. ఎప్పుడైనా, ఏదైనా విషయముంటే దాని వాయుమండలాన్ని తయారు చేయరాదు అనగా గంభీరతా గుణాన్ని స్వంతము చేసుకోవాలి.

5. మమ్మాగారు తెలిపారు - మీ జీవితానికి మీ స్వంత మతాన్ని బాధ్యతగా చేయకండి. జీవితాన్ని బాబాకిచ్చేశారు. బాధ్యత వారిదే అని అనుకుంటే సహాయము లభిస్తుంది. మీ స్వంత మతము లేక మీ బాధ్యత మీదే అని అనుకుంటే బాబా నుండి సహాయము కాని, శక్తి గాని లభించదు. ఈ విధంగా మమ్మా నాకు ప్రథమ గురువై నాకు అనేక అమూల్యమైన శిక్షణలనిచ్చారు.

## మాతేశ్వరిలో ఒక అలౌకిక ఆకర్షణ ఉండేది

ఇండోర్ నుండి బ్రహ్మకుమార్ ఓంప్రకాశ్‌గారు మమ్మా పట్ల తమ భావాన్ని ఈ శబ్ధాల ద్వారా ప్రకటితము చేస్తున్నారు. అవి " నేను ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకుంటున్న రోజులు. అప్పటికి నేను జ్ఞానములో ప్రవేశించి కొంత సమయము మాత్రమే అయ్యింది. 1956 వ సంవత్సరములో నేను మాతేశ్వరీగారితో అంబాలా ఛావనిలో కలుసుకోవడం జరిగింది. నేను వారితో మొదటిసారి కలుసుకున్నప్పుడు వారి దివ్యబుద్ధిని చూచి ఆశ్చర్యచకితుడనయ్యాను. అంతకుముందు నేను ఎంతోమంది ధార్మిక వ్యక్తులను చూచాను. కాని ఇలాంటి అలౌకిక వ్యక్తిత్వాన్ని నేను మొదటిసారి చూస్తూ ఉండిపోయాను. వారి ముందుకు వెళ్తూనే నాలో ఒక అలౌకిక ఆకర్షణ జన్మించడం ప్రారంభమయింది. భక్తి మార్గములోనివారు, ఎవరిని భక్తి చేస్తూ ఉన్నారో ఎవరిని గురించి వ్రతమాచరిస్తూ ఉన్నారో ఆ జగదంబ, ఆ శక్తి వీరే అని నాకనిపించింది.

## మమ్మా ప్రవచనములోని విశేషత - జ్ఞాన స్పష్టీకరణ

మధువననివాసి బ్రహ్మాకుమార్ కరుణాభాయిగారు మమ్మాగారి గురించి ఇలా వినిపిస్తున్నారు - 1960వ సంవత్సరములో నేను మమ్మాతో కలిసినప్పుడు మమ్మా నోటి నుండి వెలువడిన మాటలు నాకు వరదానమైపోయాయి. మొదటి కలయికలోనే వారన్నారు - "ఈ పుత్రుడు కల్పక్రితపు పుత్రుడు" అనగా ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో దీని అర్థము ఇలా చెప్తారు - ఇతను అవినాశి పుత్రుడు. ప్రతి కల్పము అనగా 5 వేల సంవత్సరాల క్రితము కూడా వచ్చాడు, ఇప్పుడు కూడా వచ్చాడు, అంతేకాక భవిష్య కల్పములో కూడా వస్తాడు. మాతేశ్వరిగారు నా అవినాశి పాత్రను గురించి భవిష్యత్తును తెలిపి వరదానమిచ్చారు.

బాబా మురళి అంతులేని త్రికాల జ్ఞానమునిచ్చే అపారమైన భండారము. ఈ జ్ఞానములో అన్ని రకాల వజ్రాలు, ముత్యాలు, రత్నాలు, మాణిక్యాలు ఉంటాయి. కాని మాతేశ్వరిగారు ఆ భండారము నుండి అప్పుడప్పుడు వజ్రాలు, అప్పుడప్పుడు రత్నాలు, అప్పుడప్పుడు మాణిక్యాలు తీసి ఇస్తారు. బెంగుళూరులో మమ్మా ఎన్ని ఉపన్యాసాలిచ్చారో, ఆ ఉపన్యాసాల ద్వారా మేము వారి సరస్వతి పాత్రను సాక్షాత్తు దృశ్యంగా చూశాను. జిజ్ఞాసువుల సభలలో, భక్తుల సభలలో, విజ్ఞానవేత్తల సభలలో వారు ఈ ఈశ్వరీయ జ్ఞానాన్ని స్పష్టపరిచారు. ఆ రోజులలో మమ్మాగారు చేసిన జ్ఞాన సేవ ద్వారానే ఈ రోజు దక్షిణ భారతదేశము ఈశ్వరీయ సేవ ద్వారా సమృద్ధిగా ఉంది.

## మాతేశ్వరిగారు చాలా తేజస్వి మరియు ఓజస్విమూర్తి

కలకత్తా నుండి బ్రహ్మాకుమారి రుక్మిణి బెహన్ మమ్మా పట్ల తమ అనుభవాన్ని ఇలా వినిపిస్తున్నారు - 1963 సంవత్సరములో కలకత్తాలో మొట్టమొదట ఒక ధర్మశాలలో ఒక ప్రదర్శిని ఉంచారు. ఆ ప్రదర్శినీకి మమ్మా కూడా వచ్చారు. 1964 సంవత్సరములో బాబా నిర్మలశాంత దీదీని మరియు మమ్మాను కలకత్తాలోనే సేవ కొరకు నిమిత్తంగా చేశారు. ఆ రోజులలో ఆ సమయములో బాబా సుమారు 90-100 మంది సోదరీ సోదరులను సేవ కొరకు కలకత్తాకు పంపించారు. మమ్మా కూడా అచ్చట 20 రోజులు





తేజస్వీ మూర్తి ఓజస్వీ మూర్తి సరస్వతి తల్లి!

ఉండినారు. ఆ సమయములో నా వయస్సు 6 సంవత్సరాలు. మమ్మా చిన్న పిల్లలను కూడా చాలా ప్రేమించేవారు. తన ఒడిలో కూర్చోపెట్టుకొని మాకు టోలి తినిపించేవారు. అప్పట్లో నాకు అంత పెద్దగా అర్థమయ్యేది కాదు. కాని మమ్మా చాలా మహోన్నతమైన దేవి అని అనుభవమయ్యేది. వారిని చూస్తే చాలు చాలా సంతోషము కలిగేది. నేను నిశ్శబ్ధంగా కూర్చొని వారిని చూస్తూ ఉండేదానిని, చూస్తూనే ఉండిపోవాలనిపించేది. మమ్మా చాలా తేజస్వీ మూర్తి, ఓజస్విమూర్తి అని అనిపించేది. మమ్మాగారు కూర్చునే విధానము కూడా చాలా ప్రభావశాలిగా, ఆకర్షణీయంగా ఉండేది. మమ్మాలో చాలా అద్భుతమైన పరిశీలనాశక్తి ఉండేది. వారు దూరము నుండే ఏ వ్యక్తి ఎటువంటివారో తెలుసుకునేవారు.

## మమ్మా ఒక ప్రేరణా మూర్తి

పంజాబులో మానసా నుండి బ్రహ్మాకుమారి సుదేశ్ బహన్ చెప్తున్నారు - " ఇప్పటికి 39 సంవత్సరాల ముందు 1964వ సంవత్సరములో మొదటిసారి అంబాలా క్యాంటులో మమ్మాతో నేను కలుసుకోవడం జరిగింది. ఆ సమయములో నా వయస్సు 12 సంవత్సరాలు. నా లౌకిక తల్లి క్లాసుకు వెళ్తూ ఉండేది. మమ్మా అంబాలాలో ఛావనీకి వచ్చి ఉండినారు. నేను నా తల్లితో పాటు క్లాసుకు వెళ్ళాను. మమ్మా అంబాలలో 3 రోజులుండినారు.

మాతేశ్వరీగారిని చూసినప్పుడు నా మనస్సు అక్కడ నుండి వాపసు వెళ్లేందుకు ఒప్పుకోలేదు. కాని బాల్యావస్థ అయినందున ఇంటికి తప్పకుండా పోవలసి వచ్చింది. మమ్మాను చూచి నేను పెద్ద అయితే మమ్మా వలెనే తయారవ్వాలనే ప్రేరణ నాకు కలిగింది.

మమ్మాతో కలిసి ఉండే మంచి అవకాశము నాకు లభించకున్నా వారిని చూచే నా జీవితములో పరివర్తన జరిగింది. నా జీవితాన్ని అలౌకికంగా చేసుకోవాలనే దృఢ సంకల్పము కలిగింది. ఈ రోజుకు కూడా వారి ప్రేరణ ద్వారానే జ్ఞాన మార్గములో ముందుకు వెళ్తూ ఉన్నాను.

మమ్మాను చూచినప్పుడు వీరు చాలా చాలా మంచి భోజనము చాలా ఎక్కువగా స్వీకరిస్తూ ఉంటారని భావించాను. నేను ఒక రోజు నా లౌకిక తల్లితో కలిసి మాతేశ్వరిగారు భోజనము చేస్తూ ఉండడం చూచి నేను చాలా ఆశ్చర్యపడ్డాను(అవాక్ అయిపోయాను). ఎందుకంటే మమ్మా చాలా సాధారణమైన భోజనము స్వీకరిస్తూ ఉండినారు. ఉడికించిన ఉప్పు మిరపకాయలు, మసాలాలు లేని భోజనము తింటూ ఉండినారు. అది కూడా చాలా కొద్దిగా స్వీకరిస్తూ ఉండినారు. వారి ఆరోగ్యానికి, పుష్టికి మూల కారణము ఈశ్వరీయ నషా మరియు యోగబలము అని నాకు అనుభవమయ్యింది.

## పిల్లల సేవలోనే సదా తత్పరులుగా ఉండిన తల్లి - కామధేనువు

బ్రహ్మాకుమార్ చోటేలాల్ భాయి ప్రస్తుతము మధువనములో 'చాచాజీ' అను పేరుతో పిలువబడుతున్న సోదరుడు తమ అనుభవాన్ని ఇలా తెలుపుచున్నారు. 1960 సంవత్సరము జనవరి మాసములో జరిగిన విషయం - మమ్మా కాన్పూరుకు వచ్చి ఉండినారు. నేను సీహ్మావు గ్రామములో ఉండేవాడిని. ఆ గ్రామములో గీతాపాఠశాల నడిచేది. కాన్‌పూర్ నుండి సీహ్మావు వరకు వచ్చేందుకు బస్సులో మూడు గంటలు పడుతుంది. కొందరు సోదరులు సీహ్మావు నుండి నిమంత్రణ పత్రము తీసుకొని కాన్పూరుకు మమ్మా వద్దకు వెళ్ళారు. మమ్మా మా ఆహ్వానాన్ని అంగీకరించారు. వారు కాన్పూరు నుండి బస్సులో సాయంకాలము బయలుదేరారు. కాని రోడ్డు



బాగా లేని కారణంగా మధ్య మధ్యలో రాళ్ళు - రప్పలున్నందున సీహ్మావు చేరునప్పటికి తెల్లవారింది. మమ్మా అచ్చటకు ఉదయానికి చేరుకున్నారు. మేము మమ్మా కొరకు ఎదురు చూస్తూ చూస్తూ రాత్రి అంతా కూర్చొని యోగభట్టి చేశాము. మమ్మా కూడా రాత్రి అంతా బస్సులో జాగరణ చేశారు. మమ్మా మమ్ములను స్మృతి చేస్తూ ఉండినారని, శక్తి ఇస్తూ ఉండినారని మాకు అనుభవుతూ ఉండినది.

మమ్మా గీతా పాఠశాలకు చేరిన వెంటనే అచ్చట ఉన్న వస్తువుల స్థితిని చూచి పని అంతా తమ చేతులతోనే చేసేశారు. గోధుమపిండి తెప్పించారు, వారే స్వయంగా రొట్టె తయారు చేసి పిల్లలందరికీ తలా ఒక్క ముక్క తినిపించారు. మేము తల్లి అంతులేని ప్రేమను చవిచూచాము. అనుభవము చేసి ధన్య ధన్యమైపోయాము. జగదంబ సరస్వతిగారు స్వయం పట్ల కొంచెం కూడా ఆలోచించక పూర్తిగా పిల్లల సేవ చేసి అందరినీ మురిపించారు. దాని తర్వాత మమ్మా బియ్యము తెప్పించి శుభ్రపరచి మధ్యాహ్నానికి పూర్తిగా తయారు చేసుకున్నారు.

అక్కడ ఒక ఠాకూర్ ఇల్లు ఉండేది. అక్కడ మమ్మా అందరినీ కలిశారు. అక్కడ సుమారు 50-60 మంది జనము చేరారు. అందులో చాలా మంది సాధు-సన్యాసులు కూడా ఉండినారు. అచ్చట కుర్చీ - టేబుల్ ఏవీ లేవు. మమ్మా గంటల తలబడి నిలబడే ఉపన్యసించింది. అచ్చటకు వచ్చిన జనులందరూ సాధు- సత్పురుషులందరూ కూడా నిలబడే జ్ఞానాన్ని విన్నారు. అచ్చట చేరిన వారిలో మన జ్ఞానాన్ని విమర్శించిన వారు కూడా చాలా మంది ఉండినారు. వారు కూడా నిశ్శబ్దంగా, చాలా గమనముతో జ్ఞానాన్ని వింటూ ఉండిపోయారు. ప్రవచనము పూర్తి అయిన తర్వాత వారు వెళ్లేటప్పుడు మీరు మమ్ములను చాలా ప్రశ్నలడిగేవారు కదా, ఇప్పుడు మమ్మాగారిని ఏమీ అడగలేదే అని మేమడుగితే దానికి వారు మీ మాతేశ్వరిగారిని అడిగే ధైర్యము కూడా మాకు లేకుండాపోయింది. మా నోళ్ళు కట్టి వేయబడినట్లనిపించింది. ఈ విధంగా మమ్మాగారి వాణి(మాటలు) చాలా శక్తిశాలిగా, సరళంగా, స్పష్టంగా ఉండేవి. వారి సేవా భావము కూడా చాలా ఉత్కృష్టమైనది. మమ్మా

ఎప్పుడూ ఇది చిన్నపల్లె అని గాని, ఇందులో అందరూ చదువురానివారే ఉన్నారని గాని, ఆ పల్లెకు పోయేందుకు కష్టమవుతుందని గాని అనుకోలేదు. బాబా సేవకై వారు ఏ సమయములోనైనా పగలు గాని, రాత్రి గాని, పట్టణము గాని, పల్లె గాని, సుశిక్షితమైనవారు గాని, అశిక్షితమైనవారు గాని ఆలోచించక సదా సిద్ధంగా ఉండేవారు. అందుకే వారిని సర్వుల మనోకామనలను పూర్తి చేయు కామధేనువని అన్నారు.

## నాకు మమ్మా వారి శీతల రూపాన్ని చూపించారు

బటాలా నుండి బి.కె నందకిశోర్ భాయి ఇలా అంటున్నారు - మమ్మా బటాలాకు వచ్చినప్పుడు నేను మమ్మాను మొదటిసారి చూచాను. మొదటి రోజు సభలో మాట్లాడారు. మరుసటి రోజు బ్రాహ్మణులను కలిశారు. మమ్మా పూర్తి శాంతముద్రలో ఉండినారు. మమ్మాను కలుసుకునేందుకు నా వంతు వచ్చినప్పుడు నేను మమ్మా సాన్నిధ్యములోకి వెళ్ళినప్పుడు తల్లి ఒడిలో బిడ్డ సుఖ-శాంతులను పొందు విధంగా నేను అనుభవము చేశాను. నాకు మమ్మా ఒడి పూలతో నిండి ఉండినట్లనిపించింది. బయటి నుండి చూచినప్పుడు నాకు వైష్ణవీ దేవిని చూచినట్లుగా అనుభూతి కలిగింది. ఒడిలోకి వెళ్ళినపుడు శీతలాదేవి అని అనుభవమయింది. ఈ విధంగా నేను మమ్మాలో దేవీల సాక్షాత్తు స్వరూపాలను చూచాను.

మమ్మాగారి ప్రథమ వీక్షణములోనే వీరు నా తల్లి అని నాకు అనుభవమయ్యింది. మమ్మాలో చాలా ఆకర్షణ శక్తి ఉందని నేను గమనించాను. వారి ముందుకు ఎలాంటి విపరీత సంకల్పాలున్నవారు వెళ్ళినా, వారి వ్యర్థ సంకల్పాలు సమాప్తమైపోయేవి. వారు వారి ముందు చిన్న పిల్లలుగా అయిపోయి అమ్మా! అమ్మా! అనడం ప్రారంభించేవారు.

## మమ్మా, అందరి విఘ్నాలను హరించేవారు

గ్లోబల్ ఆసుపత్రిలో సేవ చేస్తున్న బ్రహ్మకుమార్ రమేష్‌కోహలిగారు తమ అనుభవాన్ని ఇలా వినిపిస్తున్నారు. నేను మొట్టమొదట మమ్మాను మధువనములో 1962 సంవత్సరములో చూచాను. నేను నా తండ్రిగారి



వెంట వచ్చి ఉండినాను. ప్రతి పుత్రుని మమ్మా బాబా ఒడిలోకి తీసుకునేవారు. అప్పట్లో రైళ్ళలో స్లీపర్ కోచ్ లేనందున ప్రయాణములో కలిగే కష్టాలతో మధువనము చేరే సరికి మా స్థితి చాలా దయనీయంగా ఉండేది. బట్టలన్నీ మాసిపోయి, శరీరము అలసిపోయి ఉండేది. మమ్మా, బాబాలు పిల్లలైన మమ్ములను ఒడిలోకి తీసుకుంటూనే మా అలసట అంతా దూరమైపోయింది. ఎవరైనా ఒక వ్యక్తి మంచి ఎండలో నడుస్తూ ఉన్నప్పుడు అతనికి దారిలో మంచి నీడనిచ్చే వృక్షము చల్లని నీరు లభిస్తే వారికి ఎంత విశ్రాంతి సుఖము లభిస్తాయో, అదే విధంగా బాబా-మమ్మాల సాన్నిధ్యము ప్రాప్తి చేసుకొని మేము హర్షితమై ప్రేమాశృవులు కారుస్తూ ఉండిపోయేవారము. మనసు తేలికై ఆనందంతో ఎగురుతూ ఉండేది. మమ్మా ఒడిలోకి పోయినప్పుడు నేను చిన్న బాలునిగా అయ్యి తల్లి ఒడిలో ఇమిడిపోతున్నానని అనిపించింది. ఆ సమయములో ఎలాంటి దేహ భావపు స్మృతి కూడా లేదు. మా దేహాలను కూడా మేము మర్చిపోయేవారము.

మమ్మాలో ఒక గొప్ప విశేషత ఏమంటే - ఏదైనా ఎంత పెద్ద సమస్య వచ్చినా, దానిని వారు చాలా సులభంగా పరిష్కరించేవారు. ఎంత పెద్ద పరీక్ష అయినా మమ్మా సదా శాంతిగా, అచలంగా ఉండి దాని సమాధానాన్ని కనుగొనేవారు. ఈ విధంగా మమ్మా ఒక విశేష వ్యక్తిత్వము గలవారు.

## మాతేశ్వరి ఒక మహోన్నతమైన విదుషీమణి (విద్వాంసురాలు)

బొంబాయి నుండి చార్టర్డ్ అకౌంటెంట్ బ్రహ్మకుమార్ ఆనంద్‌భాయి ఇలా చెప్తున్నారు - నేను 1962వ సంవత్సరంలో జ్ఞానములోకి వచ్చాను. మమ్మాతో నేను 1963 వ సంవత్సరంలో వాటర్‌లూ భవనములో కలిశాను. అక్కడ మమ్మా క్లాసు జరుగుతూ ఉండేది. రమేష్ భాయి(బొంబాయి) ఆహ్వానముతో నేను మమ్మాను కలుసుకునేందుకు అచ్చటకు వెళ్ళాను. అప్పటికి నాకు వివాహమై కేవలం 3 మాసాలే అయ్యింది. ఈ సంస్థను గురించి చాలా భ్రాంతులుండేవి. వాటర్‌లూ భవనములో ఒక గదికి పరదా వేయబడి ఉండినది. నేను మమ్మాగారితో నేరుగా “మమ్మా ఈ పర్దా ఎందుకు తగిలించారు? అక్కడ ఏమి జరుగుతూ ఉంది?” అని అడిగాను. అప్పుడు

మమ్మా చిరునవ్వుతో నీవే వెళ్ళి ఏమి జరుగుతూ ఉందో, చూచి రా! అని చెప్పారు. నేను వెళ్ళి చూసిన వెంటనే నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఎందుకంటే అక్కడ సామూహిక యోగము జరుగుతూ ఉండినది. అచ్చటి వాతావరణము మనసుకు శాంతి, ఆనందము ఇచ్చేదిగా ఉండినది. మమ్మా ఏ విషయములోనూ వాద-వివాదము చేసేవారు కాదు. కాని స్వయం మీ అంతకు మీరే చెక్ చేసుకోమని చెప్పేవారు ఆ వ్యక్తిలో ఉన్న భ్రాంతులను స్వయం నివారణ చేసుకునే అవకాశము వారికి ఇచ్చేవారు.

మమ్మా క్లాసు ప్రతి రోజు సాయంకాలము జరిగేది. మమ్మాగారి భాష చాలా సరళంగా మనస్సును ఆకర్షించేదిగా ఉండేది. భాషలో శాలీనత(నమ్రత, శీతలత) ఉండేది. మమ్మా ఏ వేదశాస్త్రాలు మొదలైనవి అధ్యయనము చేయలేదు. కాని వారి ఉపన్యాస శైలి ఎలా ఉండేదంటే వీరు చాలా గొప్ప విదుషీమణి(పండితురాలు) అనిపించేటట్లు ఉండేది. వారి అర్థము చేయించే కళ చాలా సరళంగా, స్పష్టంగా, అర్థయుక్తంగా ఉండేది. మమ్మా జ్ఞానమునిచ్చే విధానము. ఎలా ఉండేదంటే ఎంతటి సాధారణ వ్యక్తి అయినా వారికి కూడా నేను లక్ష్మీనారాయణుల వంటి దేవతలుగా అవ్వాలని అనిపించేది. మమ్మా క్లాసు చేసేటప్పుడు కొంతమందికి దేవతగా, కొంతమందికి జగదంబశక్తిగా సాక్షాత్కారమయ్యేది, సుశిక్షితులైనవారు. మమ్మా వినిపించే పద్ధతి ద్వారా వీరు జ్ఞానములో చాలా గొప్ప అథారిటీ అని, జ్ఞాన భండారమని భావించేవారు. మమ్మాగారి పవిత్రత, సరళ స్వభావము, హర్షితముఖము, నమ్రత అందరితో కలిసి-మెలిసి ఉండి మాట్లాడుట మొదలైన గుణాలు నన్ను చాలా ప్రభావితము చేశాయి.

# మహాప్రయాణానికి తయారవ్వడం

## శారీరిక స్వస్థత రూపములో చాలా పెద్ద పరీక్ష

మమ్మాగారి జీవితములో ఒక చాలా పెద్ద పరీక్షను వారి శారీరిక ఆరోగ్య విషయములో ఎదుర్కొన్నారు. వారిని చాలా భయంకరమైన జబ్బు చుట్టుముట్టింది. ఇక నా శరీరము చాలాకాలము వరకు ఉండదని తెలుసుకున్నప్పుడు కూడా వారు నిర్భయులుగా, నిశ్చింతులుగా ఉండినారు. మానవులకు అన్నింటికంటే ఎక్కువ భయము కలిగించేది మృత్యువు. అన్నిటికంటే ఎక్కువ చింత - సురక్షితంగా ఉండాలని ఉంటుంది. కాని ఈ రెండిటి గురించి తెలిసినా, వారి ముఖములో గాని లేక వారి హావభావాలలో గాని ఎవ్వరూ ఎప్పుడూ చింత చూడలేదు, ఎప్పుడూ లేశమాత్రము భయము కూడా చూడలేదు. వారు వారి జీవితాన్ని శివబాబాకు అర్పితము చేసేశారు. ఇప్పుడు ఏమి జరిగినా అందులో కళ్యాణమే ఇమిడి ఉంది అని వారి అచంచల విశ్వాసము జబ్బు వలన కూడా వారి దినచర్యలో ఏ మాత్రము వ్యత్యాసము రాలేదు, వారు ప్రాత: కాలములో పిల్లలందరి కంటే ముందు లేచి యోగములో స్థితమయ్యేవారు. ముందు వలెనే అనునిత్యము సేవలో లగ్నమై ఉండేవారు.

## అంతిమ శ్వాసలో కూడా ఈశ్వరీయ సేవ

ఏ రోజైతే వారి ఆత్మ, శరీరము వేరైపోయాయో ఆ రోజు కూడా వారు పిల్లలందరితో కలిశారు. వారు తల్లి వలె ప్రతి వత్సకు స్నేహము, చిరునవ్వుల మౌన భాషలో మాట్లాడారు. వారితో నేత్ర మిలనము చేశారు. అంతేకాక తమ చేతులతో ప్రతి ఒక్కరికి స్నేహసూచక సౌగాత్(బహుమతి) రూపములో ఆపిల్, ద్రాక్ష ఇచ్చారు. ఇక కొద్ది సమయపు అతిథియే అని, దీని తర్వాత నేను మహాప్రయాణము చేస్తానని తెలిసి కూడా వారిలో ఏ మాత్రము వ్యాకులత కలగలేదు. చివరికి ఎటువంటి క్షణము వచ్చిందంటే శక్తి సైన్యపు సేనాధిపతి జగదంబ సరస్వతి శరీరము నుండి ప్రస్థానమై వెళ్ళిపోయారు. వారు ముందే తమ జీవితాన్ని బాబా సేవ కొరకు సమర్పితము చేసేశారు. ఇప్పుడు ఆ సమర్పిత ఆత్మను బాబా ఇక ముందు జరుగబోయే సేవకు నియుక్తము చేశారు.

- బ్రహ్మాకుమార్ జగదీష్ చంద్ర



మాతేశ్వరి గారితో జమునా దాదీ, రతన్ మోహినీ దాదీ

### మాతేశ్వరిగారు జీవితములో అంతిమ సమయము వరకు సేవ చేస్తూ ఉండడం చూశాను

24 జూన్ 1965 ఉదయము 10 గంటలకు మమ్మా అందరికి ద్రాక్ష ఇస్తున్నారు. ఆ రోజే మమ్మా తన శరీరము త్యాగము చేస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. మమ్మాను చూచే వారెవ్వరికీ అలా అనుభవమవ్వలేదు. మమ్మా చిరునవ్వు నవ్వుతూ అందరికీ ద్రాక్ష పండ్లనిస్తూ ఉండినారు. ద్రాక్షతో పాటు ఎంత శక్తిశాలి దృష్టి కూడా ఇస్తూ ఉండినారంటే ఈ దేవి తల్లి అందరికీ వరదానమిస్తూ ఉందా అనిపిస్తూ ఉండినది. నేను కూడా మమ్మా నుండి ద్రాక్షపండ్లు మరియు దృష్టి తీసుకున్నాను. ఆ దృష్టిలో నాకు ప్రకాశము అనుభవమయింది. నేను మమ్మాతో మొదటిసారి కలకత్తాలో కలిసినప్పుడు నా వయస్సు 27 సంవత్సరాలు. అప్పుడు మమ్మా మురళి చేస్తూ ఉండినారు. నేను వారి ముందు కూర్చున్నాను. మురళి వినిపించునప్పుడు నేను మమ్మా కనులను చూసి వారి కనుల నుండి ప్రకాశము వెలువడి నా పై పడుతూ ఉన్నట్లు అనుభవము చేశాను. ఎవరో దేవత నా పై శక్తిని వర్షిస్తున్నట్లుంది. మమ్మా నుండి నాకు చాలా శక్తి లభిస్తూ



ఉన్నట్లు అనుభవమవుతూ ఉండినది. మమ్మాను ఎవరు చూసినా మమ్మా వ్యక్తిత్వము ద్వారా చాలా ప్రభావితులయ్యేవారు. వీరు ఎవరో దేవత అని అనుభవమవుతూ, వారిని సదా అలాగే చూస్తూ వారి దగ్గరే ఉండాలని అనిపించింది.

- బ్రహ్మకుమారి సత్యవతి, తిన్‌సుఖియా

### మమ్మాగారి అంతిమ సమయము మరియు నేను

ఢిల్లీ నుండి మధువనానికి వెళ్లేందుకు ముందు మమ్మా నన్ను ఢిల్లీలోని కమలానగర్ సెంటర్లో వదిలి వెళ్లారు. మమ్మాగారి ఆరోగ్యము చాలా క్షీణించిందని, వారిని బొంబాయి నుండి ఆబూకు తీసుకొచ్చారని తెలిసి నేను వెంటనే ఒంటరిగానే మమ్మాను చూచేందుకు ఆబూకు వచ్చేశాను. మమ్మా శరీరము వదిలినప్పుడు అచ్చట మేము 5 మంది కన్యలుండినాము. బాబా మాతోనే చాప పరిపించి దాని పై మమ్మా శరీరాన్ని పరుండజేయించి మమ్ములనే అచ్చట కూర్చోబెట్టారు. మమ్మా శరీరాన్ని తీసుకెళ్లే అర్థీ(పాడె)ని కూడా మేమే అలంకరించాము. ఇతరులెవ్వరి చేయి పడలేదు. ఆ భాగ్యము మాకే దక్కింది. ఈ విధంగా నేను మమ్మా శారీరిక అంతిమ క్రియా కర్మలలో కూడా పాల్గొన్నాను.

- బ్రహ్మకుమారి చక్రధారి, రష్యా

### ఓ మాతా సరస్వతి! స్వయం నిన్ను నీవే తయారు చేసుకున్నావు

మాతేశ్వరీ గారిని చివరిలో క్యాన్సర్ వ్యాధి చుట్టుముట్టింది, కాని మాతేశ్వరి సరస్వతి తమ స్వరూపము ద్వారా వారికే వ్యాధి లేదని ప్రత్యక్షము చేశారు. వారు 1965 సంవత్సరము జూన్ 24వ తేదీన శరీరాన్ని త్యాగము చేశారు. నేను జూన్ 23 తేదీ నుండే మధువనములో ఉన్నాను. ఆ రోజులలో మాతేశ్వరి సరస్వతి వ్యాధి కారణంగా తమ గది నుండి వెలుపలికి వచ్చేవారు కాదు. అయినా బాప్‌దాదా మహావాక్యాలను స్పీకర్ ద్వారా గదిలో వింటూ ఉండేవారు. బాప్‌దాదా జూన్ 23 తేదీన మీ పిల్లలందరికీ మామిడి పండ్లు ఇవ్వాలని మాతేశ్వరితో చెప్పారు. మాతేశ్వరి సంతోషంగా బాబా ఆజ్ఞను పాలన చేస్తూ ప్రతి వత్సకు స్నేహపూర్వక శక్తి సంపన్న దృష్టినిస్తూ, చాలా నిదానంగా త్వరపడకుండా మామిడి పండును టోలీగా ఇచ్చి స్నేహ మిలనము చేస్తూ

వరదానములిచ్చారు. ఆ సమయములో మాతేశ్వరి కూర్చునే స్థితిలో లేరు. ఎందుకంటే వ్యాధి పూర్తిగా ముదిరిపోయి మమ్మాను తీవ్రంగా ఆక్రమించింది. కాని మాతేశ్వరి సరస్వతి ప్రకృతిజీత్‌కు ప్రత్యక్ష ప్రమాణము(ఋజువు)నిస్తూ బాబా ఆజ్ఞను పాలన చేస్తూ తన సంపూర్ణ స్వరూపాన్ని సాక్షాత్కారము చేయించారు. నేను ఈనాటి వరకు చాలా మంది క్యాన్సర్ వ్యాధి గ్రస్థులను చూచాను. వారు చివరి సమయములో అసహాయులుగా, శక్తి హీనులుగా ఉంటారు. సహించలేని బాధతో అతలాకుతలమవుతూ ఉంటారు. కాని మాతేశ్వరి సరస్వతిగారు ఈశ్వరీయ జ్ఞాన-యోగాలకు ప్రత్యక్ష ప్రమాణమునిచ్చి అసాధ్యమైన రోగాన్ని కూడా ఓడించారు. జూన్ 24వ తేదీన మాతేశ్వరి హర్షితముఖముతో తమ సంపూర్ణతను ప్రాప్తి చేసుకొని తమ నశ్వర దేహాన్ని త్యాగము చేశారు. ఢిల్లీలోని కవి సోదరుడు తన కవిత ద్వారా తన శ్రద్ధాంజలిని అర్పిస్తూ ఇలా అన్నారు.....

" ఈ యజ్ఞములో శివుడు బ్రహ్మ పదవిని తయారు చేశాడు,
కాని, ఓ మమ్మా! సరస్వతీ నీవు స్వయం నిన్ను నీవే తయారు చేసుకున్నావు............ "

ఈ యజ్ఞము స్థాపన అయినప్పుడు శివబాబా ఇలా అన్నారు - "ఈ దాదా శరీరాన్ని ఆధారంగా తీసుకొని నేను సత్యయుగీ దైవీ ప్రపంచాన్ని స్థాపన చేస్తాను. ఈ దాదాయే బ్రహ్మ" కాని మమ్మా జగదంబ సరస్వతి గారు తమ స్వంత పురుషార్థము ద్వారా తనను తాను ప్రత్యక్షము చేసుకున్నారు. యజ్ఞమాతగా తయారై సంపూర్ణ రూపములో శారీరిక మరియు ఆత్మిక రూపాలతో యజ్ఞాన్ని సంభాళించారు.

- బ్రహ్మకుమార్ విద్యాసాగర్, ఢిల్లీ

## మాతేశ్వరి నష్టమోహా (నిర్మోహి), స్మృతి స్వరూపంగా ఉండేవారు

ఈ రోజు మమ్మా తన శరీరాన్ని వదలబోతుందని బహుశా బాబాకు తెలిసి ఉండవచ్చు అందుకే ఆ రోజు ఉదయమే మమ్మా చేతులతో యజ్ఞ వత్సలందరికీ ద్రాక్షనిప్పించారు. బాబా పగలు విశ్రాంతి తీసుకొని 4 గంటలు లేక 4-15 నిమిషాలకు లేచి నాతో బచ్చీ మమ్మాను చూచిరా! అని చెప్పారు. నేను బాబా చేతికి నీటి గ్లాసునందించి మమ్మా గదిలోకి వెళ్ళాను. మమ్మా మెడ ప్రక్కకు ఒరిగిపోయి ఉంది. నేను వెంటనే బాబా వద్దకు పరుగెత్తికెళ్ళి 'బాబా, బాబా!' అని పిలవసాగాను. బాబాకు అర్థమైపోయింది. బాబా వెంటనే లేచి మమ్మా గదిలోకి



వెళ్ళారు. నేను కూడా బాబా వెంట వెళ్ళాను. మమ్మాను చూచి బాబా అన్నారు - అచ్ఛా, మమ్మా, శివబాబా వద్దకు వెళ్ళిపోయింది! " అక్కడి నుండి బాబా తన గదికి వెళ్ళి జాబులు వ్రాయడం ప్రారంభించారు. అప్పుడు ఇద్దరు కన్యలు బాబా వద్దకు వచ్చారు. "వచ్చేశారా పిల్లలూ!" అని బాబా అన్నారు. వారు ఏడ్వడం ప్రారంభించారు. అప్పుడు బాబా అన్నారు - "మీరు బాబా ముందు మమ్మా కొరకు దు:ఖాన్ని తెలియజేసేందుకు వచ్చారా? మీరు బాబా ముందు ఏడుస్తున్నారా? ఎవరు ఏడుస్తారు? విధవలు. మమ్మా మీదిగా లేనే లేదు. ఆమె శివబాబాకు చెందినదిగానే ఉండేది. ఇప్పుడు శివబాబా వద్దకే వెళ్ళిపోయింది.

- బ్రహ్మకుమారి దాదీ సంతరీ గారు

## ఆ రోజు సద్గురువారము

24 జూన్ 1965న సంవత్సరము గురువారము ఉదయము 10 గంటలకు మమ్మా అందరికీ ద్రాక్ష పండ్లు ఇచ్చారు. అప్పట్లో ద్రాక్ష తోట చాలా పెద్దదిగా ఉండేది. ద్రాక్ష గుత్తులు కూడా చాలా వచ్చాయి. కాని మమ్మా వ్యాధి ఎంత ముదిరిపోయిందంటే, మమ్మా బయటకు రావడమే మానేశారు, మాట్లాడడం కూడా చాలా తగ్గించేశారు. కాని మమ్మా స్థితిలో ఎలాంటి పరివర్తన రాలేదు. వారి వరదాని దృష్టి పూర్వము వలెనే ఉండినది. మునుపటి వలెనే పెదవుల పై చిరునవ్వు కూడా చెరగలేదు. అదే నిశ్చింత భావము. ఇప్పుడు ఈషు బెహన్ ఆఫీసు ఉన్న చోట మమ్మా ఒక్కొక్కరికి నాలుగేసి ద్రాక్ష పండ్లు తమ స్వహస్తాలతో ఇచ్చారు. తర్వాత జమునా బెహన్ బాబాను మమ్మా గదిలోకి తీసుకొచ్చారు. బాబా మమ్మాను చూచి వెంటనే డాక్టరును పిలుచుకుని రమ్మని ఎవరినో పంపించారు. డాక్టరు వచ్చి చెక్ చేసి మమ్మా శరీరాన్ని వదిలేశారని చెప్పారు. తర్వాత అన్ని చోట్లకు సందేశము కూడా పంపించారు. మమ్మా 24 జూన్ సాయంకాలము సుమారు 4 గంటలకు శరీరాన్ని వదిలేశారు. 1965 జూన్ 25వ తేదీన మమ్మా అంతిమ సంస్కారము జరిగింది.

- బ్రహ్మకుమార్ ఓంప్రకాశ్, మధువనము

# మమ్మా ఆఖరి రోజులలో వారితో అనుభవము

ముంబయి నుండి బ్రహ్మకుమార్ భ్రాతా రమేష్‌గారు చెప్తున్నారు - ఏప్రిల్ 1964వ సంవత్సరము నుండి మమ్మాతో నా వ్యక్తగత అనుభవము చాలా లోతైనదే కాక హృదయాన్ని స్పర్శించునదిగా ఉండినది. మమ్మా ఏప్రిల్ 1964లో మధువనము నుండి సేవాకేంద్రాలు తిరిగి వచ్చేందుకు వెళ్లారు. మమ్మా పంజాబులో తిరుగుతూ కాన్పూరు చేరుకున్నారు. నేను అప్పుడు ముంబాయిలో ఉన్నాను. ఒకరోజు అకస్మాత్తుగా కాన్పూరు నుండి ఫోనులో నాకు ఇలా తెలుపబడింది - నిన్నటి రోజు మమ్మాను ఒక డాక్టరుకు చూపించగా వారి ఛాతి పై ఒక గడ్డ కనిపించింది. మరో డాక్టరుకు చూపించగా ఈ గడ్డ కొంత విచిత్రంగా కనిపిస్తోంది. కనుక మాతేశ్వరి గారిని ముంబయికి తీసుకెళ్లి అచ్చట టాటా ఆసుపత్రిలో చెక్ చేయించాలి అని చెప్పారు. మేము ఈ విషయాన్ని బాబాకు తెలిపామని, బాబా మమ్మాను మొదట ఆబూకు తీసుకొని రమ్మని చెప్పారని, ఆబూకు వచ్చిన తర్వాత ఏమి చేయాలో, ఏమి చేయరాదో బాబా నిర్ణయిస్తారని, బాబా చెప్పారని కూడా కాన్పూరు సోదరీ-సోదరులు నాకు ఫోను ద్వారా తెలిపారు.

వ్యాధి గంభీర రూపము తెలిసి నేను ఫోను ద్వారా మధువనంలో ఉన్న బాబాతో వివరంగా మాట్లాడాను. అప్పుడు మమ్మాను కాన్పూరు నుండి ముంబయికి తీసుకు రావాలని నిర్ణయించబడింది. దాదా విశ్వకిశోర్ కూడా మధువనము నుండి ముంబయికి వచ్చారు. విశ్వకిశోర్ దాదాతో కలిసి నేను నాకు తెలిసిన డాక్టరు జస్వాల్ గారితో టాటా హాస్పిటల్లో చెక్అప్ చేయించే కార్యక్రమాన్ని తయారు చేశాము. చెక్అప్ చేసిన తర్వాత డాక్టర్ ఆపరేషన్ చేసేందుకు నిర్ణయించారు.

ఆపరేషన్ చేసేందుకు సమయము నిశ్చయింపబడింది. రెండు రోజుల తర్వాత మేము మమ్మాను మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్ళాము. ఆపరేషన్ థీయేటర్ వరకు మమ్మాను నేను, విశ్వకిశోర్ భాయి ఇరువురమే తీసుకెళ్ళాము. వార్డుబాయిలకు ఇవ్వలేదు. ఆపరేషన్ థియేటర్‌లో మమ్మాతో మా లౌకిక సోదరి డాక్టర్ అనిల కూడా ఉండినది. ఆమె వచ్చి అప్పుడప్పుడు సమాచారము వినిపిస్తూ ఉండినది. మేము ఆ సమాచారాన్ని వెంట వెంటనే మధువనములో






మాతేశ్వరిగారితో విశ్వ కిశోర్ భావు

బాబాకు తెలిపిస్తూ ఉండినాము. ఆ తర్వాత మమ్మాను ఆసుపత్రి నుండి ముంబయిలో మా ఇంటికి తీసుకొచ్చాము. ఆపరేషన్ తర్వాత మమ్మా ముంబయిలో రెండున్నర మాసాలున్నారు.

ఆ తర్వాత మేము మమ్మాను తీసుకొని మధువనానికి వచ్చాము. ప్రతి మూడు మాసాలకు చెక్అప్ చేయించేందుకు మమ్మాను ముంబాయి తీసుకు రావలసి వస్తుందని డాక్టరు చెప్పారు. మమ్మా వస్తూ ఉండినారు. 1965వ సంవత్సరం జనవరి 12వ తేదీ మమ్మాను మళ్లీ టాటా ఆసుపత్రిలో చూపించాము. చెక్అప్ చేసిన తర్వాత డాక్టరు మళ్లీ మూడు మాసాలకు చెక్ చేయించుకోవాలని చెప్పారు. మమ్మా ముంబాయి నుండి బెంగుళూరుకు వెళ్లారు. అక్కడ ఒకటిన్నర - రెండు మాసాలు ఉండి తర్వాత పూనాకు వచ్చారు. ఏప్రిల్ 18వ తేది మళ్లీ చెక్అప్ కొరకు ముంబయికి వచ్చారు. మమ్మాతో పాటు జమునా దాది, అనిలా బెహన్ కూడా వెళ్ళారు. నేను వెళ్లలేదు ఎందుకంటే ఆ రోజు మాకు ఆఫీసులో పని ఉన్నందున నేను వెళ్లలేదు. ఆఫీసు నుండి



ముంబయి ఆసుపత్రిలో బెడ్ పైన పరమాత్మ - లగ్నములో మగ్నమైన మాతేశ్వరి శ్రీ జగదంబ

వస్తూనే అనిలా ముఖము ఉదాసీనంగా పాలిపోయి ఉంది. నేను ఆమెను వెలుపల గ్యాలరీలోకి తీసుకెళ్లి "మీ ముఖము ఎందుకు పాలిపోయి ఉంది? డాక్టరు ఏమి చెప్పారో నాకు తెలుపు" అని అడిగాను. ఆమె నేరుగా చెప్పక మాట మార్చేందుకు ప్రయత్నించింది. "డాక్టరు ఏమి చెప్పారో సత్యంగా తెలుపు" అని నేను ఆమెను అడిగాను. అందుకు ఆమె "నీవు వినలేవు" అని అన్నారు. అప్పుడు నేను "నన్ను గురించి ఆలోచించకు వాస్తవాన్ని ఎదుర్కోనే తీరాలి, దాచి పెట్టడం వలన జరగబోయేది ఆగదు" అని అన్నాను. అప్పుడు ఆమె "మమ్మాలో క్యాన్సర్ వ్యాధి దావానలము(అడవిలో అంటుకొను అగ్ని) వలె ఊపిరితిత్తుల వైపుకు వ్యాపిస్తోంది అనగా రోగి ఎక్కువలో ఎక్కువ 3 - 4 మాసాలు మాత్రమే జీవించగలదని డాక్టరు చెప్పారు" అని చెప్పింది. మరుసటి రోజు నేను శీల్ దాది దగ్గరకు వెళ్లి ఆమెతో నీవు వతనానికి వెళ్లి అత్యవసర కార్యము కొరకు మీ శరీరములోకి రమ్మని బాబాను ఆహ్వానించండి అని చెప్పాను. అప్పుడు శీల్ దాది అన్నారు - " నీవు ఏ సందేశము ఇవ్వాలో నాకు తెలుపు నేను రేపు ఉదయము వారి వద్దకు సందేశము తీసుకెళ్తాను.



నీవు ఎప్పుడు కావాలంటే అప్పుడు అంత సులభంగా పిలిస్తే వచ్చేదానికి బాబా అంత సాధారణము అనుకున్నావా! " అని అన్నారు. అప్పుడు నేను - "విషయము ఎలాంటిదంటే నేను మీకు సందేశములో కూడా వినిపించలేను. కావున మీరు బాబా వద్దకు వెళ్లండి. వారు తప్పకుండా వస్తారని నాకు పూర్తిగా నమ్మకముంది. చాలా గుప్తమైన మహత్వపూర్ణమైన విషయము అందువలన మీరు వెళ్లండి" అని ఆమెకు చెప్పాను. అప్పుడు శీల్ దీదీ ధ్యానములోకి వెళ్లారు. 5 నిముషాల తర్వాత బాబా వారి శరీరములోకి వచ్చారు. నేను బాబాతో మాట్లాడాను. మొత్తం విషయమంతా తెలిపాను. బాబా అన్నారు - "బచ్చే! ఇది డ్రామాలో నిర్ణయించబడింది" దానిని నిలుపలేము. అచ్ఛా నీవు ఒక పని చేయాలి - "మమ్మా మీరు కేవలం ఇక మూడు మాసాలు మాత్రమే జీవించి ఉంటారని డాక్టరుగారు చెప్పినారని ఒక కాగితము పై వ్రాసి మమ్మాకు ఇవ్వు" అని అవ్యక్తబాబా నాకు చెప్పారు.

ఇప్పుడు మీరు ఆలోచించండి - ప్రపంచములో ఏ కుమారుడైనా తన తల్లికి అమ్మా! ఇక నీ జీవితము మూడు, నాలుగు మాసములు మాత్రమే మిగిలి ఉంది, ఆ తర్వాత మీరు శరీరాన్ని వదిలేస్తారని వ్రాస్తాడా? నేను ఇప్పుడు మీకు ఎంతో శాంతిగా తెలుపుతున్నాను, కాని అప్పుడు బాబా ఎదుట కూర్చొని ఒకవైపు "లేదు, లేదు" అంటూ ఉండినాను మరోవైపు నా కనుల నుండి అశ్రువులధార ప్రవహిస్తూ ఉండినది. "బాబా, నేను ఈ పని చేయలేను, చేయలేను" అని నేనన్నాను. అందుకు బాబా అన్నారు - "ఈ కార్యము నీవే చేయాలి, బాబా నీకు శక్తినిస్తారు. ఈ రోజు రాత్రి నీవు ఆఫీసుకు వెళ్ళు, మమ్మాకు జాబు వ్రాయి. ఆ జాబును మమ్మా చేతికే ఇవ్వు. ఆ జాబు మమ్మా చదివిన తర్వాత దానిని ఒక కవరులో ఉంచి మధువనానికి పంపించు, ఆ కవరు పై సాకార బాబాకే అందాలి అని వ్రాయి. ఆ జాబును సాకార బాబా మాత్రమే చదువుతారు, ఇతరులెవ్వరూ చదవలేరు."


నేను ఆఫీసుకు వెళ్లి వ్రాసేందుకు ప్రారంభించాను. 5-6 సార్లు ప్రయత్నించాను. కాని వ్రాసేందుకు ధైర్యము చాలలేదు. చివరికి ఏదో ఒక విధంగా మమ్మాకు జాబు వ్రాసి కవర్‌లో ఉంచి కవర్ మూసేశాను. రాత్రి

భోజనము చేసిన తర్వాత మమ్మా గదికి వెళ్లాను. ఆ జాబు మమ్మాకు ఇచ్చి మమ్మా ఇది మీరు చదవాలి అని అన్నాను. మమ్మా నన్ను ఇది ఎవరి జాబు? అని అడిగారు. అందుకు నేను "అవ్యక్తబాబా నాతో ఈ జాబు వ్రాయించారు" అని అన్నాను. మమ్మా చదివి ఇది డ్రామాలో నిర్ణయించబడి(భావి) ఉంది అని అన్నారు. మమ్మాకు డ్రామా పై ఎంత నిశ్చయముండేదో గమనించండి. విషయము పూర్తిగా తెలిసినా ఎంత నిశ్చింతగా ఎంత నిబ్బరంగా ఉండినారో చూడండి. జాబు చదివి నాకు వాపస్ ఇచ్చేశారు. నేను ఆ జాబును ఆబూలో సాకారబాబా పేరుతో పంపించాను. ఆ నెల 19-20 తేదీలు నాకు చాలా కఠిన పరీక్షా రోజులు. ఆ పరీక్షలను నేను ఎదుర్కోవలసి వచ్చింది. గుండె రాయిగా చేసుకొని నేను పరీక్షలో పాస్ అయ్యాను.

ఆ తర్వాత క్యాన్సర్ వ్యాధి శరీరములో ఇతర భాగాలకు వ్యాపించకుండా రేడియేషన్ కొరకు మమ్మాను ప్రతిరోజు ఆసుపత్రికి తీసుకెళ్లవలసి వచ్చేది. చివరి దఫా డాక్టర్ వద్దకు మమ్మాను డాక్టర్ అనిలా బెహన్ తీసుకెళ్లింది. చెక్ చేసిన తర్వాత డాక్టర్ చెప్పారు - "ఇప్పుడు మమ్మాలో క్యాన్సర్ చాలా తీవ్రమైపోయింది. ఈ ప్రపంచములో ఏ మందూ ఇప్పుడు పని చేయదు. మీరు దయ చేసి వీరు శాంతిగా శరీరాన్ని వదిలేందుకు ఎక్కడకు కావాలంటే అక్కడకు తీసుకెళ్లండి." శ్వాస తీసుకునేందుకు కూడా మమ్మాకు చాలా కష్టంగా ఉండినది. ఈమెను ఎక్కడకు కావాలో అక్కడికి తీసుకెళ్లమని చెప్పినప్పుడు అనీలా బెహన్‌కు మేము ఆటలో ఓడిపోయామని దృఢంగా నిశ్చయమైపోయింది. తర్వాత మేము సాకార బాబాకు ఫోన్ చేసి డాక్టరు గారు ఇలా చెప్పారు - ఏమి చేయాలి? అని అడిగాము. అప్పుడు "మమ్మాను ఆబూకు పంపమని" చెప్పారు.

జూన్ 4వ తేది 1965 సంవత్సరము మా ఇంటి నుండి మమ్మా మధువనానికి వీడ్కోలు తీసుకునే రోజు. ఆ రోజు నేను ఒక కొత్త పాటను రికార్డు చేసుకొని వచ్చాను. ఆ పాట ఏదంటే - ' ఓ జానేవాలే హొ సకే తో లౌట్ కే ఆనా..........(ఓ పోయే ప్రయాణికుడా! వీలైతే వాపస్ రా! ......)' కుమార్కా దాది(ప్రకాశ్‌మణిదాది) బ్రిజేంద్రదాది బయట కూర్చుని ఉండినారు. ఇది





మూడు నిముషాల రికార్డు అని, పూర్తి అయిన తర్వాత మళ్లీ అదే రికార్డును పెట్టమని, 6 నిమిషాలు మమ్మాతో గడుపుతానని చెప్పి నేను మమ్మా గదిలోకి వెళ్లాను. రికార్డు మొదలయ్యింది.

*అంతిమ క్షణము వరకు విశ్వమునకు సకాశ్ ఇస్తున్నటువంటి జగన్మాత*

ఈ పాట వింటూనే దాది దానిని ఆపు చేశారు. ఇటువంటి రికార్డు వేయరాదు రమేష్ నీవు ఏమనుకుంటున్నావు అని దాదిగారు నాతో సీరియస్‌గా అన్నారు దాదీ, "మేము మా ఇంటి నుండి మమ్మాకు వీడ్కోలు ఇస్తున్నాము, ఇది మా ఆహ్వానము" అని చెప్పి దాదీజీని ఒప్పించాను. దాదీకి ఇష్టము లేకున్నా ఆ రికార్డు మళ్లీ వేశారు.

మమ్మా స్థితి ఎలా ఉందో భవిష్యత్తులో ఏమి జరగబోతుందో నాకు తెలుసు. మమ్మా నా చేతిలో తన చేయి వేసి 6 నిమిషముల పాటు నాకు ప్రేమతో నిండిన దృష్టినిస్తూ ఉండినారు. నేను కూడా దృష్టి తీసుకుంటూ ఉండినాను. తర్వాత మమ్మాను వీల్‌చేర్‌లో క్రిందకు తీసుకొచ్చి కారులో కూర్చోబెట్టాము. రైలులో కూడా మమ్మాకు వీడ్కోలు సమయములో మమ్మా కనులు ప్రేమాశ్రువులతో నిండిపోయాయి. ఏమి జరగబోతుందో మమ్మాకు కూడా తెలుసు, నాకు కూడా తెలుసు. ఇతర యజ్ఞవత్సలు ఎవ్వరికీ మమ్మా

మమ్ములను విడిచి వెళ్ళిపోతుందని తెలియదు. అటువంటి ఆలోచన కూడా వారికి రాదు. మమ్మాను, జమునా దాది, అనిలా బెహన్ బ్రహ్మాబాబా లౌకిక కుమారుడు నారాయణ్ భాయ్‌తో పాటు ఆబుకు పంపించాము.

మరుసటి రోజు గురువారము. ఆ రోజు శీల్‌దాది భోగ్ తీసుకెళ్తూ ఉండినది. ఆమెకు బాబా వద్దకు నా సందేశము ఇలా వినిపించమని చెప్పాను. బాబా ఇంతవరకు నేను ఏమీ అడగలేదు, ఈ రోజు ఒక్క విషయము అడుగుతున్నాను - మమ్మా శరీరము వదులునప్పుడు నేను అక్కడ ఉండాలి. ఈ మాట విన్న వెంటనే శీల్‌దాది నీవు ఏమి ఇంత నాస్తికుడుగా తయారయ్యావు? మమ్మా శరీరము వదులుతుందనేది ఎప్పుడైనా జరుగుతుందా? ఇలా మాట్లాడవచ్చా? దానికి నేను - దాదీ మీరు కేవలం నా సందేశాన్ని బాబాకు వినిపించండి......... ఒకవేళ మమ్మా శరీరాన్ని విడువకుంటే మమ్మా శరీరాన్ని వదలరని బాబా చెప్తారు. అంతేకాక ఆబూలో వారికి క్రొత్త కొత్త మందులు ఎలా ఇస్తారో, మమ్మా ఎలా బాగైపోతుందో కూడా తెలుపుతారు. ఈ మాట శీల్‌దాదికి కూడా నచ్చింది. శీల్‌దాది సందేశాన్ని తీసుకెళ్ళింది. బాబా అన్నారు - డ్రామాకు ఇష్టముంటే రమేష్ అక్కడకు చేరుకుంటాడు. శీల్‌దాది క్రిందికి వచ్చిన తర్వాత నీ సందేశము తప్పు అని బాబా చెప్పలేదు. డ్రామాకు మంజూరైతే రమేష్ అక్కడకు చేరుకుంటాడని బాబా చెప్పారు. కావున దీని అర్థమేమి? అని నన్ను అడిగారు. అందుకు నేను నాకేమి తెలుసు? చతురసుజానులైన బాబాకే తెలుసు అని నేను చెప్పాను.

రోజులు గడుస్తూ పోయాయి. మమ్మా శరీరాన్ని వదిలినప్పుడు మొట్టమొదట బాబా ముంబయికే ట్రంక్‌కాల్ చేశారు. ఆ ఫోన్ నేనే తీసుకున్నాను. మమ్మా సాయంకాలము 4 లేక 4-10 నిముషాలకు శరీరము వదిలేసిందని తెలుపబడింది. ఫోను వచ్చినప్పుడు అందరూ క్లాసులో ఉన్నారు. ఏమి చేయాలో అందరూ కలిసి ఆలోచించారు. కుమార్‌కా దాది, సీతా మాతలతో నేను రాత్రి 9 గంటలకు గుజరాత్ మెయిల్‌కు వెళ్లాలని నిర్ణయించారు. నిర్వైర్‌భాయి మమ్ములను స్టేషన్ వరకు వచ్చి వదిలిపెడ్తారు. నేను నా లౌకిక సోదరి అనిలా బెహన్ ఇంటికి వెళ్ళి నేరుగా స్టేషన్‌కు వస్తాను. మీరు నాకు కూడా టికెట్ తీసుకొని సీట్ పెట్టమని చెప్పాను. శరీరాన్ని ఎక్కువ సమయము ఉంచేందుకు వీలు లేదు. కావున పోకుంటే మంచిదని అనిలా బెహన్ అన్నారు. నేను వెళ్ళలేదు. రమేష్ భాయి రాలేదు. కావున నిర్వైర్ భాయిని మీరు మాతో రండి అని దాదీ అన్నారు. నిర్వైర్ భాయి దాది వారి జతలో వెళ్ళిపోయారు. తర్వాత నేను ఇంటికి వెళ్ళి కొంచెము నాశ్తా తిని వాటర్‌లూ సెంటర్‌కు వెళ్ళాను. అక్కడ అందరూ మీరు పోయి ఉండాల్సింది అని చెప్పారు. ఉదయము 6 గంటలకు అహ్మదాబాదుకు విమానము ఉండినది. వెంటనే నేను అందులో టికెట్ బుక్ చేయించుకున్నాను. మేము 5 మంది ఉండినాము. అహమ్మదాబాదు మెయిల్ ట్రైన్ ఉదయం 8 గంటలకు బయలు దేరుతుంది. విమానము 8-15 నిమిషాలకు విమానాశ్రయము చేరుకుంటుంది. మేము టాక్సీలో మెహసానా వరకు పోయేసరికి మెయిల్ ప్లాట్‌ఫామ్ పై నిలబడి ఉంది. మేము కూడా దాదీతో కలిశాము. మమ్మా కొరకు మేము రాత్రే గంధపు చెక్కలు. పూల ఛాదర్(దుప్పటి) మొదలైనవి తీసుకొని ఉండినాము. స్టేషన్‌లో బూరి దాది ఉండినది. చేరిన వెంటనే ఆమె ఈ సామానంతా ఇక్కడే వదిలేసి అంతిమ సంస్కారము జరిగే చోటికి వెళ్ళండి. మీ కొరకు అందరూ కాచుకొని ఉన్నారని చెప్పింది. మేమందరమూ నేరుగా అచ్చటికి చేరుకున్నాము. అందరికీ గంధపు చెక్కలు ఇచ్చి పూల దుప్పటి శరీరము పై కప్పాము. అగ్ని స్పర్శ కార్యము సంపన్నమయ్యింది. ఈ విధంగా మేము డ్రామానుసారము మమ్మాగారి అంతిమ సంస్కారానికి చేరుకున్నాము. ఈ విధంగా మమ్మాగారి గురించిన తెలుపవలసిన విషయాలు చాలా ఉన్నాయి. వారి నుండి నేర్చుకోవలసిన శిక్షణలు కూడా చాలా ఉన్నాయి. కాని వారిని గురించి ఎంత తెలిపినా, వారి చరిత్ర(క్యారెక్టర్), వ్యక్తిత్వాల గుణగానము పూర్తి కాదు.

# మమ్మాను గురించి అవ్యక్త సందేశము



లక్నో - బనారస్ తోటలో మాతేశ్వరి గారు (1956)

సర్వ సేవాకేంద్రాలలోని స్వదర్శన చక్రధారులు, బ్రాహ్మణ కుల భూషణులైన సోదరీ-సోదరులకు మధువన నివాసులమైన మా అందరి హృదయ పూర్వక ప్రియస్మృతులు స్వీకరించండి. మధురమైన(మీఠీ) మమ్మా స్థూల వతనాన్ని వదిలి సూక్ష్మ వతనవాసిగా అయిన విషయము మీ అందరికీ తెలిసే ఉంటుంది. బ్రహ్మాబాబాతో పాటు పిల్లలైన మేమందరము కలిసి చాలా చాలా ఆహ్వానించాము. కాని ఆల్‌మైటీ బాబా మా అర్జీని మంజూరు చేయలేదు. మధురమైన డ్రామా అనే చెప్పాలి. మురళి సమాప్తము చేసుకొని మధ్యాహ్నము రెండు గంటలకు తల్లి శరీరాన్ని మధువన భూమి నుండి వీడ్కోలు పలికే కార్యక్రమము ఉండినది. ఆల్‌మైటీ బాబా తల్లి కొరకు చాలా



బాగా అలంకరించబడిన శవపేటిక(పాడె, చౌడేలా)ను తయారు చేయమని ఆదేశించారు. ఆల్‌మైటీ బాబా ఇచ్చిని ఆదేశము ప్రకారము రంగు రంగుల పుష్పాలతో తెల్లని చాదర్‌లతో చౌడేలా అలంకరింపబడింది. సరిగ్గా 2-30 నిమిషాలకు తల్లి పార్థివ శరీరము పుష్పాలతో చందన తిలకము మొదలగు వాటితో అలంకరించబడి తయారు చేయబడింది. మళ్లీ చివరిసారిగా అర్ధగంట బాప్‌దాదాతో కలిసి పిల్లలైన మేమందరము హాల్‌లో మమ్మా శరీరాన్ని చూస్తూ యోగములో కూర్చున్నాము. చివరి వరకు ఇప్పుడైనా మా తల్లిని వాపస్ పంపండి అని ఆహ్వానించాము. చివరికి మూడు గంటలకు తల్లి శరీరమున్న శవ పేటిక(చౌడేలా) పైకి తీసుకెళ్లబడింది. ఫోటోలు మొదలైనవి తీయబడ్డాయి. గోప-గోపికలందరూ లైనులో నిలబడ్డారు. చౌడేలా నెమ్మది నెమ్మదిగా ముందుకు సాగిపోయింది. సాకార బాబా కూడా మధువన ద్వారము(ఫాటమ్) వరకు తమ భుజమునిచ్చేందుకు వచ్చారు. మధువన గేట్ వెలుపల వరకు వచ్చిన పిదప పిల్లలైన మేమందరము మా యూనిఫామ్‌లు ధరించి చాలా నిశ్శబ్దంగా మూడు లైన్లలో వరుసగా నిలబడ్డాము. ముందు భాగములో సోదరులు, తర్వాత సోదరీలు నడుస్తూ వెళ్లారు. ఈ దృశ్యము ఒక ఫరిస్తాల మెరవణి పోతూ ఉన్నట్లు కనిపిస్తూ ఉండినది. పిల్లలు నంబరువారీగా భుజాలు మార్చుకుంటూ అగ్ని సంస్కార స్థలము వద్దకు వెళ్లేందుకు ముందుకు సాగారు. దారిలోని జనులందరూ ఈ విచిత్రమైన అలౌకిక దృశ్యాన్ని చాలా ఆశ్చర్యముతో చూస్తూ ఉండినారు. వారు ఇది ఎంత ఆశ్చర్యము! ఇంతమంది ఇంత సైలెన్స్‌గా, శాంతిగా పోతూ ఉన్నారు! అని అనుకుంటూ చూస్తూ ఉండినారు. చివరికి ఏ స్థలములో అంతిమ సంస్కారము జరగాలో ఆ స్థలానికి చేరుకున్నాము. తల్లి మృత దేహమును చూస్తూ అందరూ చాలా గంభీరంగా డ్రామాలో నిశ్చయింపబడిన దానిని చూస్తూ ఉండిపోయారు. అక్కడ కూడా అందరము యోగములో కూర్చొని ఉండినాము. మరోవైపు ఏర్పాట్లు జరుగుతూ ఉండినాయి. ఆ అంతిమ సమయములో బొంబాయి నుండి బ్రహ్మాకుమార-కుమారీలు విమానాల ద్వారా, రైళ్ల ద్వారా వచ్చి నేరుగా ఆ స్థలానికి చేరుకున్నారు. తల్లి మృత శరీరాన్ని

చూచి అందరూ చాలా గంభీర రూపములో విధిని చూస్తూ ఉండిపోయారు. చాలా పుష్పాలు, గంధపు కర్రలు మొదలైనవి తీసుకొని వచ్చి ఉండినారు. చివరికి తల్లి చౌడేలా(పాడె) పై కర్రలు మొదలైనవి పేర్చు సమయము వచ్చేసింది. ఆ సమయములో సూది క్రింద పడినా శబ్ధము వచ్చునంత నిశ్శబ్ధము ఆవరించింది. ఇప్పుడిక మమ్మా ఈ స్థూలవతనము నుండి వీడ్కోలు తీసుకుంటూ ఉందని అందరికి నిశ్చయమైపోయింది. తర్వాత విశ్వకిశోర్ భాయి గుండె నిబ్బరము(రాయి) చేసుకొని చితికి నిప్పంటించారు. అంతే అగ్ని మమ్మా దేహములోని సర్వస్వాన్ని పంచతత్వాలకు అర్పితము చేసేసింది. తర్వాత అందరూ శాంతిగా లైనులోనే మధువనానికి వాపసు వచ్చేశాము.

సాకార వతనవాసి అయిన మధురమైన మమ్మా సూక్ష్మ వతన వాసిగా అయిన పిదప అవ్యక్త వతనములో ఆత్మిక సంభాషణ.

**(సందేశీ గుల్జార్‌దాది ద్వారా మధువనములో ఏడు రోజుల భోగ్ సమాచారము)**

## మొదట రోజు (26-06-1965)

సాయంకాల సమయము నేను వతనానికి వెళ్లేసరికి మధురమైన మమ్మా చాలా సుఖంగా బాబా ఒడిలో విశ్రమించి ఉండినారు. నేను అక్కడకు చేరుకున్నాను. బాబా తమ చేతులతో మమ్మాకు భోగ్ స్వీకారము చేయించి నాతో ఇలా అన్నారు - మమ్మా చాలా అలసిపోయి వచ్చింది. అందువలన విశ్రాంతి చేయిస్తున్నాను. నేను అన్నాను - మమ్మా అందరూ మిమ్ములను తీసుకొని రమ్మన్నారు, కావున మీరు రండి. అందరూ చాలా జ్ఞాపకము చేసుకుంటున్నారు. అందుకు మమ్మా చాలా మధురంగా చిరునవ్వుతూ, పిల్లలూ! మీరంతా చాలా సార్లు వతనములో తిరుగుతూ ఉండినారు. నేను వచ్చింది ఈ రోజే. అప్పుడే నన్ను తీసుకెళ్లేందుకు వచ్చావా? నాకు సూక్ష్మవతనమంటే చాలా ఇష్టము. పిల్లలందరికి నా తరఫున చాలా ప్రియస్మృతులు ఇవ్వండి అని అన్నారు.

## రెండవ రోజు (27-6-1965)

నియమానుసారము భోగ్ స్వీకారము చేయించిన పిదప ఈ రోజు



మీఠీ మీఠీ మమ్మాను ఆల్‌మైటీ బాబాతో పాటు గద్దె పై విరాజమానమై ఉండడం చూశాను. ఇరువురు పరస్పరము మాట్లాడుకోవడంలో ఎంత మగ్నమై ఉన్నారంటే కొన్ని సెకండ్ల వరకు వారు నా పైపు కూడా చూడనేలేదు, గమనించనేలేదు. తర్వాత బాబా అన్నారు - మమ్మా నీ కొరకు యజ్ఞ ప్రసాది(గుల్జార్‌దాది) వచ్చింది. ఈ రోజు మీరు భోంచేయడమే మర్చిపోయారు కదా. తర్వాత మమ్మా నాకు ఇలా వినిపించారు - "మమ్మా ఈ రోజు సేవార్థము నిన్ను పంపమంటావా?" అని బాబా నన్ను అడిగారు. దానికి నేను బాబా నేను వచ్చింది ఇప్పుడే కదా. ఇంకా కొంత సమయము నేను వతనములోనే ఉంటాను. ఎలాగైతే సాకార వతనంలో సాకార బాబా జతలో ఉండినానో అలాగే ఆకార వతనములో మీ జతలో ఉంటాను. ఆ తర్వాత నేను మమ్మాగారికి అనన్య పిల్లలందరి స్మృతులను తెలిపాను. అంతే. వారి స్మృతులు తెలిపిన వెంటనే మమ్మా కనులు అనే దుర్బిణి(టెలిస్కోప్) ద్వారా ఒక్కొక్క వత్సల ప్రేమ సంపన్న స్మృతి మూర్తి నిలుస్తూ ఉండి, ఒక్కొక్కరితో కలుస్తూ ఉన్నట్లు అనుభవమయింది. ఆ సమయములో తల్లి కనులు పిల్లల స్నేహములో చెమ్మగిల్లుతూ ఉండినాయి. మమ్మా అందరితో కలిసేందుకు వస్తావా? అని అడిగాను. బాబా ఎలా నడిపిస్తారో, అలా నడుస్తాను. బాబా నన్ను చాలా ఆనందపరుస్తున్నారు. ఆ విషయము రేపు వినిపిస్తాను.

## మూడవ రోజు(28-06-1965)

ఈ రోజు తల్లిని తండ్రి జతలో పుష్పాల తోటలో చూశాను. జతలో సంపూర్ణ మమ్మాను కూడా చూశాను. దూరము నుండి నా కళ్లకు ఒకే తల్లివి రెండు రూపాలు చూడడం లేదు కదా అని అనిపించింది. కాని సమీపము నుండి చూచినప్పుడు సంపూర్ణ మమ్మా సాకార మమ్మా ఇరువురు వేరు వేరుగా కనిపించారు. రూపురేఖలు(లక్షణాలు) ఒకే విధంగానే ఉండినాయి. ఇరువురూ పారదర్శికంగానే ఉండినారు. కాని ఇరువురిని వేరు వేరుగా స్పష్టంగా గుర్తించగలిగాను. కలుసుకున్న తర్వాత సంపూర్ణ మమ్మా కనిపించలేదు. ఈ రోజు ఎక్కడెక్కడ విహరించారో మమ్మాను అడుగు అని బాబా నాతో అన్నారు. ఈ రోజు అన్ని సెంటర్లను చూపించేందుకు బాబా

నన్ను తీసుకెళ్ళారు. సెంటర్లలో పిల్లలకు శివబాబా స్మృతి అయితే ఉంది. కాని త్రాసులో తల్లి అనే పళ్లెము వైపు ముల్లు వంగి ఉండి భారము చూపుతూ ఉండినది. చాలామంది ముఖాలు చాలా నిశ్శబ్ధంగా, గంభీరంగా కనిపిస్తూ ఉండినాయి. ఇంకా కొంతమంది ముఖాలైతే ముడుచుకుని కూడా ఉండినాయి, కొంతమంది ముఖాలు హర్షితంగా చిరునవ్వుతో కూడా కనిపించాయి. అన్ని సెంటర్లు తిరిగిన తర్వాత బాబా నన్ను మధువనానికి తీసుకొచ్చారు. నేను సాకారములో ఉన్నప్పుడు గద్దె పై కూర్చుని మురళి ఎలా వినేదానినో అలా నా గద్దె(సందలి) పై కూర్చుని మురళి విన్నాను. పిల్లల గమనము మరియు నా గమనము మురళి పైననే ఉండినది. తర్వాత మమ్మా వినిపించారు - ఈ రోజు 6 గంటల నుండే కాచుకొని ఉండినాము. బాబా మాకు వతనములో ఫలాలను చూపిస్తూ మీకు నచ్చిన వాటిని కోసుకొని తినమని చెప్పారు. నేను మమ్మాను ఇలా అడిగాను - మమ్మా మీరు సాకార వతనము నుండి వచ్చునప్పుడు కనీసము అందరి నుండి వీడ్కోలు కూడా తీసుకోలేదు. ఇక వెళ్లిపోతానని మీకు ముందే తెలుసా? ఆ విషయము రేపు వినిపిస్తానని మమ్మా అన్నారు. మధువనానికి రమ్మని మమ్మాను ఆహ్వానించాను. ఈ రోజు మమ్మాకు స్థూలవతనపు స్మృతి కొంచెము ఎక్కువగా ఉండినది. వారు చాలా రిఫ్రెష్(తాజా)గా ఉండినారు. ఈ రోజు మమ్మాను భక్తుల వద్దకు తీసుకెళ్ళాలని బాబా అన్నారు.

## నాల్గవ రోజు (29-06-1965)

మమ్మా బాబా జతలోనే ఉండినారు. భోగ్ స్వీకరించిన పిదప మమ్మా, నిన్నటి రోజు మిమ్ములను బాబా ఎక్కడెక్కడ విహరింపజేశారు? అని అడిగాను. మమ్మా ఇలా అన్నారు - భక్తులలో అర్ధ భాగము నీ భక్తులు, అర్ధ భాగము నా భక్తులున్నారు. ఇప్పుడు తండ్రి భక్తుల వద్దకు తీసుకెళ్లమంటావా? లేక నీ భక్తుల వద్దకు తీసుకెళ్లమంటావా? అని నన్ను అడిగారు. తర్వాత బాబా నన్ను చాలా విహరింపజేశారు. అందులో ఒక కాళికా మందిరానికి నన్ను తీసుకెళ్ళారు. అచ్చట చూస్తే చాలా పెద్ద భక్తుల గుంపు ఉండినది. భక్తులు తమ నియమానుసారము వెళ్తూ ఉండినారు. ఆ మందిరములో ఒక భక్తుడు



చాలా వ్యాకులపడుతూ దర్శనమివ్వకపోతే ప్రాణ త్యాగము చేస్తానని ప్రతిజ్ఞ చేస్తూ ఉండినాడు. అప్పుడు బాబా నన్ను ఇలా అడిగారు - మమ్మా నీ భక్తుల పిలుపులు విని నీకు దయ కలగడం లేదా? ఇప్పుడు అతని ముందుకు వెళ్ళు అని బాబా చెప్పారు. అప్పుడు నేను మందిరములోని విగ్రహము ముందు నిలబడ్డాను. ఆ భక్తుడు నా సాధారణ రూపము చూసి పాపం ఒకవైపు సంతోషిస్తూ కూడా ఉండినాడు. అయితే అవునా కాదా? అను ద్వంద్వములో పడిపోయాడు. అప్పుడు అతని మస్తకము పై నీ చేతితో నిమురు అని బాబా చెప్పారు. నేను వెళ్ళి అతని ముందు నిల్చొని అతని మస్తకము పై నా చేతిని ఉంచాను. అతను ధ్యాన మగ్నమైపోయాడు(ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు). ధ్యానములో అదే కాళి జగదంబ రూపములో వచ్చి నిలబడి ఉందని తెలుసుకున్నాడు. అయితే చైతన్య రూపములో కలిగిన ఈ ప్రాప్తికి ఆ భక్తుడు గద్గదమైపోయాడు.

తర్వాత బాబా చాలా నౌధా(నవ విధముల) భక్తి చేసిన ఒక విదేశీ జంటను చూపించారు. వారు చాలా బాధతో ఇంగ్లీషులో ప్రార్థిస్తూ ఉండినారు. తల్లీ! తల్లీ! అంటూ కలవాలనే అభిలాషను తెలుపుతూ ఉండినారు. బాబా వారిని గురించి ఇలా తెలిపారు - వీరు భలే ఇప్పుడు క్రైస్తవులే కాని వీరు భారతవాసులైన పక్కా భక్తులు. ఏదో లెక్కాచార కారణంగా వీరికి విదేశాలలో జన్మ లభించింది.

నిన్నటి రోజు అంతిమ సమయపు అనుభవము గురించి నేను మమ్మను అడిగాను కదా. దాని గురించి మమ్మా పూర్తి సమాచారాన్ని ఇలా వినిపించారు - నాల్గు రోజుల ముందు ఆల్‌మైటీ బాబాతో కలవడము జరిగింది. ఆ మిలనములో బాబా మాటలను బట్టి ఇక నేను వెళ్ళాలని నూరు శాతము నిశ్చయము జరిగింది. కాని ఎక్కడో ఒక శాతము నిశ్చయము లేకుండా ఉండినది. ఎందుకంటే ఇంతకు ముందు బాబా నాతో కలిసినప్పుడు నీవు ఇంకా చాలా సేవ చేయాలి, ఇప్పుడే వెళ్లే మాటే లేదు, నీది చాలా పెద్ద పాత్ర, ఆలోచించుకో............. అని చాలా మాటలు చెప్తూ వచ్చారు. కాని ఈసారి - బాబా ఇంకా ఎంత కాలము ఈ లెక్కాచారము? అని నేను అడిగాను.

అప్పుడు ఇక కొద్ది సమయము మాత్రమే మిగిలి ఉంది. త్వరలో నీ లెక్కాచారము సమాప్తము కాబోతుంది అని బాబా చెప్పారు. ఆ రోజు ప్రారంభము నుండే బాబా గంభీరంగా చిరునవ్వు నవ్వుతూ ఉండినారు. ఆ నవ్వులో ఏదో ఒక రహస్యము దాగి ఉన్నట్లనిపిస్తూ ఉండినది. అంతేకాక మధ్య మధ్యలో బేటీ సూక్ష్మవతనానికి వస్తావా? అక్కడికి వచ్చి ఆడుకుంటావా? సంతోషంగా ఉంటావా? అని అడిగేవారు. ఈ మాటల వలన బాబా నన్ను తన వద్దకు లాగుతూ ఉన్నట్లు అనుభవమవుతూ ఉండినది. దానికి తోడు శరీరములో బలహీనత అధికమౌతూ ఉండడం గమనించి ఇంకా పక్కా అవుతూ పోయింది. చివరిరోజు చాలా కష్టమయింది. అందులో కూడా శ్వాస లాగుతూ ఉన్నట్లు అనుభవమౌతూ ఉండినది. రెండు గంటల ముందు నా శారీరిక శక్తి ఇంకా తగ్గిపోసాగింది. నాకు పూర్తి పక్కాగా అర్థమైపోయింది. కాని చెప్పాలనే సంకల్పము లేదు. చివర్లో కొన్ని క్షణాలలో నేను దేహములో ఉండినా, దేహము నుండి భిన్నత్వ స్థితి సాక్షి స్థితి, అశరీరి స్థితి, కర్మాతీత అవస్థ అనుభవమౌతూ ఉండినది. నేను పోతున్నాననే సంకల్పమునే బాబా మర్జ్(మరపింపజేయుట) చేసేశాడు. అనగా ఆ సంకల్పమే కలగలేదు. ఎవరైనా మాట్లాడుతూ ఉంటే వినడం నుండి కూడా నేను అతీతమైపోయాను. నా ముందు బాబా పారదర్శక రూపాన్ని స్పష్టంగా చూశాను. కాని ఆ సమయములో కూడా సాకార వతనము, సాకార శరీరాల భావము రాలేదు. ఆ తర్వాత నేను మమ్మాను ఇలా అడిగాను - "మమ్మా శ్మశాన దృశ్యాన్ని బాబా మీకు చూపించారా?" అప్పుడు మమ్మా అవును, బాబా నాకు మొత్తము దృశ్యాన్నంతా స్పష్టంగా చూపించారు. నా శరీరాన్ని నేనే సాక్షిగా ఉండి చూస్తూ ఉన్నట్లనిపించింది. నా శరీరముతో పాటు పిల్లలైన మీరంతా ఏమేమి చేస్తూ ఉండినారో, అందరి స్థితులు ఎలా ఉండినాయో కూడా చూస్తూ ఉండినాను!

## ఐదవ రోజు (29-06-1965)

ఈ రోజు వతనములో భోగ్ స్వీకారము చేయించిన తర్వాత మమ్మా పిల్లలందరి స్మృతితో నాకు చేతిముద్ద తినిపించారు. బాబా అన్నారు - మమ్మా పైన మాకే ప్రేమ ఉందని పిల్లలనుకుంటారు. కాని బాబాకు కూడా మమ్మా



పై ప్రీతి ఉంది, అందుకే వతనానికి పిలిపించుకున్నారు. చిరునవ్వుతో మళ్లీ ఇలా అన్నారు - మా అమ్మ మమ్ములను మర్చిపోయిందని పిల్లలు భావిస్తారు. కాని మమ్మా మర్చిపోలేదు. అమ్మ ఇప్పుడు కూడా పిల్లల సేవలోనే ఉన్నారు. సాకారములో అయితే ఎక్కడ ఉండినారో, అక్కడ మాత్రమే సేవ చేయగలిగేవారు. కాని ఇప్పుడు ఎక్కడకు కావాలంటే అక్కడకు ఒక్క సెకండులోనే చేరుకోగలరు మమ్మా అన్నారు - నేను ఎలాగైతే సూక్ష్మరూపములో ఉన్నానో, మీరు కూడా అలా ఆత్మ రూపములో ఉంటే తల్లి ఎలా సేవ చేస్తూ ఉందో అనుభవము చేయగలరు. ఈ మూడు రోజులలో సూక్ష్మ రూపములో పిల్లలకు ఎలా సేవ చేశానో తర్వాత తెలిస్తాను. ఆ తర్వాత మిమ్ములను మేము ఎప్పుడైతే ఆహ్వానము చేస్తూ ఉండినామో, అప్పుడు మీకు ఏమి అనుభవము అవుతూ ఉండేది? అని నేను మమ్మాను అడిగాను. మమ్మా చెప్పారు - మీ అందరి యోగ ఆహ్వాన ప్రవాహము నాకు చేరుతూనే ఉండినది. కాని నాకు స్థూల శరీరముతో సంబంధము పూర్తిగా తెగిపోయి ఉండినది. కావున వాపస్ ఎలా రాగలిగే దానిని? భలే ఆకర్షణ(లాగుట) జరుగుతూ ఉండినది. ఏదైనా ఒక వస్తువును చీమలు చుట్టుముట్టి లాక్కొని లాక్కొని తీసుకుని పోతాయో అలాంటి సూర్యకిరణాల వలె శక్తి తీగలు ఆత్మనైన నన్ను ఆకర్షించి లాగుతూ ఉండినాయి. కాని కర్మ బంధనము సమాప్తమైనందున వాపసు పోదామా అను సంకల్పము కూడా నాకు రాలేదు - సంకల్పమే కలగకుంటే కర్మ ఎలా జరిగి ఉండేది? అనగా ఎలా వచ్చి ఉండగలను?

తర్వాత మమ్మా ఇలా వినిపించారు - రాత్రంతా మీరు ఆహ్వానిస్తూ ఉన్నప్పుడు మధ్యలో రెండు సార్లు నన్ను ఇదే(సూక్ష్మ) శరీరములో తిరిగి వచ్చేందుకు పంపిస్తూ బాబా ఇలా చెప్పారు - శరీర బంధన వశములో ఆత్మ స్థితి ఎలా ఉంటుంది? శరీర బంధనము నుండి ముక్తమై ఆత్మ అదే శరీరములోకి మళ్లీ పోతే ఎలా అనుభవము చేస్తుందో, ఆ అనుభవము చేసి రా!.............. అని అన్నారు. నేను భలే రెండు సార్లు శరీరములోకి వచ్చాను కాని ఏదో పరాయి స్థానములో తిరిగేందుకు వచ్చాననిపించింది. శరీరము

చాలా చల్లగా అయిపోయింది. కావున భలే ఆత్మ ప్రవేశమయింది కాని ఎలాంటి చలనము జరగలేదు. అయితే నేను మాత్రము (సూక్ష్మ శరీరముతో) వచ్చి చూచిపోయాను. తర్వాత నేను అన్నాను - మమ్మా, మీరు పోతూ పోతూ మాకందరికీ ఆ రోజు నాల్గు గంటల నుండి ఐదు లోపల 2-3 సార్లు మీ ముఖము పై చిరునవ్వు ప్రకాశము వంటిది అమ్మ వచ్చినట్లు అందరితో కలుస్తున్నట్లు అనుభవమయింది. ఈ విధంగా ఆత్మిక సంభాషణ చేసి స్థూల వతనానికి వాపసు వచ్చేశాను.

## ఆరవ రోజు (30-06-1965)

ఈ రోజు నేను సూక్ష్మవతనానికి వెళ్లినప్పుడు అమ్మ స్థూలవతనములో సాకార బాబాతో కలిసి వాపసు వచ్చి ఆల్‌మైటీ బాబాకు సమాచారము వినిపిస్తూ ఉండినారు. నేను వెళ్తూనే మమ్మా స్వయంగా పిల్లల యాద్‌ప్యార్ క్షేమ సమాచారాలు అడిగి ఇలా అన్నారు - నేను సాకార రూపానికి బదులుగా ఇప్పుడు సూక్ష్మ రూపములో సహాయకారిగా(మదద్‌గార్‌గా) ఉన్నాను. పిల్లలకు నా సందేశమును ఇలా ఇవ్వండి - అమ్మ పై ప్రేమ ఉంటే సాకారములో సాకార తండ్రికి ఇప్పుడు పిల్లలైన మీరే సహాయకారులు. కావున బాబాకు పూర్తి సహాయకారులై నడుచుకోండి. చిన్న చిన్న విషయాల పై ఎక్కువగా శ్రమ చేయరాదు. ఇప్పుడు నా పాత్ర ద్వారా సమయము చాలా దగ్గరకు వస్తూ ఉందని తెలుసుకొని ఉంటారు. వినాశ సమయమే కాదు. ప్రత్యక్షతా(ప్రభావము పడు) సమయము కూడా దగ్గరకు వస్తూ ఉందని తెలుసుకొని ఉంటారు. కావున స్వయాన్ని సంపూర్ణంగా చేసుకోవడంలో తీవ్ర పురుషార్థులుగా అవుతూ వెళ్లండి. తర్వాత నేను ఇలా అడిగాను - "మమ్మా పిలలైన మాకు సూక్ష్మంగా మీరు ఎలా సేవ చేస్తున్నారు?" దానికి మమ్మా ఇలా అన్నారు - ఇప్పుడు స్థూల శరీరముతో నా పాత్ర సమాప్తమైపోయింది. ఇప్పుడు ఆత్మకు, ఆత్మలతో సంబంధము మిగిలింది. కావున ప్రారంభములో మీకు గుర్తు ఉండవచ్చు - మమ్మా ఆత్మలైన మీతో మాట్లాడుతూ ఉండేది. అదే విధంగా ఇక్కడ కూడా ఇప్పుడు ప్రతి పుత్రుని రూపాన్ని ఎమర్జ్ చేసుకొని వారి కలిన సంస్కారాలేవైతే ఉన్నాయో, వాటిని



యోగ శక్తి, ఆత్మిక శక్తితో భస్మము చేయు సేవ జరుగుతూ ఉంది. అంతేకాని నేను అందరినీ మర్చిపోయానని కాదు. పిల్లలందరి మ్యాపు నా ముందర ఉంది. అమృతవేళలో ప్రతి ఆత్మను ఎమర్జ్ చేస్తూ ఉంటాను. కాని పిల్లలైన మీరు కూడా ఆత్మ రూపములో ఉంటే ఈ ఆత్మిక సేవను అనుభవము చేయగలరు. ఆత్మిక రూపములో స్థితము అవ్వనంతవరకు అనుభవము కూడా చేయలేరు. కావున వద్దనుకున్నా తల్లి స్మృతి మిమ్ములను ఆత్మిక రూపములో స్థితము చేయుస్తుంది. అంతేకాక యోగయుక్త దేహీ-అభిమానులుగా చేస్తుంది. తల్లి మాతో ఇలా మాట్లాడుతూ ఉన్నారని, కలుస్తూ ఉన్నారని వారికి ప్రాక్టికల్‌గా అనుభవమౌతుంది. ఆ తర్వాత మమ్మా నగల పెట్టెను తెరిచారు, ఆ పెట్టె నగల సెట్లతో నింపబడి ఉంది. ఆ నగలు అలౌకికమైనవి. వాటిని అంతకుముందు నేను ఎప్పుడూ చూచి ఉండలేదు. అమ్మ ఇలా చెప్పారు - నేను రోజంతా ఈ దివ్య గుణాలనే నగలతో పిల్లలైన మిమ్ములను అలంకరిస్తూ ఉంటాను. ఇదే మీకు అమ్మ చేయు సేవ.

## ఏడవ రోజు (01-07-1965)

ఈ రోజు వతనములో తల్లితో కలియునప్పుడు క్షేమసమాచారాల అనంతరము అమ్మ ఇలా చెప్పారు - బాబా నన్ను వినాశనానికి వస్తువులు ఎక్కడ తయారౌతూ ఉన్నాయో అచ్చటకు తీసుకెళ్ళారు. అచ్చట చాలా నాజూకు ఆయుధాలు తయారై ఉన్నాయి. మిలిటరి మార్షల్స్ ప్లాను తయారు చేసుకొని సిద్ధంగా నిలబడి ఉండినారు. ప్రారంభము చేసేందుకు ఆజ్ఞ లభించేందుకు కేవలం ఒక్క సెకండు మాత్రమే ఆలస్యముంది. బాబా అన్నారు - ఇచ్చట విమానాలు ఎందుకు చూపబడ్డాయంటే - ఒకవైపు వినాశనానికి తయారీలు, రెండవ వైపు స్థాపనకు నిమిత్తమైన మీ శక్తి సైన్యము స్థాపనకు ఎంతవరకు సిద్ధముగా ఉన్నారు? స్థాపనకు, వినాశనానికి అయిన తయారీలలో రాత్రికి పగులుకు ఉన్నంత తేడా ఉండినది. మమ్మా దానిని గురించి ఇలా చెప్పారు - ఇప్పుడు పిల్లలకు ఎంతగా అర్థము చేయించినా, వారి పురుషార్థము తీవ్రతరము కాదని అనిపిస్తుంది. కాని ఒకవైపు వినాశనానికి కొన్ని రిహార్సల్స్ రెండవ వైపు ప్రభావితమయ్యే సమయము కూడా సమీపానికి వస్తోంది.

అందులో పిల్లల బుద్ధి బిజీ(తలమునకలు) అయితేనే పాత విషయాలు లేక పాత సంస్కారాలు నశిస్తాయి. ఇప్పుడు పిల్లలేమో మేము బిజీగా ఉన్నామని అంటారు. కాని అందరి బుద్ధి బిజీగా లేదు. భలే అందరి నోరు బిజీగా ఉంది కాని బుద్ధి బిజీగా ఉండాలి. తర్వాత బాబా ఒక నిగూఢ రహస్యాన్ని వినిపించారు - చూడండి వినాశ కార్యము ఇప్పుడు చాలా వేగంగా జరుగుతూ ఉంది. ఒక్క సెకండులో బుద్ధిని టచ్ చేసి వినాశ కార్యమును చేయించుకుంటారు. అదే విధంగా ఇప్పుడు స్థాపనా కార్యము కూడా త్వరత్వరగా జరగాలి. అందుకే మమ్మా కూడా పిల్లల బుద్ధిని ప్రేరేపించి స్థాపనా కార్యమును త్వరగా చేయించాలని, ప్రభావము వెలువడాలని వారిని కూడా సూక్ష్మ వతనవాసిగా తయారుచేశాను. ఈ విధంగా కొద్ది సమయములోనే పిల్లలైన మీరు అంత: వాహక శరీరము ద్వారా అత: ప్రేరణలతోనే తల్లి చేయు సేవా ప్రభావాన్ని చూస్తూ పోతారు.

ప్రారంభములో ప్రేరణతో లేక టచింగ్ ద్వారా పిల్లలైన మీరంతా వచ్చారు. అందుకే యజ్ఞ స్థాపన చాలా వేగంగా జరిగింది. శ్రమ కూడా చాలా తక్కువే చేయవలసి వచ్చింది. అనన్య రత్నాలు కూడా చాలా మంది వెలువడ్డారు. ఇప్పుడు ఎంత శ్రమ చేయవలసి వస్తోందో, ఎంత సమయము పడ్తూ ఉందో గమనించండి. ఇప్పుడు చివరి సమయములో కూడా మరలా ప్రారంభములో జరిగిన టచింగ్ పాత్ర నడుస్తుంది. దీని ద్వారా సమయము చాలా దగ్గరకు వచ్చిందని పిల్లలు ఇప్పుడు అర్థము చేసుకోవాలి. అంతేగాని రకరకాల పాయింట్లు పట్టుకొని నిర్లక్ష్యముగా ఉండరాదు. ఉదాహరణానికి బ్రహ్మకు నూరు సంవత్సరాలు ఆయువు కదా. ఇంకా ఇంత సమయము మిగిలి ఉంది కదా, మొదలైన పాయింట్ల పై ఆధార పడకుండా పురుషార్థము చేస్తూ పోండి. బాబా ఇది కూడా వినిపించారు - ఏదైనా ఒక దేశములోని గొప్ప వ్యక్తి మొదలైనవారు మరో దేశానికి వెళ్ళినప్పుడు వారికి అతిథి సత్కారాలు ఎంతగా చేస్తారు! ఆ దేశములో లభించే రుచికరమైన ముఖ్య పదార్థాలను తినిపిస్తారు, ముఖ్య ప్రదేశాలలో విహరింపచేస్తారు! అదే విధంగా మమ్మా కూడా ఇప్పుడు స్థూలవతనము నుండి సూక్ష్మవతనవాసిగా అయింది. కావున



మమ్మాకు విష్ణుపురమును శంకరపురము, నిర్వాణధామము మొదలైన వాటన్నిటిలో చాలా విహరింపచేయాలి. అచ్ఛా ఈ రోజు సద్గురువారము. మమ్మాకు కూడా ఈ రోజు ఆహ్వానమివ్వబడింది. ఇప్పుడు మమ్మా సూక్ష్మవతనములో బాబా వద్ద ఉంటుందని పిల్లలకు తెలుపబడింది. పిల్లలు బాబాను పిలిచి - బాబా, మమ్మా చివరివరకు మాతో ఉండాలి కదా. మీరెందుకు మమ్మాను మీ సాక్షిగా చేసుకున్నారు? అని అడిగారు. డ్రామాలో ఏది నిశ్చయింపబడి ఉందో, అది జరిగే తీరుతుంది, నేను వీరి ద్వారా చాలా పనులు చేయించవలసి ఉంది. మమ్మా తన లెక్కాచారమునంతా భోగించుట ద్వారా చుక్తా చేసుకున్నారు. వీరు నా కుడిభుజము మమ్మా వచ్చి పిల్లలకు చివరి సమయములో ఏమి జరిగిందో ఎలా వెళ్ళిపోయారో మొత్తము సమాచారమంతా వినిపిస్తారు. ఆత్మకు అన్ని విషయాలు తెలుసు కదా. మమ్మాకు చాలా మంచి లిఫ్ట్ లభించింది. అందుకై ఇంకా ఎక్కువగా అందరూ సంతోషించాలి.

అచ్ఛా! సందేశి అయిన గుల్జార్ ఎగురుతూ వతనానికి వచ్చారు. ప్రియమైన మమ్మా గుల్జార్ రథములో సవారి చేస్తూ మధువనానికి వచ్చారు, మొట్టమొదట సాకార బాబాతో కనులు కలిపి వారి చేతిలో చేయి వేశారు. మమ్మా వచ్చారు............ అని బాబా అన్నారు. ఇప్పుడు పిల్లలను కలిసి తన సమాచారము కూడా వినిపిస్తారు. ప్రాణప్రదమైన తల్లి మహావాక్యాలు ఉచ్ఛరించేందుకు పిల్లలందరి ప్రియస్మృతులకు బదులు తెలిపేందుకు ఇచ్చటకు వచ్చారు. ఇంతవరకు సూక్ష్మవతనములోనే నివసిస్తున్నారు. కొంత యోగబలముతో, కొంత కర్మభోగముతో అనేక జన్మల లెక్కాచారము ఏదైతే ఉండినదో, దానినంతటిని శివబాబా త్వరగా చుక్తా చేయించారు. అందువలన ఇప్పుడు నిర్బంధన ఆత్మగా ఉండి పిల్లలైన మీ సేవలో ఇంతవరకు ఎలా ఉండినారో, ఇప్పుడు అలాగే సేవ చేస్తూ ఉన్నారు. చివరివరకు జతలోనే ఉంటారు. కేవలం సాకారము నుండి ఆకారములోకి మారిపోయారు. అదొక్కటే తేడా పోతే ఇది అనాది, అవినాశి తోడు. ప్రతి రోజు పిల్లలతో కలుస్తూ కూడా ఉన్నారు. ఇక ముందు కూడా కలుస్తూనే ఉంటారు. చివరి సమయానికి

కొంత సమయము ముందు నుండి బాధ, కష్టము తగ్గిపోయినట్లు అనుభవమవ్వసాగింది. సాకార శరీరములో ఉన్నప్పుడే కొన్ని సెకండ్లు అశరీరి స్థితి కర్మాతీత స్థితి అనుభవమయ్యింది. అదే అంతమతి సో గతి,........... లెక్క ప్రకారము కర్మాతీత స్థితి ప్రాప్తి అయ్యింది. అంతిమ సమయములో నా అనుభవము ఇదే. ఇప్పుడు నిర్మోహిగా, అనాసక్తంగా, కర్మాతీతంగా, కర్మ బంధనముక్తంగా అయ్యి మొత్తము ప్రపంచమంతటి సేవలో శివబాబా జతలో ఉపస్థితమై ఉన్నాను. చింతించే విషయమేదీ లేదు. నేను చాలా రాజీగా(తృప్తిగా) ఖుషీగా ఉన్నాను. మీ జతలోనే ఉన్నాను. కావున మీరందరూ కూడా త్వరత్వరగా అనాసక్తంగా, అంతర్ముఖులుగా, అచల స్థితిని ప్రాప్తి చేసుకోండి. మీ రాజ్యస్థాపన కార్యములో సహయోగము(సహాయకారులుగా) ఇచ్చేవారిగా తయారౌతూ నడుస్తూ వెళ్ళండి.

సాకారబాబా ఇలా అన్నారు - మమ్మా! పిల్లలందరికీ సాకారములో భోగ్ నీ చేతులతో ఎలా ఇస్తూ ఉండినారో, అలా ఈ రోజు నీ చేతులతో అందరికి ప్రసాదము పంచి పెట్టు. అప్పుడు నియమానుసారము అందరికీ అమృతము త్రాపించి బాప్‌దాదా అందరిని అవ్యక్త మమ్మా వద్దకు పంపుతూ వెళ్ళారు. మమ్మా ప్రతి ఒక్కరికి మధురమైన దృష్టినిస్తూ పిల్లల రెండు చేతుల(దోసిళ్ళ)కు భోగ్ ఇస్తూ ఉండినారు, మధ్య మధ్య కొంతమందిని సైగలతో క్షేమసమాచారాలను కూడా అడుగుతూ ఉండినారు. కొంతమందిని చిరునవ్వుతో పలకరించారు. ఎవరైనా ఇతరుల స్మృతి తెలిపితే, వారి కొరకు పండ్లు కూడా ఇచ్చారు అనగా ప్రియమైన మమ్మా రూపము మార్చుకొని వచ్చినట్లు అనుభవమయింది. ఈ విధంగా భోగ్ పంచుతూ పంచుతూ సుమారు రెండు గంటలు గడచిపోయాయి. అందరికీ భోగ్ ఇవ్వడం సమాప్తమవుతూనే బాప్‌దాదా మధురమైన మమ్మా ముందు గద్ది పై కూర్చుని కళ్ళతో అవ్యక్త మిలనము చేసిన తర్వాత, హస్త కమలముతో ప్రియమైన అవ్యక్త మమ్మాకు ఇంటి ఫలాన్ని భోగ్‌ను స్వీకరింపచేశారు. మామిడి పండ్ల రసము కూడా తీయించి త్రాపించారు. తర్వాత మమ్మా బాబాకు తినిపించారు. అప్పుడప్పుడు సాకారములో ఎలా జరుగుతూ ఉండేదో, అలాగే జరిగింది.



తర్వాత మమ్మా మళ్ళీ పిల్లలందరినీ కనులతో కలుస్తూ బాప్‌దాదాతో మధుర మిలనము జరుపుతూ శెలవు తీసుకొని వెళ్ళిపోయారు. మమ్మా వెళ్ళిపోయిన తర్వాత సభ సమాప్తమైపోయింది. ఆ రోజు బ్రహ్మాభోజనము కూడా ఉండినది.

## సోమవారము (06-07-1965)

ఈ రోజు సోమవారము. ప్రాణప్రదమైన మమ్మా మధువనము నుండి వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయి 12 రోజులు గడిచిపోయాయి. ఈ రోజు ముఖ్యంగా ప్రాణప్రియమైన తల్లి స్మృతిలో భోగ్ సమర్పించబడింది. పిల్లలను కలుసుకునేందుకు ప్రాణప్రదమైన అమ్మకు ఆహ్వానము పంపబడింది. ప్రాణప్రదమైన అమ్మ ఆదర పూర్వకంగా సందేశీ శరీరములో విచ్చేసి కూర్చున్నారు. అప్పుడు బాప్‌దాదా వారిని కనులతో పలకరించి చేయి కలుపుతూ - మమ్మా ఇప్పుడు నీ నివాసమెక్కడ? అని అడిగారు. ప్రాణప్రియమైన మమ్మా - సూక్ష్మవతనములో అని చెప్పారు. సేవలో తత్పరమై ఉన్నావా? అని బాబా అడిగారు. అవును అని సైగలతో తల ఊపి తెలిపారు. ఈ రోజు మిమ్ములను పిలిపించారు. పిల్లలకు రెండు మాటలు కూడా వినిపించండి. కొంత సమాచారము కూడా వినిపించు, ఈ పిల్లలు ఎక్కడెక్కడి వారో వారిలో చాలా మందిని గురించి నీకు తెలిసే ఉంటుంది. ఇంతకుముందు కచేరి కూడా చేసేవారు. పరిష్కారము కూడా అడిగేవారు.

సుక్ష్మవతనవాసి అయిన తల్లి - అందరి సేవతో పాటు శివబాబా జతలో వినాశనము జరిగే ఏర్పాట్లు కూడా సాక్షాత్కారము చేయిస్తూ ఉంటారు. అనన్య భక్తులుగా ఎవరైతే ఉంటారో, వారి వద్దకు కూడా పోతూ ఉంటారు. అంతేకాక పిల్లలైన మీకు ఆత్మిక సేవ కూడా చేస్తూ ఉంటారని మమ్మా తనను గురించి తెలిపారు. ఇచ్చట అంతిమ సమయములో ప్రభావము వెలువడేందుకు నిమిత్తమైన ఏ వ్యక్తులైతే ఉంటారో, వారిని కూడా అడ్వాన్స్‌గా సాక్షాత్కారము చేయిస్తూ ఉంటారు. ఆంతరిక ప్రేరణ వలన అంత: వాహక శరీరము ద్వారా వారి బుద్ధిని ప్రేరేపించే సేవ కూడా నడుస్తూ ఉంటుంది.

తర్వాత భోగ్ సమర్పించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అమ్మ తమ పవిత్రమైన హస్తాలతో అందరికి భోగ్ ఇచ్చారు. తర్వాత బాప్‌దాదా అందరినీ

ఒడిలో కూర్చోబెట్టారు, ప్రాణప్రదమైన మమ్మా టోలి తినిపిస్తూ పోయారు. సుమారు రెండున్నర గంటల సేపు ఈ అసాధారణ, ఉత్కృష్టమైన ఆనందాన్ని కలుగజేసే ఈ దృశ్యము నడిచింది. తర్వాత ప్రాణప్రియమైన బాబా, ప్రాణ ప్రియమైన మమ్మాను స్థూల వతనము నుండి వీడ్కోలు ఇచ్చారు.

## సందేశము

ఈ రోజు వతనములో బాబా ముఖ్యంగా మమ్మాను పిలిచారు. పిల్లలైన మేమందరము(మమ్మాను పిలిచేందుకు) బాబాకు సందేశాన్ని ఇచ్చాము. నేను వెళ్తూనే మమ్మా మరియు బాప్‌దాదా బాహ్య రూపములో రెండు మూర్తులుగా కనిపించారు. కాని వాస్తవానికి త్రిమూర్తులు. దూరము నుండే చాలా రోజుల తర్వాత వతనములో మమ్మాను చూచాను. అందువలన ప్రారంభములో సంతోషము కొద్దిగా కలిగింది. కాని చాలా రోజుల తర్వాత మమ్మా ముఖము చూచాననే సంతోషము కూడా కలిగింది. మమ్మా చాలా నిర్మోహిగా ఉండి చూస్తూ ఉండినారు. భిన్నంగా, అతీతంగా ఉండినారు. కాని వారిలో ప్రీతి నిండే ఉంటుంది. ఇటువంటి స్థితి ముందు మాది ఏ మాత్రము నడవదు. మమ్మాతో కలవమని బాబా చెప్పారు. నేను ముందుకు వెళ్లసాగాను. అప్పుడు మమ్మా - “కాదు మొదట తండ్రి తర్వాత అమ్మ” అని చెప్పారు. అప్పుడు బాబా వైపుకు వెళ్లి బాబాను కలిశాను. మమ్మా అన్నారు - “విశేషంగా ఎవరి స్మృతి ఉండినది?” అని అడిగింది. అందుకు నేను - బీజాన్ని స్మృతి చేశాము. కాని మీ స్మృతి కూడా ఉండినది అని అన్నాను. పిల్లలందరు ఎంత వేగంగా నడుస్తున్నారు అని మమ్మా అందరి స్థితి గతుల గురించి అడిగారు. మీరేమని అనుకుంటున్నారు? అని అడిగారు. దానికి నేను “అందరిలో ఉత్సాహమైతే చాలా ఉంది. ఉత్సాహముతో ముందుకు అడుగులు కూడా వేస్తున్నారు. మా మమ్మా - బాబాల స్మృతిచిహ్నాలు ఎలాగైతే ఉన్నాయో, అలాంటి కర్తవ్యాలు మేము కూడా చేయాలనే ఉత్సాహము మెజారిటీ పిల్లలందరిలో ఉంది” అని చెప్పాను. “మీ స్మృతి చిహ్నము స్థిరంగా ఎలా ఉంటుంది?” ఏ ముఖ్య విషయము పై గమనముంచితే మీ జ్ఞాపక చిహ్నము స్థిరంగా ఉంటుంది?” అని మమ్మా అడిగారు. మమ్మా-బాబా ఏమి



చేసినందున వారి స్మృతిచిహ్నము ఉంది? మమ్మా ఇలా వినిపించారు - “ఎవరు ఎంతెంత స్మృతిలో ఉండి కర్మలు ఆచరిస్తారో, వారి స్మృతి చిహ్నము అంత స్థిరంగా తయారౌతుంది. స్మృతిలో ఉండి కర్మలు ఆచరించకపోతే స్మృతి చిహ్నము తయారవ్వదు. కావున స్మృతి చేసిన ఫలితంగానే స్మృతి చిహ్నము తయారౌతుంది. కావున ప్రతి ఒక్క పుత్రుడు నా తర్వాత నా స్మృతిచిహ్నము ఎంత కాలముంటుందని ఇప్పుడు కూడా చూసుకోవచ్చు. స్మృతిలో ఉండాలి అయితే స్మృతిలో కూడా ఎంత స్థితి ఎంత శాతముంటుందో అంత స్మృతిచిహ్నము తయారౌతుంది. ఉదాహరణానికి కొంతమంది ఆత్మలకు ఇప్పటికిప్పుడు స్మృతి ఉంటుంది మళ్లీ వెంటనే మర్చిపోయే స్థితి ఉంటుంది. దాని అనుసారమే మన స్మృతిచిహ్నము తయారవుతుంది. ”

## సందేశము 22-07-1965

అన్ని సేవాకేంద్రాల దైవీ సోదరి-సోదరులకు మధువన నివాసులమైన మా అందరి స్మృతులు స్వీకరించండి. ప్రస్తుతము మధువన స్టేజి పైన ఏ పాత్ర నడుస్తూ ఉందో తెలుసుకోవాలనే ఉత్సాహము అందరి హృదయాలలో తప్పక ఉంటుంది. సమయ ప్రతి సమయము మురళిల ద్వారా పిల్లలైన మనలను బాబా చాలా చాలా రిఫ్రెష్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈసారి మధువనములో చాలా గొప్ప కుంభమేళా జరిగింది. అందులో అన్ని సేవాకేంద్రాల టీచర్లు వారి విద్యార్థులు అన్ని విధాలైన రిఫ్రెష్‌మెంట్లు పొందారు. ప్రస్తుతము మధువనములో సంపూర్ణ శాంతి వ్యాపించి ఉంది. అమృత్‌సర్ బటాలా, బొంబాయి, పూనా, ఢిల్లీ, నంగల్ నుండి కొన్ని పార్టీలు వచ్చి ఉన్నారు. వర్షాకాలము కూడా ప్రారంభమయ్యింది. చలిగాలులు కొంత ఎండ అప్పుడప్పుడు మేఘాలు అప్పుడప్పుడు వర్షము - ఇటువంటి రకరకాల ఋతువు నడుస్తూ ఉంది. మధువనములో మమ్మా పాత్ర ఏదైతే సందేశి(పక్షి) ద్వారా నడిచిందో ఆ దినచర్య అంతా మురళి ద్వారా మీ వద్దకు చేరే ఉంటుంది కాని ఈసారి అకస్మాత్తుగా జరిగిన తల్లి పాత్ర చాలా సాధారణమైనదిగా, విచిత్రమైనదిగా ఉండినది.

గురువారము ఉదయము 5-30 గంటలకు బాప్‌దాదా అచల్ బెహన్,

సతీ బెహన్, దేవీ బెహన్ ఈ ముగ్గురు సందేశీల ద్వారా మమ్మాను మధువనానికి పంపమని శివబాబాకు నిమంత్రణ(ఆహ్వానము) పంపించారు. ఆహ్వానముతో పాటు ఈ ముగ్గురి సందేశీలలో ఏ సందేశీ శరీరములో మమ్మా వస్తారో అది కూడా కనుక్కొని రమ్మన్నారు. మమ్మా ఎవరి శరీరములో వచ్చి ఉన్నారనే విషయాన్ని సాకార బాబాయే తెలుసుకుంటారని శివబాబా చెప్పారు. క్లాసు పూర్తి అయిన తర్వాత ఎప్పటి వలె ప్రోగ్రాము అనుసారము భోగ్ ప్రారంభమయింది. ముగ్గురు సందేశీలను పెద్ద గద్దె పైన కూర్చోపెట్టారు. బాబా తమ సింహాసనాన్ని వదిలి వారి వద్ద కూర్చున్నారు. ముగ్గరుకి దృష్టి ఇస్తూ ఉండినారు. ఒక్క క్షణములో ముగ్గురు వతనానికి చేరుకున్నారు. ఇంతలో దేవి బెహన్, సతీ బెహన్‌ల రథాలలో(శరీరాలలో) సంపూర్ణ మమ్మా, ఆల్‌మైటీ బాబాలు వచ్చారు. అచల్ బెహన్ శరీరములో సాకార మీలీ మమ్మా విచ్చేశారు. పిల్లలైన మేము కూడా మాటిమాటికి ముగ్గురి నుండి దృష్టి తీసుకుంటూ, టోలీ తీసుకుంటూ పోయాము. సాకార మమ్మా (అచల్ బెహన్ శరీరములో) పిల్లలను మధురమైన దృష్టితో కలుస్తూ ప్రతి ఒక్కరికి చాలా తక్కువ శబ్ధముతో ఏదో ఒక శిక్షణ ఇస్తూ ఉండినారు. సతీ బెహన్, దేవీ బెహన్ వారి పాత్ర చేసి క్రిందికి వచ్చేశారు. కాని బాబా సాకార మమ్మాను ఇక్కడి విషయాలను పర్యవేక్షించేందుకు పంపించారు. క్లాసు సమాప్తమైన తర్వాత అచల్ బెహన్ శరీరములో గల అమ్మను బాబా తన గదిలోకి తీసుకెళ్ళారు. అచ్చట పిల్లలను కలుసుకునేందుకు బాబా తనను పంపారని తల్లి తమ ప్రోగ్రామును తెలిపారు. తర్వాత సాకార బాబా ఆదేశానుసారము మమ్మా గది మొదట ఎలా ఉండినదో, అలా తయారు చేయబడింది. తర్వాత ఇద్దరు పిల్లలతో పర్సనల్‌గా మాట్లాడారు. ఆ తర్వాత బంఢారము(వంట గది) వైపు వెళ్ళింది. అచ్చట కూడా మమ్మా పిల్లలైన మమ్ములను శిక్షణలతో అలంకరించారు. ముఖ్యంగా బ్రహ్మాభోజన మహత్వమును తెలిపారు - బ్రహ్మాభోజనము తయారు చేయునప్పుడు కూరగాయలు తరుగునప్పుడు ఒకే ఒక్క శివబాబా స్మృతిలో ఉండినందున ఈ బ్రహ్మాభోజనములో శక్తి ప్రవేశించి ఉంటుంది. 5 వేల సంవత్సరాల తర్వాత అదే దేవత వృక్షపు తప్పిపోయిన



పిల్లలు మళ్ళీ నేరుగా వచ్చి కలుసుకున్నారు. బ్రహ్మాభోజనానికి చాలా మహత్వముంది. కావున అటువంటి బ్రహ్మాభోజనాన్ని చాలా ప్రీతిగా తయారు చేయాలి. ఇది బాబాగారి దుకాణము. ఇచ్చట చాలా సత్యంగా, నిజాయితీగా సేవ చేయాలి. కేవలం షో కొరకు చేయు సేవ కాదు. చాలా ప్రీతిగా ఇంటి యజమానిగా భావించి సేవ చేయడం వలన ఏదైనా కొంత తయారౌతుంది. ఈ ఇల్లు నాదే ఈ పరివారము నాదే అని భావించినందున ఏ ఇతర భావము ఉత్పన్నమవ్వదు. అప్పుడు ఏ విషయములో కూడా వెనుక ముందు ఆలోచించరు. కాని ఎప్పుడైతే నా వారనే భావము వదిలేస్తారో అప్పుడు దేహ భావము ఉత్పన్నమౌతుంది. ఎవరికైతే ఒక్క తండ్రితోనే బుద్ధి యోగముంటుందో వారు ఎప్పుడూ అలసిపోరు. బాబా అలసటలేని వారు(అథక్). ఎవరి బుద్ధియోగము అథక్ బాబా జతలో ఉంటుందో వారు ఎప్పుడూ అలసిపోరు. యజ్ఞము నాది అని భావిస్తూ చాలా ప్రీతిగా నడుచుకోవాలి. ఈ యజ్ఞ సంభాళన కొరకు ఇంతగా ఎందుకు చెప్పబడుతూ ఉంది? ఆలస్యంగా వచ్చినవారు త్వరగా స్వాహా అయిపోతారని కూడా కాదు. కాని ఇంతకు ముందే సమర్పణ అయిన వారు పూర్తిగా తెలుసుకొని నడుచుకోకుంటే కొత్తవారు సంపూర్ణంగా స్వాహా అవ్వడంలో ఆలస్యమైపోతుంది. ఆహుతి ఇవ్వబడిన వస్తువు బయటకు వస్తే అది మళ్ళీ స్వాహా అవ్వడంలో శ్రమ కలుగుతుంది. ప్రపంచములో జరిగే స్థూల యజ్ఞములన్నీ స్వాహా అవ్వడం పిల్లల స్థితి పైననే ఆధారపడి ఉంది. అశరీరి అయిన తండ్రి ఎలా సేవ చేస్తారో, అలా మీరు రుహానీ ఆత్మలు సేవ చేయాలి. వారిని స్మృతి చేస్తే బలము లభిస్తుంది. ఈ విధంగా రుహానీ ఆత్మలైన మీరు రుహానీ విధానము ద్వారా అనేక అజ్ఞాని ఆత్మలకు సేవ చేయాలి. ఇది నా పని కాదు. దాదీ-దీదీల పని. నేను చాలా చిన్నవాడిని అని కూడా అనుకోరాదు. మీరందరూ మాలికులే(అధికారులే). ఇటువంటి యజమానులైన మీరు పూర్తిగా గమనముంచాలి. అప్పుడు బాబా ప్రేరణలను క్యాచ్ చేయగలరు. (గ్రహించగలరు) పిల్లలు త్వరగా వచ్చేయాలని బాబా కోరుచున్నారు. ఎందుకంటే బాబాకు పిల్లలు కూడా తోడయితే త్వరగా జరుగుతుంది. ఒక

అనుభవము - ఎవరైనా ఒకరు ఏదైనా చెట్టులోని చిటారుకొమ్మ పైకి ఎక్కగలిగితే వారిని చూచి చాలా మంది చెట్టు ఎక్కడానికి సాహసిస్తారు. అలాకాక ఎవరైనా ఒకరు చెట్టు శిఖరము పైకి ఎక్కి క్రింద పడితే వారిని చూచి ఎవ్వరూ చెట్టు ఎక్కేందుకు సాహసించరు. బాప్‌దాదా నుండి ఇప్పుడు ఎక్కువ శ్రమ తీసుకోరాదు. నేను చాలా సేవాకేంద్రాలు తిరుగుతూ ఉంటాను. ఇప్పుడు ఇంకా చాలామందికి తండ్రి పరిచయము పూర్తిగా లేనందున చాలా తప్పులు జరుగుతూ ఉంటాయి. మీరు అందరికీ ఆదర్శంగా ఉండాలి. ఇప్పుడు చాలా మంది ఆత్మలకు టచింగ్ జరిగి వారసత్వము తీసుకునేందుకు వస్తారు. ఆదేశాలు ఆచరణలో కనిపించకపోతే వెనుకకు తొలగిపోతారు. సేవ కూడా ఒక్కరి స్మృతిలోనే చేయాలి. వారి స్మృతిలో ఏ సేవ చేసినా ఋజువు(ప్రూఫ్) కూడా త్వరగా వెలువడ్తుంది. తల్లి(మమ్మా) ఇటువంటి శిక్షణలతో పిల్లలైన మమ్ములను అలంకరించి, కొద్ది సమయము తర్వాత వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయింది.

